ఎమ్బీయస్ – గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2015 Q1 జనవరి – మార్చి ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక

మదన్ మిత్రను ఏం చేయాలి?
ముసుగువీరుడు బిశ్వాస్
రాగా – నమ్ముకున్న వాళ్లకు ఆరున్నొక్క రాగమే
పనిలో పనిగా జాగ్రఫీ
మతం మార్పిళ్లు – ప్రకంపనలు
(అ)క్రమబద్ధీకరణ
మీడియా సంగతేమిటి?
పెషావర్ ఘటన తర్వాత పాకిస్తాన్
హెల్త్ ఎంబాసిడర్‌గా అమితాబ్ బచ్చన్
ముఫ్తీ యిక్కట్లు
చార్లీ హెబ్డో ఇస్లాంపై గురి పెట్టిందా?
స్పైస్ జెట్‌ని మారన్ రక్షిస్తాడా ?
ఇప్పుడు అకాలీదళ్ వంతు..
మంత్రుల ప్రోగ్రెస్ రిపోర్టు
గాంధీ పునరాగమనానికి 100 ఏళ్లు
ఎకె 49 పేలుతుందా?
కర్ణాటకలో మఠాలకు ముకుతాడు
దేవుడి ప్రమేయం ఎంతవరకు?
సర్వం తానెయై...
పాత పుస్తకానికి కొత్తగా దండన
ఆశాజీవి అంటే..?
ఇదీ ఉపముఖ్యమంత్రి స్థాయి...
కిరణ్ బేదీ రాజకీయ పోరాటం
రీమేకుల బోనీ కపూర్
సెన్సార్ బోర్డు క్షాళన
విబి రాజేంద్రప్రసాద్
అంతా వాస్తు చాదస్తమేనా?
మహారాష్ట్రలో విచారణ కాండ
ద్రౌపది పుట్టిన చోటు
దేవదూత సినిమా !?
హోం సెక్రటరీ తొలగింపు
ముస్లిం జనాభా పెరుగుదలపై ఆందోళన
ఢిల్లీ ఎన్నికల సస్పెన్స్
సోనియాపై పుస్తకం
ఢిల్లీలో బిజెపిపై మూకుమ్మడి దాడి

ఇది చెంపదెబ్బ కాదు...
ఆంధ్రకు పరిశ్రమలు తరలివస్తాయా?
ఏది సత్యం? ఏదసత్యం?
అవినీతి డాక్టరుకు గుజరాత్ మద్దతు
సౌదీ అరేబియాలో రాజు మారారు
ఆప్ భవిష్యత్తు
సిద్ధరామయ్యపై గవర్నరు చర్య తీసుకుంటారా?
పానుగంటి వారి "సాక్షి" – 1
పానుగంటి వారి "సాక్షి" – 2
శ్రీలంక అధ్యక్షుడి భారత పర్యటన
ఢిల్లీ ఎన్నికల పాఠాలు
సూత్రధారి కాబోయిన పాత్రధారి
చెడ్డకాపురానికి ముప్పేమిటి...?
గుజరాత్ పోలీసులకు అచ్ఛే దిన్ – ప్రజాహక్కుల యోధులకు బురే దిన్
నిర్మాత పదానికి నిర్వచనం – రామానాయుడు
రచయితగా ఆర్.కె.లక్ష్మణ్
పానుగంటి వారి "సాక్షి" – 3
ఆపసోపాంధ్ర
మధ్యప్రదేశ్‌లో మార్కుల స్కామ్
తృణమూల్ చీలుతుందా..?
అసూయకు మతం ముసుగు
బలాత్కారమంటే...?
ఇరికించడంలో ఘనులు
ఈ పొదుపు మాకొద్దు అంటున్న గ్రీసు
నిర్మాతల గురించి ఎందుకు?
రాహుల్ గాంధీకి సెలవు
నితిన్ గడ్కరీ వ్యాపారబంధాలు
గోవింద్ పన్సారే హత్య వెనుక ఎవరున్నారు?
ఈజిప్టు అధ్యక్షుడికి కార్మికవర్గాల బెడద
సమాచారచౌర్యం
షారుఖ్ ఖాన్ రుచి చూసిన కామన్ మ్యాన్ పవర్
తీస్తా ఎన్‌జిఓ గురించి మరి కాస్త..
గతుకులబాటపై అతుకుల బండి
హేతువాదులకు మూడుతోంది
వార్ధక్యంలో కూడా తిరగబడడం మానలేదు
ఫడ్నవీస్ నూరు రోజుల పాలన
ఎంత నేర్చినా... కాంతదాసులే!
కాశీకి మోక్షం వస్తుందా?
హమ్ 'ఆప్' కే హై కౌన్?
వీడ్కోలు సభలో దుమ్ము దులిపేసిన సుజాతా సింగ్
అడ్డుకట్టకు అడ్డంకులు
అవినాశ్ చందర్‌ను ఎందుకు పంపించేశారు?

**55 ఏళ్ల తర్వాత నవలకు సీక్వెల్**
**మన్‌మోహన్ పట్ల జాలి పడాలా?**
**తూర్పున చీట్ ఫండ్స్**
**బుల్లెట్ ట్రెన్స్ వచ్చేనా?**
**తమిళనాడు కొంప ముంచిన ఉచితాలు**
**మహాన్‌లో ఎస్సార్ పవర్ ప్రాజెక్టు**
**యాంకరే న్యూస్ అయినవేళ....**
**పెత్తదార్లంకే భోజ్యం....**

**2015 జనవరి 01-03 వీక్లీకై          ఎమ్బీయస్ : మదన్ మిత్రను ఏం చేయాలి?**

శారదా స్కాములో అరెస్టయిన బెంగాల్ ట్రాన్సుపోర్టు మంత్రి మదన్ మిత్రను ఎలా హ్యేండిల్ చేయాలో మమతా బెనర్జీకి అర్థం కావటం లేదు. సిబిఐ తన పార్టీ రాజ్యసభ ఎంపీ కునాల్ ఘోష్‌ను ప్రశ్నించినప్పటి నుంచీ ఆమెకు యిలాటిది ఏదో జరుగుతుందని తెలుసు. "మదన్ మిత్ర, మమతకు అత్యంత సన్నిహితుడైన ముకుల్ రాయ్ యిద్దరూ శారదా బాస్ సుదీప్త సేన్‌నుండి నిధులు సేకరించి పార్టీకై 2011 ఎన్నికలలో ఖర్చు పెట్టారు. మమత పెయింటింగ్స్‌ను కళ్లు చెదిరే ధర పెట్టి కొనమని సేన్‌కు చెప్పినది వీరే." అని కునాల్ సిబిఐకు చెప్పాడు. రెండేళ్ల క్రితం శారదా నిధులతో ఒక లిక్కర్ కంపెనీ పెట్టారు. అది తయారుచేసే మద్యం నాణ్యత బాగా లేదు కాబట్టి లైసెన్సు యివ్వవద్దని ఎక్సయిజ్ అధికారులు అడ్డం పెట్టినా మిత్ర సహాయకుడు బాపి కరీమ్ పట్టుబట్టి లైసెన్సు యిప్పించారు. ఇప్పుడది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ దృష్టిలో పడింది. ఈ కరీమే కలకత్తాలోని సాల్ట్ లేక్‌లో వున్న శారదా ఆఫీసు నుండి డబ్బు పట్టుకుని వచ్చి మిత్రకు యిచ్చేవాడని యిప్పుడు సిబిఐ న్యాయవాది కోర్టుకి చెప్పాడు. సిబిఐకు ఎడిషనల్ డైరక్టరుగా వుంటూ శారదా స్కాముపై విచారణ జరుపుతున్న అనిల్ కుమార్ సిన్హా సిబిఐ డైరక్టరుగా చార్జి తీసుకోగానే యిక మదన్ మిత్ర పని పట్టడం ఖాయం అనుకుంది మమత. అందుకే అతన్ని కాబినెట్ సమావేశాల్లో పాల్గొనవద్దని అంది. తనతో పాటు సభలకు, పర్యటనలకు రావద్దని అంది. నిజానికి మిత్ర మమతకు ఎప్పణ్నుంచో అనుచరుడిగా వున్నాడు. ఇద్దరూ బెంగాల్ కాంగ్రెసు నేత ప్రియరంజన్ దాస్‌మున్షీ శిష్యులే. అప్పట్లో బెంగాల్ కాంగ్రెసుకు సారథ్యం వహిస్తున్న ప్రణబ్ ముఖర్జీపై కోపంతో దాస్‌మున్షీ వీళ్లిద్దరినీ కొత్త పార్టీ పెట్టుకోమని ప్రోత్సహించాడు. అలాటి మిత్రను యిప్పుడు దూరంగా పెట్టమని ఆమె హితైషులైన అధికారులు హెచ్చరించారు. చివరకు అనుకున్నట్టే డిసెంబరు 13 న సిబిఐ అతన్ని అరెస్టు చేసింది.

మమత వూరుకుంటే మంచిదని హితైషులు చెప్పారు. కానీ అతన్ని అలా వదిలేస్తే పార్టీలో తక్కిన నాయకులు 'ఈమె వాడుకుని వదిలేసే రకం' అనే సంకేతం వెళుతుందనే భయంతో మమత అతన్ని మంత్రిగా తొలగించలేదు. అతన్ని అరెస్టు చేసి తీసుకెళుతున్న సిబిఐ వ్యాన్ ముందు ప్రదర్శనలు చేసి అడ్డుకోమని తన పార్టీ కార్యకర్తలకు ఉపదేశించింది. కోర్టులో తన పార్టీ అభిమానులైన లాయర్ల చేత ఆందోళన చేయించి, సిబిఐ తరఫు న్యాయవాది వాదనలు వినకుండా నినాదాలతో హోరెత్తించింది. ఏదో కారణం చెప్పి ప్రభుత్వాసుపత్రిలో చేరమని మిత్రకు సూచనలు వెళ్లాయట. డిసెంబరు 19 న ఆలీపూర్ సెషన్స్ కోర్టు మిత్రాకు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. అతను "నాకు అనారోగ్యంగా వుంది, సెల్‌కు వెళ్లను, ఎవరైనా డాక్టరును పిలిచి పరీక్ష చేయించేదాకా యిక్కణ్నుంచి కదలను" అంటూ జైలు సూపరింటెండెంట్ ఆఫీసులోనే బైఠాయించాడు. చివరకు డాక్టరు వచ్చాడు. మిత్ర కోరినట్లే ఎస్ఎస్‌కెఎమ్ అనే ప్రభుత్వాసుపత్రిలో చేరాలని సిఫార్సు చేశాడు. ఆరోగ్యశాఖ చూస్తున్న మమతా బెనర్జీ తరఫున మదన్ మిత్రా ఆ ఆసుపత్రి వ్యవహారాలన్నీ పర్యవేక్షిస్తూంటాడు. ఇక అక్కడ అతనికి ఎటువంటి భోగాలు అందుతాయో వూహించవచ్చు. ఇలాటి ఏర్పాట్లు చేయకపోతే కునాల్ మిత్రాను యిరికించినట్లుగా మిత్రా యింకెవరిని యిరికిస్తాడోనన్న భయం మమతది. కునాల్ చెప్పిన పేర్లలో ముకుల్ రాయ్ వున్నాడు కదా. మమతకు కుడిభుజం వంటి అతను శారదా గ్రూపుకి చెందిన రియల్ ఎస్టేటు, మీడియా వ్యవహారాలన్నీ పర్యవేక్షించేవాడు. ఇప్పుడు మదన్ మిత్ర కూడా అతని పేరు చెపితే కొంప మునుగుతుందని మమత అతన్ని పార్టీ బాధ్యతల నుండి పూర్తిగా తప్పించేసింది. అతని బాధ్యతలను పార్థ చటర్జీ, సుబ్రతా బక్షిలకు పంచింది. నవంబరు నుంచి తృణమూల్ పోస్టర్లపై, బ్యానర్లపై అతని ఫోటో కనబడటం లేదు. అతనితో బాటు మంత్రి ఐన శ్యామాపాద ముఖర్జీ, రాజ్యసభ ఎంపీ అహ్మద్ హసన్ ఇమ్రాన్‌లను కూడా పార్టీ సభల్లో పాల్గొనవద్దని చెప్పారు.

ఇలా తన యిమేజి కాపాడుకుంటూ సిబిఐ విచారణ ఒక కొలిక్కి రాకుండా మమత ప్రభుత్వం చేస్తుందన్న సందేహంతో కేసు విచారణను బెంగాల్‌కు బయట నిర్వహించడానికి అనుమతి యివ్వాలని సిబిఐ రాష్ట్రప్రభుత్వాన్ని కోరింది. మమత ఎలాగూ నిరాకరిస్తుంది. అప్పుడు సిబిఐ కోర్టుకి వెళుతుంది. ఇది మమత మెడకు ఎప్పుడు చుట్టుకుంటుందో వేచి చూడాలి. – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)

## ఎమ్బీయస్ : ముసుగువీరుడు బిశ్వాస్

బెంగుళూరులో సింగిల్ బెడ్‌రూమ్ ఎపార్ట్‌మెంటులో పట్టుబడిన 24 ఏళ్ల మెహదీ మస్రూర్ బిశ్వాస్ అందర్నీ ఒక్కసారి ఉలిక్కిపడేట్లు చేశాడు. అతనికి రెండు ముఖాలున్నాయి. పగలు అతను ఐటిసి ఫుడ్స్ అనే మల్టీ–నేషనల్ కంపెనీలో ఏటా రూ. 5.30 లక్షల వేతనం పొందే ఉద్యోగి. రాత్రి వర్చువల్ ప్రపంచం ద్వారా మతయుద్ధం చేసే జిహాదీ టెర్రరిస్టు. తక్కిన జిహాదీల్లా అతను యితర దేశాలకు వెళ్లి టెర్రరిస్టులను కలిసి వారి వద్ద తర్ఫీదు పొందిన వ్యక్తి కాదు. అపరిచితుడు సినిమా హీరోలా తన మేధోశక్తితో సమాచారాన్ని సేకరించి, దాన్ని వ్యాప్తి చేస్తాడు. అతను బెంగాల్‌కు చెందినవాడు. తండ్రి బెంగాల్ ఎలక్ట్రిసిటీ బోర్డులో పనిచేశాడు. ఇద్దరు అక్కలు. 2003లో ఎలక్ట్రికల్ యింజనీరింగు చదువుతూండగా అతను ముస్లిం టెర్రరిజంవైపు మొగ్గాడు. లెవాంట్ ప్రాంతపు (లెబనాన్, సిరియా, పాలస్తీనా, జోర్డాన్, ఇజ్రాయేలు, టర్కీ) రాజకీయాలు, అక్కడి పరిణామాలు అన్నీ క్షుణ్ణంగా తెలుసుకోసాగాడు. ఇస్లామిక్ స్టేట్ (ఐయస్) అభిమానిగా మారి వారి ఆత్మాహుతి దళంలో చేరడం కంటె స్ట్రాటజిస్టుగా వుండి, వారి పోరాటానికి ప్రచారం కల్పించి కొత్తవారు దానిలో చేరేట్లా చేయాలనుకున్నాడు. ఇంట్లో ఒంటరిగా వుంటూ 2009లో బిశ్వాస్ 60 జిబి బ్రాడ్‌బ్యాండ్ కనక్షన్ తీసుకుని ట్విట్టర్ ఖాతా తెలిచాడు. అతనికి 17 వేల మంది ఫాలోయర్స్ వున్నారు. ఇప్పటివరకు 1,29,000 ట్వీట్లు చేశాడు. అరబిక్ నేర్చుకుని అరబ్బీ భాషలో వున్న ట్వీట్స్‌ను యింగ్లీషుకి తర్జుమా చేసేవాడు. ఆ విధంగా ఇంగ్లీషు మాత్రమే తెలిసిన టెర్రరిస్టులకు ఆత్మీయుడయ్యాడు. ఆసియా దేశాలను లక్ష్యంగా చేసుకున్న ఐయస్ కార్యకలాపాలకు యిది వూతం యిచ్చింది. తన రహస్యం ఎప్పటికీ బయటపడదన్న విశ్వాసంతో వున్న విశ్వాస్ తన కార్యకలాపాల గురించి బ్రిటిషు టీవీ ఛానెల్ 4కు యింటర్వ్యూ యిచ్చాడు. ఆ ఛానెల్ వాళ్లు అతనెవరో ఎవరికీ తెలియనివ్వలేదు. కానీ ఆ ప్రసారం చూసిన బ్రిటన్ యింటెలిజెన్సు, సెక్యూరిటీ ఏజన్సీలు సొంతంగా విచారణ జరిపి బెంగుళూరు పోలీసులను హెచ్చరించారు. "మీ వూళ్లోనే వున్నాడతను" అని. అప్పుడు వాళ్లు ఒక స్పెషల్ టీము ఏర్పరచి వెతక నారంభించారు. ఫోన్లు ట్యాప్ చేయసాగారు. ఇదేమీ తెలియని ఛానెల్ 4 మళ్లీ బిశ్వాస్‌కి ఫోన్ చేసి మరో యింటర్వ్యూ యిస్తారా? అని అడిగింది. ఆ సంభాషణ విన్న స్పెషల్ టీము పశ్చిమ బెంగుళూరులోని జలహళ్లిలో తన ఎపార్టుమెంటులో వున్న అతనిపై డిసెంబరు 12 అర్ధరాత్రి దాడి చేసి పట్టుకున్నారు.

ఇంగ్లండ్ పోలీసులు చెప్పేదాకా మీరేం చేస్తున్నారు? అన్న ప్రశ్న బెంగుళూరు పోలీసులే కాదు సైబర్ క్రైమ్ పర్యవేక్షించే అందరూ ఎదుర్కోవలసి వచ్చింది. 2010లో కశ్మీర్‌లో ఒక నకిలీ ఎన్‌కౌంటర్ జరిగిందనీ, ఇరాక్‌లో అమెరికన్ సైనిక దళాలు కొరాన్‌ను దగ్ధం చేశాయనీ అబద్ధపు వార్తలు సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి కశ్మీర్‌లో అల్లర్లు సృష్టించారు. ఈజిప్టులోని అరబ్ స్ప్రింగ్ ఉద్యమకారులు సోషల్ మీడియాను ఎలా వుపయోగించుకున్నారో గమనించిన పాకిస్తాన్ అనుకూల కశ్మీరీ జహాదీలు అల్లరి మూకలు ఒక నిశ్చితమైన సమయానికి ఒక చోట చేరేట్లు చేసి వాళ్లు రాళ్లు విసిరి గొడవలు చేసేట్టు చేయగలిగారు. అప్పుడు భారతదేశపు యింటెలిజెన్సు వర్గాలు సోషల్ మీడియాపై నిఘా పెట్టడం గురించి గట్టిగా ఆలోచించి, అదుపు చేశాయి. పోనుపోను శ్రద్ధ తప్పిందని తాజా ఘటనలు నిరూపించాయి. ఇంటెలిజెన్సు బ్యూరో హెూం శాఖ కింద పనిచేస్తుంది. దాని వద్ద నిపుణులున్నారు కానీ వాళ్లకు యింటర్నెట్‌పై పట్టు లేదు. నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ కింద పనిచేసే నేషనల్ టెక్నికల్ రిసెర్చి ఆర్గనైజేషన్‌కు యింటర్నెట్‌పై పూర్తి అవగాహన వుంది. కానీ దానికి నిర్మాణ వ్యవస్థ లేదు. ఇప్పుడు బిశ్వాస్ పట్టుబడ్డాక నేషనల్ సెక్యూరిటీ ఎడ్వైజర్‌గా వున్న అజిత్ దోవల్ వివిధ ఇంటెలిజెన్సు వర్గాల నుండి ప్రతినిధులను తీసుకుని జాయింట్ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేశాడు. కానీ యీ లోపునే ఐయస్ స్లీపర్ సెల్స్ మేల్కొన్నాయి. బిశ్వాస్ అరెస్టయిన మర్నాడే మరో ట్విటర్ ఖాతా ప్రారంభమైంది. 'బిశ్వాస్‌ను అరెస్టు చేసిన గోయల్ అనే డిసిపిపై పగ తీర్చుకుంటాం' అని ట్వీట్ పెట్టారు బిశ్వాస్ సహచరులు. సాంకేతికతో కూడుకున్న యీ గేమ్ ఆడటంలో మన పోలీసులు టెర్రరిస్టు యువకులతో పోటీ పడినపుడే విజయం సిద్ధిస్తుంది. ఏ మాత్రం ఏమరపాటు కనబరిచినా మరో పదిమంది బిశ్వాస్‌లు పుట్టుకుని వస్తారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ : రాగా – నమ్ముకున్న వాళ్లకు ఆరున్నొక్క రాగమే

మొన్న పార్లమెంటు ఎన్నికలలో మోదీ సాధించిన ఘనవిజయం గురించి హరీశ్ ఖారే అనే సీనియర్ జర్నలిస్టు "హౌ మోదీ వన్ ఇట్..." అనే పుస్తకం రాశారు. దానిలోని కొన్ని భాగాలు పత్రికలలో వచ్చాయి. ఓ పక్క మోదీ ఏడాదికి ముందే సిద్ధమై సర్వశక్తులూ సమీకరించుకుని ముందుకు దూసుకుపోతూ వుండగా, మరో పక్క కాంగ్రెసుకు సారథ్యం వహించవలసిన రాహుల్ గాంధీ నిద్రమత్తులో తూగుతూ, నిరాసక్తంగా తను ఎటు వెళుతున్నాడో, పార్టీని ఎటువైపు తీసుకెళుతున్నాడో తెలియక కాంగ్రెసు రథాన్ని నడిపాడని మామూలు ప్రజలమే గమనించాం. కాంగ్రెసు నాయకులు, సీనియర్ అధికారులు గమనించకుండా వుంటారా? అయినా పైకి చెప్పరు. రాహుల్ గాంధీ యువకుడు. దేశాన్ని ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలన్నదానిపై ఆయనకు ఎన్నో వూహలున్నాయి. మాకు ఆయన నాయకత్వంపై నమ్మకం వుంది. అంటూ నాయకులు ప్రకటనలు చేస్తారు. ఇక అధికారులు తాము ఎవరి కింద పనిచేస్తున్నారో వారికి 'మీడియాలో ఏం రాసినా మన యింటెలిజెన్సు వర్గాల రిపోర్టు ప్రకారం మీదే గెలుపని తెలుస్తోంది' అని మెరమెచ్చు కబుర్లు

చెపుతూ జోకొడతారు. అందుకే అధికారంలో వున్నవాళ్లు బోల్తా పడుతూంటారు. హరీశ్ ఢిల్లీలో పనిచేసే జర్నలిస్టు కాబట్టి వాళ్లతో ఆంతరంగికంగా మాట్లాడి విషయాలు బయటకు లాగగలడు. మర్యాద కాదు కాబట్టి వాటిని యథాతథంగా అప్పుడు ప్రచురించరు. ఇప్పుడు ఫలితాలు అందరికీ తెలిసిపోయాక, అప్పుడు ఆ నాటి డైరీని బయటపెడతారు. హరీశ్ రాసిన పుస్తకంలో రాహుల్ గురించి, మోదీ జగన్నాథ రథం గురించి జర్నలిస్టులు, అధికారులు ఏమనుకున్నారో వాటి గురించి, కొన్ని సంఘటనల గురించిన వివరాలు వున్నాయి.

ఓ జర్నలిస్టు ఫ్యామిలీతో కలిసి చైనీస్ రెస్టారెంట్‌కు వెళితే అక్కడ పక్క టేబుల్‌పై రాహుల్, మరో నలుగురైదుగురు కుర్రాళ్లు వున్నారట, పొట్టి దుస్తుల్లో ఒక అమ్మాయి కూడా. అది 2014 ఏప్రిల్. పేపర్లో, టీవీల్లో అదే రోజు పొద్దున్న రాయబరేలీలో సోనియా గాంధీ నామినేషన్ ఫైలు చేస్తూండగా ఆమె పక్కనే సాయంగా నిలబడిన రాహుల్ ఫోటోలు వచ్చాయి. సాయంత్రం చూస్తే యిక్కడ! ఆ కుర్రాళ్లెవరూ రాజకీయాల్లో వున్నవాళ్లు కారు. వారి సంభాషణ ఆ జర్నలిస్టు చెవిలో పడుతూనే వుంది. డబ్బున్న కుర్రాళ్ల పిచ్చివాగుడు తప్ప దేశభవిష్యత్తు గురించిన టాపిక్కే లేదు. 'నాయకుడనేవాడికి అధికారదాహం వుండాలి, ఆకలిగొన్న పులిలా పోరాడాలి. ఈ కుర్రాడికి ఆకలిదప్పులు వేరే విషయాల్లో వున్నాయి కానీ రాజకీయాలకు సంబంధించి లేవు.' అనుకున్నాడు ఆ జర్నలిస్టు. 'అబ్బే లేకపోవడమేం, సంకీర్ణ ప్రభుత్వాలతో మన్‌మోహన్ వేగుతున్న తీరు చూసి రాహుల్ విసిగిపోయారు. 2014 ఏదో యిలా పోనిచ్చి, 2019 నాటికి కాంగ్రెసుకు పూర్తి మెజారిటీ సిద్ధించేట్లా ఆయన ప్రణాళికలు రచిస్తున్నాడు' అని కొందరు కాంగ్రెసు ముఖ్యమంత్రులు, రాష్ట్రాధ్యక్షులు హరీశ్‌తో దబాయించేవారట. 'అతనికంత సీనుందా? అప్పటిదాకా పార్టీ నిలుస్తుందా?' అని లోపల సందేహిస్తూనే. 'సోనియా గాంధీ పోరు భరించలేక రాహుల్ ఆ పదవిలో కొనసాగుతున్నాడు. వాళ్లిద్దరికీ మధ్య పార్టీ విషయాలపై ఏ చర్చ జరుగుతుందో ఎవరికీ తెలియదు. సయోధ్య వున్నట్టుగా కూడా తోచదు. అన్నిటికీ అహ్మద్ పటేలే గతి. అతని వద్దకు ఏ సమస్య తీసుకెళ్లినా 'ఆ విషయం మా దృష్టికి వచ్చింది, దానిపై ఏదో ఒక నిర్ణయం త్వరలోనే తీసుకోవడం జరుగుతుంది.' అంటూంటాడు. ఆ తర్వాత ఆ సమస్యను పరిష్కరించారో లేక అలాగే వదిలేశారో ఎవరికీ తెలియదు' అంటాడు మరో సీనియర్ నాయకుడు. తెలంగాణ విషయంలో మనం చూశాం – సరైన సమయంలో సరైన నిర్ణయం అంటూ ఎలా తాత్సారం చేసి, చివరకు పార్టీని, రాష్ట్రాన్ని ఎలా భ్రష్టు పట్టించారో! మోదీ సమీరం క్రమేపీ ప్రభంజనంగా మారుతున్నపుడు యుపిఏలో మేలు పొందిన అనేకమంది అధికారులు బిజెపిలో చేరసాగారు. అది చూసైనా కాంగ్రెసు మేలుకోలేదు. తన ముఖ్యమంత్రులను తన పార్టీ నాయకులే బహిరంగంగా విమర్శిస్తూ వుంటే గోతులు తీస్తూ వుంటే ఎవర్నీ మందలించలేదు. కిరణ్ కుమార్ రెడ్డిపై కాంగ్రెసు నాయకులు ఎలా నోరు పారేసుకునేవారో యిక్కడా చూశాం. రాహుల్ ఎవర్నీ అదిలించలేదు.

కాంగ్రెసు నాయకులందరికీ ఒక పద్ధతికి అలవాటు పడ్డారు. టిక్కెట్టు దొరికేదాకా వాళ్లకూ వీళ్లకూ తినిపించడంలో డబ్బు ఖర్చు పెట్టడం, టిక్కెట్టు వచ్చాక ప్రచారానికై నిధులిమ్మని హై కమాండ్‌ను వేధించడం, వచ్చిన నిధులను ఓటర్లపై ఖర్చు పెట్టకుండా తన యింటికి తరలించడం, ఓడిపోతే నిధులు సరిపోలేదని ఫిర్యాదు చేయడం! తక్కిన పార్టీల్లో కూడా యీ సమస్య వుంది కానీ కాంగ్రెసులో యిది పరాకాష్టకు చేరింది. దీన్ని అరికట్టడానికి రాహుల్ చేసినదేమీ లేదు. పరిస్థితి బాగా లేదని అందరికీ తెలుసు, కానీ ఎవరూ దాని గురించి ఏమీ చేయలేదు. రాహుల్ కాకపోతే ప్రియాంకా గాంధీ ఐనా వచ్చి రక్షిస్తుందని కొందరు కింది స్థాయి కార్యకర్తలు ఆశపెట్టుకున్నారు కానీ కొందరు బ్యూరోక్రాట్లు ఆమెనూ తీసిపారేశారు. "చూడు, యివాళ భర్త రాబర్ట్ వాద్రాతో కలిసి ఓటేయడానికి వచ్చింది. మూర్తీభవించిన అవినీతికి మారుపేరుగా రాబర్ట్ పేరు మారుమ్రోగుతున్నపుడు ఆమె అలా చేయవచ్చా? ఏ మాట కా మాట చెప్పుకోవాలంటే సోనియా గాంధీలో పట్టుదల వుంది, మొండితనం వుంది, కాథలిక్ సంప్రదాయం నేర్పిన క్రమశిక్షణ వుంది, ప్రజలేమనుకుంటారోనన్న జంకు యూరోపియన్లకు వుంటుంది చూశారా, అలాటి సెన్సిబిలిటీ వుంది. ఆమె పిల్లలకు అదేమీ లేదు. కులాసారాయుళ్లుగా కనిపిస్తారు." అని మండిపడ్డారు. నెహ్రూ కుటుంబమంటే అభిమానం గల ఒక రిటైర్డ్ అధికారి "2012 నాటికి మన్‌మోహన్ ప్రధాని పదవి రాహుల్‌కి అప్పగించేసి, తను దేశాధ్యక్షుడు అయిపోవాల్సింది. రాహుల్‌కి మంచి ట్రైనింగ్ అయి వుండేది" అని వాపోయాడట. "ఆయన యిస్తానన్నా యితను పుచ్చుకోవాలి కదా. అలాటి ప్రతిపాదన వచ్చినపుడు రాహుల్ 'అబ్బే 2009 జనాదేశం మన్‌మోహన్‌ను చూసి వచ్చింది. నేను 2014లో నెగ్గి అప్పుడు పగ్గాలు చేపడతాన'ని అన్నాడట." అని హరీశ్ వివరించారు. ఆ 2014 యిప్పుడు 2019 అయినట్టుంది.

ఎన్నికల్లో ఓటమి సంభవించాక పదేళ్లు రాజ్యం చేయడం చేత ఏంటీ ఎస్టాబ్లిష్‌మెంట్‌తో కాంగ్రెస్ ఓడిపోయింది అని సంజాయిషీ చెపుతున్నారు రాహుల్ అభిమానులు. మరి గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో ఆ లాజిక్ పని చేయలేదేం? అని ఎవరూ గట్టిగా అడగరు. రాహుల్‌ని తీసేద్దాం అని ఒక నాయకుడంటే మరి అతని స్థానంలో ఎవర్ని పెడదాం? అని వేరేవాళ్లు అడుగుతారు. ఎవరి వద్దా సమాధానం లేదు. 1998 ఎన్నికలలో కాంగ్రెసు ఓడిపోయింది. ఆ ఓటమికి బాధ్యత వహిస్తూ పివి నరసింహారావు నియమించిన పార్టీ అధ్యక్షుడు సీతారాం కేసరి రాజీనామా చేయాలి అని అర్జున్ సింగ్ వంటి వారు తిరుగుబాటు చేశారు. వారి చేత తిరుగుబాటు చేయించినది సోనియా గాంధీ. అలా అప్పుడు ఆమె పార్టీ పగ్గాలు చేజిక్కించుకుంది. మరి యిప్పుడు కాంగ్రెసు ఘోరపరాజయం పొందింది. అలాటి తీర్మానం చేసి పార్టీ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుణ్ని దింపేసేవారెవరు? **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ : పనిలో పనిగా జాగ్రఫీ

చంద్రబాబు, కెసియార్ వాగ్దానాల పుణ్యమాని మన పిల్లలకు ప్రపంచ నగరాలన్నీ పరిచయమవుతున్నాయి. సింగపూరు పాట యిద్దరూ పాడారు. సింగపూరు చరిత్ర పుస్తకాన్ని కెసియార్ తెలుగులోకి అనువదిస్తామన్నారు. అంతలోనే ఇస్తాంబుల్ గుర్తుకు వచ్చిందాయనకు. ఆ పేరు చెపితే ముస్లింలు మురిసిపోతారనుకున్నారో ఏమో. ఈలోగా బాబు జపాన్ గురించి చెప్పసాగారు. ఆంధ్రలో జపనీస్ భాషలో తర్ఫీదు యిచ్చే కోర్సులు పెడుతున్నారు. అటు స్మృతి ఇరానీ గారు జర్మన్ భాష ఎందుకు, సంస్కృతం నేర్చుకోండి అంటోంది. పరలోక భాష కంటె పరదేశ భాషకు యిలలో ఎక్కువ ప్రయోజనం వుందని బాబు సరిగ్గానే గుర్తించారు. ఇప్పుడు కెసియార్ ఇస్తాంబుల్‌లో మాట్లాడే టర్కిష్ భాషో మరోటో నేర్పిస్తారేమోనని ఎదురు చూస్తుండగా యివాళ హైదరాబాదును డల్లాస్‌లా చేస్తానంటూ ప్రకటన చేశారు. ఇదెందుకు మధ్యలో అంటే అక్కడ మల్టీ లేయర్ ఫ్లైఓవర్లు వున్నాయట. చిన్నపుడు 'ఐసరబజ్జా' అనే కథ విన్నాను. ఒకడు అత్తారింట్లో తిన్న ఒక తినుబండారం పేరు గుర్తు పెట్టుకుని యింటికి వెళ్లి భార్యకు చెప్పి చేయించుకోవడానికి దారిలో ఆ పేరు వల్లించుకుంటూ వెళుతూంటాడు. ప్రయాణంలో ఏ శబ్దం విన్నా పాత పేరు వదిలేసి కొత్తదాన్ని మననం చేస్తూంటాడు. అలాగ 'బొహెూం బొహెూం', 'హైలెస్సా, హైలెస్సా' అని మార్చుకుంటూ వచ్చి చివర్లో ఎవరో ఓ స్థూలకాయుడు మెట్లెక్కుతూ 'ఐసరబజ్జా' అని నిట్టూరిస్తే ఆ శబ్దం పట్టుకుని యింటికెళ్లి భార్యతో 'ఐసరబజ్జా వండు' అని చంపుకు తింటాడు. అలాగ కెసియార్, బాబు కార్లో ఓ అట్లాసు పట్టుకుని అవేళ ఏ పేజీ కనబడితే దాని పేరు చెప్తూంటారేమో, లేకపోతే పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన ఎన్నారైలు వాళ్ల వూరి విశేషాలు చెప్పగానే ఎక్సయిటై పోయి మన వూరిని వాళ్ల వూరిగా మార్చేస్తామని ప్రకటనలు చేస్తారేమో!
**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 04-05 వీక్లీకై ఆర్టికల్**

## ఎమ్బీయస్ : మతం మార్పిళ్లు – ప్రకంపనలు

హిందూమతం నుంచి యితర మతాల్లోకి మారేవాళ్ల గురించి వార్తల్లో ఎప్పుడూ రాదు కానీ ఆగ్రాలో 300 చ.కి.మీ. విస్తీర్ణం గల వేద్ నగర్ అనే మురికివాడలో నివసించే 57 కుటుంబాలకు చెందిన సుమారు 250 మంది ముస్లిములు డిసెంబరు 8 న హిందూమతంలోకి మారడంతో వాళ్ల గురించి కథనాలు చాలానే వస్తున్నాయి. మీడియా వారిని వెతికిపట్టుకుని వారి కథనాలు వెలువరిస్తోంది. అక్కడున్నవారిలో చాలామంది బెంగాల్, బంగ్లాదేశ్, బర్మాల నుంచి జీవనోపాధి కోసం అక్కడకు వచ్చిన ముస్లిములు. చెత్తకాగితాలు ఏరుకోవడం వారి వృత్తి. రోడ్డుమీద పారేసిన తుక్కు వస్తువులు ఏరుకోవడానికి రోజుకి 20, 25 కి.మీ.లు నడిచినా నెలకు రూ.2000 కి మించి ఆదాయం రాదు, పిల్లలెక్కువ. దినదినగండంగా బతుకుతున్నారు. వాళ్లకు రేషన్ కార్డులు లేవు. బంగ్లాదేశ్, బర్మాల నుంచి వచ్చినవారికి వెనక్కి పంపించేస్తారన్న భయం తోడయింది. హిందూత్వ సంఘాలు వీరిని వెతికి పట్టుకున్నాయి. 'రేషన్ కార్డులు, ఐడెంటిటీ కార్డులు, ఉద్యోగాలు యిస్తాం' అని ఆశపెట్టి మతం మార్చారు. అన్ని పేపర్లలో ఆ విషయం రాగానే మీడియా చుట్టుముట్టింది, ముస్లిం మతపెద్దలు కదలివచ్చి తిట్టిపోశారు. 'ఇలా అయితే అల్లా మిమ్మల్ని క్షమించడు. ఇప్పుడు మీరు హిందువులు కాదు, ముస్లిములు కాదు' అని భయపెట్టారు. ఎటూ కాకుండా పోయినందుకు ముసలివాళ్లందరికీ బెంగ పట్టుకుంది. పోయిన మతం ఎలాగూ పోయింది, బతుకు మాట ఏమిటని అడుగుదామంటే హిందూత్వ కార్యకర్తలు కనబడకుండా పోయారు.

'ఈ మతమార్పిళ్లన్నీ యిలాగే వుంటాయి' అంటాడు ఆగ్రాకు 50 కి.మీ.ల దూరంలో వున్న అస్రోయీ గ్రామంలో వుండే రామ్ పాల్ అనే వ్యక్తి. పదేళ్ల క్రితం అతనింటికి క్రైస్తవ మిషనరీలు వచ్చారు. 'నీకు పట్నంలో నెలకు రూ.2500 జీతంతో ఉద్యోగం యిప్పిస్తాం, మీ వూళ్లో బడి పెడతాం, ఆసుపత్రి పెడతాం, మీ యింటి ముందు కాస్త స్థలం యిస్తే చర్చి పెట్టుకుంటాం' అన్నారు. ఇతను సరేనన్నాడు. ఓ షెడ్ కట్టి అదే చర్చి అన్నారు. ఇతనికి ఉద్యోగం వచ్చింది. తొమ్మిది నెలలు గడిచాక 'మీ వూళ్లో నువ్వు తప్ప వేరెవరూ మతంలోకి చేరలేదేం?' అని సతాయించసాగారు. 'మీరు కడతానన్న స్కూలు, ఆసుపత్రి కట్టలేదు కదా' అన్నాడితను. ఊరు కెళితే జనాలందరూ నువ్వు హిందువువా? క్రైస్తవుడివా? అని అడగసాగారు. ఈ బాధ భరించలేక ఒక హిందూత్వ సంస్థ దగ్గరకు వెళ్లి 'నన్ను హిందూమతంలోకి మళ్లీ మార్చేయండి' అని బతిమాలుకున్నాడు. వాళ్లు సరేనన్నారు. ఏ మతంలో వున్నా అతని జీవనశైలిలో మార్పు రాలేదు. పందుల పెంచి నెలకు రూ. 3000 దాకా సంపాదించుకుంటాడు. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలకు పంపుకుంటాడు.

ఇప్పుడీ ఆగ్రా మతమార్పిడుల అంశం కారణంగా అందరి దృష్టీ యీ 57 కుటుంబాలపై పడింది. జిల్లా యంత్రాంగం వచ్చి వాళ్లకు భోజనాలూ అవీ ఏర్పాటు చేసింది. కప్పుకునేందుకు దుప్పట్లూ అవీ యిచ్చింది. కొన్ని సంస్థలవాళ్లు వచ్చి పుస్తకాలు పంచారు. ఇవన్నీ కొద్దిరోజుల పాటే మళ్లీ యింకో చోట మార్పిళ్లు జరిగేదాకానే అని వీళ్లకు తెలుసు. కానీ వస్తూంటే కాదనడం దేనికి అని పుచ్చుకుంటున్నారు. భారతదేశంలోని వారందరూ స్వతహాగా హిందువులే అనీ, అందుచేత యీ మతాంతీకరణ 'ఘర్ వాపసీ' (ఇంటికి తిరిగిరావడం) అనీ హిందూత్వ వర్గాలు వాదిస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా ముస్లిముల కంటె క్రైస్తవులు ఎక్కువగా పోరాడుతున్నారు. ఎందుకంటే క్రైస్తవంలోకి మారిన హిందూ దళితులపై హిందూ సంస్థలు దృష్టి కేంద్రీకరించాయి. ఆదివారం నాడు చర్చి ప్రార్థనల తర్వాత బయటకు వస్తున్నవారిని గమనిస్తూ వారిలో దళిత, వెనుకబడిన వర్గాల వారి వద్దకు వెళుతున్నారు.

కాస్సేపు మాట్లాడితే వాళ్లు తమ అసలు కులం ఏదో చెప్పేస్తున్నారు. "మీకు మీ కులం మళ్లీ యిప్పించేస్తాం. మీ బంధువులందరితో కలిసిమెలసి వుండవచ్చు. ఎందుకిలా విడిగా వుండడం?" అని బుజ్జగిస్తున్నారు. వాళ్లు సరేనంటే మతం మారుస్తున్నారు. ఈ ధోరణి మిషనరీలకు నచ్చటం లేదు.

క్రైస్తవ మిషనరీల చేతిలో చాలా విద్యాసంస్థలున్నాయి, సంఘటీకృతమైన వ్యవస్థ వుంది. గట్టిగా మాట్లాడగలిగేవారూ వున్నారు. మీడియాను ప్రభావితం చేయగలిగినవారూ వున్నారు. ముంబయిలోని సెయింట్ జేవియర్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డా॥ ఫ్రేజర్ పార్లమెంటు ఎన్నికల సమయంలో తన విద్యార్థుల నుద్దేశించి ఒక లేఖ రాసి యీ మెయిల్‌గా పంపాడు. కాలేజీ వెబ్‌సైట్‌లో పెట్టాడు. ఆ లేఖలో "ఈ ఎన్నికలలో కార్పోరేట్‌ల పెట్టుబడి, మతతత్వ శక్తులు రెండూ కలిసి మన లౌకికవాద ప్రజాస్వామ్యానికి ముప్పు తేబోతున్నాయి. మీరు జాగ్రత్తగా వ్యవహరించండి." అని రాశాడు. ఇది మోదీకి వ్యతిరేకంగా వుద్దేశించినదని అందరికీ అర్థమవుతుంది. "ఇలాటి రాజకీయపరమైన విషయాలు ప్రచారం చేయడం మీకు తగునా?" అని అడిగితే "ఒక తండ్రి తన పిల్లల్ని ఉద్దేశించి రాసినట్టుగా రాశాను. తప్పేముంది?" అని వాదిస్తాడాయన. కేరళలోని సైరో-మలబార్ చర్చి ప్రతినిథి ఫాదర్ పాల్ తేలకాట్ యిటీవల మాట్లాడుతూ "బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రైస్తవులందరూ భయపడుతున్నారు. వరల్డ్ హిందూ కాంగ్రెసు 2014లో వాళ్లు తీర్మానం చేశారు - "హిందూత్వానికి శత్రువులు 5 ఎమ్‌లు - మెకాలేయిజం (బ్రిటిషు హయాంలో నేటి విద్యావ్యవస్థ ప్రవేశపెట్టినతను మెకాలే), మిషనరీలు (క్రైస్తవ మత సంస్థలు), మెటీరియలిజం (దేవుడి లేడని వాదించే భౌతికవాదం), మార్క్సిజం ('మతం మత్తుమందు లాటిది, ప్రజలు చైతన్యవంతులు కాకుండా పాలకులు మతం పేరు చెప్పి వారిని జోకొడతారు' అని బోధించే కమ్యూనిజం), ముస్లిములు" అని. ఇప్పుడు అనేక క్రైస్తవ స్కూళ్లల్లో సరస్వతీ దేవి బొమ్మ పెడతారా లేదా అని విద్యార్థుల చేత, వారి తలిదండ్రుల చేత అడిగిస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌లో విద్యార్థులు పట్టుబట్టారు. అంతే కాదు, యిన్నాళ్లదాకా పిలుస్తున్న 'రివరెండ్ ఫాదర్'కు బదులు 'ప్రాచార్యా' అని పిలుస్తామంటున్నారు." అన్నారు.

నవంబరు 30 న మోదీ క్రైస్తవ జనాభా అధికంగా వున్న నాగాలాండ్ వెళ్లినపుడు క్రైస్తవ నాయకులు మోదీని కలిసి ఆయన పాలన వచ్చాక దేశమంతా క్రైస్తవులపై దాడులు పెరిగాయని ఫిర్యాదు చేశారు. వారి ఆరోపణల ప్రకారం - ఢిల్లీ, ఝార్‌ఖండ్‌లోని భిలాయ్, దుర్గ్, కర్ణాటకలోని ఉడుపి, చిత్రదుర్గ, కేరళలోని త్రిశూర్, ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్, మహాసముంద్, యుపిలోని జాన్‌పూర్, బులంద్‌శహర్, ఆలీగఢ్, తమిళనాడులోని కరూరు, మధ్యప్రదేశ్‌లోని మాండ్లాలలో చర్చిలపై రాళ్లు వేయడం, ధ్వంసం చేయడం వంటి సంఘటనలు జరిగాయి. మధ్యప్రదేశ్‌లోని దేవాస్, కట్నీ, ఇండోర్, భోపాల్, ఆలీపూర్, కర్ణాటకలోని చిత్రదుర్గ, కార్వార్, తమిళనాడులోని తిరునల్వేలి, ఛత్తీస్‌గఢ్‌లోని జశ్‌పూర్, బెంగాల్‌లోని మేదినీపూర్, బిహార్‌లోని పాట్నా, యుపిలోని ఫైజాబాద్‌లలో పాస్టర్లను పోలీసులు అరెస్టు చేయడమో, వేధించడమో చేశారు. ఆదివారం నాడు ఏదో ఒక చోట చేరి క్రైస్తవులందరూ పాటలు పాడడాలు, ప్రార్థనలు చేస్తూంటారు కదా. ఇటీవలి కాలంలో కొందరు వచ్చి అవి ఆపేయమని గట్టిగా చెప్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసి, వారిని చెదరగొడుతున్నారు. అన్ని రకాలవీ కలిపి మొత్తం 71 సంఘటనలు. బలవంతంగా మతమార్పిడులు చేస్తున్నారంటూ మధ్యప్రదేశ్‌లో గత మూడు నెలల్లో 500 కేసులు బుక్ చేశారు. 1998లో వాజపేయి ప్రధానమంత్రిగా వుండగా ఒడిశాలో గ్రహమ్ స్టెయిన్స్ అనే క్రైస్తవ మిషనరీని సజీవదహనం చేశారు. మళ్లీ ఆ రోజులు తిరిగి వస్తాయన్న భయం వేస్తోంది అన్నారు నాగాలాండ్ క్రైస్తవులు. ఇలా ఫిర్యాదు చేసినవారికి బుద్ధి చెప్పడానికా అన్నట్లు మర్నాడే ఢిల్లీలోని దిల్‌షాద్ గార్డెన్ ప్రాంతంలో సెయింట్ సెబాస్టియన్ చర్చ్‌లోని బలిపీఠం దగ్ధం చేశారు కొందరు. దాంతో వేలాది క్రైస్తవులు ఢిల్లీ పోలీసు హెడ్‌క్వార్టర్స్ వద్ద ఘొరావ్ నిర్వహించారు.

ప్రపంచవ్యాప్తంగా క్రీస్తు జన్మదినంగా పాటించే డిసెంబరు 25ను 'సుపరిపాలనా దినం'గా ప్రకటించి ఆ రోజు ఆ అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించాలని స్మృతి ఇరానీ ఆదేశాలు జారీ చేశారు. అంటే కావాలని అవేళ స్కూళ్లు తెరిపిస్తున్నారన్నమాట అని అందరూ విరుచుకుపడ్డారు. అబ్బే లేదు, వారు స్కూళ్లకు వచ్చే రాయనక్కరలేదు అంటూ ఇరానీ సవరించుకున్నారు. ఏది ఏమైనా భారతీయులకు సంబంధించి యీ డిసెంబరు 25 ను క్రీస్తు జన్మదినంగా కాక వాజపేయి, మాలవ్యాల జన్మదినంగా గుర్తుంచుకునేట్లు చేసింది బిజెపి ప్రభుత్వం. ఇవన్నీ క్రైస్తవులను బాధిస్తున్నాయి. "విద్య, వైద్యం పేరు చెప్పి మేం కనబడిన వాళ్లందరినీ మా మతంలోకి లాక్కుంటాం అని తెగ ప్రచారం సాగుతుంది. భారతదేశంలో 2000 ఏళ్లగా క్రైస్తవం వుంది. అయినా జనాభాలో క్రైస్తవులు 2.3% మంది మాత్రమే వున్నారని గమనించండి." అంటున్నారు వాళ్లు. 2011 జనాభా లెక్కల ప్రకారం హిందువులు 80.5%, ముస్లిములు 13.4%, క్రైస్తవులు 2.3%, శిఖ్కులు 1.9% మంది వున్నారు. క్రైస్తవుల్లో విద్యావంతులు 80% కాగా, శిఖ్కుల్లో 69%, హిందువుల్లో 65%, ముస్లిములలో 59%. ఇక్కడ ఒక విషయం గమనించాలి. చాలామంది దళితులు క్రైస్తవంలో మారినా రిజర్వేషన్లు పోతాయన్న భయంతో తమను తాము హిందువులుగానే పేర్కొంటారు. కొన్ని రాష్ట్రప్రభుత్వాలు దళితక్రైస్తవులను దళితులుగా పరిగణిస్తామని చెప్తున్నా దేశవ్యాప్తంగా ఆ పరిస్థితి లేదు. క్రైస్తవులకు, దళిత ముస్లిములకు కూడా రిజర్వేషన్లు వర్తింప చేస్తారా అని యిటీవల రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు అలాటి ఉద్దేశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

ఇప్పుడు హిందూమతంలోకి జరుగుతున్న మతమార్పిడుల గురించి విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తే 'అయితే మతమార్పిడుల నిషేధ చట్టం అమలు చేద్దామంటారా?' అని అడుగుతోంది బిజెపి. సరేనంటే ముస్లిము, క్రైస్తవవర్గాలు చిక్కుల్లో పడతాయని విపక్షాల భయం. ఇప్పటికే ఆ చట్టం కొన్ని రాష్ట్రాలలో దుర్వినియోగం అవుతోంది. ఆట్టే మాట్లాడితే అక్కడ కూడా చట్టరూపం ధరించలేదు.

అసెంబ్లీలో తీర్మానాలు పాస్ చేశారంతే. కోర్టుల్లో వాటిని సవాలు చేశారు కాబట్టి గవర్నరు ఆమోదముద్ర పడలేదు. అందుచేత యింకా చట్టంగా పరిగణించలేం. అయినా అది పెట్టుకుని అనేకమంది పాస్టర్లపై కేసులు బుక్ చేయడం జరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో ఆ 'చట్టం' క్రింద గత 8 ఏళ్లల్లో 700 ఫిర్యాదులు నమోదు చేశారు. ప్రాథమిక విచారణ తర్వాత 270 కేసులు నిలిచాయి. పోలీసులు కేసులు రిజిస్టరు చేసి వందకుపైగా పాస్టర్లను అరెస్టు చేసి జైల్లో పెట్టారు, వాళ్లు బెయిల్‌పై బయటకు వచ్చారు. 40 మందిపై పెట్టిన కేసులను కోర్టు కొట్టేసింది. 2003లో గుజరాత్ ప్రభుత్వం 'ఫ్రీడమ్ ఆఫ్ రెలిజియన్ యాక్ట్' చేసింది. దాని ప్రకారం ఎవరైనా మతం మార్చుకోదలచుకుంటే జిల్లా కలక్టర్ అనుమతి పొందాలి! ఆ చట్టం యొక్క నియమనిబంధనలు రూపొందించడానికి ఐదేళ్లు పట్టింది! అవి తయారయ్యేసరికి దాన్ని గుజరాత్ హైకోర్టులో సవాలు చేశారు. కోర్టు ప్రభుత్వానికి నోటీసు పంపింది. పంపి ఆరేళ్లయినా గుజరాత్ ప్రభుత్వం యిప్పటిదాకా దానికి సమాధానం పంపలేదట. మధ్యప్రదేశ్ ప్రభుత్వం 'ఫ్రీడమ్ ఆఫ్ రెలిజియన్ యాక్ట్'కి 2006లో చేస్తే గవర్నరు ఆమోదించలేదు. దాన్ని భారత దేశాధ్యక్షుడికి పంపితే ఆయన సొలిసిటర్ జనరల్ అభిప్రాయం కోరారు. అది పెండింగులో వుండగానే 2013 జులైలో మధ్యప్రదేశ్ ఎసెంబ్లీ అదే సవరణ చేసి ఎలాటి చర్చ లేకుండా ఆమోదించింది.

తన ప్రభుత్వం యిలాటి మతపరమైన అంశాలతో వివాదాల్లో చిక్కుకోవాలని మోదీ కోరుకోవడం లేదని కొందరంటారు. విదేశాలతో వ్యాపారబంధాలను పెంచుకోవాలని, వారికి అనుగుణంగా చట్టాలు మార్చి పెట్టుబడులను ఆకర్షించాలని మోదీ ప్రయత్నిస్తున్నారని పాశ్చాత్యదేశాలు గుర్తించాయి. కానీ అవన్నీ క్రైస్తవ దేశాలే. భారతదేశంలో మతపరమైన వివక్షత సాగుతోందనే ప్రచారం వారికి యిబ్బంది కలిగిస్తుంది. ఆ యా దేశాల్లో చర్చిలు కూడా చాలా బలమైనవి, స్థానిక రాజకీయాలను ప్రభావితం చేయగలిగినవి. అంతేకాకుండా సామ్రాజ్యవాద దృక్పథంతో వున్న అగ్రరాజ్యాలకు మతమార్పిళ్లపై యిలాటి ఎదురుదాడి రుచించదు. మతానికి, రాజ్యవిస్తరణకు ఏమిటి సంబంధం అనే ప్రశ్నకు మాజీ డిజిపి అరవిందరావుగారు జనవరి 2 నాటి ఆంధ్రజ్యోతిలో రాసిన వ్యాసంలో సమాధానం దొరుకుతుంది. ఆయన ప్రతి శుక్రవారం ఆ పేపర్లో "భారతీయం" అనే పేర ఆధ్యాత్మికపరమైన, మతపరమైన అంశాలపై చక్కటి, హేతుబద్ధమైన వ్యాసాలు రాస్తారు. ఆయన వ్యాసం సారాంశాన్ని రాస్తున్నాను. పూర్తి పాఠం కావాలంటే వ్యాసం చదవాల్సిందే! – "10 వ శతాబ్దిలో పాశ్చాత్య సంస్కృతికి, అరబిక్ దేశాల సంస్కృతికి మధ్య క్రూసేడ్స్ పేర జరిగిన పోరాటం యిప్పుడు కొత్తరూపంలో పునరావృతం అవుతోంది. ప్రపంచంలో అత్యధికులు క్రైస్తవులు, తర్వాతి స్థానంలో ముస్లిములు, ఆ తర్వాత బౌద్ధులు, నాలుగో స్థానంలో హిందువులు. పూర్వకాలపు వలసవాదం కారణంగా, ప్రపంచీకరణ కారణంగా ఇస్లాం మతస్తులు యూరోప్, అమెరికా దేశాల్లో విస్తరిస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లో కుటుంబవిలువలు, మతవిశ్వాసాలు క్షీణించి క్రైస్తవులు సంఘటితంగా లేరు. ముస్లిములు ఆ విషయాలంలో బలంగా వున్నారు. కొందరు క్రైస్తవులు ఇస్లాంలోకి మారుతున్నారు కూడా. అందువలన రాబోయే 25 ఏళ్లల్లో ముస్లిములు యూరోప్‌లో మెజారిటీగా వుండబోతారని ఒక అంచనా. అది తలచుకుని పాశ్చాత్యదేశాల్లోని క్రైస్తవులు ఇస్లాం వ్యాప్తి పట్ల, మతమార్పిడుల పట్ల ఆందోళన చెందుతున్నారు. అందుకే ఇస్లాం దేశాలను అంతర్యుద్ధాలతో, మారణకాండలతో బలహీన పర్చడానికి, భారత్‌లో తమ సంఖ్య పెంచుకోవడానికి వ్యూహాలు రచిస్తున్నారు. ఈ క్రమంలో ఇస్లామిక్ దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. ఇది గమనించిన చైనా మతమార్పిడిని వ్యతిరేకిస్తోంది.

'ఒక దేశం మరొక దేశాన్ని వశపరచుకోవడానికి దాడి చేయడం ఓ పద్ధతి. ఆ దేశపు అంతర్గత వ్యవస్థను, దేశ సంస్కృతిని బలహీనపరచి, తమ సంస్కృతిని, మతాన్ని వ్యాపింపచేసి, ఆ తర్వాత తమ మతస్తుల భద్రతకు ముప్పు వచ్చిందని గగ్గోలు పెట్టి, తమ అనుయాయులకు అధికారంలో భాగస్వామ్యం దక్కేట్లు చేసి తమ కనుకూలమైన తోలుబొమ్మ ప్రభుత్వాలను కూర్చోబెట్టడం మరో పద్ధతి. ఆఫ్రికా, ఆసియాలోని అనేక చిన్నదేశాలపై పాశ్చాత్యదేశాలు యీ తరహాలో పెత్తనం సంపాదించుకున్న వైనం గమనిస్తూనే వున్నాం. భారతదేశం చూడ్డానికి పెద్దదే అయినా మన వ్యవస్థ బలహీనమైనది. హిందూమతంలో ఎలాటి సంస్థాగత నిర్మాణమూ లేదు. ఇతర మతస్తులను తన అనుయాయులుగా మార్చమని ఏ హిందూ దేవుడూ ఆజ్ఞ యివ్వలేదు. హిందువుల్లో ఉదారవాదం వ్యాపించి, యితరుల వ్యూహాల్ని తెలుసుకోలేకపోవడం జరుగుతోంది. ఆధునిక యుగంలో ఎవరూ చూడని దేవుడు, స్వర్గం–నరకం వంటి విషయాలపై మాదే సరైన వాదం అంటూ దాన్ని విస్తరించేవాళ్ల ఉద్దేశాలు కేవలం మతవిశ్వాసమే అనడానికి వీల్లేదు. సామ్రాజ్యవాదం ప్రస్ఫుటంగా కనబడుతుంది..."

ఇదీ అరవిందరావుగారు అనేక గ్రంథాల నుంచి సమాచారం సేకరించి, సోదాహరణంగా రాసిన వ్యాసంలోని ముఖ్యాంశం. యూరోప్‌లో, అమెరికాలో ఇస్లాం వ్యతిరేకత స్పష్టంగా కనబడుతోంది. 'వీళ్లు వచ్చి జనాభా పెంచేసుకుని, మనను, మన మతాన్ని మైనారిటీలుగా చేసేస్తున్నారు. మన ఉద్యోగాలు కాజేస్తున్నారు' అనే భావం తెల్లవారు బాహాటంగా ప్రకటిస్తున్నారు. వారే యితర దేశాల్లోకి చొచ్చుకుపోయి విస్తరించాలి తప్ప రివర్స్ గేర్‌లో వారిపై ఒత్తిడి పడితే భరించలేరు. గతంలో లాగ మన దేశాలలో వారి జండా ఎగరనక్కరలేదు. వారి దేశపు కంపెనీలకు మన దేశసంపదను కట్టబెట్టేస్తే చాలు. వారి యుద్ధస్థావరాలకు చోటిస్తే చాలు. అలాటి వ్యూహాలు రచిస్తూ భారత్‌ను టార్గెట్ చేస్తున్న పాశ్చాత్య దేశాలకు భారత్‌లో యిప్పుడు జరుగుతున్న రివర్స్ మతమార్పిడులు మింగుడుపడవు. వారి దేశపు చర్చిలు ప్రస్తుత భారత ప్రభుత్వానికి క్రైస్తవవ్యతిరేక ముద్ర కొట్టి వారితో సంబంధబాంధవ్యాలు పెంచుకోకూడదని ఒత్తిడి చేస్తే వారు వెనకంజ వేయవచ్చు. అది మోదీ ఆర్థికవిధానాలకు దెబ్బే. అందువలన యీ హిందూత్వ శక్తులు అదుపులో వుంటే బాగుంటుందని మోదీ ఆలోచనట. గుజరాత్ ముఖ్యమంత్రిగా వుండగా రోడ్డుకి అడ్డంగా వున్న మసీదులతో

బాటు అంతకంటె ఎక్కువ సంఖ్యలో వున్న దేవాలయాలను తొలగించిన వ్యక్తి మోదీ. ఆరెస్సెస్ తనకు వ్యతిరేకంగా పోరాడినా ఖాతరు చేయలేదు. ప్రధాని పదవికై ఆశించినప్పుడు మాత్రమే అతను ఆరెస్సెస్‌తో రాజీ పడ్డాడు. ప్రస్తుతం ఏదో రకంగా ఆర్థికాభివృద్ధి చేసి జనాలను ఆకట్టుకోవాలని అతని తాపత్రయం. కానీ ఆరెస్సెస్ నాయకత్వంలోని హిందుత్వ శక్తులకు అదేమీ పట్టదు. 'ఇప్పుడున్నది మన ప్రభుత్వం, భాగస్వామ్య పక్షాలపై ఆధారపడవలసిన అవసరం లేని తరుణం. మన తడాఖా యిప్పుడు చూపించకపోతే యింకెప్పుడు చూపిస్తాం?' అనే వూపులో వున్నారు. చివరకు యిది ఎటు దారి తీస్తుందో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 06–07 వీక్లీకై** **ఎమ్బీయస్ : (అ)క్రమబద్ధీకరణ**

ప్రభుత్వభూములను ఆక్రమించిన వాళ్లందరికీ తెలంగాణ ప్రభుత్వం వరాలు కురిపించింది. మాకు డబ్బు కట్టేస్తే చాలు, ఆ స్థలాలు మీవే అనేస్తోంది. పేదలైతే ఆ డబ్బూ కట్టనక్కరలేదంటోంది. తెలంగాణ ఉద్యమం నడిచినంతకాలం ఒకటే ఘోష – మా తెలంగాణ భూములను ఆంధ్రులు వచ్చి కబ్జా చేశారు, రాయలసీమ నుండి తెల్లలుంగీలు కట్టుకుని, బాంబులు చేతపట్టి, సుమోల్లో వచ్చి మా భూములు లాక్కున్నారు అని. వైయస్ హయాంలోనే యివన్నీ జరిగాయి కాబట్టే తెలంగాణ ఉద్యమం వచ్చిందని పవన్ కళ్యాణ్ కనిపెట్టారు కూడా. ఆయన పుస్తకాలు బాగా చదివారని, సమాజంలో సమస్యల పట్ల చక్కటి అవగాహన ఏర్పరచుకున్నారని, సామాజిక సైంటిస్టని చెప్తూంటారు. వైయస్ కంటె ముందే తెలంగాణ ఉద్యమం వుందని ఆయన చదివిన పుస్తకాల్లో లేదో ఏమో. సరే, ఆయన మాట ఎలా వున్నా కబ్జాల గురించి గొంతు చించుకోని తెలంగాణ మేధావి, తెలంగాణ నాయకుడు లేడు. ఇప్పుడు ఆ 'రాక్షసజాతి' ఆంధ్ర ఆక్రమణదారులకు అప్పనంగా, అతి చవుకగా భూములు అప్పచెప్పేస్తూంటే, వారి అక్రమాలను క్రమబద్ధీకరిస్తూ వుంటే తిరగబడవద్దా? తెలంగాణ ప్రయోజనాలను యిన్నాళ్లూ సమైక్యపాలకులు తాకట్టు పెట్టారని వాపోయారే, యీ రోజు పెడుతున్నదెవరు?

ఆక్రమణలు, వాటిని క్రమబద్ధీకరించడాలు మన తెలుగునాట యీనాటి క్రీడ కాదు. వింటే బాధగా వుంటుందేమోకానీ మనంత అడ్డగోలు పరిపాలన యింకోచోట కనం, వినం. కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలు కట్టిన కాలనీలు అనేక నగరాల్లో చూస్తాం. ఆ సొసైటీకి రూల్సు వుంటాయి, సభ్యులుంటారు, ఇళ్లన్నీ ఒకేలా వుంటాయి, ఎవరికైనా అమ్మాలన్నా, కొనాలన్నా సొసైటీ అనుమతి తీసుకోవాలి. కాలనీలో కార్యకలాపాలపై సొసైటీ నిఘా వేసి వుంచుతుంది. మేన్‌టెనెన్స్ కట్టకుండా ఖాళీ చేయబోయినా, పరిసరాలు శుభ్రంగా వుంచకపోయినా, అసాంఘిక చర్యలు చేస్తున్నట్లు సందేహం వచ్చినా తోలు తీస్తుంది. మన రాష్ట్రాలలో యిలాటి రూల్సు ఎప్పుడైనా విన్నామా? ఇళ్లు పూర్తవడంతో సొసైటీ పని పూర్తయిపోతుంది. ఎవడూ ఎవడి మాటా వినడు. పన్ను రాయితీలు, చవకగా స్థలాలు పొందడానికి మాత్రమే మనం సహకార సంఘాలుగా ఏర్పడతాం. ఫలానా సంస్థ ఉద్యోగులకు మాత్రమే అని బైలాస్‌లో రాసి వుంటుంది. పదవుల్లో వున్నవారికి తెలిసున్నవారందరికీ ఆ సంస్థతో ఏ సంబంధం లేకపోయినా ఎలాట్ చేసేస్తారు. జూబిలీ హిల్స్ సొసైటీ వంటి ఉన్నతస్థాయి సంఘంలోనే అవకతవకలు జరిగాయి, అవన్నీ బయటకు లాగుతాం, వాళ్లందరినీ దండిస్తాం అని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన నెలలోపునే యిదిగో యీ క్రమబద్ధీకరణ వచ్చేసింది. చాలా రాష్ట్రాలలో హౌసింగ్ బోర్డు వుంది. ప్రభుత్వమే స్థలం సేకరించి, యిళ్లు కట్టి, వాయిదాల్లో అమ్ముతుంది. ఒకే లే ఔట్, ఒకటే డిజైన్. మార్చుకుంటానంటే ఒప్పుకోదు. మరి మన దగ్గర? ఎల్‌ఐజిలో యిళ్లు ఎలాట్ చేయించుకుని, దానిపై మూడంతస్తుల మేడ కట్టేసి పక్కనున్న వాళ్లకు గాలి, వెలుతురు లేకుండా చేస్తారు. మొదట కేటాయించుకున్నవాడు అమ్మేయగలుగుతాడు. అందుకని డబ్బున్నవాళ్లు తమ పనివాళ్ల పేర ఎల్‌ఐజి యిళ్లు ఎలాట్ చేయించుకుంటారు. తర్వాత తమ పేర రాయించేసుకుని అక్కడ మేడలు వేసేసి, కమ్మర్షియల్ కాంప్లెక్సు కట్టేసి, నానా బీభత్సం చేసేస్తారు.

ఓ సారి మా బ్యాంకు క్వార్టర్స్‌లో బాల్కనీ గ్రిల్‌లో పూలకుండీలు పెట్టుకుందుకు బయటకు పొడుచుకు వచ్చేట్లా గ్రిల్ పెట్టించమని ఆఫీసర్లు మా చీఫ్ మేనేజరును అడిగారు. ఆయన మహారాష్ట్రవాడు. 'అబ్బే అది రూల్సుకి వ్యతిరేకం. మునిసిపల్ కార్పోరేషన్ వాళు వచ్చి పీకేస్తారు.' అని వాదించాడు. 'మీరు నియమాలకు కట్టుబడుతున్నారు సంతోషం. కానీ ఫర్ యువర్ ఇన్ఫర్మేషన్, మీరు చెప్పేవన్నీ మహారాష్ట్రలో జరుగుతాయి. ఎపార్టుమెంటులో తగినంత గ్రీనరీ వుండకపోయినా దండన విధిస్తారు. ఇక్కడ ఏమీ చేయరు. అంతా చల్తా హై. ఇన్ని పెంట్‌హౌస్‌లు ఏ నగరంలోనైనా చూశారా? ఫ్లాట్ ఓనర్లకు సంబంధించిన స్థలంలో బిల్డర్లు అక్రమంగా కడుతున్నారు, అమ్మేస్తున్నారు. మా ఆస్తి అమ్మడానికి నువ్వెవరు అనైనా ఫ్లాట్ ఓనర్లు బిల్డర్‌ను అడగరు. ఇక ప్రభుత్వం పథకాలు చూస్తే యింకా అన్యాయం. ఇంకుడు గుంతలని హడావుడి చేస్తున్నారు కదా, అవి పెట్టకపోతే అనుమతి యివ్వనని అంటున్నారు కదా, వచ్చే ఏడాది చూడండి ఏమవుతుందో' అన్నాను. ఇంకుడు గుంతలపై అప్పటి ప్రభుత్వం పెట్టిన ఖర్చు కంటె 'నీరు–మీరు' పేర దానికోసం చంద్రబాబు బొమ్మతో చేసిన హోర్డింగులకు, ప్రచారానికి ఎక్కువ ఖర్చయిందని పిఏసి తేల్చింది. ఇప్పుడు వాటి మాటే మర్చిపోయారు. ఇప్పుడు వాటర్ గ్రిడ్ అంటున్నారు. చెఱువుల పునరుద్ధరణ అంటున్నారు. డిసెంబరు నాటికి చెఱువులన్నీ ఖాళీ చేయాలి. ఒక్కటంటే ఒక్కటైనా చేశారా? సర్వే పూర్తి కాలేదు. టెండర్లే పిలవలేదు. ఎవరికైనా టెండర్ యిస్తానంటే ఆర్థికశాఖ కొరీలు వేస్తోందట. ఎందుకొచ్చిన అడ్డంకులని చెఱువులకు సంబంధించిన విషయాల్లో ఆర్థికశాఖ రిఫరెన్సు అక్కరలేదని రూలు పాస్

చేసేశారట. ఇక అడ్డగోలుగా నిధుల పంపిణీ అయిపోతుందన్నమాట. చెఱువులు, పర్యావరణం మరోటీ ఏమవుతాయో ఊహించుకోవాల్సిందే.

ఇవన్నీ గతంలోనూ జరిగాయి. ఆ పాపాలన్నీ సమైక్యపాలన నెత్తిమీద రుద్దారు. తెలంగాణ ఏర్పడితే అన్ని విధాలా ఉన్నతమైన సమాజం ఏర్పడుతుందని లెక్చర్లు దంచారు. ఎవరు అధికారంలోకి వచ్చినా మేం నిలదీస్తాం, కాపలాకుక్కల్లా విరుచుకుపడతాం అంటూ మావోయిస్టుల దగ్గర్నుంచి రైటిస్టుల దాకా అందరూ గర్జించారు. కెసియార్ వస్తూనే అయ్యప్ప సొసైటీ బిల్డింగులు కూలగొట్టగానే హర్షధ్వానాలు చెలరేగాయి. ఆంధ్రావాళ్లకు బుద్ధి చెప్పాడని కేరింతలు కొట్టారు. తక్కిన ప్రాంతాల్లో కూడా అలా చేస్తే ప్రభుత్వానికి రుణమాఫీ చేయడానికి కావలసినంత ఆదాయం వస్తుందని కెసియార్ చెప్పుకున్నారు. కానీ అంతలోనే అది చప్పబడిపోయింది. 'ఊరికే, ఉత్తినే.. ఝలక్ యివ్వడానికి' అంటున్నారు కెసియార్ యిప్పుడు. ఝలక్ కోసం యిళ్లు కూలుస్తారా? ఓ రెండు రోజులు నీళ్లు, కరంటు బంద్ చేస్తారా? రెగ్యులరైజ్ చేస్తానంటే వాళ్లు మాత్రం డబ్బులు కట్టనన్నారా? 'ఆంధ్రోళ్లను' హడలగొట్టి తమకు కావలసిన సాధించుకోవడానికి రాజకీయ నాయకులకు సాధనంగా పనికి రావడం తప్ప ఆ కూల్చివేతల వలన సామాన్యుడికి ఏ విధంగానూ ప్రయోజనం చేకూరలేదు. ఇప్పుడు క్రమబద్ధీకరించే వాళ్లలో ఉద్యమకారులు లెక్క ప్రకారం అందరూ ఆంధ్రులే వుండాలి. ఎందుకంటే తెలంగాణవారు అమాయకులు, నోట్లో వేలు పెడితే కొరకలేనివారు, అమాయకపు వధువు వంటి వారు అని టీవీ చర్చల్లో అనేక మంది తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎంపీలు చెప్పుకుని వచ్చారు. అలాటి పరిస్థితుల్లో ఆక్రమణదారులను తరిమేసి ఆ స్థలాలు స్వాధీనం చేసుకుంటే మంచిది కదా. ఆంధ్రోళ్లకు బుద్ధి వస్తుంది, మనకు డబ్బు వస్తుంది. క్రమబద్ధీకరిస్తే వచ్చేదెంత? అంతకంటె సర్కారే స్వాధీనం చేసుకుని దళితులకు యివ్వాల్సిన యిళ్ల స్థలాలు యివ్వవచ్చు కదా. అలా అయితే వాటికి ప్రజాధనం వెచ్చించి కొనవలసిన పని లేదు. దళితులకు గ్రామాల్లో యిస్తాం యిక్కడెందుకు అంటే ఆ స్థలాలు చూపించి కొత్త పరిశ్రమలను ఆకర్షించవచ్చు. లేదా ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యానికి వచ్చేవారి కోసం సత్రాలు కట్టి అపర నిజాం అనే కీర్తి తెచ్చుకోవచ్చు. జలయజ్ఞం కోసం వైయస్సార్ తెలంగాణ భూములను అమ్మేశారని ఆక్రోశించారు కదా. మిగిలిన భూములనైనా కాపాడుకోవద్దా? అవీ ధారాదత్తం చేసేస్తారా?

పేదలు ఆక్రమిస్తే ఆ స్థలాల్లో ప్రభుత్వం ఫ్లాట్లు కట్టి యిస్తుందట. ఎంత తమాషాగా వుంది! పేదలైనా, పెద్దలైనా ఆక్రమణదారుడు ఆక్రమణదారుడే. వాళ్లకు రివార్డా? మళ్లీ యిలా చేయమని ప్రోత్సాహమా? న్యాయంగా వుండి ఏ స్థలమూ ఆక్రమించనివాడికి గుణపాఠమన్నమాట. పేదల సంగతి సరే, రామోజీ ఫిల్మ్ సిటీ కూడా దురాక్రమణే అని కదా కెసియార్ చెప్తూ వచ్చారు. ఈనాడు దాని మాట ఎత్తకపోగా వెళ్లి ఆతిథ్యం స్వీకరించి వచ్చారు. నాగార్జున ఎన్ కన్వెన్షన్ చెఱువు భూమి ఆక్రమించారని గగ్గోలు పెట్టారు. మళ్లీ అక్కినేని ఎవార్డు ఫంక్షన్‌కు వెళ్లి సుహృద్భావం ప్రకటించారు. ముఖ్యమంత్రిగా యిది తప్పదు అని వాదించవచ్చు. కానీ దురాక్రమణ విషయంలో ఆయన స్టాండ్ ఏమిటన్నది సామాన్యప్రజలకు అర్థం కాకుండా పోయింది. రేపు చెరువులు ఆక్రమణ విషయంలో యిలాగే చేయరని నమ్మకం ఏమిటి? మిషన్ కాకతీయ గురించి ప్రచారం ఎక్కువగా వుంది కానీ ఆచరణలో చెరువుల సర్వే ముందుకు సాగడం లేదు. సర్వే మొదలుపెట్టగానే దురాక్రమణలు బయటపడ్డాయేమో. అందుకే సాగదీస్తున్నారేమో. వాటినీ క్రమబద్ధీకరించేస్తారేమో. చేస్తే చేయండి కానీ ఆక్రమణదారుల మూలాలు ఏమిటో ప్రకటించి, మరీ క్రమబద్ధీకరించండి. అప్పుడే దానిలో ఆంధ్రుల వాటా తెలుస్తుంది. ఉద్యమంలో చెప్పిన అసత్యాలూ బయటపడతాయి. ఏది ఏమైనా తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువతీయువకులు, మేధావులు ఆశించిన విధంగా మాత్రం ప్రస్తుత ప్రభుత్వం నడవటం లేదు. పాత అక్రమాలను క్రమబద్ధీకరించడం చూస్తే పాలకులు మారారు కానీ పాలన మారలేదనేది స్పష్టమవుతోంది. – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)

## జనవరి 08-10 వీక్లీకై ఎమ్బీయస్ : మీడియా సంగతేమిటి?

ఏడాది పూర్తవతోందనగానే నెల్లాళ్ల ముందు నుంచి ఇయర్ రౌండప్ అంటూ మీడియా అనేక కథనాలు వేస్తుంది. మరి 2014లో మీడియా రౌండప్ ఎలా వుంది? చెప్పాలంటే భారత మీడియాలో 2014 ఒక మైలురాయి. మోదీని అసలైన ప్రధాని అభ్యర్థిగా చూపడానికి మీడియా పడినంత శ్రమ అంతా యింతా కాదు. మోదీ ఏం చేసినా మహ బాగే, శభాషే అంటూ కేరింతలు కొట్టింది, యుపిఏ అవినీతితో, మన్‌మోహన్ మౌనముద్రతో విసిగిపోయిన మీడియా. ఆటగాళ్లను హుషారు చేయడానికి గ్రౌండ్‌లో గంతులేసే ఛీర్ లీడర్స్ స్థాయికి మీడియా దిగజారింది. మోదీలో వారికి ఏ తప్పూ కనబడలేదు. కాంగ్రెసులో ఏ మెప్పూ కనబడలేదు. ఒకప్పుడు తాము వేటాడి, వెంటాడి, విసిగించిన మోదీయే వాళ్లకు జగద్రక్షకుడిగా, మహిమాన్వితుడిగా కనబడ్డాడు. గుజరాత్‌లో మోదీ సాధించిన విజయాలను (!) దండోరా వేసే బ్యాండ్‌గా తయారయ్యారు. వింత ఏమిటంటే ఎన్నికల వరకు మీడియా బహుచక్కగా వుపయోగించుకున్న మోదీ పదవి అధిష్టించిన తర్వాత పట్టించుకోవడం మానేశాడు. పత్రికా సమావేశాలు నిర్వహించడం లేదు. మన వద్ద కెసియార్ కూడా అంతే. ఉద్యమంలో మీడియా, జాక్, మేధావులు అందరూ కావలసి వచ్చారు. అధికారం చేజిక్కాక వాళ్లని పలకరిస్తేనే పెద్ద న్యూస్ అయిపోతోంది. మోదీ తమను లక్ష్యపెట్టినా పెట్టకపోయినా మీడియాకు యింకా మోదీ మైకం దిగలేదు. నిర్మాణాత్మకమైన విమర్శలతో ప్రభుత్వానికి పక్కలో ముల్లులా వుండాలన్న మాట మర్చిపోయిన మీడియా భజనబృందం పాత్ర నుంచి బయటకు రాలేదు. ఈ లోగా మోదీ తరఫున కాపిటలిస్టులు మీడియాను సొంతం చేసుకోవడం మొదలుపెట్టారు.

తెలుగులో అగ్రశ్రేణి పత్రిక ''ఈనాడు''లో ముకేశ్ అంబానీ రిలయన్సు పెట్టుబడులు, ఆ పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుకూలంగా ఆ పత్రిక వ్యవహరించడం చూస్తూనే వున్నాం. ఆ గ్రూపు ఇండియన్ మీడియా ట్రస్టు పేరిట ఎన్నికలు కాగానే జులై 2014లో నెట్‌వర్క్ 18 కొంది. సిఎన్ఎన్-ఐబిఎన్, ఐబిఎన్7, సిఎన్‌బిసి, ఫోర్బ్స్, ఫస్ట్ పోస్ట్, మనీ కంట్రోల్ యిత్యాది అనేక సంస్థలు దాని చేతిలోకి వచ్చాయి. దీనివలన తమ స్వేచ్ఛకు భంగం వాటిల్లుతుందన్న భయంచేత కాబోలు సిఎన్ఎన్-ఐబిఎన్ ఎడిటర్ యిన్ చీఫ్ రాజ్‌దీప్ సర్దేశాయి రాజీనామా చేసి తన భార్య, తోటి టీవీ యాంకర్ అయిన సాగరికా ఘోష్‌తో సహా టైమ్స్ ఆఫ్ ఇండియాలో చేరాడు. (మోదీ అభిమానులపై నోరు పారేసుకుని మోదీకి మరింత ప్రచారం కల్పించినది యితనే) అతనితో బాటే కరణ్ థాపర్ కూడా సిఎన్ఎన్-ఐబిఎన్ నుండి హెడ్‌లైన్స్ టుడేకు మారాడు. మోదీ విదేశీయాత్రల సందర్భంగా అతని పబ్లిక్ రిలేషన్స్ పనంతా కొన్ని టీవీ ఛానెల్సే చేసిపెట్టాయి. ఎన్‌డిటివి, హెడ్‌లైన్స్ టుడే యాంకర్స్ మోదీతో బాటు వెళ్లి విస్తారంగా కవర్ చేసి, మోదీ యిమేజిని భారతీయుల్లో పెంచాయి. అనేకమంది సీనియర్ జర్నలిస్టులు మోదీతో కలిసి సెల్ఫీలు తీసుకుని సోషల్ మీడియాలో పెట్టుకున్నారు. ఇలా ఏకపక్షంగా వ్యవహరించడం వలన మీడియా తన శక్తిని కోల్పోతుంది. ప్రజలు దాని మాటలు విశ్వసించడం మానేస్తారు. రాజ్‌దీప్ సర్దేశాయి మీడియా తనను ఆకాశానికి ఎత్తేస్తోంది కాబట్టి మోదీకి యింకా వారితో విరోధం రాలేదు. కానీ రాష్ట్రాలలో పరిస్థితి అలా లేదు. బెంగాల్‌లో ఆనంద బజార్ పత్రికను సిపిఎం వ్యతిరేకి అనేవారు. ఈ రోజు మమతా బెనర్జీకి అది తన వ్యతిరేక పత్రికగా తోస్తోంది. కెసియార్ టీవీ 9, ఆంధ్రజ్యోతి ఛానెళ్లతో ఎలా వ్యవహరిస్తున్నారో, మీడియాను ఎలా బెదిరించారో వేరే చెప్పనక్కరలేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ : పెషావర్ ఘటన తర్వాత పాకిస్తాన్

పెషావర్‌లో మిలటరీ స్కూలులో 132 మంది స్కూలు పిల్లల (వారితో బాటు యితరులు 8 మంది చనిపోయారు) మరణం తర్వాత పాకిస్తాన్ టెర్రరిజాన్ని ఏ విధంగా ఎదుర్కుంటుంది అన్నది చర్చనీయాంశంగా మారింది. ఆ ఘాతుకం నిర్వహించినది టిటిపి (తెహరీక్ ఎ తాలిబాన్ పాకిస్తాన్) జిహాదీ టెర్రరిస్టులు. ప్రభుత్వవ్యవస్థను వ్యతిరేకించే 13 చిన్న మతవాద టెర్రరిస్టు సంస్థలను ఒక ఛత్రం కింద తేవడానికి 2007లో బైతుల్లా మెహసూద్ అనే వజీరిస్తాన్‌కు చెందిన గిరిజన నాయకుడు స్థాపించిన సంస్థ అది. 2009లో అమెరికా నిర్వహించిన డ్రోన్ ఎటాక్‌లో అతను మరణించాడు. ఆ తర్వాత హకీముల్లా మెహసూద్ అనే అతను కూడా అలాటి ఎటాక్‌లోనే 2013లో చనిపోయాడు. అతని మరణానికి ప్రతీకారం అంటూ యీ సంస్థ పాకిస్తాన్ మిలటరీకు చెందిన కార్యాలయాలపై దాడి చేయడం మొదలుపెట్టింది. ఆ వరసలోనే 2014 జూన్‌లో కరాచీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేసింది.

పాకిస్తాన్ తాలిబన్లను ప్రోత్సహిస్తోందని చదువుతాం, మళ్లీ తాలిబన్లు పాకిస్తాన్‌పై దాడి చేశారనీ వింటాం. ఏమిటీ మిస్టరీ అంటే టెర్రరిజంపై, తాలిబన్లపై పాక్ ద్వంద్వ విధాన ఫలితం యిది. ఆఫ్గనిస్తాన్‌లో, భారత్‌లో జిహాద్ పేర కల్లోలాలు, హింసాత్మక ఘటనలు చేసి వాటిని బలహీనపరచే తాలిబన్లను 'మంచి తాలిబన్ల'గా ప్రకటించి పాకిస్తాన్, ఐయస్ఐ వారిని ప్రోత్సహిస్తుంది. పాకిస్తాన్ భారత్‌ను బలహీనపరచడానికి 1989లో లష్కరే తొయ్‌బా, జైషే మొహమ్మద్ సంస్థలను తయారుచేసి కశ్మీర్‌లో ప్రవేశపెట్టింది. ఆఫ్గనిస్తాన్‌ను బలహీనపరచడానికి 1999 నుండి 2008 వరకు పాకిస్తాన్ అధినేతగా వున్న పర్వేజ్ ముషారఫ్ అలాటి చర్యలే చేశారు. ఆఫ్గనిస్తాన్ ప్రభుత్వాన్ని సమర్థిస్తున్నట్లు పైకి చెప్తూ అమెరికా నుండి సహాయం పొందుతూ లోపాయికారీగా అఫ్గనిస్తాన్ తాలిబన్లకు సైన్యసహాయం చేస్తూ వచ్చాడు. (ఈ విషయాన్ని అమెరికా కనుక్కోలేక పోయిందనుకోవడం వింతగా వుంటుంది) ఆ విజయాలతో మదించిన కొందరు తాలిబన్లు పాకిస్తాన్‌ను తాము కలలు కనే ఉగ్రవాద తీవ్రమతవాద దేశంగా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. వారిని పాకిస్తాన్ 'చెడ్డ తాలిబన్లు'గా పరిగణిస్తుంది. వీరిపై యుద్ధం చేస్తూంటుంది. అందుకని వారూ పాకిస్తాన్‌పై దాడులు చేస్తూ వుంటారు. మసీదుల్లోని మదరసాలలో నేర్పించే విద్య కాకుండా వేరే రకమైన విద్య నేర్పడం తాలిబన్లు సహించరు. 2004-2013 మధ్య పాకిస్తాన్‌లోని స్కూళ్లపై 724 దాడులు జరిగాయి. ఈసారి యీ ఘాతుకం తర్వాత పాకిస్తాన్ ప్రజలు తాలిబన్లను నిర్మూలించాలని హాహాకారాలు చేస్తుంటే పాక్ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు ఫారిన్ పాలసీ సలహాదారుగా వున్న సర్తాజ్ అజీజ్ 'అందరు టెర్రరిస్టులను ఒకే గాటకు కట్టకూడదు. పాకిస్తాన్ దేశభద్రతకు హాని కలిగించనివారిని మనం లక్ష్యంగా చేసుకోకూడదు' అంటున్నాడు. ఇదంతా చూస్తే ఒక విషయం స్పష్టమవుతోంది – పెషావర్ సంఘటన తర్వాత పాకిస్తాన్ సైన్యం టెర్రరిజానికి మద్దతు యివ్వడం ఆపబోవటం లేదు. ప్రజాగ్రహాన్ని యితరులపై మళ్లించి, తమకు అనుకూలమైన తాలిబన్లను ప్రోత్సహిస్తోంది.

ఇలాటి డబుల్‌గేమ్‌కు రూపశిల్పి ఐన పర్వేజ్ ముషారఫ్ యిప్పుడీ మారణకాండపై ఒక టీవీ యింటర్వ్యూలో ఏమన్నాడో తెలుసా? ''ఇది విదేశీ శక్తుల పని. అఫ్గనిస్తాన్‌లోని హమీద్ కర్జాయ్ ప్రభుత్వం హిందూస్తాన్‌కి చెందిన గూఢచారి సంస్థ 'రా' కలిసి యీ దాడిని టిటిపి ద్వారా నిర్వహించాయి. టిటిపి ప్రస్తుత అధినేత మౌలానా ఫజుల్లా అఫ్గనిస్తాన్‌లోనే దాగున్నాడు.'' అని. ఈ వాదనకు వత్తాసు పలుకుతున్నట్లు పాక్ ఆర్మీ చీఫ్ రహీల్ షరీఫ్ దాడి జరగగానే అఫ్గనిస్తాన్‌కు వెళ్లి అక్కడి ప్రభుత్వాధికారులతో ''మౌలానా ఫజుల్లాను మాకు అప్పగించండి'' అని అడిగేశాడు. ఈ ఫజుల్లా వాయువ్యపాకిస్తాన్‌లోని స్వాత్ లోయకు చెందినవాడు. పాకిస్తాన్ సైన్యం అక్కడ

తాలిబన్లను వెతక నారంభించనపుడు 2009లో అఫ్గనిస్తాన్‌కు పారిపోయి, అక్కణ్నుంచి టిపిపిని నడుపుతున్నాడు. ముషారఫ్ మాటలను 'మంచి తాలిబన్లు' అందిపుచ్చుకున్నారు. స్కూలులో ప్రాణాలు కోల్పోయినవారికై ఏర్పరచిన సంతాపసభలో లష్కరే తొయిబాకు ముసుగుగా పని చేసే జమాత్-ఉద్-దవా అనే సంస్థ పెషావర్ శాఖ అధిపతి అబ్దుల్ రవూఫ్ "పాకిస్తాన్‌ను విచ్ఛిన్నం చేయడానికి విదేశాలు కుట్ర పన్నాయి. కానీ అవి విఫలం కాకతప్పదు." అన్నాడు. 'ఈ అమాయకపు పిల్లల రక్తం అమెరికా, ఇజ్రాయేలు, ఇండియాలను భస్మీపటలం కావిస్తుంది' అంటూ ఆ సభలో బ్యానర్లు కట్టారు. పాక్‌ను తమ చేతిలో తీసుకుందామని ప్రయత్నించే తాలిబన్లకు, పాక్ సైన్యానికి నడుస్తున్న యుద్ధంలో భాగంగా ఆ సంఘటన జరిగితే మధ్యలో విదేశాలు ఎలా వచ్చాయో వాళ్లకే తెలియాలి.

పాక్ సైన్యం జర్బ్ ఎ అజ్బ్ పేర తమకు, ఆఫ్గనిస్తాన్‌కు గల సరిహద్దులో వున్న వజీరిస్తాన్ పర్వతప్రాంతంలో గెరిల్లా యుద్ధం చేస్తున్న టెర్రరిస్టులను వేటాడుతోంది. ఇప్పటికి 1500 మంది టెర్రరిస్టులను చంపామని, వారిలో చాలామంది విదేశీయులని చెప్పుకుంటోంది (ఆ ప్రాంతానికి మీడియాను అనుమతించటం లేదు, రుజువులు చూపడం లేదు, అందువలన యీ అంకె ఎంతవరకు నమ్మాలో తెలియదు). గత పదేళ్లగా వజీరిస్తాన్, ఖైబర్, ఫక్తూనిస్తాన్ ప్రాంతాల్లో పాక్ 1.50 లక్షల మంది సైనికులను అక్కడకు పంపించింది. ఈ ఆపరేషన్ కారణంగా పది లక్షల మంది పౌరులు నిర్వాసితులై శరణార్థులుగా మారారు. వారి అవస్థ చూసి పాక్ పాలనావ్యవస్థలోని కొందరు తాలిబన్ సానుభూతిపరులుగా మారారు. డిసెంబరు 16 నాటి పెషావర్ ఘటనలో స్కూలులో పనిచేసేవారు టెర్రరిస్టులకు ముందుగా సమాచారం అందించారని కొందరి ప్రగాఢవిశ్వాసం. పొద్దున్న ఆరుగురు దుండగులు స్కూలు వెనక్కాల గోడ ఎక్కుతూంటే ఎవరూ చూడలేదా? అని వారు అడుగుతున్నారు. వచ్చినది ఆరుగురు కాదు, పన్నెండుమంది, ఆరుగురు ముందు నుంచి, ఆరుగురు వెనకనుంచి వచ్చారని స్థానిక మీడియా అంటోంది. వాళ్లు స్కూలుకు సంబంధించిన వ్యాన్‌లోనే వచ్చారని, మిలటరీ కమెండోలు వచ్చి 900 మందిని రక్షించినప్పుడు దాడి చేసినవారిలో కొందరు స్కూలు సిబ్బంది సహాయంతో వారితో కలిసిపోయి తప్పించుకున్నారని కూడా అంటున్నారు. ఈ ఆర్మీ పబ్లిక్ స్కూలు మిలటరీ జోన్‌లో వుంది. వెళ్లాలంటే అనేక మిలటరీ చెక్‌పోస్టులుంటాయి. అయినా టెర్రరిస్టులు రాగలిగారంటే భద్రతా లోపాలు ఎన్ని వున్నాయో తెలుస్తున్నాయి. ఈ స్కూలుపై దాడి జరిగే ప్రమాదం వుందని పెషావర్ ప్రాంతీయ ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం గత ఆగస్టులోనే హెచ్చరిక జారీ చేసింది. అంతేకాదు, దాడికి మూడు రోజుల ముందు కూడా వార్నింగు అందిందట. అయినా దాడి జరిగిందంటే దాని అర్థం - స్కూలుకి సంబంధించిన వారిలో తాలిబన్ సానుభూతిపరులున్నారు!

దాడి జరిగిన తర్వాతి పరిస్థితిని సమీక్షిస్తే - స్కూలులో భద్రతావైఫల్యాల గురించి మీడియా ప్రశ్నలు లేవనెత్తటం లేదు. సైన్యం ఏది చెపితే అదే రాస్తోంది. తాలిబన్లను అణచివేయగలం అని వాళ్లు గొప్పలు చెపుతూంటే యథాతథంగా అదే ప్రచారం చేస్తోంది. ఇక ప్రభుత్వమైతే ఉక్రోషంతో టెర్రరిజం ఆరోపణలపై జైల్లో వున్న 500 మందిని ఉరి తీసేస్తామని ప్రకటించింది. వారిలో కొందరు అమాయకులు కూడా వున్నారని జస్టిస్ ప్రాజెక్ట్ పాకిస్తాన్ అనే హ్యూమన్ రైట్స్ సంస్థ వాదిస్తోంది. మరణశిక్షపై 2008లో విధించిన మారటోరియంను హడావుడిగా ఎత్తేసి, డిసెంబరు 19 నుంచి 24 లోగా 6 ఉరిశిక్షలు అమలు చేశారు. ఈ ఉరిశిక్షలు ప్రారంభం కాగానే తెహరీక్-ఇ-తాలిబాన్ పాకిస్తాన్ అనే సంస్థ మీడియాకు హెచ్చరిలు పంపింది - మా వాదనలకు మీరు సరైన కవరేజి యివ్వటం లేదు, ఇలా చేస్తే మేం మరిన్ని దాడులు చేస్తాం జాగ్రత్త అని. ప్రధాని నవాజ్ షరీఫ్ అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి టెర్రరిజాన్ని ఎదుర్కోవడానికి నేషనల్ టెర్రరిజం పాలసీని సమీక్షిద్దామన్నాడు. తాలిబన్‌లకు తిండి పదార్థాలు, డబ్బు ఎలా అందుతున్నాయో నిఘా వేయాలని, అఫ్గనిస్తాన్‌నుండి అనుమతి లేకుండా వచ్చిన శరణార్థులను తిప్పి పంపాలని, వారిపై సత్వర విచారణ జరపాలని యిలా ఆ సమావేశంలో రకరకాల సూచనలు వచ్చాయి. ఇదిలా జరుగుతూండగానే యాంటీ టెర్రరిస్టు కోర్టు జడ్జి ముంబయి దాడులలో నిందితుడు జకీర్ రెహమాన్ లఖ్వీకి బెయిల్ మంజూరు చేశాడు. పెషావర్ దాడికి విదేశీయులే కారణమని ప్రచారం చేస్తున్న జమాత్ ఉద్ దావాకు లఖ్వీ సన్నిహితుడు. హర్షించదగిన విషయం ఏమిటంటే పాక్ ప్రజలు మాత్రం పెషావర్ దాడిని జీర్ణించుకోలేక పోతున్నారు. ఆ దాడులను ఖండించడానికి నిరాకరించిన ఎఱ్ఱ మసీదు పూజారి మౌలానా అబ్దుల్‌కి వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. తాలిబన్ వ్యతిరేక ప్రదర్శనలు దేశమంతటా యిన్నాళ్లు జరగడం గతంలో ఎన్నడూ చూడలేదు. ఇలాటి దాడులు విద్యాసంస్థలపై, కోచింగ్ సెంటర్లపై యింకా జరుగుతాయన్న పంజాబ్ ప్రాంతీయ ప్రభుత్వం హెచ్చరించడంతో పాకిస్తాన్ క్రికెట్ ఆటగాడు, ప్రఖ్యాత బౌలర్ సయీద్ అజ్మల్ ఫైసలాబాద్‌లో తను నడుపుతున్న క్రికెట్ అకాడమీని మూసేశాడు. అకాడెమీలో దాదాపు 200 మంది కోచింగ్ పొందుతున్నారు. ఇంకో వంద మంది దాకా వస్తూ పోతూ వుంటారు. వీళ్లందరి ప్రాణాలూ పణంగా పెట్టలేక మూసేశానన్నాడు. ఇలాటి కష్టనష్టాలు పాక్ ప్రజలు మరెన్ని కలగనున్నాయో!
**- ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**ఎమ్బీయస్ : హెల్త్ ఎంబాసిడర్‌గా అమితాబ్ బచ్చన్**

ఆంధ్ర ప్రభుత్వం అమితాబ్ బచ్చన్‌ను హెల్త్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిందట. ఆయన చ్యవన్‌ప్రాశకు వాటికీ అంబాసిడర్‌గా

వున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఈ వయసులో కూడా ఓపిక చేసుకుని తిరుగుతున్నానంటే చ్యవన్‌ప్రాశ లాటివి తినడం వల్లనే అని చెప్పినట్లు వుంటుంది. కానీ శరీరమంతా అనారోగ్యాల పుట్ట అయిన అమితాబ్‌ను ఆరోగ్యానికి ప్రతీకగా చూపడం ఏమిటి తమాషా కాకపోతే! ఒక్క మాటలో చెప్పాలంటే సానియా మీర్జాలో ఎంత తెలంగాణతనం వుందో, అమితాబ్‌లో అంత ఆరోగ్యం వుంది! 'కూలీ' సినిమా యాక్సిడెంటు జరిగినపుడు బయటకు వచ్చిన ఆయన వ్యాధుల జాబితా చూసి అందరూ దడుచుకుని ప్రార్థనలు మొదలుపెట్టారు. ఆ తర్వాత బతికి బట్టకట్టాక కూడా సవాలక్ష రోగాలతో ఆయన నెట్టుకుని వస్తున్నాడు. రాజీవ్ గాంధీ బలవంతంపై రాజకీయాల్లోకి దిగవలసి వచ్చింది. ఎన్నికల ప్రచారానికి గ్రామీణ ప్రాంతాల్లో తిరిగేటప్పుడు నానా అవస్థ పడేవాడు. అసలే ఆస్త్మా, అక్కడి దుమ్ము పడేది కాదు. సినిమాల్లో మొదట్లో ఫైట్స్ చేసేవాడు కానీ తర్వాత తర్వాత మాయమంత్రాలతో మ్యాజిక్కులు చేసినట్లు పాత్రలు రాయించుకుని "తుఫాన్" వంటి సినిమాల్లో వేశాడు. అవి గాలికి కొట్టుకుపోవడంతో కారెక్టరు యాక్టరుగా మారిపోయాడు. సినిమాలు మానేసి వున్న కాస్త ఆరోగ్యాన్ని కాపాడుకుందామని అనుకుంటూన్న సమయంలో ఎబిసిఎల్‌లో భారీ నష్టాలు వచ్చి మళ్లీ వేషాలు వేయవలసి వచ్చింది. ఇటీవలే చెప్పుకున్నాడు – 'కెబిసి ప్రారంభానికి ముందు తనకు టిబి సోకిందని'. గొప్ప నటుడు కాబట్టి, అద్భుతమైన వాయిస్ వుంది కాబట్టి, కొద్దిపాటి శారీరకపు కదలికలతోనే డాన్సు చేసినట్లు భ్రమింపచేయగలడు కాబట్టి యింకా డిమాండులో వున్నాడు. అంతమాత్రానికి అతన్ని పరిపూర్ణ ఆరోగ్యానికి నమూనాగా చూపించడం ఆశ్చర్యకరం. హిందీ వాళ్లే కావాలనుకుంటే కండల వీరుడు సల్మాన్ ఖాన్నో, అక్షయ్ కుమార్ వంటి వాళ్లయితే యువతకు యిన్‌స్పయిరింగ్‌గా వుండేది. అమితాబ్‌ను ఏదో దానికి ప్రతీకగా చూపించాలంటే ఆత్మస్థయిర్యానికి ఉదాహరణగా చూపాలి. మృత్యుముఖంలోకి వెళ్లి వచ్చినా, అప్పులపాలై దెబ్బ తినిపోయినా నీరు కారిపోకుండా మళ్లీ ఆత్మబలంతో పుంజుకున్న విషయాన్ని హైలైట్ చేయాలి. ఏది చెప్పినా ఆయన వాయిస్‌లో చెపితేనే అందం. ఆయనకు తెలుగు రాదాయె! వాయిస్ డబ్ చేస్తే ఆ కాడికి అమితాబ్ ఎందుకు? పోనీ ఆయనే తెలుగును హిందీ లిపిలో రాసుకుని చదువుతాడనుకుంటే 'ళ' వంటి అక్షరాల దగ్గర దొరికిపోతాడు. "మీ కళ్లు కాపాడుకోండి" అనవలసిన చోట కల్లు అన్నాడంటే అర్థమే మారిపోతుంది. అదే కాకుండా మనకు రెండు చలు, రెండు జలు వున్నాయి. తెలుగేతరులు సరిగ్గా పలకలేరు. అమితాబ్‌ను బదులు ఏ ప్రభాస్‌నో, గోపీచంద్‌నో పెట్టుకుంటే అర్థవంతంగా వుండేది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ : ముఫ్తీ యిక్కట్లు

79 ఏళ్ల ముఫ్తీ మహమ్మద్ సయీద్ కశ్మీర్ రాజకీయాల్లో కురువృద్ధుడు. 1958 నుండి 1999 వరకు కాంగ్రెసులో వుండి నేషనల్ కాన్ఫరెన్సుకి వ్యతిరేకంగా పని చేసేవాడు. తర్వాత సొంతంగా పిడిపి పార్టీ పెట్టుకున్నాడు. ఇప్పుడు కశ్మీర్ ప్రజలు అతనికి అధికారం అందీ అందనట్టుగా యిచ్చారు. అందరి కంటె ఎక్కువగా 28 సీట్లు వచ్చినమాట వాస్తవమే కానీ అవి ఎటూ సరిపోవు. బిజెపితో చేతులు కలిపితే అధికారం తథ్యం కానీ బిజెపి బేరసారాలు తట్టుకోవడం కష్టం. ముఖ్యమంత్రి హిందువు అయి వుండాలని, కనీసం జమ్మూ నుంచి వుండాలని పట్టుబడుతోంది. అదే జరిగితే కశ్మీర్ లోయలో ఎవరికీ మొహం చూపించలేనని ముఫ్తీ వాపోతున్నాడు. జమ్మూ కశ్మీర్ ఓటర్లు అందర్నీ తలో కాస్తా శిక్షించాలనుకోవడంతో ఓట్లు చీలిపోయాయి. 87 సీట్లుంటే వాటిలో 17 వాటిల్లో 1500 ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారయ్యాయి. పిడిపి 11 స్థానాలను యీ విధంగా పోగొట్టుకుంది. నేషనల్ కాన్ఫరెన్స్‌పై వున్న ప్రభుత్వ వ్యతిరేకతతో కశ్మీర్ లోయలో పిడిపికే ఎక్కువ సీట్లు రావలసి వుంది. కానీ బిజెపితో అంటకాగుతాడనే అనుమానం కొద్దీ పిడిపిని అధికారానికి దూరంగా ఆపేశారు కశ్మీర్ ఓటర్లు. తను ప్రధాని కాగానే మోదీ ముఫ్తీకి ఫోన్ చేసి హలో చెప్పాడన్న ప్రచారం కశ్మీర్ ఓటర్లలో శంకలు రేపింది. కశ్మీర్‌లో వరదలు వచ్చినపుడు ముఫ్తీ కూతురు మెహబూబా తన పార్టీ ఎంపీలను వెంటపెట్టుకుని మోదీని కలిసి, మీడియా ఎదుట హంగామా చేయడంతో యీ శంక బలపడింది. పిడిపి నిలబెట్టిన హిందు అభ్యర్థుల్లో ఒక్కరినైనా ముస్లిం ఓటర్లు గెలిపించలేదు. ఆర్టికల్ 370 రద్దుకై ప్రయత్నిస్తామని, సైన్యానికి విశేషాధికారాలు కొనసాగిస్తామని బిజెపి అనడం కశ్మీర్ లోయలోని ప్రజలు సహించలేదు. అందుకే బిజెపి అభ్యర్థుల్లో ఒక్కరికి తప్ప వేరెవ్వరికీ డిపాజిట్టు దక్కలేదు. పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి 32.65% ఓట్లు రాగా అసెంబ్లీ ఎన్నికల వద్దకు వచ్చేసరికి 23%కి పడిపోయింది. పిడిపికి అప్పుడు 20.72% వస్తే యిప్పుడు 22.7% వచ్చాయి. ఎన్‌సికి కూడా 11.22% నుండి 20.8%కి పెరిగాయి. కాంగ్రెసు అప్పటి కంటె ఘోరంగా నష్టపోయింది. అప్పుడు 23.07% యిప్పుడు 18%. అంటే అసెంబ్లీ ఎన్నికల వద్దకు వచ్చేసరికి ప్రాంతీయపార్టీలైన పిడిపి 2%, ఎన్‌సి 8.5% ఎక్కువ తెచ్చుకోగా జాతీయ పార్టీ లయిన కాంగ్రెస్ 5%, బిజెపి 9.5% తక్కువ తెచ్చుకున్నాయి. అందరి కంటె ఎక్కువగా బిజెపి నష్టపోవడానికి కారణం కశ్మీర్ లోయలోని ఓటర్ల గాఢ వ్యతిరేకత. తన మూలస్థానమైన లోయలో బిజెపి పట్ల వ్యతిరేకత యింత తీవ్రంగా కనబడుతున్నపుడు ముఫ్తీ బిజెపికి ముఖ్యమంత్రి పదవి అప్పగించడానికి వెనుకాడడంలో ఆశ్చర్యమేముంది? **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 11-12 వీక్లీకై**

## ఎమ్బీయస్ : చార్లీ హెబ్డో ఇస్లాంపై గురి పెట్టిందా?

జనవరి 7 న ఫ్రెంచ్ పత్రిక "చార్లీ హెబ్డో" పై దాడి చేసి 12 మందిని చంపివేసి, 11 మందిని గాయపరచిన నలుగురు ఇస్లాం

ఉగ్రవాదుల్లో యిద్దరు దొరికారు. ఫ్రాన్సు దేశమంతటా హై అలర్ట్ ప్రకటించి పోలీసులు క్షుణ్ణంగా గాలిస్తున్నారు. కొందర్ని అరెస్టు చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పాత్రికేయులందరూ ఆ పత్రిక్కట దాడిని, ఎడిటర్-ఇన్-చీఫ్ స్టీఫేన్ చార్బోనియర్ తో సహా 10 మంది సిబ్బందిని కాల్చివేయడాన్ని ఖండిస్తున్నారు. స్టీఫేన్ 2013 నుండి అల్ కైదా హిట్‌లిస్టులో వున్నారు. ఇంతకీ ఆ పత్రిక ఇస్లాం వ్యతిరేకియా? ముస్లిములకు వ్యతిరేకంగా కార్టూన్లు వేసి, వారిని రెచ్చగొట్టి, వారు ప్రతిక్రియ చేయగానే ప్రపంచవ్యాప్తంగా ఖండనలు చేసేట్లు చేయడమే లక్ష్యమా? తరతరాలుగా ఫ్రాన్సులో వెలసిల్లిన స్వేచ్ఛాభావాలకు, ఉదారవాదాలకు ప్రతీక ఆ పత్రిక. మతానికి, రాజకీయాలకు ముడిపెట్టకూడదని, అందర్నీ సమానంగా చూడాలనీ, ఎవరికైనా సరే తమ భావాలను స్వేచ్ఛగా ప్రకటించే వాతావరణం వుండాలని ఫ్రెంచ్ పౌరులు కోరుకుంటారు. అందుకే రాజకీయాలు కానీ, తత్త్వశాస్త్రం కానీ, కళల విషయంలో కానీ నూతనధోరణులు ఫ్రాన్సులో వచ్చినంతగా వేరే చోట రాలేదు. అలాటి ఫ్రెంచ్ సమాజం యిటీవల సంకుచితం అయిపోతోంది. ఫ్రాన్సుకు గతంలో వలసరాజ్యాలుగా వున్న అనేక దేశాలు, వలస కారణంగా వారికి సిద్ధించిన పౌరసత్వం ఆసరాతో ఫ్రాన్సుకు తరలివచ్చి స్థిరపడుతున్నారు. మౌలికంగా వీరిలో ఫ్రెంచ్ ఉదారవాదం లేదు. సాంకేతికంగా చూస్తే వీరందరూ ఫ్రెంచ్ సమాజంలో భాగమే కాబట్టి యిప్పటి ఫ్రెంచ్ సమాజం గతంలోలా కాకుండా మతమౌఢ్యానికి లొంగుతోంది. ఇది సహజంగా అనాదిగా ఫ్రెంచ్ సంస్కృతిని అభిమానించేవారిని బాధిస్తోంది.

మన దేశం రాజరికం వర్ధిల్లినపుడు కూడా రాజులు తమ ఆస్థానాలలో విదూషకులను, వికటకవులను పోషించేవారు. రాజు చేసే తప్పులను వ్యంగ్యంగా ఎత్తిచూపే చనువు, అధికారం వీరికి వుండేవి. వీరి వ్యాఖ్యలతో రాజులు వులిక్కిపడి, తమ తప్పులు దిద్దుకునేవారు. బ్రిటిషువారు రాజ్యం చేసే రోజుల్లో కూడా పత్రికల్లో కార్టూన్లను ఒక హద్దువరకు అనుమతించేవారు. నెహ్రూ ప్రధాని కాగానే ''శంకర్స్ వీక్లీ'' అనే కార్టూన్, వ్యంగ్య పత్రిక నడిపే శంకరన్ పిళ్లయ్‌ను పిలిచి 'నన్ను వదిలిపెట్టవద్దు, అవసరమైతే చీల్చి చెండాడు.' అని కోరాడు. అలాటి ఉదారవాది కూతురు ఇందిరా గాంధీ ఎమర్జన్సీ, సెన్సార్‌షిప్ విధించడంతో దానికి నిరసనగా శంకరన్ తన వీక్లీని మూసివేశాడు. భారతదేశంలోనే యీ పాటి స్వేచ్ఛ వున్నపుడు, ఉదారవాదానికి పుట్టినిల్లయిన ఫ్రాన్సు వాతావరణం కలుషితం కావడం వామపక్ష భావాలున్న వారిని మరీ బాధించింది. వారు నడిపే పత్రికే ''చార్లీ హెబ్డో''. ఇది ఇస్లామ్‌కే కాదు, ఏ మతానికైనా, ఏ వ్యవస్థకైనా, ఏ ఉగ్రవాదానికైనా వ్యతిరేకమే. ఒక్క మాటలో చెప్పాలంటే దేనిలోనైనా అతి కనబడితే అది వదిలిపెట్టదు. ప్రతిఘటిస్తుంది. దానికి అది వుపయోగించే ఆయుధం - వ్యంగ్యం. హిట్లర్ అంటే ప్రపంచమంతా వణికే లేక గౌరవించే రోజుల్లో చార్లీ చాప్లిన్ అతన్ని వెక్కిరిస్తూ ''గ్రేట్ డిక్టేటర్'' తీశాడు. ఇప్పుడు చార్లీ చేస్తున్నదీ అదే. ఇటీవలి కాలంలో మతం అనేది పెద్ద వ్యవస్థగా ఏర్పడి, దాని పేర హింస పెరిగింది కాబట్టి మతంపై ఎక్కువగా దృష్టి పెట్టింది. మతం పేర మీద హింస జరిపేవారిని చూసి భయపడవద్దు, ఫకాలున నవ్వండి, ఆ విధంగా వారిని నిర్వీర్యం చేయండి అన్నదే వారి ఫిలాసఫీ. ఇది మతం పేర జనాలను కూడగట్టేవారిని, అడలగొట్టేవారిని మండిస్తోంది. తమను చూసి హేళనగా నవ్వుతూండే వారిని ఎలా లొంగదీసుకోవడం?

కరక్టుగా చెప్పాలంటే చార్లీ పత్రిక ఇస్లాంకు కాదు, ఇస్లాం పేర మీద నడుస్తున్న టెర్రరిజాన్ని వ్యతిరేకిస్తోంది. వెక్కిరిస్తోంది. ఇటీవలి కాలంలో ఇస్లాం పేర ఉగ్రవాదం పెరిగింది కాబట్టి చార్లీ వెక్కిరింతలూ పెరిగాయి. అంత మాత్రం చేత వాళ్లు మరో మతాన్ని నెత్తిన పెట్టుకున్నారని అనుకోనక్కరలేదు. ''జీసస్ ఆన్ ద క్రాస్'' అని పాప్యులర్ బ్రిటిష్ టీవీ షో వస్తే దాన్ని వెక్కిరిస్తూ 2006లో ఆ పత్రిక శిలువపై వున్న క్రీస్తును ముఖచిత్రంగా వేసి ''నేను సెలబ్రిటీనర్రా, యిక్కణ్నుంచి దింపండి'' అని మొర పెట్టుకుంటున్నట్టు కార్టూన్ వేశారు. 2010లో పోప్ బెనెడిక్ట్ 16 బొమ్మ ముఖచిత్రంగా వేసి, ఆయన చేతిలో కాండోమ్ పెట్టారు. 2011లో మహమ్మద్ ప్రవక్త బొమ్మ వేసి ''నవ్వకపోతే 100 కొరడా దెబ్బలు'' అని బెదిరిస్తున్నట్లు రాశారు. ఈ సంచిక వెలువడ్డాక ఆ పత్రిక ఆఫీసులపై బాంబులు పడ్డాయి. రాజకీయ నాయకులు, పత్రికాధిపతులు అనేకమంది 'ముస్లిములతో ఎందుకు వచ్చిన గొడవ, వూరుకోవాల్సింది' అని సలహా యిచ్చారు. ఫ్రాన్సులో, అమెరికాలో వున్న మతాధికారులు హెచ్చరించారు కూడా. మేమనుకున్నది మేం చెప్పకూడదా? అని అడిగితే 'మీకా స్వేచ్ఛ వుంది.. అయినా లేనిపోని తంటాలు ఎందుకు తెచ్చుకోవడం అని మా సలహా' అని మాటలు నాన్చారు. 'మేం అలా అనుకోవడం లేదు. హాస్యానికి, వ్యంగ్యానికి ప్రయోజనం వుంది. టెర్రరిస్టులంటే ప్రజలు భయపడడం మానేసినప్పుడే వారు నిర్వీర్యం అవుతారు. మీరు వారిని చంపడానికి సైన్యాన్ని పంపుతున్నారు. మేం హాస్యంతో వారి యిమేజిని దెబ్బ తీస్తున్నాం' అని వాదించింది చార్లీ. ఇస్లాం పేర మీద జరుగుతున్న ఉగ్రవాదాన్ని మహమ్మద్ ప్రవక్త కూడా నిరసిస్తున్నాడన్న అర్థంలో కార్టూన్ వేశారు. ప్రవక్త చుట్టూ అతని నేటి అనుచరులు వుంటారు. వీళ్లను ఏం చేయాలో తెలియక ఆయన తల పట్టుకుని 'ఇలాటి మూరు?ల చేత ప్రేమింపబడడం మహ కష్టం సుమా' అంటూంటాడు. అలాగే యీ జిహాదీలు మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలకు వ్యతిరేకంగా నడుచుకుంటూ ఆయన్నే దెబ్బ తీస్తున్నారన్న అర్థంలో ఐయస్ వాళ్లు ప్రవక్త తల ఎగరేస్తున్నట్లు కార్టూన్లు వేశారు. ఇక యీ పత్రికను ఏదో ఒకటి చేయకపోతే తమను అందరూ బఫూన్లుగా చూస్తారన్న భయం పట్టుకుంది ఐయస్‌కు. తక్కినవారిని భయపెట్టాలంటే ముందు యీ విదూషకుడి పని పట్టాలి. అందుకే ఘోరంగా చంపివేశారు. ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)

**జనవరి 13-15 వీక్లీకై**

## ఎమ్బీయస్ : స్పైస్ జెట్‌ని మారన్ రక్షిస్తాడా ?

ఈ రోజుల్లో ఎయిర్‌లైన్సు వ్యాపారమే నష్టదాయకంగా వుంది. 'జెట్' ఎయిర్‌లైన్సు ప్రమోటర్, 51% వాటాదారు, చైర్మన్ అయిన నరేష్ గోయల్ తన వాటాను పంజాబ్ నేషనల్ బ్యాంకుకు రూ.2000 కోట్లకు తనఖా పెట్టాడు. కింగ్‌ఫిషర్ సంగతి చెప్పనే అక్కరలేదు. స్పైస్‌జెట్ కూడా అంతే. ప్రజాధనం వెచ్చించి ప్రభుత్వం ఆదుకోవాలని వాళ్లు అడుగుతున్నారు. అంత చేటుగా డిస్కౌంట్లు యివ్వనేల? యిప్పుడీ ఆర్తనాదాలేల? కిట్టుబాటుకాని చౌకధరలు ప్రకటిస్తూన్నపుడు ఋణదాతలు అభ్యంతరం తెలిపి వుంటే యీ పరిస్థితి వచ్చేది కాదేమో! స్పైస్ జెట్ ఎయిర్‌లైన్సు విషయానికి వస్తే అది ఆర్థికపరమైన కష్టాల్లో యీదుతోంది. బ్యాంకులు, ఆయిల్ కంపెనీలు, ఎయిర్‌పోర్టు ఆపరేటర్లు యికపై అప్పులు, అరువులు యివ్వమనడంతో ఫ్లయిట్లు కాన్సిల్ చేయకతప్పని పరిస్థితి వచ్చింది. 57 విమానాలతో 230 షెడ్యూల్డ్ రూట్లలో నడుపుతూ వస్తున్న స్పైస్‌జెట్ నవంబరు మధ్య నుండి సుమారు 2000 ఫ్లయిట్లు కాన్సిల్ చేసింది. దాంతో ప్రయాణీకులకు ఆ ఎయిర్‌లైన్సుపై నమ్మకం పోయింది. ఆ కంపెనీ అధినేత కళానిధి మారన్ దాన్ని కష్టాల్లోంచి బయట పడేస్తాడా లేదా అన్నదే ఎవరికీ తెలియటం లేదు. అజయ్ సింగ్ అనే అతను స్థాపించి, చైర్మన్‌గా వున్న కంపెనీలో అది ఆర్జిస్తున్న లాభాలు చూసి 2010లో మారన్ సన్ గ్రూపు ద్వారా రూ. 940 కోట్లు పెట్టుబడి పెట్టాడు. 2011 మార్చి నాటికి రూ.101 కోట్లు లాభంలో వున్న కంపెనీ మారన్ రూ. 800 కోట్లు ఖర్చు పెట్టి అనవసరంగా విస్తరించడంతో ఏడాది తిరిగేసరికి రూ.606 కోట్లు నష్టం మూటగట్టుకుంది. అయినా 2012లో అతను 27 బంబార్డియర్ క్యూ-400 ఎయిర్‌క్రాఫ్టులు కొని, వీటితో చిన్న పట్టణాలకు కూడా సర్వీసులు విస్తరిస్తాం అని చెప్పుకున్నాడు. తక్కువ రేట్లతో నడిపే ఎయిర్‌లైన్సు పరిమితమైన రూట్లలో ఎక్కువ సర్వీసులు నడిపితేనే కిట్టుబాటు అవుతుంది. రూట్లు పెంచుకుంటే వాటికి సరిపోయినంత డిమాండ్ లేక కొన్ని సీట్లు ఖాళీగా వుండిపోతాయి. మారన్ దూకుడు వలన 2014 మార్చి నాటికి కంపెనీ రూ.1003 కోట్ల నష్టానికి చేరుకుంది. స్వదేశీ, విదేశీ ఋణదాతలకు రూ. 2000 కోట్లు బాకీ వుంది. బ్యాంకులకు, ఆయిల్ కంపెనీలకు, ఎయిర్‌పోర్టు ఆపరేటర్లకు కలిపి రూ.1700 కోట్లు బాకీ పడింది. వడ్డీ రేట్లు తక్కువగానే వున్నా కంపెనీ వడ్డీ కూడా కట్టలేని పరిస్థితికి వచ్చింది.

భారతదేశంలో అత్యంత ధనికుల జాబితాలో 38 వ పేరు కళానిధి మారన్‌ది. అతని పేరు మీదే రూ.14500 కోట్ల ఆస్తి వుంది. అతని సన్ టివికి టీవీ మార్కెట్లో 69% వాటా వుంది. అదే గ్రూపుకి చెందిన జెమిని (తెలుగు) టివికి 44%, ఉదయ (కన్నడ)కు 40% వాటా వుంది. సన్ టివి విలువ రూ.10000 కోట్లు వుంటుంది. మారన్, అతని భార్య కావేరీ జీతాల రూపేణా 2013-14లో రూ. 60 కోట్లు ఆర్జించారు. ఇంత డబ్బున్నవాడు తన కంపెనీని మునిగిపోనిస్తాడా అని కొందరనుకుంటున్నారు కానీ అతని వరస చూస్తే పట్టించుకునేట్లు లేదు. 2014 ఆగస్టు నుండి యితరులను పెట్టుబడి పెట్టమని అడుగుతున్నాడు. రాకేశ్ ఝున్‌ఝున్‌వాలాకు 1.6% వాటాను రూ.13.41 కోట్లకు అమ్మచూపాడు. రాకేశ్ రూ. 11 కోట్లు యిచ్చి సరిపెట్టాడు. ఎందుకంటే స్పైస్‌జెట్ మార్కెట్ కాపిటలైజేషన్ 2008లో రూ.2500 కోట్లు వుండగా 2014 నవంబరు నాటికి అది రూ.710 కోట్లకు పడిపోయింది. క్రికెట్ టీముల విషయంలో మారన్ ఘోరంగా నష్టపోయాడు. సిబిఐ చీఫ్ పదవి నుండి రంజిత్ సిన్హా తప్పుకున్నాడు కాబట్టి, యుపిఏ ప్రభుత్వం అధికారంలో లేదు కాబట్టి ఎయిర్‌సెల్-మాక్సిల్ కేసుల్లో కళానిధి, దయానిధి జైలుకి వెళ్లే ప్రమాదం వుందన్న భయంతో ఫైనాన్షియర్లు ఋణం యివ్వడానికి ముందుకు రావడం లేదు. అందుచేత యీ కంపెనీని ఆదుకోవడం ప్రభుత్వబాధ్యత అంటున్నాడు మారన్. తన డబ్బు తీసేలా కనబడటం లేదు. ఈ మొర విని, సివిల్ ఏవియేషన్ మంత్రి అశోక్ గజపతి రాజు మారన్ నుండి హామీ తీసుకుని స్పైస్ జెట్‌కు రూ. 600 కోట్ల వర్కింగ్ కాపిటల్ లోన్లు యివ్వమని డిసెంబరు 16 న పబ్లిక్ సెక్టార్ బ్యాంకులను కోరాడు. దాంతో బాటు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలను 15 రోజుల అరువు యిమ్మన్నాడు. ఎయిర్‌లైన్సు వాళ్లు ముందే బుకింగ్‌లు చేసేస్తూ డబ్బు తక్షణం కట్టించేసుకుంటారు కదా. స్పైస్‌జెట్ అలా 30 రోజులకు మించి ఫ్యూచర్ బుకింగ్స్ చేయకూడదని డిసెంబరు 5 న డిసిజిఏ ఆర్డర్ పాస్ చేసింది. అయితే అశోక్ గజపతి రాజు మార్చి 2015 వరకు బుకింగ్స్ చేసుకోవచ్చని వెసులుబాటు యిచ్చారు. ఇవన్నీ ఫలించకపోతే మారన్‌ను తప్పించి యిప్పటికీ 4.5% వాటా కలిగివున్న అజయ్ సింగ్‌ను మళ్లీ చైర్మన్‌గా తీసుకుని వచ్చి బాధ్యతలు అప్పగించవచ్చు అని వార్తలు వస్తున్నాయి. **- ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ : ఇప్పుడు అకాలీదళ్ వంతు..

సాధారణంగా ఒకే భావజాలం గల పార్టీలు కూటమిగా ఏర్పడి, తమను వ్యతిరేకించేవారితో పోరాడుతూ వుంటాయి. ఇప్పటిదాకా బిజెపికి నాయకత్వం వహించినవారు శివసేన, అకాలీదళ్ వంటి మతరాజకీయాలు చేసేవారితో చేతులు కలిపి రాజకీయాలు సాగిస్తూ వచ్చారు. ప్రస్తుత నాయకత్వం స్ట్రాటజీ మార్చింది. మతరాజకీయాలను అభిమానించేవారి ఏకైక పార్టీగా ఎదగడానికై భాగస్వాముల ప్రాధాన్యత తగ్గించి వారి స్పేస్ ఆక్రమిస్తోంది. మహారాష్ట్ర ఎసెంబ్లీ ఎన్నికలు జరిగేదాకా కూటమిలో శివసేన ప్రధాన పార్టీ, బిజెపి తోక పార్టీ. పొత్తు తెంపేసి, బిజెపి పరిస్థితి తారుమారు చేసింది. పంజాబ్‌లో 2017లో ఎసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. అక్కడ తన చిరకాల భాగస్వామి అకాలీదళ్‌పై యిలాటి చిట్కాయే వేస్తోంది బిజెపి. పంజాబ్ ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి

అకాలీదళ్‌కు చెందిన తండ్రీ కొడుకులు ప్రకాశ్ సింగ్ బాదల్, సుఖ్‌బీర్ సింగ్ బాదల్. సుఖ్‌బీర్ బావమరిది విక్రమ్ సింగ్ మంజీతియా రెవెన్యూ మంత్రి. సుఖ్‌బీర్ భార్య హర్‌సిమ్రత్ కౌర్‌ను కేంద్ర కాబినెట్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యిండస్ట్రీస్‌కు మంత్రిగా తీసుకున్నా వారి కుటుంబానికే ఎసరు పెట్టడానికి నిశ్చయించుకుంది బిజెపి. దానికి వారు ఎంచుకున్న లక్ష్యం – విక్రమ్ సింగ్. దానికి కారణం వుంది. మోదీకి అత్యంత సన్నిహితుడైన అరుణ్ జైట్లీని బిజెపి అమృత్‌సర్ నుండి నిలబెట్టి అతన్ని గెలిపించే బాధ్యతను నవజ్యోత్ సింగ్ సిద్ధూకు అప్పగించింది. తనకు టిక్కెట్టు రాలేదన్న అలకతో వున్న సిద్ధూ ప్రచారం చేయననడంతో అకాలీదళ్‌కు చెందిన విక్రమ్ సింగ్‌కు జైట్లీని గెలిపించే బాధ్యత అప్పగించారు. అంతిమంగా జైట్లీ ఓడిపోవడంతో విక్రమ్‌పై బిజెపి కినుక వహించింది. నిజానికి విక్రమ్ చాలా హడావుడి చేశాడు. శిఖ్కుల పవిత్రగ్రంథమైన గ్రంథసాహెబ్‌లోని కీర్తనలు తీసుకుని వాటిలో గురు గోబింద్ సింగ్ పేరుకు బదులు అరుణ్ జైట్లీ పేరు పెట్టి, ప్యారడీలు తయారు చేయించి ప్రచారంలో వాడాడు. ఇది అకాల్ తఖ్త్ వాళ్లకు కోపం తెప్పించింది. విక్రమ్‌ను క్షమాపణ చెప్పమంది. అతను చెప్పాడు. కానీ యీ ఓవరాక్షన్ వలన శిఖ్కుల ఓట్లు పడలేదు కాబోలు జైట్లీ ఓడిపోయాడు.

విక్రమ్‌కు, అతనితో బాటు అతని బంధుగణానికి, అనగా అకాలీదళ్ అగ్రనాయకత్వానికి బుద్ధి చెప్పడానికి బిజెపికి అనువుగా 2013 మార్చి నాటి డ్రగ్ స్మగ్లింగ్ కేసు దొరికింది. ఔషధాల తయారీలో ఉపయోగించే కెటామైన్, ఎఫిడ్రిన్‌లను హిమాచల్ ప్రదేశ్‌లోని ఫార్మా యూనిట్ల ద్వారా సేకరించిన స్మగ్లర్లు వాటిని కెనడాకు దొంగతనంగా పంపిస్తే చైనా, వియత్నాం నిపుణులు వాటితో సింథటిక్ మాదకద్రవ్యాలు తయారుచేసి యిస్తున్నారు. వాటిని దొంగతనంగా పంజాబ్‌కు తెచ్చి అమ్ముతున్నారు. ఈ రూ.6000 కోట్ల కేసులో అనూప్ సింగ్ కెహ్లాన్ అనే ఎన్నారై అరెస్టయ్యాడు. అతని ద్వారా జగదీశ్ సింగ్ భోలా అనే డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు కూడా అరెస్టయ్యాడు. విచారణలో భోలా తమకు హిమాచల్ ప్రదేశ్ నుండి ముడిసరుకులు తెప్పించి పెడుతున్నదీ, కెనడా స్మగ్లర్లకు బులెట్ ప్రూఫ్ కార్లు యిచ్చి రక్షణ కల్పిస్తున్నదీ విక్రమే అని చెప్పాడు. అతనితో బాటు బంజాబ్ జైళ్ల మంత్రి స్వరణ్ సింగ్ ఫిల్లౌర్ కుమారుడు ధర్మవీర్ సింగ్ కూడా వున్నాడన్నాడు. "విక్రమ్‌కు 2009లో పెళ్లయినపుడు మేమంతా హాజరయ్యాం కూడా" అన్నాడతను. యుపిఏకు, అకాలీదళ్‌కు ఏ బేరసారాలు కుదిరాయో కానీ యీ కేసు ఏడాదిన్నర దాటినా ముందుకు సాగలేదు. డిసెంబరు రెండో వారంలో బిజెపి సర్కారు దీన్ని పైకి తీసి దుమ్ముదులుపుతోందని తెలిసిన విక్రమ్ సోదరి, కేంద్రమంత్రి అయిన హర్‌సిమ్రత్ భర్తకు ఫోన్ చేసి విషయం చెప్పింది. అతనికీ ఏం చేయాలో తెలియలేదు.

అంతకుముందే మోదీ ఆకాశవాణిలో నిర్వహించే "మన్‌కీ బాత్" కార్యక్రమంలో డిసెంబరు 14 కార్యక్రమంలో పంజాబ్‌లో సాగుతున్న మాదకద్రవ్యాల వ్యాపారం గురించి ఎవరో ప్రశ్న అడిగారు. దాన్ని అణచివేస్తామని మోదీ జవాబిచ్చారు. దానికి తగ్గట్టుగా అమిత్ షా బిజెపి తరఫున మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాన్ని అమృత్‌సర్‌లో జనవరి 12న ప్రారంభిస్తామని ప్రకటించారు. తర్వాత 22కు వాయిదా వేశారు. పాపం రాహుల్ గాంధీ 2014 అక్టోబరులోనే యీ అంశం లేవనెత్తి పంజాబ్ యువతలో 70% మంది డ్రగ్స్‌కు బానిసలవుతున్నారని, కాంగ్రెసు స్టూడెంట్స్ యూనియన్ ఎన్‌ఎస్‌యుఐ దీనిపై ఉద్యమించాలని పిలుపు నిచ్చాడు. అప్పుడింత ప్రచారం రాలేదు. ఇప్పుడు బిజెపి 'కాంగ్రెస్ ముక్త్ భారత్' తరహాలో 'నశా ముక్త్ పంజాబ్ జాగరణ్ యాత్ర' పేరుతో ఉద్యమం మొదలుపెట్టి దానిలో అకాలీ దళ్‌కు పాత్ర యివ్వనంటోంది. డిసెంబరు 26న విక్రమ్ సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేటు వారు పిలిచి మనీలాండరింగ్ కేసులో నాలుగున్నర గంటల పాటు విచారణ జరిపారు! వెంటనే రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, యితర బిజెపి నాయకులు మంత్రివర్గం నుండి విక్రమ్‌ను తొలగించాలని డిమాండ్లు మొదలుపెట్టారు.

ఇదంతా తమను బలహీన పరచడానికే అని అకాలీదళ్ అనుకుంటోంది. ఇప్పటివరకు గ్రామీణప్రాంతాల్లో అకాలీదళ్, నగరప్రాంతాల్లో బిజెపి బలంగా వుండేవి. వారి పొత్తువలన యిబ్బంది వచ్చేది కాదు. ఇప్పుడు అమిత్ షా గ్రామీణప్రాంతాల్లో బిజెపి సభ్యత్వం పెంచాలని ఆదేశించడంతో 2 లక్షల మంది గ్రామీణులు బిజెపిలో చేరారట. ఇప్పుడు మాదకద్రవ్యాల పేరు చెప్పి తమ ప్రతిష్ట దెబ్బ తీయడానికే బిజెపి పన్నాగం పన్నుతోందన్న అనుమానంతో అకాలీ దళ్ బిజెపి కార్యక్రమాని కంటె ముందుగా జనవరి 5 న అదే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే అది అమృత్‌సర్‌లో కాదు, పాకిస్తాన్‌తో సరిహద్దులున్న గ్రామాలలో చేపట్టింది. 'ఈ డ్రగ్స్ పాకిస్తాన్ నుండి సరఫరా అవుతున్నాయి. స్థానిక నాయకులకు సంబంధం లేదు. ఇది విదేశాలతో ముడిపడిన అంశం కాబట్టి దీన్ని నివారించవలసిన బాధ్యత కేంద్రసర్కారు అనగా బిజెపిదే..' అని వారి థీమ్. అంతర్జాతీయ సరిహద్దుల్లో యిలాటి కార్యక్రమం నిర్వహించడానికి బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ వారు అభ్యంతర పెడితే కేంద్ర హోం శాఖ ఆ విషయాన్ని పంజాబ్ ప్రభుత్వానికి తెలిపింది. వారు ముందులో అనుకున్న ప్రాంతాలు మార్చి సరిహద్దులకు కొన్ని చోట్ల 3 కి.మీ.ల లోపలగా, మరి కొన్ని చోట్ల 13 కి.మీ. లోపల జరిపింది. ఆ సందర్భంగా అకాలీదళ్ అధ్యక్షుడు కూడా అయిన సుఖ్‌బీర్ యీ డ్రగ్స్ అన్నీ బిజెపి పాలిత రాజస్థాన్, మధ్యప్రదేశ్‌ల నుండి దొంగతనంగా సరఫరా అవుతున్నాయని ఆరోపించాడు. అంతేకాదు, పంజాబ్‌లోకి అఫ్గనిస్తాన్, పాకిస్తాన్, రాజస్థాన్‌ల నుండి వచ్చిపడుతున్న మాదకద్రవ్యాలకు బానిసలు కాకండి అని పంజాబీ యువతను హెచ్చరిస్తూ ప్రభుత్వం తరఫున యాడ్ కాంపెయిన్ కూడా మొదలుపెట్టాడు. జనవరి 22న అమిత్ షా వచ్చాక కథ మరింత రసకందాయకంలో పడవచ్చు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ ః మంత్రుల ప్రోగ్రెస్ రిపోర్టు

మంత్రులు పాఠశాలలను సందర్శించడానికి వచ్చినపుడు పరీక్షల్లో పిల్లలకు వస్తున్న మార్కులు తెలుసుకుని, పాఠాలు సరిగ్గా చెప్పటం లేదని ఉపాధ్యాయులను నిలదీయడం కద్దు. మరి మంత్రులే ప్రోగ్రెస్ రిపోర్టులు సబ్మిట్ చేయవలసి వస్తే...? అదీ మీడియా ముందు!? బిజెపి పార్టీ ఉపాధ్యక్షుడు, మధ్యప్రదేశ్ వ్యవహారాల యిన్‌చార్జ్ అయిన వినయ్ సహస్రబుద్ధేకు పుట్టిన బుద్ధి యిది. 'మంత్రులు సాధారణంగా ప్రెస్‌తో సమావేశాలు పెట్టటం లేదు. తాము అనుకున్నది చెప్పడానికి నలుగురైదుగురు టీవీ కెమెరామన్లను పిలిచి ఏదో చెప్పేసి వెళ్లిపోతున్నారు. ప్రెస్ వాళ్లు ప్రశ్నలడిగితే జవాబులు దాటవేస్తున్నారు. అందుకని ప్రతీ మంత్రి మీడియాను పిలిచి, గత ఏడాదిలో తమ శాఖ ద్వారా ఏయే పనులు జరిగాయో వివరించి, విలేకరులడిగిన ప్రశ్నలకు సమాధానాలు యివ్వాలని మీరు చెప్పండి.' అని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ చౌహాన్‌కు చెప్పాడు. ఆయన మంత్రులను పిలిచి చెప్పాడు. ఇక డిసెంబరు 13 నుండి ఒకరి తర్వాత ఒకరు చొప్పున మంత్రులకు మూడింది. నరోత్తమ్ మిశ్రా అనే ఆరోగ్యమంత్రి గత పదేళ్లగా మంత్రిగా వున్నా యిలా న్యూస్ కాన్ఫరెన్సు పెట్టడం యిదే మొదటిసారి. ఇక చూసుకోండి, డెంగ్యూ జ్వరాలపై, మందుల సరఫరాపై, ఆరోగ్యశాఖ అధికారులపై వున్న అవినీతి ఆరోపణలపై, స్టెరిలైజేషన్ క్యాంప్‌ల్లో అవకతవకలపై, ప్రభుత్వాఫీసుల్లో సౌకర్యాల లేమిపై.. యిలా ప్రశ్నలు వర్షించాయి. ఇక తట్టుకోలేక మిశ్రా ''మీరు పేపర్లో చదువుతున్నవన్నీ శుద్ధ అబద్ధాలు'' అనేసి లేచ్చక్కాపోయాడు. అటవీశాఖా మంత్రి గౌరీశంకర్ షెజ్వార్‌ను 'మన రాష్ట్రంలో పులుల సంఖ్య తగ్గిపోతోంది. 'టైగర్ స్టేట్'గా మనకున్న గుర్తింపు పోయేట్టుంది. మీరేం చేయబోతున్నారు?' అని అడిగితే అతనికి ఒళ్లు మండి ''మా గుర్తింపు పోకుండా వుండాలంటే మీరెంతమంది వున్నారో మేం లెక్కపెట్టాలి, మీరంతా క్యూ కట్టి వరసలో నిలబడండి – అని పులులకు చెప్పలేం కదా' అన్నాడు.

వ్యవసాయశాఖ మంత్రి గౌరీశంకర్ బిసేన్‌ను 'రాష్ట్రంలో యూరియా దొరకక అవస్థ పడుతున్నారు. మీరేం చేయబోతున్నారు?' అని అడిగితే అతను కాస్సేపు ఆలోచించి 'మార్చి నాటికల్లా అందరికీ యూరియా అందేట్లు చేస్తాం' అన్నాడు. మార్చి నాటికి పంట ఎదిగి కోతల సీజను వస్తుందని, అప్పుడు యూరియాతో పని వుండదని తెలియని మంత్రి తన కోతలతో బయటపడిపోయాడు. అవినీతి ఆరోపణలున్న 120 మంది అధికారులపై కేసులు పెట్టలేదేం? అని సాధారణ పరిపాలనా మంత్రి లాల్ సింగ్ ఆర్యాను అడిగితే న్యాయశాఖ నుండి అనుమతి రాలేదన్నాడు. న్యాయశాఖ మంత్రిణి కుసుమ్ మెహ్‌దలే సమావేశం పెట్టినపుడు మీడియా నిలదీసింది. 'అలాటి కేసు మా దగ్గర ఒక్కటి కూడా పెండింగులో లేదు' అందామె. మరి ఎవరు అబద్ధం చెప్తున్నట్లు? అని సందేహం వస్తుంది కదా. ప్రెస్‌ను ఎదుర్కోవడానికి 20 మంది అధికారుల సైన్యంతో వచ్చింది కాబట్టి కుసుమ్ మాటే కరక్టయి వుండాలి. రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధరా రాజే చెల్లెలు, మధ్యప్రదేశ్‌కు పరిశ్రమల మంత్రిణి అయిన యశోధరా రాజే ప్రెస్‌తో అక్షరాలా తలపడింది. వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పకపోగా వాళ్లకు ఎదురుప్రశ్నలు వేయసాగింది. దాంతో విలేకరులు ఆమె సమావేశాన్ని బహిష్కరించారు. చివరకు పబ్లిక్ రిలేషన్స్ కమిషనర్ ఎస్.కె.మిశ్రా పూనుకుని, సర్దిచెప్పి సమావేశాన్ని పునరుద్ధరించాడు. ఈ సమావేశాల కసరత్తు పూర్తయేసరికి మంత్రులందరూ సామూహికంగా నిట్టూర్చారు. 'మా పరువు తీయడానికే యిదంతా. ఇన్నేళ్లగా ప్రజాజీవితంలో వున్నాం, ఎప్పుడూ యిలాటి అనుభవాలు ఎదురు కాలేదు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేద్దామని అనుకుంటున్నారు. మాలో కొందర్ని పీకేయడానికి ముందు యీ నాటకం నడిపించారు. ఇప్పుడు మమ్మల్ని తీసేసినా ప్రజలు సరైన శిక్షే పడింది అనుకుంటారు తప్ప అయ్యో పాపం అనుకోరు.' అని వాపోయారు.

మంత్రివర్గంలో మార్పుల మాట ఎలా వున్నా ప్రతిపక్షంలో వున్న కాంగ్రెసుకు యిదంతా కనులవిందుగా, వీనులవిందుగా వుంది. 'వాళ్లేమీ సాధించలేదని వాళ్లే చెప్పుకున్నారు. మేము చెప్తూ వుంటే యిప్పటిదాకా కొట్టిపారేశారు. ఇప్పుడేమైంది?' అని ఎద్దేవా చేస్తున్నారు. నిజానికి ప్రజల ప్రశ్నలను ఎదుర్కోవడం నాయకులకు చాలా కష్టమైన పని. రాజీవ్ హయాంలో దూర్‌దర్శన్‌లో వారానికి ఒక మంత్రి వచ్చి ప్రజా దర్బార్‌లో సమాధానాలు చెప్పవలసి వచ్చేది. చివరిలో ప్రధాని వస్తారన్నారు. కొన్ని వారాలు గడిచేసరికి మంత్రులకు ముచ్చెమటలు పట్టాయి. ఆ షోకు హాజరు కామని మొండికేశారు. వరస చూసేసరికి రాజీవ్‌కూ భయం వేసినట్లుంది. అర్థాంతరంగా ఆ కార్యక్రమం ఆగిపోయింది. మామూలు ప్రజలతోనే అంత తంటా వుంటే యిక కాకలు తీరిన మీడియాతో వేగడం మాటలా? అందుకే యీ మధ్యప్రదేశ్ ప్రయోగం తక్కిన బిజెపి పాలిత రాష్ట్రాలలో రిపీట్ అవుతుందో లేదో సందేహమే. బిజెపి మంత్రులిలా ప్రోగ్రెస్ రిపోర్టంటే భయపడుతున్నారు కానీ బిజెపి గవర్నరు రామ్ నాయక్ మాత్రం ఎవరు అడక్కపోయినా ప్రోగ్రెస్ రిపోర్టు వేయించి పంచిపెడుతున్నాడు. 80 ఏళ్ల యీ మహారాష్ట్ర రాజకీయవేత్త వాజపేయి ప్రభుత్వంలో కేంద్ర పెట్రోలియం మంత్రిగా పనిచేశాడు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చాక జులై 2014లో అతన్ని యుపి గవర్నరుగా వేశారు. వచ్చిన దగ్గర్నుంచి రాష్ట్ర పరిపాలనలో, రాజకీయాల్లో తల దూరుస్తున్నాడు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి బాగాలేదని ముఖ్యమంత్రికి లేఖలు రాశాడు. విద్యుత్ కొరత వుందని రాశాడు. లోకాయుక్త యిచ్చిన నివేదికలపై చర్యలు తీసుకోలేదేం అని రాశాడు. ఇలా రాసి రంపాన పెడుతూనే ఉత్తర ప్రదేశ్ మైనారిటీ కమిషన్ ఛైర్మన్‌కు రాష్ట్ర కాబినెట్ ర్యాంకు కల్పిస్తూ ఆర్డినెన్సు జారీ చేస్తే దానిపై సంతకం పెట్టలేదు. ''కేంద్రప్రభుత్వం కేంద్ర మైనారిటీ కమిషన్ ఛైర్మన్‌కు కేంద్ర కాబినెట్ పదవి యివ్వనపుడు మీరెందుకు యిస్తున్నారు?'' అని ప్రశ్నలు గుప్పించాడు.

అంతటితో ఆగలేదు. ఫైజాబాద్‌లో అవధ్ యూనివర్శిటీలో మాట్లాడుతూ ''రామమందిరం సాధ్యమైన త్వరలో కట్టాలి.'' అని ఉపన్యసించాడు. పైగా ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్‌ను రాజ్‌భవన్‌కు డిన్నర్‌కు పిలిచాడు. గవర్నరు తన హోదాకు తగినట్టుగా ప్రవర్తించటం లేదని, కాషాయీకరణ చేస్తున్నాడని, రామమందిరం వంటి అంశాలను లేవనెత్తి మతకలహాలను ఎగదోస్తున్నాడని సమాజ్‌వాదీ పార్టీ ఆందోళన చేస్తోంది. ''రాజకీయ నాయకులను పిలిచినట్లుగానే మోహన్ భగవత్‌నూ పిలిచాను. పైగా అతను నా స్నేహితుడు.'' అన్నాడు గవర్నరు గారు. కాంగ్రెసుకు కూడా యితని వరస నచ్చటం లేదు. గవర్నరుగా తొలగించమని దేశాధ్యక్షుడిని కోరింది. ఈ గొడవలు యిలా నడుస్తూండగానే తను గవర్నరుగా వచ్చి 90 రోజులు పూర్తయిన సందర్భం పురస్కరించుకుని ''రాజ్‌భవన్ మేఁ రామ్ నాయక్'' అనే 45 పేజీల పుస్తకం వెలువరించాడు. అతని సభలు, సమావేశాల గురించి పత్రికల్లో వచ్చిన వార్తలతో, సెమినార్లలో, ఫంక్షన్‌లలో అతనిచ్చిన ఉపన్యాసాలతో అతని కూతురు విశాఖా కులకర్ణి దాన్ని సంకలీకరించింది. ఇది ఎబ్బెట్టుగా లేదా? అంటే 'ఇది నాకు అలవాటే. నేను ప్రజాజీవితంలో వచ్చిన దగ్గర్నుంచి యిలాటి ప్రోగ్రెస్ రిపోర్టులు ప్రచురిస్తున్నాను. ''లోకసభలో రామ్ నాయక్'', ''లోక్ సేవక్ రామ్ నాయక్'' లాటి పేర్లు పెట్టి పుస్తకాలు వేస్తూ వచ్చాను. ఇదీ ఆ కోవకు చెందినదే'' అని జవాబిచ్చాడు రామ్ నాయక్. ఎంతైనా బొత్తిగా 90 రోజులకే రిపోర్టా!? **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 16-17 వీక్లీకై** **ఎమ్బీయస్ : గాంధీ పునరాగమనానికి 100 ఏళ్లు**

1915 జనవరి 9 న గాంధీ దక్షిణాఫ్రికా నుండి భారత్‌కు తిరిగి వచ్చారు. సరిగ్గా నూరేళ్లయిన సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 'ప్రవాస్ భారత్ దివస్' నిర్వహించింది. గాంధీ గుజరాత్‌లోని రాజకోట్ బారిస్టరుగా ప్రాక్టీసు చేస్తూ, ఒక క్లయింటుకోసం దక్షిణాఫ్రికా వెళ్లాడు. అక్కడ సాగుతున్న వర్ణవివక్షతకు వ్యతిరేకంగా అహింసామార్గంలో ఉద్యమించి విజయం సాధించాడు. అది భారత దేశపు స్వాతంత్ర్యపోరాటయోధులను ఆకట్టుకుంది. గోపాల కృష్ణ గోఖలే 1912లో దక్షిణాఫ్రికాకు వెళ్లినపుడు గాంధీని భారత్‌కు తిరిగివచ్చి స్వాతంత్ర్యయుద్ధంలో పాలు పంచుకోమని కోరారు. ఆయన మాట మన్నించి 1915లో గాంధీ తిరిగి వచ్చాడు. దక్షిణాఫ్రికాలో ఓడ ఎక్కి బొంబాయిలోని అపోలో బందర్‌లో దిగాడు. అప్పట్లో ఆ రేవులో రాజులు, బ్రిటిషువారు తప్ప సామాన్యులకు దిగే హక్కు లేదు. గాంధీ ఖ్యాతి విన్న ఫిరోజ్ షా మెహతా, బి.జి.హార్నిమాన్ వంటి నగరపెద్దలు అధికారులకు చెప్పి ఆ ఏర్పాటు చేయడమే కాక, గాంధీని రిసీవ్ చేసుకోవడానికి స్వయంగా వచ్చారు. సౌరాష్ట్రలోని కథియవాడ్ ప్రాంతానికి చెందిన గాంధీ ఆ ప్రాంతపు సంప్రదాయ దుస్తుల్లో ఓడ దిగాడు – వెంట భార్య, నలుగులు కొడుకులు. ఆ తర్వాత బొంబాయిలో జరిగిన సన్మానసభల్లో గాంధీ పదేపదే చెప్పేవాడు – ''దక్షిణాఫ్రికాలో నేను సాధించిన విజయాల గురించే భారతీయులకు తెలుసు. అనేకానేక వైఫల్యాల గురించి వారికి ఐడియా లేదు. ఇప్పుడు తిరిగి వచ్చాను కాబట్టి నాలోని లోపాలను వారు చూడగలుగుతారు. అది ముందే వూహించి వినమ్రంగా ప్రార్థిస్తున్నాను – 'నేను మాతృదేశసేవకై వచ్చిన సేవకుణ్ని. నేను చేయబోయే పొరపాట్లను మన్నించండి.'' గోఖలే గాంధీకి గురుతుల్యుడు. ''నీకు దేశం గురించి ఏమీ తెలియదు. వస్తూనే పోరాటంలోకి దిగవద్దు. ఒక ఏడాది పాటు ప్రొబేషన్ పీరియడ్ అనుకో. దేశమంతా తిరుగు. ప్రజలను, వారి బాధలను అర్థం చేసుకో. ప్రయాణపు ఖర్చులు నేను భరిస్తాను.'' అన్నాడు.

ఆయన సలహా మేరకు భారతయాత్ర ప్రారంభించేముందు గాంధీ పూనా వెళ్లి టిళక్‌ను, గోఖలేను కలిసి ఆశీర్వాదం కోరాడు. గోఖలే తను నడుపుతున్న సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసయిటీలో సభ్యత్వం తీసుకోమన్నాడు. సరే అని గాంధీ అప్లికేషన్ పెట్టుకున్నాడు. కార్యవర్గ సమావేశం కొద్ది రోజుల్లో వుంది, అప్పుడు నీ అప్లికేషన్‌పై నిర్ణయం తీసుకుంటారు అన్నారు. ఈలోగా తన సభ్యత్వం ప్రొబేషన్‌లో వున్నట్టుగా భావించిన గాంధీ తనున్న కాలనీలో లెట్రిన్లు శుభ్రపరచడం మొదలుపెట్టాడు. ఈ పని సభ్యుల్లో కొంతమందికి నచ్చలేదు. గాంధీకి వెంటనే సభ్యత్వం యివ్వకూడదని వాదించారు. గోఖలే ఏమీ చేయలేకపోయాడు. ''నీ ఆదర్శాలతో ఆశ్రమం మొదలుపెట్టుకో. మా సొసైటీ ఒప్పుకోకపోయినా నేను జేబులోంచి దానికి డబ్బిస్తాను. ఈ భారతయాత్రకు మాత్రం సొసైటీ ద్వారా పెట్టిస్తాను.'' అన్నారు.

భారతయాత్ర సాగుతూండగానే 2015 మేలో గాంధీ తన ఆదర్శాలకు అనుగుణంగా అహ్మదాబాద్ శివార్లలోని కొచ్‌రబ్‌లో సత్యాగ్రహ ఆశ్రమం నెలకొల్పాడు. దానికి జీవన్‌లాల్ దేశాయి అనే బారిస్టర్ తన బంగళా యిచ్చాడు. కొన్నాళ్లు పోయాక ఆర్థికపరమైన యిబ్బందులు వస్తే అంబాలాల్ సారాభాయ్ అనే ధనికుడు రూ.13,000 యిచ్చాడు. ఆశ్రమంలో మొదటి బ్యాచ్‌గా 25 మంది స్త్రీపురుషులు చేరారు. వారిలో 13 మంది తమిళులు! అందరికీ కలిపి ఒకటే వంటశాల. ఎవరికి తగ్గ పనులు వారికి కేటాయించారు. అందరూ తాము నిజమే చెపుతామనీ, అహింస, బ్రహ్మచర్యం పాటిస్తామని, సొంతానికి ఏమీ వుంచుకోమనీ, స్వదేశీ వస్తువులే వాడుతామని ప్రమాణం చేశారు. అస్పృశ్యులను (హరిజనులు/దళితులు) కూడా ఆశ్రమవాసులుగా తీసుకుంటానని గాంధీ అనడంతో అతని భార్య కస్తూర్బా, బంధువు, అనుయాయి అయిన మగన్‌లాల్ గాంధీ అభ్యంతరపెట్టారు. కావాలంటే మీరు వెళ్లిపోండి, వాళ్లను మాత్రం చేర్చుకుంటా అన్నాడు గాంధీ. కస్తూర్బా సణిగినా సర్దుకుంది. మగన్‌లాల్ ఆశ్రమం విడిచి వెళ్లిపోయాడు. కొన్నాళ్లు పోయాక మనసు మార్చుకుని వచ్చి చేరాడు. గాంధీ భారతయాత్ర సాగిస్తూనే మధ్యమధ్యలో ఆశ్రమానికి వస్తూ వుండేవాడు.

గాంధీ భారతయాత్ర జనవరి నెలాఖరులో ప్రారంభమైంది. బొంబాయి నుంచి రాజకోటకు వెళ్లాడు. సామాన్య జనుల జీవితాలెలా

వున్నాయో తెలియాలని థర్డ్ క్లాసు పెట్టెలో ప్రయాణం చేశాడు. గాంధీ భారత్‌కు తిరిగి వచ్చిన తేదీ నుండి చనిపోయేవరకు ఏ రోజు ఏం చేశాడో చందూలాల్ బి. దలాల్ అనే అతను రికార్డు తయారుచేసి పెట్టాడు. మొత్తం 12075 రోజులైతే దానిలో 2119 రోజులు జైల్లో, 4739 రోజుల్లో అహ్మదాబాద్, వార్ధా ఆశ్రమాల్లో, 5217 రోజులు ప్రయాణంలో గడిపాడట. ఈ రోజుల్లో ఇండియా, బర్మా, ఇంగ్లండ్, సిలోన్‌లు తిరిగాడు. ఇండియాలో చేసిన రైలు ప్రయాణాల్లో చాలా భాగం మూడో తరగతి పెట్టెల్లో చేసినవే. ఈ రాజకోట ప్రయాణం గురించి గాంధీ తన ఆత్మకథలో రాశాడు. రైలు పెట్టెను రైల్వే అధికారుల నిర్లక్ష్యం వలన అపరిశుభ్రంగా వుంచితే, ప్రయాణీకులు దాన్ని మరింత చెత్తగా చేశారని, తుక్కు పడేస్తూ, తమలపాకులు, పొగాకు నమిలి ఎక్కడపడితే అక్కడ వుమ్ముతూ, నిరంతరం పొగ తాగుతూ, తమలో తాము కలహిస్తూ, అరుచుకుంటూ నరకాన్ని తలపించారని రాశాడు. నూరేళ్ల తర్వాత వచ్చిన మార్పు ఏమిటంటే మూడో తరగతికి పేరు మారి రెండవ తరగతి అయింది. పరిస్థితులు యించుమించు అలాగే వున్నాయి. ప్రభుత్వం నిర్మల్ అభియాన్, స్వచ్ఛ భారత్ వంటి కార్యక్రమాలు చేపట్టవలసిన అవసరాన్ని ప్రజలు కల్పిస్తున్నారు.

రాజకోట నుండి కఠియవాడ్‌లోని వీరమ్‌గామ్ అనే పట్టణానికి గాంధీ వెళ్లాడు. అప్పట్లో ఆ రెండు వూళ్ల మధ్య కస్టమ్స్ గేటు ఒకటి వుండేది. ఆ దారిలో వెళ్లేవారి వద్ద బ్రిటిషువారు డబ్బు వసూలు చేసేవారు. ఇది గాంధీ దృష్టికి వచ్చింది. ఆయన కఠియవాడ్ ప్రాంతంలో తిరుగుతూ యీ రుసుము వసూలును అహింసామార్గంలో నిరసనల ద్వారా ఎదుర్కోవాలని ఉద్బోధించాడు. దక్షిణాఫ్రికాలో రైలు పెట్టెలో నుండి టిక్కెట్టు వున్నా తనను బయటకు తోసేసిన వైనం, సత్యాగ్రహమార్గంలో పోరాడి జయించిన సంగతి అందరికీ చెపితే వాళ్లు ఉత్సాహంగా సత్యాగ్రహంలో పాల్గొంటామని అన్నారు. అప్పుడు గాంధీ బొంబాయి గవర్నరుకు ఉత్తరం రాశాడు. ''అది మా చేతిలో వుంటే మేం ఎప్పుడో ఎత్తివేసేవాళ్లం. మీరు భారతప్రభుత్వాన్ని అడగాలి.'' అని గవర్నరు జవాబు రాశాడు. దానితో బాటు ఆయన ప్రయివేటు సెక్రటరీ గాంధీకి ఉత్తరం రాశాడు – ''మీ ఉత్తరంలో మీరు సత్యాగ్రహపద్ధతిలో నిరసన తెలుపుతామని రాశారు. ఇలాటి బెదిరింపులు మంచివి కావు.'' అని. ''ఇది బెదిరింపు కాదు, ప్రజల చేతిలో వున్న న్యాయపరమైన హక్కులేమిటో మీకు తెలియపరచానంతే. బ్రిటిషు ప్రభుత్వపు శక్తి అధికారమని నాకు తెలుసు. సత్యాగ్రహం అనేది ప్రజల చేతిలో గల శక్తి అని మీరు గ్రహించాలి.'' అని గాంధీ బదులిచ్చాడు. అన్నట్టుగానే సత్యాగ్రహాలు, నిరసనలు జరిగాక ప్రభుత్వం దిగివచ్చి రెండేళ్ల తర్వాత కస్టమ్స్ గేటు ఎత్తేశారు. కొసమెరుపు ఏమిటంటే – యిప్పుడు కూడా రాజకోట వీరమ్‌గామ్ దారిలో వెళ్లే రైళ్లలో రెండో తరగతి పెట్టెల్లో బలవంతపు వసూళ్లు జరుగుతున్నాయిట. చేసేవారు ఎవరంటే – నపుంసకులు. చప్పట్లు చరుస్తూ వచ్చి, డబ్బిచ్చేదాకా వదలటం లేదట! వీరిని ఆపడానికి ఏ సత్యాగ్రహాలు చేయాలో మరి!

వీరమ్‌గామ్ నుండి గాంధీ భార్యాసమేతంగా కలకత్తా వెళ్లాడు. ఫిబ్రవరి 17 న కలకత్తా దగ్గర్లో వున్న బోల్‌పూర్‌లో రవీంద్రనాథ్ టాగూర్ నడుపుతున్న శాంతినికేతన్ చూడబోయాడు. గాంధీ, అతని భార్య వెళ్లేసరికి ఠాగూరు లేడు. ఆయన వేరే వూరు వెళ్లాడు. గాంధీ వెళ్లిన రెండు రోజులకు పూనాలో గోఖలే మరణించినట్లు టెలిగ్రాం వచ్చింది. వెంటనే అతను పూనాకు ప్రయాణం కట్టాడు. గాంధీ వచ్చి వెళ్లిన సంగతి తెలిసిన సంగతి తెలిసిన ఠాగూరు యిద్దరికీ మిత్రుడైన సి.ఎఫ్. ఆండ్రూస్‌కు లేఖ రాస్తూ ''ఐ హోప్ దట్ మహాత్మా అండ్ మిసెస్ గాంధీ హేవ్ ఎరైవ్డ్ యిన్ బోల్‌పూర్'' అని గాంధీని తొలిసారిగా మహాత్మా అని పేర్కొన్నాడు. ఇక ఆ విశేషణం గాంధీకి వచ్చి చేరింది. (ఠాగూరు, గాంధీ కలిసినపుడు గాంధీ ఠాగూరును 'మహాకవీ' అన్నాడనీ, దానికి ప్రతిగా ఠాగూరు గాంధీని 'మహా ఆత్మా' అన్నాడనీ, అంతకు మించి విశేషం ఏమీ లేదనీ ఒక పాఠకుడు రాశారు. ఠాగూరుకి వున్న బిరుదు మహాకవి కాదు, విశ్వకవి. ఆ స్థాయి కవీంద్రుడు మర్యాదకైనా వ్యర్థంగా పదాలు, విశేషణాలు వాడరు. దక్షిణాఫ్రికాలో గాంధీ సత్యాగ్రహోద్యమం గోఖలే వంటి వారినే కదిలించింది. ఠాగూరు కవి కాబట్టి చక్కగా వ్యక్తీకరిచారు. ఆయన వాక్కు వ ృథా పోలేదు). గురువుగారు గోఖలేకి అంజలి ఘటిస్తూ సంతాపసూచకంగా 1915 ఫిబ్రవరి 20 నుండి తాను ఏడాది పాటు పాదరక్షలు ధరించనని గాంధీ ప్రకటించాడు. పూనా నుండి మళ్లీ శాంతినికేతన్‌కు మార్చి 6 న వచ్చేసరికి అప్పటికి ఠాగూరు వున్నాడు. ఇద్దరూ కలిసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తమ పనులు తామే చేసుకోవాలనీ, తమ టాయిలెట్లు తామే శుభ్రపరచుకోవాలనీ గాంధీ ఉపన్యసిస్తే 'అది తర్వాతి విషయం, ముందు చదువుపై శ్రద్ధ చూపండి చాలు' అని ఠాగూరు అన్నారు. గాంధీ ఉపన్యాసాన్ని పురస్కరించుకుని శాంతినికేతన్‌లో యిప్పటికీ మార్చి 6 ను శుభ్రతాదినంగా పాటిస్తారు.

కలకత్తాలోని కాళీ మందిరం చూడడానికి వెళ్లిన గాంధీ అక్కడి అశుభ్రతను, జంతుబలిని అసహ్యించుకున్నాడు. అక్కణ్నుంచి వారణాశి వెళ్లి అక్కడ రాజ్యమేలుతున్న మురికిని చూసి భరించలేకపోయాడు. కాశీ విశ్వనాథుని మందిరంలో ఎక్కడా చూసినా చెత్త వుండడం, అక్కడి పూజారులు దక్షిణ కోసం భక్తులను పీడించడం చూసి రోత పుట్టింది. పూజారి వేధింపు తట్టుకోలేక దక్షిణగా ఒక పైస యిచ్చాడు గాంధీ. పూజారి దాన్ని విసిరికొట్టి ''నాకు చేసిన యీ అవమానానికి నువ్వు నరకానికి పోవడం తథ్యం'' అని శపించాడు. ''నా నుదుటిపై ఏం రాస్తే అదే జరుగుతుంది కానీ, మీలాటి పండితుల నోట అలాటి మాటలు రాకూడదు'' అని చెప్పేసి గాంధీ బయటకు వచ్చేశాడు. ఆ తర్వాత వారణాశి మూడుసార్లు వెళ్లినా విశ్వనాథ మందిరం వైపు తొంగి చూడలేదు. నూరేళ్లు గడిచాయి, ఇప్పటికీ కాళీఘాట్ గానీ, వారణాశి గానీ వెళ్లాలంటే భయం, అసహ్యం కలుగుతాయి. 'గంగను శుద్ధి చేస్తున్నామని 30 ఏళ్లగా చెపుతూ అపారమైన నిధులు ఖర్చు చేశారు. ఇప్పటిదాకా ఏం సాధించారు చెప్పండి' అని సుప్రీం కోర్టు నిలదీస్తే కేంద్రప్రభుత్వం గుడ్లు తేలవేస్తోంది.

వారణాశి నుండి గాంధీ హరిద్వార్ వెళ్లాడు. అక్కడ కాంగ్డీ గురుకులంలో మహాత్మా మున్షీరామ్‌ను కలిసి ఆయన నడుపుతున్న స్కూలును చూశాడు. ఉపాధ్యాయులతో, విద్యార్థులతో కలిసి మాట్లాడాడు. స్కూలులో యిండస్ట్రియల్ ట్రైనింగ్ పెడితే బాగుంటుందేమోనని సూచించాడు. హరిద్వార్‌లో కొన్నాళ్లు వుండి రామకృష్ణ మిషన్‌లోని సన్యాసులతో కలిసి చర్చించాడు. హరిద్వార్‌లో గడ్డాలు పెంచిన దొంగ సాధువులు భక్తులను భక్తి పేరుతో దోపిడీ చేయడమూ గమనించి ఖేదపడ్డాడు. అక్కడ వుండగానే ఏప్రిల్ 10 న – యికపై రోజులో ఐదు ఆహారపదార్థాల కంటె ఎక్కువ సేవించనని, సూర్యాస్తమయం తర్వాత ఏమీ తిననని ఒట్టేసుకున్నాడు. జీవితాంతం అది పాటించాడు. మున్షీరామ్‌కు గాంధీ వరస నచ్చింది. హరిద్వార్‌లో శాశ్వతనివాసం ఏర్పరచుకోమని చెప్పాడు. 'ఇక్కడి వాతావరణం బాగుంది. వారణాశి కంటె గంగానది స్వచ్ఛంగా వుంది. కానీ దేశంలో నేను చేయవలసినది చాలా వుంది' అంటూ గాంధీ వినమ్రంగానే తిరస్కరించాడు.

హరిద్వార్ నుండి గాంధీ మద్రాసు ప్రయాణం కట్టాడు. ఏప్రిల్ 17 న చేరాడు. అక్కడ పచ్చయప్ప కాలేజీలో విద్యార్థులను, ప్రొఫెసర్లను కలిశాడు. పాత మద్రాసులోని షావుకారు పేటలో ఒక లైబ్రరీ ప్రారంభించాడు. రనడే హాలులో అతని ఉపన్యాసం ఏర్పాటు చేశారు. తర్వాత వైఎంసిఎలో సన్మానసభ జరిగింది. ఆ సభలో గాంధీ ప్రసంగిస్తూ "నేను ప్రొబేషనరీ పీరియడ్‌లో వుంటూ నేర్చుకునే దశలో వున్నాను. మహానుభావుడు గోఖలే ఆదేశానుసారం సర్వెంట్స్ ఆఫ్ ఇంతీడాయ సొసైటీ ఖర్చుతో తిరుగుతున్నాను. మీరు నాపై ఔదార్యంతో కురిపించిన ప్రశంసలకు తగను. కానీ మాతృదేశానికి సేవ చేసి ఆ అర్హత సంపాదించుకోవడానికై నేను నిరంతరం శ్రమిస్తాను." అన్నాడు. ఆ తర్వాత బెంగుళూరు వెళ్లి మే 11 నాటికి అహ్మదాబాదు చేరాడు.

ఈ విధంగా గాంధీ పశ్చిమ, తూర్పు, ఉత్తర, దక్షిణ భారత ప్రాంతాలను చూశాడు. దారిలో ఎంతోమందితో ముచ్చటించాడు. దేశంలోని దారిద్ర్యాన్ని కళ్లారా చూశాడు. ప్రజల వేదనలను, ఆశలను, వారి పరిమితులను అర్థం చేసుకున్నాడు. వారికి బోధపడే భాష ఏమిటో తెలుసుకున్నాడు. ఈ ప్రయాణాల తర్వాతనే అతను పరిమిత వస్త్రాలను ధరించ నారంభించాడు. విదేశీయుల్లో కొందరు 'ఆఫ్ నేకెడ్ ఫకీర్' అని యీసడించినా 'నా దేశంలో అనేకమంది ప్రజల ఆర్థికస్థితికి యిది దర్పణం' అని సమాధానం చెప్పాడు. "గాంధీ" సినిమాలో రిచర్డ్ ఎటెన్‌బరో యీ ప్రయాణఘట్టాన్ని హృదయానికి హత్తుకునేట్లు చిత్రీకరించాడు. 1915 సంవత్సరమంతా దేశంలో అనేక ప్రాంతాలు తిరిగి అధ్యయనం చేయడం కారణంగానే గాంధీ నాయకుడు కాగలిగాడు. జాతిపిత కాగలిగాడు. అందుకే ఆ సందర్భాన్ని భారతప్రభుత్వం వేడుకగా జరుపుతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 18 వీక్లీకై**

## ఎమ్బీయస్ : ఎకె 49 పేలుతుందా?

ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. ఫిబ్రవరి 7న ఎన్నికలనగానే కోలాహలం ప్రారంభమైంది. పార్లమెంటు ఎన్నికలలో మోదీ హవా చవి చూడడానికి ముందే డిసెంబరు 2013న జరిగిన ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలలో బిజెపికి 31, ఆప్‌కు 28కు రాగా కాంగ్రెసుకు కేవలం 8 వచ్చాయి. మే నాటి పార్లమెంటు ఎన్నికలలో చావుదెబ్బ తిన్న కాంగ్రెసు యింకా కోలుకోలేదు. నాయకులు కార్యకర్తలకే మొహం చాటేస్తున్నారు. ఫోన్లు కూడా ఎత్తటం లేదట. అందువలన బిజెపిని ఎదిరించే భారం పూర్తిగా ఆప్‌పై పడింది. బిజెపి కూడా ఆప్ మీదనే గురి పెట్టింది. అరవింద్ కేజ్రీవాల్‌ను అరాచకవాదిగా, పదవీబాధ్యతలు చేపట్టలేక పారిపోయే పలాయనవాదిగా చిత్రీకరిస్తోంది. అంత అరాచకమే కావాలంటే మావోయిస్టుల్లో చేరిపోవాల్సింది అని మోదీ వెక్కిరించారు. ఎకె 47 తుపాకీని స్ఫురింప చేసేలా అరవింద్ పేరులోని పొడి అక్షరాలను (ఎకె) తీసుకుని దానికి అతను ముఖ్యమంత్రిగా పాలించిన రోజులను (49) చేర్చి ఎకె 49 అని ముద్దుపేరు పెట్టారు. తను పేలే తుపాకీనే అని చూపుకోవడానికి అరవింద్ అడావుడి చేస్తూనే వున్నాడు. తనకు బాగా తెలిసున్న విద్యలే ప్రదర్శిస్తున్నాడు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వద్దకు వెళ్లి ఢిల్లీలో 4 లక్షల మంది బోగస్ ఓటర్లు వున్నారని, 14,71,025 మంది ఢిల్లీలోనూ, హరియాణాలోనూ రెండు చోట్లా నమోదు అయి వున్నారనీ, 12,53,779 మంది ఢిల్లీలోనూ, యుపి లోనూ రెండు చోట్లా నమోదు అయి వున్నారనీ, వీరు ఢిల్లీ వాసులు కారనీ, ఎన్నికల సమయంలో వీరిని బిజెపి, కాంగ్రెసు పార్టీలు ఆ యా రాష్ట్రాల నుండి రప్పించి ఓట్లేయిస్తున్నాయనీ ఆరోపించాడు. మోదీ తనను మావోయిస్టులతో పోల్చిన రోజునుంచే విరాళాలు ఎక్కువగా వచ్చిపడుతున్నాయని చెపుతున్నాడు. ఏం చేసినా 2013 నాటి పాప్యులారిటీ పోగొట్టుకున్నాడని ఆప్ నాయకుల నమ్మకం. అందుకనే ఒక్కరొక్కరుగా అతన్ని వీడి బిజెపిలో చేరుతున్నారు.

అరవింద్‌తో బాటు అన్నా హజారేకు అనుయాయిగా వున్న కిరణ్ బేదీ తాజాగా బిజెపిలో చేరారు. ఆమెకు బిజెపి కొత్త కాదు. తను ఐపియస్ అధికారిగా వుండగా బిజెపి పార్టీ నాయకులతో ఆమె ఎన్నో సందర్భాలలో డైరక్టుగా తలపడ్డారు. అప్పుడు ఆ పార్టీలో కనబడని మంచితనం యిప్పుడు ఆమెకు హఠాత్తుగా గోచరించింది. బిజెపికి ఆమెలో నెగ్గే అభ్యర్థి గోచరించింది. అందుకే టిక్కెట్టు యిస్తామంటున్నారు. అన్నా హజారే అనుచరులలోని రాజకీయ లాలస క్రమేపీ కనబడుతోంది. ఆప్ కాబినెట్ ఏర్పడినపుడు కూడా పదవి దక్కనివారు అసంతృప్తి వెళ్లగక్కడం చూశాం. ఆప్ ప్రభుత్వం పడిపోయిన తర్వాత బయటకు వచ్చేసిన షాజియా ఇల్మీ కూడా బిజెపిలో చేరతారంటున్నారు. ఆమె మోదీ 'స్వచ్ఛ భారత్' కార్యక్రమాన్ని ప్రశంసించింది. బిజెపి పార్టీలో చేరడానికి యిదో సంకేతమైపోయింది. ఆప్ పార్టీ బలహీనపడిందని అందరూ అంటున్నా దానితో ముఖాముఖీ తలపడడానికి బిజెపికి కాస్త జంకుగానే వుంది.

ఆ పార్టీ వర్కర్లు అరవింద్ ఊరేగింపులపై కోడిగుడ్లు, రాళ్లు విసురుతూనే వున్నారు. టీవీ చర్చల్లో ఆప్ నాయకులపై యుద్ధాలు చేస్తున్నారు. ఆప్ అభ్యర్థి కారుకు నిప్పు పెట్టారు. కొన్ని స్థానాల్లో బిజెపి ఆత్మవిశ్వాసరాహిత్యానికి యివి ఉదాహరణలు అంటున్నారు పరిశీలకులు. బిజెపి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ఎవరి పేరూ ప్రతిపాదించటం లేదు. మోదీ పేరు మీదుగానే ఓట్లు అర్థిస్తోంది. అరవింద్‌ను ఢీకొన గలిగిన బిజెపి నేత ఎవరూ లేకపోవడం చేత కాబోలు! ఢిల్లీలో బహుళసంఖ్యలో వున్న విద్యావంతులకు మోదీ ఢిల్లీకి ముఖ్యమంత్రి కాలేదని, అయితే గియితే అరవింద్‌కే ఆ ఛాన్సుందని తెలుసు. అరవింద్‌పై తలతిక్క మనిషనే ఆరోపణ వుంది కానీ అవినీతి ఆరోపణ లేదు. ఇప్పుడు బిజెపి కిరణ్ బేదీని అరవింద్‌కు ప్రత్యామ్నాయంగా చూపితే దాని అర్థం బిజెపిలో యిప్పటిదాకా అరవింద్ వంటి స్వచ్ఛమైన యిమేజి లేని నాయకుడు లేకనే కిరణ్‌ను తీసుకుని వచ్చారని! అంతకు ముందు మన తెలుగు నటీమణి జయప్రద అమిత్ షాను కలిశారని, అరవింద్‌కు పోటీగా ఆమెను నిలబెడతారని తెలుగు మీడియాలో వార్తలు వచ్చాయి. జయప్రద కంటె కిరణే బెటరని అనుకుని వుంటారు.

గెలుపు తథ్యం అనే నమ్మకం లేకనే బిజెపి రెండు ట్రిక్కులు వేసింది. మధ్యతరగతిని ఆకట్టుకోవడానికి ఢిల్లీ ఎడ్మినిస్ట్రేషన్‌లోని ప్రభుత్వోద్యోగులకు జీతాలు పెంచింది. ఎలక్షన్ కమిషనర్ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి కొన్ని గంటల ముందుగా యీ ప్రకటన వెలువడింది. దీని కంటె ముందే తెలంగాణ సర్కారులా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరిస్తానని హామీ యిచ్చి గుడిసెవాసులను ఆకర్షిస్తోంది. వీటిని వ్యతిరేకించడానికి ఏ పార్టీకి ధైర్యం చాలటం లేదు. అరవింద్ ఎప్పటిలాగ విద్యుత్, తాగు నీరు హామీలు యిస్తున్నాడు. బిజెపి వాళ్లు విద్యుత్ వాడకం తగ్గించడానికి ఎల్ఇడి బల్బుల వాడకం పెంచుతామంటున్నారు. రూ. 500-600 చేసే ఆ బల్బులను రూ. 10 కే యిస్తామంటున్నారు. దీనితో బాటు 5 విద్యుత్ ప్రాజెక్టులను ప్రారంభించింది. ఆప్ నినాదాల్లో మహిళల భద్రత ఒకటి. వారి ప్రచారంలో 'ఇతరులు ఆడవాళ్లను యిళ్లలోనే కూర్చోమంటున్నారు, మేం వారు క్షేమంగా బయటకు వెళ్లి వచ్చే వాతావరణం ఏర్పాటు చేయాలని చూస్తున్నాం' అని చెప్పుకుంటున్నారు. అత్యాచారం కేసులు బయటకు వచ్చినప్పుడల్లా బిజెపి నాయకులు, వారిని సమర్థించే మతపెద్దలు కొంతమంది 'అసలు వీళ్లని బయటకు ఎవరెళ్లమన్నారు?' అంటూన్నారు కాబట్టి యిది బిజెపికి వ్యతిరేకంగా మహిళలను కూడగట్టే ప్రయత్నమే అనుకోవాలి. కేంద్రంలో, ఢిల్లీ రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం వుంటే చాలా లాభాలున్నాయంటూ బిజెపి ప్రచారం చేస్తోంది.

ఇవి యిలా సాగుతూండగానే మధ్యతరగతి ఓటర్లు ఎక్కువగా వున్న కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగాయి. 8 వార్డుల్లో 5 బిజెపికి దక్కాయి, అంటే గతంలో కంటె ఒక సీటు తక్కువన్నమాట. ఇదైనా ఓట్లు కాంగ్రెసు, ఆప్‌ల మధ్య చీలిపోవడం చేతనే జరిగింది. బిజెపికి 12 వేల చిల్లర ఓట్లు వస్తే, కాంగ్రెసుకు 10 వేల చిల్లర, ఆప్‌కు 8 వేల చిల్లర వచ్చాయి. అంటే కాంగ్రెసు బలం బొత్తిగా క్షీణించలేదని తెలుస్తోంది. అది బొత్తిగా దెబ్బ తినిపోతే తమ వ్యతిరేక ఓట్లన్నీ ఆప్‌కు పడతాయని బిజెపికి భయం. అందువలన కాంగ్రెసు కూడా ఓ మోస్తరు బలంగా వుండాలని, ముక్కోణపు పోటీ జరిగి తాము అధిక స్థానాలు గెలవాలనీ బిజెపి కోరుకుంటోంది. ఆప్‌లో ప్రముఖంగా కనబడేవారిని తమ పార్టీలోకి గుంజుకుంటోంది కాబట్టి బిజెపి ఢిల్లీ గెలుచుకోవడం తథ్యమనిపిస్తోంది. కానీ ఆప్-కాంగ్రెసు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని కాంగ్రెసు ఓట్లు ఆప్‌కు పడితే బిజెపి ఆధిక్యత తగ్గవచ్చు. బిజెపి ఢిల్లీ నాయకులు చాలామంది వున్నారు. వారిలో అంతఃకలహాలు కూడా జగమెరిగిన సత్యం. ఇప్పుడు కిరణ్ బేదీని కొత్తగా చేర్చుకుని ఆమెకు ప్రాధాన్యత యిస్తే కుట్రలు జరగవచ్చు కూడా. ఏ విషయమూ ఫిబ్రవరి 10 న ఫలితాలు వచ్చినపుడు తెలుస్తుంది.
**- ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 19 వీక్లీకై** **ఎమ్బీయస్ : కర్ణాటకలో మఠాలకు ముకుతాడు**

తక్కిన రాష్ట్రాలలో కంటె కర్ణాటకలో మఠాలు ఎక్కువ. అనేక విద్యాలయాలు, సంస్థలు, ఆస్తులు వారి ఆధ్వర్యంలో నడుస్తూ వుంటాయి. వారి ప్రభావం ఆ యా కులస్తులపై వుండడం చేత ఓట్ల కోసం పాలకులు ఆ మఠాలను ఆకట్టుకునే ప్రయత్నాలు జరుగుతూ వచ్చాయి. బిజెపి పాలనలో ఎడ్యూరప్ప, సదానంద గౌడ, జగదీశ్ శెట్టార్ అనేక మఠాలకు కోట్లాది రూపాయల గ్రాంట్లు యిచ్చి మఠాధిపతులను మెప్పించారు. ఇప్పుడు కాంగ్రెసు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మఠాలకు ముకుతాడు వేసి బిజెపి బలాన్ని తగ్గిద్దామని చూస్తున్నాడు. కర్ణాటక హిందూ రెలిజియస్ ఇన్‌స్టిట్యూట్స్ అండ్ చారిటబుల్ ఎండోమెంట్స్ (ఎమెండ్‌మెంట్) బిల్లు తయారుచేసి యిటీవలే ముగిసిన అసెంబ్లీ సమావేశాల ఆఖరి రోజున ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఏదైనా మఠం నిర్వహణలో అవకతవకలు జరిగినా, వారసత్వపు గొడవలు వచ్చినా ప్రభుత్వం దాన్ని స్వాధీనం చేసుకుని నిర్వహణ చేపట్టవచ్చు. మఠాధిపతి కోరినా, వారసుణ్ని నియమించకుండా చనిపోయినా, వారసుడు మైనర్ అయిన సందర్భాల్లో సంరక్షకుణ్ని నియమించకపోయినా, వారసుడికి భౌతికంగా కానీ మానసికంగా కానీ వైకల్యం వున్నా, ఒక్క షో కాజ్ నోటీసు యిచ్చి హేండోవర్ చేసుకోవచ్చు. మఠం మీద వచ్చే ఆదాయాన్ని మఠం మీదనే ఖర్చు పెట్టాలనే నిబంధన పెట్టారు.

కర్ణాటక జనాభాలో లింగాయతులు 19%, ఒక్కళిగలు 17% మంది వున్నారు. వీరే కర్ణాటక రాజకీయాలను శాసిస్తూ వచ్చారు. చాలా భాగం మఠాలు వీరి చేతిలో వున్నాయి. ఈ బిల్లు వలన తమ ఆధిపత్యానికి భంగం కలుగుతుందని వారు ఆందోళన చెంది,

నిరసనలు చేపడుతున్నారు. "అసెంబ్లీ సమావేశాల ఆఖరి రోజున అంత అడావుడిగా ఎందుకు తీసుకురావాలి? దీన్ని అడ్డం పెట్టుకుని వారసత్వపు గొడవల్లో చిక్కుకుని వున్న హుబ్బళిలో మూరుసవీర మఠ్ వంటి పెద్ద మఠాన్ని సునాయాసంగా ప్రభుత్వం చేజిక్కించుకోగలదు." అని బిజెపి నాయకులు విమర్శిస్తున్నారు. "నిజానికి షిమోగాలోని కూడలి శృంగేరి మఠాధిపతి, నర్సీపూర్‌లోని శ్రీ సోసలే వ్యాసరాజ మఠాధిపతి ప్రభుత్వం తమ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవాలని చాలా రోజులుగా కోరుతున్నారు. కానీ చట్టప్రకారం అలా చేసేందుకు వీలు లేకపోయింది. దక్షిణ కన్నడకు చెందిన ఉప్పినగుడి గ్రామంలో వున్న సహస్ర లింగేశ్వర స్వామి దేవస్థాన పై అప్పటి జెడియస్–బిజెపి ప్రభుత్వం వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు అంతిమ తీర్పు వెలువరించే ముందు యీ విషయాలపై రాష్ట్రప్రభుత్వం వైఖరి తెల్పాలంటోంది. అందుకే యీ బిల్లు త్వరగా పాస్ చేయవలసి వచ్చింది." అని న్యాయశాఖ మంత్రి జవాబిస్తున్నాడు. మఠానికి చెందిన ఒక్క భక్తుడు ఫిర్యాదు యిచ్చినా ప్రభుత్వం జోక్యం చేసుకోవచ్చనే షరతు పెట్టడంతో ప్రభుత్వం ఉద్దేశంపై అనుమానాలు అలుముకున్నాయి.

బిల్లుకు వ్యతిరేకంగా 400 మంది మతపెద్దలు కలబరిగిలో సమావేశమై సిద్ధరామయ్యను ముఖ్యమంత్రిగా తొలగించమని సోనియాను కలిసి కోరడానికి నిశ్చయించుకున్నారు. గోవధ నిషేధంపై 1964 నాటి బిల్లుకు గత బిజెపి ప్రభుత్వం వధ్యయోగ్యమైన జంతువుల వయసు పెంచుతూ, శిక్షలు పెంచుతూ మార్పులు చేసింది. అయితే దేశాధ్యక్షుడు ఆ మార్పులకు ఆమోదముద్ర వేయలేదు. అందువలన బిజెపి చేసిన బిల్లులను సిద్ధరామయ్య ఉపసంహరించుకున్నారు. ఇదంతా మైనారిటీలను, వెనకబడిన కులాలను బుజ్జగించడానికే అని బిజెపి ఆరోపిస్తోంది. హిందూత్వం పేర ఓట్లు సమీకరిస్తున్న బిజెపిని అడ్డుకోవడానికి సిద్ధరామయ్య యిలాటి చిట్కాలు ప్రయోగిస్తున్న మాట వాస్తవమే. కర్ణాటక బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్ అని పెట్టి వెనకబడిన కులాల సామాజిక స్థితిగతులు, విద్యలపై సమాచారం సేకరించమని గత ప్రభుత్వం ఆదేశిస్తే సిద్ధరామయ్య దాని పరిధిని మరింత పెంచారు. ఉపకులాలు, సంప్రదాయ వృత్తులు చేసే వారు, వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు పేర్లతో పిలవబడే ఒకే కులాల వివరాలు, మతం మారిన వాళ్ల విషయంలో మారకముందు వారి కులమేదో కనుక్కోవడం యిలాటి పనులన్నీ అప్పచెప్పి దాని బజెట్‌ను రూ. 117 కోట్లకు పెంచారు. ఎందుకిదంతా అంటే సమాజంలో భిన్నకులాల సంఖ్య, పరిస్థితి తెలిస్తే దానికి తగినట్టుగా బజెట్ కేటాయింపులు చేయవచ్చు కాబట్టి అంటున్నాడాయన. ఉపకులాలను కూడా లెక్కలోకి తీసుకోవడం ప్రారంభిస్తే తమ జనాభా నిష్పత్తి తగ్గిపోయి, తమ పట్టు తగ్గిపోతుందని లింగాయతులు, ఒక్కళిగలు భయపడుతున్నారు. సిద్ధరామయ్యను హిందూ వ్యతిరేకి అంటున్నారు. కాదని చూపుకోవడానికి అతను 34,266 దేవాలయాల్లో పూజారుల జీతాలను పెంచాడు. అంతేకాదు ఏటా రూ. 25 లక్షల ఆదాయాన్ని మించి గడిస్తున్న 41 ఎ క్లాస్ ఆలయాల నిర్వహణకు బిజెపి నియమించిన కమిటీలను రద్దు చేశాడు కూడా. ఇప్పుడీ బిల్లుకు వ్యతిరేకంగా సొంత పార్టీలోని అగ్రకులాల నాయకులు కూడా ఉద్యమించడంతో వచ్చే అసెంబ్లీ సెషన్స్‌లో యీ బిల్లును ఉపసంహరించుకుంటామని చెపుతున్నాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 20** **ఎమ్బీయస్ : దేవుడి ప్రమేయం ఎంతవరకు?**

జగన్ తన ఉపన్యాసాల్లో దేవుడి ప్రస్తావన ఎక్కువగా చేస్తారని నేను వ్యాఖ్యానిస్తే, 'చేస్తే తప్పేముంది? ప్రత్యేకంగా ఎత్తి చూపాల్సిన అవసరం ఏముంది?' అంటూ కొందరు రాశారు. నా దృష్టిలో మతవిశ్వాసాలు, నమ్మకాలు, ఆచారాలు అన్నీ వ్యక్తిగతం. వాటిని బహిరంగంగా ప్రదర్శించుకోవాల్సిన అవసరం లేదు. మతాచారం ప్రకారం హిందువు బొట్టు పెట్టుకున్నా, శిఖ్కు గడ్డం పెట్టుకున్నా, ముస్లిం టోపీ పెట్టుకున్నా, క్రైస్తవుడు శిలువ వేసుకున్నా వాళ్లిష్టం. కానీ ప్రజలందరికీ సంబంధించిన విషయాలను మతానికి, దైవానికి ముడిపెట్టి మాట్లాడితేనే చిక్కు వస్తుంది. సైంటిస్టులకూ వ్యక్తిగత విశ్వాసాలు వుంటాయి. తాను నమ్ముకున్న దేవుడికి దణ్ణం పెట్టే పరిశోధన మొదలుపెట్టవచ్చు. కానీ పరిశోధనలోకి దైవప్రస్తావన తీసుకురాడు. అలాగే నాయకుడు కూడా ప్రజలలో ఆత్మవిశ్వాసాన్ని, స్వయంకృషిని, భవిష్యత్తుపై నమ్మకాన్ని పురికొల్పేట్లా మాట్లాడాలి. దేవుడిపై భారం వేసి కాళ్లు బారచాచి కూర్చోండి అనే ధోరణిలో మాట్లాడకూడదు. 'మీరు చేయగలరు, నేను ముందుండి నడిపిస్తాను, మనం మంచే చేస్తున్నాం కాబట్టి దేవుడి ఆశీర్వాదం ఎలాగూ వుంటుంది' అని దేవుణ్ని కాస్త వెనక వరుసలో కూర్చోపెట్టాలి. ఆపత్తులు, అపజయాలు వచ్చినపుడు దేవుణ్ని ముందు వరుసలోకి తీసుకురావచ్చు. మొన్న హుదూద్ బీభత్సాల వంటి వాటి వలన నష్టం వాటిల్లినపుడు దేవుడు కరుణించలేదు (మర్కంటైల్ లా లో కూడా యిలాటి వాటిని 'యాక్ట్స్ ఆఫ్ గాడ్' అంటారు) అని ఆయనపై తోసేయవచ్చు. అంతేకానీ దేవుడు తలచుకుంటేనే పనులవుతాయి, కాకపోతే కావు అనే భావాన్ని పదేపదే చెప్పరాదు. అది మతాచార్యుల పని.

జగన్ అంటూంటారు – దేవుడు నాకు అవకాశం యిస్తే ముఖ్యమంత్రిని అవుతాను అని. ఆ ముక్క అందరికీ తెలుసు, పైకి చెప్పడం దేనికి? 'ప్రతిపక్ష నాయకుడిగా అవకాశం యిచ్చాడు, సద్వినియోగం చేసుకో' అనుకుంటారు జనం. వైయస్ కొడుకు కాకుండా మామూలు వ్యాపారస్తుడే అయితే జగన్‌కు యింత ఫోకస్ వుండేదా? పాతికేళ్ల పోరాటం తర్వాత వైయస్‌కు అధికారం యిచ్చిన దేవుడే ఆరేళ్ల తర్వాత అర్ధాంతరంగా పట్టుకుపోయాడు. జగన్ జీవితంలో పెద్ద కుదుపు. అది మంచికా? చెడుకా? అంటే – చూసే ధోరణి బట్టి వుంటుంది. వైయస్ యింకో యిరవై ఏళ్లు బతికి వుంటే జగన్ తండ్రి చాటు బిడ్డగానే వుండేవాడేమో, సొంతంగా

లైమ్‌లైట్‌లోకి వచ్చేసరికి అతనికీ షష్టిపూర్తి అయ్యేదేమో! వైయస్ లేరు కాబట్టి జగన్‌కున్న ఆకర్షణ ఏమిటో, లోపాలోపాలేమిటో అన్నీ తేటతెల్లమయ్యాయి. తనను చూసే ఓట్లేయమనే పరిస్థితి వచ్చింది. ఇది కీడులో మేలుగా ఎంచాలా? మేలులో కీడుగా ఎంచాలా?

ఏది ఏమైనా దేవుడి స్క్రీన్‌ప్లే ఎవరికీ అర్థం కాదు. అర్థం కాని విషయం గురించి బుఱ్ఱ బద్దలు కొట్టుకోవడం కంటె పరిస్థితిని తనకు అనువుగా మలచుకుని పోవడమే వివేకవంతులు చేయవలసినది. కనబడని దేవుడి గురించి మాట్లాడడం కంటె తన క్లయింట్లనే దేవుళ్లంటే మంచిది కదా అనుకుంటున్నారు వ్యాపారస్తులు. అందుకే పత్రికకు పాఠకులు దేవుళ్లు, సినిమాలకు ప్రేక్షకులు దేవుళ్లు, గుళ్లకు భక్తులు దేవుళ్లు (కరక్టే, భక్తులు రాకపోతే గుడికి ఆదాయం ఎక్కడ?) రాజకీయనాయకులకు ఓటర్లు దేవుళ్లు. 'మీరే ప్రత్యక్షదైవాలు, వరమిచ్చినా, శాపమిచ్చినా దానికి సమర్థులు మీరే' అంటే ఓట్లు రాలతాయి తప్ప 'దేవుడి దయ వుంటే చాలు..' అనే ధోరణిలో మాట్లాడితే వాళ్లకు మండదా? ఓ సామెత వుంది. మధ్యవయసుకు ముందు దేవుణ్ని నమ్మినవాణ్ని, మధ్యవయసు తర్వాత దేవుణ్ని నమ్మనివాణ్ని వింతగా చూస్తారని! యవ్వనంలో వుండగా స్వశక్తిపై నమ్మకం చాలా వుంటుంది. 'దేవుడిదేముంది, కనబడనే కనబడడు. నేనే అన్నీ చేయగలను' అనే ధీమా వున్నంతకాలం గుడికి వెళ్లడు, మొక్కులు మొక్కడు, దేవుడంటే ఖాతరు లేదంటాడు.

అయితే మధ్యవయసు వచ్చేసరికి చాలా విషయాలు బోధపడతాయి. ప్రపంచం సూత్రాలపై, లాజిక్‌పై ఆధారపడి నడవటం లేదని, మంచివాడికి అపకారం, చెడ్డవాడికి ఉపకారం జరుగుతోందని, శ్రమకు, ఫలితాలకు పొంతన లేదని, అకారణంగా ఒకడికి మేలు జరుగుతోందని, మరొకడికి నష్టం జరుగుతోందని గ్రహిస్తాం. ఈ చర్యల వెనుక కారణం కనబడక 'అదృష్టం' (అ-దృష్టం, (కారణం) కనబడనది) అనేది వుందనే అనుమానం మొదలవుతుంది. మంచివాడికి కష్టాలు కలగడానికి లాజిక్ అర్థం కాక 'పూర్వజన్మ పాపం లేదా కర్మ' అయి వుంటుందన్న సందేహం పొటమరిల్లుతుంది. ఏది కాకతాళీయమో, ఏది ప్రి-డిస్టయిన్‌డ్‌యో తోచక ఎందుకైనా మంచిదని దేవుడికి ఓ దణ్ణం పెట్టడంతో ప్రారంభమవుతుంది. పోనుపోను అది ముదురుతుంది. లోకమంతా యిదే తీరు కాబట్టే ఆ సామెత పుట్టింది. ముసలివాడి నోట నాస్తికత్వం, యువకుడి నోట ఆస్తికత్వం ఎబ్బెట్టుగా తోస్తాయి. చదువుకోవాల్సిన విద్యార్థి, ఉద్యోగం కోసం వెతకాల్సిన యువకుడు 'ప్రాప్తం లేదు' అంటే ఏడిశావులే అంటాం. పిల్లకు పెళ్లి చేయాల్సిన మధ్యవయస్కుడి నోట 'ఘటన', 'రాసి పెట్టి వుండాలి' లాటి మాటలు వినబడితే 'ఔనౌను' అంటూ తల వూపుతాం.

యువ రాజకీయనేత నోట ఆస్తికత్వం, దైవప్రశంస రాణించవు. జగన్ యువకులను ఆకర్షించే దశలోనే వున్నారు కాబట్టి తన ప్రసంగాల్లో దేవుడి గురించి కాకుండా, స్వయంకృషి, ఆత్మవిశ్వాసం గురించి ఎక్కువ మాట్లాడాలని నా ఉద్దేశం. జగనే కాదు, లోకేశ్ అయినా, మరో యువనాయకుడైనా యిలాగే వుండాలి. అప్పుడే ప్రజలు హర్షిస్తారు. ఈ ఉద్దేశంతో నేను ఆ వాక్యాలు రాశాను. విమర్శ వచ్చింది వివరణ యిద్దామనుకుంటూండగానే జగన్ యింకో అడుగు ముందుకేసి జాతకాల గురించి మాట్లాడారు. 'ఇంకో రెండేళ్లలో బాబు ప్రభుత్వం పతనమై పోతుందని జోస్యులు చెప్పారు' అని జగన్ ప్రకటించారు. చెప్పిన జోస్యుల పేరు చెప్పలేదు. ప్రతీ ఉగాదికి పార్టీ ఆఫీసుల్లో పంచాంగశ్రవణం అనేది ఫార్సు అయిపోయింది. ఆ సందర్భంగా రాశిఫలాలు చెప్పే పండితులు వెన్యూ చూసుకుని చెపుతున్నారు. టిడిపి ఆఫీసైతే ఒకలా, తెరాస ఆఫీసైతే మరోలా, కాంగ్రెసుదైతే యింకోలా...! అదే పంచాంగం, అవే గ్రహాలు, ఒక్కోరు ఒక్కోలా చెప్తారు. మరి జగన్‌కు యీ రెండేళ్ల విషయం ఏ జోస్యుడు చెప్పాడో!? "సాక్షి"లో వారఫలాలు రాసే ఆయనా?

అసలు దేశానికి, రాష్ట్రానికి జాతకాలు ఎలా గీస్తారు? మనిషికైతే పుట్టుక వుంటుంది. ఆ సమయం, స్థలం చూసి రాశిచక్రం గీస్తారు. ప్రాంతం విషయంలో దాని పుట్టుక ఎలా చెప్తారు? ఇండియా పుట్టినది 1947 ఆగస్టు 15 న అంటే నవ్వాలి. భూమి పుట్టినపుడు మన దేశం పుట్టింది. ఆగస్టు 15 న ఒకరి నుంచి మరొకరికి అధికారం బదిలీ అయింది. అలాగే తెలంగాణ ఏర్పాటు కూడా! 2014 జూన్ 2 న కొంత ప్రాంతానికి పేరు మారింది. భద్రాచలం ముంపు గ్రామాలు తీసేసి, ఆంధ్రకు అప్పగించాక రాష్ట్రం రూపు మళ్లీ మారింది. వీటిలో ఏ తేదీ, ఎందుకు పరిగణించాలి? దీన్ని బట్టి ఎవరు ఎంతకాలం పాలిస్తారో ఎలా చెప్పగలిగారు? రాజకీయ జోస్యాలు తప్పడం ఎన్నో దశాబ్దాలుగా గమనిస్తూ వచ్చాను. గుజ్రాల్, దేవెగౌడ, చంద్రశేఖర్, పివి నరసింహారావు, మన్‌మోహన్ సింగ్... వీరిలో ఎవరూ ప్రధాని అవుతారని ఏ జ్యోతిష్కుడూ చెప్పలేదు. అంతెందుకు మోదీ ప్రధాని అవుతారని ఐదేళ్ల క్రితం ఎవరైనా చెప్పారా? ఆయన ఏడాదిన్నర క్రితం రాజకీయరంగంపై వచ్చి వెలుగుతూంటే అప్పుడు మొదలెట్టారు. ఇలాటి మిడతంభొట్లు జోస్యాలను కోట్ చేస్తూ యువరాజకీయ నాయకుడు మాట్లాడితే జాలి పడాలి. తన బలంపై, ప్రజాబలంపై నమ్మకం పోయి దైవబలాన్ని, చిలకజోస్యాలను నమ్ముకుని ఆ ఆశతో ముందుకు సాగుతున్నాడు పాపం అనుకోవాలి.

ఏ మాట కా మాట చెప్పాలంటే చంద్రబాబులో మొదట్లో యీ నమ్మకాల గొడవ కనబడేది కాదు. ఎన్టీయార్‌కు 9 సంఖ్య అంటే వెర్రి అని, సన్యాసి రాజవుతాడని ఎవరో చెపితే నమ్మి కాషాయం కట్టారని, క్షుద్రపూజలు చేస్తారని యిలా అందరూ అనుకునే రోజుల్లో నెంబర్ టూగా వున్న బాబు ఎప్పుడు చూసినా సైంటిఫిక్ మెథడ్, మేధావులతో చర్చ... యిలాటి భాష మాట్లాడేవారు. ఎన్నికలు జరగగానే ఎన్టీయార్ తిరుపతి వెళ్లి గుండు కొట్టించుకునేవారు కానీ బాబు ఎప్పుడూ కొట్టించుకునే వారు కాదు. బాబాల చుట్టూ ప్రదక్షిణలూ కనబడేవి కావు. ఆయన నాస్తికుడని నేను అనను. దైవభక్తిని ప్రముఖంగా చాటుకునేవారు కాదంటున్నాను. ఎన్టీయార్ సంతానం క్రికెట్ టీమంత వుంటే, యీయనకు ఒక్కడే ఒక్కడు. ఇవన్నీ టిడిపిలో యువతను బాబుకు దగ్గర చేశాయి. అప్పుడు బాబు యువకుడు. ఇప్పుడు ఆయనకూ వయసు మీరింది. ఇవాళ ఎన్టీయార్ తరహాలో ఎక్కువమంది పిల్లల్ని కనండి అంటూ మాట్లాడుతున్నారు.

చదువుకున్నవాళ్లు పెళ్లిళ్లు చేసుకోవడం లేదట, చేసుకున్నా లైఫ్ ఎంజాయ్ చేస్తూ పిల్లల్ని కనటం లేదట, జనాభాలో యువత శాతం తగ్గిపోతుంది కాబట్టి, పిల్లల్ని కనదలచుకున్నవారు యింకా ఎక్కువమందిని కనాలట.

రోగాలపై సాగే యుద్ధంలో మానవుడు గెలుస్తున్నకొద్దీ జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతుంది. వారి శక్తియుక్తులను సమాజానికి ఉపయోగపడేలా ఎలా మలచుకోవాలా అని ఆలోచించాలి తప్ప గీతను చిన్నది చేయాలంటే అంతకంటె పెద్ద గీత గీయాలన్నట్లు వారి సంఖ్యను మించేట్లా పిల్లల జనాభా పెంచేయకూడదు. ఇంకో తరం గడిచేసరికి యీ పిల్లలంతా వృద్ధులై, వృద్ధుల శాతం మరింత పెరిగిపోదా? పెళ్లిళ్లు చేసుకోకపోవడం, పిల్లల్ని కనకపోవడం సమాజంలో ఒక వర్గం మాత్రమే చేస్తున్న పని. పెళ్లి చేసుకుందామనే కోరిక వుండి ఖర్చు భరించలేక వాయిదా వేసుకుంటున్నవారు వున్నారు కాబట్టే కళ్యాణలక్ష్మి వంటి పథకాలు పెడుతున్నారు. సమాజంలోని దిగువ వర్గాలు పిల్లల్ని కంటునే వున్నారని ఏ ప్రభుత్వాసుపత్రికి వెళ్లినా కనబడుతుంది. చదువుకున్నవారి చేత బలవంతంగా కాపురాలు చేయించేబదులు, యిలాటి పేదపిల్లలను చదివిస్తే సరిపోతుంది కదా. ప్రభుత్వ బలవంతం వలన ధనికులెవరైనా పిలల్ని కన్నా, వాళ్లను పట్టించుకోకపోతే వాళ్లు విలాసాలు మరిగి డ్రంకెన్ డ్రైవింగ్‌లోనో, డ్రగ్ ఎడిక్ట్‌గానో పట్టుబడితే లాభం ఏమిటి? మనకు పెరగవలసినది యువతీయువకుల సంఖ్య మాత్రమే కాదు, బాధ్యతాయుతులైన, విద్యావంతులైన, సుశిక్షితులైన యువతీయువకులు. జనాభా పెరిగిన కొద్దీ సమాజానికి, ప్రభుత్వానికి ఖర్చు పెరుగుతుంది. అంతకంటె ఆ నిధులను యీ పేదబాలబాలికలను చదివించడానికి, తర్ఫీదు యిప్పించడానికి వినియోగిస్తే మంచిది కదా!

మరి చంద్రబాబు గారికి యిలా ఎందుకు తోచలేదో? అసలు ఆయన తన కొడుక్కి మేనరికం చేసుకున్నపుడే నేను ఆశ్చర్యపడ్డాను. మేనరికాలు వద్దని వైద్యులు, శాస్త్రజ్ఞులు చెపుతున్నారు. బాబు ఆధునికంగా ఆలోచిస్తారు కాబట్టి ఆ ప్రతిపాదన వచ్చినపుడు తిరస్కరిస్తారేమో అనుకున్నాను. ఇలాటి వ్యక్తిగత విషయాలపై యింతకు మించి వ్యాఖ్యానించకూడదు. తన దైవభక్తిని బాహాటంగా చాటుకునే నాయకుడు కెసియార్. చండీయాగాలకు పాప్యులారిటీ తెచ్చిపెట్టారు. అధికారంలోకి వచ్చాక ప్రజలను మతాలవారీగా, కులాల వారీగా విభజించి, టాకిల్ చేస్తున్నారు. ప్రతీ కులానికీ ఓ భవన్! అదీ హైదరాబాదులో!! ఎందుకంటే – ఆ కులసంఘాల వాళ్లు సభలు, సమావేశాలు జరుపుకోవాలంటే హాలు కావాలిట. అందుకని కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనంతో భవంతులు కడతారట. సభలకు, సమావేశాలకు జనాలు రావడం మానేసి చాలాకాలమైంది. మీటింగుతో యాటింగు ఎట్రాక్షన్ కూడా పెడితేనే రెండు, మూడు వందల మంది వస్తున్నారు. మూణ్నెళ్లకో, ఆర్నెల్లకో మీటింగు జరగడం అబ్బురం. దానికోసం ఏ రవీంద్రభారతో, మరోటో ఆ పూట అద్దె లేకుండా యిస్తే సరిపోతుంది. దానికోసం బిల్డింగు కట్టాలా? కట్టినా ఆ కులస్తులు ఎక్కువగా వున్న జిల్లాలో కడితే వికేంద్రీకరణ జరిగినట్లూ వుంటుంది, స్థలం ఖరీదూ తగ్గుతుంది. ఆ కులస్తులకు ఉద్యోగస్తులుగానో, వ్యాపారస్తులుగానో మార్చడానికి అవసరమైన ఓ రెండు నెలల ట్రెయినింగ్‌కై ఆ నిధులు వెచ్చిస్తే భేషుగ్గా వుంటుంది.

కెసియార్ యీ తరహాలో ఆలోచించరు. అన్ని మతాలూ కవరయ్యాయా లేదా, అన్ని కులాలూ కవరయ్యాయా లేదా యిదే దృష్టి. మళ్లీ హైదరాబాదును సైన్సుకి కేంద్రంగా చేస్తాం, ఆధునికతకు నిలయంగా చేస్తాం అని ఉపన్యాసాలు దంచుతారు. మంత్రతంత్రాలు, పూజాపునస్కారాలపై బాబు కంటె కెసియార్‌కు ఎక్కువ పట్టు వున్నట్టుంది. రెండు తెలుగు రాష్ట్రాల సమస్యలు తీరాలంటే యిద్దరు ముఖ్యమంత్రులు సమావేశమై చర్చించాలని పట్టుబట్టి గవర్నరు గారు ఓచోట కూర్చోబెడితే 'అవన్నీ సరే గానీ, మీ రాజధాని అమరావతి వద్ద పెట్టుకోండి. వాస్తుప్రకారం మంచిది.' అని కెసియార్ బాబుకి సలహా యిచ్చారట. ఎవరికి మంచిది? అని బాబు అడిగారో లేదో కానీ బాబు అక్కడే రాజధాని పెట్టాలని మహేష్ బాబు లెవెల్లో కమిటై పోయి యిక కాంప్రమైజ్ కావటం లేదు. (దస్తూరీ స్వహస్తం అన్నట్లు యీ కొటేషన్ ఆయనదే!)

జోస్యాలు వ్యక్తిగత స్థాయిలో ఓ మేరకు ఫలించవచ్చు కానీ దేశస్థాయిలో, రాష్ట్రస్థాయిలో ఫలించటం లేదు. ఇక వాస్తు అయితే మరీనూ. మొదటిసారి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన కాలం నుండీ పేపర్లో చదువుతున్నాను – వచ్చిన ప్రతీ ముఖ్యమంత్రీ వాస్తుప్రకారం తన ఆఫీసుకు, అధికారిక నివాసానికి మార్పులు చేస్తూనే వున్నారు. అయినా అనేకమందికి పదవులు పోయాయి. మంత్రులూ అదే వాస్తు దోవ పట్టారు. వాళ్లూ యింటిదోవ పట్టారు. గత పాతికేళ్లగా సామాన్య జనం కూడా ఈశాన్యం, వాయువ్యం అంటూ మొదలుపెట్టారు. వాస్తు తెలియని గేస్తు కోసం వెతకాల్సిన పరిస్థితి వచ్చింది. ఇల్లాలికి తలనొప్పి వస్తే వాస్తుకు లింకు పెట్టి బెడ్‌రూమ్‌లో బీరువాకు స్థానభ్రంశం కల్పిస్తున్నారు. వాస్తును యింతలా పాటిస్తున్నారు కదా, గత పాతికేళ్లలో తెలుగువాళ్ల జీవితాల్లో కష్టాలు తొలగిపోయాయా? జీవితాల్లో ఆనందం వెల్లివిరుస్తోందా? లేదే! బతుకులు దుర్భరమై పోయాయనే కదా, ఋణమాఫీలు, ఆసరాలు, పింఛన్లు, ఆరోగ్యశ్రీలు, రూపాయికి కిలో బియ్యాలు.. యిత్యాది సంక్షేమ పథకాల అవసరం పడుతోంది. ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయి. కొందరు చదువుకున్నారు, బాగుపడ్డారు నిజమే. జనాభాలో వారి శాతం ఎంత? ఎక్కువమంది జీవితం ఎలా వుంది అన్నది గమనిస్తే వాస్తును పాటించి బావుకున్నది లేదని గుళ్లలో నిత్యం పెరుగుతూన్న రద్దీ చూస్తే తెలుస్తుంది. కొందరు ఇండియాకే వాస్తు సరిగ్గా లేదని చెప్తున్నారు. అందుకని ఏం చేయాలో మరి! ఈశాన్యం కాస్త కోసేసి చైనాకు యిచ్చేసి, వాయువ్యాన్ని పెంచుకోవడానికి పాకిస్తాన్ ఆక్రమిద్దామా?

ఆంధ్ర రాజధాని విషయంలో బాబు చాలా మూర?పు పట్టుదలతో వెళుతున్నారు. శివరామకృష్ణన్ కమిటీ రిపోర్టు పక్కన పడేశారు, కేంద్రం సలహాలు వినడం లేదు, దొనకొండలో పెడితే ఎవరి భూములూ తీసుకోనక్కరలేదు కదా అంటే వినలేదు,

నూజివీడు వద్ద దేవాలయ భూములున్నాయి అవి తీసుకుని గుడికి నష్టపరిహారం వాయిదాల్లో యిచ్చినా ఫరవాలేదు కదా అంటే వినలేదు, మెట్ట భూములతో సరిపెట్టుకోండి మూడు పంటలు పండే వ్యవసాయభూముల జోలికి వెళ్లనేల అంటే వినలేదు, ఇష్టపడి వచ్చిన వాళ్ల దగ్గర భూమి తీసుకుని పని మొదలుపెడితే తక్కినవాళ్లలో నమ్మకం చిక్కి, వాళ్లంతట వాళ్లే ముందుకు వస్తారేమో, యీ లోపున వాళ్లని ఒత్తిడి చేయడమెందుకు అంటే వినటం లేదు. ఇంత భల్లూకపు పట్టుకు కారణం వాస్తుపై ఆయనకు వున్న పిచ్చి అంటున్నారు. కావచ్చు. లేకపోతే లోకరీతికి యింత భిన్నంగా వెళతారా?

కేంద్రం వద్దకు వెళ్లి వచ్చేనెల జీతాలకు డబ్బు లేదంటారు, ప్రజల వద్దకు వచ్చి రంగుల రాజధాని బొమ్మ చూపిస్తారు, రైతుల వద్ద తీసుకున్న భూమిలో ప్రభుత్వపు వాటా కమ్మర్షియల్ స్పేస్‌ను అప్పుడే వేలం వేస్తున్నారట. ఆ తర్వాత ప్రమోటర్లు, చివర్లో రైతులు అమ్ముకోబోతే అంత డిమాండ్ వుంటుందా? అన్న ప్రశ్న అందర్నీ వేధిస్తోంది. పైసా పెట్టుబడి లేకుండా యిప్పుడు గాల్లో చూపించి అమ్మేస్తారు సరే, కేంద్రం నిధులివ్వకపోతే ఎలా కడతారు? ఏం కడతారు? సంక్రాంతి పండగపూటా యింట వుండకుండా బాబు ఢిల్లీలో తిరిగినా ప్రత్యేక హెూదా ప్రకటన రాలేదు, పన్నుల రాయితీ హామీ కూడా రాలేదు. హుదూద్ వలన 60 వేల కోట్ల నష్టమైందని యీయన చెపితే ఏమీ పరిశీలించకుండా మోదీ హామీ యిచ్చిన వెయ్యి కోట్లలో కూడా యింకా రావలసినది వుందని బాబే చెప్తున్నారు. ఇక రాజధానికి ఏ మేరకు తేగలుగుతారు? ఇప్పుడు తలపెట్టిన వేలానికి స్పందన వుంటుందా? కెసియార్ క్రమబద్ధీకరణ పథకం విఫలమైంది. ఉచితంగా చేయించుకోవడానికి ఎగబడ్డారు కానీ డబ్బులు కట్టమంటే 5% కూడా ముందు రాలేదు. అక్కడా కమ్మర్షియల్ స్పేస్ కొనడానికి ఎవరూ రాకపోతే ఆంధ్ర ప్రభుత్వం పరువు పోదా?

సంక్రాంతి కోళ్లపందాల వలన ఎన్ని కుటుంబాలు నాశనం అయి వుంటాయో! జూదం ఎప్పుడూ మంచిది కాదు. గెలిచినవాడు ఒకడుంటే పోగొట్టుకున్నవాళ్లు పదిమంది వుంటారు. ఓడే కొద్దీ కసి పెరుగుతుంది. సభ్యసమాజం సిగ్గుపడవలసిన కోళ్లపందాలను కోస్తా నాయకులు పంతం పట్టి ఆడించుకున్నారు. వారిలో అధికార పక్ష సభ్యులు అందరి కంటె ముందున్నారు. అందరూ సాయం పట్టి గతంలో కంటె ఎక్కువ ప్రాంతాలకు జూదాలను విస్తరింపచేశారు. ఇలాటి వికృత హింసాక్రీడను సంప్రదాయం పేరు చెప్పి బలపరిచారు. ఇప్పుడు రాజధాని నిర్మాణంలోని అస్తవ్యస్తతను వాస్తు పేరుతో సమర్థిస్తున్నారు. నాయకులీ రీతిగా వుంటే ప్రజలకు సైంటిఫిక్ టెంపర్‌మెంట్ ఎలా అలవడుతుంది? బాలకృష్ణను వియ్యంకుడిగా చేసుకున్నాకనే బాబుకు వాస్తుపై మోహం పెరిగిందని మరొక పరిశీలన. టిడిపి ఆఫీసు గేటు మార్పించిన తర్వాత అధికారం చేజిక్కడంతో వాస్తుపై నమ్మకం పెరిగి వుంటుంది.

అధికారపక్షం యిలా వున్నపుడు (ఏ మాట కా మాట చెప్పాలంటే వాస్తుని నమ్మి యిక్కడే రాజధాని అంటున్నాను అని బాబు బాహాటంగా ప్రకటించలేదు) ప్రతిపక్ష నాయకుడు భిన్నంగా కనబడితే సమాజంలో మేధావి వర్గాలైనా వూరడిల్లుతాయి. కానీ జగన్ చూడబోతే దేవుడి లీల, పండితుల జోస్యం అంటూ ఆ గారడీలో పడి కొట్టుకుంటున్నారు. అలాటి నమ్మకాల వలన ప్రయోజనం వుంటుందా అనే ప్రశ్నకి శ్రీలంక ఎన్నికల ఫలితాల గురించి జనవరి 10 న రాసిన "సాక్షి" ఎడిటోరియల్‌లో సమాధానం దొరుకుతుంది – 'రాజపక్సకు సంఖ్యాశాస్త్రంపై అపారమైన నమ్మకం. ఇటు సంవత్సరమూ, అటు తేదీ తన అదృష్ట సంఖ్య 8 కి సరిపోయేలా వున్నాయి కనుక.. జనవరి 8 న ఎన్నికలు జరిగేలా ఆయన చూశారు. అన్నీ సరిపోయినా అధికారపీఠం అందుకోవడానికి తప్పనిసరైన జనం మద్దతు మాత్రం ఆయనకు లేకుండా పోయింది. ఇందుకు రెండే కారణాలు – ఆయన కుటుంబ పాలన, దానితో పెనవేసుకుని పోయిన అవినీతి.' **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జెనవరి 23 వీక్లీకై** **ఎమ్బీయస్ : సర్వం తానెయై...**

ఏ రోజు పేపరు చూసినా కెసియార్‌ది ఏదో ఒక ప్రకటన వుంటోంది. అప్పుడప్పుడు బోనస్‌గా హరీశ్‌ది, కెటియార్‌ది వుంటుంది. తక్కినవాళ్లందరూ చుప్. ఆర్థికమంత్రి, హెూం మంత్రి, డిప్యూటీ సిఎం వంటి పదవులు మామూలుగా అయితే ముఖ్యమైనవే కానీ గతంలో భంగపడిన సందర్భాలు గుర్తుండిపోయి వారెవరూ నోరు విప్పటం లేదు. ఇప్పితే మూసుకోమని పెద్దాయన చెపుతారన్న భయం కాబోలు. నిజానికి సమైక్యరాష్ట్రంలో వుండగా ఈటెల, నాయిని, జూపల్లి యిత్యాదులు నిత్యం మాట్లాడుతూండేవారు. కాంగ్రెసు ముఖ్యమంత్రిని ఏ ప్రాంతపు మంత్రీ లక్ష్యపెట్టేవారు కారు. తమ చిత్తం వచ్చినట్లు మాట్లాడేవారు. ఇప్పుడదంతా బంద్. నిజాంను కీర్తిస్తూనో, ఆంధ్ర సర్కారును తిడుతూనో మాట్లాడమంటే మాత్రం మాట్లాడతారు. విధాన ప్రకటనల జోలికి వెళ్లరు. విద్యామంత్రి జగదీశ్వరరెడ్డి మాత్రమే అప్పుడప్పుడు ప్రకటనలు చేస్తూ వుంటారు. అది కూడా ఆంధ్రపై పేచీ పెట్టుకునేవే తప్ప తెలంగాణ విద్యార్థులకు మేలు చేసే ఫాస్ట్ పథకం ఎప్పణ్నుంచి అమలవుతుందో దాని గురించి మాట్లాడరు.

ఆంధ్ర రాష్ట్రంలో బాబు మాట్లాడతారు, ఆ తర్వాత నారాయణ, పుల్లారావు వంటి ఒకరిద్దరు మాట్లాడతారు. బస్. ముందు నుంచీ అధికారాన్ని తన గుప్పిట్లో పెట్టుకుని, సర్వం తన కనుసన్నల్లో నడిచేట్లు చూసుకోవడమే బాబు అలవాటు. డెలిగేట్ చేయడం రాకనే ఆయన పార్టీ, ప్రభుత్వం రెండూ దెబ్బ తిన్నాయి. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చి పద్ధతి మార్చుకుంటారనుకున్నాం. మార్చుకోలేదు. టిడిపి హయాంలో మంత్రులతో చెప్పి పనులు చేయించుకోవడం జరిగేది కాదు. మంత్రిగారు ఎంత కన్విన్స్ అయినా తప్పకుండా చేస్తానని కమిట్ అయ్యేవారు కారు. "పెద్దాయన ఏమంటారో చూడాలండి.." అంటూ నాన్చేవారు. ఈయన చెప్పినదంతా విని బాబు

తల నిలువుగా వూపుతారో, అడ్డంగా వూపుతారో తెలియదు. అలా ఎందుకు వూపారో అడిగే ధైర్యం సహచర మంత్రులకు వుండేది కాదు. 'నాకు తెలుసు కదా, ఏం చేయాలో ఎప్పుడు చేయాలో నేను చూసుకుంటా..' అనేదే బాబు నోటివెంట వచ్చే హామీ. తన వద్దకు వచ్చినవాడికి పని అయిందని చెప్పాలో, కాలేదని చెప్పాలో మంత్రికి తెలిసేది కాదు. ప్రజలు కూడా తక్కిన మంత్రులంతా సోంబేరులనీ, బాబు లేకపోతే పరిపాలనా రథం ఎప్పుడో క్రుంగిపోయేదనీ ఫీలయ్యేవారు. వాళ్లు అలా ఫీలయ్యేట్లా బిల్డప్ వుండేది. 'నేను ఊరుకోను, కమ్చీ పట్టుకుని మంత్రులను, అధికారులను తరుముతూంటా. నేను పడుక్కోను, యింకోణ్ని పడుక్కోనివ్వను. నేను కాస్సేపు కళ్లు మూసుకుంటే యింకేమైనా వుందా, కొంపలు మునిగిపోవూ...' అని బాబు తరచుగా అంటూంటారు.

బాబుకి సహచరుడైన కెసియార్ అదే ఫార్ములాను తన రాష్ట్రంలో అమలు చేస్తున్నారు. ఏ మంత్రిత్వశాఖకు చెందిన నిర్ణయమైనా సరే, ఆయన చేయాల్సిందే, మామూలుగా ఫార్మా సిటీ గురించి ఆరోగ్యశాఖ మంత్రి, ఫిల్మ్ సిటీ గురించి సినిమాటోగ్రఫీ మంత్రి, యాదగిరిని తిరుపతంత చేయడం గురించి దేవాదాయ శాఖ మంత్రి, దళిత భవన్ గురించి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి... యిలా సంబంధిత మంత్రి మాట్లాడితే చేస్తే వాళ్లూ ఏదో పని చేస్తున్నారని, ఉత్తినే జీతం తీసుకోవడం లేదనీ మనం అనుకోవడానికి ఆస్కారం వుంటుంది. అలా అనుకునే హెల్త్ యూనివర్శిటీ గురించి రాజయ్య ప్రకటించి చివాట్లు తిన్నారు. ఏదో కథ చెప్తారు – ముష్టివాడొస్తే కోడలు పొమ్మందట. అది చూసిన అత్తగారు ముష్టివాణ్ని వెనక్కి పిలిచి, అప్పుడు పొమ్మందట. 'పిలిస్తే పెట్టడానికి అనుకున్నా, పొమ్మనడానికి మళ్లీ పిలవడం దేనికి?' అని ముష్టాడు అడిగితే 'పెట్టడానికైనా, పొమ్మనడానికైనా అత్తగారిని నాకు హక్కుంటుంది తప్ప కోడలెవత్తి స్వతంత్రించి పొమ్మనడానికి..' అని అత్తగారు అధికారం చాటుకుందట. ఫైనల్‌గా రాజయ్య చెప్పిన ప్రకారమే వరంగల్‌లో పెట్టినా, అది చెప్పాల్సింది తను మాత్రమే అని కెసియార్ అత్తరికం చాటుకున్నారు. ఇక అప్పణ్నుంచి మంత్రులు మౌనవ్రతం పట్టారు. బీబీనగర్ నిమ్స్‌ను ఎయిమ్స్‌గా చేయడానికి చేయాల్సిన ఏర్పాట్ల గురించి సిఎం అధికారులతో చర్చిస్తున్న ఫోటో పేపర్లలో వచ్చింది. దానిలో ఆరోగ్యమంత్రి కనబడలేదు.

ప్రస్తుతం రాష్ట్రంలో స్వైన్ ఫ్లూ సమస్య వుంది. ఆ వ్యాధితో 19 మంది మరణించారని మీడియాలో వార్త రాగానే కెసియార్ జూలు విదిల్చారు. ''ఆంధ్రభూమి'' ప్రకారం '...రాష్ట్ర యంత్రాంగాన్ని దడదడ లాడించారు, మంత్రులు ఎంత బాధ్యతారహితంగా వ్యవహరిస్తే తాను ఎంత తీవ్రంగా పరిగణిస్తానో పరోక్షంగా తెలిసి వచ్చేలా వ్యవహరించారు, ఇంతకాలం వైద్య, ఆరోగ్యశాఖ చాలా తేలికగా తీసుకుంది. బుధవారం మీడియా కథనాల పట్ల స్పందించిన ముఖ్యమంత్రి మోదీతో , కేంద్ర మంత్రులతో మాట్లాడారు, అత్యవసరంగా మంత్రివర్గ సమావేశం జరగాలని ఆదేశించి ఆ లోపుగానే అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కాబినెట్ మీటింగులో ఉపముఖ్యమంత్రి డాఎం రాజయ్యపై అసహనం వ్యక్తం చేశారు, ప్రశ్నలతో ముచ్చెమటలు పట్టించారు...'! దీని తర్వాత మీడియాను పిలిచి ప్రజల నుద్దేశించి 'అది థర్డ్ క్లాస్ వైరస్. కలరా, మశూచి ల్లాటిది కాదు, అయినా యిక్కడ ఒక్కచోటనేనా ఏడు రాష్ట్రాల్లో వుంది' అని ధైర్యం చెప్పారు. (నలుగురితో చావు పెళ్లితో సమానం అని అనునయించేది యిలాటి సందర్భాల్లోనే కాబోలు, యిక్కడ నాలుగు ంటె మూడు ఎక్కువ!)

ఈ వార్తల వలన కెసియార్ యిమేజి పెరగడం బాగానే వుంది. 'కానీ యీ పనులన్నీ ముఖ్యమంత్రి చేయనేల? ఆరోగ్యశాఖామాత్యులు, ఉపముఖ్యమంత్రి అయిన రాజయ్యగారు ఏం చేస్తున్నారు? ఏమీ చేయటం లేదు కాబట్టే ముఖ్యమైన పనులన్నీ మానుకుని ముఖ్యమంత్రి రంగంలోకి దిగాల్సి వచ్చింది' అన్న భావం ప్రజల్లో కల్పించ లేదా? ఉపముఖ్యమంత్రి పదవి ఆరోవేలు లాటిది, అందుకే ఎవరికీ యివ్వటం లేదు అంటూ సంజీవరెడ్డి దానికి సున్నా చుట్టిన సంగతి తెలంగాణ ఉద్యమంలో పదేపదే ప్రస్తావించారు. ఆ షరతును ఆంధ్ర ముఖ్యమంత్రులు, తెలంగాణ ముఖ్యమంత్రులు యిద్దరూ ఉల్లంఘించారు. కానీ ఆంధ్రులే ఎక్కువగా ఆ నింద మోశారు. ఇప్పుడు రాజయ్యగారి సంగతి చూస్తే ఆయన పరిస్థితి ఆరో వేలా? ఏడో వేలా? అన్నట్టుంది. 'మీడియాలో చదివి స్వైన్ ఫ్లూ పెద్ద రోగమేమోనని కంగారు పడ్డాను. డాక్టర్లను పిలిచి మాట్లాడితే తెలిసింది, అది వ్యాధి కాదు, వట్టి థర్ట్ క్లాస్ వైరస్ అని..' కెసియార్ చెప్పారు. రాజయ్యగారు స్వయంగా డాక్టరు కాబట్టి వేరే ఎవర్నీ పిలవనక్కరలేకుండానే దాని సంగతేమిటో గ్రహిస్తారు కదా. గ్రహించారు కాబట్టే థర్డ్ క్లాస్ వైరస్ కోసం మన టైము వేస్టెందుకు అనుకున్నారేమో! ఏది ఏమైనా కాబినెట్లో చివాట్లు తిన్నారని, చేతిలో కాగితంపై పిచ్చిగీతలు గీస్తూ కూర్చున్నారన్న వార్తతో ఆయన యిమేజి డామేజి అయిపోయింది.

జవహర్‌లాల్ నెహ్రూ కాబినెట్‌లో తన స్థానం గురించి చెపుతూ 'ఐ యామ్ ఫస్ట్ ఎమాంగ్ యీక్వల్స్' అని వర్ణించుకున్నారు. అందరూ సమానులే. లెక్కవేసినపుడు నా పేరు మొదటగా వస్తుందంతే, అంటూ సహచరులకు సమానస్థానం కల్పించి మాట్లాడారు. తర్వాతి ప్రధానుల్లో కొందరు మాత్రమే తమ సహచరులకు అలాటి గౌరవం యిచ్చారు. రాష్ట్రాలలో, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీల ఏలుబడిలో అన్నీ ముఖ్యమంత్రుల చేతిలోనే వుండిపోతున్నాయి. లోపలి వ్యవహారం ఎలా వున్నా, పైకి వాళ్ల గురించి తేలికగా మాట్లాడకుండా వుంటే అంతే చాలు. లేకపోతే అధికారులు కూడా వాళ్లను పట్టించుకోవడం మానేస్తారు. కెసియార్ సహచరుల్లో ఎవరికీ విలువ నివ్వటం లేదని అనలేం. కొడుక్కీ, మేనల్లుడికీ బాగానే ప్రాముఖ్యత యిస్తున్నారు. ఇంటిపేరులో నీరు వున్న కారణంగా కాబోలు తన్నీరు హరీశ్‌రావుగారికి వాటర్‌గ్రిడ్, మిషన్ కాకతీయ పనులు అప్పచెప్పారు. కాంట్రాక్టులు వ్యవహారాలు చూస్తూంటే యిది మరో జలయజ్ఞంగా మారుతుందాన్న భయం కలుగుతోంది. అందుకే ఆయనకు అప్పగించారా? ఆర్నెల్లు పోయేసరికి స్పష్టమైన రూపం వస్తుంది. అప్పటికి ఎన్ని చెఱువులు తవ్వారో, ఎన్ని ఆక్రమణలు తొలగించారో లెక్క తేలుతుంది. షెడ్యూల్ ప్రకారం డిసెంబరు

నెలాఖరుకి చెఱువులు ఖాళీ చేయించాల్సి వుంది. భగవంతుడి దయ వలన, ఆ పని టైముకి జరగలేదు. వేసవిట్కటనా జరుగుతుందో లేదో, వేచి చూడాలి.

ఇలా తనూ, కుటుంబసభ్యులు కలిసి మొత్తం కాబినెట్ భారాన్ని మోస్తూంటే బంగారు తెలంగాణ నిర్మాణాన్ని కెసియార్ ఎన్నాళ్లకు పూర్తి చేస్తారు? ఆయనకీ విషయం ఎందుకు తోచటం లేదో తెలియదు. ఎన్నికల హామీలే తట్టెడున్నాయి, అవి చాలనట్లు రోజుకో హామీ యిస్తున్నారు. భూములమ్మి డబ్బు సంపాదిద్దామనుకుంటే అది అంత సులభమైన పనేం కాదు. కేవలం హైదరాబాదు జిల్లాలోనే 3919 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి 1910 కోర్టు కేసులున్నాయట. వీటి విలువ 75 వేల కోట్లుట. ఇవి పరిష్కరిస్తే బోల్డు డబ్బు అని కెసియార్ చెప్తూ వచ్చారు. కానీ పరిష్కారం ఎక్కడవుతోంది? అసలు ఎప్పటికైనా అవుతుందా? క్రమబద్ధీకరణ ద్వారా సంపాదించాలని పెట్టుకున్న లక్ష్యం సుదూరంగా వుంది. గడువు పెంచారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలు వివాదాస్పదమై, కోర్టుల తిరస్కారానికి గురవుతున్నాయి. రిటైర్డ్ ఐయేయస్‌లతో సర్కారు పెట్టుకున్న సలహాబృందాలు ఏం చేస్తున్నాయా అని యిలాటి సందర్భాల్లో అనుమానం వస్తుంది. చేయవలసిన పని ఎంతో వుంది. టీము వర్క్ వుంటేనే కొంత మేరకైనా సాధించవచ్చు. మంత్రివర్గ సహచరులను నిర్లక్ష్యం చేసి, డీమోరలైజ్ చేసి, నోరెత్తనీయకుండా చేస్తే వాళ్లలో నిష్క్రియాపరత్వం పెరుగుతుంది. అప్పుడు బంగారు తెలంగాణ వట్టి నినాదంగానే మిగులుతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 23 వీక్లీకై** **ఎమ్బీయస్ : పాత పుస్తకానికి కొత్తగా దండన**

తమిళనాడులోని కొంగునాడు (కోయంబత్తూర్, ఈరోడ్, తిరుప్పూర్, సేలం, కరూరు ప్రాంతాలు) మాండలికానికి, సంస్కృతికి ఎంతో సేవ చేసిన పెరుమాళ్ మురుగన్ అనే ఒక సాహిత్యకారుడు యిప్పుడు నానా యిబ్బందులూ పడుతున్నాడు. దీనికంతా కారణం నాలుగేళ్ల క్రితం అతను రాసిన నవల! అప్పుడు రాని గొడవ యిప్పుడు ఎందుకు వచ్చిందంటే దాని వెనుక మతరాజకీయాలున్నాయి కాబట్టి అనే సమాధానం వస్తుంది. ముందుగా మురుగన్ చేసిన భాషాసేవ గురించి తెలుసుకోవాలి. 1983లో 17 వ ఏట దక్షిణ తమిళనాడులోని కరిసాల్ ప్రాంతపు మాండలికానికి ఎవరో తయారు చేసిన నిఘంటువు చూశాక అతనికి తన కొంగునాడుకి మాత్రం యిలా ఎందుకు చేయకూడదా అనిపించింది. 17 సంవత్సరాల కృషితో దాన్ని 2000 సంఐరంలో విడుదల చేశాడు. నిజానికి తమిళ సాహిత్యంలో కథలు, కవిత్వాలలో చాలాభాగం చెన్నయ్ నగర మధ్యతరగతి జీవనం గురించి రాసినవే, గ్రామీణ ప్రాంతాలను వర్ణించవలసి వస్తే తంజావూరు, తిరునల్వేలి జిల్లాల గురించో రాసినవే. కొంగునాడు నుంచి షణ్ముగసుందరం అనే ఆయన 1942లో రాసిన ''నాగమ్మాళ్'' అనే నవల ప్రసిద్ధం. ఆ తర్వాత తన ప్రాంతం నుండి ఎవరూ పెద్దగా రాయటం లేదని గ్రహించిన మురుగన్ 1991 నుండి ధారాళంగా ఫిక్షన్ రాయడం మొదలుపెట్టాడు. ఇప్పటికి 35 పుస్తకాలు రాశాడు. అంతేకాదు కొంగునాడు చరిత్ర గురించి టి ఎ ముత్తుస్వామి కోనార్ రాసిన అలభ్యపుస్తకాన్ని సంపాదించి మళ్లీ వెలుగులోకి తెచ్చాడు.

ఇలాటి మురుగన్ యీ జనవరి 8న పోలీసుల సలహాపై వూరు విడిచి కుటుంబంతో సహా పారిపోవలసి వచ్చింది. మర్నాడు అతని ''మాతొరుభాగన్'' అనే నవలకు నిరసనగా తిరుచెంగోడులో బంద్ నిర్వహించబడింది. దీనికి ముందు డిసెంబరు 26 న కొంతమంది చేరి అతని పుస్తకం ప్రతులను తగలబెట్టడం, పుస్తకాన్ని బహిష్కరించి రచయితను ఖైదు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. అతన్ని బెదిరిస్తూ ఫోన్‌కాల్స్ కూడా రాసాగాయి. ఇంతకీ ఆ పుస్తకంలో కథేమిటి? నూరేళ్ల క్రితం జరిగిన కథ అది. సంతతి లేని పొన్న, కాళీ అనే దంపతులు పిల్లల కోసం తపిస్తారు. ఇరుగుపొరుగువారి సూటిపోటి మాటలు పడలేక దేవుళ్లకు మొక్కుతారు. గుళ్లకు తిరుగుతారు. చివరకు తిరుచెంగోడు అనే వూళ్లో అర్ధనారీశ్వరాలయంలో ప్రతీ ఏటా జరిగే వైకాశీ విశాఖం రథోత్సవంలో పాల్గొంటారు. పూర్వకాలంలో కొన్ని పండుగలలో స్త్రీపురుషులు యిష్టం వచ్చినట్లు చరించే ఆచారం వుండేది. హోలీ పండగకు మూలం అదేనంటారు తాపీ ధర్మారావు గారు తన ''పెళ్లి–దాని పుట్టుపూర్వోత్తరాలు'' పుస్తకంలో. వివాహిత స్త్రీలు తమ రవికలను కుప్పగా పోస్తే పురుషులు వచ్చి ఏరుకునేవారట. ఎవరి రవిక వస్తే ఆ స్త్రీతో అతను శయనించవచ్చు. అలాటి సందర్భాల్లో ఒక స్త్రీకి తన మొగుడే తగిలాడట. అప్పుడే ''పండగనాడూ పాత మొగుడేనా?'' అనే సామెత వచ్చిందట. ఇలాటి సందర్భాల్లో జరిగే రతిక్రీడను అప్పటి సమాజం తప్పుగా పరిగణించేది కాదు. మహారాష్ట్రను ఏలిన పీష్వాలు ''కంచుకక్రీడ'' పేరుతో యిలాటి కేళీవిలాసాలు జరిపేవారట. కొంగునాడు ప్రాంతంలో అప్పట్లో ఆ వూళ్లో యిలాటి ఆచారం వుండేది. ఆ సందర్భంగా గర్భవతులైన స్త్రీలు ఆ పిల్లలను 'సామి కొడుత్త పిళ్లయ్' (దేవుడిచ్చిన సంతానం) గా భావించేవారు. కాబట్టి కాళీ దానిలో పాల్గొందని రచయిత రాశారు. నాలుగేళ్లగా నవలలోని ఆ వుదంతం ఎవరికీ తప్పుగా తోచలేదు.

మురుగన్ పుస్తకాలను ఇంగ్లీషులోకి తర్జుమా చేస్తే అతనికి సాహిత్య ఎకాడమీ ఎవార్డు వచ్చే అవకాశం వుందని భావించిన కొందరు అభిమానులు ఆ పుస్తకాన్ని ''ఒన్ పార్ట్ ఉమన్'' పేరుతో 2014లో అనువదించారు. అవార్డు మాట ఎలా వున్నా ఆ పుస్తకం ఉత్తర భారతంలో వున్న హిందుత్వవాదుల కళ్లల్లో పడింది. తమిళనాడులో ఎలాగైనా పట్టు సాధించాలని చూస్తున్న బిజెపి సమర్థకులైన హిందుత్వవాదులకు యీ పుస్తకంలో మార్గం గోచరించింది. ఇక మురుగన్‌పై దాడి మొదలుపెట్టారు. హిందూ మున్నని, కొన్ని కులసంఘాలు కలిసి మురుగన్ కొంగునాడు స్త్రీల పరువు తీశాడని, తిరుచెంగోడుకు అప్రతిష్ట తెచ్చాడని దాడులు మొదలుపెట్టారు.

కావాలంటే రాబోయే ముద్రణలో ఆ వూరిపేరు తీసేస్తానని, అభ్యంతరాలున్న భాగాలు తొలగిస్తానని మురుగన్ ఆఫర్ చేశాడు. వాళ్లు వినటం లేదు. పుస్తకం మొత్తం బహిష్కరించాలని పట్టుబడుతున్నారు. పోలీసులు కలగజేసుకుని హిందూ సంఘాలతో మురుగన్‌కు సమావేశం ఏర్పాటు చేశారు. చర్చలకు మురుగన్ వెళ్లాడు కానీ ఆ సంఘాల ప్రతినిథులు ఎవరూ రాలేదు. వాళ్లకు కావలసినది వివాదం, పరిష్కారం కాదు. పుస్తకంలో నుండి అసందర్భంగా కొన్ని భాగాలు తీసుకుని, వాటిని కరపత్రాలుగా వేసి, చూడండి హిందూమతాన్ని ఎలా అవమానపరిచాడో అంటూ వూళ్లో పంచుతున్నారు. నిజానికి భర్త లేనప్పుడు, అశక్తుడైనపుడు వేరే వారి చేత పిల్లలు కనడం హిందూ సమాజంలో అనాదిగా వుంది. దాన్ని 'నియోగధర్మం' అంటారు. అలాటి సందర్భాల్లో పుట్టిన బిడ్డ బీజదానం చేసిన పురుషుడికి చెందదు. క్షేత్రం స్త్రీదె కాబట్టి, ఆమెకు యజమాని ఐన ఆమె భర్తకు చెందుతాడు. భారతంలో ధృతరాష్ట్రుడు, పాండురాజు అలా పుట్టినవారే. వారి తండ్రులు చనిపోతే తల్లులతో వేదవ్యాసుడు శయనించాడు. వారిని ఎవరూ తక్కువగా చూడలేదు. ధృతరాష్ట్రుడు విశాలమైన కురురాజ్యాన్ని రాజుగా ఏలాడు. అతని నాయనమ్మ అయిన సత్యవతి వివాహం చేసుకోకుండానే పరాశరుని చేత వ్యాసుణ్ని కన్నది. అయినా ఆమెను పెళ్లాడడానికి శంతనుడికి అభ్యంతరం లేకపోయింది. పరశురాముడు భూమండలమంతా తిరిగి తిరిగి క్షత్రియుడన్న ప్రతివాడిని సంహరించాడు. అప్పుడు రాణులు యితరులతో శయనించి పిల్లలను కన్నారు. అలా పుట్టినవారు రాజులయ్యారు. క్షేత్రప్రధానంగా క్షత్రియులు గానే, తమ దివంగత తండ్రులకు వారసులుగానే గుర్తింపబడ్డారు.

ఇలాటి తర్కాలు వినడానికి అక్కడి హిందూ సంఘాలు తయారుగా లేవు. వీరికి దన్నుగా నిలబడడానికి మరి కొన్ని వర్గాలు ముందుకు వచ్చాయి. మురుగన్ రచయిత మాత్రమే కాదు, గవర్నమెంటు కాలేజీలో లెక్చరరు కూడా. కొన్ని కులసంఘాలు తిరుచెంగోడు, నామక్కల్ ప్రాంతాల్లో స్కూళ్లను, కాలేజీలను ప్రారంభించి పూర్తి వ్యాపారంగా మార్చేశాయి. వాటిని విమర్శిస్తూ మురుగన్ పెద్ద ఉద్యమం నడుపుతున్నాడు. వాళ్లంతా యితనిపై పగబట్టారు. యు. సహాయం అనే అధికారి సేలం జిల్లా కలక్టరుగా వుండగా పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న వారిపై చర్యలు తీసుకున్నాడు. వారు అతనిపై ధ్వజమెత్తగా మురుగన్ సహాయంకు అండగా నిలిచి ప్రజల మద్దతు కూడగట్టాడు. యిప్పుడు వీరంతా కలిసి మురుగన్‌ను వూరి నుంచి తరిమివేశారు. అయితే తమిళనాడులోని సాహితీకారులందరూ మురుగన్‌కు అండగా నిలిచారు. మురుగన్ పుస్తకాన్ని ప్రచురించిన ప్రచురణకర్త ఏ మాత్రం జంకుండా వ్యవహారాన్ని కోర్టుకి తీసుకెళతా నంటున్నాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 26 వీక్లీకై**

**ఎమ్బీయస్ : ఆశాజీవి అంటే..?**

'కేంద్రం నుంచి పెద్దగా సాయం లభించే పరిస్థితి కనబడటం లేదు. అయినా నేను ఆశాజీవిని. అనుకున్నది సాధిస్తాను' అన్నారు చంద్రబాబు. మర్నాడే వాల్‌మార్ట్, విప్రో, ఇన్ఫోసిస్, పెప్సికో, మైక్రోసాఫ్ట్, ఫెయిర్‌ఫాక్స్ అన్నీ వచ్చి ఆంధ్రలో పెట్టుబడులు పెట్టేస్తున్నాయని చెప్పారు – ఆశాజీవి అంటే ఆశలు పెట్టుకునే జీవా? ఆశలు పెట్టే జీవా? అని సందేహం కలిగేలా! దావోస్‌లో 35 సదస్సుల్లో పాల్గొనడం, కనబడిన వాళ్లందరినీ పెట్టుబడులు పెట్టమనడం నిజమే కావచ్చు. ఈయన లాటి ముఖ్యమంత్రులు, ఆట్టే మాట్లాడితే అనేక దేశాల ప్రధానమంత్రులు వాళ్లను రోజూ కోరే కోరికే అది! చివరకు వాళ్లు ఎటు మొగ్గుతారో దేవుడికే తెలియాలి. మన పాలకులు ఊరించిన వాటిల్లో పదిశాతం వచ్చినా అదే పదివేలు అనుకునే పరిస్థితిలో వున్నాం మనం. అవైనా వస్తాయా? వచ్చేందుకు యిక్కడ యిన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏర్పడుతుందా లేదా? దినదినగండంగా గడుపుతున్న రాష్ట్రాన్ని చూసి వారు మురిసి ముక్కలయి పరిగెట్టుకువస్తారా?

ఎన్నికల సమయంలో, ఆ తర్వాతా బాబు, యితర టిడిపి నాయకులు ఏం చెప్పారు? 'కేంద్రం మనది, బిజెపితో మాకు పొత్తు వుంది. మధ్యలో వారధిగా మన వెంకయ్యనాయుడు వున్నారు. ప్రత్యేక హోదా గురించి రాజ్యసభలో ధాటీగా వాదించింది ఆయనే! మన్‌మోహన్ ఐదేళ్లంటే మేం వచ్చి పదేళ్లు చేస్తాం అన్నారాయన, ఎన్నికల ప్రచారంలో పదేమిటి, పదిహేను కూడా చేస్తాం అన్నారు. ప్రత్యేక హోదా తథ్యం. అది చూసి హైదరాబాదులో వున్న ఆంధ్ర వ్యాపారస్తులే కాదు, తెలంగాణవారు కూడా మన దగ్గరకే వచ్చేసి పరిశ్రమలు పెడతారు. రాయితీలంటే ఎవరికి చేదు? మనది స్వర్ణాంధ్రప్రదేశ్ కావడం ఖాయం' అన్నారు. మరి యిప్పుడు? 'పాపం కేంద్రానికి దాని యిబ్బందులు దానికి వున్నాయి. వాళ్లే డబ్బు కోసం అవస్థలు పడుతున్నారు. మనం గట్టిగా అడిగే పరిస్థితి లేదు. మంత్రులెవ్వరూ కేంద్రాన్ని విమర్శించకూడదు. బిజెపిని నిందించకూడదు' అంటున్నారు.

కేంద్రం కష్టాలు మనకెందుకు? అంత డబ్బు లేకుండా వుంటే స్వచ్ఛభారత్ లాటి కొత్త పథకాలు ఎందుకు పెడుతున్నారో మరి! అయినా కొత్త రాష్ట్రానికి డబ్బు యిచ్చే పరిస్థితి లేకపోతే, అర్జంటుగా విభజన చేయడం దేనికి? డబ్బులొచ్చాకే చేయలేకపోయారా? చేసినది కాంగ్రెసు పార్టీ అని తప్పించుకోలేరు. పార్టీలు మారినా ప్రభుత్వం అదేగా, మనం కట్టిన పన్నులన్నీ అక్కడికే వెళుతున్నాయి కదా. అయినా విభజన కాంగ్రెసు చేతుల మీదుగా జరిగినా దానికి సాయం పట్టినది బిజెపి కాదా? పెద్దమ్మనే కాదు, చిన్నమ్మనూ గుర్తు పెట్టుకోండి అని మురుస్తూ చెప్పిన సుష్మా స్వరాజ్ యిప్పుడు కేంద్రంలో భాగం కాదా? ఆనాడు రాజ్యసభలో గంభీరంగా హామీ యిచ్చిన వెంకయ్యనాయుడు గారే యిప్పుడు స్వయంగా చెప్పేశారు – ప్రత్యేక హోదా హుళక్కి. మీకిస్తే తక్కినవాళ్లు గోలపెడతారు, అందువలన చాటుమాటుగా, ఆ పేరు చెప్పకుండా వేరేలా యిచ్చి సరిపెడతాం లెండి అని. మురళీమోహనూ అన్నారు, ప్రత్యేక హోదా కాకుండా పరోక్షంగా సాయం అందిస్తుందిట అని. ఇదేమైనా బలరాముడి కంట పడకుండా యశోద కృష్ణుడికి వెన్నముద్ద

తినిపించినట్టా!? ఏం చేసినా బజెట్‌లో కనబడుతుంది, తక్కినవాళ్లకు తెలుస్తుంది. పేచీ పెట్టేవాళ్లు పెడతారు. వాళ్లకు భయపడి యివ్వాల్సిన ప్యాకేజీ యివ్వకపోతే ఎలా?

రాయలసీమ, ఉత్తరాంధ్రలకు బుందేల్‌ఖండ్ ప్యాకేజీ యిస్తామని కేంద్రం చెప్పినా యిప్పుడు 7 జిల్లాలకు కలిపి జిల్లాకు రూ. 10 కోట్లు చొప్పున ఏడాదికి 70 కోట్లకు మించి వచ్చే పరిస్థితి లేదని బాబే చెప్పారుట. మొత్తం 10 కోట్లు యిస్తానంటే బాబు బేరాలాడి 70 చేయించారట. ఇ?వాళ్టి పేపరు చూస్తే జిల్లాకు 60 కోట్లు వస్తుందని వార్త వచ్చింది. ప్రతీ జిల్లాకు బాబు ప్రకటించిన ప్రాజెక్టులు లిస్టు ఒక్కసారి తిరగేయండి, ఏడాదికి 60 కోట్లయినా ఏ మూలకు సరిపోతాయి? రాష్ట్రం ఏర్పడడమే 15 వేల కోట్ల లోటు బజెట్‌తో! ఆ పైన పాత ప్రభుత్వం పెట్టిన బకాయిలు. ఇప్పటికి పరిశ్రమలకు యివ్వాల్సిన 1300 కోట్ల బకాయిలు చెల్లించామని బాబు చెప్పారు. ఏ ప్యాకేజీ లేకపోతే పరిశ్రమలు వెనకబడిన ప్రాంతాలకు వస్తాయా? లోటు బజెట్ పూడ్చడం మా బాధ్యత అని విభజన చట్టంలో కేంద్రం హామీ యిచ్చింది. ఇప్పటిదాకా దాన్ని పూడ్చే ప్రయత్నమే చేయటం లేదు కేంద్రం. ఇక్కడ రాష్ట్ర ఆదాయానికి, ఖర్చుకి పొంతన లేకుండా పోయింది. కేంద్ర, రాష్ట్ర నిధులకు సంబంధించి 80 వేల కోట్ల ఖర్చు బజెట్‌లో చూపించగా జూన్ నుంచి డిసెంబరు వరకు 29 వేల కోట్లు మాత్రమే ఖర్చయింది. అనేక కీలక శాఖలకు బజెట్‌లో కేటాయించిన మొత్తంలో 20% కూడా ఖర్చు కాలేదుట. ఇరిగేషన్‌కు 4800 కోట్లు ఎలాట్ చేస్తే డిసెంబరు వరకు 164 కోట్లు మాత్రమే ఖర్చయింది. విద్యుత్ కోసం 7110 కోట్లు కేటాయిస్తే 1945 కోట్లు మాత్రమే ఖర్చయింది.

కీలకరంగాల్లో యిలా వుంటే రేపు కొరత వస్తే ఎలా? ఆశించిన రీతిలో పరిశ్రమలు ప్రారంభం కాక మిగులు విద్యుత్ కనబడుతోంది కానీ నిజంగా యిండస్ట్రీస్ వస్తే కోతలే కదా! ఎమ్‌సెట్ నుండి కృష్ణా జలాల దాకా ప్రతీదీ తెలంగాణతో పంచాయితీయే. కేంద్రానికి మొత్తుకుంటే వాళ్లు 'మీ యిద్దరూ కూర్చుని పరిష్కరించుకోండి, ఒక్కోళ్లూ ఒక్కో గణాంకాలు యిస్తున్నారు, మాకేం అర్థం కావటం లేదు' అంటున్నారు. 'ఆయనే వుంటే...' అనే సామెతలా యిద్దరూ రాజీపడితే మధ్యవర్తుల నెందుకు పిలుస్తారు? కేంద్రం తన బాధ్యత పూర్తిగా విస్మరించింది. గవర్నరుగారి వద్ద మొఱ పెట్టుకుంటే ఆయన విని వూరుకుంటాడు. పోనీ కదాని ఓ సలహా పడేస్తే వీళ్లిద్దరూ విని వూరుకుంటారు. ఎవరూ ఎవరి మాటా వినే పరిస్థితి లేదు. తెలంగాణ ప్రభుత్వం ప్రతీదీ కావాలని వివాదాస్పదం చేస్తోందని సులభంగానే అర్థమవుతుంది. అయినా దాన్ని కట్టడి చేయడానికి గవర్నరుకాని, కేంద్రం కాని ముందుకు రావటం లేదు. అంతా భేషుగ్గా వుంది, నో ప్రాబ్లెమ్స్ అంటారు నరసింహన్. ఆయనకు రెండు ప్రభుత్వాలూ 'నా' ప్రభుత్వాలే! ఇన్ని కష్టాలతో కొత్తగా పుట్టిన ఆంధ్రరాష్ట్రం ఎలా మనుగడ సాగిస్తుందో ఎవరికీ తెలియటం లేదు.

ఇలాటి పరిస్థితుల్లో భారీ రాజధాని ఎందుకు ప్లాన్ చేయాలో బాబుగారే చెప్పాలి. తక్కిన ఎవర్నీ మాట్లాడవద్దని ఆయన శాసిస్తున్నారు కాబట్టి! రాజధానికి రూ. 2000-3000 కోట్ల దాకా కేంద్రం యిస్తుందని బాబు మంత్రివర్గ సహచరులతో అన్నట్లు వార్తలు వచ్చాయి. రాజధాని అంటే నాలుగు లక్షల కోట్లు కావాలి అని ఆయన గతంలో చేసిన డిమాండ్‌లో యిది ఎన్నో వంతో మీరే లెక్కవేసుకోండి. డెసిమల్ తర్వాత సున్నా యిప్పుడే కనబడుతోంది. చివరకి ఎన్ని సున్నాలు చుడతారో ఏమో! గతంలో విభజన చేసిన రాష్ట్రాల రాజధానులే నిధుల కోసం అలో లక్ష్మణా అని ఏడుస్తున్నాయి. మూలవిరాట్టు ముప్పేత్తుకుంటూ వుంటే ఉత్సవ విగ్రహాలు వచ్చి మా మాటేమిటి అని అడిగాయని సామెత. బిజెపి స్వయంగా విభజించిన రాష్ట్రాల గతే అలా వుంటే, కాంగ్రెసు విభజించిన రాష్ట్రాన్ని ఉద్ధరించే పని బిజెపి పెట్టుకుంటుందా? ఇది అర్థం చేసుకోకుండా రాజధానిపై బాబు అంత దూకుడు ప్రదర్శించడం అవసరమా? ఎప్పుడు కేంద్ర నిధులు వస్తాయో, ఎప్పుడు పనులు ప్రారంభమవుతాయో తెలియదు. ఈ లోపుగానే అర్జంటుగా రాజధానిగా నోటిఫై చేసిన ప్రాంతాల్లో పంటలు ఆపించేస్తున్నారు. మరి అక్కడి జనాభా ఏం తిని బతకాలి? రైతులు, కౌలుదారులు, రైతు కూలీల జీవనోపాధి ఎలా? వీళ్లందరూ వెంటనే వేరే వృత్తికి మరలగలరా? నెలకు వీళ్లు యిస్తానంటున్న రూ.2500 రూ.లతో కుటుంబం మొత్తం బతకగలదా?

దేశంలో కల్లా అత్యంత సుందరమైన, ప్రణాళికాబద్ధమైన రాజధాని చండీగఢ్. మొదటి దశలో 9 వేల ఎకరాలు తీసుకుని కట్టారు, రెండో దశలో 6 వేల ఎకరాలు తీసుకుని కట్టారు. రెండు ఫేజ్‌లు పూర్తయ్యేసరికి 50 ఏళ్లు పట్టింది. మరి ఆంధ్ర రాజధాని 50 వేల ఎకరాలంటున్నారు. ఎన్నేళ్లు పడుతుందో ఊహించుకుంటే గుండెలదురుతాయి. మీ భూములు యిచ్చేస్తే కమ్మర్షియల్ స్పేస్ యిస్తాం, దాన్ని అమ్ముకుంటే మీకు డబ్బులే డబ్బులు అంటున్నారు. రాజధాని కట్టగానే జనాభా యిబ్బడిముబ్బడిగా వచ్చి పడిపోయి డిమాండ్ పెంచేస్తారా? ఇంత జనాభా ఎక్కణ్నుంచి వస్తారు? 60 ఏళ్ల తర్వాత చండీగఢ్ జనాభా 12 లక్షలు. గుజరాత్ రాజధాని గాంధీనగర్ ప్రస్తుత జనాభా రెండు లక్షల చిల్లర వుంటుంది. అది చేరడానికి 20 ఏళ్లు పట్టింది. అసలు ఏదైనా కట్టాలన్నా, ఆకర్షించి జనాల్ని పోగేయాలన్నా డబ్బు కావాలి. అదే కొరతగా వుంది. వచ్చే నెలకు జీతాలివ్వడానికి డబ్బు లేదని బాబే చెప్పారు. రిటైర్‌మెంట్ వయసు 58 నుంచి 60 కి పెంచినపుడే అన్నారు - యిది ఉద్యోగులపై ప్రేమ కాదు, రిటైర్‌మెంట్ చెల్లింపులు మరో రెండేళ్లు వాయిదా వేసేందుకే అని. అది నిజమే అనిపిస్తోంది.

ఆశావహ దృక్పథం వుండడంలో తప్పేమీ లేదు. చీకట్లో చిరుదీపం పేరే ఆశ అన్నారు. రేపు బాగుంటుందనే ఆశ లేకపోతే జీవించడం కష్టం. కానీ దురాశ పడకూడదు, ఆచరణ సాధ్యం కాని పగటి కలలు కనకూడదు. దురాశ నిరాశకు దారి తీస్తుంది. నిరాశ తట్టుకోవడం రాకపోతే ఎప్పటికీ చీకట్లోనే మగ్గుతాడు. మబ్బులు కమ్మి ఆకాశం కనబడనపుడు వెనక్కాల యింద్రధనుస్సు

వుందనుకోవచ్చు. కానీ మబ్బులు వీడుతూంటే వాటి వెనకాల ఏముందో తెలిసి జోరు తగ్గుతుంది. ఆంధ్రప్రజల విషయంలో అదే జరిగింది. రాష్ట్రం విడిపోతే హైదరాబాదు పోయినా, దానిని తలదన్నేలా తమకు రాజధాని అమరుతుందని, వికేంద్రీకరణ జరిగి, కేంద్రపు నిధుల వర్షం కురిసి, ఎక్కడ చూసినా సిరి తాండవిస్తుందని అనుకున్నారు. ఆ ఆశాభావం రియల్ఎస్టేటులో ప్రతిఫలించింది. విపరీతంగా రిజిస్ట్రేషన్లు అయ్యాయి. రాజధాని యిక్కడ వస్తుందంటే, కాదు యిక్కడ వస్తుందంటూ ప్రతీ చోటా స్థలాలు అమ్మేశారు. కాదు ఫలానా చోటే అనగానే తక్కిన చోట్ల చప్పబడింది. రాజధాని కాకపోయినా ఐఐటి వస్తుంది, పరిశ్రమలు వస్తాయి అంటూ ఆశలు చూపితే ఓ స్థాయిలోనైనా కొనుగోళ్లు జరిగాయి. ప్రత్యేక హెూదా హుళక్కి అనడం, కేంద్రం నిమ్మకు నీరెత్తినట్లు వుండడం యివి చూశాక క్రయవిక్రయాలు తగ్గుముఖం పట్టాయి. పెరిగిన భూమి రేట్లు బలం కాదు, వాపు అని అందరూ గ్రహించారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో రిజిస్ట్రేషన్ల జోరు చూసి ప్రభుత్వం బజెట్‌లో మార్చి నాటికి దానిపై రూ. 3405 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. అయితే జనవరి మూడోవారానికి 2129 కోట్లు మాత్రమే వచ్చింది. మిగిలినది రెండు నెలలు మాత్రమే. ప్రజలు ఆశలు నేలమీదే తారాడుతున్నాయి. వారికి లేనిపోని ఆశలు కల్పించడం దుర్మార్గం.

బాబు ప్రయత్నలోపం లేదు. కేంద్రాన్ని వెళ్లి అడుగుతూనే వున్నారు. సంక్రాంతికి హరిదాసులా వెళితే వాళ్లు భాండం నింపలేదు సరికదా మొండి చెయ్యి చూపించారు. బాబు పరపతి ఢిల్లీలో చెల్లుబాటు కావటం లేదని తెలిస్తే నగుబాటు అనుకుని కాబోలు, సుజనా చౌదరి కేంద్రం ఆంధ్ర రాష్ట్రానికి చేయబోతున్న సాయం యిది అంటూ జాబితా చదివారు. ఆయన సైన్సు, టెక్నాలజీ మంత్రి. ఆయన చదివిన లిస్టు వేరే శాఖలకు సంబంధించినది. ఆయన కాకుండా ఏ బిజెపి ఉత్తరాది కేంద్రమంత్రో ఆ ముక్కలు చెప్పి వుంటే కాస్త నమ్మకం, ధైర్యం కలిగేవి. వెంకయ్యనాయుడి మాటలు ఏ మాత్రం నమ్మకూడదని ప్రత్యేక హెూదా విషయంలోనే తెలిసిపోయింది. మోదీ యీయన్ని పట్టించుకుంటున్నట్టు లేదని అఖిలాంధ్రులకు అర్థమైందని సందేహం వచ్చి చౌదరిని దింపి ఆయన చేత చెప్పించి ఆంధ్రప్రజలకు మరిన్ని ఆశలు పెట్టిస్తున్నది బాబే కదా. అందుకే ఆయన విషయంలో ఆశాజీవి అనే మాటకు వేరే అర్థం స్ఫురిస్తోంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 24-25 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఇదీ ఉపముఖ్యమంత్రి స్థాయి...**

తెలంగాణ ఏర్పడితే ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, సామాజిక న్యాయం నెలకొంటాయని కలలు కన్నవారు తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి వుదంతం చూశాక నిర్ఘాంతపోతున్నారు. కెసియార్‌ను వెనకేసుకుని వచ్చే మేధావులందరూ సైలంటు అయిపోయారు. ఇక టీవీ చర్చల్లో పాల్గొనే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు 'రాజయ్యకు దండన పడిందని ఎందుకనుకుంటారు? ఆయన సేవలను ఎలా వుపయోగించుకోవాలో మా నాయకుడికి తెలియదా?' అంటూ అస్పష్టంగా మాట్లాడుతున్నారు. తర్వాతి రోజుల్లో ఆయనకు పార్టీ అధ్యక్షుడు కూడా చేస్తే చేయమను. కానీ యీ రోజు మాత్రం రాజయ్యపై సానుభూతి కురుస్తోంది. ఆయన దళితుడు కాకపోయినా యీ స్థాయి జాలి వుండేది. ఎందుకంటే రాజయ్య రాజకీయంగా కెసియార్‌పై కుట్ర పన్నలేదు. ఏనాటికైనా దళితుడు తెలంగాణకు ముఖ్యమంత్రి అవుతాడు అని తన ఆశలు హింట్ చేస్తూ ప్రసంగాలు చేయలేదు. తనపై కెసియార్ తాలూకు పత్రికలో వ్యతిరేక వార్తలు వెలువడినపుడు సంజాయిషీ చెప్పుకుందామంటే అవకాశం యివ్వలేదు. తనపై వచ్చిన ఆరోపణలపై కమిటీ వేసి నిజనిర్ధారణ చేసుకోమంటే వినలేదు. నేను తప్పు చేసి వుంటే దండించండి అంటూ సిగ్గు విడిచి లేఖ రాసి పట్టుకెళ్లినా కలవలేదు. ఆఫీసులో చప్రాసీని తీసేయాలన్నా షోకాజ్ నోటీసు యివ్వాలి. డిప్యూటీ సిఎం స్థాయి వ్యక్తికి ఓ నోటీసు లేదు, సమాచారం లేదు, తీసి పారేశారు. అంటే ఆయన పరిస్థితి ఎంత కనాకష్టంగా వుందో చూడండి. ఇంత ఘోరంగా అవమానింపబడినా రాజయ్య తిరగబడలేదు. కెసియార్ ఏసుప్రభువు, నా తండ్రి, హెూలీ ఘోస్ట్ అంటూ దండకం వల్లించాడు. ఆసుపత్రిలో ఎడ్మిట్ కావలసినంత మానసిక క్షోభ అనుభవించాడు. గుండెపోటు వచ్చి వుండదు కానీ సుగర్ 400 వరకు షూటప్ కావడంలో ఆశ్చర్యం లేదు. డాక్టర్లు వద్దంటున్నా బయటకు వచ్చేశాడు. కెసియార్‌కు చెడ్డపేరు వస్తుందన్న భయం కాబోలు! ఆవేశంలో తీసిపారేసినా రాజయ్య వినయం చూసి, మనసు కరిగి కెసియార్ ఆయన్ను పిలిపించి మాట్లాడినా కొంత డామేజి కంట్రోలు అయ్యేది. కెసియార్‌కు ఆ ధ్యాసే లేదు. ఏం చేసినా చెల్లిపోతోందన్న ధీమాలో వున్నారు.

సాధారణంగా ఎవరైనా మంత్రిని తీసేద్దామనుకున్నపుడు ముఖ్యమంత్రి పిలిచి అవసరమైతే కొన్ని ఫైళ్లు అవీ చూపించి, చెమటలు పట్టించి అప్పుడు రాజీనామా యిచ్చి గదిలోంచి వెళ్లిపో అంటారు. ఇవ్వనని మొరాయించిన వాళ్లపై మాత్రమే బర్తరఫ్ అస్త్రం ఉపయోగిస్తారు. రాజయ్య తెరాస ఉద్యమంతో మాత్రమే పైకి వచ్చిన నాయకుడు కాదు. ముందే రాజకీయాల్లో వున్నవాడు. ఇప్పుడు తన బదులు తెచ్చిన కడియం శ్రీహరిని ఎన్నికల్లో ఓడించినవాడు. కాస్త మర్యాదగా ట్రీట్ చేసి వుంటే బాగుండేది. కానీ కెసియార్ చాలా దురుసుగా, అమర్యాదాకరంగా వ్యవహరించారు. ఇంత కాఠిన్యానికి కారణం ఏమిటి? అవినీతి, అలసత్వం రెండిటిలో ఏదో ఒకటి కావాలి. స్వైన్ ఫ్లూ పట్ల అలసత్వమే దీనికి కారణం అనుకుంటే మరి వందల రైతుల ఆత్మహత్య చేసుకున్నందుకు వ్యవసాయ శాఖా మంత్రిని, ఫాస్ట్ పథకం యిప్పటికీ తేల్చనందుకు విద్యామంత్రిని, విద్యుత్ కొరతను పసిగట్టి ముందు జాగ్రత్తగా విద్యుత్ ఒప్పందాలు చేసుకోని విద్యుత్ మంత్రిని, టైమ్‌టేబుల్ ప్రకారం డిసెంబరు కల్లా చెఱువులు ఖాళీ చేయించని జలవనరుల మంత్రిని..

అందర్నీ బర్తరఫ్ చేయాలి. చేయలేదు. అంటే మరో కారణం అవినీతి అన్నమాట. అవినీతి ఆరోపణ అంటే సీరియస్సే. ఎన్నో ఆశలు కల్పించి ఏర్పరచిన కొత్త తెలంగాణలో ఆర్నెల్లలోనే అవినీతి బయటపడిందంటే అది నిరాశాజనకమే. పాతప్రభుత్వపు అలవాట్లను అధికారులు మాన్పుకోలేకపోతున్నారు అనుకుందామంటే యిప్పుడు వేటు పడింది మంత్రికి. అవినీతి వలన ప్రభుత్వానికి ఏర్పడిన నష్టాన్ని ఎలా పూడ్చారు? డబ్బు రికవరీ చేశారా? బాధితులకు పరిహారం యిచ్చారా? తెలియదు. ఏదీ బయటకు చెప్పడం లేదు. పారదర్శకత లేకపోతే ఎలా? యువకులు, మేధావులు, రచయితలు, జర్నలిస్టులు, గాయకులు, కళాకారులు అందరూ యిది తమ ప్రభుత్వం అనుకుంటున్నారు కదా వారితోనైనా యిబ్బందులు పంచుకోకపోతే ఎలా?

రాజయ్య అవినీతిపరుడే అయితే మంత్రి పదవి పీకేయడంతో సరిపెట్టకూడదు. లంచం తీసుకుంటే కుటుంబసభ్యులనైనా జైలుకి పంపుతా అన్న కెసియార్ మాట నిలబెట్టుకుని ఆయన్ను జైలుకి పంపాలి. ఎమ్మెల్యేగా తీసేయాలి, పార్టీలోంచి బర్తరఫ్ చేయాలి. లేకపోతే అవినీతిని ఓ స్థాయిలో సహిస్తున్నారన్న సంకేతం వెళుతుంది. తనకు కావలసిన వాళ్లను నియమించుకుని రాజయ్య వారి ద్వారా లంచాలు పట్టారని వార్తలు రాయిస్తున్నారు. వాళ్లను నియమించినది రాజయ్య కాదు, కెసియార్, కెటియారూ అని బిజెపి నాయకులు పేర్లతో సహా చెప్తున్నారు. రాజయ్య కోరినట్లు విచారణ జరిపిస్తే వివరాలు బయటకు వస్తాయి. అలా రావడం కెసియార్‌కు యిష్టం లేదా? అని అడుగుతున్నారు. ఇలాటి ప్రశ్నలు వస్తాయని ముందే వూహించి కాస్త దస్త్రం తయారు చేయాల్సింది. 'కొత్తగా పెట్టిన అవినీతి ఫిర్యాదు ఫోన్ నెంబరుకి రాజయ్య గురించి ఫిర్యాదులు ఎక్కువ వచ్చాయి. జనాలంతా అతను అవినీతిపరుడని నమ్ముతున్నారు అందుకనే చర్య తీసుకున్నా' అని చెప్పాల్సింది. నిజానికి జనవరి 11 నుంచి పెట్టిన అవినీతి ఆరోపణలకై టోల్‌ఫ్రీ నెంబరుకి 15 రోజుల్లో 29,275 కాల్స్ వచ్చాయి. వాటిల్లో 11486 జనరల్ ఫిర్యాదు లున్నాయి. అంటే నీళ్లు లేవని, కరంటు లేవని, రోడ్లు లేవని, ఉద్యోగాలు కావాలని, అమ్మాయిలను ఏడిపిస్తున్నారనీ.. యిలా. 1306 ఫిర్యాదులు అవినీతి గురించి వచ్చాయి. ఆ ఆరోపణలు రాజయ్య మీదే అనుకోకండి. ప్రభుత్వాధికారులు, మధ్యవర్తులు, బ్యాంకు అధికారులు, సంక్షేమపథకాల జారీ చేయడానికి సర్పంచ్‌లు – వీళ్లందరిపై కలిపి. వీరిలో సర్టిఫికెట్లకై, రేషన్ కార్డులకై లంచాలడిగారని చెప్పి మండల్ రెవెన్యూ ఆఫీసర్లపై, సివిల్ సప్లయిస్ వారిపై ఆరోపణలు ఎక్కువగా వచ్చాయి. వికలాంగుల సర్టిఫికెట్టు యిమ్మనమంటే లంచం అడిగిన వైద్య అధికారులపై కూడా వచ్చాయి. పెన్షన్లు అందలేదని వచ్చిన ఫిర్యాదులు 5906, హౌసింగ్ గురించి ఫిర్యాదులు 5906...యిలా వున్నాయి గణాంకాలు.

ఆధారాలు చూపకుండా, కారణాలు చెప్పకుండా తీసేయడం వలన రకరకాల వ్యాఖ్యానాలు వినబడుతున్నాయి. రాజయ్య దళితత్వాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తున్నారు. భట్టి విక్రమార్క మాంచి పొయెటిక్‌గా 'మేకల్ని మాత్రమే బలి యిస్తారు, పులుల్ని యివ్వరు' అన్నారు. దళితులు బలహీనులు కాబట్టి బలి అవుతున్నారన్న భావంలో! గతంలో వరంగల్ కాళోజీ యూనివర్సిటీ సందర్భంగా వేదికపై రాజయ్యను అవమానించిన తీరు యిప్పుడు అందరికీ గుర్తు వచ్చి రెండిటిని కలిపి చూస్తున్నారు. దళిత అంశం వస్తుందని తెలిసే కెసియార్ కడియం వారిని దింపారు. ఆ గుణకారభాగారాలలో ఎమ్మెల్యేలలో ఎవరూ ఫిట్‌యిన్ కాలేదేమో! కడియం ఎస్సీ కాదని టిటిడిపి వారనసాగారు. టిడిపి వారి లెక్కలే వేరు. సి.రామచంద్రయ్యగారు వారి పార్టీలో వున్నంతకాలం బిసి, వేరే పార్టీలోకి మారగానే అగ్రకులస్తుడు. అలాగే కడియం గురించి కూడా చెపుతూండవచ్చు. ఏదైనా వుంటే కోర్టుకి వెళ్లి నిరూపించాలి.

దళితుల పట్లే కెసియార్ యిలా వ్యవహరిస్తున్నారని అనుకుంటున్నారు కానీ మరి కొన్ని రోజుల్లో ఓసి, బిసిల పట్ల యిలాగే ప్రవర్తించినా ఆశ్చర్యపడనక్కరలేదు. కెసియార్‌లో తొలినాళ్ల ఎన్టీయార్ తరహా కనబడుతోంది. ప్రజలు తన వెంట వున్నారు, తనను నమ్ముకుని ఓట్లేశారు, వీళ్లు వుంటే ఎంత, పోతే ఎంత, ఏం చేసినా పడి వుంటారు అనే ఆయన అనుకున్నాడు. అందుకే నాదెండ్ల కుట్ర జరిపినపుడు అనేకమంది ఎమ్మెల్యేలు నాదెండ్లతో చేతులు కలిపారు. కుట్రను కాంగ్రెసు వారు సరిగ్గా హేండిల్ చేయకపోవడం వలన, మీడియా, ప్రజలు ఎన్టీయార్ వెంట నిలబడి పోరాడడం వలన నాదెండ్ల ఫెయిలయ్యారు. ఆ పొరపాట్లు సరిదిద్దుకుని యింకో పదేళ్లు పోయాక చంద్రబాబు విజయవంతంగా కుట్ర చేయగలిగారు. ఆ కుట్ర సఫలం కావడానికి కారణం ఎన్టీయార్ వైఖరే. ఎమ్మెల్యేకు కూడా ఒక స్థాయి వుంటుంది, కొంత బలం వుంటుంది, నచ్చినా నచ్చకపోయినా అతగాడు చెప్పినది వినాలి, లేదా విన్నట్టు నటించాలి అనే మౌలిక సూత్రాలను ఎన్టీయార్ పట్టించుకోలేదు. వీళ్లంతా గడ్డిపోచలు, నేను నిలబెడితేనే నిలబడ్డారు అనుకుని అహంకరించారు. అప్పుడు కెసియార్ వంటి గడ్డిపోచలే వెంటిగా ఏర్పడి ఆ మదగజాన్ని బంధించి నేలకు పడగొట్టాయి. ఇప్పుడు కెసియార్ ఎమ్మెల్యేలకు యిస్తున్న గౌరవం యింతకు మించి లేదు. మరి యీ చలిచీమలకు ఎప్పుడు ధైర్యం వస్తుందో తెలియదు.

ఈరోజు కెసియార్ దేమీ పొరపాటు లేదు అంటున్న రాజయ్యే అప్పుడు ప్లేటు ఫిరాయిస్తారు. 'పేదలకోసం వూరి మధ్యలో కట్టిన ఛాతీ ఆసుపత్రి తరలింపును అడ్డుకోబోయాను. దాన్ని రియల్ ఎస్టేటుకి అప్పగిద్దామనుకున్న కెసియార్ నా అడ్డు తొలగించుకున్నారు' వంటి కారణం ఏదో చెప్పి సింపతీ సంపాదిస్తారు. రాజయ్యకు అంత సీను లేదు, ఆయన చెప్పినా ఎవరూ నమ్మరు అని యీరోజు అనిపిస్తుంది. భవిష్యత్తు ఎలా వుంటుందో ఎవరికి తెలుసు? విజయరామారావుగారికి మంత్రి పదవి యిచ్చి అదే కులానికి చెందిన కెసియార్‌కు డిప్యూటీ స్పీకరు పదవితో సరిపెడదామనుకున్నపుడు బాబుకు కెసియార్ లైట్‌వెయిట్‌గానే అనిపించారు – ఎంత పాత కొలీగ్ అయినా, ఎంత మంచి స్ట్రాటజిస్టు అయినా! పుష్కరం తిరిగేసరికి కెసియార్ బాబుతో సమానస్థాయిలో కూర్చుంటున్నారు. రాజయ్య ఆ లెవెల్‌కు వెళతారని అనుకోవడం టూ మచ్ కానీ ఆయన కథ యిక్కడితో ముగిసిపోయిందని అనుకుంటే మాత్రం టూ

**జనవరి 23-25 వీక్లీకై** **ఎమ్బీయస్ : కిరణ్ బేదీ రాజకీయ పోరాటం**

కిరణ్ బేదీ దేశమంతా తెలిసిన పేరు. ప్రభుత్వ వ్యవస్థలో వుంటూనే రాజకీయ నాయకులకు వ్యతిరేకంగా పోరాడుతూ వచ్చిన పోలీసు ఆఫీసరు. ఈనాడు ఆమె రాజకీయాల్లోకి దిగారు. రాజకీయ నాయకులతో చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతూ, వారిని బుజ్జగించవలసిన అవసరం పడింది. ఇటీవలి కాలంలో బిజెపి అసెంబ్లీ ఎన్నికలలో ముఖ్యమంత్రి అభ్యర్థిని ముందుగా ప్రకటించకుండానే మోదీ ఫోటో పెట్టుకునే రంగంలోకి దిగుతోంది. ఢిల్లీ ఎన్నికలలో మాత్రం వ్యూహం మార్చింది. దీనికి కారణం రామలీలా మైదాన్‌లో మోదీ బహిరంగ సభకు పెద్దగా స్పందన లేకపోవడం. ఆ సభ జరిగిన కొన్ని గంటల్లోనే మోదీ, అమిత్ షా, అరుణ్ జైట్లీ సమావేశమై ఢిల్లీ సీను వేరేలా వుందని గ్రహించారు. అక్కడ విద్యావంతులు ఎక్కువ. పూర్తిగా నగరవాతావరణం. రాజకీయ చైతన్యం ఎక్కువ. మోదీ ప్రధానియే కానీ తమ ముఖ్యమంత్రి కాడని వారందరికీ తెలుసు. ప్రచారం చేసి మోదీ తప్పుకుంటాడని ఆ తర్వాత బిజెపి నాయకుడు ఎవర్నో ముఖ్యమంత్రి చేస్తారని వాళ్లు అర్థం చేసుకున్నారు.

ఇలాటి పరిస్థితుల్లో  ఆప్ నుంచి ముఖ్యమంత్రి అభ్యర్థిగా నిలుస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌కు దీటైన అభ్యర్థిని నిర్ణయించి ఆప్‌ను ఢీకొనాల్సిందే అని మోదీ నిర్ణయం తీసుకున్నారు. అయితే బిజెపి నుంచి వారికి ఎవరూ అలాటి అభ్యర్థి కనబడలేదు. హర్షవర్ధన్ మంచి అభ్యర్థే కానీ గతంలో ఆయన్ని ముందు పెట్టుకుని వెళ్లినా తగినన్ని సీట్లు రాక అధికారం ఆప్‌కు అప్పగించవలసి వచ్చింది. ఇక ఎవరో ఒకర్ని దిగుమతి చేసుకోవాలి అనుకున్నారు. కిరణ్ బేదీ పేరు పరిగణనలోకి వచ్చింది. అరుణ్ జైట్లీ కిరణ్‌కు ఫోన్ చేసి మీ అభిప్రాయం ఏమిటి? అని అడిగాడు. ఆమె సరేనంది. వెంటనే అమృతసర్‌లో వున్న తన భర్త బ్రిజ్ బేదీకి ఫోన్ చేసి 65 ఏళ్ల వయసులో విధి నన్ను రాజకీయాల్లోకి నడిపిస్తోంది అని చెప్పింది.

ఆమె పేరు బయటకు రాగానే ఢిల్లీ బిజెపి నాయకుల్లో కలకలం బయలుదేరింది. ఢిల్లీలో బిజెపి ఎన్నో ఏళ్లగా పాతుకుని పోయి వుంది. 1960లలోనే ఢిల్లీ కార్పోరేషన్ ఎన్నికలలో బిజెపి గెలిచింది. అప్పటినుంచి అనేకమంది కార్యకర్తలు, నాయకులు తయారయ్యారు. పదవుల కోసం పోట్లాడుకున్నారు. ఒకరి నొకరు కూలదోసుకున్నారు. ఈ గొడవల వలననే బిజెపి ముఖ్యమంత్రుల్ని మార్చవలసి వచ్చింది. కాంగ్రెసుకి అధికారం అప్పగించవలసి వచ్చింది. హర్షవర్ధన్‌కు కేంద్రమంత్రి పదవి దక్కింది కాబట్టి, తమలో ఎవరో ఒకరికి ముఖ్యమంత్రి ఛాన్సు వస్తుంది అనుకుంటూ వుండగా తామెవ్వరికీ క్లీన్ యిమేజి లేదని చాటి చెప్పినట్లు అర్జంటుగా కిరణ్‌ను దిగుమతి చేసుకోవడం వాళ్లను మండించింది. కిరణ్‌కు ఎదురు తిరగ నారంభించారు. ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు సతీశ్ ఉపాధ్యాయ తన అసంతృప్తిని ఆమె నామినేషన్ నాడే వెళ్లగక్కాడు. ఓ పట్టాన అక్కడికి వెళ్లలేదు. అమిత్ షా గట్టిగా చెప్పవలసి వచ్చింది. ఢిల్లీ బిజెపి ఎంపీలను కిరణ్ బేదీ టీకి పిలిచి వారి సహాయాన్ని అభ్యర్థించడం రాష్ట్రస్థాయి నాయకులకు నచ్చలేదు.

ఈ అసంతృప్తిని అమిత్ షా ముందే వూహించి ఆమెను గెలిపించే బాధ్యతను డా॥ హర్షవర్ధన్‌కు అప్పగించారు. నిజానికి కేంద్రమంత్రిగా వుండడం కంటె ఢిల్లీ ముఖ్యమంత్రిగా వుండడం ఆయనకు యిష్టం. తనకు గాని, తన అనుచరుడికి గాని ఛాన్సిస్తారేమో ననుకుంటే కిరణ్‌ను తెచ్చిపెట్టి ఆమెకు నీ నియోజకవర్గమైన కృష్ణనగర్ యిచ్చి విజయం చేకూర్చు అని పనిపెట్టారు. కిరణ్‌కు యిదంతా యిబ్బందిగానే వుంది. తన నియోజకవర్గంలోని కార్యకర్తలను కలవడానికి ఏర్పాటు చేసిన మొదటి సమావేశంలో ఆమె వేదిక ఎక్కాక, హర్షవర్ధన్ జిందాబాద్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఎందుకంటే ఆయన 40 ఏళ్లగా ఆ నియోజకవర్గానికి సేవ చేశాడు. 5 అసెంబ్లీ ఎన్నికలలో గెలిచాడు. కిరణ్‌కు పరిస్థితి అర్థమైంది. హర్షవర్ధన్ పేరు చెప్పుకోకపోతే తనను ఎవరూ చూడరని గ్రహించి 'హర్షవర్ధన్‌గారు మంచి ఇఎన్‌టి సర్జన్, నేను తీహార్ జైలుకి యిన్‌చార్జిగా వుండగా వచ్చి మెడికల్ క్యాంపులు నిర్వహించారు. నా చెవులు కూడా పరీక్షించారు' అంటూ ఏదో మాట్లాడింది. ఈ నియోజకవర్గం ఎప్పటికీ ఆయనదే, నేను ఒట్టి అతిథిని మాత్రమే అని చెప్పుకుంది.

ఇదంతా ఆప్‌కు వేడుకగా వుంది. అరవింద్ ఆమెను తనతో చర్చకు రమ్మనమని సవాల్‌పై సవాల్ విసురుతున్నాడు. ఇప్పటిదాకా 'ప్రతీదీ చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలి, ఎన్నికలలో ప్రత్యర్థులు అమెరికాలోలా చర్చావేదికలో తలపడాలి' అని చెప్తూ వచ్చిన కిరణ్ యిప్పుడు ప్లేటు ఫిరాయించింది. 'అరవింద్ యీజ్ కీన్ ఆన్ డిబేట్, ఐ యామ్ కీన్ ఆన్ డెలివరీ (వాగ్దానాలు చెల్లించడం)' అని చెప్పుకుంటోంది. 'ఒక్క రెండు గంటలు చాలు. రాజకీయాల్లోకి రావచ్చు కానీ బిజెపి తప్ప మీకు మరే పార్టీ దొరకలేదా అని అడుగుతాను. మీ ట్విట్టర్ ఎక్కవుంటులో నన్ను ఎందుకు బ్లాక్ చేసేశారు? అని అడుగుతాను' అంటున్నాడు అరవింద్. అరవింద్ అరాచకవాది అయితే కిరణ్ ప్రచారప్రీతితో హద్దులు దాటి అధికారాన్ని వినియోగించిన నియంత అని ప్రతీతి. ఢిల్లీ లాయర్లు సమ్మె చేసినపుడు ఆమె వాళ్లను చావగొట్టించింది. ఆ సంఘటనను వాళ్లు యింకా మర్చిపోలేదు. ఆమె నామినేషన్ దాఖలు చేసిన రోజున ఆరు జిల్లా కోర్టుల్లోని లాయర్లు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. లాఠీ ఝుళిపించడం తప్ప ఆమెకు ఎడ్మినిస్ట్రేషన్ తెలియదని వారి వాదన. మొన్నటిదాకా కాంగ్రెసుతో బాటు బిజెపిని కూడా తూర్పారబట్టిన కిరణ్ సడన్‌గా మోదీని ఆకాశానికి ఎత్తేసి, ఆయన విధానాలు నచ్చే బిజెపిలో చేరాననడం ఢిల్లీ వాసులు ఎలా అర్థం చేసుకుంటారో, అసలు ఢిల్లీ బిజెపి నాయకులు కిరణ్‌కు మనస్ఫూర్తిగా

సహకరిస్తారో లేదో చూడాలి. సర్వేలు చూడబోతే అరవింద్‌దే పైచేయి అంటున్నాయి. ముస్లిం‌లు, వెనకబడిన వర్గాలు కిరణ్‌ను నమ్మటం లేదట. మధ్యతరగతి వర్గాలే కిరణ్‌ను గట్టెక్కించాలి. అన్నా హజారే వెంట వుండి లోక్‌పాల్ బిల్లుకై అంతటి ఆందోళన చేసిన కిరణ్ ఆ బిల్లుకు ఢిల్లీ అసెంబ్లీలో మద్దతు యివ్వని బిజెపిని యిప్పుడు వెనక వేసుకుని రావడం వాళ్లు జీర్ణించుకుంటారో లేదో తెలియదు. పైగా రిపబ్లిక్ దినోత్సవ పేరేడ్‌కు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్‌ను పిలవకుండా ఏ పదవీ లేని కిరణ్ బేదీని ఆహ్వానించి ముందు వరుసలో కూర్చోబెట్టడం కూడా బిజెపి ఓవరాక్షన్‌కు ఉదాహరణగా ఫీలవుతున్నారు.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## ఎమ్బీయస్ : రీమేకుల బోనీ కపూర్

బోనీ కపూర్ అనగానే శ్రీదేవి భర్తగా అంటాం తెలుగువాళ్లం. శ్రీదేవి సినిమారంగంలోకి రావడానికి ముందు నుంచే అతని కుటుంబం సినిమాల్లో వుంది. ఇటీవలే గుణశేఖర్ ''ఒక్కడు'' సినిమాను ''తేవర్''ను పునర్నిర్మించి మిశ్రమ ఫలితాలను రుచి చూస్తున్న బోనీ కెరియర్ రీమేక్స్‌తోనే ప్రారంభమైంది. అతని తండ్రి సురేందర్ కపూర్ షమ్మీ కపూర్, అతని భార్య గీతా బాలికి మేనేజర్‌గా వుండేవాడు. పృథ్వీరాజ్ కపూర్ కుటుంబంలాగే వాళ్లదీ పెషావరే. బొంబాయి చిత్రసీమలోకి వచ్చిపడ్డారు. బోనీ తల్లి వంటలు బాగా చేసేవారట. అవి తినడానికి రాజ్ కపూర్, షమ్మీ కపూర్, ధర్మేంద్ర అందరూ వస్తూండేవారు. వారి ప్రోత్సాహంతో సురేందర్ నిర్మాతగా మారి సినిమాలు తీశాడు. ''పోంగా పండిట్'' సినిమాలో రణధీర్ కపూర్‌ను హీరోగా పెట్టి తీశాడు. కొన్ని సినిమాలు ఆడినా కొన్ని ఆడలేదు. బోనీ యువకుడయ్యేసరికి సురేందర్ నిర్మాతగా రిషి కపూర్ హీరోగా ''ఫూల్ ఖిలే హైఁ గుల్షన్ గుల్షన్'' (1978) సినిమా తీస్తున్నాడు. డైరక్టరు కావాలన్న లక్ష్యంతో శక్తి సామంతా వద్ద తర్ఫీదు పొందిన బోనీ తండ్రి సినిమా నిర్మాణంలో పాలు పంచుకున్నాడు. సినిమా తీస్తూండగానే డైరక్టర్ సికందర్ ఖన్నా చనిపోయాడు. కొత్త డైరక్టర్ సహాయంతో సినిమా పూర్తి చేశారు. సినిమాకు పేరు వచ్చింది కానీ డబ్బు రాలేదు. కుటుంబం చిక్కుల్లో పడింది. ఇక సొంతంగా డైరక్టరు అయ్యే ఆశ వదిలేసి తండ్రి స్థానంలో చిత్రనిర్మాణం చేపడితే మంచిదనుకున్నాడు బోనీ. అప్పుడు ఉత్తరాది సినిమాలను, దక్షిణాది సినిమాలను బేరీజు వేసి చూశాడు.

బొంబాయిలో పెద్ద ప్రొడ్యూసర్లందరూ స్వయంగా డైరక్టర్లే. రాజ్ కపూర్, మనోజ్ కుమార్, దేవ్ ఆనంద్ వంటి వారైతే స్వయంగా హీరోలు కూడా. దీనితో సినిమాపై వ్యామోహం పెంచుకుని అవసరానికి మించి ఖర్చు పెట్టి దెబ్బ తింటున్నారు. అదే హిందీ సినిమాలు తీసే ఎవిఎం, జెమిని, ప్రసాద్ ప్రొడక్షన్స్, విజయా వంటి దక్షిణాది నిర్మాతలు దర్శకత్వం జోలికి పోకుండా నిర్మాణంపైనే దృష్టి పెట్టి, ఖర్చుని నియంత్రించుకుంటూ తక్కువ బజెట్‌లో సినిమా తీసి 80-90% విజయం సాధిస్తున్నారు. పైగా కథల ఎంపికలో వాళ్లు రీమేక్స్‌ను ఎక్కువగా నమ్ముకుంటున్నారు. దక్షిణాది భాషల్లో ఒక భాషలో హిట్ అయినదాన్ని మరో దక్షిణాది భాషలో తీస్తూ, బాగా నమ్మకం కుదిరితే హిందీలో తీస్తూ సక్సెస్ గ్యారంటీ పెంచుకుంటున్నారు. తన తండ్రి సురేందర్ తీసిన సినిమాల్లో ఆఖరి హిట్ ''షెహజాదా'' (1972) తమిళ దర్శకుడు కె. శంకర్ దర్శకత్వంలో తీసిన తమిళ సినిమా రీమేకే అని బోనీకి గుర్తు వచ్చింది. స్వతంత్రంగా సినిమాలు తీస్తే రిస్కే అని గ్రహించాక 1979లో మద్రాసుకి వచ్చి చేరాడు. నెల్లాళ్లు మకాం పెట్టి ఏకధాటీగా 40 తెలుగు సినిమాలు చూశాడు. 29 వ రోజున ''మనవూరి పాండవులు'' చూశాడు. తెగ నచ్చేసింది. వివరాలు అడిగితే ''దీనికి మూలం కన్నడ సినిమా వుంది. బెంగుళూరు వెళ్లి హక్కులు తీసుకో'' అని సలహా చెప్పారు.

బోనీ కార్యకలాపాలపై నిఘా పెట్టిన నిర్మాత-దర్శకుడు మోహన్ సెహగల్, నిర్మాతగా మారిన హేమమాలిని తల్లి జయా చక్రవర్తి యితని కంటె ముందు బెంగుళూరు చేరి హక్కులు కొనేద్దామనుకున్నారు. వాళ్ల కంటె ముందు చేరాలి, విమానం టిక్కెట్టు దొరకలేదు, రైలూ దొరకలేదు. బస్సెక్కి, సగం దూరం నిలబడి ప్రయాణం చేసి బెంగుళూరు చేరాడు. కన్నడ సినిమా చూశాక తెలుగు సినిమాయే బాగుందనిపించింది. (కన్నడ మూలంలో కృష్ణంరాజు పాత్ర లేదు). బాపు-రమణలు యింకా బాగా నచ్చేశారు. బాపు దర్శకత్వంలోనే ''హమ్ పాంచ్'' (1981) తీశాడు. హిట్టయింది. ఇక అప్పణ్నుంచి రీమేకుల్ని నమ్ముకున్నాడు. భాగ్యరాజా దర్శకత్వం వహించిన ''అంద ఏళ్ నాటకళ్''ను తెలుగులో బాపు ''రాధాకళ్యాణం''గా తీయగా, బోనీ దాన్ని హిందీలో బాపు దర్శకత్వంలోనే ''వో సాత్ దిన్'' (1983) తీశాడు. తన తమ్ముడు అనిల్ కపూర్నే హీరోగా పెట్టుకుని ఖర్చు మిగుల్చుకున్నాడు. ఓ సారి షబానా ఆజ్మీతో కలిసి శేఖర్ కపూర్‌ను చూడడానికి వెళితే అతను ఆమెకు ''మాసూమ్'' సినిమాలో సీన్లు వివరించాడు. అతని క్రియేటివిటీ చూసి ముచ్చటపడిన బోనీ ''నా తదుపరి సినిమా డైరక్షన్ నీదే. జీతం 75 వేలు. ఇదిగో 10 వేలు అడ్వాన్సు'' అని చేతిలో పెట్టాడు. అలా తయారైనదే ''మిస్టర్ ఇండియా'' (1987)! తీయడంలో చాలా లేటైనా సూపర్ హిట్టయ్యి బోనీని పెద్ద నిర్మాతగా నిలబెట్టింది. ఆ సినిమా యిచ్చిన వూపుతో ''రూప్‌కీ రాణీ చోరోంకా రాజా'' (1993) తీస్తే అది ఘోరంగా ఫ్లాపయింది. మధ్యలో రామ్ గోపాల్ వర్మతో సినిమాలు తీసి మిగుల్చుకున్నదీ పోయింది. మళ్లీ రీమేకులను నమ్ముకుని తెలుగు సినిమా ''అసెంబ్లీ రౌడీ'' ని ''లోఫర్'' (1996)గా, ''శుభలగ్నం''ను ''జుదాయీ'' (1997) గా తీసి నిలదొక్కుకున్నాడు. అదే అలవాటుతో యిప్పుడు ''ఒక్కడు''ను రీమేక్ చేశాడు. కలక్షన్లు గొప్పగా లేకపోయినా సొంత కొడుకు అర్జున్ కపూర్‌ని హీరోగా పెట్టి తీశాడు కాబట్టి నష్టపోడని అంటున్నారు.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**జనవరి 27 వీక్లీకై** **ఎమ్బీయస్ : సెన్సార్ బోర్డు క్షాళన**

"బిజెపికు డేరా అండ" అనే పేరుతో రాసిన వ్యాసంలో కొన్ని వాక్యాలు గుర్తుకు తెచ్చుకుంటే సెన్సారు బోర్డు విషయం బోధపడుతుంది – 'డేరా ప్రభావం ఉత్తరభారతంలోని 60 లక్షల మందిపై వుందంటారు. వాళ్లే ఓటర్లు కూడా కాబట్టి పంజాబ్, హరియాణా రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయిలో డేరా వుంది. పంజాబ్‌లో 2007లో జరిగిన ఎసెంబ్లీ ఎన్నికలలో రామరహీమ్ కాంగ్రెస్ ముఖ్యమంత్రి అభ్యర్థి కెప్టెన్ అమరీందర్ సింగ్‌కు మద్దతు యిచ్చాడు. మొత్తం మీద కాంగ్రెసు ఓడిపోయినా డేరా ప్రభావం వున్న చోట్ల మాత్రం సీట్లు బాగానే గెలిచింది. ఇప్పుడు జింద్, ఫతేబాద్, కైతాల్, హిస్సార్, సిర్సా, తోహణా జిల్లాలలో డేరా అనుయాయులు వున్న విషయం గ్రహించిన మోదీ–అమిత్ షా రామ్‌రహీమ్‌ను మచ్చిక చేసుకున్నారు. అతనిపై హత్య, బలాత్కారం వంటి కేసులున్నా 'పరిశుభ్రతకై డేరా చేస్తున్న కృషి ప్రశంసనీయం' అంటూ మోదీ సిర్సా బహిరంగసభలో మెచ్చుకున్నాడు. రాష్ట్రంలో బిజెపి ఎన్నికల ప్రచారానికి యిన్‌చార్జిగా వున్న కైలాష్ విజయవర్గీయ 40 మంది బిజెపి అభ్యర్థులను రామ్‌రహీమ్ వద్దకు తీసుకెళ్లి ఆశీర్వాదం తీసుకున్నాడు. డేరా అనుయాయులు ఎన్నికలలో బిజెపికి ఓట్లేయడమే కాక, పోలింగ్ ఏజంట్లుగా పనిచేశారు. దాంతో ఆ జిల్లాలలో బిజెపి గెలుపు తథ్యమైంది. ఇప్పుడు రామ్‌రహీమ్ కార్యకలాపాలు మరింతగా విస్తరించడమే కాక, డేరాపై నిఘా తగ్గిపోవచ్చు. ఇంతటి భారీ సామ్రాజ్యంలో అవకతవకలు వుండక మానవు. ఇప్పటివరకు రామ్‌రహీమ్ అనుయాయులుగా వున్న అన్ని పార్టీల రాజకీయ నాయకులు (నవీన్ జిందాల్, హూడా, ప్రకాశ్ సింగ్ బాదల్, ప్రకాశ్ జావడేకర్, అరుణ్ జైట్లీ, వసుంధరా రాజే వారిలో కొందరు) కాపాడుతూ వచ్చారు. ఇప్పుడు సాక్షాత్తూ ప్రధానితో నేరుగా సంబంధం పెట్టుకుంటే చిక్కుల్లో పడకుండా వుండవచ్చని బాబా ఆలోచన. అతని అనుయాయులు వున్న తక్కిన రాష్ట్రాలలో కూడా బిజెపికి అతని సాయం అవసరపడుతుంది కదాని మోదీ–అమిత్ షా ఆలోచన!'

అదే వ్యాసంలో బాబా తనను తాను దేవుడిగా చిత్రీకరించుకుంటూ సినిమా తీయబోతున్నాడని కూడా రాశాను. ఆ సినిమా తయారైంది. పేరు "ఎంఎస్‌జిః మెస్సెంజర్ ఆఫ్ గాడ్" ఆ సినిమాలో బాబాకు మానవాతీత శక్తులున్నట్లు చిత్రీకరించారు. భక్తులందరూ అతన్ని 'భగవాన్' అని సంబోధిస్తూ వుంటారు. భజన వస్తూ వుంటే బాబా తన పృష్టాన్ని వూపుతూ వుంటాడట. ఆ సినిమా సెన్సారు సర్టిఫికెట్టుకై వచ్చినపుడు నందినీ సర్దేశాయి అనే సోషియాలజిస్టు ఏడుగురు యితర సెన్సార్ సభ్యులతో కలిసి సినిమా చూసి జీవించి వున్న వ్యక్తిపై యిలాటి సినిమా విడుదలైతే ప్రజల్లో మూఢనమ్మకాలు పెంచుతుందని అభిప్రాయపడి సర్టిఫికెట్టు ఏకగ్రీవంగా నిరాకరించారు. సహజంగా బాబా సెన్సారు బోర్డు కంటె పైనున్న ఫిల్మ్ సర్టిఫికెట్ ఎప్పిలేట్ ట్రైబ్యునల్‌కు అప్లయి చేసుకున్నారు. ట్రైబ్యునల్ సభ్యులు కూడా సినిమా చూసి, ఎందుకు తిరస్కరించారో బోర్డు సభ్యులను అడిగి తెలుసుకుని, తమలో తాము సంప్రదించుకుని బోర్డు నిర్ణయాన్ని తిరగతోడడానికి సాధారణంగా 15–20 రోజులు పడుతుంది. అయితే యీ సినిమా విషయంలో 24 గంటలు తిరక్కుండా ట్రైబ్యునల్ ఆ సినిమాను క్లియర్ చేసింది. ట్రైబ్యునల్ అసాధారణ చర్యకు సెన్సారు బోర్డు నిర్ఘాంతపోయింది. బోర్డు చైర్మన్ లీలా శామ్‌సన్ యీ అవకాశాన్ని తీసుకుని రాజీనామా చేసింది. ఆమె పదవీకాలం ఏడాది క్రితమే ముగిసింది. తన కొనసాగింపు కష్టమని ఆమెకు తెలుసు.

లీలా శామ్‌సన్ కళాక్షేత్ర నుంచి వచ్చారు. ఆవిడ వచ్చాక కళాక్షేత్రలో భరతనాట్యానికి, హిందూమతానికి సంబంధం లేదన్న వాదన మొదలుపెట్టి భరతనాట్య ప్రదర్శనలలో మార్పులు చేశారు. కళాక్షేత్రలో వున్న విగ్రహాలు అలంకారానికి మాత్రమేనని, వాటిని పూజించనక్కరలేదని నియమాలు పెట్టసాగారు. తరతరాల విధానాలను యిలా మార్చడం పొరపాటని ఎందరు చెప్పినా వినలేదు. ఇలాటి వ్యక్తి పద్ధతి కళాభిమానులకే బాధాకరంగా వుంటుంది. ఇక బిజెపికి ఎలా వుంటుందో వూహించవచ్చు. పైగా ఆమె సోనియాకు దగ్గర మనిషి. ప్రియాంకా వాద్రాకు భరతనాట్యం గురువు. మోదీ రాగానే ఆమె తన రోజులు లెక్కపెట్టుకోసాగింది. ఇప్పుడు డేరా బాబా సినిమా క్లియర్ చేయడంలో బిజెపి ప్రభుత్వం చేసిన అత్యుత్సాహాన్ని సాకుగా చూపి వెంటనే రాజీనామా చేసింది. ఆమెతో బాటు తక్కిన 12 మంది సెన్సారు బోర్డు సభ్యులు కూడా మూకుమ్మడిగా రాజీనామాలు పంపేశారు. లీలా శాంసన్ సంగతి సరే, తక్కినవాళ్లు కూడా యిలా రియాక్టయ్యేరేమిటని బిజెపి ప్రభుత్వం పునరాలోచించలేదు. తమాయించుకోలేదు. వదిలారు, హమ్మయ్య అనుకుని వెంటనే సెన్సారుబోర్డును తన సభ్యులతో నింపి పారేసింది.

పార్లమెంటు ఎన్నికలలో "హర్ ఘర్ మోదీ" అనే ప్రచారచిత్రాన్ని తీసిన బిజెపి సమర్థకుడు పహలాజ్ నిహ్లానీని చైర్మన్ చేసింది. 2013లో ఎడిఎంకె వదిలిపెట్టి బిజెపిలో చేరిన తమిళ హాస్యనటుడు ఎస్.వి.శేఖర్‌ను, బెంగాలీ సినీనటుడు, బిజెపి సభ్యుడు అయిన జార్జి బేకర్‌ను, బిజెపి జాతీయ సెక్రటరీ, నటి వాణీ త్రిపాఠీ టిక్కూను, మోదీ సమర్థకుడైన సినీదర్శకుడు అశోక్ పండిట్‌ను సెన్సారు బోర్డులోకి తీసుకున్నారు. వారితో బాటు అనేక పార్టీలూ మారి చివరకు బిజెపిలో చేరిన తెలుగు నటి, దర్శకురాలు జీవితా రాజశేఖర్‌ను కూడా! తమకు కావలసిన వాళ్లకు యిలాటి పదవులు యివ్వడం ఎప్పుడూ జరుగుతూనే వుంటుంది. కానీ ఆ నియామకాలకు లింకులు వెతికితే తప్ప దొరకవు. ఇప్పుడు అలాటి మొహమాటాలు పోయాయి. నిస్సిగ్గుగా తమవాళ్లను పట్టుకుని వచ్చి నియమించేసుకుంటున్నారు. ఈ ఉదంతం ద్వారా సెల్ఫ్ స్టయిల్డ్ బాబాలకు ఒక సందేశం వెళుతోంది. బిజెపిని మచ్చిక చేసుకోండి,

మీ కార్యకలాపాలకు ప్రభుత్వం అండ వుంటుంది. ఇంతకీ సినిమా గురించి చెప్పాలంటే – విడుదల కాకుండానే యీ సినిమా ప్రదర్శనను పంజాబ్ ప్రభుత్వం నిలిపివేసింది. హరియాణాలో శిఖ్కులు నిరసనలు తెలుపుతున్నారు. నిషేధంపై బాబా అనుచరులు కోర్టుకి వెళ్లారు. ఫిబ్రవరి 4 న హియరింగ్. ఏది ఏమైనా ఫిబ్రవరి 13 న సినిమా రిలీజవుతుందని బాబా చెప్తున్నాడు. ఎక్కడ ఏ ఏర్పాట్లు చేసుకున్నాడో ఏమో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

**2015 జనవరి 28** **ఎమ్బీయస్ : విబి రాజేంద్రప్రసాద్**

విబి రాజేంద్రప్రసాద్‌గారు వెళ్లిపోయారు. సినీ నిర్మాత–దర్శకుడిగా ఆయన సాధించిన విజయాలు ఒక యెత్తు – ఫిలింనగర్‌లో ఆయన ఛైర్మన్‌గా ఉండి దగ్గరుంచి కట్టించిన దైవసన్నిధానం అనే టెంపుల్ కాంప్లెక్స్ యింకో ఎత్తు. అక్కడి గుళ్లన్నీ శుభ్రంగా, ఈస్తటిక్‌గా ఉంటాయి. మేన్‌టెనెన్స్ అద్భుతంగా వుంటుంది. రోజూ సాయంత్రం ఆయన అక్కడే వుండేవారు. చూడ్డానికి ఓ స్వామీజీలా కనబడుతూ, సాధారణ వ్యక్తిలా గుడి నిర్వహణ చూసుకుంటూ వుండేవారు. ఆయన్ని చూస్తే! ఒకప్పుడు సినిమాలు తీసిన స్టార్ ప్రొడ్యూసర్, డైరక్టరు ఈయనేనా? అన్న సందేహం, ఆశ్చర్యం లిగేవి. మేం ఆ గుడికి వెళుతూ వుంటాం కాబట్టి ఆయన్ని చూస్తూండేవాణ్ని – ఏదైనా సమస్య వస్తే వెళ్లి మాట్లాడేవాణ్ని. ''ఇదీ అసలు కథ'' కార్యక్రమం చేసేటప్పుడు మిత్రులు ఎస్.వి.రామారావుగారు ఫోన్ చేసి చెపితే ఆయన ఆ యా కార్యక్రమాలు చూసేవారు. నేను మళ్లీసారి గుడికి వెళ్లినపుడు బాగున్నాయని మెచ్చుకునేవారు.

జగపతి ఆర్ట్ పిక్చర్స్ అంటేనే మంచిపాటలకు చిరునామా. ఆయన సినిమాల్లో పాటలు ఎంత హిట్ అంటే ఆ పాటలన్నీ గుదిగుచ్చి 'చిటపట చినుకులు' అనే సినిమా లు తీస్తే అవీ హిట్టే! ఆయన అన్నీ సాంఘికాలే తీశారు. తెలుగులో 26 సినిమాలు, తమిళంలో 3, హిందీలో 3 సినిమాలు తీసిన హైఫై నిర్మాత ఆయన! నిర్మాత మాత్రమే కాదు, దర్శకుడు కూడా. ఆయన దర్శకుడు కావడం విచిత్రంగా జరిగింది. అంటే నిర్మాత కావడం సహజంగా అయిందని కాదు. అసలాయన హీరో అవుదామని ఫిలింఫీల్డుకి వచ్చారు. నిర్మాత అయ్యారు. కానీ ఆయన కల ఆయన కుమారుడి ద్వారా సాకారం అయింది. ప్రముఖ హీరో జగపతిబాబు ఆయన మూడో కుమారుడు.

రాజేంద్రప్రసాద్‌గారంత పెద్దాయనకు ఇంత స్టయిలిష్ నేమ్ ఏమిటా అనుకుంటున్నారా? అప్పటి పద్ధతి ప్రకారం సత్యనారాయణ అనో సుబ్బారావు అనో వెంకటేశ్వరరావు అనో పేర్లు పెట్టుకునే పీరియడ్‌లో ఈయనకు రాజేంద్రప్రసాద్ అని పేరు పెట్టడానికి ఓ కారణం వుంది. రాజేంద్రప్రసాద్ గారి తాతగారు ఓ జమీందారు. జమీందారైనా కాంగ్రెసు పార్టీ అభిమాని. అందుకని మనుమడికి స్వాతంత్ర్య యోధుడు బాబూ రాజేంద్రప్రసాద్ పేరు పెట్టించారు. రాజేంద్రప్రసాద్ గారి నాన్నగారికి ఆ పేరు యిష్టం లేదు. ఎందుకంటే ఆయన జస్టిస్‌పార్టీ అభిమాని. తండ్రీ, తాతల మధ్య కొన్నాళ్లు వాదోపవాదాలు జరిగి చివరకు పెద్దాయన మాట నెగ్గింది.

రాజేంద్రప్రసాద్ తండ్రిగారి పేరు జగపతిరావు గారు. ఆ పేరే ఈయన తన ఫిలిం నిర్మాణసంస్థకు, తన కుమారుడికి పెట్టుకున్నారు – పెద్దకుమారుడికి ఈయన తాతగారి పేరు పెట్టుకున్నారు కాబట్టి. తాతగారి పేరు రామస్వామిగారు. ఆయన పేరుమీద పెద్ద కొడుక్కి రామ్‌కుమార్ అని పెట్టుకున్నారు. రామ్‌కుమార్ గారు ' వాల్డన్' అనే పేర హైదరాబాదులో ఓ చక్కటి బుక్‌షాప్ నడుపుతున్నారు.

అప్పట్లో వచ్చిన ఓ చట్టం కారణంగా రాజేంద్రప్రసాద్ తాతగారు జమీందారు స్థాయినుండి అప్పర్ మిడిల్ క్లాసుస్థాయికి మారవలసి వచ్చింది. కానీ రాజేంద్రప్రసాద్‌లో ఆ జమీందారీ ఫాయా, ఆ అరిస్టోక్రాటిక్ టింజ్ మిగిలిపోయాయి. సినిమా నిర్మాతగా ఆయన దేనికీ రాజీపడలేదు. షూటింగు సమయాల్లో ఆర్టిస్టులను – చిన్నయినా, పెద్దయినా – బాగా చూసుకునే వారని చెప్పుకుంటారు.

అన్నిటికంటె ముఖ్యంగా చెప్పుకోదగినది – స్టాఫ్ గురించి ఆయన ఒక సినిమా ప్రత్యేకంగా తీయడం. ఓ 12 విజయవంతమైన సినిమాలు తీశాక ఆయనకు ఆలోచన వచ్చింది. ఈ సినిమాలు ఇలా తీయగలుగుతున్నానంటే కారణం – కమిటెడ్, డివోటెడ్ స్టాఫ్ నా వెంట ఉండటం బట్టే కదా! వారికి జీతాలు యిచ్చి సరిపెట్టడం న్యాయమేనా? అని. ఓ సినిమా తీసి దానిమీద వచ్చిన లాభాలు వాళ్లకు పంచితే బాగుంటుంది కదా అనుకున్నారు. సొంత కథతో తీస్తే రిస్క్ తీసుకున్నట్టవుతుంది అనుకుని 'అన్‌హోనీ' హిందీ సినిమాను 'పిచ్చిమారాజు' పేరుతో తెలుగులో తీసి, అధిక లాభాలకు అమ్మి, ఆ డబ్బును తన కొలీగ్స్ అందరికీ – వాళ్ల జీతాన్ని బట్టి పంచారు. అవసరం బట్టే ఒకర్ని ఒకరు పలకరించే సినీరంగంలో ఈ వ్యవహారం చూసి అందరూ ముక్కు మీద వేలేసుకున్నారు. 'ఆ సినిమా హీరో కాదు, పాపం ఈయనే పిచ్చిమారాజు' అని జాలిపడ్డారు.

నిజానికి పేరు వల్లనే ఏమోగానీ ఆయనది ముందునుండీ రాజాలాగే బతికారు. ముగ్గురు సోదరుల్లో చిన్నపిల్లవాడన్న కారణంగా ముద్దు చేసేవారు. చిన్నప్పటినుండీ ఆస్తమాతో బాధపడుతున్నాడని జాలి కొద్దీ అల్లరి చేసినా, సరిగ్గా చదవకపోయినా కొట్టడం, తిట్టడం ఏమీ వుండేది కాదు. ఈయన కృష్ణాజిల్లాలో పుట్టినా డిగ్రీ చదువుకోసం కాకినాడ వెళ్లారు. 'మధ్యలో కాలేజీలు లేవా?' అని అనకుండా సరేనన్నారు ఇంట్లోవాళ్లు. కాకినాడలో చేరినది పిఠాపురం మహారాజావారి పిఆర్ కాలేజీలో! పిఠాపురం మహారాజావారి పిల్లలతో ఫ్రెండ్‌షిప్. రాజాగారికి ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. వాళ్లు హాస్టల్లో వుండి, కాలేజీలో చదువుతూండేవారు. ప్రతి శుక్రవారం ఇంపోర్టెడ్ ఎసి కారులో కాకినాడనుండి పిఠాపురం వెళ్లడం, మళ్లీ సోమవారం కాలేజీ తెరిచాక రావడం. వాళ్లతో బాటు రాజేంద్రప్రసాద్ కూడా వెళ్తూండేవారు.

ఇది ఈయనకు గొప్పగానే వుండేది కానీ కాలేజీలో కుర్రాళ్లకు అసూయగా వుండేది – ఎక్కడో వేరే జిల్లానుండి వచ్చి వీడింత వెలిగిపోవడమేమిట్రా అని. ఈయనకి చదువు తక్కువ, షోకులు ఎక్కువ. వాళ్ల తండ్రిగారినుండి వచ్చే డబ్బే కాక సవతి అన్నగారు కూడా డబ్బు ఇచ్చేవారు. ఇక బ్రహ్మాండంగా జల్సా చేసేవారు. మీకు తెలిసే వుంటుంది. 'దసరా బుల్లోడు' కథ, దర్శకత్వం ఈయనవే. గట్టిగా మాట్లాడితే ఈయన్నే దసరా బుల్లోడు అనవచ్చన్నమాట. కాలేజీలో వుండగానే బోల్డంత డబ్బు ఖర్చు పెట్టి స్టూడెంట్స్ ఎలక్షన్లో పాల్గొని ప్రెసిడెంటు అయ్యారు. రాఘవ కళాసమితి అని ప్రారంభించి నాటకాలు వేసేవారు. ఎవరికైనా అన్యాయం జరిగిందని తోస్తే వెళ్లి పోట్లాట వేసుకోవడానికి ఏమాత్రం జంకేవారు కారు. ఈయన సంగతి ముందే తెలిసినట్టుంది, హాస్టల్లో జేరదామని వెళితే వార్డన్ ఓ నమస్కారం పెట్టాడు. 'నీలాంటి విద్యార్థికి సీటు యిచ్చి నేను కష్టాల్లో పడలేను. హాస్టల్లో నీకు సీటు లేదు' అని చెప్పాడు.

మరి యిలాటి స్టూడెంటు పిఠాపురం రాజావారి కుటుంబంతో సన్నిహితంగా వుంటే తక్కిన విద్యార్థులకు అసూయ పుట్టదూ? పుట్టింది. ఈయన పేరూ, రాజాగారి అమ్మాయిల్లో ఒకరి పేరూ కలిపి గోడలమీద రాసేరు. రాజేంద్రప్రసాద్‌కి దడ పుట్టింది. వాళ్లతో మునుపటిలా చనువుగా వుండలేకపోయారు. ఓ రోజు ఆటోగ్రాఫ్ పుస్తకం తీసుకుని పిఠాపురం రాజావారి దగ్గరకి వెళ్లారు. ఆయన ఆ పుస్తకం తీసుకుని 'దే సే, వాట్ డూ దే సే?, లెట్ దెమ్ సే' అని రాసి చిరునవ్వుతో ఈయనకు అందించారు. ఈయన 'హమ్మయ్య' అనుకున్నారు. తండ్రి మరోలా అనుకోనందుకు ఆ అమ్మాయి కూడా సంతోషించింది. తర్వాత తర్వాత రాజేంద్రప్రసాద్ గారికి, ఆ అమ్మాయికి పరిచయం బాగా పెరిగింది. ఓ దశలో పెళ్లి చేసుకుందామా అని కూడా అనుకున్నారు. కానీ ఈయనకు మేనరికం వుండడంతో బయట సంబంధం చేసుకోలేకపోయారు. ఆ అమ్మాయితో స్నేహం స్నేహంగానే మిగిలిపోయింది.

కాలేజీరోజుల్లోనే అక్కినేని నాగేశ్వర్రావుగారు ఈయన రూముకి వచ్చారు. అదెలా జరిగిందంటే ఈయన ఊరు కృష్ణాజిల్లా డోకిపర్రు. అక్కడికి ప్రతీ యేడాదీ సమ్మర్‌లో నాగేశ్వరరావు వచ్చి ఓ వారం పాటు ఫ్రెండ్స్ ఇంట్లో వుండేవారు. ఆ ఫ్రెండ్స్ ఈయనకు బంధువులు. ఈయన వెళ్లి నాగేశ్వరరావుని కలుస్తూండేవారు. 1953లో 'దేవదాసు' సినిమా శతదినోత్సవం సందర్భంగా నాగేశ్వరరావు కాకినాడ వచ్చారు. అప్పుడు ఈయన వెళ్లి 'మా రూముకి రండి సార్. మా ఫ్రెండ్సంతా మిమ్మల్ని చూద్దామనుకుంటున్నారు' అంటే ఆయన వచ్చారు. అంత పెద్ద స్టార్ ఈయన రూముకి రావడంతో ఇక కాకినాడ మొత్తానికి ఈయన హీరో అయిపోయాడు. తర్వాతి జీవితంలో కూడా నాగేశ్వరరావు ఈయనకు ఫ్రెండ్, ఫిలాసఫర్, గైడ్‌గా వున్నారు. మార్గదర్శకత్వం చేసిన సందర్భాలు వుండడమే కాదు, ఆయన్ని డైరక్టరుగా చేసిన ఘనత కూడా నాగేశ్వరరావు గారిదే! ఆ సినిమా 'దసరా బుల్లోడు'.

'దసరా బుల్లోడు' కథ రాజేంద్రప్రసాద్ రూపొందించుకున్నదే. ఆయనకు తెలిసిన వాతావరణంలోంచే ఆ కథ పుట్టుకువచ్చింది. అయిదేళ్లపాటు దాన్ని గురించి ఆలోచించి, ఆలోచించి కథ తయారుచేసుకున్నారు. నాగేశ్వరరావుగారికి వినిపిస్తే 'బాగుంది' అన్నారాయన. సినిమాకి పనికి వస్తుందన్న ధైర్యం రాగానే ఎప్పుడు తీద్దామా అనుకుంటూండగానే అదృష్టం కలిసివచ్చింది. అప్పట్లో నాగేశ్వరరావుగారు కాల్షీట్లు యిచ్చిన సినిమా కథ ఆయనకు నచ్చలేదు. షూటింగ్ కాన్సిల్ అయింది. డేట్స్ ఖాళీగా వున్నాయి. 'నీ సినిమా పెట్టేసుకో' అన్నారు. ఇక ఈయన గబగబా హీరోయిన్‌గా జయలలితను, ఇతర పాత్రలకు ఎస్‌వి రంగారావు, గుమ్మడి, చంద్రకళ – ఇలా అందర్నీ అడిగి కాల్షీట్లు సంపాదించారు. ఇక డైరక్టరు. రాజేంద్రప్రసాద్ సినిమాలన్నిటికీ వి.మధుసూదనరావుగారే డైరక్టరు. ఆయన్ని వెళ్లి అడిగారు. కానీ ఆయన ఇతర సినిమాలకు ఆల్‌రెడీ కమిట్ అయివున్నారు. ఇది ముందు అనుకున్నది కాదు. అందువల్ల సారీ అనేశారు. ఏం చేయాలి?

సెకండ్ ఛాయిస్‌గా ఆదుర్తి సుబ్బారావు గారి దగ్గరకి వెళ్లి 'దసరా బుల్లోడు'కు దర్శకత్వం వహించమని రాజేంద్రప్రసాద్ అడిగారు. ఆయనకీ సేమ్ ప్రాబ్లెమ్. అప్పటికప్పుడంటే ఏ పెద్ద దర్శకుడు దొరుకుతాడు? నాగేశ్వరరావు గారి డేట్స్ దొరికాయి కదాని సినిమా మొదలుపెట్టబోతే అన్నీ కుదిరాయి గానీ డైరక్టరు కుదరడం లేదు. 'ఎలాగండీ' అని నాగేశ్వరరావుగార్ని అడిగారు ఈయన. 'ఆగండి, చూద్దాం' అన్నారు నాగేశ్వరరావు. రెండురోజులు పోయాక రాజేంద్రప్రసాద్‌కి ఓ ఫ్లాష్ ఐడియా వచ్చింది. సినిమాను నాగేశ్వరరావుగారినే డైరక్టు చేయమంటే ఎలా వుంటుందాని? ఎందుకంటే 'దసరా బుల్లోడు' సినిమా రూరల్ బ్యాక్‌గ్రౌండ్ వున్న సినిమా. నాగేశ్వరరావుగారిదీ అదే నేపథ్యం.

కానీ నాగేశ్వరరావు 'నో' అనేశారు. 'నేను డైరక్టరుగా దీనిలో ఫుల్‌గా ఇన్వాల్వ్ అయిపోతే నేను యాక్ట్ చేసే తక్కిన సినిమాల గతి ఏమవుతుంది? అయినా నాకు డైరక్షన్ మీద మోజు లేదు.' అనేశారు. అంతేకాదు, 'కథ తయారుచేసింది నువ్వు, పాత్రలపై అవగాహన పెంచుకున్నది నువ్వు, అందుకని నువ్వే డైరక్టు చేయి.' అన్నారు. 'చాల్లెండి. నా సినిమా షూటింగు అవుతున్నా నేనెప్పుడూ సెట్లో వున్నది లేదు. ఏ చెట్టు కిందో రేడియో పెట్టుకుని వింటూండేవాణ్ని. డైరక్షన్ ఎప్పుడూ అబ్జర్వ్ చేయలేదు. నా వల్లకాదు.' అన్నారు రాజేంద్రప్రసాద్.

'అలా అయితే నేనింక నీ సినిమాల్లో యాక్ట్ చేయను' అని బ్లాక్‌మెయిల్ చేశారు నాగేశ్వరరావు. ఇక తప్పనిసరి పరిస్థితుల్లో రాజేంద్రప్రసాద్ దర్శకత్వానికి ఒడికట్టారు.

షూటింగు ప్రారంభం 'పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లా' పాటతో! డాన్స్ డైరక్టరు హీరాలాల్ తను డిజైన్ చేసిన భంగిమలు చేసి చూపిస్తున్నారు. నాగేశ్వరరావుగారు రాజేంద్రప్రసాద్‌తో 'ఏమిటయ్యా ఈ నృత్యభంగిమలు, ఆడంగి చేష్టల్లా వున్నాయి?' అని కోప్పడ్డారు. ఈయన బిక్కమొహం వేశారు. వెంటనే నాగేశ్వరరావు ఫక్కున నవ్వి 'షాక్ తిన్నావా? అప్పుడప్పుడు ఇలాటివి ఇస్తూంటాను. నువ్వు

దర్శకుడిగా రాటుతేలి, రాణించాలంటే ఇలాటివి అవసరం.' అని వెన్నుదట్టారు. అదీ ఆయన రాజేంద్రప్రసాద్‌గార్ని తీర్చిదిద్దిన తీరు.

నాగేశ్వర్రావుతో యీయన మొదటి సినిమా 'ఆరాధన'. ఆ సినిమా సగం అయిపోయిన తర్వాత రాజేంద్రప్రసాద్ సహనిర్మాత 'ఇప్పటివరకూ చేసింది ఎవరైనా అనుభవజ్ఞులకు చూపిద్దాం' అన్నారు. అప్పుడు వీళ్లు కొంతమంది వెటరన్స్‌కి చూపించారు. వాళ్లలో బియన్ రెడ్డిగారు ఒకరు.

వాళ్లు సినిమా చూసి పెదవి విరిచారు. 'రొమాంటిక్ ఇమేజి వున్న నాగేశ్వరరావును గుడ్డివాడిగా చూపిస్తే ఎవరు చూస్తారు?' అన్నారు. ఆ సినిమాకు బెంగాలీ మూలం వుంది. ''సాగరికా'' అని. ''బెంగాలీలో చూశారు కదండీ' అని దర్శకుడు అంటే 'ఆ ప్రేక్షకులు వేరు.' అన్నారు యీ పండితులు. బియన్ రెడ్డి అలా అన్నాక నాగేశ్వరరావు కూడా నిజమే కాబోసు అన్నారు. 'పోయినది ఎలాగూ పోయింది. ఇంకో మంచి కథ చూసుకోండి. నేను కాల్‌షీట్లు యిస్తాను.' అన్నారాయన. దాంతో నిర్మాతలిద్దరూ కంగారు పడ్డారు. మళ్లీ మొదటినుండీ తీయడం అంటే నష్టం ఖాయం. అంతకంటె ఈ సినిమానే పూర్తి చేసి రిస్కు తీసుకోవడం మేలు అనుకుని ఆ మాట నాగేశ్వరరావుగారికి చెప్పారు. సరే కానీయండి అన్నారాయన.

నిజానికి బెంగాలీ ఒరిజినల్‌కు వీళ్లు చాలా మెరుగులు దిద్దారు. గిరిజ పాత్రను చాలా బాగా తీర్చిదిద్దారు. బెంగాలీ ఒరిజినల్‌లో ఆ పాత్ర హాస్యనటి కాదు, హీరోయిన్‌తో సమానమైన అందం, ప్రతిభ వుంది. హీరో ఎవర్ని చేసుకున్నా ఫర్వాలేదని ప్రేక్షకుడు అనుకునేట్లా వుంది. తెలుగు సినిమాలో గిరిజ పాత్రను మొదట్లో పల్లెటూరి బైతుగా చూపించి, షరతు ప్రకారం యీ అమ్మాయిని చేసుకోవాల్సి వస్తోందే అని హీరోపై జాలి పడేట్లా తీర్చిదిద్దారు. తర్వాత గిరిజ పాత్రలో మార్పు చూపించి చాలా షేడ్స్ తీసుకుని వచ్చారు. గిరిజ ప్రియుడి కారెక్టరుని రేలంగికి యిచ్చి చాలా హాస్యం పుట్టించారు. ఒరిజినల్‌లో ఆ హాస్యం ఏమీ లేదు. ఆమెను అందగాడైన ఓ డాక్టరు మోహించి, కోర్కె తీర్చుకుందామని చూస్తాడు. జగ్గయ్య పాత్ర వెళ్లి కాపాడుతుంది. తెలుగులో గిరిజ పాత్ర వలన హాస్యంతో సహా వేరే డైమన్షన్లు వచ్చి చేరాయి. ''ఇదీ అసలు కథ''లో యివన్నీ నేను చెప్పినపుడు రాజేంద్రప్రసాద్‌గారు ఆనందించారు. ఆపాటికి ఆయనకు బెంగాలీ ఒరిజినల్, చేసిన మార్పులు గుర్తు లేవు.

పెద్దలు శంకలు పెట్టినా రాజేంద్రప్రసాద్ ధైర్యం చేసి ''ఆరాధన'' సినిమా పూర్తిచేసి విడుదల చేస్తే హిట్ అయింది. నీతి ఏమిటీ అంటే – ఏ సినిమా ఆడుతుందో, ఏది ఆడదో కొమ్ములు తిరిగిన నిర్మాతకూడా చెప్పలేడు!

ఇంకో విషయం – 'ఓహోహొహొ మావయ్యా' పాట మైసూరు జూలో తీశారు కదా, పాటలో చరణాలు కొన్ని జంతువుల మీద పర్టిక్యులర్‌గా వుంటాయి. అందుకని మైసూరు జూకి ఆరుద్రగారిని ముందే పంపించి అక్కడ ఆ జంతువులు వున్నాయో లేదో లిస్టు రాసుకుని రమ్మన్నారు రాజేంద్రప్రసాద్. ఎందుకంటే తీరా రాసేసిందాకా వుండి అక్కడ అవి లేకపోతే ఏ ఆఫ్రికా అడవుల లైబ్రరీ షాట్లో కలపాల్సి వుంటుందని!

రాజేంద్రప్రసాద్‌కి నాగేశ్వరరావు ఇంత క్లోజ్ అయినప్పుడు నిర్మాతగా ఆయన సినిమారంగప్రవేశం కూడా నాగేశ్వరరావుతో జరగాలి కదా అని అనిపిస్తుంది కదూ! నిజానికి తన తొలిసినిమా ''అన్నపూర్ణ''లో నటించమని ఆయన్ని యీయన అడిగారు. కానీ అప్పటికి నాగేశ్వరరావు 2,3 సినిమాల్లో ఆల్‌రెడీ బుక్ అయివున్నారు. 'కావాలంటే నీ రెండో సినిమాలో వేస్తాను కానీ, ఇప్పటికి వదిలేయ్. జగ్గయ్యగారిని అడిగిచూడు' అన్నారు నాగేశ్వరరావు.

జగ్గయ్యకి, రాజేంద్రప్రసాద్‌కి బంధుత్వం కూడా వుంది. వెళ్లి అడిగారు. ఆయన సరేనన్నారు. అలా జగపతి ఆర్ట్స్ వారి తొలి సినిమా 'అన్నపూర్ణ'లో జగ్గయ్య హీరో. అంతేకాదు, తర్వాతి జగపతి సినిమాల్లో చాలా వాటిల్లో నాగేశ్వరరావు హీరో అయితే జగ్గయ్యది పేరలెల్ హీరో లేదా విలన్ పాత్ర! 'ఆత్మబలం' లాటి సినిమాలో నాగేశ్వరరావుపాత్ర కంటె జగ్గయ్యపాత్రే ఎక్కువ గుర్తుండిపోతుంది.

'అంతస్తులు'లో కూడా జగ్గయ్య విలన్ పాత్రలో అమోఘంగా రాణించారు. 'అంతస్తులు' అనగానే భానుమతి గుర్తుకు వస్తారు. అసలా పాత్ర జమున వేయవలసివుంది. ముందులో ఒప్పుకున్నా 'నాగేశ్వరరావు అక్క పాత్రలో వేస్తే జనం మిమ్మల్ని చూడరని' కొందరు అనడంతో ఆవిడ వెనక్కి తగ్గారు.

అప్పుడు భానుమతి దగ్గరకి వెళితే ఆవిడకు కథ నచ్చి, ఇంకో రెండు సినిమాలు వదులుకుని ఈ పాత్ర వేశారు. హైదరాబాదు వచ్చి షూటింగులో పాల్గొన్నారు. హొటల్లో రూమ్ బుక్ చేస్తే 'ఎందుకండీ సారథీ స్టూడియోలో రూములో వుంటాను లెండి' అన్నారు. 'దులపర బుల్లోడా' పాట షూటింగు ఏర్పాటు చేసుకుంటే ఆ ముందురోజు రాత్రి ఎలుకలు భానుమతి వేళ్లు కొరికాయట. దాంతో వీళ్లు భయపడిపోయారు. షూటింగు కాన్సిల్ చేద్దామా అనుకుంటే భానుమతి 'ఇవన్నీ చిన్న విషయాలు. షూటింగు పెట్టుకోండి. దుమ్ము దులిపేద్దాం' అని డెట్టాల్ రాసుకుని పాటకు డాన్సు చేసేశారు. ఆ పాట ఇప్పటికీ దుమ్ము దులుపుతూనే వుంది.

రాజేంద్రప్రసాద్ ఇంకో సినిమాలో కూడా హీరోయిన్‌కు యాక్సిడెంటయ్యింది. ''ఆత్మబలం'' సినిమా తీసేటప్పుడు దానిలో హీరోయిన్ బి.సరోజాదేవి. బెంగుళూరులో వుండేవారు. షూటింగు కోసం హైదరాబాదు వచ్చేవారు. రెండు షెడ్యూల్స్ అయ్యాక ఆవిడకు వేరే సినిమాలో ఓ యాక్సిడెంటు అయింది. అప్పుడు ఆవిడ ఎల్వీ ప్రసాద్ తీస్తున్న హిందీ సినిమాలో నటిస్తూండేవారు. హిందీ సినిమా షూటింగులో సరోజాదేవితో ఓ దృశ్యం తీస్తున్నారు. ఈమె పాలకుండ నెత్తిమీద పెట్టుకుని వెళుతూంటే ఆకతాయి కుర్రాళ్లు నెత్తిమీద కుండని రాళ్లేసి కొడతారు. ఆ సీను షూట్ చేసేటప్పుడు పొరబాటున వాళ్లు వేసిన రాయి గురితప్పి కుండకు బదులు ఈవిడ

ముఖానికి తగిలింది. రక్తం చిమ్మింది. ఆ గాయం మానాలంటే 15 రోజులు పడుతుందన్నారు.

ఇవతల రాజేంద్రప్రసాద్ షెడ్యూల్ పెట్టుకున్నారు. ఆవిడ మళ్లీ ఎప్పుడు డేట్స్ యిస్తే అప్పుడు షూటింగు పెట్టుకుందామని చెప్పడానికి బెంగుళూరు వెళితే వాళ్లు యింట్లోకి రానివ్వలేదు. సరోజాదేవి తల్లి ఈయన్ని చూసి కూడా లోపలకి రమ్మనలేదు. గూర్ఖా గేటు తీయడు. నిర్మాతల కష్టాలు యిలా వుంటాయన్నమాట! ఎవరి షూటింగులోనో దెబ్బ తగిలింది. ఈయన సినిమా కాదు, ఈయన పొరబాటు కాదు. మరి ఈయనమీద కోపం ఎందుకో తెలియదు. సినిమా నిర్మాత అంటే డబ్బిచ్చి దణ్ణాలు పెట్టాలి అంటారు ఇదే కాబోసు!

అప్పుడు ఈయన ఎల్.వి.ప్రసాద్ అబ్బాయి ఆనంద్ దగ్గరకి వెళ్లి మొరపెట్టుకుంటే ఆయన తీసుకెళ్లి రాజీ కుదిర్చాడు. నెల్లాళ్ల తర్వాత 15 రోజులు డేట్స్ యిస్తామనీ, ఆ టైములోనే షూటింగు పూర్తి చేసుకోవాలని సరోజాదేవి తల్లి ఆంక్షలు విధించింది. పైగా షూటింగు మద్రాసులోనే జరగాలట, హైదరాబాదు రారుట. ఇక్కడ చిక్కు వచ్చిపడింది. నాగేశ్వరరావుగారి కండిషన్ ప్రకారం షూటింగు హైదరాబాదులోనే జరగాలి. తెలుగు చిత్రపరిశ్రమంతా ఆంధ్రాకు తరలి రావాలనే ఉద్దేశంతో తన నిర్మాతలకు ఆయన పెట్టిన కండిషను అది. మద్రాసులో షూటింగు అంటే ఆయన ఒప్పుకోడు. ఇవతల ఈవిడ చూస్తే మద్రాసులోనే షూటింగని పట్టుబడుతోంది. ఏం చేయాలి?

రాజేంద్రప్రసాద్ నాగేశ్వరరావుగారి వద్దకు వచ్చి జరిగినదంతా చెప్పుకొచ్చారు. నాగేశ్వరరావుగారు అంతా విని 'నాకు కావలసినది నిర్మాత క్షేమం. నా నిబంధన సడలించుకుంటున్నాను. మద్రాసులోనే షూట్ చేద్దాం.' అన్నారు. అంతేకాదు, పగలు హీరోయిన్‌చేత వర్క్ చేయించి, రాత్రి ఆయన వర్క్ చేసేవారు. 15 రోజుల్లోగా సరోజాదేవి వర్క్ పూర్తి కావాలని ఆయన అలా సహకరించారు.

ఏమాట కామాట చెప్పుకోవాలి, వాళ్లమ్మ మాట ఎలా వున్నా సరోజాదేవి కూడా చాలా సహకరించింది. 'చిటపట చినుకులు' పాట చిత్రీకరించేటప్పుడు తలకు గుడ్డ కట్టుకుని మరీ నటించింది. హిందీసినిమాలో తగిలిన గాయం కనబడకుండా, వర్షంలో తడిసి మరింత జ్వరం తెచ్చుకోకుండా అది ఉపయోగపడింది.

''ఆరాధన'' తర్వాత తీసిన ''ఆత్మబలం'' సినిమాకు కూడా బెంగాలీ సినిమా ''అగ్నిసంస్కార్'' మూలం. ఆ విషయం రాజేంద్రప్రసాద్ మర్చిపోయి, ''దసరా బుల్లోడు'' పేరుతో రాసుకున్న తన అత్మకథ (యీ వ్యాసంలో వివరాలు ఆ పుస్తకంలోనివే) లో దానికి మూలం ''అతుల్ జలేర్ ఆహ్వాన్'' అని రాశారు. అది చదివి ''ఇదీ అసలు కథ'' కార్యక్రమం చేసేటప్పుడు నేను ఆ సినిమా గురించి చాలా వెతికి సంపాదించాను. తీరా చూస్తే దాని కథ వేరు. రాజేంద్రప్రసాద్‌గారితో చెప్పాను. ''అబ్బే, అదేనండి, 'ఇన్విటేషన్ ఫ్రమ్ డీప్ వాటర్స్' అని ఆ టైటిల్ అర్థం.'' అన్నారాయన. అర్థం కరక్టే. అదో సెంటిమెంటల్ సినిమా. ఓ బీద యువతి ఒక ధనికుడి యింట్లో ఆశ్రయం పొంది, చివరకు అతని ఆదరణ పొందడం కథాంశం. ''ఆత్మబలం''తో పోలికే లేదు. తెలుగు నిర్మాతలు కలకత్తా వెళ్లి వరసపెట్టి సినిమాలు చూసి, అదా, యిదా అనుకుని ఏదో ఒకటి ఫైనలైజ్ చేసేవారు. ఒకసారి రైట్స్ కొన్నాక, దాన్ని రచయిత, దర్శకుడి చేతిలో పెట్టేవారు. వాళ్లు మార్పులు, చేర్పులు చేసి చూపించేవారు. ఇక నిర్మాతలకు ఆ ఒరిజినల్ లీలగా గుర్తుంటుంది తప్ప వివరంగా గుర్తుండదు. చాలా ఏళ్లకు మనలా ఎవరైనా పరిశోధించి చెపితే ఓహో, అలాగా అంటారు. అప్పట్లో ''అతుల్..' కూడా చూసి కన్సిడర్ చేసి వుంటారు. ఆ పేరు మైండ్‌లో అతుక్కుపోయి వుంటుంది.

రాజేంద్రప్రసాద్‌గారు తీసిన 'మంచి మనుషులు' (అది ''ఆ గలే లగ్‌జా'' అనే హిందీ సినిమా రీమేక్) సినిమాలో మరో రకమైన యాక్సిడెంటు గురించి చెప్పాలి. ఆ సినిమాలో నటించే ఓ నటీమణి పెళ్లి కాకుండానే గర్భవతి అయింది. నాల్గవనెల కడుపుతోనే షూటింగుకని కశ్మీర్ వచ్చింది. కెరియర్ దృష్ట్యా అబార్షన్ చేయించుకోమని అందరూ సలహా చెబితే సరేనంది. అప్పటికే నాల్గవనెల. అప్పుడు అబార్షన్ చేయించుకోవడం నేరం. చేసిన డాక్టరుకు కూడా శిక్ష విధిస్తారు. రహస్యంగా చేయించాలి.

మద్రాసు అయితే ఎవరో ఒకరు దొరుకుతారు. కశ్మీరులో ఎలా? వీళ్లకు తెలిసిన ట్రావెల్ ఏజంటు ద్వారా ఓ గవర్నమెంటు డాక్టర్ని పట్టుకున్నారు. ఆవిడ ముస్లిం. హిందూ యువతికి అబార్షన్ చేస్తూ ఏదైనా వికటిస్తే పెద్ద కమ్యూనల్ ప్రాబ్లెమ్ వస్తుంది. డబ్బు చాలా డిమాండ్ చేసింది. వీళ్లు సరేనన్నారు. ఓ ఆదివారం నాడు తన ఇంట్లోనే, మత్తుమందుకూడా ఇవ్వకుండా ఆవిడ అబార్షన్ చేసేసింది. ఈ నటీమణి బాధను ఓర్చుకుంది. ఆపరేషన్ సక్సెసయింది కాబట్టి గుట్టు రట్టవలేదు. లేకపోతే వీళ్లందరూ జైలు కెళ్లాల్సినవాళ్లే!

ఇవన్నీ సినిమానిర్మాణంతో సంబంధం లేనివే అయినా నిర్మాతకు తలకాయనొప్పి తెచ్చిపెట్టేవే! ఆక్యుపేషనల్ హజార్డ్స్ అంటే ఇవే కాబోసు!

''ఆత్మబలం''లోని 'చిటపట చినుకులు' పాట గురించి చెప్పాలంటే చాలానే వుంది కథ. అందరికీ తెలుసు ఆ పాట రాసింది ఆత్రేయ గారని. ఆ పాట ఆత్రేయగారు రాయడానికి ముందు చినుకుల మాట ఎలా వున్నా నిర్మాతల కంట బొటబొటా కన్నీళ్లు కార్పించాడు. సినిమా అనుకోగానే పాటలు రాయించుకుందామని రాజేంద్రప్రసాద్, దర్శకుడు వి.మధుసూదనరావు, సంగీతదర్శకుడు మహదేవన్ – వీళ్లందరూ బెంగుళూరు చేరారు.

ఆత్రేయ పాటలు రాయాలి. అప్పుడే రథం కదులుతుంది. కానీ ఆయన రాయడే! జగపతివారి ఫస్ట్ సినిమా ''అన్నపూర్ణ''కు సదాశివబ్రహ్మం రచయిత. సంగీతం సుసర్ల దక్షిణామూర్తి. రెండో సినిమా 'ఆరాధన'కు ఆత్రేయ, నార్ల చిరంజీవి రచయితలు. పాటలు శ్రీశ్రీ, ఆరుద్ర, కొసరాజు, నార్ల చిరంజీవి. ''ఆత్మబలం'' కు వచ్చేసరికి మాటలు, పాటలు ఆత్రేయ. సంగీతం మహదేవన్.

ఇక అప్పుణ్నుంచి జగపతి సినిమాల్లో ఆత్రేయ, మహదేవన్ కాంబినేషన్ స్థిరపడిపోయింది. నిజానికి రాజేంద్రప్రసాద్ కాలేజీ రోజుల్లో ఆత్రేయ రాసిన 'కప్పలు' నాటకంలో ఓ గయ్యాళి స్త్రీ పాత్ర ధరించారు.

బెంగుళూరు తీసుకొచ్చి మూడురోజులు కూచోబెట్టినా ఆత్రేయ పాట కాదు కదా, పల్లవి కూడా రాయలేదు. పేపరు మీద పెన్ను పెడితో ఒట్టు. హాయిగా తినడం, తాగడం, తిరగడం. నిర్మాతగా రాజేంద్రప్రసాద్‌కి రచయితలతో ఇలాటి ఇబ్బందులు కొత్తకాదు. ఆయన సినిమారంగ ప్రవేశం తమాషాగానే జరిగింది. డిగ్రీ అయ్యేటప్పటికి ఆయనకు పెళ్లయింది. చదువయ్యాక మరో ముగ్గురితో కలిసి సిమెంటు వ్యాపారం చేశారు. పెద్దగా ఆదాయం రాలేదు. కొన్నాళ్లు వ్యవసాయం చూసేరు. కానీ ఆస్మా కారణంగా పొలాల్లో అవస్థ పడుతూంటే, రైసుమిల్లు చూడమన్నారు. కానీ అక్కడా చిట్టూ, తవుడూ వల్ల ఆస్మా పెరిగేది. ఇక ఇది పనికాదని సినిమా నటుడిగా మారదామనుకున్నారు. తండ్రి ఓ 50 వేల రూపాయలు చేతికిచ్చి 'దీనితో నీ అదృష్టం పరీక్షించుకో. డబ్బయిపోతే ఇంటికి తిరిగివచ్చి వ్యవసాయం చేసుకోవలసినదే!' అన్నారు. ఆ డబ్బు పట్టుకుని మద్రాసులో దిగారు రాజేంద్రప్రసాద్.

నాగేశ్వరరావుగారి సిఫార్సు వున్నా ఎక్కడా అంబ పలకలేదు. ఆర్నెల్లు తిరిగేసరికి డబ్బు సగం అయిపోయింది. హీరో వేషాల మాట వదిలేసి నిర్మాతగా మారదామనుకున్నారు. డబ్బింగ్ సినిమా తీద్దామా అని ఆలోచించి, చివరికి స్ట్రెయిట్ సినిమా తీస్తేనే బావుంటుందనుకున్నారు. 60 వేలు బజెట్ అనుకున్నారు. రంగారావుగారనే ఆయన 20 వేలు తెచ్చారు. రాజేంద్రప్రసాద్ బంధువులను 15 వేలు అప్పడిగి మొత్తం 40 వేలు సమకూర్చుకున్నారు. కథ గురించి సదాశివబ్రహ్మంని అడిగారు. నాలుగైదు సిట్టింగుల తర్వాత కథ ఫైనలైజ్ అయింది. అదే 'అన్నపూర్ణ'! డైలాగుల కోసం బెంగుళూరు వెళదామన్నారు ఆయన. కొత్త నిర్మాతలు సరేనన్నారు.

నిర్మాతలిద్దరూ, సదాశివబ్రహ్మం, ఆయన మనవడూ కలిసి కారులో బెంగుళూరు వెళ్లారు. ఓ యూరోపియన్ స్టయిల్ హోటల్లో దిగారు. మూడు పగళ్లూ, మూడు రాత్రుళ్లూ గడిచిపోయాయి. బ్రహ్మంగారు తినడం, తాగడం, రేసులకెళ్లడం.. డైలాగ్స్ మాత్రం ఊడిపడటం లేదు.

ఆఖరికి వీళ్లు ఆయన్ని అడిగేశారు – ఏమండీ డైలాగ్స్ రాసేది వుందా లేదా? అని. 'ఓస్ డైలాగ్సే కదా, ఓ రోజులో అయిపోతాయి ' అన్నారు. అవాళ రాత్రి మనుమణ్ణి కూచోబెట్టుకుని డిక్టేట్ చేసేశారు. పొద్దున్న కల్లా డైలాగ్స్ సిద్ధం! అమ్మయ్య అనుకున్నారు వీళ్లు. డైరక్టరు మధుసూదనరావుగారు కాస్త ఆలస్యంగా బెంగుళూరు వచ్చారు. డైలాగ్స్‌చూసి పెదవి విరిచారు. చేసేదేం లేక మద్రాసు తిరిగివచ్చి నానా అవస్థలు పడి మళ్లీ రాయించుకున్నారు.

అలాటి అవస్థ పడ్డా, రచయితను ఆల్‌టుగెదర్ ఎవాయిడ్ చేయలేరు కదా, ఇప్పుడు ''ఆత్మబలం''కు మళ్లీ ఆత్రేయతో వేగడం జరుగుతోంది. ఆ పాటికి రాజేంద్రప్రసాద్‌కు కాస్త ధైర్యం వచ్చిందిలాగుంది. మూడోరోజు సాయంత్రం 'ఇవాళ లాస్ట్. పాట రాయలేకపోతే మద్రాసు తిరిగి వెళ్లిపోదాం.' అన్నారు ఆత్రేయతో. ఆత్రేయ కాస్త కంగారు పడ్డారు. డెక్స్రిడిన్ అనే మాత్రలు వేసుకుని కూచున్నారు. వాటివల్ల నిద్ర రాకుండా వుంటుంది. రాత్రంతా మేలుకున్నా పల్లవి పల్లవించలేదు. ఏం చేయాలి?

ఆత్రేయ మర్నాడు తెల్లారుఝామున డ్రైవరును లేపి కారు తీసుకుని కబ్బన్ పార్కుకి వెళ్లారు. అక్కడ మార్నింగ్‌వాక్‌కి కొందరు వచ్చివున్నారు. ఈయన పార్కు బెంచీ మీద కూలబడి పాడ్‌కి కాగితాలు పెట్టుకుని, పెన్ను చేతబట్టి కూచున్నాడు. ఇంతలో హఠాత్తుగా వర్షం ప్రారంభమైంది. మార్నింగ్‌వాక్ జనాభా వర్షాన్ని తిట్టుకుంటూ చెట్లకిందకు వెళుతున్నారు.

వాళ్లలో ఓ యువజంట గుబురుగా పెరిగిన పొదలోకి వెళ్లిపోయారు. వర్షం పెద్దదైంది. ఆ జంట గుసగుసలు పెరిగాయి. కేరింతలు కొడుతున్నారు. మైమరచిపోతున్నారు. ఆ దృశ్యం చూసిన ఆత్రేయలో స్పందన కలిగింది. తక్షణం రాసేశారు –

'చిటపట చినుకులు పడుతూ వుంటే

చెలికాడే సరసన వుంటే...'

పాట, పిక్చరైజేషన్ సూపర్ హిట్. చెప్పానుగా జగపతి సినిమా హిట్ సాంగ్స్‌తో సినిమాలు తయారుచేస్తే ఆ సినిమాలకు మకుటంగా ఈ పాట పేరే పెట్టుకున్నారు. తర్వాత రాజేంద్రప్రసాద్ 'ఎంగళ్ తంగ రాజా' అనే పేరుతో శివాజీ గణేశన్‌తో సినిమా తీశారు. తెలుగులో 'మానవుడు–దానవుడు' లేదూ, దాని తమిళ వెర్షన్ అన్నమాట. ఆ సినిమాలో ఈ ట్యూన్ ఉపయోగించుకున్నారు. 'ఇరవుక్కుం పగలుక్కుం' అని పల్లవి.

తెలుగు సినిమాని ఇతర భాషల్లో తీయడమే కాదు, ఇతర భాషల సినిమాలను ఈయన తెలుగులో మళ్లీ తీసిన సందర్భాలున్నాయి. 'ఆరాధన', 'ఆత్మబలం'కు బెంగాలీ సినిమాల ఒరిజినల్స్ వున్నాయని చెప్పాను కదా. 'వెళ్లయి రోజా' అనే తమిళ సినిమాను 'ఎస్పీ భయంకర్' అనే పేరుతో తీశారు. ''సుమతి ఎన్ సుందరి'' అనే సినిమాను తెలుగులో ''బంగారుబాబు'' పేరుతో తీశారు. నిజానికి ఆ తమిళ సినిమాకు మూలం ''నాయికా సంగ్బాద్'' అనే బెంగాలీ సినిమా. ''ఇదీ అసలు కథ'' కార్యక్రమంలో ఆ బెంగాలీ సినిమాను, తెలుగు సినిమాను పోల్చి చూపిస్తే రాజేంద్రప్రసాద్ ఆశ్చర్యపడ్డారు. బెంగాలీ ఒరిజినల్ వుందనే తెలియదు. తమిళ సినిమా హక్కులే తీసుకుని మార్చాను. దాని డైరక్టర్ సివి రాజేంద్రన్ (రచయిత, దర్శకనిర్మాత, బెజవాడ గోపాలరెడ్డిగారి అల్లుడు, మౌలికంగా తెలుగువాడు అయిన సివి శ్రీధర్ తమ్ముడు) నేను చేసిన మార్పులు చూసి నా దాని కంటె బాగుంది అని మెచ్చుకున్నాడు'' అని చెప్పారు.

ఆయన తీసిన 'అడవిలో అభిమన్యుడు' సినిమాకు ఆధారం ఓ మలయాళ సినిమా. 'అక్కా–తంగై' అనే తమిళ సినిమాను 'అక్కా–

చెల్లెలు' అనే పేరుతో తీశారు. దానికి అసలు మూలం హిందీ సినిమా ''కానూన్''. ఆ సినిమా పేరు చెప్పగానే 'పాండవులు పాండవులు తుమ్మెదా' అనే పాట గుర్తుకు వస్తుంది. దాని గురించి ఓ ముచ్చట ఉంది –

'అక్కా చెల్లెలు' సినిమాకు డైరక్టరు అక్కినేని సంజీవి గారు. వి.మధుసూదనరావుగారు బిజీగా వుండటంతో జగపతి సినిమాలకు ఎడిటర్‌గా వున్న సంజీవిగారే ఈ సినిమాను రీమేక్ చేశారు. నాగేశ్వరరావు, షావుకారు జానకి ఓ జంట. కృష్ణ, విజయనిర్మల మరో జంట. తమిళంలో లేని ఓ పాటను షావుకారు జానకికి పెట్టడం జరిగింది. అదే 'పాండవులు పాండవులు తుమ్మెదా'!

జానకి గారికి ఆ పాట నచ్చలేదు. 'సందర్భశుద్ధి లేదు, పైగా అలా గెంతుతూ పాడితే నా ఇమేజి దెబ్బతింటుంది' అన్నారావిడ. ఎంత చెప్పినా వినలేదు. చివరికి 'సరే మీ యిష్టం' అని రాజేంద్రప్రసాద్ వదిలేశారు. తర్వాత జానకి గారే 'పోన్లెండి, మిమ్మల్ని బాధపెట్టడం ఎందుకు?' అంటూ నటించారు. 40 యేళ్లయినా ఇప్పటికీ ఆ పాట హిట్. జానకిగారి అభినయం కూడా సూపర్ హిట్.

అలాగే ''ఆస్తిపరులు'' సినిమాలో నాగేశ్వరరావుగారు మారువేషంలో వచ్చి 'సీతమ్మకు చేయిస్తీ చింతాకు పతకమ్మా రామచంద్రా' అనే పాట పాడతారు. ముందు నాగేశ్వరరావుగారు ఒప్పుకోలేదు. పాట వల్ల పాత్ర ఔచిత్యం దెబ్బతింటుందని వాదించారు. కానీ అందరూ నచ్చచెప్పడంతో నటించారు. పాట అందరికీ నచ్చింది.

''దసరా బుల్లోడు'' విషయానికి వస్తే 'పచ్చగడ్డి కోసేటి పడుచుపిల్లా' సూపర్ డూపర్ హిట్. నాగేశ్వరరావుగారికి కొత్త ఇమేజి తెచ్చిపెట్టిన సినిమా అది. ఆయన పక్కన వాణిశ్రీ అదరగొట్టేసింది. నిజానికి ఆ పాత్ర జయలలిత వేయవలసివుంది. ఆవిడకు ఎంజీఆర్ సినిమాతో క్లాష్ రావడంతో ఈ సినిమా వేయలేకపోయారు. ఆవిడ స్థానంలో ఆఖరి నిమిషంలో వాణిశ్రీ వచ్చారు. కలకాలం గుర్తుండిపోయేలా నటించారు.

రాజేంద్రప్రసాద్‌గారికి హిందీరంగంతో ఉన్న కనక్షన్ గురించి చెప్పుకుంటే –

ఈయన తీసిన ''అదృష్టవంతులు''ను రవీ నగాయిచ్ 'కిస్మత్'గా తీసి పేరు, డబ్బు సంపాదించుకున్నారు.

శశికపూర్ నటించిన 'ఆ గలే లగ్ జా'ను ఈయన తెలుగులో 'మంచి మనుషులు'గా తీశారు.

సంజీవ్‌కుమార్ 'అన్‌హోనీ'ని తెలుగులో శోభన్‌బాబుతో 'పిచ్చిమారాజు'గా తీశారు.

అశోక్‌కుమార్, ప్రాణ్‌లు నటించిన 'విక్టోరియా 203' సినిమాను ఎస్వీరంగారావు, నాగభూషణంలతో 'అందరూ దొంగలే' పేరుతో తీశారు.

తనే హిందీలో తీసిన 'ఖత్రోంకి ఖిలాడి' సినిమాను జగపతిబాబుతో 'సింహస్వప్నం' పేరుతో తీశారు.

జంధ్యాలగారి 'నాలుగు స్తంభాలాట' ను హిందీలో ఈయన 'బేకరార' పేరుతో పద్మిని కొల్హాపూరి, సంజయ్ దత్‌తో తీశారు. సక్సెస్ కాలేదు.

''దసరా బుల్లోడు''ను హిందీలో రాజేశ్ ఖన్నాతో తియ్యబోయి ఇబ్బంది పడ్డారు. ఆ కథ ఇంట్రస్టింగుగా వుంటుంది. రాజేశ్ ఖన్నా అప్పటికే 'ఆరాధనా', 'హాథీ మేరే సాథీ' సినిమాలతో సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్నారు. ఏడున్నర లక్షలు పారితోషికం తీసుకుంటున్నారు. ఈయన దసరాబుల్లోడుకు బుక్ చేయడానికి వెళితే 12 లక్షలు అడిగాడు. పైగా తన సెక్రటరీ గుర్నామ్‌సింగ్‌కు 50 వేలు అదనంగా యివ్వాలన్నాడు. అన్నిటికీ ఈయన సరేనంటూనే ఓ కండిషన్ పెట్టారు. 'ప్రారంభించాక ఆర్నెల్లలో పూర్తి చేయాలి. డేట్స్ రెండునెలల్లో యివ్వాలి' అని కండీషన్. రాజేశ్ ఖన్నా సరేనన్నాడు.

''దసరాబుల్లోడు'' సినిమా రాజేశ్ ఖన్నాతో హిందీలో రాబోతుందని వినగానే నార్త్ ఇండియాలోని డిస్ట్రిబ్యూటర్స్ క్యూలు కట్టి అడ్వాన్సులు యిచ్చేశారు. సినిమాకు ఇంత హైప్ రావడంతో రాజేశ్ ఖన్నాకు భయం వేసింది. 'సినిమా అటోయిటో అయితే నీ కెరియర్ ఫినిష్.' అని అతని సన్నిహితులు భయపెట్టారు. దాంతో రాజేశ్ ఖన్నా ఆలోచనలో పడ్డాడు. సినిమా వద్దనలేదు, చేయలేదు.

ఇక రాజేంద్రప్రసాద్‌ని తిప్పడం మొదలెట్టాడు. బొంబాయి వెళితే 'ఎందుకండీ, మద్రాసు వస్తున్నానుగా' అనేవాడు. మద్రాసులో పొద్దున్న వెళితే 'సాయంత్రం రండి సరదాగా కూచుందాం' అనేవాడు. అసలు విషయం తప్ప తక్కినవన్నీ మాట్లాడేవాడు.

ఇలాగ 15 రోజులు గడిచాయి. ఆఖరిరోజు 'ఎయిర్‌పోర్టుకు రండి, అక్కడ మాట్లాడదాం' అన్నాడు. అక్కడ విమానం ఎక్కబోతూ ఓ కవరు చేతిలో పెట్టాడు. చూస్తే రాజేశ్ ఖన్నా డేట్స్ షెడ్యూల్ అన్నమాట. ఈయన రెండు నెలలు వరసగా అడిగితే ఆయన నెలకు ఒకటి, రెండు రోజుల చొప్పున ఓ సంవత్సరంలో 26 రోజులు యిచ్చాడు. ఈ లెక్కన రెండు సంవత్సరాలు పడుతుందన్నమాట. రెండు నెలల్లో పూర్తి చేస్తానని మాట యిచ్చి రెండు సంవత్సరాలకు ప్లాను చేసినందుకు ఈయనకు కోపం వచ్చింది.

శుభ్భరంగా తిట్టిపోస్తూ ఓ పెద్ద వుత్తరం రాశారు. రాజేశ్ ఖన్నా కంగు తిన్నాడు. ఈయన శాంతింపజేద్దామని చూశాడు. కానీ 'ఇలాటి చీట్‌లతో నేను పనిచేయను' అని రాజేంద్రప్రసాద్ భీష్మించడంతో తీసుకున్న అడ్వాన్సు తిరిగి యిచ్చేశాడు. రాజేశ్ ఖన్నా ఎడ్వాన్సు తిరిగియిచ్చేశాడు కానీ అన్నగారి పాత్రకు బుక్ చేసిన ఓంప్రకాశ్ తను తీసుకున్న 3 లక్షలు తిరిగి యివ్వలేదు. ఆ విధంగా ''దసరా బుల్లోడు'' హిందీ వెర్షన్ తీయకుండానే 10 లక్షలు నష్టపోయారు రాజేంద్రప్రసాద్.

రాజేంద్రప్రసాద్‌గారి సినీజీవితంలో హిట్స్ వున్నట్టే, ఫ్లాప్‌లూ వున్నాయి. తన స్వంత బ్యానర్‌లో కొడుకు జగపతిబాబుకి మంచి హిట్ సినిమా యివ్వలేకపోయానన్న బాధ ఆయనకు మిగిలిపోయింది.

నాగేశ్వరరావుగారితో తీసిన 'ఎస్పీ భయంకర్', నాగార్జునతో తీసిన 'కెప్టెన్ నాగార్జున' రెండూ ఫెయిలయ్యాయి. తన దర్శకత్వంలో

22 సినిమాలు తీసిన ఆయన ఈ రెండూ వరుసగా ఫెయిలవడంతో ఆత్మశోధనలో పడిపోయి దర్శకత్వానికి గుడ్‌బై చెప్పేశారు. తర్వాత ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ సుబ్బారావుగారితో కలిసి తను హిందీలో తీసి హిట్ చేసిన 'ఖత్రోంకీ ఖిలాడీ'ని జగపతిబాబుతో తెలుగులో తీయబోయారు. దర్శకత్వం వి.మధుసూదనరావుకి అప్పగించారు. హిందీలో ఇద్దరు హీరోలు ఉంటే జగపతిబాబుతో తెలుగులో ద్విపాత్రాభినయం చేయించారు, జగపతిబాబు బాగా హైలైట్ అవుతాడు కదా అనుకున్నారు.

సినిమా ఫ్లాప్ అయింది. ఖర్చు 66 లక్షలు. అంతా మార్వాడీల వద్ద అప్పు తెచ్చినదే! వడ్డీలతో సహా అప్పు తీర్చడానికి ఆస్తులన్నీ అమ్ముకోవలసి వచ్చింది. అయినా ఆత్మస్థయిర్యాన్ని కోల్పోక 'అడవిలో అభిమన్యుడు' సినిమా తీసేరు. 20 లక్షల నష్టం వచ్చినా జగపతిబాబు నటనకు నంది అవార్డు తెచ్చిపెట్టింది. ఆయన నటుడిగా స్థిరపడ్డాడు. ఈ దశలో రాజేంద్రప్రసాద్‌గారు హైదరాబాదుకు మకాం మార్చారు. ఫిలింనగర్ హౌసింగ్ సొసైటీకి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కల్చరల్ సెంటర్ ప్రారంభించారు.

మళ్లీ సినిమా నిర్మాణంలోకి దిగారు. నాగార్జునతో 'కిల్లర్' అనే సినిమా తీశారు. బాగానే ఆడింది. తర్వాత బాలకృష్ణ, రవీనాటాండన్‌లతో 'బంగారు బుల్లోడు' సినిమా తీశారు. అది హిట్ అయింది. అప్పుడు జగపతిబాబు హీరోగా 'భలే బుల్లోడు', 'పెళ్లిపీటలు' తీశారు. కానీ అవి ఆశించినంత విజయాన్ని సాధించలేదు. ఇక సినిమా నిర్మాణం మానుకున్నారు. సినిమానిర్మాతగా రాజేంద్రప్రసాద్ చేసిన కృషికి గుర్తింపుగా ఆయనకు రాష్ట్రప్రభుత్వం రఘుపతి వెంకయ్య అవార్డు నిచ్చింది. ఫిల్మ్‌నగర్ గుడికి ఆయన చేసిన ఎవరూ మరువలేరు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

## జనవరి 34 ఎమ్బీయస్ : అంతా వాస్తు చాదస్తమేనా?

తెలుగు రాష్ట్రాలలో వాస్తు గురించిన చర్చ హోరెత్తిపోతోంది. ఆంధ్ర రాజధాని అక్కడ నిర్మించడానికి కారణం వాస్తే అని బాబు బాహాటంగా చెప్పలేదని మొన్ననే రాశాను. జనవరి 26 న యిద్దరు ముఖ్యమంత్రులు భేటీ అయినపుడు వాస్తు ప్రకారమే రాజధాని కడుతున్నామని బాబు అన్నారని టివి స్క్రోలింగ్స్ వచ్చాయి. స్క్రోలింగ్స్ నమ్మకుండా మర్నాటి పేపరుకోసం చూశా. కృష్ణానది పక్కన రాజధాని కట్టడం వాస్తుప్రకారం మంచిదని కెసియార్ మెచ్చుకుంటే దానికి జవాబుగా బాబు 'అన్ని కోణాల్లో ఆలోచించే మరీ ఎంపిక చేశామని చెప్పారు' అని రాశారు. వాస్తు కోసమే అనకపోయినా, వాస్తు కోణం కూడా చూశామన్న అర్థం ధ్వనించింది. కాదంటే బాబు మర్నాడే ఖండించేవారు. కెసియార్‌కు యిలాటి సంకోచాలేమీ లేవు. సెక్రటేరియట్‌ను మార్చడానికి కారణం దానికి వాస్తుదోషాలుండడమే అని ఓపెన్‌గా చెప్పారు. దీనిపై తెలంగాణ మొత్తం అల్లుకుపోయిన వామపక్షవాదులు, మేధావులు, హేతువాదులు ఎందుకు విరుచుకు పడలేదో నాకు అర్థం కావటం లేదు. అందరికీ పదవులో, కమిటీ సభ్యత్వాలో దక్కినందుకా? ప్రతిపక్షంలో వున్న రాజకీయనాయకులు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. జనవిజ్ఞాన వేదిక వారు చేపలమందు సమయంలోనే మేల్కొని హడావుడి చేస్తారు. ఇప్పుడేం చేస్తున్నారో మరి. సెక్రటేరియట్‌కు వాస్తు దోషమా!? ఎందుకు కుట్రలు జరిగాయనా? కుట్ర జరిగి సీటు దిగిపోయినవాడు దోషం అనుకోవచ్చు, సీటు ఎక్కినవాడికి వాస్తు కలిసి వచ్చినట్లేగా! అదే సెక్రటేరియట్‌లో పదేళ్లు ముఖ్యమంత్రి చేసినవాళ్లూ వున్నారు, పది నెలలు కూడా చేయనివాళ్లు వున్నారు. నెల రోజులకే పదవి పోగొట్టుకున్న ముఖ్యమంత్రి వున్నారు. వారం రోజులకే సీటు వూడిన మంత్రులూ వున్నారు. దేశమంతటికి బెస్ట్ సిఎం అనిపించుకున్నవారూ వున్నారు, నవ్వులపాలైన సిఎంలూ వున్నారు. బాంబులేసినా బతికి వచ్చిన అదృష్టవంతులున్నారు, ప్రత్యేక విమానమెక్కి మబ్బుల్లో కలిసిపోయిన దురదృష్టవంతులున్నారు, అంతా వ్యక్తులను బట్టి వుంటుంది.

వ్యక్తి గుణగణాల బట్టి, ప్రతిభాపాటవాల బట్టి వారి ఉత్థానపతనాలు వుంటాయని గట్టిగా చెప్పలేం. అదృష్టదురదృష్టాలు కూడా పాత్ర వహిస్తాయి. జ్యోతిష్యశాస్త్రాన్ని నమ్మినవారికి అది జాతకఫలం. అది వ్యక్తికే పరిమితం. భవనానికి కాదు. ఒక యింట్లో వాస్తు బాగా లేదంటే, యింట్లో అందరూ జబ్బు పడాలిగా. అలా పడరండి, హెడ్ ఆఫ్ ద ఫ్యామిలీ మీదే దాని ప్రభావం అంటారు కొందరు. హెడ్ ఆఫ్ ద ఫ్యామిలీ అనేది ఎవరు? నలుగురు అన్నదమ్ములు కలిసి ఒకే యింట్లో వుంటున్నారు. ఎవరు హెడ్? ఎవరు టెయిల్? ఎక్కువ వయసున్నవాడా? ఎక్కువ డబ్బున్నవాడా? ఇంటిని నడిపేవాడా? మహిళలు కూడా సంపాదించే యీ రోజుల్లో భర్త కంటె భార్య ఎక్కువ సంపాదిస్తే ఆమె హెడ్ అవుతుందా? ఆమె డబ్బుతోనే యిల్లు కొంటే వాస్తు ప్రభావం ఆమె మీదా? ఆమె భర్త మీదా? డబ్బు అతనిదే అయినా పెత్తనం ఆమెదే అయితే.. అప్పుడు? ప్రాంతాల బట్టి, వాతావరణాన్ని బట్టి వాస్తు మారుతుంది. ఆర్కిటెక్చర్ అని యిప్పుడు అంటున్నాం, గాలి వెలుతురు కోసం కొన్ని రూల్సు వున్నాయి అప్పట్లో గ్రామపాలక వ్యవస్థ వాస్తు పేరుతో గృహనిర్మాణాన్ని క్రమబద్ధీకరించి వుండవచ్చు. తమిళనాడులో యింటికి దక్షిణం వైపు ఎంట్రన్స్ వుంటే చాలా మంచిది అంటారు. మరి తెలుగునాట అది పనికి రాదు అంటారు. వారికి అమావాస్య మంచిది, మనకు కాదు. వాహనాల నెంబరు కలిపితే 9 అంకె వస్తే యాక్సిడెంటు అవుతుందన్న నమ్మకంతో అలాటి వాహనాల రీసేల్ కష్టం. మరి మన దగ్గర 9 అంకె మంచిదని చాలామందికి సెంటిమెంటు. ప్రాంతం బట్టి వాస్తు మారుతుంది కదాని మనం తమిళనాడుకి వెళితే అక్కడి సంప్రదాయాలు పాటిస్తున్నామా? లేదే! అమెరికా వున్నా అరవ్వాడు అమావాస్య మహబాగు అంటాడు.

ఒకే ప్రాంతంలో వున్న పండితులందరూ ఒకే మాట మీద వుంటున్నారా? గతంలో ముస్లిం పండగలకు చంద్రుడు కనబడ్డాడో

లేదో అనుకునేవాళ్లం. ఇప్పుడు హిందూ పండగలకు కూడా వివాదాలు ప్రారంభమయ్యాయి. కొంతమంది ఏకాదశి యివాళ అంటారు, మరి కొంతమంది రేపంటారు, యింకొంతమంది నిన్న అంటారు. పుష్కరాలు ఎప్పణ్నుంచి ప్రారంభం అన్నదాని గురించి కూడా ఏదో ఫిటింగు వస్తుంది చూడండి. వాస్తు విషయమైతే ప్రతీ మేస్త్రీ కూడా వాస్తు పండితుడే. ఒక పండితుడు వచ్చి కట్టిస్తాడు, మరో ఆయన కూలగొట్టిస్తాడు. ఎవర్ని నమ్మాలి? ఎన్ని పూజలు, శాంతులు, దోషపరిహారాలు చేయించినా బతుకు బాగుపడటం లేదని మొత్తుకునేవాళు చాలామంది కనబడతారు. అయినా కొత్త స్వాములారు కనబడితే పరిగెడతారు. ఇలాటి వాళ్లు వ్యక్తిగతంగా ఎంత ధనాన్ని, టైముని తగలేసుకున్నా మనం ఏమీ అనలేం. అనకూడదు కూడా. వాళ్ల డబ్బు, వాళ్ల యిష్టం. ఎవరి నమ్మకం వాళ్లది. నిలువుగా బొట్టు పెట్టుకున్నా, అడ్డంగా పెట్టుకున్నా, ఒళ్లంతా కాల్చి ముద్రలు వేయించుకున్నా, మెడలో రుద్రాక్ష వేసుకున్నా, శిలువ వేసుకున్నా, గడ్డం పెంచినా, గుండు కొట్టించినా, మొక్కులు పెట్టుకుని పొర్లు దణ్ణాలు పెట్టినా, పరకులస్తుణ్ని యింట్లోకి రానీయకపోయినా, పరమతస్తుడిన పలకరించకపోయినా అంతా వాళ్ల యిష్టం. మన రాజ్యాంగం మనకా స్వేచ్ఛ యిచ్చింది. కానీ ప్రభుత్వం సొమ్ముతో యివన్నీ పాటిస్తానంటేనే యిబ్బంది వస్తుంది. ఇప్పటికే శంకుస్థాపనలనీ, భూమిపూజలనీ, వరుణహోమాలనీ ప్రభుత్వ ఖర్చుతో హిందూ సంబంధిత పూజా కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరైనా మంత్రి కాగానే తమ జాతకాలకు అనుగుణంగా ఛాంబర్‌లో వాస్తు మార్పులు చేయిస్తున్నారు, పూజలు చేయిస్తున్నారు, ముఖ్యమంత్రులైతే భారీ స్థాయిలో చేస్తున్నారు. వాళ్ల అధికార నివాసాల్లో కోట్లాది రూపాయలతో మార్పులు జరుగుతున్నాయి. సొంత డబ్బుతో చేయించుకుంటే వాళ్ల యిష్టం కానీ ప్రభుత్వ ఖర్చుతో చేయించడం సమంజసం కాదు, కానీ నడిచిపోతోంది. గట్టిగా ఎవరైనా అడిగితే 'హజ్ యాత్రికులకు డబ్బులివ్వడం లేదా, ప్రభుత్వం ఖర్చుతో ఇఫ్తార్ విందులు యివ్వటం లేదా?' అని అడుగుతారన్న భయం కావచ్చు.

ఇప్పుడు వాస్తు పేరుతో సెక్రటేరియట్ మార్చడం మాత్రం సభ్యసమాజం నివ్వెరపోయే ఘట్టం. కొత్త సెక్రటేరియట్‌లో రాజకీయ కుట్రలే జరగవా? జరిగితే యీ నాడు సలహా యిచ్చిన వాస్తు పండితుడి తలను సచివాలయ గుమ్మానికి వేలాడదీస్తారా? ప్రస్తుత సెక్రటేరియట్ హిస్టరీ అంతా గలీజు అంటున్నారు కెసియార్. గలీజు మనుష్యులు రాజకీయాల్లోకి వచ్చినపుడు హిస్టరీ కూడా గలీజుగానే వుంటుంది. పార్టీలు మార్చేవాళ్లు, తనకు రాజకీయభిక్ష పెట్టినవారికి ద్రోహం చేసేవాళ్లు, చాడీలు చెప్పేవారు, పుకార్లు పుట్టించేవారు వున్నపుడు చరిత్ర వేరేలా ఎలా వుంటుంది? కొత్త సెక్రటేరియట్‌లో వీరెవరూ రాకుండా చేస్తేనే దోషం తప్పుతుంది? చేయగలరా? కెసియార్ పార్టీలో ప్రస్తుతం వున్నవారందరూ ఫిరాయింపుదారులే. జండా మోసినవారు కంటికి ఆనకుండా పోయారు. ఇదే సెక్రటేరియట్ కెసియార్‌ను మంత్రిని చేసింది, ముఖ్యమంత్రిని చేసింది. కొడుకుని, అల్లుణ్ని మంత్రులుగా చేసింది. అదంతా దోషఫలం అనుకుంటున్నారా ఆయన? ఆయన తలపెట్టిన ఫాస్ట్ పథకానికి కోర్టులు మొట్టికాయ వేసింది. అది వాస్తుదోషమా? సలహాదారుల లోపమా? ఆయన క్రమబద్ధీకరణ పథకానికి స్పందన కరువైంది. వాస్తుదోషమా? అవునంటే – తన పదవి వూడడం వాస్తుదోషం వల్లనే, తప్ప అవినీతి వలననో, అసమర్థత వలననో కాదు అని రాజయ్య వాదించవచ్చు.

జన విజ్ఞాన వేదికవారు మేల్కొన్నారు. కెసియార్ సెక్రటేరియట్ వాస్తుపై చర్చ ఏర్పాటు చేశారు. రెండు రాష్ట్రాలు ఏర్పడినప్పటి నుంచి యిద్దరూ సిఎంలు వాస్తుపై పెట్టిన ఖర్చుపై యింతకుముందే ఆందోళన చేపట్టి వుంటే పరిస్థితి యిక్కడిదాకా వచ్చేది కాదేమో. నిజానికి చెన్నారెడ్డిగారి వరకు సిఎంలు తమ నమ్మకాలను బాహాటంగా ప్రదర్శించలేదు. చెన్నారెడ్డిగారు షష్టిపూర్తి అనీ, ప్రభుత్వఖర్చుతో తన యింటికి వాస్తు మార్పులనీ ఖర్చు పెడితే "ఈనాడు" ఏకిఏకి వదిలిపెట్టింది. ఎన్టీయారూ వాస్తు పేరుతో సెక్రటేరియట్‌పై వృథా ఖర్చు పెట్టారు. అయినా నాదెండ్ల వెన్నుపోటు తప్పలేదు. వైయస్సార్ కట్టించిన సిఎం నివాస భవనానికి వాస్తుదోషం అంటున్నారు యిప్పటి సిఎంలు. ఏడాదిలోగా తీసేయడం ఖాయం అందరూ అనుకున్న కిరణ్ కుమార్ రెడ్డి అక్కడే వుండి మూడేళ్లు లాగించేశారు. మంత్రిగానైనా అనుభవం లేని ఆయన మూడేళ్లు సిఎంగా వుండి సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు ఆఖరి ముఖ్యమంత్రి అనే కీర్తి కిరీటంతో కిందకు దిగారంటే వాస్తు దోషం వుందనగలమా? అయినా బాబు, కెసియార్ యిద్దరూ దాన్ని పక్కన పడేశారు. ఒక అంచనా ప్రకారం జూన్ నుంచి సచివాలయ వాస్తు దోషాల నివారణకై బాబు 81 కోట్లు, కెసియార్ 34 కోట్లు ఖర్చు చేశారట. ఇంత ఖర్చు చేసినా బాబుకి సొంతంగా ఏం కలిసి వచ్చిందో తెలియదు కానీ ఆంధ్ర రాష్ట్రానికి మాత్రం ఏమీ ఒనగూడలేదు. ప్రత్యేక హోదా రాలేదు, ప్యాకేజీ రాలేదు, నెలజీతాలకే తడుముకోవాల్సిన పరిస్థితి. ఇది చాలనట్లు కనీవిని ఎరుగనంతగా హుదూద్ తుపాను వచ్చి అతలాకుతలం చేసేసింది. కెసియార్ కుందన్‌బాగ్‌లోని భవనాలకు వెళదామని వాస్తు మార్పులు చేయించి చివరకు మానేశారు. అంటే మార్పులు చేయించిన పండితుడి మాటల్లో విశ్వాసం కుదరలేదన్నమాట. ఇప్పుడు ఎర్రగడ్డకు సెక్రటేరియట్‌కు మార్పించిన దాకా వుండి, అక్కడ వాస్తు బాగా లేదన్న సందేహం వస్తే మళ్లీ వెనక్కి వస్తారా? అప్పటికే యిది కూల్చేసి వుంటే యింకో చోటికి తరలిస్తారా?

వాస్తు శాస్త్రీయతపై జనవిజ్ఞానవేదికవారికి, వాస్తు పండితుడు గౌరు తిరుపతిరెడ్డిగారికి టీవీలో చర్చలు జరిగినట్లు, ఛాలెంజ్‌లు విసురుకున్నట్లు పేపర్లో చదివాను. (దానిలో గౌరు ఓడిపోయినా వాస్తు శాస్త్రం ఓడిపోయినట్లు జనవిజ్ఞాన వేదిక వారు డిక్లేర్ చేయలేరు. వైద్యుడికి వుండే పరిమితులు వేరు, వైద్యశాస్త్రానికి వుండే పరిమితులు వేరు. జన విజ్ఞాన వేదిక వాస్తును అధ్యయనం చేసి దానిలోని లోపాలను ఎత్తిచూపితే అప్పుడు జనాలకు పూర్తి అవగాహన ఏర్పడుతుంది) ఆ సందర్భంగా నైరృతి సింహద్వారం వున్న యింట్లో వుంటే మనిషి భూమ్మీద మిగలడని గౌరువారు అన్నారట. నేను కొన్న ఒక ఫ్లాట్‌కు నైరృతి సింహద్వారమే. కొంటూంటే మా

కొలీగ్ ఒకావిడ, 'ఇంటి యజమానికి మృత్యువు సంభవిస్తుంది, వద్దు' అని సలహా చెప్పారు. 'ఫర్వాలేదు లెండి' అంటూ కొనేశాను, 8 ఏళ్లపాటు నివసించాను. అక్కడ వుండగా వృద్ధి కూడా కలిగింది. ఈలోగా ఆవిడ భర్త చిన్నవయసులోనే పోయాడు – వాస్తుప్రకారం కట్టిన యింట్లో వుంటూనే. (చావులకు, వాస్తుకు ముడిపెట్టలేమని నీతి) ఈ మాట ఎవరితోనో అంటే – 'మీది ఫ్లాట్ కదా, మీదానికి పశ్చిమంవైపు యింకో ఫ్లాట్ వుంది. అందువలన మీది నైరృతి అనడానికి లేదు' అని చెప్పాడు. 'వాస్తు విరుద్ధమైన యింట్లో ఐదేళ్ల పాటు వుంటే ఐదులక్షల రూపాయలు యిస్తాను' అని ఛాలెంజ్ చేసిన గౌరు గారూ రేపు యిలాగే వాదించవచ్చు. ఇలా అనేవాళ్లందరికీ నేను అడిగేది ఒక్కటే – 'వాస్తు యిండిపెండెంట్ యిళ్లకే తప్ప ఫ్లాట్లకు వర్తించదు' అని ప్రకటించి అనేకమందికి మనశ్శాంతి చేకూర్చండి అని. దక్షిణం వైపు నుండి గాలి వస్తుంది కాబట్టి అటువైపు కిటికీ వుండాలి అని శాస్త్రం వుందంటే అది యిండిపెండెంటు హౌస్‌కే నప్పుతుంది – దక్షిణంవైపు ఖాళీగా వుంటుంది కాబట్టి. ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో దక్షిణం పక్కన ఫ్లాట్ వుంటే యిక గాలి వచ్చే ప్రసక్తి ఏముంది? అయినా ఫ్లాట్‌కే కాదు, విడి గదులకు కూడా వాస్తు చెప్పేసి, గదిలో ఈశాన్యం వైపు ఖాళీగా వుంచాలి. అక్కడ పెట్టిన బీరువా జరిపేసి కిటికీకి అడ్డంగా పెట్టేయండి, గాలి రాకపోయినా ఫర్వాలేదు అనేస్తున్నారు.

వాస్తు కానీయండి, జాతకాలు కానీయండి – విడి విడి ఫలితాలు చూడడం తప్పు. మనిషి పొడుగుని బట్టి ఎంత బరువుంటే సబబో, ఎంత వుంటే బేసబబో తెలుస్తుంది. కొలెస్టరాల్ కూడా అబ్సల్యూట్ ఫిగర్ చూసి గుండెలు బాదుకోకూడదు. తక్కిన పరామీటర్స్, వయసు యిత్యాదులు పరిగణనలోకి తీసుకుంటేనే అది సరైన రేంజ్‌లో వుందో లేదో తెలుస్తుంది. అది డాక్టర్‌కే తెలుస్తుంది. గ్రహాలు కూడా అంతే! శని ఫలానా యింట్లో వుంటే ఫలానా రిజల్టు అని కంప్యూటర్‌లో రాసినది చూసి భయపడుతూంటారు. మీకూ ఫలానావారికి పొత్తు కుదరదు అని మేట్రిమోనియల్ సైట్‌లో పెట్టేసి మిస్‌లీడ్ చేస్తున్నారు. నిజానికి శాస్త్రప్రకారం ఒక్కో లగ్నానికి కొన్ని గ్రహాలు శుభం చేకూరుస్తాయి. కొన్ని అశుభం కలిగిస్తాయి. వాడుకలో శనిగ్రహం అని తిట్టుకున్నా కొన్ని లగ్నాలకు శని అత్యంత శుభుడు. శుభత్వం, పాపత్వం అబ్సల్యూట్ టెర్మ్స్ కావు. ఎవరితో కలిసి వున్నాడు, ఎవరిచేత చూడబడుతున్నాడు, ఎవరు, ఏ మేరకు నలిఫై చేస్తున్నారు, ఏ అంతర్దశలో వున్నపుడు ఫలితం యిస్తాడు , ఆ దశ జాతకుడి జీవితకాలంలో వస్తుందా రాదా అనేవి గమనించాకే పూర్తి పిక్చర్ వస్తుంది. ఇవేమీ పట్టించుకోకుండా బిట్స్ అండ్ పీసెస్‌లో చూడబోయి సామాన్యజనం గాబరా పడుతూంటారు. శరీరంలో ఒక అవయవం బలహీనంగా వుంటే మరో దాని శక్తి పెరిగి కాంపెన్సేట్ అయినట్లే, జాతకంలో కూడా ఒకదాన్ని మరొకటి చెక్ చేసుకుంటూ, సహాయపడుతూ మొత్తం మీద పెద్దగా యిబ్బంది లేకుండా గడిచిపోతుంది. అలాగే వాస్తు కూడా.

గతంలో వాస్తు గురించి యింత పిచ్చి వుండేది కాదు. గత 30 ఏళ్లగా అందరూ దాని గురించే మాట్లాడుతున్నారు. ఒక్కసారి పల్లెటూరికి వెళ్లి మీ తాతగారి యింటికి వాస్తు ఎలా వుందో చూసి రండి. ముప్పాతిక కేసుల్లో యీనాడు వీళ్లు చెప్పే సిద్ధాంతాలకు అనుగుణంగా వుండనే వుండదు. జాయింటు ఫ్యామిలీలు వుండే రోజుల్లో మధ్యలో హాలు, దానిలో ఓ మూల ధాన్యపు గాదె, పక్కన ఒక్కో కొడుక్కి ఒక్కో రూము – అదే వాళ్లకు బెడ్‌రూము, లివింగ్ రూము, మరోటీ. అందరికీ కలిపి పెరట్లో ఓ మూల స్నానాల గది, మరో మూల టాయిలెట్. ఎక్కడ సౌకర్యంగా వుంటే అక్కడ కట్టేవారు. తండ్రి పోతే, కొడుక్కి వారసత్వంగా వస్తే నా పేరుకి సింహద్వారం యిటువైపు వుండకూడదు అంటూ గుమ్మం కూల్చేసి, మార్చేసేవారు కారు. అదే యింట్లో కొనసాగేవారు. వాళ్లంతా బతకలేదా, బట్ట కట్టలేదా? ఇవన్నీ ఆలోచించకుండా వాస్తు పేరు చెప్పి భయపెట్టేవారు ఎక్కువై పోయి చాదస్తాలు పెరిగిపోయేయి. మా మిసెస్ కొలీగ్ ఒకావిడ తన అనారోగ్యానికి కారణం వాస్తు బాగా లేని యింటిలో వుండడం అని మొత్తుకుంటూ వుండేది. దాన్ని అమ్మేసి, వేరే యింట్లోకి మారినా ఆవిడ అనారోగ్యం తగ్గలేదు. ఎందుకు? అని అడిగితే 'ఆ యిల్లు అమ్మగా వచ్చిన డబ్బు తింటున్నాం కదండీ, అందుకు..' అంది! అంటే వాస్తు బాగా లేని యిల్లు డబ్బుగా మారిన తర్వాత కూడా పీడించగలదా? ఏ సిద్ధాంతం ప్రకారం? ఇవన్నీ జనాలు ఆలోచించడం మానేశారు. రాజకీయపరమైన వ్యాసంగా మొదలుపెట్టి యిలాటి నమ్మకాలపై లెక్చరు దంచుతున్నానేమిటని అనుకోవద్దు. నాయకులు, సినిమాతారలు సమాజంపై గాఢప్రభావాన్ని కనబరుస్తారు. సామాన్యజనులు వారిని అనుకరిస్తారు. ఇవాళ బాబు వాస్తు ప్రకారం రాజధాని కడుతున్నారు, కెసియార్ వాస్తు పేరు చెప్పి సెక్రటేరియట్ మారుస్తున్నారు. రేపు శాఖాధిపతులు కూడా వాస్తు కోసం అంటూ ఆఫీసు గేట్లు, ఫర్నిచరు మారుస్తారు. మంత్రి ఫలానా ఐయేయస్ ఆఫీసరుకూ నాకూ జాతకరీత్యా పొంతన కుదరలేదు, మార్చాలి అని పట్టుబడతారు. మామూలు ప్రజలు కూడా యిక ప్రతీదీ వాస్తుకి ముడిపెట్టి బెంగ పెట్టుకుంటారు. అందువలన నాకు తెలిసిన కొద్దిపాటి విషయాలను పాఠకులకు చెప్పి కాస్త ఉపశమనాన్ని పంచుతున్నాను.

వాస్తు ఎలా పుట్టిందో, అది ఎంతవరకు శాస్త్రీయమో విపులంగా రాయండి అని కొందరు అడుగుతున్నారు. సైన్సు రచయిత కవనశర్మగారు ఇంజనియర్, పరిశోధకులు, ప్రొఫెసరు, ఏం రాసినా క్షుణ్ణంగా తర్కించి పాతను, కొత్తను సమన్వయం చేసి తిరుగులేని విధంగా రాస్తారు. ''రచన'' పత్రికలో వాస్తుపై వరుసగా వ్యాసాలు రాశారు. పుస్తకంగా వచ్చిందేమో తెలియదు. అది చదివితే మంచిది. ఏది ఏమైనా 'మనం చేసినా తలరాత తప్పించుకోలేం, పూర్వజన్మ పాపపుణ్యాల కారణంగా అంతా ముందే నిర్ణయమై పోయి వుంటుంది' అనే మాట మనం విశ్వసిస్తే యివాళ గోడ కట్టో, కన్నం పెట్టో, కూలగొట్టో దాన్ని మార్చలేం. ఏ నమ్మకమైనా వ్యక్తిగతమే. ఇంట్లో అందరూ ఒకే దేవుణ్ని పూజిస్తారన్న గ్యారంటీ లేదు. ఎవరి యిష్టదైవం వారికే. అలాగే జ్యోతిష్కుడు కూడా! ఒకరు నమ్మినవారిని మరొకరు నమ్మరు. అలాటప్పుడు తెలంగాణ రాష్ట్రం మొత్తానికి వాస్తుపండితుడు ఒక్కడే ఎలా వుండగలడు? ఇవాళ ఆయన ప్రస్తుత సెక్రటేరియట్ పనికి రాదు అని చెప్తే మనమందరం నమ్మేయడమేనా? మరొకరు వచ్చి కొత్తది పనికి రాదని చెపితే?

ఎర్రగడ్డ హాస్పటల్ స్థలానికి 15 రకాల వాస్తుదోషాలు వున్నాయని యివాళ్టి పేపర్లో వచ్చింది. అనేక వీధిశూలలు వున్నాయట.

అసలు వీధిశూల వద్దని ఎందుకు అన్నారో ఒక వాస్తు పండితుడు చెప్పాడు. గతకాలంలో రథాలు మలుపు తిరిగేటప్పుడు ఏ చక్రమో వూడిపడిపోయి మన యింటి గోడమీద పడే ప్రమాదం వుంది కాబట్టి వద్దన్నారట. అప్పట్లో అయితే వాహనాలు తక్కువ. ఇప్పుడు యింట్లోనే రెండు, మూడు వాహనాలు వుంటున్నాయి. మన యింట్లో వాళ్లే అదుపు తప్పి కాంపౌండువాల్ గుద్దేసే ప్రమాదం లేకపోలేదు. వీధి శూల వుంటే పైకి రారని చెప్తారు. మద్రాసులో శివాజీ గణేశన్ యింటికి వీధి శూల వుంది. ఆయన పైకి రాలేదా? వీధిశూలలకు పరిహారం అంటూ వీధి ఎదురుగా ప్రహారీగోడలో చిన్న వినాయకుడి బొమ్మ పెట్టారు. ఆ విగ్రహం సొంతంగా కొనకూడదని, ఎక్కణ్నుంచో ఎత్తుకురావాలని కూడా నమ్మకం. దానికి లాజిక్ ఏమిటో అర్థం కాదు. ఇప్పుడున్న సెక్రటేరియట్‌కు కూడా వాస్తుదోషం అంటే ఏ విగ్రహాన్నో దొంగిలించి పెడితే సరి! ఇవాళ్టి పేపర్లోనే మరో న్యూస్ కెసియార్ ఆఫీసుకి వెళ్లేదారిలో వాస్తు దోషం వుందట, అది వక్రమార్గంట. సరి చేయడానికి 10 లక్షల రూ.లు శాంక్షన్ చేశారట. ఆఫీసులోకి డైరక్టుగా వెళ్లాలట. పక్క గుమ్మం నుంచి వెళ్లకూడదట. మన యింటికి వీధివైపు గుమ్మం వుంటే అందరూ కనబడతారని, ఆ గుమ్మం మూసి వుంచి పక్కన గుమ్మం ద్వారా రాకపోకలు సాగిస్తాం. అదీ వక్రమార్గమేనా? ఇలాటి శంకలతోనే అనుకుంటా, పార్లమెంటు భవనానికే వాస్తు వంకలు పెట్టారట. అది ఏ ప్రాంతపు వాస్తు ప్రకారమో!?

మీకు తెలుసా? జ్యోతిష్యం కూడా అబ్సల్యూట్ సైన్స్ కాదు. ఎవరి స్కూలు వారిదే. పరాశరుడు 9 గ్రహాలను మాత్రమే కన్సిడర్ చేశాడు. గౌతముడు మాంది, గుళికుడు, ధూమ్రకుడు అనే మరి మూడు గ్రహాలను కూడా లెక్కలోకి తీసుకోవాలన్నాడు. జైముని మహర్షి ధూమ్రకుని వదిలివేసి 11 మందితో చెప్తే చాలన్నాడు. శ్రీపతి, సత్యాచార్యుడు, వరాహమిహిరుడు 9టిలో ఛాయాగ్రహాలైన రాహు, కేతువులను వదిలి మిగిలన ఏడు గ్రహాలనే ఆధారంగా చేసుకుని ఫలితాలు రాశారు. గ్రహాల మిత్ర, శత్రుత్వాల పట్టికలో రాహు, కేతువులు కనబడరు. పైన చెప్పిన ఋషులే కాక, యింకా అనేకమంది ఋషులు జ్యోతిష్యశాస్త్రాలను రాశారు. గ్రహాల సంఖ్యలోనే భేదం వుందని చెప్పాను కదా, ఫలితాల విషయంలో యింకా ఎన్ని తేడాలున్నాయో చెప్పనలవి కాదు. సైన్సులో నీరు 100 డిగ్రీల సెంటిగ్రేడ్ వద్ద ఆవిరవుతుంది అని చెప్పినంత రూఢిగా జాతకఫలితాలు చెప్పే స్థితి యిప్పటిదాకా రాలేదు. అంతా సబ్జక్టివ్‌గానే వుంది. ఫలితాలు హిట్ అండ్ మిస్‌గా వున్నాయి. ప్రయోగదశలోనే వున్న యీ విద్యను విస్మరించకుండా పరిశోధిస్తూ పోతే ఎప్పటికైనా పరిపూర్ణరూపం రావచ్చు. దానికి కొన్ని వందల, వేల సంవత్సరాలు పట్టవచ్చు – ఓపెన్ మైండ్‌తో డీల్ చేస్తే. ఈ దశలో దాన్ని నమ్ముకుని ప్రజల జీవితాలను ప్రభావితం చేసే భారీ నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదు.

ప్రతీ సినిమా ముహూర్తం పెట్టి, పూజ చేసి ప్రారంభిస్తున్నారు. అయినా 80% సినిమాలకు డబ్బు వెనక్కి రావటం లేదు. అది నిర్మాత సొంత డబ్బు. లాభనష్టాలు ఆయనవే. రాష్ట్రం అంటే పౌరులందరిదీ. ఎవరి జాతకం ప్రకారం ముహూర్తం పెట్టాలి? బాబు మంచి ముహూర్తంలోప్రమాణస్వీకారం చేయడానికై ప్రమాణస్వీకారాన్ని వారం రోజులకు వాయిదా వేసుకున్నారు. బాబు పాలనకోసం పదేళ్లగా ఎదురుచూసినవారు పాపం ఆగవలసి వచ్చింది. ఆ ముహూర్తం ఎలా పెట్టి వుంటారు? చంద్రబాబుగారి పుట్టిన తేదీ, సమయం ప్రకారం పెట్టి వుంటారు. అది ఆయన మేలును దృష్టిలో పెట్టుకుని నిర్ణయించిన ముహూర్తం, ఆయనకు మంచి జరిగితే రాష్ట్రానికి మంచి జరగాలన్న నియమమేమీ లేదు. అలాగే కెసియార్ ముహూర్తం చూసే ప్రమాణస్వీకారం చేశారు. ఆ ముహూర్తంలోనే చేసిన ఉపముఖ్యమంత్రి ఆర్నెల్లు తిరక్కుండా పదవి నుండి బర్తరఫ్ అయ్యారు. ముహూర్తబలం చాలకో ఏమో నెలల్లోనే పదవి పోగొట్టుకున్న ముఖ్యమంత్రులూ వున్నారు.

నా బోటి వాడికే యివన్నీ తోచినపుడు, యీ విషయాలపై చక్కని పరిజ్ఞానం వున్న కెసియార్‌కు కొత్త సెక్రటేరియట్‌లో కూడా కుట్రలు, బర్తరఫ్‌లు జరగకమానవని తెలియదా? వాస్తు కోసమే సెక్రటేరియట్ మారుస్తున్నామని పైకి చెప్పినా ఆయన ఆంతర్యం వేరే వుండి వుంటుంది. కొత్త రాజధాని పేరుతో బాబుకి కాంట్రాక్టులు యిచ్చే ఛాన్సు దొరికింది. సింగపూరు, జపాన్ వాళ్లందరినీ ఆకర్షిస్తున్నారు. తెలంగాణకు ఆ ఛాన్సు లేదు. ఇప్పటికే పూరంత రాజధాని వుంది. వరంగల్‌ని సూపర్ సిటీ చేస్తామన్నా అంబ పలకదు. ఎందరు ఆసక్తి చూపుతారో తెలియదు. స్మార్ట్ సిటీల స్కీములో తెలంగాణకు యిప్పటిదాకా ఏదీ శాంక్షన్ కాలేదు.

అయినా స్మార్ట్ సిటీలు అంత తేలికైన వ్యవహారం కాదని మొన్న దానిపై జరిగిన కేంద్ర ప్రభుత్వ అధికారుల సమావేశం ద్వారా తేలింది. ఆ వూరి నిర్వహణ యిప్పటికే బాగుండాలట, మునిసిపల్ ఉద్యోగులందరికీ సవ్యంగా జీతాలు యిస్తూ వుండాలట. తనంతట తను ఆదాయం పెంచుకునే సత్తా కలిగి వుండాలట. ఇదెలా వుందంటే జూనియర్ కాలేజీల్లో చేరిన మెరికల్లాటి ముగ్గురు నలుగుర్ని పట్టుకుని వారికి ఐఐటి కోచింగ్ యిప్పించి, వారికి సీటు వస్తే కాలేజీవాళ్లు గొప్పగా చూపుకుంటారు చూడండి. అలాటి కేసన్నమాట. ఇప్పటికే బాగా వున్న సిటీలకు మరింత ప్రోత్సాహమిస్తారు, తక్కినవాళ్లను జూనియర్ కాలేజీలో తక్కిన కుర్రాళ్లలా పట్టించుకోరు. స్మార్ట్ సిటీ అనిపించుకుంటే నిధుల వర్షం కురుస్తుందేమో, ఎంతోకొంత నొల్లుకోవచ్చు అనుకున్న రాష్ట్రపాలకులందరికీ యిది ఆశాభంగం కలిగించే వార్తే. రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి వైజాగ్ ఒకటే స్మార్ట్ సిటీగా వెలుస్తుందేమో, అదీ అమెరికా టేకప్ చేస్తోంది కాబట్టి, దానిలో అమెరికా ప్రయోజనాలు యిమిడి వున్నాయి. దేశరక్షణ దృష్ట్యా వైజాగ్ వంటి నగరాన్ని నిధులకోసం అమెరికావాళ్ల చేతిలో పెట్టడం ఎంత రిస్కో అనిపిస్తోంది. రేవుతో బాటు, నేవీ యితర డిఫెన్సు సంస్థలు ఎన్నో వున్నాయక్కడ. వైజాగ్‌లో అణువణువూ తెలుసుకునే అవకాశం అమెరికాకు అప్పగిస్తున్నాం మనం.

వరంగల్ స్మార్ట్ సిటీయో, సూపర్ సిటీయో మరోటో అయ్యే అవకాశాలు సుదూరం కాబట్టి హైదరాబాదునే పట్టించాలి. కొత్తగా కట్టేందుకు ఏమున్నాయి? కాంట్రాక్టర్లను ఆకర్షించడానికే హుస్సేన్ సాగర్ చుట్టూ ఆకాశహర్మ్యాలు అన్నారు కెసియార్. అందరూ నవ్వారు, స్థలం ఎక్కడుంది? సంజీవయ్య పార్కును కబళిస్తారేమో పర్యావరణ సమస్య వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. ఆయన సెక్రటేరియట్ మీద కన్నేశారని ఎవరికీ తోచలేదు. అక్కడ టవర్లు కట్టడానికే యిప్పుడీ వాస్తు మాట ఎత్తారు కెసియార్. కొత్త సెక్రటేరియట్‌కు 150 కోట్లు సరిపోతుందంటున్నారు. సరిపోతుందా? చివరకు 500 కోట్లు అవుతుందని కొందరంటున్నారు. నిధులు లేవని ఋణమాఫీని కుదించారు, రైతులకు కావలసినవి సమకూర్చలేక పోతున్నారు, విభజన తర్వాత ఆదాయం తగ్గిందని, డబ్బు లేదని, ప్రత్యేక హెూదా యివ్వకపోతే ఆరిపోతామని కేంద్రానికి వెళ్లి మొరపెట్టుకుని నెలలు కాలేదు. ఇప్పుడీ పని తలపెడితే ఎక్కణ్నుంచి తెస్తారని కేంద్రం అడగదా? నిధులు యిస్తుందా? అర్జంటుగా మార్చడం దేనికి, అంతగా వాస్తు బాగా లేకపోతే మార్పులు చేయించండి, ఓ మూల గోడ కట్టడమో, మరో మూల గుమ్మం మార్చడమో, బావి తవ్వడమో, ఏదో ఒకటి చేసుకోండి. మొత్తం వేరే చోటికి వెళ్లనేల? అని అడుగుతుంది.

నాకు వాస్తు మీద ప్రబలవిశ్వాసం వుందని చెప్పుకోవడానికే కెసియార్ మొక్కుల సంగతి యిప్పుడు తీసుకుని వచ్చారు. ప్రత్యేక రాష్ట్రం రావాలనో, దానికి దళితుడు సిఎం కావాలనో, సమర్థుడైన దళితుడు ఎవరూ దొరకని పక్షంలో తను సిఎం కావాలనో ఏదో ఒకటి చెప్పుకుని కెసియార్ మొక్కు పెట్టుకున్నారనే అనుకుందాం. రాష్ట్రం ఏర్పడి ఆర్నెల్లు దాటాక అవన్నీ యిప్పుడు గుర్తుకు వచ్చాయా? కెసియార్‌కు డబ్బు లేదా? ఆయన పుట్టడమే కొన్ని ఎకరాల యింట్లో భూస్వామి కుటుంబంలో పుట్టారు, యీ వయసులో కూడా వ్యవసాయంపై ఏటా కోట్లాది రూపాయలు గడిస్తున్నారు. ఈ ముక్కుపుడక మొక్కులు ఓ లెక్కా? ప్రభుత్వానికి మొక్కులేముంటాయి? ఈయన కాకపోతే మరొకడు అవుతాడు. ప్రభుత్వం యిలా మొక్కులు తీర్చడం యిప్పటిదాకా భారతదేశ చరిత్రలో జరిగి వుండదు. భద్రాద్రి రాముడికి తలంబ్రాలు పంపలేదా, కొత్త బట్టలు పంపలేదా? అంటే అది ఒక సంప్రదాయంగా మారింది. అది వ్యక్తిగతమైన మొక్కు కాదు, ముఖ్యమంత్రి సొంత ప్రయోజనం ఆశించి పంపేది కాదు, ముఖ్యమంత్రిగా ఎవరుంటే వాళ్లే పట్టుకెళ్లి యిస్తారు.

ఏ మతానికి చెందిన భక్తులైనా వారి సౌకర్యార్థం ఏదైనా పుణ్యక్షేత్రంలో వసతిగృహం కట్టడం, బస్‌స్టాండ్ కట్టడం, రోడ్లు వేయించడం, ఉత్సవాలు జరిగినపుడు అదనపు పోలీసు బలగాలను పంపడం – అవన్నీ ఓకే. ఎందుకంటే భక్తులు కూడా పౌరులే కదా. వారికి మేలు చేకూర్చడానికి వారు కట్టే పన్నులను వినియోగించవచ్చు. కానీ వ్యక్తిగతమైన నమ్మకాల కోసం ప్రభుత్వధనం వ్యయం చేయడం చాలా పొరపాటు. దీనిపై ఎవరో ఒకరు కోర్టుకి వెళ్లడం తథ్యం. కోర్టు యివ్వడానికి వీల్లేదంటే 'అయితే నా సొంత డబ్బులోంచే యిస్తా' అంటారేమో కెసియార్. ఇదంతా దేనికంటే తనకున్న నమ్మకాల కారణంగానే సెక్రటేరియట్ మార్చడం జరుగుతోంది తప్ప వేరే ఆర్థికపరమైన కారణాలు లేవని చెప్పుకోవడానికి!

ఇక్కడ సెక్రటేరియట్‌కు నాలుగు వైపులా రోడ్లున్నాయి. ఎర్రగడ్డలో ఒక్కటే రోడ్డు, సెక్యూరిటీ రిస్కు, చాలా వుంది. ఏదైనా ఎటాక్ జరిగితే పారిపోవడం కష్టం. చలో అసెంబ్లీలా చలో సెక్రటేరియట్ అంటూ ఎవరైనా నిరసన కార్యక్రమం చేపట్టి హేండిల్ చేయడం చాలా కష్టం. వాళ్లు రాళ్లేసి ఎర్రగడ్డ పక్కన, వెనక్కాల చిన్న యిళ్లున్న కాలనీల్లో నక్కుతారు. ఇలాటివి వూహించి ముందే ఆ కాలనీలన్నీ ఖాళీ చేయించేస్తారనుకుంటాను. ఇళ్లు కూల్చేసి నలువైపులా రోడ్లు వేస్తారేమో! లేకపోతే ఆ రోడ్డు మీద ట్రాఫిక్ జామ్ నిశ్చయం. అదసలే నేషనల్ హై వే. రాత్రి 8 దాటిందంటే చాలు విజయవాడవైపు వెళ్లే రూటు బస్సులు మెయిన్‌రోడ్డుని ఆక్రమించేస్తాయి. ఇప్పుడు సెక్రటేరియట్ సిబ్బంది కోసం వేసే బస్సులే పొద్దున్నా, సాయంత్రం రోడ్డు ఆక్రమిస్తాయి. మంత్రులు వస్తూ పోతున్నారని వాహనాలు ఆపేస్తే జరిగే బీభత్సం వూహించడానికే భయం వేస్తోంది. ఈ రోడ్డు వదలిపెట్టి వేరే మార్గంలో వెళ్లాలంటే పంజగుట్ట, జూబిలీహిల్స్ మీదుగా వెళ్లాలి. ఆ రోడ్డు యిప్పటికే ఘోరంగా వుంది. చంద్రబాబుగారు మాదాపుర్‌లో హైటెక్ సిటీ ప్లాన్ చేసేటప్పుడు పెరగబోయే రద్దీ అంచనా వేసి, రోడ్డు నెంబరు 36 తో బాటు రేడియల్ రోడ్లు వుండాలని కొందరు అధికారులు చెప్పినా ఆయన వినలేదట. ఇప్పుడు అక్కడ ట్రాఫిక్ సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇప్పుడీ అదనపు రద్దీని ఎలా పరిష్కరిస్తారో ఏమో! ఊరి ప్లానింగ్ టోటల్ మెస్ చేసి అంతర్జాతీయ నగరం అంటే ఎవరు నమ్ముతారు?

ఇదంతా దేనికి? ఇప్పుడున్న సెక్రటేరియట్ స్థానంలో టవర్లు కట్టడానికి ఏ సింగపూరు వాళ్లకో డెవలప్‌మెంట్‌కి యివ్వడానికి! బాగానే వుంది కానీ కానీ వాస్తు బాగా లేదని ఇంత ప్రచారం జరిగిన స్థలంలో టవర్లు కడితే వాటిలో కమ్మర్షియల్ స్పేస్ ఎవరు కొంటారు? అబ్బే స్థలంలో ఏ డిఫెక్టూ లేదు, పాత బిల్డింగులోనే డిఫెక్టు అంటే నమ్మరు. అలా అయితే ఆ మార్పులేవో చేసి వుండేవారు కదా. పక్కన హుస్సేన్ సాగర్ వుండడం అరిష్టంట కదా, అందుకే హిస్టరీ అంతా గలీజు అయిందట కదా అంటారు. మా కంపెనీలో మాత్రం కుట్రలు, కూహకాలు జరగాలని మేం కోరుకుంటామా? అంటారు కొనేవారు. ఇక అప్పుడు డెవలపర్స్ యీ హుస్సేన్ సాగర్ ఒకటి, ముందు దాన్ని పూడ్చేయండి సార్ అంటారు. కెసియార్ ఆ పనికీ ఒడిగట్టినా ఒడిగట్టవచ్చు. వేసవిలో ఖాళీ చేయిస్తారట కదా, అప్పుడు దాన్ని కనీసం వాస్తుకి అనుగుణంగా ఎత్తుపల్లాలు సరిచేసి, అప్పుడు మళ్లీ నింపుతారేమో! నండూరి పార్థసారథిగారి 'అయోమయ రాజ్యం' నవలలో ప్రజలందరూ వెనక్కి నడవాలని రాజుగారు ఆజ్ఞవేశారని రాస్తే వ్యంగ్యం హద్దులు దాటిందనుకున్నాను. లిటరల్‌గా కాకపోయినా, విజ్ఞానపరంగా ప్రస్తుతం జరుగుతున్నది అదే. మనది కచ్చితంగా అయోమయరాజ్యమే!

**(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (జనవరి 2015)**

ఫి్రబవరి 01-03 వీక్లీకై

## ఎమ్బీయస్ : మహారాష్ట్రలో విచారణ కాండ

ఎన్నికల సమయంలో గత ప్రభుత్వంలోని కాంగ్రెసు-ఎన్‌సిపి నాయకులపై ఆరోపణలు చేసిన ఫడ్నవీస్ మహారాష్ట్ర ముఖ్యమంత్రి కాగానే రాజీ పడలేదు. విచారణలు జరపడానికి ఎసిబి (అవినీతి నిరోధక బ్యూరో)కు ఎడాపెడా అనుమతులు యిచ్చేస్తున్నాడు. ఆరోపణల్లో మొదటి వరుసలో వున్న ముగ్గురు ఎన్‌సిపి లీడర్లపై విచారణకు ఎసిబికి నవంబరు ఆఖరివారంలోనే అనుమతి యిచ్చి ఆ విషయాన్ని అతను బహిరంగపరచలేదు. సరైన సమయం చూసి ప్రకటన చేస్తానులే అని అధికారులకు చెప్పాడు. అన్నట్టుగానే ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ పుట్టినరోజు సందర్భంగా డిసెంబరు 12 న యిది ప్రకటించాడు. అప్పటికే ఆసుపత్రిలో వున్న శరద్‌కు యిది మరో దెబ్బ. అతని సోదరుని కుమారుడు, మాజీ ఉపముఖ్యమంత్రి అయిన అజిత్ పవార్, మాజీ జలవనరుల మంత్రి సునీల్ తత్కారే యిద్దరూ రూ. 70 వేల కోట్ల ఇరిగేషన్ స్కీములో యిరుక్కున్నారు. విచారణకు అనుమతి కోరుతూ బ్యూరోవారు గత కాంగ్రెసు ప్రభుత్వానికి రాస్తే ఆ ప్రభుత్వం యివ్వకుండా తొక్కిపెట్టింది. ఇప్పుడు ఫడ్నవీస్ యిచ్చాడు.

ఇక మాజీ పబ్లిక్ వర్క్స్ శాఖ మంత్రి ఛగన్ భుజ్‌బల్‌పై ఆప్ కార్యకర్త అంజలీ దమానియా పిల్ దాఖలు చేసింది. కాంట్రాక్టర్లకు కట్టబెట్టిన పనులమీద కమిషన్‌గా అతను రూ. 82.42 కోట్లు పొందాడని 2013 నుంచి ఎసిబికి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్‌కు, ఇన్‌కమ్‌టాక్స్ డిపార్ట్‌మెంటుకు పిటిషన్లు యిచ్చి వేసారి, బాంబే హై కోర్టులో పిల్ పడేసిందామె. ఇప్పుడు ఎసిబి కదిలింది. కోర్టుకు విన్నవిస్తే డిసెంబరు 18 నాటి తన తీర్పులో హైకోర్టు ఎసిబి డైరక్టర్ జనరల్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ డైరక్టర్లతో స్పెషల్ ఇంక్వయిరీ టీము వేసి భుజబల్‌పై అవినీతి ఆరోపణలను విచారించి ఫి్రబవరి 28కి రిపోర్టు సమర్పించమంది. తనపై వచ్చిన ఆరోపణలను భుజబల్ లిఖితపూర్వకంగా జవాబు యిచ్చి మద్దతుగా డాక్యుమెంట్లు సమర్పించవచ్చు. వాటిని ఎసిబి సేకరించిన డాక్యుమెంట్లతో సరిచూసి అప్పుడు నేరాన్ని నిర్ధారిస్తారు. తెలిసిన వనరుల నుంచి వచ్చిన ఆదాయం కంటె 15% ఎక్కువగా ఆస్తులుంటే అప్పుడు కేసు అవుతుంది. ఈ కేసుపై మాట్లాడుతూ భుజ్‌బల్ "కాంట్రాక్టులు యిచ్చేముందు అన్ని విధానాలను కరక్టుగా పాటించాం. న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్ కాంట్రాక్టు విషయంలో గోల్‌మాల్ జరిగిందని ఆరోపిస్తున్నారు. కాబినెట్‌లోని ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కమిటీ నిర్ణయాన్నే నేను అమలు చేశాను. దానికి నన్ను తప్పు పడితే ఏం చేయగలను?" అన్నాడు.

హర్షవర్ధన్ పాటిల్ అనే కోఆపరేటివ్ మినిస్టర్‌పై అనిల్ గోటే అనే బిజెపి ఎమ్మెల్యే ఆరోపణలు చేశాడు. ధూలే నాన్‌దర్బార్ జిల్లా సెంట్రల్ కోఆపరేటివ్ బ్యాంకు ప్రియదర్శిని కాటన్ కోఆపరేటివ్ సొసైటీకి ఏ అదనపు గ్యారంటీలు లేకుండా రూ.116 కోట్ల అదనపు ఋణాన్ని యిస్తూంటే సహకారమంత్రిగా వున్న పాటిల్ ఏమీ పట్టించుకోలేదని, అనేకమంది అధికారులకు, సొసైటీ డైరక్టర్లకు అనవసరమైన స్వేచ్ఛ యిచ్చి వారు దుర్వినియోగానికి పాల్పడేటట్లు చేశాడని ఫిర్యాదు చేశాడు. పాటిల్‌పై కూడా బహిరంగ విచారణ చేపట్టడానికి ఎసిబి సెప్టెంబరులో అనుమతి కోరింది. డిసెంబరు చివరి వారంలోనే ఫడ్నవీస్ అనుమతి యిచ్చాడు. మంత్రులతో బాటు పిడబ్ల్యుడి, హౌసింగ్, ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ వంటి అనేక శాఖల్లో పనిచేసిన ఐయేయస్, ఐఎఫ్ (ఫారెస్ట్) ఎస్ అధికారులను, డజన్ల కొద్దీ యితర అధికారులపై కూడా కేసులు పెట్టి విచారణ జరుపుతున్నారు. సాధారణంగా రాజకీయ నాయకులు అధికారంలో వున్నవారిపై ఆరోపణలు చేయడం, తాము అధికారంలోకి వస్తే డబ్బు కక్కిస్తామని ప్రతిజ్ఞలు చేయడం జరుగుతుంది. అధికారంలోకి వచ్చాక ఆ వూసే మర్చిపోతారు. అసెంబ్లీలో మాత్రం పాత ఆరోపణలే తిరిగి తిరిగి చేస్తూ వుంటారు. 'మీ చేతిలో అధికారం వుంది కదా, కావాలంటే విచారణకు ఆదేశించండి. అగ్నిపునీత అయిన సీతలా బయటకు వస్తాం' అని అవతలివాళ్లు ఛాలెంజ్‌లు చేస్తూ వుంటారు. ఇద్దరి మధ్య ఏవో ఒప్పందాలు కుదిరివుంటాయి, యిదంతా కలిసి ఆడుతున్న నాటకం అని ప్రజలు అనుకుంటూ వుంటారు. ఫడ్నవీస్ ధైర్యంగా విచారణలు చేపట్టారు. ఇదంతా కక్షసాధింపు చర్య అని బాధితులు అంటే అననీ. కనీసం తను చేసిన ఆరోపణల్లో పస వుందని ఆయన నమ్ముతున్నాడు. తెలుగు ముఖ్యమంత్రులు తాము గతంలో ఆరోపణలు చేసినవారిపై విచారణ ప్రారంభించడం లేదు కాబట్టి అలాటి నమ్మకం వారికి లేదని మనం నమ్మవలసి వస్తోంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫి్రబవరి 2015)**

## ఎమ్బీయస్ : ద్రౌపది పుట్టిన చోటు

రామ జన్మభూమి గురించి జరుగుతున్న వివాదం అందరికీ తెలుసు. అసలు రాముడు అమ్మమ్మ గారింట్లో పుట్టకుండా అయోధ్యలో పుట్టడమేమిటి అని కూడా కొందరు ప్రశ్నిస్తున్నారు. ఏ వివాదమూ లేనిది ద్రౌపది జన్మస్థలం. కానీ దాని గురించి ఎవరికీ పట్టటం లేదు. రాముడు పురుషోత్తముడైతే ద్రౌపది ఆత్మాభిమానానికి, ఆభిజాత్యానికి ప్రతీక. సీతలా అణకువగా బతికినది కాదు. స్వయంవరంలో తన యిష్టం ప్రకటించి కర్ణుణ్ని పెళ్లి చేసుకోను పొమ్మనమంది, దుశ్శాసనుడు వచ్చి 'నీ భర్త నిన్ను జూదంలో ఓడిపోయాడు, సభాస్థలికి రా' అంటే 'నన్నోడి తన్నోడెనా? తన్నోడి నన్నోడెనా?' అని లా పాయింటు లాగింది. విరటుని సభలో కీచకుడు తనను అవమానిస్తూ వుంటే మౌనంగా వున్న తన భర్త ధర్మరాజును దెప్పి పొడుస్తూ 'నా భర్త జూదరి, అందుకే నా బతుకు యిలా

రచ్చకెక్కింది' అని ఎత్తిపొడిచింది. కురుసభలో తనను అవమానించినవారిపై ప్రతీకారం తీర్చుకోమని భర్తలను మాటిమాటికి ప్రేరేపించి, పగ తీరిన తర్వాతే జుట్టు ముడేసింది. ఆమె సౌందర్యం ఆమె పాలిట శత్రువైంది. దాసి వేషంలో వున్నా కీచకుడి పాల బడింది. ఆడపడుచు మొగుడు కూడా ఆమెపై కన్నేసి ఎత్తుకుని పోబోయాడు. అయినా పౌరుషం, ప్రతాపం చూపిస్తూనే వచ్చిన ఆ శక్తి స్వరూపిణి భారతీయ స్త్రీలందరికీ సీత కంటె ఆదర్శప్రాయురాలని నీరా మిశ్రా అనే ఢిల్లీ సోషల్ ఎంట్రప్రెనార్ భావించింది. రామజన్మభూమిలో దేవాలయం గురించి వెంపర్లాడే, ఉద్యమాలు నడిపే పురుషప్రపంచం ద్రౌపది జన్మస్థలాన్ని పరిరక్షించే విషయం గురించి పట్టించుకోకపోవడం అన్యాయం అనుకుంది. ద్రౌపది ట్రస్టు అనే పేర ఒక ట్రస్టు పెట్టి ఆ పని తలకెత్తుకుంది.

మహాభారతంలో ప్రస్తావించిన పాంచాల దేశం ఈనాటి ఉత్తరప్రదేశ్‌లోని ఫరూకాబాద్ జిల్లాలో వుంది. పాంచాల దేశపు రాజధాని కాంపిల్యయే నేటి కంపిల్. ద్రోణుడికి గురుదక్షిణగా అర్జునుడు ద్రుపదుణ్ని ఓడించడం భారతంలో చదివాం. ద్రోణుడు క్షమించి వదిలిపెట్టిన తర్వాత తన రాజ్యానికి తిరిగి వచ్చిన ద్రుపదుడు ద్రోణుణ్ని చంపే కొడుకు, అర్జునుడికి భార్య కాగల కూతురు కావాలని యాగం చేశాడు. ఆ హోమకుండంలోంచి ద్రౌపది, ధృష్టద్యుమ్నుడు పుట్టారు. గంగానది ఒడ్డున వున్న ఆ హోమకుండం వద్ద ఏటా జాతర జరుగుతుంది. అదే వూరిలో ద్రుపదుడి కోటగా చెప్పబడే దిబ్బ వుంది. భారతకాలం నాటి కోట యిప్పటిదాకా ఎలా వుంటుందన్న సందేహం వస్తుంది కదా. బ్రిటిషు హయాంలో నెలకొల్పిన ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా తొలి డైరక్టర్ జనరల్ అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ ఆదేశాల మేరకు 1878లో ఆ దిబ్బ వద్ద సర్వే జరిగి, దాన్ని పురాతన ప్రదేశంగా గుర్తించి రక్షించడం మొదలుపెట్టారు. తర్వాతి రోజుల్లో తవ్వకాలు జరిపి అనేక శిల్పాలు, వస్తుసామగ్రి వెలికితీసి భద్రపరిచారు. అవి కుషాణుల కాలానికి, గుప్తుల కాలానికి చెందినవాటిగా గుర్తించారు. దొరికిన వాటిలో వున్న పింగాణీ సామగ్రి క్రీ.పూ. 370 నాటి వని అభిప్రాయపడ్డారు. మహాభారతకాలం అంటే యింకా పాతవై వుండాలి. ఏది ఏమైనా క్రీస్తు పూర్వం నాటి శిథిలాలు అక్కడ వున్నాయి కాబట్టి అవి ద్రుపదుడి కోటవి అయినా కాకపోయినా, భద్రపరచవలసిన, పరిశోధించవలసిన అవసరం వుంది. కానీ గత 30 ఏళ్లగా ఆర్కియాలజీ శాఖకు దానిపై ఆసక్తి తగ్గి పట్టించుకోవడం మానేసింది.

ఈనాడు ద్రౌపది కుండ్‌లో కంపు కొట్టే మురికి నీరు తప్ప మరేమీ లేదు. ద్రుపదుడి కోటగా చెప్పే దిబ్బను స్థానికులు ఆక్రమించి పొగాకు పండిస్తున్నారు. ఇది రక్షితస్థలమని తెలిపే బోర్డు సైతం లేదు. 2003లో ద్రౌపది పేర ట్రస్టు నెలకొల్పిన నీరా, ద్రౌపది జన్మస్థలంలోని మహిళలనైనా సొంత కాళ్లపై నిలబడేట్లా చేద్దామనుకుంది. వృత్తివిద్యలలో, కంప్యూటర్ కోర్సులలో వాళ్లకు తర్ఫీదు యిప్పిస్తోంది. దాంతో బాటు ద్రౌపది జన్మకుండ్‌కు రావలసిన గుర్తింపు కోసం ఉద్యమించి ప్రభుత్వ ఏజన్సీలలో చలనం తెప్పించింది. ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా వారి అనుమతి సంపాదించి లక్నో యూనివర్శిటీ చేత 2010-12 మధ్య అక్కడ తవ్వకాలు జరిపించింది. వాళ్లు 30 కందకాలు తవ్వి ఐదు వేర్వేరు కాలాలకు చెందిన పరికరాలను కనుగొన్నారు. ఆమె కృషి వలన 2012లో కాన్పూరు ఐఐటి వారి సివిల్ ఇంజనీరింగు విభాగం రాడార్‌తో భూమిలోపల వున్న అవశేషాలను స్కాన్ చేశారు. ఆ రిపోర్టు ప్రకారం దిబ్బ కింద రాళ్లు పరిచిన రోడ్లు, నీళ్లు పోయే కాలువలు, గోడలు కనబడ్డాయిట. కానీ పని మందకొడిగానే సాగుతోంది. తవ్వకాలు జరపడానికి పెద్ద యంత్రాలు తేవాలి. పక్కనున్న స్థలాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులు పొలాలు పాడై పోతాయని గోల చేస్తున్నారు. స్థానికులు కలిసి రావటం లేదు. వాళ్లు తవ్వకాల్లో బయటపడిన యిటుకలను పట్టుకుపోయారు, శిల్పాలను యిళ్లకు తీసుకెళ్లి పూజాగృహాల్లో పెట్టేసుకున్నారు. ద్రౌపది ట్రస్టు పెట్టాక నీరా మిశ్రా వాళ్లందరినీ ఒప్పించి వెనక్కి తీసుకుని వచ్చి వూళ్లో వున్న గుళ్లో వాటిని భద్రపరిచింది. అలనాటి ద్రౌపది చాలా కష్టాలే పడింది. ఆ ద్రౌపది స్మృతికి గౌరవం చేకూర్చాలని శ్రమిస్తున్న యీ నీరా ఎన్ని పడాలో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : దేవదూత సినిమా !?

"మెసెంజర్ ఆఫ్ గాడ్" (దేవదూత) అనే సినిమా సెన్సార్ సర్టిఫికెట్ వివాదం కారణంగా మొత్తం సెన్సార్ బోర్డే మారిపోయింది. ఇంతకీ ఆ సినిమా ఎలా వుంటుంది? దీనికి హీరో, డైరక్టర్, పాటల రచయిత, ముఖ్యగాయకుడు, ఆర్ట్ డైరక్టర్, కాస్ట్యూమ్ డైరక్టర్ అన్నీ – డేరా సచ్చా సౌదా అధినేత గుర్మీత్ సింగే! వయసు 47. ఆయన పిల్లలకు కూడా పిల్లలు పుట్టారు. డేరా వర్గాల సమాచారం ప్రకారం గుర్మీత్ యిప్పటికే 102 సంగీతప్రదర్శనలు నిర్వహించారు. ఒక్కో ప్రదర్శనకు లక్షకు తక్కువ కాకుండా ప్రేక్షకులు వచ్చారు. వెయ్యి పాటలు రాసి, పాడారు. ఈ సినిమాను 67 రోజుల్లో షూట్ చేశారు. ఈ సినిమాలో చిన్నా పెద్దా నటీనటుల సంఖ్య 13 లక్షలట. ఒక సన్నివేశం కోసం 75 వేల కొవ్వొత్తులు వెలిగించారు – అంతకంటె ఎక్కువ కొవ్వొత్తులు దొరకకపోవడం వలన! ఒక సెట్టింగు వేయడానికి ముంబయి నుంచి వచ్చిన ఆర్ట్ డైరక్షన్ టీము 45 రోజులు పడుతుందని చెపితే బాబా తన బుద్ధికుశలత వుపయోగించి భక్తుల చేత మూడు రోజుల్లో దాన్ని కట్టించాడట! 300 గంటలు నడిచే సినిమా తీసి దాన్ని 3 గంటలకు కుదించారు. ఈ సినిమా విడుదల కాకుండా దీనికి సీక్వెల్ షూటింగు ప్రారంభమై పోయింది. "దీనిలో నన్ను నేను దేవుడిగా చూపించుకోవడం లేదు. దీని ద్వారా యువతకు సందేశం యివ్వడమే నా లక్ష్యం. బాలీవుడ్ ప్రభావం దీనిపై వుండదు. ఫిబ్రవరిలో సినిమా విడుదలైనపుడు మీకే తెలుస్తుంది" అంటున్నాడు గుర్మీత్ – దేవదూత అనిపించుకోవడంలో తప్పేమీ లేదన్నట్టు! 1948లో నెలకొల్పిన డేరా సచ్చా

సౌదాకు అతను మూడో గురువు. 1967లో రాజస్థాన్‌లో జాట్ కుటుంబంలో పుట్టిన గుర్మీత్ 1990 నుండి డేరాకు అధినేత అయ్యాడు. అప్పటికి పదిలక్షల మంది భక్తులుంటే దాన్ని 50 రెట్లు పెంచాడు. అతని వేషాలు అవీ చూస్తే మనకు వింతగా తోచవచ్చు కానీ అతని భక్తులకు (5 కోట్ల మంది వున్నారట) అతను సాక్షాత్తూ దేవుడే. వాళ్లందరికీ లక్కీ నెంబర్ 7. ఎందుకంటే బాబా పేరు గుర్మీత్‌లో మొదటి అక్షరమైన 'జి' ఇంగ్లీషు అక్షరమాలలో ఏడో అక్షరం! అందువలన వాళ్ల మొబైల్ నెంబర్‌లో 7 అంకె వుండి తీరాలి.

అతనికి సిర్సాలో 700 ఎకరాల వ్యవసాయ క్షేత్రం వుంది. ఒకప్పుడు ఊసరక్షేత్రంగా వున్న దాన్ని సస్యశ్యామలంగా చేశాడు. భక్తులు అక్కడకి వచ్చి వుచితంగా పనిచేస్తారు. వాళ్లకు వసతి కల్పించి, భోజనం పెడతారంతే. లేబరు చార్జీలు తక్కువ కాబట్టి అక్కడ తయారయ్యే ఊరగాయలు, రోజ్ వాటర్, పళ్లరసాలు, అలోవియా, యితర హెర్బల్ ప్రాడక్టులు బాగా అమ్ముడుపోతాయి. వాటి మీద, బాబా మ్యూజిక్ ఆల్బమ్‌మీద, కారు డిజైన్ యూనిట్ల మీద వచ్చే ఆదాయంతోనే 104 ప్రజాసంక్షేమ సంస్థలు నడుస్తున్నాయి అంటారు వాళ్లు. నమ్మాలో లేదో భవిష్యత్తే చెపుతుంది. ఎందుకంటే ఏ ఆశ్రమం చూసినా ఆర్థిక లావాదేవీల వివాదాలలో చిక్కుకుంటోంది. ఏ మాట కా మాట చెప్పాలంటే డేరా వాళ్ల ఆశ్రమంలో నడిచే అనాథాశ్రమంలో పరిస్థితులు వంక పెట్టేట్లా లేవట. డేరా ఉద్యమానికి వెన్నెముక వాళ్ల వాలంటీర్ ఫోర్స్. ఏదైనా పని కావాలంటే 20 మంది వాలంటీర్లకు చెపితే చాలు, వాళ్లు తలా ఐదు మందికి చెప్తారు, వాళ్లు తలా మరో ఐదుగురికి.. ఇలా నిమిషాల్లో 100 మంది పనికి సిద్ధపడతారు. మీడియాలో ప్రచారానికి యిలాటిది చాలా ఉపయోగపడుతుంది. ఇలా చేసే గిన్నెస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోకి డేరా 13 సార్లు ఎక్కింది. సైనికుల కోసం మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో ఒక రికార్డు, (ఇప్పటివరకు 3 లక్షల లీటర్ల రక్తాన్ని డేరా భక్తులు దానం చేశారు) చెట్లు నాటడంలో మరో రికార్డు. ఈ రికార్డులలో కాయిన్ పైకి ఒకేసారి ఎగరేయడంలో (2011లో 12,013 మంది ఒకేసారి ఎగరేశారు) ఒకటి, గోళ్లకు రంగులేసుకోవడంలో (2012లో 7675 మంది ఒకేసారి వేసుకున్నారు) మరోటి కూడా వున్నాయి. వీటికి ఆధ్యాత్మికతకు సంబంధం ఏమిటని భక్తులెవరూ అడగరు. ఇప్పుడీ సినిమాలు, రంగురంగు దుస్తుల్లో డాన్సులు ఏమిటంటే మాదకద్రవ్యాలకు అలవాటు పడిన యువతను దారికి తీసుకురావడానికి అని అంటున్నారు. ఫిబ్రవరి నెలలో 3000 థియేటర్ల ద్వారా సినిమా విడుదలయ్యాక ఎంతమంది సంస్కరించబడతారో చూడాలి. యూట్యూబ్‌లో వున్న ట్రైలర్ చూసి ఎంతమంది మారారో డేరా వర్గాలు చెప్పలేదు.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : హోం సెక్రటరీ తొలగింపు

హోం సెక్రటరీ అనిల్ గోస్వామి చేత రాజీనామా చేయించడానికి, శారదా స్కాముకి లింకు వుందన్న విషయం బయటకు వచ్చింది. శారదా నిందితుల్లో ఒకరైన మాతంగ్ సింహ్ అసాం కాంగ్రెసు నాయకుడు. శారదాకు సంబంధించిన టీవీ ఛానెల్ కొన్నారు. ఆయన భార్యకు ఒక తెలుగు టీవీ ఛానెల్ వుండేది. సిబిఐ మాతంగ్ సింగ్‌ను అరెస్టు చేయబోతే అనిల్ గోస్వామి ఫోన్ చేసి ఆపించారు. మాతంగ్ సింహ్‌పై 2013లోనే కేసుంది. కెనరా బ్యాంకు నుండి ఫోర్జరీ డాక్యుమెంట్లతో అప్పు తీసుకుని ఎగ్గొట్టాడని అభియోగం. తన టీవీ కంపెనీకై వేరే వాళ్ల నుంచి టెక్నాలజీ కొన్నానని, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కొన్నానని దొంగ ఇన్‌వాయిసులూ చూపించి అప్పు తీసుకున్నాడు. చివరకు రూ. 67 కోట్లు బకాయి పడ్డాడని, తీర్చడం లేదని కెనరా బ్యాంకు 2011లో ఫిర్యాదు చేస్తే సిబిఐ 2013లో అరెస్టు చేయబోయింది. కానీ మాతంగ్ తనకు మొహమాటం వున్న అనిల్ వంటి ఉన్నతాధికారుల సాయంతో తప్పించుకున్నాడు. ఇప్పుడు శారదా స్కాములో పూర్తిగా దొరికిపోయాడు. శారదా స్కాము విచారణలో ముందుకు సాగడానికి సిబిఐకు చాలా అవరోధాలే ఎదురవుతున్నాయి. రాష్ట్ర పోలీసు యిచ్చిన డాక్యుమెంట్లు బహుస్వల్పం. స్కాములో భాగస్వాములు బెంగాల్‌లో యింకా పాలకులుగానే వున్నారు. 2014 నవంబరులో నిందితుడిగా అరెస్టయిన కుణాల్ ఘోష్ అనే జర్నలిస్టు, తృణమూల్ రాజ్యసభ ఎంపీ జైలునుండి సిబిఐను ఉద్దేశించి రాసిన 91 పేజీల లేఖ సిబిఐకు చాలా సమాచారాన్నే యిచ్చింది. "నేను పనిచేసిన "సంగ్బాద్ ప్రతిదిన్" యజమాని స్వపన్ సాధన్ బోస్, అతని కుమారుడు సృంజయ్ బోస్ (గురువారమే పార్టీ నుంచి, రాజ్యసభ సభ్యత్వం నుంచి రాజీనామా చేశాడు) నన్ను మాతంగ్ సింగ్‌తో లింకు పెట్టుకోమన్నారు" అని ఆ లేఖలో వుంది. సిబిఐ మాతంగ్ సింగ్ జోలికి వెళ్లగానే హోం శాఖ కార్యదర్శిగా వున్న అనిల్ గోస్వామి అడ్డుకున్నారు. జనవరి 31న మాతంగ్ సింగ్ అరెస్ట్ చేసిన సిబిఐ హోం మంత్రికి ఆ విషయం తెలియపరచడం, ఆయన అనిల్ గోస్వామిని పిలిచి అడిగితే ఆయన తప్పు ఒప్పుకోవడం జరిగాయి. అందుకే యీ రాజీనామా!

కుణాల్ మొదట్లో సిపిఎం సానుభూతిపరుడు. 2008లో వారి నుంచి దూరంగా జరిగి సింగూరులో ఉద్యమం నడుపుతున్న మమతా బెనర్జీని సమర్థించసాగాడు. అతను పనిచేసిన పత్రిక మమతాకు పూర్తిగా ప్రచారం కల్పించింది. శారదా గ్రూపు అధినేత సుదీప్త ఆ పత్రికను తీసుకుని, అనుబంధంగా అనేక పత్రికలు, టీవీలు నెలకొల్పి మమతాకు పూర్తి ప్రచారం కల్పించాడు. ఆ మీడియా గ్రూపుకి సిఇఓ కుణాల్ కాబట్టి అతనికి అనేక విషయాలు తెలుసు. సుదీప్తకు, తనకు పరిచయమే లేదని, ఎన్నడూ కలవలేదని మమత చేస్తున్న వాదన అబద్ధమని కుణాల్ తన లేఖలో స్పష్టం చేశాడు. ''ఆమె తరచుగా సుదీప్తతో మాట్లాడేది. శారదా గ్రూపుకి సంబంధించిన పత్రికలలో, టీవీల్లో తనకు వ్యతిరేకంగా ఏదీ రానిచ్చేది కాదు. ''లేఖలు'' శీర్షికలో విమర్శ వచ్చినా వెంటనే

ఫోన్ తీసుకుని నన్ను తిట్టేసేది. ఇలాటి కారణాలతోనే మా గ్రూపుకి చెందిన ఇంగ్లీషు పత్రిక "బెంగాల్ పోస్ట్"లో న్యూస్ కోఆర్డినేటర్‌ను తీయించేసింది." అంటాడు కుణాల్. ఫోన్లోనే కాదు, ఆమె ప్రత్యక్షంగా కూడా సుదీప్తను కలిసింది అంటాడు. ఆమె ముఖ్యమంత్రి అయిన కొత్తల్లో కలింపాంగ్‌లో సుదీప్తను కలిసిందని, తను కూడా ఆ సమావేశంలో వున్నాననీ అతని ఆరోపణ. తను ప్రధాని కావడానికి మార్గం సుగమం అయ్యేందుకు సుదీప్త ఢిల్లీలో ఒక యింగ్లీషు డైలీ పెట్టి ఆమెను బాగా ప్రొజెక్టు చేయాలని కోరింది. దానికి బదులుగా ఒక టూరిజం ప్రాజెక్టు ఆమెకు కట్టబెడతానంది. ఒక టూరిజం అధికారిని పిలిచి 'ప్రభుత్వం యీయనతో కలిసి ప్రాజెక్టు పెడుతుంది. భూమి ఎలాట్ చేయండి' అని చెప్పింది. అయితే ప్రభుత్వభాగస్వామ్యం నచ్చని సుదీప్త ఆ ప్రాజెక్టు వదిలేశాడు. ఇటీవల ఒక టీవీ యింటర్వ్యూలో మమతను 'మీకు సుదీప్త ఎవరో తెలియదంటున్నారు. కానీ కలింపాంగ్‌లో మీ యిద్దరి మధ్య సమావేశం జరిగిందట కదా' అని అడిగితే ఆమె కోపంతో అర్థాంతరంగా లేచి వెళ్లిపోయింది.

సుదీప్త మమత పెయింటింగ్స్ ఒక్కోటి రూ. 1.80 కోట్లు పెట్టి కొన్నాడన్న విషయం సువిదితమే. కుణాల్ లేఖ ప్రకారం అతను స ృంజయ్ కోరిక ప్రకారం క్యాష్ యిచ్చి కొన్నాడు. దానికి బదులుగా పెయింటింగ్స్ తనకు చేరాయో లేదో గుర్తే లేదు. సుదీప్త అంతర్థానం వెనుక మమత కుడిభుజం ముకుల్ రాయ్ పాత్ర ఎంతో కూడా లేఖ బహిర్గతం చేసింది. శారదా బండారం బయటపడగానే కుణాల్ మమతతో మాట్లాడాడు. ఆమె సుదీప్తతో మాట్లాడి 'అంతా సర్దుకుంటుందిలే' అని చెప్పింది. ఆ తర్వాత 2013 ఏప్రిల్ 5 న కలకత్తాలోని నిజాం ప్యాలస్‌లో ముకుల్ రాయ్ సమావేశం ఏర్పాటు చేసి సుదీప్తను, అప్పట్లో పోలీసు డైరక్టర్ జనరల్‌గా వున్న రజత్ మజుందార్‌ను పిలిచాడు. కుణాల్ కూడా వాళ్లతో బాటు వున్నాడు. ఆ సమావేశం తర్వాత సుదీప్త గాయబ్! దానికి గాను రజత్‌కు సుదీప్త నుండి చెక్కు రూపేణా లంచం ముట్టింది. అందుకే సిబిఐ రజత్‌ను 2014 సెప్టెంబరులో అరెస్టు చేసింది. ఇలాటి అనేక విషయాలు రాసిన కుణాల్ తనను తాను కూడా నిందించుకున్నాడు. 'వాళ్లు ఎఱ వేసిన నెలకు రూ.15 లక్షల జీతానికి కక్కుర్తి పడి వీటిలో పాలు పంచుకున్నాను' అని వాపోయాడు. మన తెలుగునాట యిప్పుడు అగ్రిగోల్డ్ వ్యవహారం నడుస్తోంది. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల విషయంలో జరుగుతున్న అవకతవకల గురించి మార్గదర్శి సమయంలోనే బయటపడింది. ఉండవల్లి అరుణ్‌కుమార్ వాటిని బయటపెట్టిన కారణంగా ఏ ఒక్క డిపాజిటరూ నష్టపోలేదు. ఆ తర్వాతైనా ఫైనాన్సు కంపెనీలు ప్రజల నుంచి తీసుకునే డిపాజిట్లపై నిఘా వేసి వుంచాల్సింది. అగ్రిగోల్డ్ యింత పెద్ద యెత్తున గోల్‌మాల్ చేసిందంటే దానికి రాజకీయ నాయకుల దన్ను వుండే వుంటుంది. ఈ రోజు దానికున్న ఆస్తులన్నీ రాజధాని ప్రాంతంలో వుండడం దాని పాలిట శాపంగా మారింది. ఆస్తులను అమ్ముకోనిస్తే డిపాజిట్లు వెనక్కి యిచ్చేస్తానని కంపెనీ అంటున్నా వినటం లేదు. ఆస్తులను తక్కువ రేట్లకు స్వాధీనం చేసుకుని కంపెనీని దివాళా తీయించే ప్రయత్నమే సాగుతోంది. ఈ క్రీడలో డిపాజిటర్లు నష్టపోతారు. అగ్రిగోల్డ్‌కు కూడా పత్రిక, టీవీ వున్నాయి. వాటిలో జర్నలిస్టు ఎవరైనా కుణాల్ తరహాలో లేఖ రాస్తే అగ్రిగోల్డ్‌ను యిన్నాళ్లూ కాపాడిన రాజకీయ నాయకులెవరో బయటపడుతుంది.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : ముస్లిం జనాభా పెరుగుదలపై ఆందోళన

2011 జనాభా గణాంకాలు పూర్తిగా బయటకు వచ్చేలోపుగా జనవరి 22న ఒక 'పదేళ్లలో 24% పెరిగిన ముస్లిం జనాభా' అంటూ ఒక లీకు వెలువడింది. దాని ప్రకారం 2001-11 మధ్య జనాభా పెరుగుదల సగటున 18% వుండగా ముస్లిംల జనాభా మాత్రం 24% పెరిగింది. జనాభాలో 2001లో ముస్లింల శాతం 13.4% వుండగా అది 2011 నాటికి 14.2% అయింది. దేశవ్యాప్తంగా సగటు ముస్లిం జనాభా పెరుగుదల 0.8% కాగా, బంగ్లాదేశ్ నుండి వలసలు ఎదుర్కుంటున్న బెంగాల్‌లో 1.8% పెరగగా అసాంలో 3.3% పెరిగింది. ఉత్తరాఖండ్‌లో 2% పెరిగింది. ఈ అంకెలు బయటకు రాగానే ఈ లెక్కన యీ దేశంలో కొన్నాళ్లకు హిందువుల కంటె ముస్లిములు పెరిగిపోతారన్న ఆందోళన ప్రారంభించారు హిందూత్వవాదులు. సాక్షి మహారాజ్, సాధ్వీ ప్రాచీ వంటి వారు హిందూ తల్లులు యిబ్బడిముబ్బడిగా పిల్లల్ని కనాలని పిలుపు నిచ్చారు. శివసేన నాయకుడు 'పదిమంది కంటె ఎక్కువమందిని కన్న హిందూ మహిళకు రూ.21000 బహుమతి యిస్తాం' అని ప్రకటించాడు. శివసేన ఉత్తర్‌ప్రదేశ్ అధ్యక్షుడు "ముస్లిములు కుటుంబ నియంత్రణ పాటించటం లేదు. మనమెందుకు పాటించాలి?" అని గర్జించాడు. ముస్లిం జనాభా పెరుగుదలను ఏ కోణంలో చూడాలి? ఇండియాలో హిందువులు మైనారిటీ అయ్యే ప్రమాదం వుందా? అనే విషయం తెలుసుకోవాలంటే గణాంకాలను పూర్తిగా పరికించాలి. పాక్షికంగా వస్తున్న లీకులు అనవసరంగా గందరగోళ పరుస్తాయి.

ఈ 2011 జనగణన కంటె ముందే 2006లో వెలువడిన సచార్ కమిటీ ముస్లిం జనాభా గురించి సరైన అంచనాలే వేసి 2011 నాటికి 14.2% అవుతుందని చెప్పింది. నిజానికి ముస్లింలలో పునరుత్పత్తి గతంలో కంటె తగ్గింది. 1991-2001 మధ్య ముస్లిం జనాభా పెరుగుదల 29%. తర్వాతి దశాబ్దంలో అది 24% అయింది. 1998-99 కాలంలో ముస్లిం మహిళల ఫెర్టిలిటీ రేటు (పునరుత్పత్తి శాతం) 3.59% వుండగా, 2005-06 నాటికి అది 3.09% అయింది. అంటే 0.50% తగ్గింది. అదే కాలంలో హిందువుల్లో 2.78% నుండి 2.65%కి తగ్గింది. అంటే తగ్గుదల 0.13% మాత్రమే. ముస్లిం మహిళలలో మార్పు వస్తోంది కాబట్టే యీ తగ్గుదల సంభవించింది. 1992-2006 మధ్య ఫెర్టిలిటీ రేటు శాతంలో తగ్గుదల ముస్లింల విషయంలో 30% కాగా,

హిందువుల విషయంలో 20% మాత్రమే! హిందువుల కంటె ముస్లిం మహిళలు ఎక్కువమంది సంతానాన్ని కలిగి వుండటానికి కారణాలున్నాయి – చిన్నతనంలో పెళ్లి కావడం, తగినంత అక్షరాస్యత లేకపోవడం, ఉద్యోగాలకు వెళ్లకుండా యింటిపట్టున వుండడం, మతపెద్దల మాట విని గర్భనిరోధణ సాధనాలు వాడకపోవడం యిలాటివి! హిందువుల్లో జననాలు తక్కువగా వుండడానికి మెరుగైన ఆర్థికపరిస్థితి, అక్షరాస్యత, యిద్దరూ వుద్యోగాలు చేయడం వంటి కారణాలతో బాటు గర్భంలోనో, పుట్టగానో ఆడబిడ్డను చంపివేయడం కూడా ఒకటి. ముస్లింలలో యీ అలవాటు పెద్దగా కనబడటం లేదు. పురుషుల, స్త్రీల మధ్య నిష్పత్తిని ఏ ఏజ్ గ్రూపులో చూసినా ముస్లిం మహిళ నిష్పత్తి ఎక్కువగా వుంటోంది. ఐదేళ్ల లోపు గ్రూపులో హిందూ బాలుర సంఖ్యతో పోలిస్తే బాలికల సంఖ్య చాలా స్వల్పంగా వుంటోంది. సగటు హిందూ స్త్రీకి 2.65 పిల్లలుంటే, సగటు ముస్లిం స్త్రీకి 3.09 పిల్లలుంటున్నారు. తేడా 0.44. అయినా హిందూ జనాభా ఎక్కువ కాబట్టి 2001–11 మధ్య 8 కోట్లు పెరిగి జనాభాలో 78.3% వున్నారు. 2001 కంటె జనాభాలో వారి శాతం 1.3% తగ్గింది. ఇదే సమయంలో ముస్లిం జనాభా 0.8% పెరిగింది. ఈ తేడాతో వాళ్లు హిందువులను దాటిపోయే ప్రమాదం ఎంతకాలంలో వుంది?

సచార్ కమిటీ అంచనాల ప్రకారం జనాభాలో ముస్లింల శాతం 2041 నాటికి 16.26%, 2071 నాటికి 17.57%, 2101 నాటికి 17.98% అవుతుంది. అంకెల్లో చెప్పాలంటే వారి జనాభా అప్పటికి 32 కోట్లు అయి, (ఇప్పుడు 13.81 కోట్లున్నారు) ఆ తర్వాత స్టెబిలైజ్ అయిపోతుంది. సామాజికపరమైన మార్పులు, ఆ వర్గాలు ఆర్థికమైన ప్రగతి సాధించగలిగితే అంతకంటె ముందే స్టెబిలైజ్ కావచ్చు కూడా. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 4**

## ఎమ్బీయస్ : ఢిల్లీ ఎన్నికల సస్పెన్స్

ఢిల్లీలో బిజెపి గెలుపు ఖాయం అనే దశ నుంచి ఆప్‌కి ఎక్కువ సీట్లు వస్తాయి అనే పరిస్థితికి మారినట్లు సర్వేలు చెపుతున్నాయి. సర్వేలను బట్టి బిజెపి వెనకబడిపోయిందని తీర్మానించడం కష్టమే. బిజెపికి వున్న పార్టీ నిర్మాణం ఆప్‌కు లేదు. ప్రభుత్వం బిజెపి చేతిలో వుంది, పోలీసు బలగం వుంది. అమిత్ షా వంటి కార్యదక్షుడు వున్నాడు. స్థానికులను నమ్ముకోకుండా యితర ప్రాంతాల నుంచి ఆరెస్సెస్ కార్యకర్తలను రప్పించి బూత్ స్థాయిలో యింటింటికి తిప్పుతున్నారట. మోదీతో సహా కాబినెట్ మంత్రులందరూ ఢిల్లీ ఎన్నికలలో తలమునకలయ్యారు. వీటన్నిటి వలన బిజెపి తక్కువ మార్జిన్‌తోనైనా మెజారిటీ సీట్లు గెలిచినా గెలవవచ్చు. గత ఢిల్లీ ఎన్నికల సమయంలో బిజెపి, ఆప్‌ను సీరియస్‌గా తీసుకోలేదు. ఇప్పుడు గెలుస్తామనే నమ్మకంతో ముందుకు వెళ్లినా కిరణ్ బేదీను సిఎం ప్రకటించిన తర్వాత యిక్కట్లు ఏర్పడి ఆప్ వైపు మొగ్గు కనబడుతోంది కాబట్టి దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చు. సీనియర్ బిజెపి నాయకులను బతిమాలో, బుజ్జగించో, బెదిరించో దారికి తెచ్చుకోవచ్చు. ఢిల్లీ ఎన్నికలు ప్రతిష్ఠాత్మకమైనవి కాబట్టి సామదానభేద దండోపాయాల్లో దేన్నీ వదలకపోవచ్చు. ఇంత చేసినా ఆప్‌కే ఎక్కువ సీట్లు వచ్చినా అప్పుడూ ఆశ్చర్యపడవద్దు. ఎందుకంటే బిజెపిని ఓడించి, మోదీ దూకుడుకు అడ్డుకట్ట వేసే లక్ష్యంతో కాంగ్రెసు తన ఓటర్లను ఆప్‌వైపు మళ్లించిందని అందరూ అంటున్నారు. ఈ వాదన కూడా పొరపాటని, సర్వేలలో చూస్తే పార్లమెంటు ఎన్నికల సమయం నుండి కాంగ్రెసు ఓటింగ్ శాతం యథాతథంగా వుందని, బిజెపి నుంచే ఆప్ ఓట్లు గుంజుకుంటోందనీ పరిశీలకులు అంటున్నారు. అలా జరిగినా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే పార్లమెంటు ఎన్నికలు మోదీని గెలిపించే లక్ష్యంతో సాగాయి. ఈ అసెంబ్లీ ఎన్నికలలో మోదీ అభ్యర్థి కాదు, కిరణ్ బేదీ!

రాజకీయ నాయకులంటే అసహ్యం అంటూ అన్నా హజారే సమావేశాలకు వచ్చిన నాయకులను వేదిక నుంచి దింపేసిన వ్యక్తి కిరణ్ బేదీ. ఈ రోజు ఆమె రాజకీయాల్లోకి వచ్చి సాధారణ రాజకీయజీవిలా వాగ్దానాలు కురిపిస్తూ వుంటే, కంటతడి పెడుతూ వుంటే చాలా విడ్డూరంగా వుంది. కిరణ్ తన అధికారాన్ని పూర్తిగా వినియోగించి అందర్నీ అదలెత్తించిన మనిషి. ఆమె కంటె ఎక్కువ ప్రతిభావంతులున్నా, ఆమెకు రావలసినంత దాని కంటె ఎక్కువ పేరు వచ్చిందని ఐపియస్ అధికారులు అంటారు. ఇక రాజకీయాలన్నాక ఛోటా నాయకులు, కార్యకర్తలు దగ్గరకు వస్తారు, ఉపకారాలు చేయమని కోరతారు. కిరణ్‌ను చూస్తే వాళ్లకు గొంతు తడారిపోతుంది. ముఖ్యమంత్రి అయ్యాక యీమె మనకు అందుబాటులో వుండదు అనే భావన బిజెపి కార్యకర్తల్లో బాగా నాటుకు పోయింది. అందుకే వారందరూ ఉత్సాహరహితంగా వున్నారు. అరవింద్ అప్పుడే రాజకీయాల్లోకి వచ్చి రాటు తేలాడు. మామూలు కార్యకర్తలతో కలిసిపోతున్నాడు. అతనితో పోలిస్తే కిరణ్ ఉపన్యాసాలు జనాలను ఆకట్టుకోవడం లేదు. కిరణ్‌ను సిఎం అభ్యర్థిగా తేవడం గొప్ప వ్యూహం అని అమిత్, మోదీ అనుకుని వుండవచ్చు కానీ అది పొరపాటని యిప్పుడు అనిపిస్తోంది. తమను సంప్రదించకుండా, ఒప్పించికుండా ఎక్కణ్నుంచో సిఎం అభ్యర్థిని దింపడం నాయకులకు, కార్యకర్తలకు మింగుడు పడటం లేదు. ఆమెను తేవడంలోనే మోదీ నెర్వస్‌నెస్ బయటపడిందని, అది ఓటర్లలో తప్పుడు సంకేతం పంపిందని బిజెపి వారి అభిప్రాయం. ఢిల్లీ రామలీలా మైదాన్‌లో జనవరి 10 న తన సభకి జనం రాకపోవడం మోదీలో కంగారు పుట్టించిందని అందరికీ తెలుసు. అంతమాత్రాన బయటివ్యక్తిని తేవాలా అనేదే వారి ప్రశ్న.

ఆప్‌కు ఆదరణ పెరుగుతున్న కొద్దీ బిజెపిలో నెర్వస్‌నెస్ మరింత పెరుగుతోంది. ఆప్ నుంచి చీలివచ్చిన సంస్థను చేరదీయడం, ఎప్పుడో వారికి వచ్చిన విరాళాలపై ఆరోపణ చేయడం హాస్యాస్పదంగా వుంది. మోదీ కూడా తన స్థాయి మరచి వీటిని ప్రస్తావించారు.

ఇతరుల స్విస్ బ్యాంకు ఖాతాల వివరాలు జేబులో పెట్టుకుని తిరిగే ఆప్ నాయకులకు తమ పార్టీ ఖాతాలో డబ్బు ఎలా వచ్చిందో తెలియదా అంటూ ఎద్దేవా చేశాడు. విరాళాల వివరాలు తవ్వితే బిజెపి కవచంలో చాలా తూట్లు కనబడతాయి. ఈ విషయం తెలిసే అరవింద్ యీ విరాళాలే కాదు, బిజెపి కాంగ్రెసు విరాళాల విషయంలో కూడా విచారణ డిమాండ్ చేస్తూ సుప్రీం కోర్టుకి రాశాడు. ఇవాళే విరాళాల విషయంలో రాజకీయపార్టీలు చేసే తమాషాల గురించి ఒక రిపోర్టు పేపర్లో వచ్చింది. ఫైనాన్సు మంత్రిత్వశాఖ ఆమోదించిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ నివేదిక ప్రకారం 2009-10, 2010-11 సంవత్సరాలలో రాజకీయపార్టీలు సేకరించిన విరాళాలలో 75% మొత్తం ఎవరు యిచ్చారో రికార్డులు లేవు. రూ.20 వేల రూపాయల కంటె తక్కువ విరాళం యిచ్చిన దాతల పేర్లు నమోదు చేసుకోనక్కరలేదు అనే వెసులుబాటు వుపయోగించుకుని బిజెపి పార్టీ తమకు వచ్చిన 426 కోట్ల రూ.ల విరాళాలలో 77% 20 వేల కంటె తక్కువే అంది. తమకు వచ్చిన 775 కోట్ల రూ.లలో 88% డిటోడిటో అంది కాంగ్రెసు. బహుజన సమాజ్ పార్టీ అయితే తమకు వచ్చిన 172 కోట్లూ 100% అలాటి విరాళాలే అంది. 150 కోట్ల విరాళాలు చూపిన సిపిఎం 99% ఆ బాపతే అంది. అన్ని పార్టీలదీ యించుమించు యిదే చరిత్ర. ఇలాటి పరిస్థితుల్లో ఆప్‌కు వచ్చిన విరాళాల గురించి యింత యాగీ చేస్తే నవ్వరా?

అరవింద్ 'ఉపద్రవీ గోత్రీకుడు' అనే యాడ్ ఎవరు డిజైన్ చేశారో కానీ చాలా పూర్ టేస్టు కనబరచారు. ఇందిర హత్య తర్వాత జరిగిన ఎన్నికలలో రాజీవ్ ఎలక్షన్ మేనేజర్లు హిందూ ఓట్లు గంపగుత్తగా పొందడానికి శిఖ్కులను దుర్మార్గులుగా చూపించబోయారు. 'మీ టాక్సీ డ్రైవర్‌ని చూసి మీరెందుకు భయపడాలి?' అంటూ శిఖ్కు టాక్సీ డ్రైవర్ ఫోటో వేశారు. శిఖ్కులందరూ టాక్సీ డ్రైవర్లా అంటూ వాళ్లు విరుచుకుపడ్డారు. నిజానికి అవేమీ అవసరం లేకుండానే సింపతీ ఓటుతో రాజీవ్ భారీగా గెలిచారు. కానీ కాంగ్రెసు పార్టీ అప్పుడు మతాన్ని వాడుకుంది. ఇప్పుడు బిజెపి తన కులస్తులను, గోత్రీకులను అవమానపరిచింది అంటూ అరవింద్ రచ్చ చేస్తున్నారు. బిజెపికి యిది అవసరమా? అరాచకవాది, ఉపద్రవవాది అంటే పోలేదా? గోత్రీ అనడం దేనికి? పైగా గత రిపబ్లిక్ డే పెరేడ్‌ను భగ్నపరచబోయాడు కాబట్టి యీసారి పిలవలేదు అని యాడ్ యివ్వడం ఏమిటి? ఆయన అడగలేదు కాబట్టి ఆహ్వానం పంపలేదు అని మొన్ననే కదా చెప్పారు!? అరవింద్ తన ప్రభుత్వాన్ని తానే కూలదోసుకున్న అవివేకి అని అంటున్నారు. అది పొరపాటు, మళ్లీ చేయను అని అరవింద్ స్వయంగా చెప్పుకున్నపుడు ఓటర్లు యింకేమనగలరు? ఉద్యమకారుడిగా అరవింద్ ఢిల్లీవాసులకు యిష్టుడు. అధికారంలో వున్న నెలన్నరలో కూడా డబ్బు తీసుకున్నట్లు ఎవరూ నిరూపించలేకపోయారు. అతనితో చర్చకు దిగడానికి భయపడిన కిరణ్ వేళాకోళానికి గురయ్యింది. రాజకీయాల్లో దిగడం అవకాశవాదం అంటూ అరవింద్‌ను అప్పట్లో విమర్శించిన మీరు యిప్పుడు రాజకీయాల్లోకి ఎలా వచ్చారు? అని టీవీ యాంకరు అడిగితే కిరణ్ యింటర్వ్యూ మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయింది. ఇవన్నీ చాలనట్లు ఆప్ నాయకులు తనపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపించింది. అవేమిటో చెప్పండి, విచారణకు ఆదేశించండి అని వాళ్లు అడిగితే జవాబు లేదు. ఒక సీనియర్ పోలీసు ఆఫీసరుగా పని చేసి అందర్నీ తారెత్తించిన ఆమె నిస్సహాయురాలంటే, మాటలు పడి వూరుకుందంటే ఎవరు నమ్ముతారు? ఇవన్నీ చీప్ టాక్టిక్స్‌గా మిగిలిపోతాయి.

రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే పార్టీ ప్రభుత్వం వుంటే మంచిదని బిజెపి నాయకులు నూరిపోస్తున్నారు. ఆ లెక్కన కేంద్రంలో యుపిఏ వున్నపుడు ఎంపీ, రాజస్తాన్, గుజరాత్‌లలో కూడా కాంగ్రెసునే గెలిపించాల్సింది. ఇప్పుడు తాము కేంద్రంలో వున్నారు కాబట్టి యిలా మాట్లాడతారు. ఇవన్నీ ఢిల్లీ ఓటర్లకు తెలియని విషయాలు కావు. వారిలో విద్యావంతులు, రాజకీయ అవగాహన వున్నవారు చాలామంది వున్నారు. అరవింద్ దిగిపోయిన చాలాకాలమైనా, బిజెపి ఢిల్లీ ఎన్నికలు నిర్వహించలేదు. ఫిరాయింపుదార్లతో ప్రభుత్వం ఏర్పరచాలని, విఫలమయ్యాకనే అసెంబ్లీ రద్దు చేసింది. ఈ లోగా మహారాష్ట్ర ఎన్నికలలో శివసేన కొమ్ములు విరిచింది. కశ్మీర్‌లో మెజారిటీ సీట్లు తెచ్చుకోలేకపోయినా పిడిపితో బేరాలాడుతూ వాళ్లు కిందికి దిగివచ్చేట్లా చేస్తోంది. మోదీ-అమిత్ యిద్దరూ గడుసువాళ్లే కాబట్టి యివన్నీ చేస్తున్నారు. ఢిల్లీలో కూడా ఏదో మ్యాజిక్ చేసి బిజెపిని గెలిపిస్తారు అని ఢిల్లీ ఓటర్లు కూడా అనుకుంటున్నారు కానీ యీ గడుసు యిమేజి కూడా ఒక్కోప్పుడు కౌంటర్ ప్రొడక్టివ్. గడుసువాడితో మాట్లాడేటప్పుడు ముందే ఎలర్టయి, మనసులో కౌంటర్లు రెడీ చేసుకుంటాం. అదే అవతలివాడు వెర్రిబాగులోడు అనుకుంటే మన రక్షణ వ్యవస్థ నిద్రిస్తుంది. అతను చెప్పేవి మనసులో నాటుకుంటాయి. అరవింద్‌పై జాలి కురిసి, పోనీ ఓ ఛాన్సిద్దాం అనుకున్నా అనుకోవచ్చు. కాంగ్రెసు 15 ఏళ్లపాటు పాలించి ఢిల్లీని నాశనం చేస్తే, ఆప్ ఏడాదిపాటు ఢిల్లీని నాశనం చేసిందని మోదీ సెటైర్లు వేశారు. ఓ పక్క అరవింద్ 49 రోజుల పాలన గుర్తు చేస్తూ ఎకె-49 అని పేరు పెడుతూనే అతను 365 రోజులు పాలించాడని ఎలా అంటారు? ఏడాదిలో ఏడు నెలలుగా పాలిస్తున్నది బిజెపి సర్కారు హోం శాఖే! ఇక షీలా దీక్షిత్ మొదటి రెండు టెర్మ్‌లు సరిగ్గా పాలించి వుండకపోతే మూడో టెర్మ్‌లో ఎన్నికయ్యేది కాదు కదా!

ఢిల్లీ ఎన్నికల ఫలితం 10 న తెలుస్తుంది. బిజెపి వాళ్లు - గెలిస్తే మోదీ మ్యాజిక్ అంటారు, ఓడితే బేదీ కారణంగా అంటారు. మోదీ వేవ్ చల్లారలేదని చూపించడమే వారి లక్ష్యం. అల అలాగే వుండిపోవడం ప్రకృతివిరుద్ధం. ఏదీ ఎల్లకాలం సాగదు. ఎక్కడో అక్కడ బ్రేకులు పడుతూంటాయి. మొన్నటివరకు సోనియా, రాహుల్ తమకు ఎదురు లేదని విర్రవీగారు. ఈ రోజు తరతరాల విశ్వాసపాత్రురాలు జయంతి నటరాజన్ నుంచి అందరూ ఎదురు తిరుగుతున్నారు. అలాగే మోదీ-అమిత్ ద్వయానికి కూడా అతివిశ్వాసం పనికి రాదంటూ ఢిల్లీ ఎన్నికలు యిప్పటికే గుణపాఠం నేర్పాయి. కష్టపడి నెగ్గినా పిచికపై బ్రహ్మాస్త్రం వుపయోగించవలసి వచ్చిందన్న యీ పాఠం వారు మర్చిపోకూడదు. **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

ఫిబ్రవరి 5 వీక్లీకై ఎమ్బీయస్ : సోనియాపై పుస్తకం

జావియర్ మోరో అనే స్పానిష్ నవలా రచయిత సోనియా జీవితం గురించి రాసిన "ద రెడ్ శారీ" అనే పుస్తకం స్పెయిన్‌లో 2008 అక్టోబరులో వెలువడింది. దాదాపు పన్నెండు భాషల్లో అనువదించబడింది. కానీ ఇంగ్లీషులోకి మాత్రం కాలేదు. దానిపై భారతదేశంలో అప్రకటిత నిషేధం వుంటూ వచ్చింది. బిజెపి ప్రభుత్వం వచ్చాక ఆ పుస్తకాన్ని యింగ్లీషులో ఇండియాలోని బుక్ స్టోర్స్‌లో లభిస్తోంది. "ఔట్‌లుక్" వారపత్రిక ఆ పుస్తకంలోని కొన్ని భాగాలను ముద్రించడమే కాకుండా, ఆ రచయితతో యింటర్వ్యూ కూడా ప్రచురించింది. భారత స్వాతంత్ర్యంపై వచ్చిన "ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్" రచయితల్లో ఒకరైన డొమెనిక్ మేనల్లుడే ఆ రచయిత. తన మామ రచనల ద్వారా ఇండియా గురించి, నెహ్రూ కుటుంబం గురించి అతనికి అవగాహన ఏర్పడింది. ఇటలీలో పేద కుటుంబంలో పుట్టి సామాన్యమైన తెలివితేటలున్న సోనియా అనూహ్య పరిస్థితుల్లో ఆ కుటుంబంలో కోడలుగా వచ్చి భారతదేశాన్ని పరోక్షంగా ఏలగలగడం అతనికి అబ్బురంగా తోచింది. ఆమె యీ పయనాన్ని రసవత్తరమైన కథగా చూశాడతను. రోమ్‌లోని అతి పెద్ద బుక్‌స్టోర్స్‌కి వెళ్లి సోనియా జీవితంపై పుస్తకం వుందా అని వాకబు చేశాడు. ఒక్కటి కూడా లేదన్నారు. తన జీవితం గ్రంథస్తం కావడానికి సోనియా యిష్టపడలేదని, ఎవరికీ అనుమతి యివ్వలేదని, యింటర్వ్యూలు యివ్వదని, వివరాలు చెప్పదని అందుకే ఏ ఇటాలియన్, ఏ యూరోపియన్ జర్నలిస్టూ ఆమె జీవితచరిత్ర రాయడానికి సాహసించలేదని అతనికి అర్థమైంది. ఆ పని తనే ఎందుకు చేయకూడదనుకుని ఆమెతో చెప్పకుండానే ఆమె వివరాలు సేకరించడం మొదలుపెట్టాడు. ఆమె పుట్టిన ఆర్బాసానో అనే వూరికి వెళ్లి మూడువారాలు హెూటల్లో కాపురం పెట్టి ఆమెకు బాల్యంలో ఐస్‌క్రీమ్ అమ్మినవాడి దగ్గర్నుంచి అందర్నీ పలకరించాడు. వాళ్ల నాన్న ఎంత దారిద్ర్యంలో బతికాడో తెలిసింది. వెతుకులాటలో జావియర్‌కు అదృష్టం కలిసి వచ్చి స్పెయిన్‌లో జర్నలిస్టుగా పనిచేసే జోస్టో మాఫియో అనే ఇటాలియన్ పరిచయమయ్యాడు. అతను ఆ వూరి పోలీసు అధికారి కొడుకు. సోనియాకు 15 ఏళ్ల వయసులో తొలి బాయ్‌ఫ్రెండ్!

జావియర్ ఇండియాకు వచ్చి సోనియా సర్కిల్‌లోని ప్రముఖులను కదలేస్తే ఎవరూ పెదవి విప్పలేదు. చివరకు 10 జనపథ్‌లో తోటమాలిగా పనిచేసిన ఒకతను దొరికాడు. ఇంటి విషయాలెన్నో చెప్పాడు. ఇందిరకు 16 ఏళ్ల పాటు సెక్రటరీగా పనిచేసిన ఉషా భగత్ అనే ఆమె కొన్ని సంగతులు చెప్పింది. ఇలా సేకరించిన సమాచారంతో చక్కటి నవలలా తన పుస్తకాన్ని రాశాడు. దాన్ని పబ్లిష్ చేయడానికి ముందు అతను సోనియాను కలిసి, "నేను రాసిన పుస్తకం కాపీ పంపమంటారా?" అని అడిగాడు. "అక్కరలేదు, మా గురించి రాసిన పుస్తకాల్ని మేం ఎప్పుడూ చదవం" అందామె రాజసం ఒలకబోస్తూ. ఇవన్నీ అతను చెప్పాడు. 'మీరు రాసిన పుస్తకం యీ దేశప్రజలు చదవకూడదని కాంగ్రెసు పార్టీ ఎందుకు ప్రయత్నించింది?' అనే ప్రశ్నకు బదులుగా అతను 'అప్పటికే ఆమె విదేశీయురాలనే చర్చ జరుగుతోంది. విదేశీయురాలైనా గొప్ప కుటుంబం నుంచి వచ్చిందన్న భావం భారతప్రజల్లో వుండాలని పార్టీ ఆశపడింది. ఆమె ఒక లోక్లాస్ యూరోపియన్ పిల్ల అని బయపడడం వాళ్లకు యిష్టం లేదు.' అన్నాడు. పుస్తకం చదివితే సోనియా తండ్రి ఒకప్పుడు గొఱ్ఱెలు కాచుకునేవాడని తెలుస్తుంది. అంతేకాదు, పెద్దగా లోకజ్ఞానం లేనివాడు, భయస్తుడు కూడా. ఇండియా వంటి దూరదేశంలో తన కూతురు స్థిరపడడం జీర్ణించుకోలేక పోయాడు. ఆమె పెళ్లికి అతను రాలేదు. తన స్నేహితుడితో 'అక్కడ ఆమెను పులులకు ఆహారంగా వేసేస్తారు' అని చెప్పుకుని బాధపడ్డాడు. పెళ్లికి సోనియా తల్లి, సోదరి, మేనమామ మాత్రమే వచ్చారు.

సోనియాను పెళ్లి చేసుకుంటానని తనని అడగడానికి రాజీవ్ వాళ్లింటికి వచ్చినపుడు అతను చాలా కంగారుపడ్డాడు. రాజీవ్‌కు, అతనికి మధ్య దుబాసీగా సోనియాయే పనిచేసింది. "మీ అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి మీ అనుమతి కోరడానికై వచ్చాను." అని రాజీవ్ అంటే అతను "నీ కళ్లల్లో నిజాయితీ కనబడుతోంది. కానీ సోనియా విషయమే నాకు సందేహంగా వుంది. చిన్నపిల్ల. ఇండియా వంటి దూరదేశంలో బతకలేదు. మన సంస్కృతుల్లో చాలా తేడా వుంది." అన్నాడు. "పోనీ ఆమెను ఇండియాకు పంపి అక్కడ అలవాటు పడుతుందో లేదో చూదాం. మా అమ్మకు ఆల్‌రెడీ పరిచయం చేశాను. సోనియా ఒక్కత్తీ అక్కడకు వెళ్లి మా యింట్లో వుంటుంది, కొన్ని రోజులకు నేను వెళ్తాను. తనకు ధైర్యం చిక్కితేనే పెళ్లి చేసుకుంటాం." అని సూచించాడు రాజీవ్. "ఈ ప్రయోగమైనా తనకు 21 ఏళ్లు నిండితేనే తప్ప నేను అనుమతించలేను. అంటే యింకో ఏడాది అన్నమాట. అప్పటికి కూడా మీకు ఒకరిపై మరొకరికి యింత యిష్టం వుంటుందో లేదో చూదాం." అన్నాడు.

సోనియా తండ్రి విధానం యిలా వుంటే రాజీవ్ తల్లి ఇందిరా గాంధీ పద్ధతి యింకెలా వుందో కూడా రాశాడు రచయిత. ఇందిరా గాంధీ లండన్ వచ్చి ఇండియన్ ఎంబసీలో బస చేసిందని తెలిసి రాజీవ్ సోనియాను ఆమె దగ్గరకు వెంటబెట్టుకుని వెళతానన్నాడు. ఆమె సరేనంది కానీ సగందారిలో భయం పట్టుకుంది. 'అంత ఉన్నతస్థానంలో వున్నావిడ దగ్గర నేనెలా ప్రవర్తించాలో అర్థం కావటం లేదు, యీ సారి కాదు, వచ్చేసారి వస్తానులే' అందామె. కొన్ని రోజుల తర్వాత ధైర్యం కూడగట్టుకుంది. ఓ స్టూడెంటు పార్టీకి వెళుతూ రాజీవ్‌తో కలిసి అతని గర్ల్‌ఫ్రెండ్‌గా ఇందిర వద్దకు వెళ్లింది. ఆమెతో కాస్సేపు మాట్లాడగానే ఇందిరకు అర్థమైంది – ఇంగ్లీషు సరిగ్గా రాదని. ఆమె కోసం ఫ్రెంచ్‌లో మాట్లాడింది. "నేనూ నీ లాగే ఒకప్పుడు మొహమాటస్తురాలిని, యవ్వనంలో వుండగా ప్రేమలో పడినదాన్ని, నీ యిబ్బంది అర్థం చేసుకోగలను" అని ధైర్యం చెప్పింది. సోనియా "పార్టీకి వెళ్లడానికి యీవెనింగ్ డ్రెస్ వేసుకోవాలి.

పక్కరూములో కెళ్లి బట్టలు మార్చుకోవచ్చా?" అని అడిగితే సరేనంది. డ్రస్సు వేసుకుని బయటకు వెళ్లబోతూ వుంటే తూలి కాలికి వేసుకున్న హైహీల్ గుచ్చుకుని ఆమె గౌను అంచు చిరిగిపోయింది. ఇందిర వెంటనే సూది, నల్లదారం తీసుకుని అంచు కుట్టి యిచ్చింది. "ఆ పరిస్థితుల్లో మా అమ్మ ఎలా చేస్తుందో అచ్చు అలాగే ఆమె చేసింది. ఇక దానితో నా సందేహాలన్నీ పటాపంచలయ్యాయి' అని సన్నిహితులతో చెప్పుకుంది సోనియా.

కేంబ్రిజ్‌లో వాళ్లు కలిసిన సరిగ్గా మూడేళ్ల తర్వాత రాజీవ్, సోనియా ఇండియాకు కలిసి వచ్చి పెళ్లి చేసుకుంటామని తనతో చెప్పినపుడు ఇందిర ఆశ్చర్యపడింది. ఇన్నాళ్లయినా వాళ్ల నిర్ణయం మారలేదంటే ఒకరినొకరు గాఢంగా ప్రేమించుకుంటున్నారని, అడ్డు చెప్పి ప్రయోజనం లేదనీ ఆమెకు అర్థమైంది. కానీ భారతీయులు యీ వివాహాన్ని ఆమోదించరని ఆమెకు తెలుసు. తను ఫిరోజ్ గాంధీని పెళ్లి చేసుకుంటానన్నపుడే నెహ్రూ కుటుంబీకులు అలాటి సామాన్యుణ్ని చేసుకోవడమేమిటి అని అభ్యంతరం తెలుపుతూ ఉత్తరాలు, టెలిగ్రాంలు పంపారు. పత్రికల్లో చర్చలు జరిపారు. ఇక సోనియా విదేశీయురాలు. 'ఈమెలో ఏం చూసి రాజీవ్ చేసుకుంటున్నాడు? ఇండియాలో యింతకంటె అందగత్తె దొరకలేదా?' అంటారని వూహించింది. వాళ్లిద్దరూ కలిసి ఢిల్లీలో తిరుగుతూ వుంటే పత్రికల మాట ఎలా వున్నా ఢిల్లీ సోషల్ సర్కిల్స్‌లో చర్చ ప్రారంభమైంది. సోనియా మూలాలు ఎవరికీ నచ్చలేదు. 'ఈమె కంటె మా అమ్మాయి అందంగా వుంటుంది, ఓ సారి పలకరించి చూడు' అని వెంటపడే సొసైటీ లేడీస్ తయారయ్యారు. ఇలా ఓ వారం గడిచేసరికి ఇందిరకు గత్యంతరం లేదని తెలిసింది. "పెళ్లికి ఒప్పుకుంటాను కానీ ఒక షరతు. పెళ్లయ్యాక ఆ అమ్మాయి మనింట్లోనే వుండాలి. కోడలు అత్తవారింట్లో వుండడం భారతీయ సంప్రదాయం. భర్తతో విడిగా కాపురం పెట్టడం విదేశీ సంప్రదాయం. ఇప్పటికే నేను కులాంతర, మతాంతర వివాహం చేసుకున్నానని, నాకు భారతీయ సంస్కృతి పట్ల గౌరవం లేదన్న విమర్శలున్నాయి. ఇప్పుడు విదేశీయురాలిని కోడలుగా ఆమోదిస్తున్నాను కాబట్టి అవి మరింత పెరుగుతాయి. ఇక మీరు విడిగా వుండడం కూడా అనుమతిస్తే హద్దు మీరినట్లే. సోనియా ఏమంటుందో కనుక్కో." అని కొడుక్కి చెప్పింది.

పెళ్లయ్యాక అత్తవారింట్లో వుండడం అంటే అత్తగారు, మరిది, రాబోయే తోడికోడలు అందరితో కలిసి వుండాలి. సోనియా పెరిగిన వాతావరణానికి యిది విరుద్ధం. అయినా రాజీవ్‌పై ప్రేమతో సరేనంది. "ఎక్కువకాలం ఆగినకొద్దీ చిక్కులు పెరుగుతాయి తప్ప ఉపయోగం లేదు. ఫిబ్రవరి 25న పెళ్లి." అంది ఇందిర... అంటే సోనియా ఢిల్లీకి వచ్చిన నెల్లాళ్లలోనే. ఇటలీ వెళ్లి తలిదండ్రులను ఒప్పించే వ్యవధి లేదు సోనియాకు. పరిస్థితి వివరిస్తూ ఉత్తరం రాసింది. పెళ్లికి రమ్మనమని కోరింది. ఉత్తరం చేరే లోపున అంతర్జాతీయ మీడియాలో వీరి వివాహవార్త వచ్చేసింది. ట్యురిన్ నుండి "లా స్టాంపా" పత్రికా విలేకరి సోనియా యింటికి వెళ్లి అక్కడేమైందో రాశాడు. సోనియా తలిదండ్రులు, సోదరి అందరూ టెన్షన్‌తో కొట్టుమిట్టులాడుతున్నారు. ఇంటి చుట్టూ జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, ఫోన్ నిరంతరం మోగుతూ గాభరా పెంచుతోంది. 53 ఏళ్ల ఆమె తండ్రి అతి తక్కువ మాటల్లోనే తన ఆవేదన తెలిపాడు – "నా కూతుళ్ల భవిష్యత్తు కోసమే నేను నిరంతరం శ్రమించాను. ఇక సోనియా పెళ్లి గురించి అంటారా, అదేదో పూర్తయిన తర్వాతే వ్యాఖ్యానించడం మంచిది, అంతకంటె మంచిపని ఏమిటంటే – దాని గురించి ఎప్పటికీ మాట్లాడకపోవడం?!" 45 ఏళ్ల ఆమె తల్లి కన్నీరు కారుస్తూ "మా అమ్మాయి అంత దూరానికి వెళ్లిపోతుందన్న ఆలోచనే నన్ను భయపెడుతోంది." అంది. పెళ్లికి వెళుతున్నారా అన్న ప్రశ్నకు బదులుగా ఆమె తండ్రి "మా ఆవిడ వెళుతుంది. నాకిక్కడ చాలా పని వుంది. అక్కడకి వెళ్లి నా టైము వేస్టు చేసుకోలేను." అన్నాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 6** **ఎమ్బీయస్ : ఢిల్లీలో బిజెపిపై మూకుమ్మడి దాడి**

ఇటీవలి కాలంలో ఏ అసెంబ్లీ ఎన్నికలకూ రానంత మీడియా హైప్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు వచ్చింది. పార్లమెంటు ఎన్నికల తర్వాత ప్రతీ చోటా ఏదో ఒక స్థాయిలో గెలుస్తూ వచ్చిన బిజెపికి ఢిల్లీలో ఎదురుదెబ్బ తగులుతుందన్న సూచన రావడంతో అందరికీ ఉత్సుకత పెరిగింది. మోదీ-అమిత్ వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని కాబినెట్ మంత్రులందరినీ రంగంలోకి దింపడంతో ఇప్పటిదాకా అఫెన్సివ్ వున్న బిజెపి ఢిల్లీకి వచ్చేసరికి డిఫెన్సివ్‌లో పడినట్లు, అరవింద్ సిఎం కాకుండా చూడడానికి యావచ్ఛక్తిని వుపయోగిస్తున్నట్లు తోస్తోంది. పార్లమెంటు ఎన్నికలలో మొత్తం తన చుట్టూ తిప్పుకున్న మోదీ సైతం యిప్పుడు అరవింద్‌ను లక్ష్యంగా చేసుకుని మాట్లాడడంతో యీ ఎన్నికలు అరవింద్ కేంద్రంగా నడుస్తున్నాయి. బిజెపికి మద్దతుగా నిలిచిన మీడియా యిప్పుడు ఆప్‌కు సానుభూతి చూపుతున్నట్లు కూడా అనిపిస్తోంది. సర్వే ఫలితాలు కూడా యిష్టం వచ్చినట్లు వస్తున్నాయి. మొన్నటిదాకా ఆప్‌ది పై చేయి అన్నారు. గత రెండు, మూడు రోజులుగా బిజెపి పుంజుకుంది అంటున్నారు. ఈ సర్వేల శాంపుల్స్ బేస్ ఎంతో సరిగ్గా చెప్పరు. ఢిల్లీ మినీ ఇండియా లాటిది. పంజాబ్, హరియాణాల నుండి వచ్చినవారు దశాబ్దాలుగా వున్నారు. పంజాబీలు మధ్యతరగతి వర్గాలుగా, ధనికవర్గాలుగా సెంట్రల్ ఢిల్లీలో పాతుకుపోతే హరియాణా గ్రామీణులు ఔటర్ ఢిల్లీలో, అర్బనైజేషన్ ఛాయలు సోకని 20 నియోజకవర్గాల్లో నిర్ణయాత్మకంగా వున్నారు. ఢిల్లీకి పక్కనే వున్న యుపి నుంచే కాదు, బిహార్ నుంచి కూడా చాలామంది వచ్చి ఢిల్లీ శివార్లను ముంచెత్తారు. బెంగాలీలు శతాబ్దాలుగా స్థిరపడ్డారు. ఉన్నతోద్యోగాల కోసం వచ్చిన తమిళులు, మలయాళీలు కూడా తరాలుగా వున్నారు. తర్వాతి స్థానం తెలుగువారిది, ఆ తర్వాత కన్నడిగులది. దక్షిణాది వారు జనాభాలో 10% వుంటారని అంచనా. వీరందరి ఓటింగు సరళిని తమ

సొంత రాష్ట్రాల రాజకీయాలు ప్రభావితం చేసే అవకాశం చాలా వుంది. మోదీ రథానికి అడ్డుకట్ట కట్టగల మొనగాడు అవతరించాడన్న ఆశతో వివిధ రాష్ట్రాలలో బలంగా వున్న ప్రాంతీయ పార్టీలు – లెఫ్ట్, జనతా దళ్ యు నుంచి శరద్ యాదవ్, లేటెస్టుగా మమతా బెనర్జీ – ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. వీరి ప్రభావం ఆయా భాషావర్గాలపై తప్పక వుంటుంది. మరి సర్వే శాంపుల్‌లో ఏయే వర్గాలను తీసుకుంటున్నారో తెలియకుండా దేన్నీ నమ్మలేం.

ఒకటి మాత్రం కచ్చితం. కాంగ్రెసును ఆదరిస్తూ వచ్చిన దళిత, మైనారిటీ, నిమ్న వర్గాలు గత ఎసెంబ్లీ ఎన్నికల నుంచే ఆప్‌వైపు మళ్లాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో 8 సీట్లు మాత్రమే గెలుచుకుంది. పార్లమెంటు ఎన్నికలు వచ్చేసరికి వీటిలో 5 సిగ్మెంట్లలో ఆప్‌కు కాంగ్రెస్ కంటె ఎక్కువ ఓట్లు పడ్డాయి. ఈసారి ఎనిమిదైనా నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని చెపుతున్నారు కానీ, అజయ్ మేకన్ తన నియోజకవర్గం వదిలిపెట్టి ప్రణబ్ కూతురు శర్మిష్టా ముఖర్జీని గ్రేటర్ కైలాష్ నుంచి గెలిపించే పనిలో పడ్డాడు. బిజెపిని బలహీనపరచడానికి కాంగ్రెసు తన ఓటర్లను ఆప్‌వైపు మళ్లించవచ్చనే అందరూ నమ్ముతున్నా, కాంగ్రెసు అంత పని చేయకూడదని బిజెపి ఆశిస్తోంది. ఢిల్లీలో ఎప్పణ్నుంచో పాతుకుపోయిన బిజెపికి 34% కోర్ ఓటు బ్యాంక్ వుంది. ఒక్కోప్పుడు 36% వరకు వెళ్లింది, శాతం మాట ఎలా వున్నా ప్రత్యర్థుల బలాబలాల బట్టి 1998 నుంచి 2013 మధ్య సీట్ల సంఖ్య 15 నుంచి 31 వరకు మారుతూ వచ్చింది. ఆప్ ప్రవేశంతో బియస్పీ ఓటు, కాంగ్రెసు ఓటు కూడా దానికి మళ్లాయి. ఇప్పుడు ఆప్ ఏకైక ప్రతిపక్షంగా అవతరిస్తే ముఖాముఖీ పోటీలో యీ 36% ఓట్లు చాలతాయో లేదో తెలియదు. అల్పాదాయ, దళిత, మైనారిటీ ఓట్లు కాంగ్రెస్, ఆప్‌ల మధ్య చీలిపోతేనే బిజెపి గెలుస్తుంది. అందుకే కాంగ్రెసుకు కాస్త బలమున్న 19 నియోజకవర్గాలలో తమ పార్టీ నుంచి కొత్త అభ్యర్థులను, ప్రజలకు పెద్దగా పరిచయం లేనివారిని నిలబెట్టారట. దళితుల మద్దతు కోసం కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కృష్ణ తీర్థ్‌ను బిజెపి చేర్చుకుంది. దళితులు, మైనారిటీలు కలహించిన త్రిలోకపురి నియోజకవర్గంలో అల్లర్లకు కారణభూతుడని అందరూ చెప్పుకునే బిజెపి నాయకుడు సునీల్ కుమార్ చనిపోతే అతని భార్యను బిజెపి అభ్యర్థిగా నిలబెట్టింది.

మురికివాడలు ఆప్‌కు పట్టుగొమ్మలుగా వున్నాయని తెలిసిన బిజెపి ఎన్నికల ముందు మాత్రమే గుడిసెల క్రమబద్ధీకరణ ప్రకటన వెలువరించింది. దాన్ని మోదీ తన ఉపన్యాసాల్లో పదేపదే ప్రస్తావిస్తున్నాడు. నిజానికి బిజెపి చేతిలోనే ఢిల్లీ 7 నెలలుగా వుంది. అన్నాళ్లుగా యీ దిశగా ఏమీ చేయలేదు. ఈ ఒక్కటే కాదు, అరవింద్ తగ్గించిన విద్యుత్, వాటర్ చార్జీలు అతను దిగిపోగానే లెఫ్టినెంట్ గవర్నర్ పెంచేశాడు. బిజెపి అధికారంలోకి వచ్చాక మళ్లీ తగ్గించలేదు. మురికివాడల పరిస్థితి మెరుగుపర్చలేదు. అందువలన వాళ్లంతా బిజెపిని నమ్మదలచుకోలేదు. అరవింద్ అయితేనే తమ కష్టాలను పట్టించుకుంటాడని వారి నమ్మకం. కిరణ్ బేదీ అంటే మధ్యతరగతి వర్గాలలో వున్న ఆరాధన, అభిమానం అల్పాదాయ వర్గాలలో కానరాదు. వాళ్లకి పోలీసులంటే ప్రేమ వుండదు, భయం తప్ప! వారంతా గంపగుత్తగా ఆప్‌కు వేస్తారనుకోకపోయినా అధికాంశం ప్రజలు వేస్తారనే అనుకోవచ్చు. మధ్యతరగతి కూడా ఢిల్లీలో చాలా ముఖ్యమైన సిగ్మెంటు. వారికి ఒకప్పుడు అరవింద్ చాలా యిష్టుడు. మోదీ ప్రధానిగా, అరవింద్ ముఖ్యమంత్రిగా వుంటే చాలు ఢిల్లీ రూపురేఖలే మారిపోతాయి అనుకునేవారు. అందుకే అసెంబ్లీ ఎన్నికలలో ఆప్‌ను ఆదరించారు. కానీ అరవింద్ పరిపాలనను గత్తరబిత్తర చేయడం, పార్లమెంటు ఎన్నికలలో దేశమంతా పోటీ చేసి పరాజయం పొందడం, అనవసరంగా మోదీతో కాశీలో తలపడడం – వీటివలన అరవింద్‌పై మోజు తగ్గింది. అందుకే పార్లమెంటు ఎన్నికలలో బిజెపికి 60 అసెంబ్లీ సిగ్మెంట్లలో ఆధిక్యత లభించింది. కాంగ్రెసుపై ఏహ్యతతో మోదీని ప్రధాని చేయాలన్న పట్టుదల వారిని కదిలించింది. ఇప్పుడు ఆ వూపు లేదు. . కిరణ్ బేదీ పట్ల మోజున్న మాట వాస్తవమే కానీ అరవింద్‌ను ఓడించి తీరాలన్నంత కోపమూ లేదు. పైగా ఢిల్లీకి రాష్ట్ర స్థాయి కల్పించకపోవడం కూడా వాళ్లకు నచ్చలేదు. కాంగ్రెసు ఎప్పుడూ ఆ పని తలపెట్టలేదు. మేం అధికారంలోకి వస్తే క్షణాల్లో చేస్తాం అని చెపుతూ వచ్చిన బిజెపి మాట తప్పింది. ఢిల్లీలో తాము కాకుండా ఆప్ గెలిస్తే వాళ్లకు ప్రాధాన్యత యివ్వాల్సి వస్తుందన్న లెక్కతోనే యిలా చేసిందని వాళ్లకు తెలుసు. ఇలాటి కారణాలతో వాళ్లు అటూ బిజెపికి, యిటు ఆప్‌కు వేయకుండా యింట్లోనే కూర్చుంటే బిజెపికి నష్టమే.

ఇప్పుడున్న ధోరణులు గమనిస్తూ వుంటే మధ్యతరగతి కదిలివస్తే బిజెపికి ఎక్కువ సీట్లు, రాకపోతే ఆప్‌కు ఎక్కువ సీట్లు. ఈ సంగతి తెలిసి ఓటర్లను బూతులకు తరలించేందుకు అమిత్ షా ఒక్కో నియోజకవర్గానికి 3 నుంచి 5 వేల మంది కార్యకర్తల చొప్పున 2–3 లక్షలమందిని యితర రాష్ట్రాల నుంచి ఢిల్లీకి తెచ్చాడట. రూలు ప్రకారం వీళ్లు ఓటింగు రోజుకి 48 గంటల ముందు వూరు విడిచి వెళ్లిపోవాలట. రూల్సు తెగ మాట్లాడే ఆప్ కార్యకర్తలు వీరిపై నిఘా వేసి వుంచారట. బూతుకు నలుగురు కార్యకర్తల చొప్పున 9128 బూతులకు దాదాపు 35 వేల మంది కార్యకర్తలు తమకున్నారని, బయటినుంచి వచ్చిన బిజెపి కార్యకర్తలు తిరిగి వెళ్లకపోతే ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఆప్ వాళ్లు చెప్తున్నారు. రేపు ఎన్నికల రోజున ఓటింగు శాతం చూశాక పార్టీల బలాబలాల గురించి స్పష్టత రావచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 11** **ఎమ్బీయస్ : ఇది చెంపదెబ్బ కాదు...**

బిజెపి నాయకుల అహంకారానికి ఢిల్లీ ఓటరు చెంపపెట్టు పెట్టాడంటూ కొందరు కామెంట్ చేస్తున్నారు. ఇది చెంపదెబ్బ కాదు. ఏకంగా పొట్టలో గుద్దినట్లే. బుద్ధి చెప్పేవాళ్లయితే వీపుమీద దెబ్బ వేస్తారు. ఢిల్లీ వాళ్లు సెంటర్ చూసి కొట్టినట్లు కొట్టారు. బిజెపికి

మూడా? సింగిల్ డిజిట్ అంటేనే అవమానం. కేంద్రంలో సొంతబలంతో ప్రభుత్వం ఏర్పరచి 8 నెలలు కాలేదు. అప్పుడే యింతటి ఎదురుదెబ్బా? సర్వేలు చాలా రకాలుగా చెప్పాయి, మొదట్లో ఆప్ అన్నాయి, తర్వాత బిజెపి అన్నాయి, ఆ తర్వాత సగంసగం అన్నాయి. ఎగ్జిట్ పోల్స్‌లో అందరూ ఆప్‌కే గెలుపు అన్నారు. సాధారణంగా కరక్టుగా గెస్ చేసే టుడేస్ చాణక్య కూడా ఆప్‌కు 40 ప్లస్ యిచ్చింది. యోగేంద్ర యాదవ్ 50 దాకా వస్తాయంటే నవ్వుకున్నాను. బిజెపికి వున్న కోర్ ఓట్‌ను ఎలా విస్మరిస్తున్నారు వీళ్లు అని. తీరా చూస్తే ఆప్‌కు 67, ఏ అంచనాలకూ అందనట్లుగా! ఇలాటి గెలుపు యిప్పటిదాకా ఎవరూ కనీవినీ ఎరిగి వుండరు. 95% సీట్లు ఒక్క పార్టీకా? మై గాడ్. అంత గొప్ప పార్టీయా అది? కాంగ్రెసు తన ఓటు పూర్తిగా ఆప్‌కు బదలాయించేసిందేమో అనుకుంటే దానికీ 10% వచ్చాయి. బియస్పీ యిత్యాది ఇతరుల ఓట్లు మాత్రం ఆప్‌కి వచ్చి చేరాయి. అది కచ్చితం.

బిజెపి ఓట్లన్నీ ఎటు పోయాయి అంటే ఎటూ పోలేదు. 2013 కంటె 1% మాత్రమే తక్కువ వచ్చాయి. కానీ సీట్లుచూడబోతే గతంలో 32 వస్తే చిన్న అంకె ఎగిరిపోయి 3 మిగిలింది. ఎందుకీ తేడా అంటే గతంలో త్రిముఖ పోటీ, యిప్పుడు ముఖాముఖీ పోటీ. పార్లమెంటు ఎన్నికలలో 60 అసెంబ్లీ సెగ్మెంట్లలో విజయం సాధించిన బిజెపికి యింతటి పరాభవమా!? ఆప్‌కు గతంలో 30% ఓట్లు వస్తే యీసారి 55% వచ్చాయి. 40% కంటె ఎక్కువ ఓట్లు వచ్చిన ప్రాంతాల మ్యాప్ చూస్తే ఢిల్లీలోని దాదాపు అన్ని ప్రాంతాలలోను ఆప్ బలపడిందని అర్థమౌతుంది. అన్ని వర్గాలలో, అన్ని ప్రాంతాలలో అది చొచ్చుకుపోయింది. కాంగ్రెసు నుండి 15% ఓట్లుతో పాటు బిజెపికి పార్లమెంటు ఎన్నికలలో అదనంగా వచ్చిన ఓట్లను కూడా అది పట్టుకుపోయింది. విజేతల విన్నింగ్ మార్జిన్స్‌ను పరికించి చూసినపుడు మనకు యింకా కాస్త స్పష్టత వస్తుంది. ఈలోగా మనం వ్యాఖ్యానించుకోదగిన విషయాలేమిటంటే –

ఇంత ఘనవిజయం ఆప్‌కు కూడా మంచిది కాదు. గతంలో దీనిలో సగం కంటె తక్కువ సీట్లు వచ్చినపుడే కాబినెట్ నిర్మాణంలో తబ్బిబ్బు పడ్డారు. మంత్రి పదవి రానివారు అలిగారు. దక్కినవారు తాము ఏ నియమాలూ పాటించ నక్కరలేదన్నట్లు ప్రవర్తించారు. ఇప్పుడు యీ ఘనవిజయం మా వల్లనే అంటే మా వల్లనే అంటూ అన్ని వర్గాలవారూ వచ్చి తమతమ డిమాండ్లు ముందు పెడితే పాలకులు ఏం చేస్తారో తెలియదు. ప్రజల ఆశలు లిటరల్‌గా మిన్ను ముట్టాయి. వాటిని అందుకోవడం ఎవరి తరం కాదు. అరవింద్ దగ్గర సంజాయిషీలు లేవు. పాంచ్‌సాల్ అడిగితే ఎదురు లేకుండా, ప్రతిపక్ష నాయకుడు కూడా లేకుండా పాలించు అని అధికారాన్ని అప్పగించారు. నిధులు యివ్వకుండా మోదీ బిగబెడితే ధర్నా చేస్తాను అంటే జనాలు పట్టుకుని తంతారు. ఇంత ప్రజాభిమానం తట్టుకోవడం మానవమాత్రులకు సాధ్యం కాదు. అరవింద్ ఎలా నెగ్గుకు వస్తాడో వేచి చూడాలి. ఇక బిజెపికి యింత ఘోరపరాజయం అక్కరలేదు. మోదీ, అమిత్ షా అహంకారం తగ్గాలంటే ఢిల్లీలో ఓడాలని చాలామంది కోరుకున్నారు. కానీ మరీ యింతలా ఓడితే ఎలా? బిజెపి కార్యకర్తలు, నాయకులు పూర్తిగా డీమోరలైజ్ అయిపోతారు. కిరణ్ బేదీ యిప్పటికే ముఖం వేలాడేసింది. తనే నెగ్గలేకపోవడం దుర్భరమైన అవమానం. ఆవిడ రాజకీయాల్లోంచి తొలగిపోయి, ఢిల్లీ విడిచి భర్త దగ్గరకి పంజాబ్ వెళ్లిపోతుందేమో!

బిజెపికి బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో, మోదీ జగన్నాథరథానికి బ్రేకులు వేద్దామని ఉద్దేశంతో దేశంలోని రాజకీయపక్షాలన్నీ ఏకమై ఢిల్లీలో తమ ఓటర్లను ఆప్‌కు వేయమని చెప్తారని అనుకుంటూనే వున్నాం. కానీ బిజెపి కోర్ ఓటర్లు తప్ప మామూలు ఓటర్లు కూడా బుద్ధి చెప్పడానికి నిశ్చయించుకున్నట్లు అర్థమైంది. ఎందుకు బుద్ధి చెప్పాలి? 8 నెలల్లోనే మోదీ చేసిన పాపం అంత పేరుకుపోయిందా? మరి యిప్పటిదాకా వచ్చిన అసెంబ్లీ ఎన్నికలలో నెగ్గుతూనే వచ్చారే! కశ్మీర్‌లో తొలిసారి రెండవ పెద్దపార్టీగా అవతరించారే! వాళ్లెవరికీ లేని కసి ఢిల్లీ ప్రజలకు మాత్రమే వుందా? ఇవన్నీ లోతుగా ఆలోచించవలసిన విషయాలే. గణాంకాలు, విశ్లేషణలు యింకా వస్తున్నకొద్దీ చిత్రం స్పష్టంగా అర్థమవుతుంది. ఇప్పటివరకు కనబడినదాన్ని బట్టి యిది మోదీ–అమిత్ ద్వయానికి జరిగినది శృంగభంగమే. వారు చేసిన పొరపాట్లు కొన్ని కనబడుతున్నాయి. ముఖ్యంగా ఆప్‌కు యింత ఆదరణ వుందని కొంచెమైనా పసిగట్టలేకపోయారా అన్నదే ఆశ్చర్యం కలిగిస్తోంది. రామ్‌లీలా మైదానం నాలుగోవంతు నిండినప్పుడే అర్థం కావలసింది. ఇదేదో తక్కిన అసెంబ్లీలా కాదురా బాబూ అని. అప్పుడు మోదీ పక్కకు తప్పుకుని వుండాల్సింది. ఓడిపోయినా, 'మేం పట్టించుకోలేదు, ఆఫ్టరాల్ ఢిల్లీ అంటే కార్పోరేషన్ కంటె ఎక్కువ, రాష్ట్రం కంటె తక్కువ' అని చెప్పుకోవలసింది. తను స్వయంగా ప్రచారం చేయడమే కాక 120 మంది ఎంపీలను, మంత్రులను వాడవాడలా తిప్పి యింత హంగు చేసి భంగపడడమేల? అరవింద్‌పై నోరు పారేసుకుని అతనికి సింపతీ తెచ్చిపెట్టడమేల? అధికారంలో వున్నవాళ్లపై ప్రశ్నలు సంధిస్తారు, లేఖలు రాస్తారు. ఇక్కడ మోదీ అరవింద్‌కి ప్రశ్నలేశారు. గత ఎన్నికలన్నీ మోదీ వెర్సస్ అదర్స్‌గా నడిస్తే, ఢిల్లీ ఎన్నికలు అరవింద్ వెర్సస్ అదర్స్‌గా నడిచాయి. ఆప్ వాళ్లు వ్యక్తిగతంగా ఎవర్నీ ఏమీ అనలేదు. వీళ్లు చూడబోతే తెల్లారి లేస్తే అరవింద్‌ను భగోడా అనీ, ఉపద్రవగోత్రీ అనీ, పర్సనల్ ఎటాక్స్ చేశారు.

అమిత్ షా బయటినుంచి మనుష్యులను తెస్తే తెచ్చాడు కానీ దానికి ప్రచారం రాకుండా చూసుకోవాల్సింది. దానితో స్థానిక కార్యకర్తలకు మండినట్లుంది. బయటివాళ్లనే చేసుకోనీ, మనకెందుకు? అనుకున్నారు లాగుంది. ఫలితాలు వచ్చాక కొందరు కార్యకర్తలు చెప్తున్నారు – మాకు ఎవరూ ఏ పనీ చెప్పలేదు అని. మోదీ, అమిత్ యిద్దరూ ఢిల్లీవాళ్లు కాదు. పంజాబీ, హరియాణీ, యుపి కాకపోతే ఢిల్లీ వాళ్లకు పరాయివాళ్ల కిందే లెక్క. దానికి తోడు వాళ్లు బయటివాళ్లను తెచ్చి వాళ్ల ద్వారానే ఖర్చులు పెట్టిస్తే యిక ఢిల్లీ బిజెపి కార్యకర్తలు ఉసూరుమనరా? కిరణ్ బేదీని వాళ్లల్లో ఉత్సాహం నింపిదనుకోవడానికి ఏమీ లేదు. ఆవిడా వాళ్లకు పరాయిదే. ఇప్పుడు ఓటమి కిరణ్ నెత్తిన రుద్దేస్తున్నారు. అలా రుద్దుతారని తెలిసే ఆవిడ నేనే బాధ్యత వహిస్తున్నాను అంది. కిరణ్‌ను సిఎం అభ్యర్థిగా ప్రకటించడం ఘోరతప్పిదం అని బిజెపి నాయకులందరూ అనుకుంటున్నా పైకి అనలేని పరిస్థితి. ఇంత ముఖ్యమైన

నిర్ణయం పార్టీ అంతర్గత సమావేశం ఏర్పరచి, అందరితో చర్చించి తీసుకున్నది కాదు. ముగ్గురు నలుగురు కూర్చుని అప్పటికప్పుడు తీసుకున్నది. మేం చేసినా చెల్లుతుంది అనే నియంతృత్వ ధోరణే కనబడింది. అందుకోసమే ఢిల్లీ ఓటరే కాదు, బిజెపి కార్యకర్తా బుద్ధి చెప్పాడు.

ఆప్ గెలుపు ఎవరూ కనీవిని ఎరుగరు అనే మాట తప్పు. సిక్కింలో సిక్కిం డెమోక్రాటిక్ ఫ్రంట్ 1989లో, 2009లో 32కు 32 సీట్లు తెచ్చుకుంది. అయితే అప్పుడది అధికారంలో వుంది. ప్రతిపక్షంలో వుండి 95% సీట్లు తెచ్చుకోవడం అనే ప్రత్యేకతే ఆప్‌ది.

ఇవాళ్టికి ఓటింగు శాతాలు కరక్టుగా వచ్చాయి. 2013 అసెంబ్లీలో బిజెపికి 34%, ఆప్‌కు 29.5%, కాంగ్రెస్‌కు 24.6%, 2014 లోకసభ నాటికి బిజెపి 46.6%, ఆప్ 33.0%, కాంగ్రెస్ 15.1%, 2015 అసెంబ్లీకి బిజెపి 32.7%, ఆప్ 54.3%, కాంగ్రెస్ 9.7%. అంటే అరవింద్ 49 రోజుల తర్వాత గద్దె వదిలి వెళ్లిపోయినా ఢిల్లీలో ఆప్ తరఫున పెద్ద అభ్యర్థులు లేకపోయినా, అరవింద్ అనవసరంగా వారణాశిలో యిరుక్కుపోయినా, ఢిల్లీతో సహా దేశమంతా మోదీ హవా వీస్తున్నా 3.5% ఓట్లు ఎక్కువగా వచ్చాయి. ఇది మోదీ-అమిత్ గమనించి ఎందుకైనా మంచిదన్నట్లు ఎన్నికలలో దిగి వుంటే బాగుండేది. కానీ మోదీ స్వభావం అది కాదు. ప్రత్యర్థికి ఏ మాత్రం పొలిటికల్ స్పేస్ యివ్వకుండా సాంతం అణచిపారేయాలనే తత్వం అతనిది. పార్టీలో తనను ఆమోదించనివారితోనే కఠినంగా వ్యవహరించాడు. పాతికేళ్లగా భాగస్వాములుగా వున్నవారితో కూడా కటువుగా వ్యవహరించాడు. ఇక వారణాశిలో తనకు వ్యతిరేకంగా నిలబడిన అరవింద్‌ను క్షమిస్తాడా? ఎలాగైనా సరే బుద్ధి చెప్పాల్సిందే అన్న కసితో ఢిల్లీ ఎన్నికలలో కౌరవసైన్యమంత జనాన్ని మోహరించాడు. నిజానికి యిది మోదీ పాలనపై రిఫరెండం కాదు, మోదీ రంగంలోకి దిగకుండా అమిత్‌పై వదిలేసి వుంటే ఓటమి భారం అతను మోసేవాడు. కానీ కక్షపూని వ్యవహరించినట్లు ప్రధాని పదవికి వుండవలసిన హుందాతనాన్ని విస్మరించి అరవింద్‌ను నానా మాటలూ అన్నాడు. ఇది ఓటర్ల దృష్టిని దాటిపోలేదు. నిజానికి చాలామంది ఓటర్లు చివరి క్షణంలో బయటకు వచ్చి ఓటేయడానికి కారణం అరవింద్ మొహం చూసి!

పార్లమెంటు ఎన్నికల సమయంలో మోదీ చాయ్‌వాలా! అందలం ఎక్కాడమ్మా, అందకుండా పోయాడమ్మా అన్నట్లు 8 నెలల తర్వాత చూస్తే అతను పదిలక్షల సూట్‌వాలా! అప్పుడు పఠించిన అభివృద్ధి మంత్రం యిప్పుడు మారిపోయింది. ఢిల్లీ బాగుపడాలంటే నేను చెప్పినవాడికే ఓటేయండి అనడం ప్రారంభమైంది. ఈలోగా మోదీ సర్కారు నడిచిన తీరును కూడా ఓటర్లు పరిగణనలోకి తీసుకున్నారు. మోదీ ఇతర పక్షాలను పూచికపుల్ల కంటె అన్యాయంగా చూస్తున్నారు. కాంగ్రెసుకు ప్రతిపక్ష హోదా దక్కలేదు. అయినా యిచ్చి ఔదార్యం చాటుకుని వుండవచ్చు - ఇప్పుడు అరవింద్ చేసినట్లు! కానీ శత్రుశేషం వుంచకూడదన్న పాలసీ మోదీది. కాంగ్రెస్ ముక్త్ భారత్‌ని నిజంగా అమలు చేద్దామని చూశాడు. ఈరోజు బిజెపి ముక్త్ ఢిల్లీ అయిపోయింది. భూసేకరణ చట్టం కానీ, విదేశీ పెట్టుబడుల విషయంలో కాని, ప్లానింగ్ కమిషన్ రద్దు చేసి 8 నెలలైనా దాని ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయని విషయంలో కాని, పెట్రోలు ధరలు అంతర్జాతీయంగా తగ్గుతున్నాయి కాబట్టి ఆ బెనిఫిట్‌ను సామాన్యుడికి అందించే విషయంలో కాని - ఎవర్నీ అడిగేది లేదు, పెట్టేది లేదు. పోనీ అలాగని పేదలకు ఏమైనా చేస్తున్నాడా అంటే ఏమీ లేదు. ఢిల్లీ కార్పోరేషన్ వారి చేతిలోనే వుంది. ఢిల్లీ ప్రభుత వారి చేతిలోనే వుంది. ఈలోగా నాలుగు మంచిపనులు చేసి వుంటే పేదలు గుర్తు పెట్టుకునేవారు. జస్ట్ ఎన్నికలకు ముందు క్రమబద్ధీకరణ అంటే వాళ్లు నమ్మలేదు. పైగా కిరణ్ బేదీ వంటి పోలీసు అధికారిణి సిఎంగా వచ్చిందంటే వీళ్లందరినీ లేపేయ్ అంటుందేమోనని భయపడి, గుడిసెవాసులంతా ఆప్‌కీ జై అన్నారు. మోదీ పాలనతో కార్పోరేట్‌లకు మాత్రమే అచ్ఛే దిన్ వచ్చాయని ప్రజలంతా నమ్ముతున్నారని ఢిల్లీ ఎన్నికలు చెప్పాయి.

పార్లమెంటు ఎన్నికలలో మీడియా మేనేజ్‌మెంట్‌తో, ఆరెస్సెస్ కార్యకర్తల బలంతో అఖండ విజయం సాధించాం కాబట్టి పిడుక్కీ బియ్యానికీ ఒకటే మంత్రం అనుకున్నారు. కానీ ప్రచారం అతిగా చేస్తే గతి చెడుతుందని 2004 నాటి 'ఇండియా షైనింగ్' అనుభవం చెప్పింది. ఇప్పుడు 70 సీట్ల ఢిల్లీ కోసం హోర్డింగులపై ఎంత ఖర్చు పెట్టిందో చూడండి. పత్రికల్లో ఫుల్‌పేజీ యాడ్స్ గుప్పించింది. దానికి వ్యతిరేకంగా ఆప్ హోర్డింగులకు దూరంగా వుంది. దాని వాలంటీర్లు 40 బై 10 బ్యానర్లు పట్టుకుని వంతెనలపై, ఎత్తయిన ప్రదేశాల్లో కొన్ని గంటలపాటు నిలబడ్డారు. ఆటోల వెనక ప్రచారమే. తామేదో పవిత్రుల మన్నట్లు ఆప్‌వారికి హవాలా మార్గాల ద్వారా విరాళాలు అందాయని బిజెపివారు ఆరోపించారు. నిజానికి 20 వేలకు పైబడి విరాళాలు యిచ్చిన వాళ్ల వివరాలు ఎన్నికల కమీషన్‌కు 2013-14 సంవత్సరానికి బిజెపి యింకా యివ్వలేదు. జాతీయపార్టీల్లో అదొక్కటే అలా యివ్వనిది. అంతేకాదు, సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ 6 జాతీయ పార్టీలకు తమ పార్టీ కార్యకలాపాల గురించి ఆర్‌టిఐ (సమాచార హక్కులు) ప్రశ్నలకు సమాధానమిచ్చే వ్యవస్థ ఏర్పాటు చేయమని అడిగింది. బిజెపితో సహా ఎవ్వరూ ఆ పని చేయలేదు. 2014 నవంబరులో ఆ పార్టీలను నిలదీయడానికి సమావేశం ఏర్పాటు చేస్తే ఎవరూ హాజరు కాలేదు. వీళ్లు ఆప్‌పై బురద చల్లుదామని చూస్తే ఎలా? నిజానికి ఆప్ రూ. 30 కోట్ల టార్గెట్ పెట్టుకున్నా 20 కోట్లే వచ్చాయి. వాళ్లు కార్పోరేట్ కాదు, కమ్యూనిటీ ఫండింగ్ నమ్ముకున్నారు. వాళ్ల అభ్యర్థుల ఆస్తిపాస్తుల సంగతికి వస్తే 2013 ఎన్నికలలో నెగ్గి 2015లో మళ్లీ పోటీ చేస్తున్న ఎమ్మెల్యేల ఆస్తులు (ప్రకటించినవి) లెక్కవేస్తే బిజెపి, కాంగ్రెసు ఎమ్మెల్యేల సగటు ఆస్తి రూ. 10 కోట్లు వుంటే ఆప్ అభ్యర్థి సగటు ఆస్తి రూ.1 కోటి వుంది.

ఓటర్లలో పార్టీ పట్ల అభిమానం వున్నా వారిని బూత్‌లకు వద్దకు తీసుకుని వచ్చే కార్యకర్తలుండాలి. కార్యకర్తలున్నంత మాత్రాన ఎన్నిక గెలిచేయరు. అన్ని ప్రాంతాల నుండీ కార్యకర్తలను తెచ్చేశామని అమిత్ భుజాలు చరుచుకున్నారు కానీ బూత్‌లోపలికి

వెళ్లినవాళ్లు బిజెపికి ఓటేయలేదు. బిజెపి లోకసభ ఎన్నికలలో 38.38 లక్షల ఓట్లు తెచ్చుకుంటే యీ ఎన్నికలలో 28.91 లక్షల ఓట్లు తెచ్చుకుంది. అంటే సుమారు 9 లక్షల ఓట్లు తగ్గాయి – మోదీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని మిషన్ 44 అని నినాదం యిచ్చి బిజెపి నాయకులందరినీ దింపినా! 'వరుసగా వచ్చిన 8 ఎన్నికలలో 7టిలో నెగ్గాం. ఒక్కటే పోయింది' అంటున్నారు వెంకయ్యనాయుడు. కరెక్టే. అంతేకాదు, 2013 ఎన్నికలతో పోలిస్తే 1.3% మాత్రమే తగ్గాయి అని కూడా చెప్పుకోవచ్చు. కానీ అప్పుడు మోదీ వంటి గ్లామర్ బాయ్ లేదు. ఇప్పుడు మోదీ వున్నాడు. తనకు వీసా నిరాకరించిన అమెరికా దేశపు అధ్యక్షుడు ఒబామాను తన వద్దకు రప్పించుకుని తన అహాన్ని చల్లార్చుకున్న మోదీ ఢిల్లీలో తన బలప్రదర్శన చేసిన తర్వాత పార్లమెంటు ఎన్నికలతో పోల్చి చూడాలి. అలా చూస్తే 13.9% తగ్గిందనాలి. కాంగ్రెసు చాలా దశాబ్దాలపాటు దేశాన్ని పాలించాక ప్రతిపక్షాలకు అర్థమైంది – తామంతా కలిస్తే కాంగ్రెసును ఓడించవచ్చని! అలా చేసి గెలిచారు. ఇప్పుడు బిజెపి వచ్చిన 8 నెలల్లోనే ప్రతిపక్షాలకు దాన్ని ఓడించే మార్గం తెలిసిపోయింది. మళ్లీ మళ్లీ యిలాటి ట్రిక్కులు మిగతా ప్రాంతాల్లో కూడా వేస్తే పార్టీ గతేమిటి? అని ఆలోచించుకుని అప్పుడు మాట్లాడాలి. "నేను తప్పులు చేశాను, క్షమించండి" అని క్షమాపణ అడిగి అరవింద్ ప్రజలను దగ్గర చేసుకున్నాడు. మోదీ కానీ, అమిత్ కానీ అలాటి స్టేటుమెంటు ఏమీ యివ్వలేదు, యిస్తారని కూడా అనుకోను. కానీ బిజెపి పార్టీలోనైనా యీ ఓటమిపై నిష్కర్షమైన అంతర్గత చర్చ జరుగుతోందా అన్నదే ప్రశ్న.

ఇందిరా గాంధీ బలపడిన తర్వాత కాంగ్రెసు పార్టీ ఆమె చుట్టూ తిరగసాగింది. పార్టీలో, ప్రభుత్వంలో ఎందరు మేధావులున్నా, ఎందరు సమర్థులున్నా అంతా ఆమె యిష్టప్రకారమే జరిగేది. ఎదురు చెప్పే ధైర్యం ఎవరికీ లేకుండా పోయింది. చెపితే వాళ్ల కెరియర్ ఆఖరు. అంతా ఆమె పేరుమీదుగానే జరగడంతో ప్రజల్లో కూడా మంచైనా, చెడైనా ఇందిర చేసిందనే అనేవారు. జనతా పార్టీ 1977–79 వరకు పాలించినప్పుడు యీ పరిస్థితి లేదు. ఏం జరిగినా మొరార్జీయే చేశాడనలేదు. కాబినెట్‌లో ఎందరో ప్రతిభామూర్తులు. ఎవరి సత్తా వారు చూపించారు. ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ విధంగానే వాజపేయి, ఆడ్వాణీ, మధు దండవతే, ఫెర్నాండెజ్, చరణ్ సింగ్‌ల గుణగణాలు, ఆలోచనా విధానాలు ప్రజలకు తెలిశాయి. దురదృష్టవశాత్తూ ఆ బహుళనాయకత్వం చాలాకాలం సాగలేదు. అందుచేత ప్రభుత్వం నాలుగుకాలాల పాటు మనుగడ సాగించాలంటే ఏకోన్ముఖమైన నాయకత్వం వుండాల్సిందే అనే వాదన బయలుదేరి, మళ్లీ ఇందిరకు పట్టం కట్టారు. ఇక అప్పణ్నుంచి ఇందిర, రాజీవ్, పివి, తెర వెనుక నుంచి సోనియా – సొంత నిర్ణయాలతోనే నడిపారు. మధ్యలో వచ్చిన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలలో నాయకులు ఎక్కువై పోయి పూర్తికాలం వుండలేకపోయాయి. ఎన్‌డిఏ తరఫున వాజపేయి ప్రధానిగా వుండగా ఏకవ్యక్తి పాలనగా కాకుండా మళ్లీ బహుళనాయకత్వంలోనే నడిచింది. మంత్రులకు గుర్తింపు లభించింది. పార్టీలో కూడా వాజపేయి–ఆడ్వాణీ కృష్ణార్జునుల్లా ప్రథమశ్రేణిలో వున్నా, మురళీమనోహర్ జోషి, రాజ్‌నాథ్ సింగ్, సుష్మా స్వరాజ్ వంటి అనేకులు ప్రముఖస్థానాల్లో వున్నారు. మోదీకి కూడా తన ప్రతిభ చూపే అవకాశం యిచ్చారు. వాజపేయికి జీహుజూర్ అనే వాళ్లే పార్టీలో వుండాలన్న ధోరణి కనబడలేదు.

ఇప్పటి బిజెపిలో అది మారింది. ఎటు చూసినా మోదీ–అమిత్ మాత్రమే కనబడుతున్నారు. పేరుకి యిద్దరు కానీ రాముడు, పరశురాముడులా యిద్దరిలో వున్నది మోదీ ఒక్కడే. అతను ఏం తలచుకుంటే అదే జరుగుతోంది. ఏం జరిగినా అతని ఘనతే అనే ప్రచారం సాగుతోంది. వర్షం కురిసినా మోదీ కురిపించాడు, తుపాను ఒడిశాను తాకకుండా బంగ్లాదేశ్ వైపు వెళ్లిపోతే మోదీ మళ్లించాడు అనే తీరులో ఆకాశానికి ఎత్తేస్తున్నారు. విదేశీ అతిథి భారత్‌యొక్క తరతరాల సంస్కృతిని, ఎన్నో శతాబ్దాలుగా తమ దేశంతో వున్న అనుబంధాన్ని ప్రశంసించాడు అంటే అదీ మోదీ ఘనతే. ఇలా ఇందిర టైపులో వ్యక్తిపూజను ప్రోత్సహిస్తున్నారు. ఎక్కడ చూసినా మోదీ మాస్కులే. మోదీ ఎందుకు, కమలం మాస్కులు పెట్టవచ్చుగా! మోదీ ఆరాధన ఏ లెవెల్‌కి వెళ్లిందంటే వారణాశి నియోజకవర్గంలో 'హరహర మోదీ, ఘర్‌ఘర్ మోదీ' అనే నినాదం మొదలెట్టారు. పరమశివుడి స్థానంలో వచ్చి చేరగలిగిన మొనగాడా మోదీ? శివుడు మూడో కన్ను తెరిచినట్టున్నాడు. ఢిల్లీ ఎన్నికల్లో బూడిదే మిగిలింది. ఇప్పుడు ఆ నినాదాన్ని కొద్దిగా మార్చి 'హారాహారా మోదీ' (ఓడిపోయాడు మోదీ) అని వెక్కిరిస్తున్నారు. అంతా తన చుట్టూ తిప్పుకుంటే యిదే జరుగుతుంది. 'బిజెపి ఓడలేదు, మోదీ ఓడాడు' అనే వ్యాఖ్యలు రావడానికి కారణం యిదే.

బిజెపి అనేక రాష్ట్రాలలో వుంది. ఆ యా రాష్ట్రాల అవసరాలు కూడా తీర్చాలి. తెలుగు రాష్ట్రాల విభజన తర్వాత చేయవలసిన పనులు వున్నాయి. రాజ్యసభలో అప్పటి ప్రధాని ఆంధ్రకు ఐదేళ్లపాటు ప్రత్యేక హోదా యిస్తానని అనడం, వెంకయ్య దాన్ని పదేళ్లు చేస్తాననడం రికార్డయి వుంది. మోదీ దాన్ని తోసిరాజన్నాడు. ఆంధ్రకు తొలి సంవత్సరం బజెట్ లోటు భరిస్తామన్న హామీని తుంగలో తొక్కి 15 వేల కోట్లు అడిగితే 500 కోట్లు యిచ్చాడు. వెనకబడిన ప్రాంతాలకు ప్యాకేజీ యిస్తామని చెప్పి, జిల్లాకు 350 కోట్లు అడిగితే 7 జిల్లాలకు కలిపి 350 కోట్లు యిచ్చాడు. తెలంగాణకు చేయవలసినవీ చేయడం లేదు. (అందుకే ఢిల్లీలో తెలుగువారెవరూ బిజెపికి ఓటేయలేదట. కవర్ చేయడానికి వెళ్లిన తెలుగు మీడియావాళ్లకు బాహాటంగా చెప్పారట) నీరు, విద్యుత్ పంపిణీ గురించి ఇరు రాష్ట్రాల మధ్య పేచీలు పరిష్కరించడానికి సెంట్రల్ ఏజన్సీలు ఏమీ చేయకుండా చోద్యం చూస్తున్నాయి. ఇద్దరూ కొట్టుకుని బలహీనపడాలన్న దురుద్దేశం కాకపోతే యీ ఉదాసీనతకు కారణం వేరేముంటుంది? ఇవి మన తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన విషయాలే. తక్కిన రాష్ట్రాలకూ యిలాటి ఫిర్యాదులే వున్నాయి.

ఇలా జరిగితే ఆ యా రాష్ట్రాల బిజెపి నాయకులకు ఆ రాష్ట్రాలలో పలుకుబడి ఏం మిగులుతుంది? వెంకయ్యనాయుడివి అన్నీ

కబుర్లే, మోదీ యితని మాటలేవీ పట్టించుకోడట అని మనం అనుకునే స్థితి వచ్చింది కదా! బండారు దత్తాత్రేయదీ డిటో పొజిషనే. 'మేం మోదీకి చెప్పాం' అనే అంటారు తప్ప 'సాధించుకుని వచ్చాం' అనలేరు కదా. ఎప్పటికైనా యివ్వడమంటూ జరిగితే మోదీ దయతలచి మనకు విదిలించాడు అనుకోవాలి. అలా అనుకునేదాకా మోదీ విదల్చనే విదల్చడు. ఇందిర యిలాగే చేసేది. రాష్ట్రాలలో ఎవరైనా బలమైన నాయకుడు వుంటే అతని ప్రత్యర్థిని దువ్వి బలహీనపరిచేది. ఇద్దరూ తన దగ్గరకు పంచాయితీకి రావాలి. రెండు దశాబ్దాలు గడిచేసరికి దేశం మొత్తం తెలిసిన నాయకుడంటూ లేకుండా పోయాడు. గతంలో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యేలు ఎన్నుకునేవారు. ఇందిర హయాం నుంచి ఎమ్మెల్యేలు నిర్ణయాన్ని ఇందిరకు వదిలేస్తూ తీర్మానం పాస్ చేయడం, కేంద్ర పరిశీలకులు వచ్చి అందరి చేతా ఒట్లేయించి కవర్లోంచి పేర్లు బయటకు తీయడం ఎక్కువైంది. మోదీ అదే బాటలో వెళుతున్నారు.

వీటన్నిటికి ఆర్థికమంత్రినో, జలవనరుల మంత్రినో నిందించకుండా మోదీమీదే ఎందుకు పడాలి అంటే దానికి మోదీ ధోరణే కారణం. 15 ఏళ్లలో గుజరాత్ సాధించిన అభివృద్ధి అంతటికీ మోదీయే క్రెడిట్ తీసుకున్నాడు కదా. అక్కడ విద్యుత్ నిరంతరం సరఫరా అవుతుంది అంటే, రోడ్లు బాగున్నాయి అంటే, పరిశ్రమలు వృద్ధి చెందాయి అంటే, సర్దార్ సరోవర్ ప్రాజెక్టు బాగా అమలైంది అంటే ఆయా శాఖల మంత్రులకు ప్రశంసలు లభించాలి కదా. లభించిందా? లేదే! అంతా మోదీ, మోదీ మోదీ! మోదీయే అన్ని డిపార్ట్‌మెంట్లలోనూ పనిచేసినంత బిల్డప్. ఇప్పుడు కేంద్రానికి వచ్చాక కూడా అదే బిల్డప్. ఏ మంత్రిని కుదురుగా కూర్చోనివ్వడు. సొంత నిర్ణయాలు తీసుకోనివ్వడు. వాళ్లకు ఎవరు సెక్రటరీగా వుండాలో తనే నిర్ణయిస్తాడు. వాళ్లెవరూ విధాన ప్రకటనలు చేయడానికి వీల్లేదు. వాళ్లంతా అల్లరి కుర్రాళ్లు. తను హెడ్మాస్టరు. ఇక ఉద్యోగులంతా పనిదొంగలైనట్లు, తనేదో పట్టుకోవడానికి వచ్చిన పోలీసు యిన్‌స్పెక్టరయినట్లు వ్యవహరించే తీరు బాగా లేదు. (అందుకే ఉద్యోగులలో చాలామంది బిజెపికి వ్యతిరేకంగా ఆప్‌కు ఓటేశారట). ఇది పద్ధతి కాదు అని మోదీకి చెప్పే ధైర్యం తక్కిన బిజెపి నాయకులెవరూ కనబరచటం లేదు. మోదీయే ఉద్ధారకుడు, మానవాతీత వ్యక్తి, తలచుకుంటే ఏదైనా చేయగలడు అనే యిమేజిని కార్పోరేట్ శక్తులు సోషల్ మీడియా ద్వారా బిల్డప్ చేశాయి. మోదీని వ్యతిరేకిస్తే భారతీయతను, హిందూమతాన్ని, అవినీతి ప్రక్షాళనను, స్వచ్ఛభారత్‌ను, సామర్థ్యాన్ని, బంగారు భవిష్యత్తును, అచ్ఛే దిన్‌ను వ్యతిరేకించినట్లే అనే అభిప్రాయం కలిగేట్లా చేశారు. మోదీ సర్కారు భూసేకరణ చట్టాన్ని యిష్టం వచ్చినట్లు దుర్మార్గంగా మార్చేసింది. మాదంతా స్వదేశీ విధానం అని చెపుతూనే ఇన్సూరెన్సు రంగంలో, రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులు ఆహ్వానిస్తోంది. మేక్ ఇన్ ఇండియా అంటూనే ప్రధాని సూట్లు విదేశాలనుంచి వస్తున్నాయి. గతంలో శివరాజ్ పాటిల్ రోజుకి మూడు సూట్లు మారిస్తే యాగీ చేసిన బిజెపి నాయకులను ఒబామా పర్యటనలో మోదీ మూడు సూట్లు మార్చారేమని అడిగితే ఏం చెప్పగలరు? సూటుపై తన పేరే డిజైన్‌గా వేసుకొనేటంత నార్సిసిజం (ఆత్మమోహం) తగునా? నార్సిసియస్ కథలో నీతి ఏమిటి, తన ప్రతిబింబంతో తనే మోహంలో పడితే చివరకు ఆత్మహత్యే గతి!

లెనిన్ టైములో రష్యాలో యితర నాయకులకు కూడా చోటు వుండేది. స్టాలిన్ వచ్చి తన వ్యతిరేకులందరినీ ఏరి పారేశాడు. తన చిత్తం వచ్చినట్లు పాలించాడు. దాని వలన కొంత మంచి జరిగింది, కొంత చెడు జరిగింది. అంతిమంగా రష్యా నష్టపోయింది. అందరినీ సంప్రదిస్తూ, అందరినీ కలుపుకుని పోవడం చాలా కష్టమైన పని. దానికి ఓపిక, ఓర్పుతో బాటు అవతలివాళ్లపై గౌరవం కూడా కలిగి వుండాలి. అవతలివాడు చెప్పేది నాన్సెన్స్ అని తెలిసినా, మర్యాదగానే తిరస్కరించగలగాలి. ఇదంతా టైమ్ వేస్ట్ అని తీసి పారేస్తే, తోసి పారేస్తే స్టాలిన్‌లాగానే జరుగుతుంది. అడాల్ఫ్ హిట్లర్ కూడా జర్మనీ పౌరుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి, ఎన్నో అద్భుతాలు సాధించాడు. యుద్ధాలకు దిగకుండా వుంటే చాలాకాలం పాలించి వుండేవాడు. అతనిపై అవినీతి ఆరోపణలు లేవు. కానీ మితిమీరిన అధికారం, తన మాటకు ఎదురాడిన వారిని సహించకపోవడం అనే లక్షణాలే చివరకు జర్మనీని నాశనం చేశాయి. ఈరోజు అడాల్ఫ్ అనే పేరు జర్మనీలో ఎవరూ పిల్లలకు పెట్టుకోనంతగా ప్రజల అసహ్యానికి గురయ్యాడు. హిట్లర్ తనతో బాటు తొలిరోజుల్లో కలిసి పయనించిన పార్టీలను నాశనం చేసి అందరి స్థానాలనూ తనే ఆక్రమించాడు.

ఇప్పుడు మోదీ చేస్తున్నదీ అదే కదా. ఢిల్లీ ఎన్నికల తర్వాత శివసేన స్టేటుమెంటు చూడండి – మోదీది వేవ్ అయితే, ఆప్‌ది సునామీ! తన భాగస్వామి ఘోరపరాజయం పొందితే చంకలు గుద్దుకుంటోంది. ఎందువలన? ఎందుకంటే వాళ్ల పార్టీ సభ్యుణ్ని రాత్రికి రాత్రి బిజెపి తన పార్టీలో చేర్చేసుకుని మంత్రిపదవి కట్టబెట్టినందుకు ఉక్రోషం. పొత్తులో ఎవరు బలవంతులో చూపడానికి విడివిడిగా పోటీ చేయడంలో తప్పు లేదు. కానీ తర్వాత కాస్త ఔదార్యం చూపాలి. రేపు పరిస్థితి తారుమారు అయితే ఎలా? అనే ఆలోచన వుండాలి. అకాలీదళ్‌తో కూడా యిలాగే ఆడుకుని, ఢిల్లీ ఎన్నికలలో పంజాబీ ఓట్ల కోసం బాదల్‌కు పద్మవిభూషణ్ యిచ్చారు. అవసరమా? అతను చేసిన ఘనకార్యం ఏమిటో చెప్పారా? తన ప్రధాని అభ్యర్థిత్వాన్ని నితీశ్ వ్యతిరేకించాడు కాబట్టి నితీశ్‌పై మోదీ పగబట్టి మాంఝీని దువ్వాడు. మోదీ దన్ను చూసుకునే బలం లేకపోయినా మాంఝీ తల ఎగరేశాడు. గవర్నరు మన చేతిలో వున్నాడు కదా అనుకున్నాడు. ఇలాటి భ్రష్టు పనులు చేయడానికే వస్తూనే గవర్నర్లను మార్చేశాడు. అన్నీ కాంగ్రెసు బుద్ధులే. ఎన్టీయార్‌ను పడగొట్టడానికి నాదెండ్లను యిలాగే వాడుకున్నారు. ఆ తర్వాత వదిలేశారు. ఢిల్లీ ఎన్నికల ఫలితం చూశాక మోదీ వెనక్కి తగ్గితే అప్పుడు మాంఝీ నాలిక కరుచుకోవాలి – నమ్మి ఏమారిపోయానే అని. కశ్మీర్‌లో పిడిపితో కూడా బేరాలు తెగలేదు కాబట్టి వాళ్లూ మంటగా వున్నారు. ఢిల్లీ ఫలితాలు రాగానే 'ఇవి వారికి కనువిప్పు కావాలి' అన్నాడు ముఫ్తీ. ఇప్పటికైనా గుఱ్ఱం దిగి సమానస్థాయిలో మాట్లాడు సుమా అని హెచ్చరించాడన్నమాట. టిడిపిది మిత్రపక్షమైనా, చంద్రబాబు అడిగినవి యివ్వకుండా ఎలా తిప్పుతున్నారో

చూస్తున్నాం కదా, బాబుకి రాష్ట్రంలో ఆబోరు దక్కే అవకాశం లేకుండా చేశారు కదా!

గత చరిత్ర యింత కథ చెప్తూ వుంటే బిజెపి నాయకులు మోదీకి దాన్ని గుర్తు చేసి 'నిదానించు బ్రదర్' అనాలి కదా. అన్నారా? లేదు కదా. అని వుంటే ఢిల్లీ ఎన్నికలు మోదీ ఒంటిచేత్తో నిర్వహించేవాడా? ఢిల్లీ ఎన్నికలు ముఖ్యమైనవే. బిజెపి గెలిచివుంటే ఎవరూ పట్టించుకునేవారు కారు. ఇప్పుడు ఘోరంగా ఓడిపోవడంతో ప్రతిపక్షాలు పార్టీ అయిపోయిందని గంతులేస్తున్నాయి. మోదీ అజేయుడు కాడు, గట్టివాడు ఎవడైనా తగలితే చాలడు అనే సందేశం వెళ్లిపోయింది కదా. ఢిల్లీ ఎన్నికల ప్రాముఖ్యత గమనించి పార్టీలో అందరినీ కూర్చోబెట్టి సలహాలు తీసుకోవాల్సింది. బిజెపి ప్రముఖ నాయకుల్లో చాలామంది ఢిల్లీ వాళ్లే. కానీ ఎవర్నీ అడగలేదు. మోదీ, అతని శాంకో పాంజా అమిత్ యిద్దరే కూర్చుని అన్నీ చూసుకున్నారు. హర్షవర్ధన్‌ను 2013 ఎన్నికలలో బిజెపి తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థి. అలాటి ఆయనతో పార్టీ విధానం గురించి గాని, అభ్యర్థుల ఎంపిక గురించి కానీ, ప్రచారసరళి గురించి కానీ ఏమీ మాట్లాడలేదట. మేం చెప్తాం, నువ్వు అలా చేసుకుపో అని అందర్నీ డమ్మీలను చేశారు. అంతమాత్రం చేత బిజెపి క్యాడరంతా తిరగబడ్డారని, వేరే పార్టీకి ఓటేశారనీ అనడానికి లేదు. అలా వేసి వుంటే దాదాపు 33% ఓట్లు వచ్చేవి కావు. వాళ్లు మనసు పెట్టి పనిచేయలేదంతే.

జనసంఘ్ రోజుల నుండి ఢిల్లీ బిజెపికి కంచుకోటగా వుండేది. దేశవిభజనలో నష్టపోయిన పంజాబీలు 1947లో ఢిల్లీకి వచ్చిపడ్డారు. ముస్లిం వ్యతిరేకత వారిలో నరనరాలా పాకిపోయింది. వారికి తొలిరోజుల్లో హిందూమహాసభ, తర్వాతి రోజుల్లో జనసంఘ్ తమను ఆదుకునే పార్టీలుగా అనిపించాయి. అందుకే వాటికి కోర్ సపోర్టర్లుగా యిప్పటికీ నిలిచారు. ఢిల్లీ బిజెపి నాయకుల్లో చాలామంది పంజాబీలే. కష్టించే స్వభావం వలన పంజాబీలు బాగా పైకి వచ్చారు. ఢిల్లీ మొత్తాన్ని డామినేట్ చేశారు. కొన్నాళ్లకు ఢిల్లీలోని హరియాణా, యుపి వాసులకు యిది కంటకంగా తోచింది. ఢిల్లీ పంజాబీ సంస్కృతిని పూర్తిగా లోను కావడం గురించి నీరద్ సి. చౌధురి తన ఆత్మకథలో వ్యథ వ్యక్తపరిచారు చూడండి. ఈ కౌంటర్ ఫోర్స్ కాంగ్రెసుకు వెన్నుదన్నుగా నిలిచింది. ఇప్పుడు అది ఆప్‌కు మళ్లింది. కిరణ్ బేదీని బిజెపి అభ్యర్థిగా నిలపడంలో యీ పంజాబీ కోణం కూడా వుంది. పార్లమెంటు ఎన్నికలలో కూడా పంజాబీ ఖత్రీలు, జాట్‌లు, ఓబిసి ( మోదీ బిసి) బిజెపికి ఓటేశారని గణాంకాలు తెలిపాయి. ఈసారి మోదీ అభ్యర్థి కాదు కాబట్టి, ఓబిసిలు ఆప్‌కు వెళ్లిపోయి వుండవచ్చు. హరియాణా నుంచి వచ్చిన జాట్‌లను భూ సేకరణ చట్టం అదలగొట్టిందట. ఆ చట్టం ద్వారా యుపి, హరియాణాలలోని తమ భూములు లాక్కుంటారని భయపడి అందువలన వాళ్లంతా ఆప్‌కు వేశారట. మోదీ సర్కారు ఏర్పడ్డాక హిందూత్వ సంస్థలను అదుపు చేయకపోవడం, మంత్రులు సైతం యిష్టం వచ్చినట్లు మాట్లాడడం ఎక్కువైంది. గాడ్సే కీర్తన, లవ్ జిహాద్, హరామ్ జాదే.. ఒకటా రెండా? హిందూ వనితలు నలుగురేసి పిల్లలను కనాలన్న వ్యాఖ్యపై మీరేమంటారు అని మహిళా ఓటర్లు కిరణ్ బేదీని అడిగితే ఆమె మౌనం వహించింది.

నిజానికి ఆమెకు కూడా మోదీ-అమిత్ ప్రసంగాలు నచ్చి వుండవు. మోదీ – అరవింద్ నక్సలైట్, అరాచకవాది అంటే అమిత్‌షా టైమ్స్ ఆఫ్ ఇండియాకు యిచ్చిన యింటర్వ్యూలో – కేజ్రీవాల్‌ను ప్రజలు కొట్టి చంపేవారు అన్నాడు. ఇలా మాట్లాడి అరవింద్‌పై అందరూ జాలిపడేట్లా చేశారు. ప్రజల స్వభావం ఎలా వుంటుందంటే ఎప్పుడూ అండర్‌డాగ్ పక్షం వహిస్తారు. సైకిల్, కారు గుద్దుకుంటే సైకిలు వాడిది తప్పయినా వాణ్నే వెనకేసుకుని వస్తారు. పార్లమెంటు ఎన్నికలలో మోదీ అండర్‌డాగ్, మనలో ఒకడైన చాయ్‌వాలా. రాహుల్ గొప్పింటి బిడ్డ. అందుకని మోదీని గెలిపించారు. ఇంటర్వల్ తర్వాత మోదీ యిప్పుడు సూట్‌వాలా, అరవింద్ మఫ్లర్‌వాలా. పాపం రిపబ్లిక్ డే పెరేడ్‌కు పిలుపు కూడా రానివాడు. ప్రచారం చేసుకోవడానికి డబ్బు కూడా లేనివాడు. అతనిపై జాలితో 2013లో 25 వేలు వున్న ఆప్ వాలంటీర్లు యిప్పుడు రెట్టింపయ్యారు. డబ్బు తీసుకోకుండా పనిచేశారు.

మోదీలో హుందాతనం పూర్తిగా లోపించింది. అరవింద్‌ను వెంటాడినట్లు ప్రవర్తించారు. ఎలాగైనా నెగ్గాలనే యావతో మోదీని, బిజెపిని తిట్టిన షాజియా యిల్మీని బిజెపిలో చేర్చుకున్నారు. ఓడిపోయింది. కాంగ్రెసు నుంచి తీసుకుని వచ్చిన దళిత నేత కృష్ణ తీరథ్ కూడా ఓడిపోయింది. ఓటర్లలో 45% మహిళలు కాబట్టి కిరణ్ బేదీ ఆ ఓట్లు పొందుతుందని లెక్క వేసి పోలింగు మూడు వారాలు వుందనగా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారు. కానీ కిరణ్ పంజాబీ మూలాలు ఓటర్లలో 24% వున్న పూర్వాంచల్ వాసులకు నచ్చలేదు. పోలీసు అధికారిణి సిఎం అవుతారనేసరికి కార్మికులు, శ్రామికులు, చిన్న దుకాణదారులు భయపడ్డారు. 15 వేల నుంచి 25 వేల దాకా ఆర్జించే గ్రూపు 20% వున్నారు. వీరు అక్రమ కాలనీల్లో వుంటారు. కిరణ్ బేదీ కూల్చేస్తుందని భయపడ్డారు. ఫలితాలు వెలువడ్డాక కిరణ్ తన స్టేటుమెంట్లు మార్చడం చూస్తే అర్థమైంది – ఆమె రాజకీయాలకు పనికి రాదని. నేను ఓడిపోలేదు, పార్టీ ఓడిపోయింది అంటోంది. మళ్లీ మోదీని నిరాశ పరిచాను, సారీ అంటోంది. అంటే ఆమె మోదీకే జవాబుదారీ, పార్టీకి కాదన్నమాట!

బిజెపి ఓడిపోలేదు, దాని కోర్ ఓటర్లు దానితోనే వున్నారుగా అని వాదిస్తే భవిష్యత్తులోనూ ఫలితాలు యిలాగే వస్తాయి. తటస్థులను ఆకట్టుకుంటేనే గట్టెక్కుతారు, లేకపోతే మునిగిపోవడమే. ఈ తటస్థులు సాధారణంగా జాలిగుండెతో వుంటారు. వీపు మీద దెబ్బేసి వదిలేస్తూ వుంటారు. కానీ యీసారి ఢిల్లీ ఓటరు కసి కొద్దీ గుప్పిలి బిగించి బిజెపిని కడుపులో గుద్దాడు. సర్వం తానెయై వ్యవహరించిన మోదీ బాధతో విలవిల్లాడుతున్నారు. అమిత్ షా కొడుకు పెళ్లికి కూడా హాజరు కాలేదు. పెళ్లిలో బాణసంచా గట్రా కాన్సిల్ చేశారు. గవర్నర్ల సమావేశంలో కూడా మోదీ ముభావంగా వున్నారట. దీనితో బిజెపి కథ అంతమై పోయిందని ఎవరూ అనుకోలేరు. టైమ్లీ వార్నింగ్ అందినందుకు బిజెపి సంతోషించాలి. పార్టీలో అధికార వికేంద్రీకరణ జరగాలని, బహుళనాయకత్వం సిద్ధాంతం మళ్లీ

అమలు కావాలని, కార్పోరేట్‌కు, విదేశీయులకు దాసోహమంటోందన్న భావాన్ని తొలగించాలని, హిందూత్వ శక్తులను అదుపు చేయాలనీ, అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా పెట్రోలు ధరలను తగ్గించి, తద్వారా మొత్తం ధరలు తగ్గేట్లా చేయాలనీ, ఆర్డినెన్సులు ఆపి అఖిలపక్షసమావేశాలను ఏర్పరచి యితర పార్టీలనూ సంప్రదించాలని, అన్ని రాష్ట్రాలనూ పక్షపాతరహితంగా చూసి స్థానిక బిజెపి నాయకులు కూడా ఎదిగేట్లు చేయాలనీ – బిజెపి పార్టీ సభ్యులందరూ తీర్మానాలు చేసి మోదీకి కళ్లెం వేయవలసిన తరుణం వచ్చింది. ఎందుకంటే ప్రస్తుతం దేశంలో కనబడుతున్న ఒక్క మొగాడు – మోదీయే! అతన్ని సరిదిద్దుకుని సవ్యంగా వాడుకోవాలి. దేశప్రజల సంక్షేమం దృష్ట్యానైనా, బిజెపి కార్యకర్తలు యీ పని చేయాలి. స్టాలిన్ రోజుల్లోలాగ, హిట్లర్ రోజుల్లోలాగ మోదీ తమను సిబిఐ ద్వారా బెదిరిస్తాడనో, ఇన్‌కమ్‌టాక్స్ వారిని ఉసిగొల్పుతాడేమోననో భయపడితే వారికే కాదు, దేశానికే అరిష్టం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 15–17** **ఎమ్బీయస్ : ఆంధ్రకు పరిశ్రమలు తరలివస్తాయా?**

రాష్ట్రవిభజన తర్వాత తెలంగాణ నుండి ఆంధ్రకు పరిశ్రమలు తరలి వస్తాయని చాలామంది అనుకున్నారు. ఆంధ్రకు ఐదేళ్లపాటు ప్రత్యేక హెూదా యిస్తామని, 13 జిల్లాలలో సగం కంటె ఎక్కువ 7 జిల్లాలలో బుందేల్ ఖండ్ తరహా రాయితీలు యిస్తామని, ప్రోత్సాహకాలు యిస్తామని రాజ్యసభలో అప్పటి ప్రధాని మన్‌మోహన్ ప్రకటించారు. మీరు ఐదేళ్లంటున్నారు, మేం ఎలాగూ అధికారంలోకి రావడం ఖాయం, దాన్ని పదేళ్లు చేస్తాం అని వెంకయ్యనాయుడు అన్నారు. వీటన్నిటి దృష్ట్యా ఆంధ్రకు పరిశ్రమలు రావడం తథ్యమనే అందరూ నమ్మారు. ప్రత్యేక హెూదా వున్న రాష్ట్రాలలో సాధారణంగా భౌగోళిక పరిస్థితి బాగుండదు. ఆంధ్రలో అయితే ఎగుమతులకు దోహదపడే కోస్తా తీరం వుంది, విద్యావంతులైన, పనిలో నేర్పరులైన స్థానికులున్నారు, డబ్బు వుంది. అందువలన స్పెషల్ స్టేటస్ ప్లస్ యీ సౌకర్యాలు కలిస్తే యిక తిరుగులేని స్థానానికి చేరుకుంటుందని, తెలంగాణను తలదన్నుతుందని, ఐదు పదేళ్ల తర్వాత విడిపోవడం మన మంచికే వచ్చిందనుకుంటారని అందరూ భావించారు. ఇరుగుపొరుగు రాష్ట్రాల వారు తమ రాష్ట్రం నుంచి పెట్టుబడిదారులు రాయితీల కోసం అక్కడకు వెళ్లిపోతారని భయపడి అడ్డుపుల్లలు వేయసాగారు. ఈ హంగామా అంతా చూసి ఆంధ్రవాసులు యింకేముంది, తమ స్థలాలకు గొప్ప డిమాండ్ వచ్చేసింది అనుకుంటూ భూమి ధరలు అమాంతం పెంచేశారు. బిజెపి, టిడిపి భాగస్వాములు కాబట్టి ప్రత్యేక హెూదా, రాయితీలు వచ్చి తీరతాయని అందరూ అనుకుని పరిశ్రమలు పెట్టడానికి ముందుకు వచ్చినవారు యీ ధరలు చూసి జంకారు. కాస్త తమాయించారు.

ఈలోగా మోదీ స్వభావం తేటతెల్లమైంది. తెలుగు మీడియాను తన గుప్పిట్లో పెట్టుకున్న చంద్రబాబు కేంద్రం నుంచి వచ్చిన ప్రతీ పైసా తన ప్రతాపమే అని రాయించుకుని తన పాప్యులారిటీ పెంచుకుంటారని, దానివలన తనకేం లాభమనే ఆలోచనతో మోదీ నిధులు బిగబడుతున్నారని అందరికీ అర్థమైంది. పెట్టుబడిదారులు సరే, వేచి చూదాం ఎప్పటికో అప్పటికి యివ్వకపోరు, ఇచ్చాకనే కదులుదాం అని ఆగారు. గత నెలలో ప్రత్యేక హెూదా హుళక్కి అని తేల్చేశారు. ఇన్నాళ్లూ ఆశ పెడుతూ వచ్చిన బిజెపి, టిడిపి నాయకులు కూడా ఆ విషయం బాహాటంగా చెప్పుకోవలసి వచ్చింది. మళ్లీ ఆ నోటితోనే ప్రత్యేక హెూదా పేరుతో కాకపోయినా దాదాపు ఆ బెనిఫిట్ వచ్చేటంత రాయితీలు, ప్రోత్సాహకాలు వస్తాయని చెపుతూ వచ్చారు. ఫిబ్రవరి మొదటివారంలో అదీ బయటకు వచ్చింది. ఎక్సయిజ్ మినహాయింపు, యిన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ, ఇన్‌కమ్‌టాక్స్ రిబేట్, టాక్స్ హాలీడే యిలాటివి ఏమీ లేవు. కేవలం యంత్రాలపై 15% ఎడిషినల్ డిప్రిసియేషన్.

కంపెనీ లాభాలు సంపాదిస్తూ వుంటే, దానిపై యిన్‌కమ్ టాక్స్ కట్టేటప్పుడు పొందగల అదనపు సౌకర్యం యిది. ఆదాయపు పన్ను కట్టే స్థాయికి ఒక కంపెనీ రావాలంటే కొన్నేళ్లు పడుతుంది. ఇప్పటికే లాభాల్లో వున్న కంపెనీని ఎక్కణ్నుంచైనా తరలిస్తే యీ సౌకర్యం రాదు. ఎందుకంటే కొత్త మెషినరీ మీదే యీ ఫెసిలిటీ. మెషినరీపై పెట్టే ఖర్చులో 15% ఇన్వెస్ట్‌మెంట్ ఎలవన్స్ కూడా యిచ్చారు. ఇది ఐదేళ్లలో ఎప్పుడైనా క్లెయిమ్ చేయవచ్చు. ఇది కూడా లాభాలు వచ్చే పరిశ్రమకు పనికి వస్తుంది తప్ప తక్కినవారికి పనికిరాదు. ఈ ప్రోత్సాహకాలైనా ఆ 7 జిల్లాలలో పెడితేనే వస్తాయి. అక్కడ యిన్‌ఫ్రాస్ట్రక్చర్ బాగా వుంటే కాస్త ముందడుగు వేయవచ్చు. అవి వెనుకబడిన జిల్లాలని ప్రభుత్వమే ఒప్పుకుంది. అక్కడి పరిస్థితులు బాగు చేయాలంటే రాబోయే ఐదేళ్లలో రూ.24350 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్రం ప్రతిపాదనలు పంపింది. అంటే ఏడాదికి 4870 కోట్లు అన్నమాట. దానికి బదులు వాళ్లు యీ ఏడాది శాంక్షన్ చేసినది రూ.350 కోట్లు! అంటే 7% అన్నమాట. ఈ లెక్కన అక్కడి పరిస్థితులు ఎప్పుడు బాగుపడేను? ఎప్పుడు పరిశ్రమలు వచ్చేను?

ఈ ఏడాది జనవరి వరకు ఆంధ్రలో 80 భారీపరిశ్రమలు, 175 మధ్య తరహా పరిశ్రమలు, 2 వేలకుపైగా చిన్న పరిశ్రమలు పెట్టడానికి ఎంక్వయిరీస్ వచ్చాయట. కేంద్రం కానీ, రాష్ట్రం కానీ ఎలాటి రాయితీలు యిస్తాయో చూసి అప్పుడు నిర్ణయం తీసుకుంటాం అంటున్నారట పెట్టుబడిదారులు. కేంద్రం ఏమిస్తుందో రాష్ట్రానికి ఏదైనా తెలిస్తే కదా హామీ యివ్వడానికి. తమ వరకు తాము ఏమీ యిచ్చే పరిస్థితిలో లేరు. మహా అయితే భూమి యివ్వాలి. తెలంగాణలో వున్నట్టుగా అక్కడ ప్రభుత్వభూమి ఎక్కువగా లేదు. తీరప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో యిద్దామంటే పర్యావరణ శాఖ నుంచి మినహాయింపులు తెచ్చుకోవాలి. అదో పెద్ద తలకాయనొప్పి. కొని యిద్దామంటే

రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. భూసేకరణో, భూసమీకరణో చేసి యిద్దామంటే రాజధాని విషయంలోనే ఎదురుదెబ్బ తగులుతోంది. అక్కడ ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేకపోతున్నారు. జరీబు భూముల్లో రైతులు తిరగబడుతున్నారు. ఆదేశాలు ధిక్కరించి పంటలు వేస్తున్నారు. హామీలతో కాకుండా డబ్బిచ్చి వాళ్లను చల్లార్చాలని చూదామంటే ఉద్యోగుల జీతాలకే డబ్బు చాలదు. అయినా తెలంగాణతో పోటీ పడి జీతాలు పెంచవలసి వచ్చింది. ఈ ఉక్కిరిబిక్కిరి పరిస్థితుల్లో ఏ ముఖ్యమంత్రైనా ధీమాగా ఎలా వుండగలరు? ఎవరికి మాత్రం ఏ హామీ యివ్వగలరు? విదేశీ రాయబారులను వెళ్లి అడిగి వచ్చారు. ఏదైనా శిశువుల పేరు చెప్పి, మహిళల పేరు చెప్పి సంక్షేమపథకాలు పెడుతున్నాం, ఆదుకోండి అంటే విదేశీ ప్రభుత్వాలు ఆలోచిస్తాయి. పెట్టుబడులు, నిధులు అంటే వాళ్లకు పట్టదు.

ఆంధ్రమూలాలు వున్న పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు తెలంగాణలో పుష్కలంగా వున్నారు. ఆంధ్రకు అన్యాయం జరిగింది కాబట్టి దాన్ని సవరించడానికి మనమేదైనా చేయాలి, అక్కడకు తరలివెళ్లి ఆదుకోవాలి అనే సెంటిమెంటు రాష్ట్రావతరణ సమయంలో కాస్త కనబడింది. సినిమా పరిశ్రమ వెళ్లిపోతుందా? చీలిపోతుందా? అని కూడా అనుకున్నారు. అక్కడా స్టూడియోలు కడతాం అన్నారు కొందరు. ఇప్పటిదాకా ఎవరూ కట్టినట్లు లేదు. వైజాగ్‌లో రామానాయుడు గారి స్టూడియో ఏ మేరకు యాక్టివ్‌గా వుందో తెలియదు. అయినా యిప్పుడు స్టూడియోలను నమ్ముకునేవారు తగ్గిపోయారు. ఇళ్లలోనే తీసేస్తున్నారు. ఇళ్ల స్థలాలిచ్చి, రాయితీలిచ్చి పిలుచుకుని వస్తేనే మద్రాసు నుండి తరలి రావడానికి దశాబ్దాలు పట్టింది, యిక్కణ్నుంచి యిప్పట్లో వెళుతుందా? అని కొందరు సందేహించారు. బొంబాయితో కాని, మద్రాసుతో కాని హైదరాబాదు కున్నంత కనెక్టివిటీ ఆంధ్రలో ఏ పట్టణానికీ యింకా లేదు. ఎయిర్‌పోర్టులు ఎప్పుడు వస్తాయో, వాటికి రద్దీ ఎప్పుడు పెరుగుతుందో, టిక్కెట్ల ధర ఎప్పుడు తగ్గుతుందో చూశాకనే ఆలోచించవచ్చు అనుకున్నారేమో తెలియదు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ తెలుగునేలకు తరలి రావడానికి కారణభూతుడు నాగేశ్వరరావుగారు. తనతో సినిమా తీసేవాళ్లందరూ హైదరాబాదులోనే తీయాలనే షరతు పెట్టి బలవంతాన లాక్కుని వచ్చారు. ఇప్పుడు అంత కమిట్‌మెంట్ వున్న హీరో ఎవరు? వైజాగ్‌లోనో, విజయవాడలోనో షూటింగ్ చేస్తేనే సైన్ చేస్తా అనే హీరో ఒక్కడూ వుండడు. అమెజాన్‌లో తీస్తావా, ఆస్ట్రేలియాలో తీస్తావా? అని అడుగుతారు. అయినా అప్పట్లో ఎయన్నార్ ఏడాదికి ఆరేడు సినిమాలు వేసేవారు కాబట్టి వాటికి సంబంధించిన వారందరూ రావలసి వచ్చేది. ఇప్పుడు పెద్ద హీరోతో సినిమా అంటే రెండేళ్లు పడుతోంది. అప్పుడప్పుడు వెళ్లి వచ్చినా సరిపోతుంది. కంటిన్యువస్‌గా వుండవలసిన పని లేదు. సినిమా షూటింగుల్లో లైట్ల కారణంగా భయంకరమైన వేడి. బయట వాతావరణపు వేడి కూడా తోడవుతే యింకా మండిపోతుంది. హైదరాబాదు వాతావరణానికి అలవాటు పడ్డాక వేరే చోటికి వెళ్లడం కాస్త కష్టమే. కానీ సముద్రతీరం, నదీతీరం వంటి లొకేషన్స్ కావాలంటే కోస్తాకు వెళ్లాల్సిందే. తెలుగు సినిమా స్థాయి పెరిగిపోయాక అలాటి లొకేషన్స్ కోసం విదేశాలు వెళదామంటున్నారు స్టార్లు.

ఇతర పరిశ్రమల విషయానికి వస్తే తెలంగాణ ఏర్పడగానే ఆంధ్ర వాళ్ల పని పడతానంటూ కెసియార్ నాగార్జున కన్వెన్షన్‌పై పడడం, అయ్యప్ప సొసైటీ బిల్డింగులు కూల్చడం యివన్నీ చూడగానే అందరూ తట్టా, బుట్టా సర్దడం మొదలుపెట్టారు. కానీ అంతలోనే సద్దు మణిగింది. అయ్యప్ప సంఘటన కేవలం ఝలక్ యివ్వడానికే అని తేల్చేశారు కెసియార్. పద్మాలయా స్టూడియోస్, రాఘవేంద్రరావు కాంప్లెక్స్, ల్యాంకో హిల్స్, ఐ మ్యాక్స్ – యిలాటి అనేక సంస్థలపై ఉద్యమ సమయంలో గర్జించిన, హెచ్చరించిన, కేసులు పెట్టిన తెరాస నాయకులు యిప్పుడు చల్లారిపోయారు. తమ ప్రజలనే స్థానికులు, స్థానికేతరులుగా విడగొట్టడానికి ఉద్దేశించిన ఫాస్ట్ పథకాన్ని ఫాస్టూ లేదు, గీస్టూ లేదు అంటూ రద్దు చేశారు. వచ్చే ఏడాది మళ్లీ ముందుకు తెస్తారేమో తెలియదు. ఉద్యమసమయంలో ప్రయివేటు పరిశ్రమల్లో కూడా స్థానికులకు రిజర్వేషన్ కల్పిస్తామని చేసిన వాగ్దానాలపై కిమ్మనటం లేదు. కూలీలుగా వచ్చినవారితో కాదు, ఆంధ్ర పెట్టుబడిదారులతోనే మా పేచీ అంటూ ప్రకటించినవారు యిప్పుడు ఆంధ్ర పెట్టుబడిదారులతోనే వూరేగుతున్నారు. తవ్వించి పారేస్తానన్న రామోజీ ఫిల్మ్ సిటీలో ఒక్క అంగుళం కూడా అసైన్డ్ భూమి లేదని కెసియార్ ప్రకటించారు. ఉందని ప్రభుత్వం వేసిన కేసు కోర్టులోనే వుంది. ఫార్మా సిటీ, ఫిల్మ్ సిటీ ఏ సిటీ ప్లాన్ చేసినా పక్కన ఆంధ్రులు వుంటున్నారు. ఇదేమిటి యిలా అంటే ఉద్యమనాయకత్వం వేరు, పరిపాలన వేరు అని సమాధానం చెప్తున్నారు. ఈ విషయం అప్పుడు తెలియదా? తెలంగాణ వస్తే ఆంధ్రుల్ని తరిమేసి తమకే అన్నీ కట్టబెడతారని ఆశ పెట్టుకున్న సామాన్యులు ఉసూరుమంటారు కదా అని అడిగితే జవాబు వుండదు. ఈ ఉద్యమాలు యిలాగే వుంటాయి. పాలకులు మారతారు కానీ పెట్టుబడిదారులు ఎప్పుడూ సురక్షితంగానే వుంటారు. వారు లేకపోతే అభివృద్ధి ఎక్కడిది? అభివృద్ధి కావాలంటే శాంతి వుండాలి. వాళ్లను అల్లరి పెట్టకూడదు. ఇవాళ పేపర్లో వచ్చింది – కెసియార్ తన ప్రభుత్వాధికారులతో మాట్లాడుతూ 'ఆంధ్ర–తెలంగాణ పేచీలు మర్చిపోండి. గతం గతః, తెలంగాణకు నష్టం కలిగినప్పుడే స్పందిద్దాం' అన్నారుట. (రేపే యింకోలా మాట్లాడినా ఆశ్చర్యపడనక్కరలేదు) అంటే అర్థం ఏమిటి? 'మా పేచీలు ఆంధ్రప్రభుత్వంతోనే. ఆంధ్ర ప్రాంతీయులు యిక్కడ పెట్టుబడులు పెట్టడానికి వస్తే సతాయించకండి, సతాయిస్తే మేం సంతోషిస్తాం అని అనుకోకండి.' అనే సంకేతం యిచ్చినట్లే కదా! మహారాష్ట్ర మహారాష్ట్రులకే అని నినదించిన శివసేన గుజరాతీ పెట్టుబడిదారులను బొంబాయి నుంచి తరిమివేసిందా? తరిమివేస్తే ఉద్యోగాలు పోయి మరాఠీవారే శివసేన దుంప తెంపుతారని తెలుసు వాళ్లకు, అందుకే గుజరాతీల పెట్టుబడులు అప్పటికంటె పెరిగాయి.

భవిష్యత్తు ఎలా వుంటుందో తెలియదు కానీ కెసియార్ ప్రస్తుతానికి తన రాష్ట్రంలో వున్న ఆంధ్ర పారిశ్రామిక వేత్తలకు వ్యతిరేకంగా వెళ్లటం లేదు. ఇక్కడ వేడి పుట్టి వుంటే వాళ్లూ తరలి వెళ్లేవారేమో కానీ, కాస్త నిదానించారు. పైగా తెలంగాణ ఏర్పడ్డాక హైదరాబాదులో

రియల్ ఎస్టేటు స్తంభించింది. తక్కిన జిల్లాల్లో భూముల రేట్లు తగ్గుముఖం పట్టాయి. కొనేవాళ్లు కనబడటం లేదు. రంగారెడ్డి, మెదక్ జిల్లాలలో ఎకరానికి 5 లక్షలుంటే ఆంధ్రలో ఓ మాదిరి ఊళ్లో కూడా 50 లక్షలుంటోందిట. ఎవరైనా పరిశ్రమలు పెట్టాలంటే భూమి విషయంలోనే యింత తేడా వుంటే ఆలోచించడా? భూమి రేటు తగ్గించడం ఆంధ్రప్రభుత్వం చేతిలో కూడా లేదు. ఇప్పటికే భూములుంటే కొత్త యూనిట్లు అక్కడ పెడుతున్నారేమో తెలియదు కానీ వున్నవాటి తరలింపు అంత జోరుగా కనబడటం లేదు. తెలంగాణలో పరిశ్రమలు కొనసాగడానికి విద్యుత్ లోటు ఒకటి అవరోధంగా వుంది. కెసియార్ సెక్రటేరియట్ తరలింపు లాటి అనవసరమైనవాటికి విపరీతంగా ఖర్చు పెట్టి, విద్యుత్ ప్రాజెక్టుల కోసం ప్లాన్ చేయడం లేదు. విద్యుత్ కొనడానికే డబ్బులు చాలని పరిస్థితిలో కులసంఘాలకు, ప్రాంతీయ సంఘాలకు బిల్డింగులు అవసరమా? ఇవన్నీ ఉత్పాదనకు పనికి వచ్చే ఖర్చు కాదు. విద్యుత్ విషయంలో ఆంధ్రలో మిగులు వుంది కాబట్టి పరిశ్రమలకు అటువైపు ఆకర్షణ వుంది. అయితే యీ మిగులు ఎంతకాలం వుంటుందో తెలియదు. ఇన్నాళ్లూ అక్కణ్నుంచి హైదరాబాదుకి సప్లయి చేస్తూండేవారు. ఇప్పుడు ఆపేశారు కాబట్టి మిగులుతోంది. ప్రస్తుతానికి పరిశ్రమలు లేవు కాబట్టి నిరంతరం యిస్తున్నారు. నిజంగా పరిశ్రమలు వస్తే ఎన్ని గంటలు యివ్వగలరో? విద్యుత్ ప్రాజెక్టులు యింకా పెట్టాలంటే నిధులు కావాలి. అక్కడ చంద్రబాబూ సంక్రాంతికి 'చంద్రన్న కానుక' వంటి వ ృథా వ్యయం చేసి డబ్బులు తగలేస్తున్నారు. ముందుచూపు లోపిస్తోంది.

కొత్తవాటి మాట ఎలా వున్నా యిప్పటికే వున్న కంపెనీలు తెలంగాణ నుంచి ఆంధ్రకు తమ రిజిస్ట్రేషన్లు మార్చుకుంటాయా అనేది మరో ప్రశ్న. జూన్ నెల నుంచి కొన్ని నెలలపాటు కొన్ని కంపెనీలు తమ అడ్రసులు తెలంగాణ నుంచి ఆంధ్రకు మార్చడంతో తెలంగాణ ఆదాయం తగ్గింది. ఆ విషయం కెసియార్ కూడా కేంద్రానికి యిచ్చిన నివేదికలో చెప్పుకున్నారు. దాని అప్‌టుడేట్ తెలియదు. ఇక్కడ ఒక విషయం గమనించాలి. ప్రొఫెషనల్స్, చిన్న వ్యాపారాల వాళ్లు రీజనల్ సెంటిమెంటుతో హెడాఫీసు ఆంధ్రకు షిఫ్ట్ చేసినట్లు చూపించి, తమ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగించవచ్చు. కానీ యిన్‌కమ్‌టాక్స్ భారీగా కట్టే పెద్ద కంపెనీల వాళ్లు పెద్ద నగరాల నుంచి ఓ పట్టాన మారరు. దేశంలోని అనేక కంపెనీల హెడాఫీసు బొంబాయిలో వుంటుంది. అక్కడ ఒక్క చిన్న గదిలో బుల్లి టేబుల్ వేసి, అదే హెడాఫీసు అంటారు. ఎందుకంటే టాక్స్ ఫైలు బొంబాయిలో వుంటే అక్కడ మహాసముద్రంలో కాకిరెట్టలా వుండవచ్చు. బొంబాయిలో ఫైళ్లు ఎంత పెద్ద సంఖ్యలో వుంటాయో వూహించండి. అంత వాల్యూమ్‌లో ఎ,బి,సి మెథడ్‌లో (ప్రాధాన్యతా క్రమంలో ఫైళ్లు విడగొట్టడం) చిన్నవాటిని, మధ్యతరహా వాటిని పెద్దగా పట్టించుకోరు. పెద్దపెద్ద కంపెనీలను దులిపితే ఏదైనా రాలుతుంది. చిల్లర ఎంత పోగుచేసినా ఏం లాభం అనుకుని, ఒక లిమిట్‌కు కింద వున్నవాటిని ఎట్ ర్యాండమ్, మధ్యమధ్యలో ఒకటి తీసి చూసి తక్కినవి వదిలేస్తూంటారు. వాళ్ల చూపు తమపై పడకూడదనుకునేవారికి అలాటి వాతావరణమే కావాలి. ఉదాహరణ చెప్పాలంటే మీరు ఉద్యోగానికి యింటర్వ్యూకి వెళుతున్నారనుకోండి. మొదటిరోజు పదిమందిని చేస్తారట, రెండో రోజు యిరవై మందిని చేస్తారట, నీ పేరు ఏ రోజు వేయమంటావు అని అడిగితే 'రెండో రోజు చివర్లో వేయి' అని అడుగుతారు. ఆ పాటికి అలిసిపోయి, పెద్దగా ప్రశ్నలు వేయకుండా వదిలేస్తారనే ఆశతో. మొట్టమొదటి కాండిడేట్‌గా వెళితే వాళ్లు ఫ్రెష్‌గా వుండి వాయించేస్తారన్న భయం వుంటుంది. ట్రాఫిక్ పోలీసు చెక్ చేస్తూ వుంటే సిగ్నల్ దగ్గర ముందు వరసలో వుందామనుకోం. వెనక్కాల నక్కి వుందామనుకుంటాం, అన్ని పేపర్లూ దగ్గరున్నా చెకింగ్ అంటే బోరే. జిరాక్స్ పెట్టావేం, ఒరిజినల్ వుండాలి కదా అనవచ్చు. ఏదో ఒకటి లోటు కనిపెట్టవచ్చు. ఇదీ అలాగే!

హైదరాబాదు, విజయవాడ మధ్య మీరు ఏ సెంటర్‌ను ఎంచుకుంటారు అని పెట్టుబడిదారుణ్ని అడిగితే, హైదరాబాదులో గుంపులో గోవిందాగా వుంటుంది కాబట్టి అక్కడే అంటారు. విజయవాడ అయితే అధికారులకు పని ఎక్కువ వుండదు కాబట్టి పట్టిపట్టి చూస్తారని భయం! ఇలాటి కారణాలకు ఎంత వెయిటేజి వుంటుంది అన్నది ఎవరైనా క్షుణ్ణంగా పరిశోధిస్తే కానీ తెలియదు. ఇదంతా కామన్‌సెన్స్‌తో రాస్తున్నదే! ముళ్లపూడి వెంకటరమణ గారి "రాజకీయ బేతాళ పంచవింశతిక"లో "దాచింపాడు రోడ్డు కథ" అని ఒకటుంది. ఒక గ్రామానికి పట్టణం నుంచి సరైన రోడ్డు వుండదు. రావాలంటే చచ్చే అవస్థ. గ్రామాధికారులు పట్టించుకోరు. ఒక యువకుడు యిదంతా చూసి, కోపగించుకుని ఎన్నికలలో నిలబడతాడు – 'నేను గెలిస్తే రోడ్డు వేయిస్తాను' అనే నినాదంతో. అవతలవాళ్లూ అదే చెప్తారు – 'వాడు గెలిస్తే రోడ్డు వేయిస్తాడు జాగ్రత్త' అని. అతను ఓడిపోతాడు. ఎందుకనే బేతాళప్రశ్నకు జవాబు ఏమిటంటే – రోడ్డు బాగా లేదని యిన్నాళ్లూ ప్రభుత్వాధికారులు చెకింగ్‌కు పెద్దగా రావటం లేదు. ఏడాదికోసారి మొక్కుబడిగా వస్తున్నారు. ఇప్పుడు రోడ్డు పడితే తోచీతోచనమ్మ తోటికోడలు పుట్టింటికి వెళ్లినట్లు వారానికో సారి చెకింగ్‌కు వచ్చి అది లేదని, యిది వుందని సతాయిస్తారని జనం భయపడతారు. అంతకంటె రోడ్డు లేకపోవడమే మేలనుకుంటారు. గొప్ప సెటైర్ కానీ వాస్తవాలతో కూడుకున్నది. ఇప్పటికీ వర్తిస్తుంది.

ఇతర రాష్ట్రాల నుంచి ఆంధ్రకు ఏమైనా తరలి వస్తున్నాయో లేదో కొన్ని రోజుల్లో తెలుస్తుంది. ఇతర దేశాల నుంచి వస్తున్నాయని బాబు అంటున్నారు. అవన్నీ వచ్చేదాకా, కనీసం భూమిపూజ అయ్యేదాకా లెక్కలోకి తీసుకోలేం. 1972లో ఆంధ్ర వుద్యమం జరిగినపుడు ఆ ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్న సమైక్యవాది ఒకాయన 'విడిపోతే ఆంధ్ర కేరళలా తయారవుతుంది. అందరూ ఎడ్యుకేటెడే, స్కిల్‌డే, కానీ అందరికీ అవకాశాలు వుండవు. ఇప్పుడైతే తెలంగాణలో వాక్యూమ్ వుంది కాబట్టి కొందరైనా అక్కడకు వ్యాపించి, తాము బాగుపడి, వాళ్లనూ బాగుచేస్తున్నారు. విడిపోయాక ఆ అవకాశాలు సన్నగిల్లుతాయి. సొంత రాష్ట్రంలో పోటీ ఎక్కువై పోతుంది.

తట్టుకోలేనివాళ్లు మలయాళీల్లా యితర రాష్ట్రాలలోకి వెళ్లి బాగుపడాల్సిందే.' అన్నారు. ఆ మాటలు నాకు యిప్పుడు గుర్తుకు వస్తున్నాయి. కేరళలో ఏదీ పెద్ద వూరూ కాదు, ఏదీ గ్రామమూ కాదు, అన్నీ సుమారుసుమారుగా వుంటాయి. ఆగ్రో యిండస్ట్రీస్, కుటీరపరిశ్రమలు, సీ ఫుడ్ పరిశ్రమలు వీటితో లాక్కుని వస్తూ వుంటుంది. పెద్ద పరిశ్రమలు పెడదామంటే పొల్యూషన్ కంట్రోలు వాళ్లు ఒప్పుకోరు. ఆంధ్రలో కూడా ఎక్కడికక్కడ చిన్నచిన్న పరిశ్రమలు పెట్టుకుని జనాలు బతికేస్తూ వుంటారిక. కానీ అందరికీ ఉపాధి దొరకడం కష్టం. అవకాశాల కోసం గతంలో హైదరాబాదుకి వచ్చేవారు, హైదరాబాదు కూడా మందగించింది కాబట్టి, మద్రాసు, బెంగుళూరు, మధ్యప్రదేశ్, యిలా వేరే వేరే వూళ్లు వెతుక్కుంటూ వెళతారు. మరీ టాలెంట్ వుంటే విదేశాలు వెళతారు. ప్రతిభ వున్నవారిని, కష్టపడేవారిని ఎవరూ ఆపలేరు. పాలకుల కబుర్లు విని ఊహల్లో తేలియాడకుండా తమ టాలెంట్ పెంచుకుంటేనే ఆంధ్ర యువతకు మంచిది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 8-12 వీక్లీకై**

## ఎమ్బీయస్ : ఏది సత్యం? ఏదసత్యం?

ఆర్మీ చీఫ్‌గా పనిచేసిన వి.కె.సింగ్ రిటైరయ్యే సమయానికి తన వయసు ఏడాది ఎక్కువగా పడిందని యాగీ చేసి కోర్టుకి వెళ్లడం, ఓడిపోవడం, కసితో అప్పటి యుపిఏ ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేసి, వారి పరువు తీయడం చూశాం. అలాటి వ్యక్తి తమ అమ్ములపొదిలో వుంటే బాగుంటుందనుకుని బిజెపి పార్టీలో చేర్చుకుని కాబినెట్‌లో విదేశాంగ శాఖలో సహాయమంత్రిగా చేసింది. ఇప్పుడాయన ఎన్‌డిఏ ప్రభుత్వంపై కూడా విరుచుకుపడుతున్నాడు. ''అవినీతిని అరికడతామన్న నినాదంపై అధికారంలోకి వచ్చి అవినీతి జరిగిందని బాహాటంగా కనబడుతున్న కేసులో కూడా అవినీతిపరులను సమర్థిస్తూ వుంటే వూరుకోవడం ఎలా?'' అంటూ. ''దీనిలో అవినీతి జరిగిందని మీకు కచ్చితంగా ఎలా తెలుసు?'' అంటే ''నేనే కదా కేసు మొత్తం డీల్ చేసినది...'' అంటున్నాడు.

పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్‌లో సుఖ్నా అనే చోట మిలటరీ కంటోన్మెంట్ ప్రాంతం వుంది. దాన్ని ఆనుకుని 71 ఎకరాల ప్రయివేటు భూమి వుంది. అక్కడ ఏదైనా కట్టాలంటే మిలటరీవారు 'నో అబ్జక్షన్ సర్టిఫికెట్' (నిరభ్యంతర పత్రం) రూపంలో అనుమతి యివ్వాలి – రక్షణ వ్యవహారం కాబట్టి! అక్కడ దిలీప్ అగర్వాల్ అనే బిల్డర్ భవంతులు కట్టి అమ్ముదామనుకున్నాడు. పత్రం యిచ్చేలా చేయమని మిలటరీ సెక్రటరీగా వున్న లెఫ్టినెంట్ జనరల్ అవధేశ్ ప్రకాశ్‌ను కోరాడు. ఆయన 2008 జూన్ ప్రాంతంలో అధికార పర్యటన అంటూ సుఖ్నాకు వచ్చి అగర్వాల్‌ను కంటోన్మెంట్ వ్యవహారాలకు యిన్‌చార్జిగా వున్న 33 కార్ప్స్ కమాండర్ పి.కె. రథ్‌కు పరిచయం చేసి, పత్రం యిచ్చేలా చేయమని కోరాడు. అప్పట్లో ఆర్మీ ఈస్టర్న్ కమాండ్‌కు జనరల్ ఆఫీసర్ కమాండింగ్ – ఇన్ – చీఫ్‌గా వున్న వి కె సింగ్‌కు సైతం తెలియపరచకుండా రథ్ 2009 మార్చిలో 'దిలీప్ అగర్వాల్ ఆ ప్రాంతంలోకాలేజీ కట్టడానికై అడుగుతున్నాడన్న' కారణం చెప్పి నిరభ్యంతర పత్రం యిచ్చేశాడు. ఈ విషయం ఏడాది చివరలో తనకు తెలియగానే వికె సింగ్ దీనిపై విచారణ ప్రారంభించి, అవధేశ్, రథ్‌లపై కోర్టు మార్షల్ జరపాలని ఆదేశించాడు. మిలటరీ కోర్టు విచారణ జరిపి పై అధికారులకు తెలుపకుండా పత్రం యివ్వడం రథ్ చేసిన తప్పేనని, మిలటరీ క్రమశిక్షణను ఉల్లంఘించినట్లేనని భావిస్తూనే 'మిలటరీని మోసగించాలన్న దురుద్దేశం వున్నట్లు ఆధారాలు కనబడలేద'ని అంది. రథ్‌ను పురిగొల్పిన అవధేశ్‌కు మాత్రం దురుద్దేశం వుందని అభిప్రాయపడి అతన్ని మిలటరీ సర్వీస్‌లోంచి తీసేసింది. రథ్‌కు శిక్షగా తీవ్రమైన మందలింపుతో బాటు, 18 నెలల సర్వీసు తగ్గించింది, పెన్షన్ లెక్క వేసేటప్పుడు 15 సం॥ల సర్వీసుని లెక్కలోకి తీసుకోకూడదంది.

ఈ తీర్పు 2011 జనవరి 1న వెలువడింది. అవధేశ్ వూరుకున్నాడు కానీ రథ్ దీన్ని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ట్రైబ్యునల్ దృష్టికి తీసుకెళ్లాడు. 'నేనే తప్పూ చేయలేదు. ఇదంతా వికె సింగ్ అవధేశ్‌పై వ్యక్తిగతమైన కక్షతో చేసిన వ్యవహారం. నన్ను యిరికించారు.' అని వాదించాడు. సింగ్ తన పుట్టిన తేదీ తప్పుగా పడిందని, తన తండ్రి పొరపాటున ఒక ఏడాది ఎక్కువ వేశాడని కెరియర్ చివర్లో వివాదం లేవనెత్తగా మిలటరీ సెక్రటరీగా వున్న అవధేశ్ అంగీకరించలేదు. మిలటరీ అధికారిగా కూడా పని చేసిన వికె సింగ్ తండ్రి పొరపాటు చేస్తారంటే నమ్మగలమా? వయసు కారణంగానే ఎన్నో ప్రమోషన్స్ పొందిన వికె సింగ్ రిటైరయ్యే సమయంలో తన పదవీకాలం మరో ఏడాది పొడిగించుకోవడానికి వేసిన ఎత్తు యిది అని అవధేశ్ భావించాడు. వికె సింగ్ కోర్టుకి వెళ్లినా, డిఫెన్సు మంత్రిని కోరినా లాభం లేకపోయింది. ''ఆ కసితో సింగ్ అవధేశ్‌పై యీ కేసు బనాయించి నన్ను బలిచేశాడు. నా వద్ద జూనియర్లుగా పనిచేస్తున్న అధికారులను ఒత్తిడి చేసి వారి చేత నాకు వ్యతిరేకంగా సాక్ష్యం యిప్పించాడు. అలా చెప్పినందుకు వారికి ప్రమోషన్లు యిచ్చాడు. రికార్డు సరిగ్గా లేని కల్నల్ ర్యాంకు ఆఫీసర్ని బ్రిగేడియర్‌గా చేసి సింగ్ స్వయంగా అతనికి మెడల్ గుచ్చాడు. మేజర్ జనరల్ ర్యాంకులో వున్న మరో వ్యక్తిని లెఫ్టినెంట్ జనరల్ ర్యాంకుకు ప్రమోట్ చేసి డిప్యూటీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా చేశాడు. అంతేకాదు, యీ విచారణ మొత్తం తన కనుసన్నల్లో జరిగేట్లు చూసుకున్నాడు. కోర్టు మార్షల్‌లో జడ్జి ఎడ్వకేట్‌గా ఎవరుండాలో తనే నిర్ణయించాడు. నాకు దురుద్దేశం లేదని జడ్జి అభిప్రాయపడ్డాక తీర్పును పునస్సమీక్షించవలసినదిగా ఆయన్ను కోరాడు. మిలటరీ కోర్టు విచారణ విషయంలో ఫిర్యాదిగా, విచారణాధికారిగా, ప్రాసిక్యూషన్ న్యాయవాదిగా, జడ్జిగా, తీర్పు ఆమోదించి అమలు చేసే అధికారిగా – యిన్ని పాత్రలు తనే పోషించాడు. ఇది సహజన్యాయానికి విరుద్ధం.'' అంటూ రథ్ వాదించాడు.

ట్రైబ్యునల్ యీ ఆరోపణలపై విచారించిన జస్టిస్ సునీల్ హాలీ, ఎయిర్ మార్షల్ జె.ఎన్.వర్మ రథ్ వాదన సరైనదన్న అభిప్రాయానికి

వచ్చారు. రథ్‌పై వున్న అన్ని ఆరోపణలు కొట్టిపారేశారు. అతను నియమాలు ఉల్లంఘించాడనడానికి ఏ ఆధారాలూ లేవన్నారు. వికె సింగ్ అతనిపై కక్ష కట్టినట్లు స్పష్టంగా కనబడుతోందన్న అభిప్రాయంతో రథ్‌కు రావలసిన అన్ని సౌకర్యాలు 12% వడ్డీతో సహా తిరిగి యివ్వాలన్నారు. ''అతని పట్ల జరిగిన అన్యాయానికి పరిహారం ఎంతో కొంత యివ్వాల్సిందే. అందువలన ఆర్మీ అతనికి యీ తీర్పు వెలువడిన మూడు నెలల లోపున లక్ష రూపాయలు యివ్వాలి.'' అన్నారు. ఈ తీర్పు 2014 సెప్టెంబరు 5 న వెలువడింది. ఇప్పుడు కాబినెట్‌లో మంత్రిగా వున్న సింగ్‌కు యిది చాలా యిబ్బందికరమైన పరిస్థితి. ఈ కేసును ఆర్మీ యింతటితో వదిలేయకూడదని, దీనిపై అప్పీలుకి వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. అయితే ప్రభుత్వం అతని మాట పట్టించుకోకపోగా ఆ తీర్పును యథాతథంగా అమలు చేయాలంటూ సెప్టెంబరు 30న ఒక ఆదేశం జారీ చేసింది. సింగ్ మండిపడుతున్నాడు. ''ఫ్రంట్‌లైన్'' పత్రికతో మాట్లాడుతూ ''ఇది సిల్లీ ఆర్డర్. ఇలాటి ఓపెన్ అండ్ షట్ కేసులో అవినీతిని సహించడం ద్వారా ప్రభుత్వం ఎలాటి సంకేతం యివ్వబోతోంది? ట్రైబ్యునల్ వికలాంగులైన సైనికులకు, చనిపోయిన సైనికుల భార్యలకు అదనంగా పరిహారం యివ్వమని తీర్పు యిచ్చిన కేసుల్లో అప్పీలుకి వెళ్లే ప్రభుత్వం యీ కేసులో యిలా చేయడమేమిటి?'' అంటూ నిప్పులు చెరిగాడు.

మామూలు పాఠకులం యిప్పుడు మనం ఎవర్ని నమ్మాలి? సుఖ్నా ల్యాండ్ స్కామ్ 2009-10లో వార్తాపత్రికలకు ఎక్కింది. యుపిఏ అవినీతిని ప్రోత్సహిస్తోందంటూ దాన్ని బయటపెట్టిన వికె సింగ్‌ను ఆనాడు అందరూ ప్రశంసించారు. యుపిఏను ముప్పుతిప్పలు పెట్టినందుకు బహుమతిగా బిజెపి అతన్ని పార్టీలోకి చేర్చుకుని, మంత్రిపదవితో సత్కరించింది. ఈనాడు అతని మాటలు పనికిరాకుండా పోయాయి. వికె సింగ్ వ్యక్తిగతమైన కక్షతోనే స్కాము బయటపెట్టాడనుకున్నా అసలు అవినీతి జరిగిందా లేదా? జరిగితే దానికి పాల్పడిన రథ్‌ను శిక్షించాలా? లేదా? సింగ్ చెప్పేది నిజమా? రథ్ చెప్పేది నిజమా? ఏది సత్యం? ఏదసత్యం?

- తెలుసుకోవాలని నేను నెట్‌లో పాత ఎంట్రీలకోసం వెతికాను. సుఖ్నా ల్యాండ్ స్కామ్‌లో మిలటరీ అధికారులు తప్పు చేశారని వికె సింగ్ తర్వాత పదవిలోకి వచ్చిన దీపక్ కపూర్ కూడా అన్నారు. అప్పటి రక్షణ మంత్రి, మిస్టర్ క్లీన్‌గా పేరుబడిన ఎకె ఆంటోనీ కూడా నిందితులపై చర్య తీసుకోవాలనే పట్టుదల ప్రదర్శించారు. మరి ఇప్పుడు రథ్ చేస్తున్న ఆరోపణల మాటేమిటి? 2010 ఫిబ్రవరి 1న యీ స్కాము గురించి లెఫ్టినెంట్ జనరల్ హర్వంత్ సింగ్ అనే ఆయన రాసిన వ్యాసం కనబడింది. ఆయన రాసినదాని సారాంశం యిది - ''...మిలటరీ యిన్‌స్టాలేషన్స్ వున్నచోటికి వెయ్యి మీటర్ల దూరంలో ఏ కట్టడాలు కట్టకూడదని చట్టం వుంది. కానీ చాలా చోట్ల అది పాటించడం లేదు. లూధియానా వద్ద వున్న బాడోవాల్‌లో ఆర్మీ ఎమ్యూనిషన్ డిపో వున్నచోట కళ్యాణమండపాలు కట్టారు. ఆర్మీ అధికారులు అభ్యంతరం తెలిపినా పట్టించుకున్నవాడు లేడు. కసౌలీలోని ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ పక్కన అనేక విల్లాలు పుట్టుకుని వచ్చాయి. ఎయిర్‌ఫోర్సు హిమాచల్ ప్రదేశ్ హైకోర్టుకి వెళ్లినా యిప్పటిదాకా ఏమీ ఫలితం కనబడలేదు. లాల్రూ ఎమ్యూనిషన్ డిపో పక్కన టోల్ గేటు వచ్చింది. ఆర్మీ అభ్యంతరం పెట్టినా లాభం లేకపోయింది. ఇలా ఎన్నో జరుగుతున్నాయి.

''సుఖ్నాలో బిల్డర్ ''కాలేజీ కడతాను, నిరభ్యంతరపత్రం యివ్వండి'' అంటూ వచ్చాడు. అలాటి పత్రాలు ఆర్మీ ఎన్నడూ యివ్వదు. ఆ పద్ధతే లేదు. అందుకే నిరాకరించారు. కొన్నాళ్లు పోయాక కాలేజీ బ్రోషరు ముద్రించి దానిపై మిలటరీ సెక్రటరీ అవధేశ్ ప్రకాశ్ ఫోటో వేసి కింద రాబోయే కాలేజీకి కాబోయే డైరక్టర్ అని వేసి, మళ్లీ పత్రం కోసం వచ్చాడు. అవధేశ్ కీలకమైన పదవిలో వున్నాడు కాబట్టి కింది అధికారులపై ఒత్తిడి తెచ్చాడు. ఈ అవధేశ్ రాణీఖేత్‌లో కూడా యిలాటి పనే చేశాడు. అంతేకాదు, రెజిమెంటుకు సంబంధించిన నిధుల దుర్వినియోగంలో కూడా యిరుక్కున్నాడు. ఇప్పుడు సుఖ్నా భూమి వ్యవహారం ఈస్టర్న్ కమాండ్ విచారిస్తోంది. రాణిఖేత్ వ్యవహారం సెంట్రల్ కమాండ్ విచారిస్తోంది...''

ఇదంతా చదివితే వికె సింగ్ విచారణ జరిపించడం న్యాయమనీ, అవధేశ్, రథ్‌లు దోషులని తేటతెల్లమౌతోంది. వికె సింగ్‌కు మనసులో కసి, కక్ష వున్నాయో లేదో స్కానింగ్‌లో కూడా తెలియవు. కానీ అతను చేసిన పని మాత్రం కరక్టే. ఇప్పుడీ ట్రైబ్యునల్ వికె సింగ్ చేసినది తప్పని తీర్పు యిస్తే ప్రభుత్వం దానిపై అప్పీలు చేసి వుండాల్సింది. ఎందుకు చేయలేదో వారికే తెలియాలి.
**- ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : అవినీతి డాక్టరుకు గుజరాత్ మద్దతు

డా॥ కేతన్ దేశాయి అనే ఒక డాక్టరుగారు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు (ఎంసిఐ) ప్రెసిడెంటుగా వుండి అవినీతికి పాల్పడితే 2010 ప్రాంతాల్లో అది బయటపడి అరెస్టు చేశారు, జైలుకి పంపారు. ఆర్నెల్లు శిక్ష అనుభవించి బెయిలు మీద బయటకు వచ్చాడు. కేసు విచారణ యింకా జరగాలి. ఈలోగా ఏకంగా వరల్డ్ మెడికల్ ఎసోసియేషన్ (డబ్ల్యుఎమ్ఏ)కు ప్రెసిడెంటు అయిపోయాడు, దొంగ సర్టిఫికెట్లతో! అదీ ఆయనగారి సత్తా!

ఈ దేశాయి గుజరాత్‌కు చెందిన డాక్టరు. ఎవర్ని ఎలా పట్టాలో తెలిసిన వ్యక్తి. మెడికల్ కౌన్సిల్ ప్రెసిడెంటు అయిపోయాడు. మెడికల్ కాలేజీలకు అనుమతులు జారీ చేయడంలో, సర్టిఫికెట్లు యివ్వడంలో లంచాలు పట్టేవాడు. పంజాబ్‌లో పటియాలాలో గ్యాన్ సాగర్ మెడికల్ కాలేజీ గుర్తింపు విషయంలో రూ. 2 కోట్లు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అతనితో బాటు యింకో యిద్దరు డాక్టర్లు సుఖ్‌వీందర్ సింగ్, కవల్‌జిత్ సింగ్, మధ్యవర్తి జె పి సింగ్‌లపై సిబిఐ 2010 ఏప్రిల్‌లో కేసు పెట్టింది. దేశాయి యింటిని

సోదా చేసిన సిబిఐకు 1.5 కిలోల బంగారం, 80 కిలోల వెండి దొరికాయి. బ్యాంకు లాకర్లో రూ. 35 లక్షల విలువైన నగలున్నాయి. ఇంకా తెరవవలసిన లాకర్లు 35 వున్నాయని సిబిఐ అప్పుడు చెప్పింది. దేశవ్యాప్తంగా 400 ఆస్తులున్నాయట. రాష్ట్రపతి 2010 మేలో ఆ మెడికల్ కౌన్సిల్‌నే రద్దు చేశారు. ఆ తర్వాత మళ్లీ కౌన్సిల్ ఏర్పడినపుడు అది దేశాయి మెడికల్ ప్రాక్టీషనర్ లైసెన్సును రద్దు చేసింది.

ఇంత జరిగినా ఆ ఘటికుడు బెదరలేదు. గుజరాత్ ముఖ్యమంత్రి మోదీని ఆశ్రయించాడు. గుజరాత్ మెడికల్ కౌన్సిల్ నీ మెడికల్ ప్రాక్టీషనర్ లైసెన్సును రద్దు చేయనులే అంది. అహ్మదాబాద్‌లోని బిజె మెడికల్ కాలేజీలో యూరాలజీ డిపార్టుమెంటుకి హెడ్‌ని చేసింది, గుజరాత్ యూనివర్శిటీ సెనేట్ మెంబర్‌గా 2010లో మళ్లీ ఎంపిక చేసింది. రాష్ట్రప్రభుత్వాలు తమ రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల ప్రతినిధిగా ఒకరిని మెడికల్ కౌన్సిల్‌కు పంపుతాయి. తమ రాష్ట్రప్రతినిధిగా దేశాయిని మించిన యోగ్యుడు దొరకలేదు మోదీకి. గుజరాత్ ప్రతినిధిగా మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా 2012లో మళ్లీ వచ్చి చేరాడు. "మీకు మెడికల్ ప్రాక్టీషనర్‌గా లైసెన్సే లేదు, మీరు కౌన్సిల్ సభ్యుడు ఎలా అవుతారు?" అని పాత్రికేయులు అడిగితే, "నేను రిజిస్టర్ చేసుకున్నది గుజరాత్ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌తో. వాళ్లు రద్దు చేయలేదు. నేను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో రిజిస్టర్ చేసుకోనప్పుడు రద్దు చేసే అధికారం వాళ్లకెలా వుంటుంది?" అని వాదించాడు. గుజరాత్ మెడికల్ కౌన్సిల్ కూడా అతని తరఫునే వాదించింది. సిబిఐ కేసు పెండింగులో వుండగానే యిలా కౌన్సిల్ సభ్యుడై పోవడంతో అతను ఆగలేదు. కౌన్సిల్ బోర్డులోనూ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లోనూ తనకు అనుకూలంగా వుండే సభ్యులు ఎన్నికయ్యేట్లు చూసుకున్నాడు.

ఇంతలో అతని కన్ను వరల్డ్ మెడికల్ అసోసియేషన్‌పై పడింది. డాక్టర్లలో నైతిక విలువలు కాపాడే ఉద్దేశంతో 102 దేశాల డాక్టర్లతో ఏర్పడిన స్వతంత్ర సంస్థ అది. దానికి యితని అధ్యక్షుడిగా యితని పేరు సిఫార్సు చేయించుకున్నాడు. దానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికల్ కౌన్సిల్ సభ్యుల మద్దతు కూడగట్టుకున్నాడు. తనపై కేసులున్నాయన్న విషయం ప్రపంచసంస్థ వారు విని వుంటారని తెలుసు కాబట్టి మెడికల్ కౌన్సిల్ వారి ఎథిక్స్ కమిటీలోని ముగ్గురు సభ్యులు – డా।। అజయ్ కుమార్, డా।। వినయ్ అగర్వాల్, డా।। సుదీప్త రాయ్‌ల చేత – అతనిపై కేసులేవీ పెండింగులో లేవు అని దొంగ సర్టిఫికెట్టుపై సంతకం పెట్టించి పంపించాడు. దానితో ఆ ప్రపంచ సంస్థ వారు 2016 నుంచి యితనే ప్రెసిడెంటు అని ప్రకటించారు. దొంగ సర్టిఫికెట్టు విషయం గ్రహించిన మెడికల్ కౌన్సిల్ చీఫ్ విజిలెన్సు ఆఫీసరు ఎచ్.కె. జేఠీ సంతకాలు పెట్టిన ముగ్గురిపై చర్య తీసుకోమని హెల్త్ మినిస్ట్రీకి రాశాడు. అయితే హెల్త్ మినిస్ట్రీ ఏ చర్యా తీసుకోలేదు. దేశాయిని మోదీ చాలాకాలంగా వెనకేసుకుని వస్తున్నారని వాళ్లకూ తెలుసు. దేశాయిని వ్యతిరేకించినందుకే మోదీ హర్షవర్ధన్‌ను ఆరోగ్యశాఖనుండి తప్పించివేశాడని వారికి తెలుసు. జేఠీ లేఖకు ఫలితం లేకపోలేదు. మెడికల్ కౌన్సిల్‌కు ప్రస్తుతం అధ్యక్షురాలిగా వున్న డా।। జయశ్రీబెన్ మెహతా (ఆవిడా గుజరాత్ నుండే వచ్చారు, దేశాయికి అనుచరురాలు) జేఠీనే కౌన్సిల్ నుండి బదిలీ చేసేసింది.

పంజాబ్ కాలేజీ కేసులో దేశాయిని పట్టిచ్చిన డా।। కుణాల్ సాహా దృష్టికి యిది వచ్చింది. అతను అమెరికాలో వుండేవాడు. అతని భార్య కలకత్తాలోని ఒక ఆసుపత్రిలో సౌకర్యాల లేమి వలన చనిపోయింది. దానిపై కేసు వేసి 15 ఏళ్లు పోట్లాడి రూ. 5.60 కోట్ల నష్టపరిహారం పొందాడు. సౌకర్యాలు లేని యీ ఆసుపత్రికి అనుమతి యిస్తున్న ఆ మాయదారి కౌన్సిల్ ఏది అని వెతకడంతో దేశాయి వంటి వ్యక్తుల గురించి తెలిసింది. ఫిర్యాదు చేసి కౌన్సిల్ అవినీతిని బట్టబయలు చేశాడు. వరల్డ్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డా।। జేవియర్ దృష్టికి యిదంతా తెచ్చాడు. సుప్రీం కోర్టులో పిల్ పడేశాడు. మెడికల్ కౌన్సిల్, మెడికల్ అసోసియేషన్ ఎన్నికలలో రిగ్గింగ్ చేసి దేశాయి తన అనుచరులను గెలిపించుకున్నాడని, అందుకే వారు యిలా వ్యవహరిస్తున్నారనీ కూడా ఆరోపించాడు. సుప్రీం కోర్టు హెల్త్ మినిస్ట్రీకి, మెడికల్ కౌన్సిల్‌కు నోటీసులు యిచ్చి సిబిఐ చేత విచారణ జరిపించమంది. ఆరోగ్యశాఖా మంత్రి కూడా యీ విషయంపై సంజాయిషీ చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. లేటెస్టు న్యూస్ ఏమిటంటే అమిత్ షా కుమారుడి పెళ్లికి హాజరైన ప్రముఖుల్లో కేతన్ దేశాయి కూడా వున్నారు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : సౌదీ అరేబియాలో రాజు మారారు

సౌదీ అరేబియా పాలకుడు అబ్దుల్లా బిన్ అబ్దులజీజ్ జనవరి 23 న చనిపోయారు. అరబ్ ప్రాంతంలో అమెరికాకు చిరకాలమిత్రుడైన అబ్దుల్లా అంత్యక్రియలకు హాజరు కావడానికై ఒబామా తన భారతదేశ పర్యటనను కుదించుకోవలసి వచ్చింది. సౌదీ ఆచారం ప్రకారం అంత్యక్రియలు అతి నిరాడంబరంగా జరిగాయి. శవాన్ని ఒక గుడ్డలో చుట్టి కుటుంబసభ్యులు మోయగా, శవపేటిక కూడా లేకుండా గుర్తు పట్టలేని ఒక చోట కప్పిపెట్టారు. అక్కడ సమాధి కట్టడం లాటివి ఏవీ చేయరు. లెక్కప్రకారం చూస్తే 2005 నుంచే అబ్దుల్లా రాజుగా వ్యవహరించారు. కానీ అంతకు పదేళ్ల ముందు నుంచే అతను తెర వెనుక నుండి అధికారం చలాయిస్తున్నాడు. అప్పటి రాజు ఫహద్ యితని సవతి సోదరుడే. ఇతను అప్పుడు యువరాజు. సౌదీ అరేబియా రాజ్యాన్ని స్థాపించిన ఇబ్న్ సౌద్ 1953లో చనిపోయాక, అతని కుమారులే ఒకరి తర్వాత మరొకరు రాజులవుతూ వస్తున్నారు. అబ్దుల్లా స్థానంలో యిప్పటిదాకా యువరాజుగా వున్న ఆయన సోదరుడు సల్మాన్ బిన్ అబ్దులజీజ్ సౌద్ కొత్తరాజు అయ్యారు. వయసు 70. వీళ్లందరూ సోదరులేనా

అని ఆశ్చర్యపడవద్దు. వాళ్లు మొత్తం 53 మంది బ్రదర్స్! (ఇంతమంది పిల్లలకు పేర్లు వెతకడం కూడా కష్టమే కదా) ఈ సోదరులందరూ కలిసి వారసులెవరో నిర్ణయిస్తారన్నమాట. అందరి కంటె చిన్నవాడు 68 ఏళ్ల ముక్రీన్‌ను యువరాజు చేస్తూ కొత్తగా యువరాజుకి డిప్యూటీ (బాలరాజు అనాలేమో)ను కూడా నియమించాలని నిశ్చయించారు. అతను హోం మంత్రిగా పని చేస్తూ అల్ ఖైదాతో పోరాటం సాగిస్తున్న మహమ్మద్ బిన్ నయ్యాఫ్. ఇతను సౌద్‌కు కొడుకు కాదు, మనుమడు. ఈ మార్పుల వలన సౌదీ విధానాలు ఏమైనా మారతాయా అనేది ఆసక్తికరమైన అంశం.

అబ్దుల్లాకు లిబియా అధినేత కల్నల్ గడ్డాఫీ అంటే అస్సలు పడేది కాదు. ఒకసారి అరబ్ లీగ్ సమావేశంలో అబ్దుల్లా గడ్డాఫీపై అరబిక్ భాషలో బూతులు కురిపించాడట. అమెరికా సాయంతో గడ్డాఫీని ఎలా అంతం చేశాడో చూశాం. ప్రస్తుతం సిరియా పాలకులపై కక్ష కట్టాడు. అంతకుముందు ఐయస్ (ఇస్లామిక్ స్టేట్)ను అణచాలని అమెరికా మిలటరీ కూటమి ఏర్పరచి సౌదీని భాగస్వామిగా చేసింది. అలాటి కూటమే మరొకటి ఏర్పరచి సిరియా పని పట్టాలని అబ్దుల్లా కోరుతూ వచ్చాడు. 2013లో సిరియాపై దాడి చేయడానికి అమెరికా, సౌదీ, ఫ్రెంచ్ విమానాలు రెడీగా వున్న తరుణంలో ఆఖరి నిమిషంలో దాడి వద్దని అన్నందుకు ఒబామాను అబ్దుల్లా క్షమించలేదు. కొన్నాళ్లు పోయాక సిరియా ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి, వారి సహకారంతో సిరియాలో వున్న ఐయస్ స్థావరాలపై దాడిచేశారు. కానీ అది అబ్దుల్లాను సంతృప్తి పరచలేదు.

అబ్దుల్లాకు ఈజిప్టు అధ్యక్షుడుగా వున్న హెూస్నీ ముబారక్ అంటే అభిమానం వుంది. ఈజిప్టులో విప్లవం చెలరేగి, అతన్ని కిందకు దింపేస్తూ వుంటే వేడుక చూస్తూ కూర్చుందని అమెరికాపై కినుక. హెూస్నీ పతనం తర్వాత ముస్లిం బ్రదర్‌హుడ్‌కు బలం పెరిగి, ఆ ప్రాంతంలో బలం పుంజుకోవడం, అరబ్‌లో కల్లా పెద్ద దేశమైన ఈజిప్టులో ప్రజాస్వామ్యం కోసం డిమాండ్ రావడం – యివన్నీ చూశాక అబ్దుల్లాకు గుబులు ప్రారంభమై కినుక కోపంగా మారింది. అరబ్ ప్రాంతంలో ప్రజాస్వామ్యం ఛాయలు పడకూడదన్న ఆదుర్దాతో ఈజిప్టులోని మిలటరీ ప్రభుత్వానికి ఆర్థికసాయం, నైతిక సాయం చేశాడు. అంతేకాదు, గల్ఫ్‌లోని యితర అరబ్ దేశాల నేతలను కూడా ఒప్పించి ఈజిప్టు ప్రజాస్వామ్యంవైపు వెళ్లకుండా మిలటరీకి మద్దతిచ్చేట్లా చేశాడు. అరబ్ ప్రజలెప్పుడూ రాజులకు సలాంలు చేస్తూనే వుండాలని అబ్దుల్లా కోరిక. వీళ్లు సున్నీలు. వీళ్ల రాజ్యంలో 15% వున్న షియాలు తమ పట్ల వివక్షత చూపుతున్నారని భావిస్తూ వుంటారు. బహరైన్‌లో రాజు కూడా సున్నీ, కానీ ప్రజల్లో షియాలకు సంఖ్యాబలం వుంది. వాళ్లు ఎన్నికలు కావాలంటూ, ప్రభుత్వంలో ప్రజలకు ప్రాతినిథ్యం వుండాలంటూ 2012, 2013లలో ఉద్యమాలు చేపడితే బహరైన్ రాజు అబ్దుల్లా సాయం అర్థించాడు. అబ్దుల్లా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కలిసి 'శాంతిసేన'ను పంపించి, ఉద్యమాన్ని అణచివేశారు. ఇప్పటికీ ఆ సేన అక్కడే వుంది.

అబ్దుల్లాకు నచ్చని మరో దేశం షియాలు ఎక్కువగా వున్న ఇరాన్! బహరైన్, ఇరాన్. యెమెన్, లెబనాన్ – ఎక్కడ గొడవ జరిగినా ఇరానే వెనక నుంచి చేయిస్తోందని అతని అనుమానం. సిరియాలో ప్రభుత్వాన్ని మార్చేసి తన చెప్పుచేతల్లో వుండేవారిని నెలకొల్పాలనే అబ్దుల్లా కోరిక ఇరాన్, రష్యాలు సిరియాకు మద్దతు యివ్వడం చేత నెరవేరటం లేదు పాపం. తమ మధ్య సత్సంబంధాలు నెలకొల్పాలని ఇరాన్ ప్రయత్నాలు చేయకపోలేదు. కానీ అబ్దుల్లా స్పందించలేదు. ఇరాన్–అమెరికాల మధ్య అణు ఒప్పందానికి ఇజ్రాయేలు ఎంత వ్యతిరేకో, అబ్దుల్లా కూడా అంతే వ్యతిరేకి. సౌదీ రాజకుటుంబానికి రాజగురువులైన వహాబీ మతపెద్దల ప్రకారం షియాలు ఇస్లాం మతచ్యుతులు. హసన్ వహాబ్ అనే మతగురువు 19 వ శతాబ్దపు చివరిలో వుండేవాడు. ఆయన కూతుళ్లలో ఒకరిని ఇబ్న్ సౌద్ పెళ్లాడి, ఆ మతపీఠంతో చేతులు కలిపాడు. సౌదీ రాజుల మద్దతుతో యీ గురువులు అరబ్ ప్రాంతమంతా పర్యటిస్తూ, తమ ప్రబోధాలతో ఇరాన్, ఇరాక్, సిరియా వంటి ప్రాంతాల్లో సున్నీ–షియా విభేదాలను రెచ్చగొడుతున్నారు. సిరియాను అల్లకల్లోలం చేయడానికి చూస్తున్న ఐయస్ సౌదీ తరహా పుస్తకాలను తమ అధీనంలో వున్న స్కూళ్లలో చదివిస్తోంది. ఇరాన్ బలపడితే సౌదీలో వున్న షియాలకు ధైర్యం వస్తుందని సౌదీ రాజుల భయం.

ఆర్థికపరమైన అంశాలకు వస్తే – సౌదీ వైభవానికి కారణం ప్రపంచంలో కల్లా క్రూడ్ ఆయిల్ ఎక్కువగా ఉత్పత్తి చేసే దేశమది. తన ఉత్పత్తిని పెంచో, తగ్గించో ప్రపంచంలో ఆయిల్ ధరలను నియంత్రించ శక్తి గలది. గత ఏడాదిగా ఆయిల్ ధరలు తగ్గుతున్నాయి. లెక్క ప్రకారం చూస్తే సౌదీ ఆయిల్ ఉత్పత్తి తగ్గించి డిమాండ్, ధర పడిపోకుండా, తాము నష్టపోకుండా చూసుకోవాలి. కానీ సౌదీ ఉత్పత్తి తగ్గించటమే లేదు, ఆయిల్ ధర యింకాయింకా పడిపోతున్నా సరే! దీని వెనక రాజకీయ కారణాలున్నాయి. సిరియాను వశపరచుకోవాలంటే దానికి మద్దతిస్తున్న ఇరాన్, రష్యాలను ఎలాగోలా దెబ్బ కొట్టాలి. ముందుగా రష్యాపై సామోపాయం ప్రయోగించి చూశాడు. 2014లో 'మీ వద్ద బిలియన్ల డాలర్ల ఆయుధాలు కొంటాం, సిరియాకు మద్దతు యివ్వడం మానేయండి' అన్నాడు. దానికీ, దీనికీ లింకు పెట్టవద్దు, దేనికదే అన్నారు రష్యావారు. రష్యా ఆర్థికవ్యవస్థను దెబ్బ కొట్టాలంటే ఆయిల్ ధర పెరక్కుండా చూడాలి అనుకున్నాడు. అదే రీతిలో ఆయిల్ ఉత్పత్తి చేసే మరో దేశమైన ఇరాన్‌ను కూడా దెబ్బ కొట్టాలంటే యిదే మంత్రం అనుకున్నాడు. పాత స్థాయిలోనే ఆయిల్ ఉత్పత్తి చేస్తూనే వున్నాడు. గత ఏడాది 100 డాలర్లు వున్న బారెల్, యిప్పుడు 50 డాలర్లకు పడిపోయింది. ఇరాన్, రష్యా విలవిల్లాడుతున్నాయి. అమెరికా ఆయిల్ ఇండస్ట్రీకి కూడా దీని వలన దెబ్బ తగిలింది. అయినా దానికి సంతోషమేమిటంటే ఆయిల్ ఎగుమతులపై ఆధారపడిన వెనిజులా వామపక్ష ప్రభుత్వం కూడా ఆర్థిక సంక్షోభంలో యిరుక్కుంది. ఆయిల్ ధరల తగ్గుదల వలన సౌదీ కూడా ప్రభావితమైంది. 2015 బజెట్‌లో 38.6 బిలియన్ డాలర్ల లోటు కనబడుతోంది. కానీ దానికి 750 బిలియన్

డాలర్ల రిజర్వ్స్ వున్నాయి కాబట్టి ధీమాగా వుంది. కొత్త రాజు యీ పాలసీని మార్చేస్తాడని అనుకోలేం కానీ, రాచకుటుంబంలోని పిన్నవయస్కులు ఎందుకొచ్చిన గోల యిది అనుకుంటున్నారట.

2010లో అమెరికా ఆర్థికపరిస్థితి అతలాకుతలమైనపుడు అమెరికాతో ముడివేసుకున్న సౌదీ అరేబియాలో కూడా నిరుద్యోగం ప్రబలింది. అబ్దుల్లా 384 బిలియన్ డాలర్లతో పంచవర్ష అభివృద్ధి ప్రణాళిక ప్రవేశపెట్టాడు. అయినా జనాభాలో సగం మంది 25 ఏళ్ల వయసు కంటె తక్కువ వాళ్లే కాబట్టి యిప్పటికీ నిరుద్యోగ సమస్య తీరలేదు. నిరుద్యోగ భృతి కింద డబ్బు ఖర్చు పెట్టవలసి వస్తోంది. రాజకీయ పరమైన సంస్కరణల విషయంలో అబ్దుల్లా కొద్దిపాటి మార్పులు చేశాడు. మహిళలు వాహనాలు నడపకూడదు కానీ మునిసిపల్ ఎన్నికలలో ఓటు వేయవచ్చు. ఆ బూతులపై నిఘా వుంటుందనుకోండి. ఒక హద్దు వరకు మీడియా ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు. అలా అంటూనే హక్కుల ఉద్యమకారులను, రాజకీయ ఉద్యమకారులను జైళ్లలో పెట్టారు. ప్రభుత్వం పాటిస్తున్న మతఛాందసత్వాన్ని ప్రశ్నిస్తూ ఒక వెబ్‌సైట్ పెట్టినందుకు రయీఫ్ బద్వాయీ అనే సౌదీ పౌరుడికి వెయ్యి కొరడా దెబ్బల శిక్ష విధించారు. మహిళలకు మరిన్ని హక్కులు కావాలని కోరిన ఒక షియా మతస్తుడికి గత అక్టోబరులో స్పెషల్ కోర్టు 'రాజధిక్కారం' నేరంపై మరణశిక్ష విధించింది. అంతర్జాతీయంగా నిరసన వెలువడడంతో మరణశిక్షను తాత్కాలికంగా నిలిపి వుంచారు. సౌదీ అరేబియాలో రాజు మారవచ్చు కానీ రాజరికపు పోకడలు ఎక్కడకు పోతాయి? ప్రపంచ ప్రజాస్వామ్య పరిరక్షకులం, జీతం లేకుండా పోలీసు ఉద్యోగం చేస్తున్నాం అని చెప్పుకునే అమెరికా యిలాటివారికి వత్తాసు యిస్తూ వుంటుంది. దాని అండతో వీళ్లు ప్రజల హక్కులను కాలరాస్తూనే వుంటారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : ఆప్ భవిష్యత్తు

ఆప్ సాధించిన విజయానికి అందరూ హర్షం తెలుపుతూనే 'ఇల్లు అలకంగానే పండగ కాదు' అని గుర్తు చేస్తున్నారు. అరవింద్ అతని అనుచరులు గతంలో ఉన్మాదుల్లా ప్రవర్తించాడు. తాము న్యాయంగా వున్నాం కాబట్టి, తమ ఉద్దేశాలు మంచివి కాబట్టి ఏ రాజ్యాంగానికీ, ఏ నియమానికీ కట్టుబడనక్కర లేదన్న రీతిలో ప్రవర్తించి అభాసుపాలయ్యారు. కాంగ్రెసు, బిజెపి యిద్దరూ దొంగలే అనే చూపించే ఆతృతతో అరవింద్ తన సింహాసనానికి తానే నిప్పు పెట్టుకున్నాడు. దానివలన చాలా సింపతీ వచ్చిందని భ్రమపడి పార్లమెంటు ఎన్నికల నాటికి మరిన్ని గంతులు వేసింది ఆప్. ఢిల్లీ లాటి చిన్న రాష్ట్రంలోనే కుదురుకోలేక పోయినవాళ్లు దేశమంతా పోటీ చేయడమేమిటి? పైగా అరవింద్ ఢిల్లీవాసి, అక్కడి సమస్యలు తెలిసినవాడు. షీలా దీక్షిత్‌పై కామన్వెల్త్ క్రీడల అవినీతి ముసురుకుంది కాబట్టి ఆమెపై గెలవగలిగాడు. దేశమంతా మోదీనామ జపం చేస్తూంటే వారణాశి వెళ్లి అతనితో తలపడడమేమిటి? ఘోరపరాజయం తర్వాత ఆప్‌కు తిక్క కుదిరింది. అందుకే యీసారి ఢిల్లీ వాసులు మళ్లీ ఓ ఛాన్సు యిచ్చారు. దీన్ని జాగ్రత్తగా యితర ప్రాంతాలకు నిలుపుకుని విస్తరిస్తారో, తాగలేక మళ్లీ ఒలకబోసుకుంటారో చూడాలి. గతంలో తమంతట తామే యింపాజిబుల్ టార్గెట్స్, వీక్లీ టార్గెట్స్ పెట్టుకుని భంగపడ్డారు. ఇప్పుడు యోగేంద్ర యాదవ్ 'ప్రజలకు కావలసినది ఇమ్మీడియేట్ డెలివరీ కాదు, ష్యూర్ డెలివరీ అని గ్రహించాం' అంటున్నాడు. నిజానికి సాధారణ ప్రజలు చాలా ఓర్పు కలవారు. ప్రాక్టికల్‌గా, కామన్‌సెన్స్‌తో ఆలోచిస్తారు. చెప్పినదానిలో కొంత చేసినా సంతోషిస్తారు. కొత్త వాగ్దానాలు వద్దులే, చెప్పినవి కాస్త చేసి చూపించు అంటారు.

ఆప్ ఎన్నికలలో చేసిన వాగ్దానాలు అన్నీ యిన్నీ కావు. వాటికి నిధులు కావాలి. బాబు వంటి మిత్రులకే చేయి విదల్చని మోదీ తనకు పుట్టెడు అవమానాన్ని తెచ్చిపెట్టి రోజూ కళ్లెదుటే కనబడి గుర్తు చేస్తూండే అరవింద్‌కు యిస్తాడా? ఇక అరవింద్‌కు గతేముంది? కేంద్రాన్ని తిడుతూ కూర్చోవడం తప్ప! రోడ్ల మీద నిరసనలు చేస్తే జనాలు చీపుళ్లతో తుడిచేస్తారు. రాజకీయ చాకచక్యం ప్రదర్శించి పనులు జరుపుకోవాలి. ఏ మాత్రం లౌక్యం ప్రదర్శించినా 'ఇతనివీ సాంప్రదాయక రాజకీయాలే' అంటూ మీడియా, ప్రతిపక్ష పార్టీలు యాగీ చేస్తాయి. మోదీని ఎదిరించడానికి యితర ప్రతిపక్షాలన్నీ కలిసి వచ్చాయి కానీ, తమ రాష్ట్రానికి వచ్చి తమ అవినీతి గురించి ప్రశ్నించడం ఆరంభిస్తే వారు సహిస్తారా? ఆప్ గమనం ఎలా వుంటుందో గమనించాల్సిన విషయమే.

ఆప్ వేయబోయే మలి అడుగు పంజాబ్‌లో. దేశమంతా మోదీ వేవ్ వీస్తున్న సమయంలోనే ఆప్ పంజాబ్‌లో మూడు పార్లమెంటు సీట్లు గెలుచుకుంది అక్కడ. పంజాబ్‌ను పాలిస్తున్న అకాలీదళ్ పార్టీ అవినీతి పూర్తిగా బట్టబయలైంది. దానితో అంటకాగిన బిజెపికి కూడా ఆ మసి అంటింది. కాంగ్రెసు అవినీతి గురించి ముందే తెలుసు. అందువలన ఆప్‌కు అక్కడ ఛాన్సుంది. ఆప్ బలమంతా నగరప్రాంతంలో కనబడుతూ వచ్చింది. సోషల్ మీడియాను అది పూర్తిగా వుపయోగించుకుని, యువతను ప్రేరేపించింది. పంజాబ్‌లో రైతులను, గ్రామీణ ప్రాంతాలనూ ఆకట్టుకోగలిగిన విధానాలు ఏర్పరచుకుంటేనే దానికి అక్కడ విజయం సిద్ధిస్తుంది. ప్రస్తుతం భారత్‌ను శాసిస్తున్నది కార్పోరేట్ శక్తులు, వాళ్ల చేతిలో వున్న మీడియా. కార్పోరేట్ శక్తులకు అరవింద్ మిత్రుడేమీ కాదు. అతను అంబానీలను కూడా విమర్శిస్తున్నాడు. కొన్ని రంగాల్లో విదేశీ పెట్టుబడులను వ్యతిరేకిస్తున్నాడు. ఢిల్లీ ఎన్నికలలో అరవింద్ బలాన్ని తక్కువ చేసే చూపే ప్రయత్నమే చేసింది మీడియా. మొదట్లో అతనికి అనుకూలంగా సర్వే ఫలితాలు వచ్చినా ఎన్నికలకు 3, 4 రోజుల ముందు బిజెపిదే గెలుపు అంటూ వచ్చాయి. ఎగ్జిట్ పోల్స్ వద్దకు వచ్చేసరికి ఎవరూ ఏమీ చేయలేకపోయారు. చేసినా ప్రయోజనం లేదని తెలుసు.

అవినీతి అన్ని రాష్ట్రాలలో వుంది. ఆప్ అన్ని ప్రాంతాల్లో ఓపిగ్గా యూనిట్లు పెట్టుకుంటూ వెళుతూ మునిసిపల్ ఎన్నికలతో మొదలుపెట్టి పోటీ చేస్తూ పోతే భవిష్యత్తు వుండవచ్చు. కొడితే కుంభస్థలాన్నే కొట్టాలనుకుంటే అన్ని చోట్లా, అన్ని వేళలా అది కుదరదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : సిద్ధరామయ్యపై గవర్నరు చర్య తీసుకుంటారా?

కర్ణాటకలో బిజెపి అధికారంలో వుండగా ముఖ్యమంత్రి యెడ్యూరప్ప అక్రమ మైనింగ్ వ్యవహారంలో యిరుక్కున్నారంటూ కాంగ్రెసుకు సంబంధించిన యిద్దరు అడ్వకేట్లు ఫిర్యాదు చేయడం, అప్పటి గవర్నరు, కాంగ్రెసు నాయకుడు అయిన ఎచ్ ఆర్ భరద్వాజ్ ముఖ్యమంత్రిని ప్రాసిక్యూట్ చేయడానికి 2011 జనవరి 21 న అనుమతి యివ్వడం జరిగింది. వెంటనే బిజెపి అధినాయకత్వం అతన్ని గద్దె దిగమంది. ఇప్పుడు బిజెపి అడ్వకేట్లు యిద్దరు తమ వంతుగా అర్కావతి లే ఔట్‌లో డీనోటిఫికేషన్ అంశంపై అవినీతికి పాల్పడినందున సిద్ధరామయ్యపై చర్య తీసుకోవాలని, ప్రాసిక్యూట్ చేయడానికి అనుమతి మంజూరు చేయాలని బిజెపి నాయకుడైన యిప్పటి గవర్నరు వజూభాయ్ వాలాను కోరుతోంది.

2003లో అప్పటి కాంగ్రెసు ముఖ్యమంత్రి ఎస్.ఎమ్.కృష్ణ బెంగుళూరు శివార్లలోని యెలహంక వద్ద వున్న 16 గ్రామాలను ఖాళీ చేయించి 22 వేల హౌసింగ్ ప్లాట్ల కోసం ప్లాన్ చేశారు. 3839 ఎకరాలు స్వాధీనం చేసుకోవడానికి నోటీసు యిచ్చారు. కానీ 1089 ఎకరాల యజమానులు కోర్టుకి వెళ్లడంతో అది 2750 ఎకరాలకు తగ్గిపోయి ప్రభుత్వం చేతిలో 11 వేల ప్లాట్లకు సరిపడా స్థలం వచ్చింది. కొందరు ప్రయివేటు వ్యక్తులు ప్రభుత్వాధీనంలోని భూమిని కాస్త కాస్త డీనోటిఫై చేయించుకుంటూ సొంతంగా ప్రాపర్టీస్ డెవలప్ చేసుకోసాగారు. గత పదేళ్లలో వివిధ ముఖ్యమంత్రులు రకరకాల ఒత్తిళ్లకు లొంగి కొంత కొంత భూమిని డీనోటిఫై చేస్తూ వచ్చి లే ఔట్‌ను 1766 ఎకరాలకు తీసుకుని వచ్చారు. దీనికై స్థలాలు యిచ్చినవారు 6 వేల మంది, స్థలాలకోసం అప్లయి చేసినవారు 8 వేలు, మొత్తం 14 వేల మంది యిళ్ల స్థలాల ఎలాట్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. వారి కోసం రివైజ్‌డ్ స్కీమును ప్రభుత్వం హైకోర్టుకి సమర్పించింది. ఇష్టం వచ్చినట్లు మినహాయింపులు యిచ్చేయకూడదని, ఏవైనా యిళ్లు, ఫ్యాక్టరీలు, ధార్మిక సంస్థలు వంటివి వుంటేనే అప్పుడు పరిగణించాలనీ హైకోర్టు మార్గదర్శకాలు యిచ్చింది.

''2013లో నేను ముఖ్యమంత్రిగా వుండగా 541 ఎకరాలు డీనోటిఫికేషన్‌కై నా వద్దకు ఫైలు వచ్చింది. అభ్యర్థనలు హైకోర్టు గైడ్‌లైన్స్‌కు వ్యతిరేకంగా వున్నాయని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అభ్యంతరపెట్టింది. నేను ఫైలు తిప్పి పంపించేశాను. జూన్ 2014లో సిద్ధరామయ్య అదే ఫైలు మీద ఓకే అంటూ సంతకం పెట్టాడు – పార్లమెంటు ఎన్నికలలో నిధుల సమీకరణ కోసం!'' అంటున్నాడు బిజెపి నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టార్. ఇప్పుడీ ఆరోపణ రావడంతో సిద్ధరామయ్య తను హైకోర్టు ఆదేశాలు, కాదు సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం వెళ్లానని చెప్పుకున్నాడు. అంతేకాదు, ఏకంగా 2003 నుంచి 2014 వరకు అర్కావతి లే ఔట్‌లో యిచ్చిన అన్ని మినహాయింపులపై న్యాయవిచారణకు ఆదేశించాడు. ఇది ఎప్పటికి తేలుతుందో ఏమో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 18–19**

## ఎమ్బీయస్ : పానుగంటి వారి ''సాక్షి'' – 1

పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు నా అభిమాన రచయిత. ఆయన మంచి కవి. నాటక రచయిత. హాస్య రచయిత. మన సమాజాన్ని ప్రేమిస్తూనే దానిలోని లోపాలను వ్యంగ్యంగా ఎత్తి చూపుతూ ''సాక్షి'' వ్యాసాలు రాశారు. ఈ ఫిబ్రవరి 11 ఆయన 150 వ జయంతి. ఆయన ''సాక్షి'' వ్యాసాలు పుస్తకరూపంలో వచ్చిన చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత సంపుటాలుగా వెలువడ్డాయి. ''హాసం'' నడిపే రోజుల్లో ''క్లాసిక్స్ రీటోల్డ్'' పేర ఆ వ్యాసాల్లో కొన్నిటిని పాఠకులకు పరిచయం చేశాను. వాటిలో కొన్నిటిని మీకు రుచి చూపిస్తాను. నచ్చిందంటే యింకా కొన్ని చూపిస్తాను. చివర్లో ఆయన జీవిత విశేషాలను యిస్తాను. ''క్లాసిక్స్ రీటోల్డ్'' కాన్సెప్ట్‌ను వివరించిన తీరు యిది –

తెలుగు రచన ఎప్పుడూ ఒకేలా లేదు. తొలిరోజుల్లో దస్త్రాలకు దస్త్రాలు రాసేవారు. కథలే అచ్చులో పదేసి, పన్నెండేసి పేజీలు వుండేవి. పోను పోను క్లుప్తంగా రాయసాగారు. ఇలా క్లుప్తంగా చదవడానికి అలవాటు పడిన యువతరం పాత పుస్తకాలలో రచనల 'సైజు'ను చూసి దడిసి ఆ కథలు, నవలలు చదవడం మానేశారు. 14 రీళ్ల సినిమాలకు అలవాటు పడినవాళ్లను 24 రీళ్ల సినిమా చూడమంటే ఏం చేస్తారు? సిడి మూలపడేస్తారు. పుస్తకాలకూ అదే గతి పట్టింది. సినిమాలలో డైలాగుల భాష కొద్దిగానే మారింది కానీ పుస్తకాలలో మార్పు తీవ్రంగా వచ్చింది. ఇప్పుడు ఎక్కడ చూసినా వ్యవహారికమే. చిన్నప్పటినుండీ యిదే చదివినవారిని గ్రాంథికం చదవమంటే చదువుతారా? ..వరు.

లోకమంతా ఇదే తీరు. తొలినాటి పుస్తకాలను కొత్తతరం వాళ్లు ఎంజాయ్ చేయలేని పరిస్థితి వచ్చిందని గుర్తించిన ఇంగ్లీషు వారు 'రీటోల్డ్ ఫర్ యంగర్ రీడర్స్' అనే మకుటంతో పాత క్లాసిక్స్‌ను సరళమైన శైలిలో, నేటి భాషలో తిరిగి చెప్పడం జరుగుతోంది.

అదే బాటలో దాదాపు నూరేళ్ల నాటి పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి ''సాక్షి'' వ్యాసాలను పరిచయం చేస్తున్నాను. 1913లో కొంతకాలం, 1920లో కొంతకాలం ప్రచురించబడ్డ ఈ వ్యాసాలలో శ్రీపానుగంటి ఉపమానాలపై ఉపమానాలు వాడుతూ, అతిశయోక్తులు బహుళంగా వాడుతూ సరళగ్రాంథిక భాషలో ఎన్నో అందాలు చూపారు. నిజానికి గ్రాంథిక భాష అందంగా, కవిత్వానికి దగ్గరగా వుంటుంది. ఈనాటి వ్యావహారిక భాష బ్లాండ్‌గా, చాలాసార్లు రసహీనంగా వుంటుంది కానీ పాఠకులకు బాగా అర్థం అవుతుంది. ''సాక్షి'' రచన రెండింటికి మధ్య వుంటుంది. బెస్ట్ ఆఫ్ ద బోత్ అన్నమాట. కాస్త ఓపిక పట్టి చదవనారంభిస్తే ఎంతో ముచ్చటగా వుంటుంది. అలా ఓపిక లేనివారికోసం ఆ వ్యాసాలలో యీ నాటికీ రిలవెంట్ ఉండే కొన్నిటిని ఎంచుకుని, క్లుప్తంగా యీనాటి వ్యావహారిక భాషలో, యింగ్లీషు మాటలు ధారాళంగా వాడుతూ మళ్లీ చెబుతున్నాను. మొదటి వ్యాసం నాటకాలలోని అసహజత్వం గురించి. ఈ నాటి సినిమాలలో కూడా యిలాటి అసహజత్వాలే కనబడతాయి కాబట్టి మనం వీటితో అతి సులభంగా రిలేట్ కాగలం.

## నాటక ప్రదర్శనం

సాక్షి సంఘ సభ్యులలో ఒకడైన జంఘాల శాస్త్రి క్రితం రాత్రి ''సారంగధర'' నాటకం చూసి వచ్చి తన అనుభవాలు చెప్తున్నాడు – ''నిన్న రాత్రి తొమ్మిది గంటలకే నాటకం వేసే హాలు వద్దకి వెళ్లాను. అక్కడ ఇంకా ఏదీ రెడీ కాలేదు. పాడయిపోయిన నాటక సామగ్రిని రిపేరు చేస్తూ సిబ్బంది కనబడితే, మేకప్ సామాను కోసం తడుముకుంటున్న వేషధారులు కనబడ్డారు. కొంతమందికి డ్రస్ రాలేదు, మరి కొంత మందికి తెచ్చిన పెట్టుడు గడ్డాలు నచ్చలేదు. పూసల కోటు ఎవరు వేసుకోవాలన్న విషయంపై ఇద్దరు నటులు తిట్టుకుంటున్నారు. కృత్రిమస్తనాలు పెట్టుకుని చుట్ట కాలుస్తున్న నటుడొకడు నేను గ్రీన్‌రూమ్‌లో చొరబడం చూసి పక్కకు పారిపోయి ''టిక్కెట్లు అమ్మకం అప్పుడే ఆరంభించిన గాడిద ఎవడ్రా'' అని అరిచేడు.

ప్రేక్షకులు చూడబోతే – ఆ రోజు సంత కాబట్టి రైతులు చాలామంది వచ్చారు. స్కూలు పిల్లలు కూడా వచ్చి వాళ్ల టీచర్ల గురించి కామెంట్స్ చేసుకుంటున్నారు. ఆడవాళ్లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్థలం డోరు దగ్గర నేను కూచుంటానరటే నేను కూచుంటానని ఇద్దరు యాక్టర్లు కొట్టుకోవడం, చివరికి మూడోవాణ్ని కూచోబెట్టడం జరిగింది. కానీ ప్రతీ నిమిషానికీ ఎవడో ఒక యాక్టరు రావడం ఆడవాళ్లను– 'మీ కేమీ ఇబ్బందిలేదు కదా!' అంటూ పరామర్శించడం, అమిత ఉత్సాహి అయిన ఓ నటుడు ఒక సానిపాప కోసం విసిరిన సెంటు బాటిలు ఖర్మ కాలి అది ఓ పోలీసు ఆఫీసరు కూతురు నెత్తిమీద పడడం, దాంతో గోల జరిగి ఆ ఆఫీసరు నాటకాల వాళ్లకు వార్నింగ్ ఇవ్వడం జరిగింది.

ఈ గోల ఇలా ఉండగా తెర వెనకాల తలకాయ పగిలినట్టు శబ్దం, మొర్రోమని కేక వినబడ్డాయి. మరేం లేదు, నాటక సమాజం వాళ్లు కొబ్బరికాయ పగలకొట్టి ప్రార్థనలు మొదలెట్టారు. ప్రార్థన అయిన తర్వాత తెర పైకి లేవబోయింది కానీ కప్పీ(పుల్లీ)లు సరిగా లేక మధ్యలో ఆగిపోయింది. దాంతో ఆ యాక్టర్లే జబ్బపుష్టి కొద్దీ పైకి లేవనెత్తారు.

మొదటి సీనులో రాజరాజనరేంద్రుడనే రాజు, అతని ప్రధాన మంత్రి సరదాగా తోటలోకి వచ్చి మాట్లాడుకునే దృశ్యం – ఆ సీనులో వాళ్లిద్దరూ వేదాల గురించి, వర్ణాశ్రమధర్మాల గురించి, పంటల గురించి, ధాన్యం ధరల గురించి తెగ మాట్లాడుకున్నారు. సరదాగా షికారుకి వచ్చిన వాళ్లు ఇంత గంభీరమైన డిస్కషన్ ఎందుకు చేస్తారో నా కర్థం కాలేదు.

అంతలో చిత్రాంగి, ఆమె దాసి వచ్చారక్కడికి. ఎందుకు వచ్చారో ఎవరికీ తెలియదు కానీ రాజరాజనరేంద్రుడు తన మంత్రి చేయి పట్టుకుని, 'చూసావా, దాని జడ చూసావా?' అంటూ పాట లంకించుకున్నాడు. ఆ మంత్రి కూడా పాట అందుకుని 'చూశా, చిన్నిచన్నుల వన్నెలాడిని చూశా' అంటూ పాడ నారంభించేడు. తనకు నచ్చిన అమ్మాయి గురించి వేరెవరితోనైనా అలా ఎవరైనా– పైగా భారతాన్ని అంకితం పుచ్చుకున్న మహారాజు పాడతారా? తన మంత్రి ఆమె అంగాంగ వర్ణన చేస్తే ఊరుకుంటారా? కానీ ఈ ఔచిత్యం గురించి ఆలోచించిన వాళ్లెవరు?

రెండవ రంగంలో రాజరాజనరేంద్రుడికి, చిత్రాంగికి వివాహం జరిగాక మూడవ రంగంలో వారి శోభనం. రాజుగారు పాటలు పాడడం, విరహంతో రాగయుక్తంగా ఏడవడం అతి దుర్భరంగా ఉంది.

రెండవ అంకంలో సారంగధరుడు, మంత్రి కొడుకు, ఇంకా కొంతమంది పిల్లలు వచ్చి ఫుట్‌బాల్ ఆడారు. ప్రమాదవశాత్తూ ఆ బంతి ఎగిరి పైన వేలాడుతున్న దీపాన్ని పగలకొట్టింది. తర్వాతి మంత్రి కొడుకు చేతిలోంచి గోటిబిళ్ల ఎగిరి సభలో ఉన్న ఒక పిల్లవాడి కణతకు తగలడంతో వాడు స్పృహ తప్పి పడిపోయాడు. ఆ పిల్లవాడి తండ్రి, నాటకపద్ధతికి విరుద్ధంగా రాగయుక్తమైన పాటలతో కాకుండా, వట్టిమాటలతోనే ఏడుస్తూ పిల్లవాణ్ని ఇంటికి తీసుకుపోయాడు. అంతలో కోతికొమ్మచ్చు లాడుతున్న సారంగధరుడు చెట్టు మీద నుండి కింద పడ్డాడు. దాంతో తెర కూడా పడింది.

రెండవ రంగంలో సారంగధరుడు, మంత్రికొడుకు పావురాలు ఎగరవేస్తూ ప్రవేశించారు మళ్లీ పాడుతూ, నాటకంలో కథ ప్రకారం ఆ పావురం చిత్రాంగి మేడ పిట్టగోడపై వాలాలి. కానీ పావురానికి కథ తెలియదేమో, ప్రేక్షకులలో ఉన్న మేజిస్ట్రేటు గారి నెత్తిమీద వాలి రెట్ట వేసింది. కానీ సారంగధరుడు అది చిత్రాంగి మేడలో వాలినట్టే ఊహించుకుని మంత్రి కొడుకు వద్దంటున్నా

మేడలోకి వెళ్లాడు.

మూడవ రంగంలో సారంగధరుడు చిత్రాంగి మేడలో ప్రవేశం. చిత్రాంగి అతన్ని చూడగానే ఫిడేలు వాడికి సైగ చేసి 'ఒకసారి కౌగిట నొత్తిన నేలరా' అనే పాట లంకించుంది. దానికి సారంగధరుడు నడుము బిగించుకుని, 'చెలియ నీదు పలుకులు...మగువ నీదు మాటలు' (పిన్నీ అని మాత్రం అనలేదు) అని పాడి, పాడి ఒగరుస్తూ కూర్చున్నాడు. చిత్రాంగి అతని మీద పడింది. అతను 'రమణీ రాకు రాకు' అంటూ గిరగిరా స్టేజంతా తిరగడం, 'రారా పోకుపోకు' అంటూ చిత్రాంగి – పందిని బట్టే ఎరుకులదానిలా – వెంట తిరగడం జరిగింది. ఈ విధంగా కొంత సేపు తాళం తప్పకుండా గంతులు వేసాక సారంగధరుడు పారిపోవడం, చిత్రాంగి భూపాలరాగంతో భూపాల పుత్రుణ్ని (రాకుమారుడు) తిడుతూ ఉంటే తెర దిగింది.

మూడవ అంకం రాజరాజ నరేంద్రుడు చిత్రాంగికి సర్దిచెప్పే రంగంతో ప్రారంభమయ్యింది. భార్య నేలమీద పడుకుని ఉండగా రాజు 'చిత్రాంగీ, మనోహరాంగీ, మదసారంగీ, ఫిరంగీ' అంటూ అంత్య ప్రాసలతో వేడుకోనడం చూసి నేను నివ్వెరపోయాను. 'మన భార్యలకు కోపం వచ్చిప్పుడు మనం ఇలాగే సంబోధిస్తున్నామా?' అని. ఈలోగా రాజు పాట మొదలుపెట్టాడు. మాటలకు లొంగని చిత్రాంగి పాటలకు లొంగి గొంతు కలిపింది – మాటకు మాట చెబుతూ, వాహకులు తక్కువైన శవాన్ని ఇద్దరు సాయం పట్టి శ్మశానికి చేరవేసినట్టు వీళిద్దరూ కలిసి ఆ పాటను నానా స్వరసాంకర్యంతో ఓ దరికి చేర్చారు. ఆ పాట ద్వారా చిత్రాంగి తన గోడు చెప్పుకుంది – సారంగధరుడు తనను చెరచాడని.

ఇక రెండ అంకం కోర్టు సీను. సర్కారు వకీలు నాదానమ క్రియతో నేరం గురించి ఉపన్యసించాడు. ముద్దాయి తన నిర్దోషిత్వాన్ని భైరవి రాగంలో, హార్మోనియం, చిప్పతాళం సహాయంతో తెలియచెప్పాడు. సాక్షులందరు, ముద్దాయి వైపు న్యాయవాది కూడా – రకరకాల పాటలతో తన వాదనను వినిపించాడు. పాతరోజులు పోయాయి. న్యాయస్థానమంతా సంగీతమయమే! అందరూ గాయకులే ! బిళ్ల బంట్రోతు కనీసం పిళ్లారి రాగమైనా పాడగలగాలి. న్యాయాధిపతి సారంగధరుడికి కాళ్లు చేతులు ఖండించాలని నాటకురంజిరాగంతో తీర్పు చెప్పాడు. ఆపై శంకరాభరణంతో సంకరపరచి సభ చాలించాడు.

తరువాతి అంకంలో కారాగారంలో ఉన్న సారంగధరుడిని చూడడానికి తల్లి వచ్చింది. కౌగిలించుకుని ఏడుస్తుందనుకున్నాను కానీ ఏడవ లేదు. పాడింది – 'నాయానా, నాయానా.. 'అంటూ! దానికి తోడు తెరచాటు నుండి 'తథిగిణతో తకతధి గణితోం' అంటూ ముక్తాయింపు ఒకటి. ప్రజలంతా హుషారెక్కిపోయి ఒళ్లు మర్చిపోయారు. సారంగధరుడి కష్టాలు చూసి వారు దుఃఖించలేదని మనం ఫిర్యాదు చేయరాదు. కన్నతల్లే బాధ కనబరచలేదు. తన పాటకు వచ్చిన రెస్పాన్సు చూసి ఆ పాత్రధారి మొగం కళకళలాడిపోయింది. తన సవతి పన్నిన కుట్రకు బలికాబోతున్న కొడుకు అవస్థ చూసి ఆమె రియాక్టయిన తీరది!

నాలుగో అంకంలో మొదటి రంగంలో సారంగధరుణ్ని మంచం మీద పడుకోబెట్టి తలారులు కాళ్లు, చేతులు నరుకుతున్నారు. ఆ సమయంలో కూడా ఆ కుర్రవాడు పాట లంకించుకోవడమే కాదు, తాళం ఎక్కడ చెడిపోతుందో నన్న భయంతో కాలి మడమతో మంచం పట్టె మీద తాటిస్తూనే ఉన్నాడు. ఆఖరి అంకంలో దేవుడు ప్రవేశించి సారంగధరుణ్ని బతికించి తల్లిదండ్రులతో కలపడంతో నాటక ప్రదర్శనం ముగిసిపోయింది. పొలోమని జనాలు లేచిపోయారు.

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు. ఎంతటి దుర్భర దృశ్యాన్నైనా చూడవచ్చు కానీ ఔచిత్యం తెలియని కవి తన కలంమొనతో ప్రకృతికాంత (నేచురాలిటీ)ని చీల్చి చెండాడుతూంటే చూసి భరించడం కష్టం. నిత్యజీవితంలో మనం సంగీతం ఉపయోగిస్తున్నామా? భార్యతో 'బీఅకాయ వేఉ గూరఉ జేయవే – సరిగమగరి ఎబీఅఎఎ రవపులుసు, వేసి ఎబీఅ' అని పాట పాడుతున్నామా? పాడితే పిచ్చివాళ్ల మనుకోరూ? ఆదర్శ జీవితాన్ని చూపించవలసిన నాటకాలలో యీ దరువు లేమిటి? ఈ తాండవాలేమిటి? రోగశయ్యపై రాగాల పాట్టేమిటి?"

– అంటూ జంఘాల శాస్త్రి తన ఉపన్యాసాన్ని ముగించేడు. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 20**

## ఎమ్బీయస్ : పానుగంటి వారి "సాక్షి" – 2

నేను ప్రస్తావించబోయే "సాక్షి" లో రెండో వ్యాసంకూడా నాటకాల గురించే. నాటకాలు మాకు తెలియవు బాబోయ్ అని యువపాఠకులు అంటే జాలి పడతాను. గత 50 ఏళ్లగా తెలుగువారికి తెలిసిన ఏకైక కళారూపం సినిమా మాత్రమే. ఒక సంగీత కచ్చేరీ పెట్టినా, భరతనాట్య కార్యక్రమం పెట్టినా, నాటకం వేసినా హాలు ఖాళీగా వుంటుంది. మనవాళ్లకు శాస్త్రీయసంగీతం గురించి చెప్పాలన్నా, చరిత్ర గురించి చెప్పాలన్నా సినిమాల ద్వారానే చెప్పాలి. 25,30 ఏళ్ల క్రితం దాకా కనీసం స్కూలు ఫంక్షన్లలోనైనా స్కిట్స్, నాటికలు వేసేవారు. ఇప్పుడు ఎక్కడా చూసినా రికార్డింగ్ డాన్సులే. చిన్నపిల్లల నుండి, నడివయసు గృహిణులదాకా సినిమాపాటలకు స్టెప్పులు వేసేవారే. తక్కిన ప్రాంతాల్లో పరిస్థితి యింత ఘోరంగా లేదు. చాలా రాష్ట్రాలలో నాటకరంగం యింకా సజీవంగానే వుంది. ఇలాటి పరిస్థితి రావటానికి యువత బాధ్యులు కారు. కానీ వారు గతాన్ని ప్రస్తుతానికి రిలేట్ చేసి చూడగల శక్తి సంతరించుకోవాలి. సైన్సు ప్యూర్ ఫార్మ్‌లోనే వుంటే ఉపయోగపడదు. అప్లయిడ్ సైన్సెసే మనకు జీవితానికి బాట చూపుతాయి. "సారంగధర" నాటకంలో రాజరాజ నరేంద్రుడు తను పెళ్లి చేసుకోబోయే యువతి అందచందాలను మంత్రి ఎదుట పాడడం

అసహజం, ఔచిత్యభంగం అని పానుగంటి విమర్శించారు. ఈనాడు సినిమాల్లో కూడా యిలాటివి వున్నాయి కదా! నీ మెడ చూసి మెచ్చా, నీ నడుం చూసి వచ్చా, అంటూ వెనక్కాల ముప్ఫయి మంది ఆడా, మగా వేసుకుని కథానాయకుడు కథానాయికతో అనడం వింత కాదా! అలాగే నన్ను ఎత్తుకుపోరా, ఏదేదో చేయరా, కొరకరా, నలిపేయరా అంటూ కథానాయిక అందరి ఎదుటా హీరోని వేడుకోవడం విడ్డూరం కాదా! ఇలా ప్రస్తుతానికి అన్వయించుకుంటే పాతవి కూడా ఎంజాయ్ చేయగలం.

ఈ వ్యాసం మగవాళ్లు ఆడవేషం వేయడం గురించి. అప్పట్లో నాటకాలే వుండేవి కాబట్టి, వాటి గురించి పానుగంటి రాశారు. ఇప్పుడు సినిమాల్లో కూడా ఎందరో హాస్యనటులే కాదు, కథానాయకులు కూడా ఆడవేషం వేస్తూ వుంటారు, చుట్టుపక్కన వున్నవాళు ్ల గుర్తించలేక పోతూ వుంటారు. అసలు మగవాళ్లను ఆడవేషంలో భరించడం మహా కష్టం. అత్యంత అసహజంగా వుంటుంది. అయినా హీరోలకు అదో మోజు, అన్ని రకాల పాత్రలూ వేయగలిగామని చెప్పుకోవడానికి! ఆడవారికి వుండే సహజమైన ఒంపుసొంపులు, సొగసు, వగలు పురుషుడికి రానేరావు. ఏదో ప్రయోగం కోసం అంటే కాస్సేపు భరించవచ్చుంతే. ఆ పాయింటు మీదే యీ వ్యాసం!

మగవారూ – ఆడవేషాలూ – ఒక మహిళా సంఘంలో ఉపన్యాసం ఇవ్వడానికి ఒకామె రాసుకున్న ప్రసంగ వ్యాసం సాక్షి సంఘానికి చేరింది. ఆ ఉత్తరంలో విషయం యిది – 'మగవాడు మొదటినుండి మన అభివృద్ధికి అడ్డుపడున్నాడని తెలిసి కూడా అతని పాపాన అతడే పోతాడని ఊరుకున్నాం చాలా కాలం. ఇప్పుడు వాళ్ల కెదురు తిరిగి అన్నిరంగాలలో పైకి వస్తున్నాము కాబట్టి అసూయతో కొన్ని ఆరోపణలు చేస్తున్నాడు. వారికి సమానం కావాలనే దురాశతో మనం వారిని అనుకరిస్తున్నామని వెక్కిరిస్తున్నాడు. మనకి అవసరమైనది మనం చేస్తున్నాము కానీ తనను అనుకరించే ఉద్దేశ్యం ఎంత మాత్రం లేదని అతనికెందుకు తెలియదు? తాను మాత్రం ఎవరిని ఇమిటేట్ చేసి యిన్ని వేషాలు తెచ్చుకున్నాడు? తను మనను కాపీ కొట్టవచ్చా? కానీ మనం మాత్రం అతన్ని కాపీ కొట్టకూడదా?

నాటకాలలో స్త్రీ పాత్రలు మగవాళ్లు ఎందుకు వెయ్యాలి? సొగసుగా ఉంటుందని మనం ముంగురు ఈ చెంపా, ఈ చెంపా, ఒక్క అంగుళం వెడల్పున కత్తిరించుకుంటే ఎంత అల్లరి పెట్టాడు. అలాంటిది తను మీసాలు పూర్తిగా గొరిగించుకుని నాటకం స్టేజి మీద పోతుపేరంటాలులా నిలబడినపుడు మనం చెంపలు వాయిస్తే తప్పేముంది? రైకకు బొత్తాలు అంటించి చేతులు రవంత పొడుగు చేసుకుంటే కళ్లల్లో మేకులు కొట్టుకున్నాడే ! అలాంటిది అతనిప్పుడు మన రైక తొడుక్కుని మరేవో తగలబెట్టుకుని సిగ్గులేక ఉభయభ్రష్టత్వపు ఆడరూపంతో మగముత్తైదవులా నిలబడితే మనని అవమానించినట్లే కదా! చుట్ట కాల్చి మాడ్చుకున్న పెదాల మీద లత్తుక పూస్తాడు. అసలే మన తల కంటే అతని తల పెద్దది. అది చాలదన్నట్టు దానిమీద సవరాలు పెట్టడం! మొత్తం మీద రాకాసి తలలా అనిపిస్తుంది. ఇలా తయారయ్యి తనేదో జగన్మోహినీ అవతారం అనుకుంటాడు.

ఆడదానిని అనుకరించడం తన తరమా? అసలు ఆడదాని చూపును అలవర్చుకోగలడా మగవాడు? సూటిగా ఒక్క క్షణం చూసి తక్షణం చూపు మరల్చుకోగల లావణ్యం మగవాడికుందా? మంగళహారతి ఇచ్చినట్టు ఒక్క చూపుతో పరిసరాలన్నీ తిప్పి చూడగల ఆడదాని నేర్పు, కళ్ళల్లో ఒక్కసారి మెరుపు చూపించి అంతలోనే ఆర్పేయగల ఒడుపు మగవాడు స్వంతం చేసుకోగలడా? పెదాలపై పండు వెన్నెల్లా కనబడవలసిన మందహాసాన్ని పెదాల మీదనే నొక్కేసి కంటికొనలో ఓ మూల దాచేయడం ఆడదానికే తగుతుందా? ఈ నపుంసక రూపానికా?

అసలు ఆడదానిలా నిలబడగలడా మగవాడు ? చనువు, ప్రేమ కనబరచవలసిన భర్త ఎదుట ఎలా నిలబడాలో, కాసంత మాత్రమే గౌరవం చూపాల్సిన పెద్ద బావగారి వద్ద ఎలా నిలవాలో, భయగౌరవాలు రెండూ కనబరచవలసిన మామగారి వద్ద ఎలా నిలబడాలో ఆ తేడా మగవాడు చూపగలడా? ఒక ఉదాహరణ చెప్తాను. నా భర్త శాకుంతలం నాటకంలో ప్రియంవద వేషం వేస్తున్నాడంటే చూడడానికి వెళ్లాను. మొక్కలకు నీళ్లు పోయడానికి శకుంతలతో కలిసి చేతిలో చెంబు పట్టుకుని మా ఆయన స్టేజి ఎక్కాడు. ఎలా నిలబడ్డాడో తెలుసా? ఎడమ చేయి నడుము మీదికి జారి పోయింది. కుడి చేతిలో ఇత్తడి చెంబు పట్టుకుని ప్రాప్టింగు చెప్పేవాడి వైపు చూస్తున్నాడు. అదెలా వుందో తెలుసా? టాయిలెట్ క్యూలో నిలబడినట్టుంది! నడుము మీద చేయి వేసుకుంటే, బుగ్గ మీద వేలు పెట్టుకుంటే, మాటిమాటికి పైట సవరించుకుంటే ఆడదానిని అనుకరించినట్లేనా? వెర్రివెర్రి పక్క చూపులు చూసి, ముసిముసి నవ్వులు నవ్వితే మనం ఆడదనుకోవాలా? అసలు ఆడదాని వేషం మగవాడికి ఎలా అబ్బుతుంది?

ఒకసారి 'ద్రౌపది వస్త్రాపహరణం' నాటకానికి వెళ్లాను. దుశ్శాసనుడు ద్రౌపది చీరలు ఒలిచే దృశ్యం. చీరలు ఎంత మట్టుకు లాగాలో దుశ్శాసనుడికి తెలియదు. ఎంతవరకూ లాగించుకోవాలో ద్రౌపదికీ తెలియదు. ఇద్దరూ కూడా చెడ తాగి ఉన్నారు. ద్రౌపది వేషం స్త్రీ వేసి ఉంటే జాగ్రత్త పడి వుండేది. కాని వేషం కట్టినది పురుషుడు కదా! 'వద్దు వద్దు' అని తెరచాటు నుండి కేకలు వేసినా దుశ్శాసనుడు ఆగలేదు – ద్రౌపది ఆపలేదు. చివరికి ద్రౌపది వేషధారికి పైన 'రైక', క్రింద గావంచా మిగిలింది. నెత్తిపైన బోర్లించిన బుట్టలా సవరం ఒకటి! సృష్టికంతకు ఒక్కటే దిష్టిపిడతలా ద్రౌపది మిగిలింది. పుట్టు గుడ్డి వేషం వేస్తున్న ధృతరాష్ట్రుడు కూడా ఆ దృశ్యం చూడలేక ఎవరి సహాయం లేకుండానే తెరచాటుకి పారిపోయాడు. తెర దించబోతే పడలేదు. ద్రౌపదికి నాటకం కాంట్రాక్టరుకి భయం వేసింది కాబోలు కిందకు ఉరికాడు. ద్రౌపది వేషధారి తను ఆడో, మగో మర్చిపోయి పురుషుల వైపుకు పరిగెట్టాలో, స్త్రీల వైపుకు పరిగెట్టాలో అర్థం కాక చివరికి స్త్రీల వైపు పరిగెట్టి వాళ్ల మధ్యన కూచున్నాడు. ఆడవాళ్లంతా తటాలున లేచిపోయి పాక కాలినంత హడావుడి చేసి కేకలు వేశారు. చివరకు కొందరు మగవాళ్లు వచ్చి ఆ వేషధారిని చావగొట్టారు. కొంతకాలం

పాటు ఆడవేషాలు వేస్తే పాత్రధారి ఇలాగే అవుతాడు.

ఇంకొక స్త్రీ పాత్రధారి గురించి చెప్తాను – ఆయన ఓ రోజు మార్కెట్లో కూరలు కొంటున్నాడు. పైన ఉత్తరీయంలో కూరలు మూట కట్టుకుని వెళ్తున్నాడు. జన్మతః ఆడంగివాడు కాదు కానీ పది సంవత్సరాలుగా ఓ నాటకం కంపెనీలో ఆడ వేషం వేస్తున్నాడు. ఇంతలో ఆ కంపెనీ యజమాని అలా వచ్చాడు. అతన్ని చూడగానే యితను సిగ్గుపడి, ముడుచుకుపోయి మూట కట్టగా మిగిలిన ఉత్తరీయంతో పైట వేసుకోబోయి, అది చాలకపోవడంతో రెండు చేతులను కత్తెరలాగా ఛాతీపై వేసుకుని తలవంచుకుని నిలబడ్డాడు. ఒక్క నిమిషంలో తన మగతనాన్ని మసి చేసుకున్నాడు, అలా అని ఆడదీ కాలేకపోయాడు.

బాహ్యలక్షణాలే అనుకరించలేనివాడు స్త్రీ అంతరంగ లక్షణాలు అనుకరించగలడా? మనను అనుకరించడానికి ప్రయత్నించి భంగపడిన మగవాడు మనం అతన్ని అనుకరిస్తున్నా మనడం హాస్యాస్పదం కదూ! అసలు మగతత్వానికి ఆడతనానికి ఎంతో భేదం ఉంది. ఒకటి కఠినం, మరొకటి మార్దవం, ఒకటి హేతుబద్ధం మరొకటి రసప్లుతం. ఇంత విభిన్నత ఉంది కాబట్టే స్త్రీ పురుషులకు ఒకరంటే మరొకరికి ఆకర్షణ ఉంది. ఇద్దరి మధ్య ఆ గీత చెరిపి వేయబోతే ఇలాగే ఉంటుంది.'

ఇదీ ఆ వ్యాసం. దీన్ని ప్రస్తుతానికి అన్వయించే ఉదంతం చెప్తాను వినండి – జమునగారు సత్యభామ వేషంలో ఎంత పేరు తెచ్చుకున్నారో అందరికీ తెలుసు. చాలా ఏళ్ల గ్యాప్ తర్వాత "శ్రీకృష్ణ తులాభారం" సినిమాలో వేసేటప్పుడు సీనియర్ నటి ఋష్యేంద్రమణి "అమ్మాయ్, రంగస్థలంపై స్థానంవారు వేసి ఎంతో పేరు తెచ్చుకున్న పాత్ర వేస్తున్నావు. ఆయన ఎలా చేసేవారో చేసి చూపిస్తాను. అలా చెయ్యి" అంటూ స్థానం వారిలా మాటిమాటికీ పైట సర్దుకోవడం, తొడ మీద నుంచి చేయి తిప్పుకోవడం చేసి చూపించింది. జమున మాత్రం ఆ షాట్‌లో జస్ట్ నడుం మీద చెయ్యి పెట్టుకుని నిలబడ్డారు. "అదేమిటి? నేను చెప్పినా అలా సింపుల్‌గా చేసేశావ్?" అని ఋష్యేంద్రమణి కోప్పడబోతే జమున లాజిక్ చెప్పారు – "స్థానం వారు మగవారు, ఆడ కారెక్టరు వేస్తున్నారు కాబట్టి కొంచెం అతిగా నటించాలి. లేని వయ్యారం తెచ్చిపెట్టుకోవాలి. రంగస్థలం కాబట్టి దూరంగా వున్నవారు కూడా నోటీసు చేసేట్లా కాస్త విగరస్‌గా చేయాలి. నేనూ ఆయనలాగే పైట మాటిమాటికీ సర్దుకుంటే ఓవర్‌గా చేశానంటారు, సెక్సప్పీలు కోసం పాత్రను పాడు చేశానని విమర్శిస్తారు" అని. జమునగారి మాటలు అక్షరాలా నిజం. ఆవిడకు సహజమైన వయ్యారం, లావణ్యం వున్నాయి. మగవాడైతే తెచ్చిపెట్టుకోవాలి. కానీ ఎంత తెచ్చిపెట్టుకున్నా ఆ హొయలు రానే రావు. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 21** **ఎమ్బీయస్ : శ్రీలంక అధ్యక్షుడి భారత పర్యటన**

శ్రీలంకకు కొత్తగా అధ్యక్షుడిగా ఎన్నికైన మైత్రీపాల సిరిసేన ఫిబ్రవరి 16 న భారతదేశం రాబోతున్నారు. ఇది అతని మొదటి విదేశీ పర్యటన. రాజపక్ష చైనాకు అనుకూలంగా వ్యవహరించగా, సిరిసేన భారత్‌కు అనుకూలంగా వ్యవహరిస్తారనే ఆశ పొడచూపుతోంది. అనూహ్యంగా 69 ఏళ్ల మహీంద్ర రాజపక్షను ఎన్నికలలో ఓడించిన సిరిసేన తను అనుకున్నది సాధించగలడా లేదాని వూహించేముందు శ్రీలంక ప్రస్తుత రాజకీయాలను ఒక్కసారి మననం చేసుకోవాలి.

ఎల్‌టిటిఇని మట్టుపెట్టి, శ్రీలంకలో శాంతిని స్థాపించిన రాజపక్షకు యిప్పట్లో ఎదురు వుంటుందని ఎవరూ అనుకోలేదు. ముఖ్యంగా రాజపక్ష! అందుకే గడువుకు రెండేళ్ల ముందుగానే ఎన్నికలు జరుపుతామని నవంబరు 2014లో ప్రకటించి 2015 జనవరి 8 నాటి ఎన్నికలలో తన అధికారాన్ని తానే చేతులారా కూలదోసుకున్నాడు. గతంసారి దేశాధ్యక్షుడిగా వుంటూ 2009 మేలో తమిళ టైగర్లతో యుద్ధంలో గెలిచి, పౌరులందరూ అతన్ని పొగుడుతున్న తరుణంలో 2010లో అతను అధ్యక్ష ఎన్నికలు ప్రకటించాడు. ఎవరూ ఎదురుచూడని విధంగా అతని ఆర్మీ కమాండర్ జనరల్ శరత్ ఫోన్సేకా అతనితో తలపడ్డాడు. ప్రజలు రాజపక్ష పక్షాన నిలిచారు. శరత్ ఓడిపోయాడు. విజితుడి పట్ల రాజపక్ష ఔదార్యం చూపలేదు. నాకే ఎదురుతిరుగుతావా, బుద్ధి చెప్తానుండు అన్నట్లు చిన్న చిన్న ఆరోపణలపై అతన్ని జైలుపాలు చేశాడు, అతనితో పాటు అతని సహచరులను కూడా! ఇదే అది అతని పతనానికి నాంది అంటారు పరిశీలకులు. శ్రీలంక రాజ్యాంగం ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్ల కంటె ఎక్కువసార్లు అధ్యక్షుడిగా వుండకూడదు. తన అధికారాన్ని ఉపయోగించి 2010లో ఆ షరతు ఎత్తేశాడు. సుప్రీం కోర్టు ఆ సవరణను ఆమోదించేట్లు చూసుకున్నాడు.

మంత్రివర్గాన్ని, పాలనా యంత్రాంగాన్ని, న్యాయవ్యవస్థను, మిలటరీని తన బంధువులతో, అనుచరులతో నింపేశాడు. తనవాళ్లనే ఉన్నత పదవుల్లో నియమించుకున్నాడు. వాళ్ల పేర్లన్నీ రాస్తే కొండవీటి చాంతాడంత జాబితా తయారవుతుంది. శాంపిల్‌గా – తమ్ముడు గోటబయ డిఫెన్సు సెక్రటరీ, ఇంకో తమ్ముడు చమాల్ పార్లమెంటులో స్పీకరు, మరో తమ్ముడు బాసిల్ గంఫా జిల్లా నుంచి ఎంపీ. చమాల్ పెద్ద కొడుకు శశీంద్ర ఊవా ప్రాంతానికి మాజీ సిఎం. రెండో కొడుకు శమీంద్ర శ్రీలంక పోర్ట్‌స్ అథారిటీకి డైరక్టర్. బావగారు నిశాంత విక్రమసింఘే శ్రీలంక ఎయిర్‌లైన్సుకి చైర్మన్, బావమరిది లలిత్ చంద్రదాస రాజపక్ష ఆఫీసులోనే న్యూట్రిషన్ ప్రాజెక్టుకి నేషనల్ కోఆర్డినేటర్, కజిన్ ప్రసన్న విక్రమసూర్య ఎయిర్‌పోర్టు ఏవియేషన్ సర్వీసెస్‌కు చైర్మన్. ఇక రాజపక్ష పెద్ద కొడుకు నామల్ యూత్ ఆర్గనైజేషన్‌కు చైర్మన్ ఎంపీ, రెండో కొడుకు యోసిత కార్లటన్ స్పోర్ట్‌స్ నెట్‌వర్క్‌కు ఓనరు. ఇతర దేశాల్లో శ్రీలంక రాయబారులుగా నియమితులైన వారిలో చాలామంది అతని బంధువులో, స్నేహితులో! ఇప్పుడు రాజపక్ష హడావుడిగా ఎన్నికలు పెట్టి గెలిచేయాలని చూడడం దేనికంటే – 28 ఏళ్ల తన కొడుకు నామల్‌కి 2021 నాటికి 35 ఏళ్ల వయసు వచ్చి, అధ్యక్ష పదవికి

పోటీ చేసే అర్హత తెచ్చుకుంటాడనిట! ఇలా తన వంశమే ఎల్లకాలం పాలించాలని అనుకున్నాడు. వాళ్ల కుటుంబం విలాసాల్లో మునిగి తేలింది. లగ్జరీ కార్లు, విమానాలు, గుఱ్ఱాలు కొనడానికి ప్రభుత్వధనం వ్యయం చేసింది. ఇతర కాబినెట్ మంత్రులు అలంకారానికి మాత్రం మిగిలారు. గొంతెత్తి వ్యతిరేకత తెలుపుదామంటే రాజపక్ష తన సొంత పార్టీలోని యితర ప్రముఖులపై కూడా నిఘా వేసి వుంచాడు. తనను విమర్శించినవారిని వెంటాడి వేటాడాడు.

మైనారిటీలలో, తమిళ ప్రాంతాలలో అతని పట్ల విముఖత పెరిగినకొద్దీ గ్రామీణ ప్రాంతాలలో, సింహళీయులలో, బౌద్ధులలో అతని పట్ల ఆరాధన కొనసాగింది. బోధు బల సేన అనే అతివాద బౌద్ధ సన్యాసుల సంఘం 2012లో ముస్లిములు, క్రైస్తవుల పట్ల దాడులు జరిపింది. కొలంబో ప్రాంతంలో ముస్లిం జనాభా విపరీతంగా పెరిగిపోయి, బౌద్ధుల కంటె ఎక్కువ అయిపోతున్నారని దాని ఆందోళన. దానికి రాజపక్ష, అతని సోదరుడు గోటబయ మద్దతు వుంది. తమిళ టైగర్లను దునుమాడడంలో గోటబయ పాత్ర గణనీయమైనది. 2014 జూన్‌లో బలసేన ముస్లిం జనాభా అధికంగా వున్న బెరువల అనే పట్టణంపై దాడి చేసి అనేక ఆస్తులు ధ్వంసం చేసి నలుగుర్ని చంపేశారు. రాజపక్షకు మద్దతు యిస్తూ వస్తున్న ముస్లిం రాజకీయనాయకులు యీ దాడులకు నిరసన తెలిపి, నిందితులను అరెస్టు చేయాలని రాజపక్షను కోరారు. కానీ ఎవరూ అరెస్టు కాలేదు.

ఆర్థికాభివృద్ధి 7% వుంది అని ప్రభుత్వం చెపుతున్నా శ్రీలంక ఆర్థికవేత్తలు అవన్నీ కిట్టించిన గణాంకాలు అంటున్నారు. రాజపక్ష పాలనలో ఉద్యోగాలు తగ్గాయి, జీతాలు తక్కువగా వున్నాయి. కానీ ప్రజలను ముగ్ధులను చేయడానికి పెద్ద పెద్ద మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు తలపెడితే అందరూ వూరుకుంటారని అతను తలపోశాడు. చైనా అండగా నిలిచింది. అధిక వడ్డీలపై బిలియన్ల డాలర్ల ఋణాలు యిచ్చింది. ప్రాజెక్టుల వలన ధనం ప్రవహించి కొంతమంది లాభపడ్డారు. వాటి దీర్ఘకాల ప్రయోజనం మాట ఎలా వున్నా ప్రస్తుతానికి మాత్రం అవి గుదిబండల్లా తయారయ్యాయి. ఎందుకంటే వడ్డీలు కట్టడానికి ఏటా వచ్చే ఆదాయమే సరిపోనంత భారీగా అప్పులు తీసుకున్నాడు రాజపక్ష. ఇంత పెద్ద ప్రాజెక్టులు అవసరమా, దీర్ఘకాలంలోనైనా ఆదాయం వస్తుందా, ఆర్థికంగా నిలబడుతుందా (ఎకనమిక్ వయబిలిటీ) లేదా, వడ్డీలైనా తీర్చగలమా లేదా అన్న లెక్కలేవీ వేయకుండా వీటిలో దిగాడు. కాంట్రాక్టులు యిచ్చేటప్పుడు అంతర్జాతీయ టెండర్లు పిలిచే పద్ధతి లేదు. ఇతరులతో పోల్చి చూసే పద్ధతి లేదు. (మన ఆంధ్ర రాజధాని బృహన్నిర్మాణపు ప్రణాళికల గురించి, సింగపూరు కంపెనీలకు కాంట్రాక్టులన్నీ కట్టబెడుతున్న తీరు వలన భవిష్యత్తులో జరగబోయే నష్టం గురించి యిక్కడ గుర్తు చేయడం అప్రస్తుతం కాదు) అన్నీ చైనాకు కట్టపెట్టాడు. ఈ ప్రాజెక్టులపై నిర్ణయాలు తీసుకునే ముఖ్యమైన మంత్రిపదవులన్నీ రాజపక్ష బంధువుల వద్దే వున్నాయి. తన నియోజకవర్గపు ఓట్ల కోసం తన సొంత వూరిలో ఒక కొత్త ఎయిర్‌పోర్టు, కన్వెన్షన్ హాలు, ఎక్స్‌ప్రెస్ హైవే కట్టడానికి చైనానుండి ఋణం అర్థించాడతను. చైనా వాళ్ల దగ్గర కమిషన్‌ల కోసమే యీ ప్రాజెక్టులన్నీ అని, చివరకు ఆ అప్పులన్నీ తమ నెత్తిన పడతాయనీ శ్రీలంక ప్రజలు భావించారు.

సామాన్యప్రజలు ఏమనుకున్నా పట్టించుకోనక్కరలేదని, ఎందుకంటే రాజకీయంగా తనతో తలపడగల మొనగాడే లేడని తలపోసిన రాజపక్ష యీ వూపులోనే మూడోసారి కూడా అధ్యక్షుడిగా ఎన్నికయిపోతే ఎప్పటికీ ఎదురు వుండదనుకుని, ముందస్తు ఎన్నికలు ప్రకటించాడు. 2013 జనవరిలో తనకు వ్యతిరేకంగా తీర్పు యిచ్చిన చీఫ్ జస్టిస్ శిరాణీ బండారునాయకేను రాజపక్ష పదవి నుంచి తొలగించాడు. దాంతో మధులోలువె సొబితా అనే బౌద్ధసన్యాసి నేతృత్వంలో ప్రజాహక్కుల ఉద్యమం మొదలైంది. ఆయన అందరి పట్ల నిష్పక్షపాతంగా వుంటాడన్న పేరు వుంది కాబట్టి ఏడాది తిరిగేసరికి సమాజంలోని అనేక వర్గాలు దానిలో చేరి ఆందోళన చేయసాగాయి. అది బలపడుతూండడం కూడా రాజపక్ష ముందస్తు ఎన్నికలు ప్రకటించడానికి ఒక కారణం అంటారు.

1987 నాటి భారత-శ్రీలంక ఒప్పందం ప్రకారం ప్రాంతీయ కౌన్సిళ్లకు పోలీసు, భూమిపై అధికారాలు కట్టబెట్టాలి. రాజ్యాంగంలో ఆ విషయమై 13 వ సవరణ చేసినప్పటికి దాన్ని అమలు చేయడంలో విపరీతమైన జాప్యం జరిగింది. తమిళ ప్రాంతాలలో టైగర్ల ప్రాబల్యం వుండగా దాన్ని ఆలస్యం చేయడం సహజమేననుకుని భారత్ వేచి వుంది. 2009 తర్వాత పరిస్థితులు చక్కబడ్డాయని శ్రీలంక ప్రభుత్వమే చెపుతున్నపుడు మరి ఆ సవరణ చేయడానికి యింకేమిటి ఆలస్యం? అని ఇండియా ఫీలైంది. తమిళ ప్రాంతాల్లో ఎన్నికలు జరిపినా అక్కడి కౌన్సిళ్లకు అధికారాలు యివ్వకపోవడంతో అవి మునిసిపాలిటీల్లాగే వున్నాయి. యుద్ధం ముగిసిపోయినా అక్కణ్నుంచి మిలటరీని ఉపసంహరించలేదు. యుద్ధసమయంలో ఆక్రమించిన యిళ్లు, పొలాలు మిలటరీ అధీనంలోనే వుండిపోయాయి. పైగా మరి కొన్ని స్థలాలు తీసుకుని కొత్తగా మిలటరీ స్థావరాలు కట్టారు. యుద్ధనేరాలపై విచారణ జరిపిస్తానంటూనే జరిపించకపోవడంతో యునైటెడ్ నేషన్స్‌లో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ 2012, 2013లో రాజపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్మానం చేసినపుడు అమెరికాతో బాటు ఇండియా కూడా దాన్ని సమర్థించింది. అయితే చైనా వీటో చక్రం వేసి రాజపక్షను కాపాడింది.

అప్పుడు యిండియాలో యుపిఏ ప్రభుత్వం వుంది. డిఎంకె ఒత్తిళ్లకు లొంగి, తన పట్ల అన్యాయంగా ప్రవర్తించిందని, ఎన్‌డిఏ అధికారంలోకి వచ్చిన తర్వాత సంస్కరణలపై పట్టుబట్టదని రాజపక్ష ఆశ పెట్టుకున్నాడు. అయితే రాజపక్షతో జరిగిన తన తొలి సమావేశంలోనే మోదీ 13 వ సవరణ అమలు గురించి ఏమైందని అడగడంతో దిగ్భ్రాంతి చెందాడు. దానికి ఫాలోఅప్ అన్నట్లు ఉత్తర ప్రాంతంలో కౌన్సిల్‌ను పాలిస్తున్న తమిళ నేషనల్ ఎలయన్స్ (టిఎన్ఏ) పార్టీ నాయకులు 2014 ఆగస్టులో రాజపక్షను కలిసి అమలు చేయమని కోరారు. రాజపక్షకు కోపం వచ్చింది. నెల తిరక్కుండా చైనీస్ సబ్‌మెరైన్లను కొలంబో హార్బర్‌లో డాక్ చేయడానికి తొలిసారి అనుమతించాడు. ఆ మరుసటి నెలలో అంటే అక్టోబరులో చైనా అధ్యక్షుడు ఇండియా, శ్రీలంక పర్యటనకు వచ్చినపుడు

రెండోసారీ అనుమతించాడు. ఈ వరస చూసి రాజపక్షకు బుద్ధి గరపడానికి శ్రీలంక ఎన్నికలలో ఇండియా ప్రతిపక్షాలకు పరోక్షంగా సహాయం అందించిందని వినికిడి.

రాజపక్ష ప్రజలను వర్గాలుగా విడదీసి, కొందర్ని మచ్చిక చేసుకున్నాడు. తను లేకపోతే శ్రీలంక విచ్ఛిన్నమై పోయేదనే భావనను సింహళీయుల్లో కలిగించడానికి మీడియాను వాడాడు. తన గురించి గొప్పగా రాయడానికి, ప్రతిపక్షాలను చీల్చి చెండాడడానికి ప్రభుత్వం చేతిలో వున్న మీడియాను వుపయోగించుకున్నాడు. హోటళ్లు, బ్యాంకింగ్, పరిశ్రమలు వంటి అనేక రంగాల్లో తన స్నేహితులకు బాగా అవకాశాలు కల్పించి వారి ద్వారా మీడియాను లోబరుచుకోవడానికి, లొంగని చోట బెదిరించడానికి వుపయోగించుకున్నాడు. అనేక ప్రయివేటు మీడియా సంస్థలు ప్రభుత్వ లైసెన్సులకోసం, యాడ్‌లపై ఆదాయం కోసం అమ్ముడుపోయాయి. కొందరు పాత్రికేయులు స్వతంత్రంగా వ్యవహరించబోయారు. వారి ఫోన్లు ట్యాప్ చేయించాడు. ఇలాటి వేధింపులు తట్టుకోలేక కొందరు జర్నలిస్టులు విదేశాలకు పారిపోయారు.

రాజపక్ష చేస్తున్న యీ పనులు పట్టణప్రాంతాల వారు, విద్యావంతులు ఏవగించుకున్నారు. అయినా సింహళ ప్రజలు తన పక్షానే వున్నారని రాజపక్ష గర్వం. ప్రతిపక్ష పార్టీ అయిన యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి)కి అధ్యక్షుడైన రానిల్ విక్రమ్‌సింఘే సింహళ ఓట్లను తననుంచి గుంజుకోలేడని అతనికి తెలుసు. ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థిని నిలిపి తనను ఓడించే అవకాశం లేదని తెలిసి, యిదే అదనని ముందస్తు ఎన్నికలు ప్రకటించాడు. దానికి నెల ముందు ఓటర్లను ఆకట్టుకోవడానికి అక్టోబరులో ప్రకటించిన బజెట్‌లో సబ్సిడీలు పెంచుతానని, వాటర్ సప్లయి ప్రాజెక్టులు, పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులలో ఎక్కువ పెట్టుబడులు పెడతానని, పన్నులు తగ్గిస్తానని, విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని హామీలు గుప్పించాడు. పబ్లిక్ సెక్టార్ ఉద్యోగుల జీతాలు పెంచాడు. ప్రయివేటు సెక్టార్ ఉద్యోగులకు యిచ్చే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ మెరుగుపరిచాడు. పోలీసు అధికారులకు, ఉద్యోగులకు మోటారు సైకిళ్లు, స్కూటర్లు నామమాత్రపు ధరలకు అందించాడు. వరికి, పాల ఉత్పాదనలకు, రబ్బరుకు మద్దతు ధర పెంచాడు. హైస్కూలు విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు, సీనియర్ సిటిజన్లకు, వికలాంగులకు, కిడ్నీ రోగులకు, మిలటరీ కుటుంబాలకు అలవెన్సులు పెంచాడు. నీరు, విద్యుత్ చార్జీలు, ఆదాయపు పన్ను రేట్లు తగ్గించాడు.

ఇన్ని చిట్కాలు ప్రయోగించినా చివరకు ఓటమి తప్పలేదు. దానికి కారణం – గడ్డిపోచల్లా విడివిడిగా పడి వున్న ప్రతిపక్షాలు వెంటిగా ఏర్పడి రాజపక్ష అనే మత్తగజాన్ని బంధించడమే! వారిని అలా సంఘటితం చేసిన వ్యక్తి రాజపక్ష పార్టీకే చెందిన చంద్రికా కుమారతుంగ!

చంద్రికా కుమారతుంగ తండ్రి సోల్మన్ బండారనాయకేయే 1951లో శ్రీలంక ఫ్రీడమ్ పార్టీ (ఎస్‌ఎల్‌ఎఫ్‌పి) ని స్థాపించినది! స్వాతంత్ర్యానంతరం ప్రధాన భూమిక వహించిన రెండు పార్టీలలో యిది ఒకటి. దీని సిద్ధాంతాలు సోషలిజానికి దగ్గరగా వుండగా దీని ప్రత్యర్థి యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి) సెంటర్–రైటిస్టు పాలసీని అవలంబించేది. సోల్మన్ 1956లో దేశానికి ప్రధానిగా ఎన్నికై మూడేళ్ల తర్వాత హత్యకు గురయ్యాడు. అప్పుడు చంద్రిక తల్లి సిరిమావో పార్టీ పగ్గాలు చేతబట్టి 1960లో ప్రధానమంత్రి అయింది. వామపక్ష, ప్రజా సంక్షేమ విధానాలతో ప్రజలను ఆట్టుకుంది. తర్వాత అధికార దుర్వినియోగానికి పాల్పడి చెడ్డపేరూ తెచ్చుకుంది. 1977లో పదవీభ్రష్టురాలై జయవర్ధనే చేతిలో ఓడిపోయింది. చంద్రిక పారిస్‌లో చదువుకుంది. 1974లో శ్రీలంకకు తిరిగి వచ్చి పార్టీలో చేరి మహిళా విభాగంలో చురుగ్గా పనిచేసింది. ఒక సినిమా యాక్టరును పెళ్లాడి, తల్లి పార్టీని విడిచి అతని పార్టీలో చేరింది. అయితే అతను కూడా హత్యకు గురి కావడంతో ఇంగ్లండ్ వెళ్లి అక్కడే చాలాకాలం వుంది. 1991లో తిరిగి వచ్చి పార్టీకి పునర్వైభవం కలిగేట్లా చేసింది.

ఆమె తల్లి చాలా కుటిలత్వం ప్రదర్శించింది. కొడుకు అనూరకు, కూతురు చంద్రికకు మధ్య పోటీ పెట్టి పార్టీని తన అదుపులో వుంచుకోవాలని చూసింది. ముగ్గురిలో చంద్రిక తెలివితేటలు ప్రదర్శించి పీపుల్స్ ఎలయన్స్ పేర ఒక కూటమిని కూర్చి యుఎన్‌పి 16 ఏళ్ల పాలనను అంతం చేసి 1994లో అధ్యక్షురాలిగా ఎన్నికైంది. తల్లిని వూరికే వదిలేస్తే ప్రమాదమని 1994లో ప్రధానమంత్రిని చేసింది. ఆమె ఆరేళ్లు ఆ పదవిలోనే వుంది. చంద్రిక తమిళటైగర్లతో సంధియత్నాలు చేసింది, అవి విఫలం కావడంతో వారిపై మిలటరీని ప్రయోగించింది. టైగర్లు 1999 ఎన్నికల సమయంలో చేసిన ఒక దాడిలో ఆమె ఒక కన్ను పోయింది. ఆ ఎన్నికలలో సింపతీ ఓటుతో ఆమె యుఎన్‌పి తరఫు అభ్యర్థి రానిల్ విక్రమసింఘేను ఓడించి మళ్లీ అధ్యక్షురాలైంది. 2001 డిసెంబరులో ఆమె ప్రత్యర్థి రానిల్ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యాడు. అతను టైగర్లతో శాంతి చర్చలు మొదలుపెట్టాడు. ఆ మెతకవైఖరి చంద్రికకు నచ్చలేదు. అతను 2003 నవంబరులో అమెరికా వెళ్లినపుడు పార్లమెంటును ప్రొరోగ్ చేసి అతని అధికారాలు లాక్కుంది. వామపక్ష పార్టీ అయిన జనతా విముక్తి పెరమున, యింకా యితర పార్టీలతో కలిసి యునైటెడ్ పీపుల్స్ ఫ్రీడమ్ ఎలయన్స్ (యుపిఎఫ్‌ఏ) అనే మరింత పెద్ద కూటమిని కూర్చి, దాని ద్వారా రాజపక్షను ప్రధానమంత్రిని చేసింది.

అయితే 2005 కల్లా పెరమున విడిపోయింది. అప్పటితో చంద్రిక అధ్యక్షపదవి కూడా సమాప్తమైంది. ఆవిడ యింకా కొనసాగాలని చూసింది కానీ రాజపక్ష అడ్డుపడ్డాడు. కూటమిలోని 25 పార్టీలు – ఎస్‌ఎల్‌ఎఫ్‌పితో సహా – అతనికి అండగా నిలిచాయి. చంద్రిక సొంత పార్టీలోనే బలహీనపడింది. అధికారంలో వుండగా చంద్రిక తన తల్లి పద్ధతులకు వ్యతిరేకంగా గ్లోబలైజేషన్‌వైపే మొగ్గింది. ఉదార ఆర్థికవిధానాలు అవలంబించి ధనిక, పేద వ్యత్యాసానికి దోహదపడింది. అవినీతి ఆరోపణలు కూడా వచ్చాయి. చంద్రిక

స్థానంలో ఆమె సోదరుడు అనూరకు బదులుగా పార్టీ నేతలు రాజపక్షను అధ్యక్ష అభ్యర్థిగా నిలబెట్టారు. అనూర కోపంతో యుఎన్‌పిలో చేరాడు. రాజపక్ష ఎన్నికల్లో నెగ్గి తమిళ టైగర్లను మట్టుపెట్టి తన బలాన్ని పెంచుకున్నాడు. తన నేత ృత్వంలోని యుపిఎఫ్ఏ కూటమిలో 14 పార్టీలుండడంతో పోనుపోను చంద్రికను లక్ష్యపెట్టడం మానేశాడు.

పరాజయభారంతో కుములుతున్న చంద్రిక రాజపక్షపై కక్ష తీర్చుకోవాలనుకుంది. ఇన్నాళ్లకు అవకాశం రావడంతో ఎవరికీ తెలియకుండా వ్యూహరచన చేసింది. రాజపక్ష మంత్రివర్గంలో అసంత ృప్తి రగులుతున్నట్లు కనిపెట్టిందామె. కొత్తగా పార్టీలో చేరి, రాజపక్షకు సన్నిహితులుగా మారి అవినీతికి పాల్పడుతున్నవారిపై చాలాకాలంగా వున్న అతని సహచరులకు అసూయగా వుంది. ఎదిరించి బయటకు వస్తే వేధింపులకు గురవుతామోనని భయపడుతున్నారు. రాజపక్ష సోదరులు యిప్పుడున్నదానితో సంత ృప్తి పడకుండా యింకా పెద్దపెద్ద ప్లాన్లు వేస్తున్నారని వారికి తెలుసు, అతని కొడుకు వచ్చేసారి అధ్య్క అభ్యర్థి అని తెలుసు. ఇక వారి వంశం శ్రీలంకను ఎల్లకాలం పాలించడానికి సిద్ధపడుతోందని, ఇంకో 8 ఏళ్ల పాటు సాగబోయే పాలనలో తాము మరింతగా నామమాత్రు లవుతామనీ భయపడ్డారు. రాజపక్షకు అడ్డుకట్ట వేసి తీరాల్సిందే, కానీ ఎలా? తమకు బలం చాలదే అని మథన పడుతున్నట్లు చంద్రికకు తెలిసింది.

రాజపక్ష వేలితో అతని కన్నునే పొడవాలనే ప్రణాళికతో అతని పార్టీలోనే అతనికి కుడిభుజంగా, అతని కాబినెట్‌లో ఆరోగ్యమంత్రిగా వున్న మైత్రీపాలను దువ్వింది. అతనికి మద్దతు పలకమని తనకు బద్ధశత్రువుగా వున్న యుఎన్‌పి నాయకుడు రానిల్‌ను కూడా అర్థించింది. ఈ కసరత్తు కొన్ని వారాలపాటు జరిగింది. ఆమె యింట్లోనే ప్రతిపక్ష నాయకులు సమావేశమయ్యేవారు. సమావేశాల గురించి సమాచారం అందించుకోవడానికి మామూలు ఫోన్లు వుపయోగిస్తే ప్రభుత్వ యింటెలిజెన్సు వర్గాలు పసిగడతాయనే భయంతో వారికి చిక్కకుండా వుండేందుకు ఎన్‌క్రిప్టెడ్ శాటిలైట్ ఫోన్లను ఉపయోగించారు. గత ఎన్నికలలో రాజపక్ష చేతిలో ఓడిపోయిన మాజీ ఆర్మీ చీఫ్ శరత్ ఫోనెస్కా వీరికి యిలాటి విషయాల్లో సాయపడ్డాడు. అనేక మంది డమ్మీ కాండిడేట్లను అభ్యర్థులుగా నిలిపి రాజపక్షను కన్‌ఫ్యూజ్ చేసి, అతనికి ఎన్నికలంటే నల్లేరుపై బండి నడక అనే అభిప్రాయం కల్పించారు.

ప్రతిపక్షాల తరఫున ఎవరు సరైన అభ్యర్థి అని గాలిస్తే అనేక పేర్లు చర్చకు వచ్చాయి – చంద్రిక, యుఎన్‌పి సభ్యులు రానిల్ విక్రమసింఘే, కారూ జయసూర్య, నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ సోషల్ జస్టిస్ లీడరు జస్టిస్ మధులోలువె సొబితా, చీఫ్ జస్టిస్ శిరాణీ బండార్ నాయకే.. యిలా. చివరకు మైత్రీపాల సరైన అభ్యర్థి అని అందరూ అభిప్రాయపడ్డారు. మైత్రీపాల ఎస్ఎల్ఎఫ్‌పికి జనరల్ సెక్రటరీ, ఆరోగ్యమంత్రి. తమిళ టైగర్లతో పోరాడిన ఖ్యాతి రాజపక్షకు వున్నట్లే మైత్రీపాలకు కూడా వుంది. అతనిపై 2008లో టైగర్లు దాడి చేస్తే అద ృష్టవశాత్తూ తప్పించుకున్నాడు. యుద్ధం అంత్యదశలో అంటే 2009లో అతను తాత్కాలికంగా డిఫెన్సు మినిస్టర్‌గా పనిచేశాడు. రాజపక్ష లాగా అతనూ సింహళ బౌద్ధుడు. గ్రామీణ ప్రాంతీయుడు. మధ్యతరగతి రైతు కుటుంబంలో 12 మంది పిల్లల్లో ఒకడిగా పెరిగాడు. స్థానికంగా చదువుకునే రోజుల్లో చైనాకు అనుకూలంగా వుండే కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ సిలోన్‌లో సభ్యుడిగా వున్నాడు. కానీ తర్వాత ఎస్ఎల్ఎఫ్‌పి యూత్ వింగ్‌లో చేరాడు. 1971 నాటికి యూత్‌వింగ్ మాత ృసంస్థపై తిరగబడినపుడు యితను కూడా తిరుగుబాటుదారుల్లో ఒకడు. 15 నెలలపాటు జైలు జీవితం అనుభవించాడు. 1989లో ప్రతిపక్ష సభ్యుడిగా పార్లమెంటులో అడుగుపెట్టాడు. 1994లో అతని పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక, అతన్ని యిరిగేషన్ శాఖలో డిప్యూటీ మినిస్టర్‌గా వేశారు. తర్వాతి రోజుల్లో వ్యవసాయమంత్రిగా, ఆరోగ్యమంత్రిగా కూడా చేశాడు. రాజపక్షలో రాజరికపు పోకడలున్నాయి. వాణిజ్యవర్గాలతో స్నేహం వుంది. అత్యాశ వుంది. మైత్రీపాల పదవుల కోసం పాకులాడ లేదు. పైగా మ ృదుస్వభావి. మంత్రి అయినా గ్రామీణ పోకడలు విడిచిపెట్టలేదు. ఈ విధంగా రాజపక్ష లాటి నేపథ్యమే కలిగి వుండి, యుఎన్‌పి ఆమోదయోగ్యుడయ్యే అరుదైన వ్యక్తి యితనే అని తేల్చారు.

నవంబరు 20 న రాజపక్షతో కలిసి విందారగించిన మైత్రీపాల మర్నాడు పొద్దున్నకల్లా ''ఈ దేశపు ఆర్థికవ్యవస్థను, సాంఘికవ్యవస్థను ఒకే ఒక్క కుటుంబం శాసిస్తోంది. అందుకే బయటకు వచ్చేశా..'' అన్నాడు. ''వెన్నుపోటుదారులు యిలాగే వుంటారు'' అన్నాడు రాజపక్ష. విభీషణుడితో పోలిక తేలేదు, తను రావణుడు అనుకుంటారని, అంతిమంగా ఓడిపోతానని అనుకుంటారనీ! పోలీసు వ్యవస్థపై యింత పట్టు బిగించినా, తన వీపు వెనక్కాల యింత కుట్ర జరగడం అతను హరాయించుకోలేక పోయాడు. మైత్రీపాలతో బాటుగా ఐదుగురు ఎంపీలు కూడా బయటకు వచ్చేశారు. ఆ తర్వాత ఒకరొకరుగా చాలామంది మంత్రులు కూడా.. ! అందర్నీ రాజపక్ష పార్టీలోంచి బహిష్కరించాడు. ప్రతిపక్షాలన్నీ కలిసి న్యూ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎన్‌డిఎఫ్) ఏర్పరచారు. ఈ కూటమిలో రైటిస్టు భావాలున్న యుఎన్‌పి, మార్క్సిస్ట్ భావాలు కల జెవిపి, బౌద్ధ సన్యాసులు నడిపే జెఎచ్‌యు, రెండు ముస్లిము పార్టీలు, తమిళ నేషనల్ ఎలయన్స్ – లాటి భిన్న ద ృక్పథాలున్న పార్టీలున్నాయి.

ఇంతమంది కలిసినా రాజపక్షపై విన్నింగ్ మార్జిన్ 3.7% మాత్రమే (81.5% పోలింగు జరగగా మైత్రీపాలకు 51.28%కు వచ్చి 12 ఎలక్టొరల్ జిల్లాలలో నెగ్గగా రాగా, రాజపక్షకు 47.58% వచ్చి 10 జిల్లాలలో నెగ్గాడు) అంటే రాజపక్ష ఎంత బలంగా పాతుకుపోయాడో చూడండి. 2010 ఏప్రిల్‌లో జరిగిన ఎన్నికలలో అతని యుపిఎఫ్ఏకు 60.33% ఓట్లు, 225 సీట్లలో 160 సీట్లు వచ్చాయి. అతని కూటమిలో సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ, లంక సమ సమాజ పార్టీ, నేషనల్ ఫ్రీడమ్ ఫ్రంట్, నేషనల్ యూనియన్ ఆఫ్ వర్కర్స్, అప్ కంట్రీ పీపుల్స్ ఫ్రంట్ యిలా అనేకానేక పార్టీలున్నాయి. బోధుబలసేన మద్దతు ఎలాగూ వుంది.

నవంబరు 18న జాతిక హేలా ఉరుమాయ అనే పార్టీ రాజపక్ష కూటమినుండి అతను పాలనా సంస్కరణలు చేపట్టటం లేదన్న అభియోగంతో బయటకు వచ్చేట్లా చేశారు. 2014 డిసెంబరు 8 నామినేషన్ల దినం కాగా అదే రోజున యిద్దరు ప్రతిపక్షాల ఎంపీలు రాజపక్షవైపు ఫిరాయించారు. వారిలో ఒకరిని రాజపక్ష మైత్రీసేన స్థానంలో ఆరోగ్యమంత్రిగా నియమించాడు. డిసెంబరు 23 న ప్రభుత్వపక్షం నుండి శ్రీలంక ముస్లిమ్ కాంగ్రెస్, ఆల్ సిలోన్ ముస్లిమ్ కాంగ్రెస్ అనే పార్టీలు బౌద్ధుల దాడుల నుంచి ముస్లిములకు రక్షణ కల్పించడం లేదన్న ఆరోపణతో ప్రతిపక్షంవైపు ఫిరాయించారు.

ఇలాటి గందరగోళ పరిస్థితుల్లో ఎన్నికల ప్రచారం ఎలా సాగిందో, ఏయే సేనలు ఎటు మోహరించాయో గమనించడం ఆసక్తికరంగా వుంటుంది. రాజపక్ష అంటే మైనారిటీలకు, తమిళులకు అసహ్యం కాబట్టి జనాభాలో వాళ్లు 25% కాబట్టి, వాళ్లకు నచ్చేట్లా వాగ్దానాలు గుప్పిస్తే ఓట్లు కురుస్తాయని మైత్రీసేన అనుకోలేదు. ఎందుకంటే తమిళ టైగర్లను అణిచేసిన చరిత్ర అతనికీ వుంది. అందువలన 2009 నాటి యుద్ధనేరాలపై అంతర్జాతీయ విచారణ జరిపించాలన్న కోరికకు తల వొగ్గలేదు. అలాగే ముస్లిము, క్రైస్తవులపై దాడుల గురించి విచారణ జరిపిస్తాననీ అనలేదు. మెజారిటీ బౌద్ధులను, సింహళీయులకు నచ్చేట్లా బౌద్ధమతానికి రాజ్యాంగరీత్యా ప్రముఖస్థానాన్ని కొనసాగిస్తానని హామీ యిచ్చాడు. ఆ విధంగా అతను రాజపక్ష ఓటుబ్యాంకులోకి చొరబడి అన్ని మతాలకు చెందిన సింహళ ఓట్లను కొల్లగొట్టాడు. మధ్య, దక్షిణ ప్రాంతాలలో ఆధిక్యత సంపాదించాడు. రాజపక్షకు గ్రామీణ ప్రాంతాలలో, సింహళ-బౌద్ధులున్న దక్షిణాగ్ర శ్రీలంకలో, ఆధిక్యత వచ్చింది. అక్కడ రాజపక్షకు 2% ఎక్కువ ఓట్లు రాగా, ఉత్తరాన, తూర్పున వున్న తమిళ, ముస్లిం ఓట్లు మైత్రీసేనకు తోడయ్యాయి కాబట్టి అతను రాజపక్ష కంటె కొద్దిపాటి మొగ్గు సంపాదించి నెగ్గేశాడు. హింసకు, వివక్షతకు, నిరుద్యోగానికి గురైన మైనారిటీలు, తమిళులు కసితో బూతుల వద్ద బారులు తీరి మైత్రీసేనకు విజయం కట్టబెట్టారు. 2010 ఎన్నికలలో రాజపక్ష ఎన్నిక కచ్చితం అని తెలుసు కాబట్టి అప్పుడు తమిళులు ఎన్నికల పట్ల ఆసక్తి చూపలేదు. ఎవరు కారణమో తెలియదు కానీ ఎన్నికల రోజున తమిళ ప్రాంతాలైన పాయింట్ పెడ్రో, వావునియాలలో బాంబులు పేలాలి. తమను భయపెట్టి బూతులకు దూరంగా వుంచాలనే ప్రయత్నమే అనుకుని తమిళులు మరింత పట్టుదలతో ఓట్లేయడానికి వచ్చారు. మైత్రీసేన అక్కడకు ప్రచారానికి రాకపోయినా రికార్డు స్థాయిలో 68% పోలింగు జరిగింది.

ఎన్నికలకు ముందుగా రాజపక్ష యిచ్చిన తాయిలాలను విమర్శించాలో లేదో ప్రతిపక్షం తేల్చుకోలేకపోయింది. వద్దంటే ఆ యా వర్గాలకు కోపం వస్తుందని భయం. ప్రభుత్వం 55 బిలియన్ డాలర్ల అప్పులో కూరుకుపోయిందని మాత్రం నిందిస్తూనే తాము అధికారంలోకి వస్తే అవన్నీ కొనసాగిస్తాయని హామీ యిస్తూ ఆ మాటకొస్తే పబ్లిక్ సెక్టార్‌లో జీతాలను 5000 పెంచుతాయని కూడా చెప్పింది. అవన్నీ యిప్పుడు ఎలా నెరవేరుస్తారో వేచి చూడాలి. వీళ్లు ఏం చెప్పినా ప్రభుత్వసాయంపై ఆధారపడిన సింహళ గ్రామీణ పేదలు రాజపక్షకే ఓటేశారు. సింహళీయుల్లో బౌద్ధులు, ధనికులు కూడా అతనికే ఓటేశారు. కొలంబోలోని నగరప్రాంతాలు, పారిశ్రామిక వాడల్లోని జనాభా 2010లో రాజపక్షకు ఓటేయగా, యీసారి అతనికి వ్యతిరేకంగా వేశారు. ఎందుకంటే అక్కడ వున్నవారిలో సింహళ, తమిళ భాషల క్రైస్తవులు, తమిళ హిందువులు, ముస్లిములు ఎక్కువగా వున్నారు. సమాజంలోని విద్యావంతులు, ఎకడమీషియన్లు, కార్మికనాయకులు, లెఫ్టిస్టులు, కళాకారులు, హక్కుల ఉద్యమకారులు అందరూ ఎక్కడున్నా సరే రాజపక్షకు వ్యతిరేకమయ్యారు.

రాజపక్ష ప్రచారంలో భాగంగా 26 ఏళ్ల పాటు తమిళ టైగర్ల వలన దేశం అంతర్యుద్ధంలో ఎలా నాశనమైందో గుర్తుకు తెచ్చుకోండి అంటూ రేడియో, టీవీ స్లాట్‌ల ద్వారా మోగించేశారు. రాజపక్ష కారణంగానే శాంతి నెలకొంది, అతన్ని దింపేస్తే మళ్లీ అశాంతే అనే అర్థంలో తమిళ, సింహళ, ఇంగ్లీషు భాషలో పత్రికలలో యాడ్స్ గుప్పించారు. మైత్రీపాలను 'ఈలమిస్టు'గా 'ఎలిట్' (కులీనవర్గాల) ప్రతినిధిగా చూపిస్తూ తనను గ్రామీణ ప్రాంతాల ఛాంపియన్‌గా చిత్రీకరించుకున్నాడు. జాతిపరమైన మైనారిటీలు మొత్తం 22% మందే వున్నారు కాబట్టి, యీ రకమైన విభజన ద్వారా మెజారిటీ ప్రజల మద్దతుతో తను గెలవవచ్చని అతని లెక్క. కానీ అది తప్పింది. మైత్రీసేన నెగ్గాడు. ఇప్పుడు మైత్రీసేన ముందున్న సవాళ్లేమిటో చూద్దాం.

మైత్రీపాల జనవరి 9 న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేశాడు. మామూలుగా అయితే చీఫ్ జస్టిస్ ఎదుట చేయాలి. కానీ ఆ పదవిలో వున్న మోహన్ పెయిరిస్ రాజపక్ష మనిషి కాబట్టి అతని ఎదుట చేయనంటూ సుప్రీం కోర్టు జడ్జి శ్రీపవన్ ఎదుట చేశాడు. వెనువెంటనే యుఎన్‌పికి చెందిన రానిల్ విక్రమ్‌సింఘే ప్రధానమంత్రిగా చేశాడు. తర్వాత వెంటనే చేసిన పని మోహన్‌ను తీసేయడం! 225 మంది సభ్యులుండే పార్లమెంటుకు ఏప్రిల్‌లో ఎన్నికలు జరగబోతున్నాయి. రాజపక్ష వ్యతిరేకులందరినీ కలుపుకుని పోకపోతే ఆ ఎన్నికలలో యిబ్బంది వస్తుంది. యుఎన్‌పి గ్రామీణ ప్రాంతాల్లో బలహీనంగా వుంది. అది బలపడాలంటే వారికి యిలాటి పదవి ఒకటి ముఖ్యం. ఎన్నికల సందర్భంగా మైత్రీపాల చిత్తం వచ్చినట్లు వాగ్దానాలు చేశాడు. ఒకే వ్యక్తి అధ్యక్షుడిగా రెండు కంటె ఎక్కువసార్లు ఎన్నిక కావచ్చంటూ రాజపక్ష చేసిన రాజ్యాంగ సవరణను 100 రోజుల లోపు తిరగతోడతానన్నాడు. తను ఒక టర్మ్ మించి వుండనని మాట యిచ్చాడు. అధ్యక్షుడి అధికారాలు తగ్గిస్తానన్నాడు. దానికి సవరణ అవసరం. సవరణ కోసం పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ వుండాలి. సాధ్యమా? అతను మీడియాకు న్యాయవ్యవస్థకు, పోలీసు వ్యవస్థకు స్వేచ్ఛ యిస్తానన్నాడు. అవినీతి తొలగించి ప్రజలకు 'గుడ్ గవర్నన్స్' అందిస్తానన్నాడు.

మైనారిటీలు, తమిళులు చాలా ఆశలు పెట్టుకున్నారు. తమిళ ప్రాంతాల్లో సైన్యాన్ని పూర్తిగా తొలగించి, తమిళ కౌన్సిళ్లకు అధికారాలు బదిలీ చేయకపోతే వాళ్లు వూరుకోరు. చేస్తే సింహళులు అలుగుతారు. ఇప్పటికే దక్షిణ శ్రీలంకలో పుకార్లు షికారు

చేస్తున్నాయి – మైత్రీసేన విజయాన్ని తమ విజయంగా భావించిన తమిళ వేర్పాటువాదులు తమిళ ఈలం పేర జండా ఎగరేశారనీ, ఆర్మీ క్యాంప్‌లపై రాళ్లు విసిరారనీ! దీన్ని లౌక్యంగా పరిష్కరించడానికి మైత్రీసేన తమిళులతో పేచీలు పడుతున్న చీఫ్ సెక్రటరీని మార్చడంతో బాటు తమిళులున్న ఉత్తర ప్రాంతానికి గవర్నరుగా వున్న మేజర్ జనరల్‌ని తీసేసి, అతని స్థానంలో అనుభవజ్ఞుడైన పాలిహక్కర అనే మాజీ ఫారిన్ సెక్రటరీని వేశాడు. వాళ్లు యిదే అదనని యుద్ధనేరాలపై కూడా విచారణ జరపాలని పట్టుబడితే మైత్రీసేన స్వయంగా చిక్కుల్లో పడతాడు. మైత్రీపాలకు ఏదైనా ధైర్యంగా చేయాలన్నా భయమే, ఎందుకంటే మైత్రీసేనది సంకీర్ణ ప్రభుత్వం! వామపక్ష పార్టీలు రాజపక్షపై కోపంతో నానాగోత్రాలకు చెందిన పార్టీలు కూటమిగా ఏర్పడి మైత్రీపాలను సమర్థించాయి కానీ వారిలో వారికి సిద్ధాంతవైరుధ్యం వుంది. తరతరాలుగా ప్రతిపక్షాలుగా వున్న యుఎన్‌పి– ఎస్ఎల్ఎఫ్‌పి, సింహళ బౌద్ధులు– తమిళ హిందువులు, అర్బన్ మిడిల్‌క్లాస్–అర్బన్ పూర్, మాజీ ఆర్మీ కమాండర్–వామపక్షాలు, తమిళ ప్లాంటేషన్ వర్కర్లు, ప్రొఫెషనల్స్–ఆర్గనైజ్‌డ్ యూనియన్లు.. యిలా వీరందరూ కలిస్తే యీ ఫలితం వచ్చింది. వీరు ఎంతకాలం కలిసి వుంటారో ఎవరూ వూహించలేకున్నారు.

అన్నిటికన్నా పెద్ద యిబ్బంది ఆర్థికవ్యవస్థను చక్కదిద్దడం, చైనాతో సంబంధాలను సమీక్షించుకోవడం. చైనాతో సంబంధాలు హఠాత్తుగా తెంచుకుంటే సగంలో వున్న భారీ ప్రాజెక్టులు ఆగిపోతాయి. వాటిని కొనసాగిస్తే పెనుభారాన్ని మోయవలసి వుంటుంది. దుస్తులు, చేపలు, టీ ఎగుమతి, టూరిజం వంటి పరిశ్రమలు పుంజుకునేట్లా చేసి ఫారిన్ ఎక్స్‌ఛేంజ్ గడించాలి, ఉద్యోగాలు కల్పించాలి. చైనా రాజపక్షకు అనుకూలంగా వ్యవహించి కాబట్టి దాన్ని తరిమివేసి దాని స్థానంలో ఇండియాను తెద్దామన్నా, ఇండియా ఒప్పుకుంటుందా? చైనా స్థాయిలో పెట్టుబడులు పెడుతుందా? చైనాతో పేచీ ఎందుకని వూరుకుంటుందా? చైనాతో మరీ విరోధం పెట్టుకుంటే యునైటెడ్ నేషన్స్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సెషన్‌లో యిబ్బంది వస్తుందన్న భయం వుంది. యుద్ధనేరాలపై శ్రీలంకకు వ్యతిరేకంగా తీర్మానం చర్చకు వచ్చినప్పుడల్లా చైనా తన వీటో అధికారం వుపయోగించి శ్రీలంకను రక్షిస్తోంది. మార్చిలో ఆ తీర్మానం పునస్సమీక్షకు వస్తోంది. ఈసారి చైనా యిరుకున పెడితే? ఇలాటి చిక్కు వ్యవహారాలు చూడడానికి మైత్రీసేన యునైటెడ్ నేషన్స్‌లో అండర్ సెక్రటరీ జనరల్‌గా పనిచేసిన జయంత ధనపాలను విదేశాంగ వ్యవహారాల విషయంలో తనకు సలహాదారుగా నియమించుకున్నాడు.

రాజపక్ష, మైత్రీపాల, అతని వెనుక వున్న చంద్రిక అందరూ ఎస్ఎల్ఎఫ్ పార్టీకి చెందినవారే. రాజపక్ష యిన్నాళ్లూ పార్టీని తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. ఈ ఓటమి తర్వాత చంద్రిక, మైత్రీపాల పార్టీని రెండుగా చీల్చారు. నిర్మల్ శ్రీపాల వర్గం రాజపక్ష పార్టీ నాయకుడిగా ప్రకటిస్తే, శరత్ అమునుగామా వర్గం మైత్రీపాలను పార్టీ చైర్మన్‌గా ప్రకటించింది. తనకు యుపిఎఫ్ఏ కూటమిలోని 41 మంది ఎంపీల మద్దతు వుంది కాబట్టి తనే ప్రతిపక్ష నాయకుణ్నని రాజపక్ష ప్రకటించుకున్నాడు. కానీ 35 మంది ఎంపీలు మైత్రీసేన వైపు మళ్లారు. దాంతో రాజపక్ష బరిలో నుంచి తప్పుకుని మైత్రీసేనకు చైర్మన్‌గిరీ అప్పగించేశాడు. అతని సోదరుడు బాసిల్ పార్టీ నేషనల్ ఆర్గనైజర్ పదవికి రాజీనామా చేశాడు. ఇది యుఎన్‌పిని భయపెట్టింది. మైత్రీసేనను తమ నుంచి వేరు చేయడానికి రాజపక్ష వేస్తున్న పన్నాగం యిది అనుకున్నారు. ఆ భయాలు పారదోలడానికి మైత్రీపాల అవినీతి నిర్మూలనకై కమిషన్ వేసి దాన్ని వామపక్షాల ఆధ్వర్యంలో పెట్టి రాజపక్ష, బాసిల్, కొడుకు నామల్‌లపై వచ్చిన ఆరోపణలను విచారించమన్నాడు. బాసిల్, అతని భార్య తమ అమెరికన్ సిటిజన్‌షిప్ అడ్డం పెట్టుకుని జనవరి 11న అమెరికా పారిపోయారు.

అవినీతి ఆరోపణలు చేసినంత సులభం కాదు, వాటిని నిరూపించడం. ఆ పనులు చేసినవారు అదను చూసి పాలకపక్షంలో చేరిపోతారు, యిక విచారణ కుంటుపడుతుంది. యంత్రాంగం మారదు కాబట్టి వారు ఆధారాలను నాశనం చేస్తారు, ఫైళ్లు దొరకవు. మరీ దూకుడుగా వెళితే 'కక్షసాధింపు చర్య' అనుకుని ప్రజలు అవతలివాడిపై సానుభూతి కురిపిస్తారన్న భయం ఒకటి. మన దేశంలోనే, మన రాష్ట్రాలలోనే యివన్నీ ఎన్నాళ్లగానో చూస్తున్నాం. ప్రతిపక్షంలో వుండగా స్విస్ బ్యాంకుల నుండి బ్లాక్‌మనీ తెప్పించి పౌరులందరి ఖాతాల్లో జమ చేస్తానని బీరాలు పలికిన వారే అధికారంలోకి రాగానే 'అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించలేం కదా, వారు సమాచారం యివ్వకపోతే మనం ఏం చేయగలం?' అంటూ సంజాయిషీలు చెప్తారు. నేరం చేసినట్లు ఆధారం వుంటే చూపండి, బ్యాంకు ఖాతా వివరాలు యిస్తాం అంటారు స్విస్ అధికారులు. మీరు ఖాతాలో ఎంత వుందో చెప్తే దాన్ని బట్టి నేరం జరిగినట్లు మేం కేసు అల్లుకుంటాం అంటారు మనవాళ్లు. పెళ్లి ముందా? పిచ్చికుదరడం ముందా? ప్రతిపక్షంలో వుండగా యిలాటి ఆలోచనలు రావు పాపం. గద్దె కెక్కాకనే కళ్లు విచ్చుకుంటాయి. చైనాకు అప్పగించిన భారీ ప్రాజెక్టులలో రాజపక్ష కమిషన్ తీసుకున్నాడని ఇచ్చినవాళ్లు చెప్తారా? పుచ్చుకున్నవాళ్లు చెప్తారా? అనుమానంతో ప్రాజెక్టు ఆపేస్తే ప్రజలు డబ్బులు మిగిలాయని సంతోషిస్తారా? దాని ఫైనాన్షియల్ వయబిలిటీ వారికి పట్టదు. తమ వూళ్లో పెద్ద రోడ్లు, వంతెనలు, హాళ్లు వచ్చాయా లేదా అవే చూస్తారు. వాటిని అర్థాంతరంగా ఆపేసిన వాళ్లను శత్రువులుగా భావిస్తారు.

రాజపక్షపై అవినీతి కంటె పెద్ద ఆరోపణను ముందుగా విచారిస్తున్నారు – తను ఓడిపోతున్నాడని గ్రహించిన రాజపక్ష జనవరి 9 న సైన్యం సహాయంతో ఓట్ల లెక్కింపును భగ్నం చేసి శాంతిభద్రతలకు విఘాతం కలిగిందన్న సాకుతో ఎమర్జన్సీ విధిద్దామనుకున్నాడని, దానికి అతని సహచరులు కొందరు సహకరించారని ఆ ఆరోపణ. సైన్యాధికారులను పిలిచి ఆ దిశగా మాట్లాడాడని వాళ్లు నిరాకరించడంతో విధిలేక తప్పుకున్నాడని కొత్తగా విదేశాంగ మంత్రి అయిన మంగళ సమరవీర కొలంబో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అటార్నీ జనరల్ యీ ఫిర్యాదుపై స్పందించి, రాజపక్ష, అతని సోదరుడు గోటబయ, చీఫ్ జస్టిస్‌గా వున్న మోహన్, ఫారిన్

సెక్రటరీగా వున్న జి ఎల్ పెయిరిస్ యిత్యాదులపై కేసు పెట్టి విచారణకు ఆదేశించాడు. ఈ ఆరోపణను రుజువు చేయలేకపోతే రాజపక్షపై అనవసరంగా జాలి పెరుగుతుంది. రాజపక్ష కుటిల రాజకీయాలు నడపడంలో దిట్ట. ఇప్పటికే అతను తను జాతీయవాదినని, శ్రీలంకను ఐక్యంగా వుంచడానికి కృషి చేస్తే మైనారిటీలు, తమిళులు పగబట్టి విదేశీ శక్తుల సహాయంతో తనను ఓడించారని చెప్పుకుంటున్నాడు. సింహళీయులకు యీ మాటలు తలకెక్కుతున్నాయి కూడా. ఏప్రిల్‌లో రాబోయే పార్లమెంటు ఎన్నికలలో అతను యుఎన్‌పికి చెందిన రానిల్‌పై పోటీ చేస్తే యుఎన్‌పి అంటే దశాబ్దాలుగా మండిపడే ఎస్‌ఎల్‌ఎఫ్ పార్టీ వారందరూ – మైత్రీసేన వర్గంలో వున్నవారు కూడా – సమర్థించవచ్చు. 2005 అధ్యక్ష ఎన్నికలలో రాజపక్ష రానిల్‌ను 2 లక్షల మార్జిన్‌తో ఓడించాడు. ప్రస్తుతం ప్రధాని చేతిలో పెద్దగా అధికారాలు లేవు, అన్నీ అధ్యక్షుడి చేతిలోనే వున్నాయి. అయితే మైత్రీసేన తన అధికారాలు కుదించుకుంటా నంటున్నాడు. ఎన్నికలకు ముందు అంత సాహసం చేస్తాడా? రాజపక్ష ప్రధాని అయినా అలా చేస్తాడా? అని పలు సందేహాలు. చేయకుండా వుంటే యితనూ ప్రజాస్వామ్యవాది కాదన్న మాట పడతాడు.

మైత్రీసేనకు ఎన్నికలలో భారత గూఢచారి సంస్థ 'రా' సహాయం చేసిందన్న సందేహాలు అంతర్జాతీయ సమాజంలో వున్నాయి. అధ్యక్షుడిగా ఎన్నిక కాగానే మైత్రీపాల నాలుగురోజుల పర్యటనపై ఇండియాకు రావడం వలన అవి మరింత బలపడతాయి. ఇండియాకు వచ్చి సివిల్ న్యూక్లియార్ కోఆపరేషన్ గురించి ఒక ఒప్పందం చేసుకున్నారు. రక్షణ, భద్రత విషయాలలో తమకున్న అనుబంధాన్ని మరింతగా విస్తరించాలని నిర్ణయించారు. ఈ న్యూక్లియార్ ఒప్పందానికి అమెరికా ఏమీ అభ్యంతరం చెప్పలేదు. శ్రీలంక–భారత్ స్నేహం గురించి ఆందోళన చెందవలసిన చైనా కూడా చాలా గడుసుగా వ్యవహరించింది. ఈ నెలాఖరులోనే శ్రీలంక విదేశ వ్యవహారాల మంత్రి మంగళ సమరవీర, మార్చి నెల చివరిలో మైత్రీపాల చైనాకు వెళుతున్నారు. దానికి భూమిక ఏర్పరచడానికి చైనా 'చైనా–శ్రీలంక–భారత్‌ల మధ్య త్రైపాక్షిక భాగస్వామ్యం ఏర్పడాల'ని ఆకాంక్షిస్తూ ప్రకటన విడుదల చేసింది. పాశ్చాత్య దేశాలకు తమ ఎగుమతులు పెంచుకోవడానికి హిందూ మహాసముద్రంలో మారిటమ్ సిల్క్ రూట్ అని చైనా ప్లాన్ చేస్తోంది. దక్షిణాసియాలో ఇండియా, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ ముఖ్యమైన భాగస్వాములు. ముఖ్యంగా శ్రీలంక – ఎందుకంటే నడిదారిలో సరుకులు ఒక ఓడ నుంచి మరొక ఓడకు మార్చుకునే ట్రాన్స్‌షిప్‌మెంట్ సెంటర్‌గా శ్రీలంకయే ఉపయోగపడుతుంది. శ్రీలంకతో వైరం తెచ్చుకుంటే యీ ప్లానంతా చెడుతుంది. పైగా తాము యిప్పటికే అక్కడ చాలా పెట్టుబడులు పెట్టి వున్నారు. మైత్రీసేన భారత పర్యటన చైనా–భారత్‌ల మధ్య వైషమ్యానికి, స్పర్ధకు దారి తీయకుండా పరస్పర సహకారానికి దారి తీస్తే అంతకంటె ఆనందించవలసిన విషయం మరొకటి లేదు. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 25–27 వీక్లీకై**

**ఎమ్బీయస్ : విలోకనం – 01**

**ఎమ్బీయస్ : ఢిల్లీ ఎన్నికల పాఠాలు**

బిజెపి తలకెక్కిన 'నషా' (నరేంద్ర–అమిత్ షా జోడీలో మొదటి, చివరి అక్షరాల కూర్పు)ను దించేసిన ఢిల్లీ ఓటరు ఎందుకలా చేశాడన్నదానిపై అన్ని పార్టీల, పత్రికల విశ్లేషణ కొనసాగుతూనే వుంది. బిజెపి ఓటుబ్యాంకు మరీ అంత ఘోరంగా దెబ్బ తినలేదు, కానీ సీట్లు చూస్తే ఘోరాతిఘోరంగా వచ్చాయి. అంటే అన్ని నియోజకవర్గాలలోను ఆప్ ముందంజలో వుందన్నమాట. ఎందుకలా? పరికించి చూస్తే అమిత్ మైక్రో మేనేజ్‌మెంట్ పిరమిడ్ స్ట్రక్చర్‌లో లోపం ఏమీ లేదు. ఢిల్లీలో వున్న 70 అసెంబ్లీ స్థానాలను ఏడు పార్లమెంటు స్థానాల యూనిట్లుగా విభజించుకున్నారు. ఒక్కో యూనిట్‌కు ఒక్కొక్క ఆరెస్సెస్ ప్రచారక్‌ను నియమించారు. విష్ణు దత్ శర్మకు మాత్రం రెండు యూనిట్లు, అంతే 20 అసెంబ్లీ స్థానాలకు యిన్‌చార్జి చేశారు. ఆ విధంగా మొదటి దొంతరలో 6గురు ఆరెస్సెస్ ప్రచారకులున్నారు. రెండవ దొంతరలో 14 మంది కేంద్రమంత్రులు లేదా బిజెపి జాతీయ నాయకులకు అయిదేసి అసెంబ్లీ స్థానాలు అప్పగించారు. అంటే ఒక్కొక్కరు 5 స్థానాలను పర్యవేక్షించాలి. వాటిలో ఒకదాన్ని డైరక్టుగా చూసుకోవాలి. మూడవ దొంతరలో 57 మంది బిజెపి నాయకులున్నారు. వారు ఢిల్లీ వాసులు కాని బిజెపి పాలిత రాష్ట్రాలకు చెందిన మంత్రులు, కేంద్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు. వీరు తమకు నిర్దేశించిన అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోందో గమనిస్తూ స్థానిక నాయకుల మధ్య కోఆర్డినేట్ చేయాలి. 4 వ దొంతరలో వున్న 14 మంది సీనియర్ బిజెపి/ఆరెస్సెస్ ఫుల్‌టైమర్స్ వున్నారు. వారు తమకప్పగించిన 5 అసెంబ్లీ నియోజకవర్గాలలో బూత్ కమిటీల మధ్య సమన్వయం చూసుకోవాలి. 5 వ దొంతరలో 80 మంది బిజెపి/ఆరెస్సెస్ ఫుల్‌టైమర్లను ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో సీనియర్లకు, కార్యకర్తలకు అనుసంధానకర్తలుగా నియమించారు. వీళ్లందరూ ఢిల్లీకి సంబంధించనివారే. వీరు కాకుండా కార్యకర్తలుగా పనిచేయడానికి వేలాదిమంది ఆరెస్సెస్/బిజెపి కార్యకర్తలను ఢిల్లీ బయటినుంచి దింపారని అందరికీ తెలుసు. అమిత్ తక్కిన ఎన్నికలలో ఎంత పక్కాగా వున్నారో, వీటిల్లోనూ అంతే పటిష్టమైన ప్రణాళికలు రచించి, అమలు చేశారు. ఇంతకు మించి ఎవరు మాత్రం ఏం చేయగలరు? మరెందుకీ అపజయం?

మహారాష్ట్ర, హరియాణాలలో మోదీ అక్కడ వున్న ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసి ఓట్లు సంపాదించారు. కానీ ఢిల్లీకి వస్తే అక్కడ తనదే ప్రభుత్వం, ఏడాదిగా కేంద్రం చేతిలోనే వుంది. అక్కడి లోటుపాట్లకు ప్రధానిగా అతనే బాధ్యుడు. ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలు దాటవేసిన కొద్దీ ఆప్‌కు బెంగ పెరిగింది. మోదీ వంటి చాణక్యుడు వాయిదా వేస్తున్నాడంటే దానికి ఏదో ఒక కారణం

వుండే వుంటుందనుకుని ఆప్ నాయకత్వం భయపడింది. జులైలో అంతర్గతంగా ఒక సర్వే నిర్వహించింది. తమకు 33% ఓట్లు వస్తే తమ కంటె బిజెపికి 13% ఓట్లు ఎక్కువ వస్తాయని తెలిసింది. సెప్టెంబరు నాటికి మోదీ అంతర్జాతీయంగా అనేక సభల్లో పాల్గొని ఒక వెలుగు వెలుగుతున్నారు. అప్పుడు తమ గతి ఎలా వుందా అని యింకో సర్వే నిర్వహించి చూసుకుంటే 16% వెనకబడినట్లు తెలిసింది. అంతలో వారికి యింకో విషయం తెలిసింది – 'ఢిల్లీలో బిజెపి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనబడుతున్నా మోదీ ఎందుకు తాత్సారం చేస్తున్నట్లు, తమను అధికారం నుంచి దూరంగా వుంచి అతనేం సాధిస్తున్నట్లు?' అని బిజెపి ఢిల్లీ యూనిట్‌లో రుసరుసలు వున్నాయని! మోదీ ఎప్పటికీ అజేయుడిగానే వుండలేడని వాళ్లకు ఆశ కలిగింది. గతంలో కాంగ్రెసును, బిజెపిని విమర్శించి అధికారంలోకి వచ్చాం. ఇప్పుడు పాజిటివ్ ఓటుతో గెలవాలి అనుకుని పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టి వీధివీధుల్లో కమిటీలు ఏర్పరచి 30 వేల మంది కార్యకర్తలను తయారుచేసుకున్నారు. ఆప్ గెలుస్తుందన్న భయంతోనే బిజెపి ఎన్నికలు వాయిదా వేస్తోందని వారికి నమ్మకం కలిగించడానికి బిజెపిని ఛాలెంజ్ చేస్తూ 'చునావ్ కరో' (ఎన్నికలు పెట్టండి) అనే ఆందోళన మొదలుపెట్టారు. ఆప్ వాళ్లు యింకో విషయం గమనించారు – బిజెపి కార్యకర్తల అసంతృప్తి అధినాయకత్వానికి చేరటం లేదు. ఇప్పుడు బిజెపిలో నాయకత్వం యిద్దరి చేతుల్లో కేంద్రీకృతమైంది. వారు మామూలు కార్యకర్తలతో సంప్రదింపులు జరపడం లేదు. ఎప్పుడు చూసినా ట్వీట్‌లు, మెసేజ్‌లు – అంతా ఒన్‌సైడ్ వ్యవహారం. కమ్యూనికేషన్ లేదు. దానికి విరుద్ధంగా తాము అందరి కష్టసుఖాలు తెలుసుకుంటాం అనే అభిప్రాయం కలిగించడానికి "ఢిల్లీ డైలాగ్" అనే కార్యక్రమం చేపట్టాడు. సందుల్లో కూడా తిరిగి సామాన్యులు ఏకరువు పెట్టే బాధలను వినడం మొదలుపెట్టారు. ఈ చర్యల వలన ఆప్ కార్యకర్తలు బిజీ అయిపోయారు, బిజెపి వారు చేష్టలుడిగి చూస్తూ కూర్చున్నారు. వారి అధినాయకత్వం కదలలేదు మరి.

తర్వాతి స్టెప్‌గా అరవింద్ అప్పుడే ఎన్నికలు వచ్చేస్తున్నట్లు, తనూ ఢిల్లీ బిజెపి అధ్యక్షుడు జగదీశ్ ముఖీ ముఖ్యమంత్రి పదవికై పోటీ పడుతున్నట్లు ఒక భ్రమ కల్పించాడు. ఆటోల వెనక్కాల పోస్టర్లు వెలిశాయి – 'మీలో ఎవరు కావాలి మీకు? అరవిందా? జగదీశా?' అంటూ. అరవింద్‌కు వున్నంత గ్లామర్ జగదీశ్‌కు లేదని అందరికీ తెలుసు. ఈ కార్యక్రమాల కారణంగా డిసెంబరు నాటికి ఆప్‌కి ప్రజాదరణ పెరిగింది. ఈ సారి సర్వేలో బిజెపి కంటె 3% ఓట్లు ఎక్కువ వచ్చాయని తేలింది. ఈ ఫలితాలను బిజెపివారికి చేరేట్లా చూశారు ఆప్‌వారు. అరవింద్–జగదీశ్ పోలిక కారణంగా ఎన్నికలు యింకా ఆలస్యం చేస్తే యీ 3% తేడా రెట్టింపై ఆప్ గెలిచేస్తుందేమోనని అమిత్ భయపడి ఎన్నికలు ప్రకటింపచేసి, అరవింద్‌కు పోటీగా ముందు మోదీని దింపి 12 ర్యాలీలు ప్లాన్ చేశారు. మొదటిది ఫ్లాప్ కావడంతో భయపడి కిరణ్ బేదీని తెచ్చారు. కిరణ్ రాగానే ఆప్ ఆటోల వెనక్కాల పోస్టర్లు మార్చింది. 'నిజాయితీపరుడు కావాలా? అవకాశవాది కావాలా?' అంటూ! ఇంకో సర్వే చేసి చూసుకుంటే తాము బిజెపి కంటె 5% ముందు వున్నట్లు తెలిసింది. ఈ దశలో బిజెపి చాలా తెలివితక్కువగా అరవింద్‌పై నెగటివ్ కాంపెయిన్ మొదలుపెట్టింది – పలాయనవాది, మావోయిస్టు, ఉపద్రవ గోత్రీకుడు, అడవుల్లో వుండవలసినవాడు అంటూ! వెంటనే అరవింద్ కిరణ్‌ను అవకాశవాది అని కూడా అనడం మానేసి, ఆ పోస్టర్లు తీయించేశాడు. చాలా బుద్ధిమంతుడిలా ఎవర్నీ ఏమీ అనకుండా వుండడంతో జనాలు అతని పట్ల జాలి పడ్డారు. తన వ్యాగన్–ఆర్‌లోనే తిరిగేవాడు. ఆవేశపూరిత ఉపన్యాసాలు యివ్వకుండా తాపీగా వివరించే ప్రసంగాలు చేశాడు. మఫ్లర్ కట్టుకుని, యింటిపక్క మనిషిలా కనబడ్డాడు. 49 రోజుల పాలన తర్వాత పారిపోవడం గురించి అరవింద్ చాలా సంజాయిషీయే యిచ్చుకోవలసినది – 'నేను పొరపాటు చేశాను, నేరం చేయలేదు' అని ప్రజలకు చెప్పుకున్నాడు. మీడియాతో 'నా పాలనాకాలంలో ధరలు తగ్గించాను, అవినీతికి పాల్పడలేదు, అందువలన ప్రజలు నాపై కోపంగా లేరు' అని వాదించాడు. 'అరకొరగా సీట్లు యిస్తే తక్కినవాళ్లు చెప్పినట్లు ఆడాలి, పూర్తి మెజారిటీ యిచ్చి చూడండి, ఐదేళ్లు పాలిస్తా' అంటూ 'పాంచ్‌సాల్, కేజ్రీవాల్' అనే స్లోగన్ కాయిన్ చేశారు. ఆప్‌కు మద్దతుగా మేరఠ్, భువనేశ్వర్, ముంబయి, బెంగుళూరుల నుండి 10 వేలమంది వాలంటీర్లు వచ్చారు.

బిజెపి తరఫు నుండి జరిగిన పొరపాట్లలో 25 మంది ఫిరాయింపుదార్లకి టిక్కెట్లు యివ్వడం ఒకటి. రిపబ్లిక్ పెరేడ్‌కి ఒబామాను తెచ్చి 'బరాక్ బరాక్' అని పిలిస్తే ఢిల్లీ ఓటరు మురిసి ముక్కలవుతాడని అనుకోవడం మరొకటి. ఆ ఫంక్షన్‌కు అరవింద్‌ను, షీలా దీక్షిత్‌ను పిలవకపోవడం అహంకారానికి పరాకాష్టగా ఓటర్లు ఫీలయ్యారు. ముందువరుసలో కూర్చున్న కిరణ్ 'ఆహ్వానం కావాలంటే అరవింద్ బిజెపిలో చేరాలి' అనడం ప్రజలను భగ్గుమనిపించింది. మతప్రచారం తక్కువ, రాజకీయప్రచారం ఎక్కువ అయిన షాహీ ఇమామ్ బుఖారీ అరవింద్‌కు ఓటేయమని యిచ్చిన పిలుపును ప్రస్తావిస్తూ బిజెపి ఆప్‌ను హిందూ వ్యతిరేకిగా చిత్రీకరించడం మరో తెలివితక్కువ పని. ఇదంతా బిజెపి కుట్రలో భాగం అంటూ అరవింద్ బుఖారీ మద్దతును తిరస్కరించి, వాళ్లను యిబ్బందుల్లోకి నెట్టాడు. బహుశా ఏ రాజకీయవేత్తా మతనాయకుడి మద్దతును తిరస్కరించడేమో. కానీ అరవింద్ అలా చేయడం చేతనే కాబోలు అతనికి ముస్లిము ఓట్లలో 77%, సిఖ్ ఓట్లలో 57% పడ్డాయి. ఆప్‌కు వచ్చిన విరాళాల గురించి అల్లరి చేయబోతే 'దమ్ముంటే అరెస్టు చేయ్' అని అరవింద్ అరుణ్ జైట్లీకి సవాల్ విసిరాడు. విచారణ జరిపించమని తనే కోరాడు. 'విచారణ జరిపించామని, ఆరోపణలు అబద్ధమని తేలాయని' కేంద్రం కోర్టుకి విన్నవించిందని తాజా వార్త. అంటే యిది ఎన్నికల కోసమే బిజెపి ఆడిన నాటకమని తేటతెల్లమైనట్లే కదా!

ఇండియా టుడేవారు ఏ వర్గం ఎటు ఓటు వేసిందో తెలుసుకోవడానికి పోలింగ్ తేదీన ప్రత్యేకమైన సర్వే నిర్వహించారు. 24 అసెంబ్లీ నియోజకవర్గాలలో 120 లొకేషన్లలో 2060 మందిని యింటర్వ్యూ చేసి ఫలితాలు క్రోడీకరించారు. సర్వే శాంపుల్ తక్కువగానే

వున్నా వారి శాంప్లింగ్ మెథడ్ వాస్తవాలను ప్రతిబింబించిందని వారు చెప్పుకున్నారు. దళితులు 16.2% మంది ఓటేసి వుంటారని వీరు లెక్క వేస్తే వాస్తవానికి 16.8% మంది వేశారట. ఆప్‌కు 54.8% ఓట్లు వస్తాయని వీరు అంచనా వేస్తే వాస్తవానికి 54.3% వచ్చాయిట. ఇంతకీ వీరు చెప్పే వర్గీకరణ ప్రకారం మగవాళ్లలో 55% ఆప్‌కు, 33% బిజెపికి ఓటేస్తే ఆడవాళ్లలో 52% ఆప్‌కు, 35% బిజెపికి వేశారు. పేదవాళ్లలో 65% ఆప్‌కు, 22% బిజెపికి, దిగువ మధ్యతరగతివారు 56% ఆప్‌కు, 30% బిజెపికి, మధ్యతరగతివారు 50% ఆప్‌కు, 36% బిజెపికి వేయగా ఎగువ మధ్యతరగతి/ధని వర్గాలవారు 46% ఆప్‌కు, 44% బిజెపికి వేశారు. ఈ వర్గాలవారిలో కాంగ్రెసుకు 6% మంది వేశారు, మధ్యతరగతివారిలో 12% మంది వేశారు. ఇక తక్కిన వర్గాలలో వారి ఓటు శాతం 9–10 వుంది. దీనర్థం ధనికవర్గాలు బిజెపిని ఎక్కువగా ఆదరించగా, పేదవర్గాలు ఆప్‌ను ఎక్కువగా ఆదరించాయి. ఇక వయసు ప్రకారం చూస్తే 25 సంఎఎల లోపువారిలో 56% ఆప్‌కు, 31% బిజెపికి, 26–35 గ్రూపులో 59% ఆప్‌కు, 32% బిజెపికి, 36–43 గ్రూపులో 53% ఆప్‌కు, 35% బిజెపికి, 46–55 గ్రూపులో 49% ఆప్‌కు, 35% బిజెపికి, 56 ప్లస్ గ్రూపులో 45% ఆప్‌కు, 38% బిజెపికి వేశారు. ఈ చివరి గ్రూపులో కాంగ్రెసుకు 15% మంది వేశారు. తక్కిన గ్రూపుల్లో 6–10% మంది ఓట్లు వేశారు.

బిజెపికి మొదటినుండీ వ్యాపారస్తుల, అగ్రవర్ణాల పార్టీగా పేరుంది. ఢిల్లీలో అయితే పంజాబీల పార్టీగా కూడా అనుకుంటారు. పార్లమెంటు ఎన్నికలలో మోదీ చాయ్‌వాలా యిమేజి చూసి పేదలు కూడా ఓట్లేశారు. బిజెపి కూడా యుపిఏ తరహా కార్పోరేట్ ఫ్రెండ్లీ ఆర్థికవిధానాలే కొనసాగించడంతో క్రమేపీ మోదీ అంటే పేదలకు మోజు తగ్గింది. పార్లమెంటు ఎన్నికలు జరగగానే అసెంబ్లీ ఎన్నికలు జరిపించి వుంటే తమకు యీ అపజయం తప్పేదని వెంకయ్యానాయుడు అంటున్నారు. 8 నెలలు గడిచేసరికి ప్రభుత్వవిధానాలు అందరికీ అర్థమై పోయాయి. ఇదే ఏడాది చివర్లో జరగబోయే బిహార్ ఎన్నికలలో మోదీ మ్యాజిక్ ఏ మేరకు పనిచేస్తుందో ఢిల్లీలో ఒక సంకేతం లభించింది. పేదరాష్ట్రాలైన బిహార్, యుపిల నుండి ఢిల్లీలో స్థిరపడినవారిని పూర్వాంచలీలంటారు. వారు ఓటర్లలో 20–25% మంది వుంటారు. బిజెపి వారిలో అభ్యర్థులలో 4గురు మాత్రమే పూర్వాంచలీలు కాగా, ఆప్ 12 మందిని నిలబెట్టి వారి ఓట్లను కొల్లగొట్టింది. ఢిల్లీ ఎన్నికలో పార్టీ నిర్వహణలో లోపం లేకపోయినా మోదీ మ్యాజిక్ పనిచేయలేదని అర్థమైంది. మోదీ హవా యింకా నడుస్తోందని జనాల్ని నమ్మించాలని చూస్తున్న పార్టీకి యీ వైఫల్యాన్ని ఎలా కప్పిపుచ్చుకోవాలో తెలియలేదు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల ఫలితాలు రాగానే అనేకమంది బిజెపి నాయకులు కెమెరాలకు ముందుకు వచ్చి యిదంతా మోదీ విజయమే అని ఉపన్యాసాలు దంచారు. బిజెపి పార్లమెంటరీ బోర్డు సమావేశమై ఆ ఘనతను మోదీకి కట్టబెడుతూ ఒక తీర్మానం కూడా చేసింది.

ఢిల్లీ ఎన్నికల ఫలితాలు వెలువడుతూ వుంటే బిజెపి హెడ్‌క్వార్టర్స్‌కు ఒకే ఒక్క మంత్రి – ప్రకాశ్ జావడేకర్ వచ్చారు. ఫలితాలు పూర్తిగా రానీయండి అని చెప్పి వెళ్లిపోయారు. ఆ తర్వాత మురళీధరరావు, షా నవాజ్ హుస్సేన్, శంభిత్ పాత్రా, జివిఎల్ నరసింహారావు టీవీ చర్చలకు వచ్చారు. వారికి అప్పగించిన పని – అపజయానికి, మోదీకి కించిత్తు కూడా సంబంధం లేదని వాదించడం! ఇంకాస్సేపటికి బిజెపి సీట్ల సంఖ్య సింగిల్ డిజిట్‌లో ఆగిపోతుందని తెలిసింది. ఇక బిజెపి జనరల్ సెక్రటరీ రామ్ లాల్ కొందరు నాయకులతో కలిసి కూర్చుని చర్చించి 'బిజెపికి ఓట్ల శాతం కొద్దిగానే తగ్గింది' అనే వాదనను ముందుకు తెస్తూ గత ఎసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చెప్పారు. పార్లమెంటు ఎన్నికలతో పోలిస్తే దారుణంగా పడిపోయిందన్న విషయం ప్రస్తావించలేదు. ఆ తర్వాత కొందరు మేధావులు ఢిల్లీ ఎన్నికలలో బిజెపి కావాలనే ఓడిపోయిందనే వింత వాదన, ఆరెస్సెస్ సహకరించలేదు కానీ లేకపోతేనా.. అమ్మో అంటూ యింకో వాదన యివన్నీ ప్రచారం చేశారు. ఓడిపోవాలనుకునేవారు పత్రికలలో 120 యాడ్స్ యివ్వరు, చతురంగ బలాలను మోహరించరు. జరిగింది జరిగిపోయింది. జరగాల్సినది ఏమిటి అన్నదే ముఖ్యమైన ప్రశ్న. హిందూత్వ ప్రచారం తమకు నష్టం కలిగిస్తోందని గ్రహించిన మోదీ మతపరమైన దాడులు సహించం అంటూ గట్టిగా మాట్లాడారు. అలాగే భూసేకరణ చట్టానికి మార్పులు తెస్తూ చేసిన ఆర్డినెన్సును చట్టరూపంలో తెచ్చేటప్పుడు కొన్ని మార్పులు కూడా చేయవచ్చు. తాము పేదలకు మేలు చేస్తున్నామని చూపించుకోకపోతే ఆ వర్గాలు తమకు పూర్తిగా దూరమవుతాయనే భయం కలగడం సహజం కాబట్టి యీ సారి బజెట్‌లో పెట్టుబడిదారీ విధానాలు తగ్గించుకోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

### ఎమ్బీయస్ : సూత్రధారి కాబోయిన పాత్రధారి

బిహార్ ముఖ్యమంత్రి మాంఝీ విశ్వాసతీర్మానం జోలికి పోకుండానే రాజీనామా సమర్పించేశారు. ఇలాటి బలహీనుడికి బిజెపి తన మద్దతు ప్రకటించి పప్పులో కాలేసిందా? పరిశీలిస్తే చాలా విషయాలు తెలుస్తాయి. బిహార్‌లో కులరాజకీయాలు ప్రాధాన్యత వహిస్తాయని అందరికీ తెలుసు. జనాభాలో 14% వున్న యాదవులు లాలూ ఎన్ని కుంభకోణాల్లో యిరుక్కున్నా సరే అతనికే మద్దతు యిస్తున్నారు. 22 కులాల దళితులు పాశ్వాన్ కులానికి చెందిన రామ్ విలాస్ పాశ్వాన్‌కు మద్దతిస్తున్నారు. నితీశ్ కూర్మీ కులానికి చెందినవాడు. వారి జనాభా 3% మాత్రమే. అందుకే కొంతకాలం లాలూతో, మరి కొంతకాలం బిజెపితో అంటకాగుతూ బండి లాక్కుని వస్తున్నాడు. తను అధికారంలోకి వచ్చాక 2007లో దళితులను పాశ్వాన్‌లు–యితరులుగా విడగొట్టడానికి జనాభాలో 15% వున్న 21 కులాలకు విడిగా మహాదళితులనే గుర్తింపు యిచ్చి పాశ్వాన్ బలం తగ్గించాడు. ఆ వర్గానికి చెందిన మాంఝీకి ప్రాధాన్యత

యిచ్చాడు. ప్రభుత్వ పథకాలు వారికి అందేట్లు చేశాడు. బిజెపిలో ఉదారవాద నాయకత్వం వున్నంతకాలం నితీశ్‌కి దిలాసాగానే వున్నాడు – తనను బలపరిచే ముస్లిములు తనతోనే వుంటారని. కానీ ఎప్పుడైతే మోదీ బిజెపిని హస్తగతం చేసుకుని ప్రధాని అభ్యర్థిగా ముందుకు వచ్చాడో నితీశ్‌కు గత్యంతరం లేకపోయింది. మోదీ మొహం చూస్తే ముస్లిములు జెడియును కూడా దూరం పెట్టేస్తారని భయపడి, 2013 జూన్‌లో బిజెపితో తెగతెంపులు చేసుకున్నాడు. ఓడిపోయాడు. పార్లమెంటు ఎన్నికలలో వైఫల్యం తర్వాత నైతిక బాధ్యత వహిస్తూ తను దిగిపోయి చెప్పిన మాట వింటాడు కదాని మాంఝీని తన స్థానంలో కూర్చోబెట్టాడు. మాంఝీ ఆ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి చేతిలో డిపాజిట్ కూడా పోగొట్టుకున్నా కులం కారణంగా యీ పదవి దక్కింది. అయితే కొద్ది రోజుల్లోనే మాంఝీకి ఆశ పుట్టింది. తన కులానికి ఎక్కువ ఓట్లు వున్నపుడు తను నితీశ్ మాట వినవలసిన అవసరం ఏముంది, విడిగానే నాయకుడిగా ఎదగవచ్చు కదా అని. దళిత కార్డును విస్తారంగా వాడడం మొదలుపెట్టాడు. తన తర్వాత దళితుడే ముఖ్యమంత్రి కావాలని ప్రకటనలు చేయసాగాడు. శాసనసభ్యులందరికీ జీతాలు పెంచి వాళ్లను ఆకట్టుకున్నాడు. కానీ అధికారగణం అతన్ని సీరియస్‌గా తీసుకోలేదు. అతని జనతా దర్బార్‌లకు హాజరు కాలేదు. దాంతో ఆమె నితీశ్ సెలక్టు చేసిన అధికారులందరినీ వేరే చోట్లకు బదిలీ చేసేశాడు.

నితీశ్ అంటే మోదీ భగ్గుమంటాడని తెలుసు కాబట్టి మాంఝీ మోదీతో స్నేహం చేశాడు. అతని ప్రమాణస్వీకారానికి హాజరయ్యాడు. విడిగా కలవనారంభించాడు. ఇదంతా నితీశ్‌కు నచ్చలేదు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు తన క్యాడర్‌ను సిద్ధం చేయాలని సంపర్క్ యాత్ర అని పార్టీ తరఫున మొదలుపెడితే మాంఝీ వాటికి రాలేదు సరికదా, అదే సమయంలో వివాదాస్పద ప్రకటనలు చేసి, యాత్ర సఫలం కాకుండా చేశాడు. ఇతన్ని కొనసాగించిన కొద్దీ తమకు ఎప్పణ్నుంచో ఓట్లేస్తున్న వారందరూ దూరమవుతారని, యిటీవలే జట్టుకట్టిన లాలూని సమర్థించే యాదవులు కూడా వ్యతిరేకులవుతారనీ జెడియు నాయకులు శరద్ యాదవ్, నితీశ్‌లకు భయం పట్టుకుంది. నువ్వు దిగిపో, నీకు పార్టీలో మంచి పదవి యిస్తాం, మీ అబ్బాయికి మంత్రి పదవి యిస్తాం అని ఆశపెట్టారు. మాంఝీ లొంగలేదు. బిజెపి మద్దతుతో తను ముఖ్యమంత్రిగా కొనసాగగలననుకున్నాడు. ఆ విషయం తెలియగానే అప్పటిదాకా అతన్ని సమర్థించిన లాలూ వూరుకున్నాడు. మాంఝీ అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళదామనుకున్నాడు. తన వద్ద దళిత ఓట్లు వున్నాయని, బిసి నాయకుడు పప్పూ యాదవ్ తనకు మద్దతు యిస్తున్నాడు కాబట్టి బిసి ఓట్లు కూడా కలుస్తాయని, బిజెపి కారణంగా అగ్రవర్ణాల ఓట్లు కూడా చేరి తను ఎన్నికలలో నెగ్గడం ఖాయమని అతను అంచనా వేశాడు. రద్దు చేయడానికి కాబినెట్ సమావేశంలో అందరూ ఒప్పుకున్నారని బొంకాడు. కానీ వెంటనే మంత్రులు ఆ ప్రకటనతో విభేదించి, బయటకు వచ్చి నితీశ్‌తో చేరారు.

జెడియు పార్టీ చీలి అత్యధికులు తనను సమర్థించడంతో నితీశ్ వారిని, ఆర్‌జెడి, కాంగ్రెస్, సిపిఐ శాసనసభ్యులు 130 మందిని వెంటపెట్టుకుని రాష్ట్రపతి వద్దకు వెళ్లి 243 మంది వున్న శాసనసభలో తనకే బలం వుందని యావద్దేశానికి నిరూపించాడు. అయినా మాంఝీ వెనక్కి తగ్గలేదు. ఆర్‌జెడిని చీల్చబోయాడు. తన వద్ద 42 మంది జెడియు, 12 ఆర్‌జెడి సభ్యులున్నారని క్లెయిమ్ చేశాడు. అసెంబ్లీ ఏర్పాటు చేసి, తనకే బలం వుందని నిరూపించుకుంటా నన్నాడు. ఎందుకంటే బుధవారం నాడు బిజెపి సమావేశమై మాంఝీకి ఓటేయాలని తన 87 ఎమ్మెల్యేలకు విప్ జారీ చేసింది. పార్టీలో నితీశ్ బలం పెరగసాగింది. తనకు 128 ఎమ్మెల్యేల మద్దతు వుంది కాబట్టి తనను ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించాలని నితీశ్ స్పీకరును కోరాడు. ఆ అభ్యర్థనపై నిర్ణయించడానికి స్పీకరు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే బిజెపి వాకౌట్ చేసింది. అయినా స్పీకరు నితిశ్‌ను గుర్తించాడు. మాంఝీ పక్షాన 12 మంది ఎమ్మెల్యేలు మాత్రమే నిలిచారు. వారిలో నలుగురి సభ్యత్వాన్ని స్పీకరు రద్దు చేస్తే పట్నా హైకోర్టులో సింగిల్ బెంచ్ దాన్ని నిలిపింది. కానీ గురువారం నాడు డివిజన్ బెంచ్ విచారణ జరిపి ఆ తీర్పుపై స్టే యిచ్చింది. దాని కారణంగా యిప్పుడు ఆ నలుగురు ఓట్లేయలేరు. అందుచేత అతని పార్టీలో 8 మందే మిగిలారు. మాంఝీకి మద్దతిస్తే డబ్బిస్తానని, మంత్రిపదవి యిస్తానని పప్పూ యాదవ్ తనకు ఫోన్ చేశాడని ఆరోపిస్తూ నితీశ్ అనుచరుడు సాక్ష్యంగా ఆడియో క్లిప్పింగ్ విడుదల చేశాడు.

ఇవన్నీ తట్టుకోవడానికి తమకు 140 మంది మద్దతు వుందని చెప్పుకుంటున్న మాంఝీ ''దళిత చేతనా ర్యాలీ'' అని పట్నాలో ఓ కార్యక్రమం నిర్వహించి, తను చేస్తున్న అభివృద్ధి సహించలేక దళితేతరులు తనను కూలదోస్తున్నారని చెప్పుకున్నాడు. జెడియు పార్టీలోంచి తనను ఫిబ్రవరి 7 న బహిష్కరించగానే అతను రూ. 1 కోటి పరిమితిలోని ప్రభుత్వ కాంట్రాక్టులన్నిటిలో ఎస్సీ, ఎస్టీ కాంట్రాక్టర్లకే ప్రాధాన్యత యిస్తానని ప్రకటించాడు. అంతకుముందే ఎస్సీ, ఎస్టీ మహిళలకు పిజి వరకు ఉచిత విద్య కూడా ప్రకటించాడు. ఇవి చాలలేదనుకున్నాడేమో ఫిబ్రవరి 12 న 'ఐదెకరాల లోపు రైతులకు ఉచిత విద్యుత్ యిస్తా, నేను ముఖ్యమంత్రిగా కొనసాగితే దాన్ని 10 ఎకరాలు చేస్తా' అన్నాడు. గురువారం రాత్రి పొద్దుపోయేదాకా మాంఝీ వూగిసలాడుతూనే వున్నాడు. ఎలాగోలా గట్టెక్కేస్తే తర్వాతి సంగతి తర్వాత చూసుకోవచ్చనుకున్నాడు. తన ప్రధాని అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించి బిజెపి కూటమిలోనుంచి బయటకు వెళ్లిపోయిన నితీశ్‌కు బుద్ధి చెప్పాలన్న గట్టి పట్టుదలతో వున్న మోదీ బిజెపి చేత విప్ కూడా జారీ చేయించాడు కాబట్టి అంతా తన చేతిలోనే వుందనుకున్నాడు. కానీ ఏం జరిగిందో ఏమో శుక్రవారం ఉదయం అసెంబ్లీ ప్రారంభం కావడానికి ముందే గవర్నరు వద్దకు వెళ్లి రాజీనామా చేతిలో పెట్టాడ **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 28–30 వీక్లీకై**

**ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 86,**

**ఎమ్బీయస్ : చెడ్డకాపురానికి ముప్పేమిటి...?**

'చెడ్డకాపురానికి ముప్పేమిటి? చంద్రకాంత (ఒక పిండివంట)లొండు' అన్నాట్ట వెనకటికి మొగుడొకడు. కాంగ్రెసు పార్టీ మునిగిపోతోంది, కొందరు నాయకులు విడిచి వెళ్లిపోతున్నారు, దాన్ని రక్షించడానికి ఏదో ఒకటి చేయాలి, కనీసం రాహుల్‌కు బదులు ప్రియాంకాను తేవాలి అని చాలామంది వర్రీ అయిపోతున్నారు కానీ పార్టీ అధ్యక్షురాలు సోనియాకు ఆ చింతలేమీ లేవు. పోతున్నవాళ్లందరూ పార్టీనుంచి సకల ప్రయోజనాలు అనుభవించి, యిప్పుడు రాళ్లేసి పోతున్నారు. ఇలాటివాళ్లు ఎంతమంది వదిలితే అంతమంచిది, పార్టీని నమ్ముకుని వుండే కొత్త నాయకత్వమే చాలు అనుకుంటోందామె. అందుకే తాము చెప్పినమాట వినకపోతే పార్టీ ఫిరాయిస్తామని బెదిరించినా, రాహుల్‌ను మార్చమని సలహాలు వచ్చినా కిమ్మనకుండా వుంది. రాహుల్ నాయకత్వంపై విమర్శలు చేసి యిలా వెళ్లిపోతున్నపుడు, తన నాయకత్వంపై యిలాటి అసంతృప్తి రగులుతున్నపుడు మామూలుగా అయితే వారిని పిలిచి రాహుల్‌తో సమావేశం ఏర్పాటు చేసి వుండాలి. కానీ సోనియా యిటీవలి కాలంలో అది మానుకున్నారు. తన మాట నెగ్గించుకోవడానికి సీనియర్ నాయకులు యిదే తరుణమని భావిస్తున్నారని ఆమె అభిప్రాయం. 'పొండిరా పొండి, నా కాలం కర్మం కలిసొస్తేనే రండిరా రండి..' అనే పాట తనలో పాడుకుంటున్నారు. తనకు హితవు చెప్పడానికి వచ్చినవారితో "1998లో నేను యిలాటి యిబ్బందే పడ్డాను, యిప్పుడు రాహుల్ వంతు!" అని వేదాంతధోరణిలో మాట్లాడుతున్నారు.

ఓటమి సూచనలు కనబడిన దగ్గర్నుంచి గత 14 నెలల్లో సుమారుగా 12 మంది సీనియర్ నాయకులు పార్టీకి గుడ్‌బై చెప్పారు. వారిలో కొందరు - హరియాణా ముఖ్యమంత్రి హూడాకు వ్యతిరేకంగా 2013 సెప్టెంబరులో వెళ్లిపోయి బిజెపిలో చేరి ఎన్‌డిఏ మంత్రి అయిపోయిన రావు ఇందర్‌జిత్ సింగ్, అదే కారణంతో 2014 జులైలో వెళ్లిపోయి బిజెపిలో చేరిన చౌధరీ బీరేందర్ సింగ్, రాష్ట్రవిభజన నిర్ణయానికి వ్యతిరేకంగా ఫిబ్రవరి 2014లో వెళ్లిపోయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి, మార్చి 2014లో వెళ్లి బిజెపిలో చేరి ఎంపీ అయిపోయిన ఉత్తర్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగదంబికా పాల్, అదే నెలలో టిక్కెట్టు దక్కని కారణంగా బిజెపిలో చేరి ఎంపీగా గెలిచిన కల్నల్ సోనారామ్ చౌధరీ, అదే నెలలో అదే కారణంతో సమాజ్‌వాదీ పార్టీలోకి దూకిన మాజీ కేంద్రమంత్రి బూటా సింగ్, అదే నెలలో అదే కారణంతో పార్టీ విడిచిన మరో మాజీ కేంద్రమంత్రి జాఫర్ షరీఫ్ - వీళ్లంతా పార్లమెంటు ఎన్నికల ఫలితాలకు ముందు వెళ్లిపోయారు. ఫలితాలు వచ్చాక హై కమాండ్ తీరు విమర్శిస్తూ మాజీ కేంద్రమంత్రి జికె వాసన్ విడిపోయి, తన పాత పార్టీ తమిళ మానిల కాంగ్రెసును పునరుద్ధరించాడు. ఢిల్లీ ఎన్నికల సందర్భంగా మాజీ కేంద్రమంత్రి కృష్ణ తీరథ్ పార్టీ వదిలి బిజెపి అభ్యర్థిగా పోటీ చేశారు. అదే నెలలో కేంద్రమంత్రిగా వుండి, సోనియా కుటుంబానికి సన్నిహితురాలిగా పేరుబడిన జయంతీ నటరాజన్ బయటకు వచ్చేసి, కాంగ్రెస్ నాయకత్వాన్ని ఘాటుగా విమర్శించారు. ఇంకా ఏ పార్టీలోనూ చేరలేదు. వీరే కాకుండా యింకా కొంతమంది కూడా క్యూ కట్టి వున్నారని వినికిడి. ఆంధ్రలో అయితే బిజెపిలో, తెలంగాణలో అయితే తెరాసలో చేరే కాంగ్రెసువారి పేర్లు తరచుగా వినబడుతూనే వున్నాయి.

2013లో రాహుల్ నియమించిన పంజాబ్ యూనిట్ అధ్యక్షుడు ప్రతాప్ సింగ్ బాజ్వాను మార్చేయకపోతే తను పార్టీ మారిపోతానని మాజీ ముఖ్యమంత్రి కెప్టెన్ అమరీందర్ సింగ్ కబురుమీద కబురు పంపుతున్నా రాహుల్ బెసకటం లేదు. తమిళనాడుయూనిట్ అధ్యక్షుడిగా వున్న జికె వాసన్ వెళ్లిపోయి తన పాత పార్టీ పెట్టుకున్నాక చిదంబరం కూడా వెళ్లి ఆ పార్టీలో చేరతాడని అందరూ అనుకున్నారు. వాసన్ స్థానంలో రాహుల్ నియమించిన ఇలంగోవన్ 'ధైర్యముంటే పార్టీ విడిచిపొండి' అని చిదంబరాన్ని, అతని కొడుకు కార్తీక్‌ను బహిరంగంగా ఛాలెంజ్ చేశాడు. చిదంబరం రాహుల్ వద్దకు వచ్చి ఇలంగోవన్‌పై ఫిర్యాదు చేసినా అతనేమీ చర్య తీసుకోలేదు. సోనియా మందలించి వదిలేసింది. చిదంబరం అవమానాన్ని దిగమింగాల్సి వచ్చింది. హరియాణాలో హూడాకు వ్యతిరేకంగా పార్టీలో యితర నాయకులు వెళ్లిపోతున్నా అతన్ని బలపరుస్తూ వచ్చారు సోనియా-రాహుల్. మొన్న అసెంబ్లీ ఎన్నికలలో కేవలం 15 సీట్లు మాత్రమే గెలవడంతో హూడా హెూదా తగ్గించాలని భావించి, అతని వ్యతిరేకవర్గంలోని కిరణ్ చౌధురీని లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా నియమించారు. దీనికి హూడా అభ్యంతరం తెలిపినా పట్టించుకోలేదు. ఛత్తీస్‌గఢ్‌లో అజిత్ జోగీ రాజ్యమే యిన్నాళ్లూ నడిచింది. ఇప్పుడు రాహుల్ అతని ప్రత్యర్థి భూపేష్ బాఘేల్‌ను దువ్వుతున్నాడు, అజిత్ గోల పెడుతున్నా వినకుండా. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెసు అంటే తన సామంత రాజ్యమే అని భావించిన కమల్ నాథ్‌కు కూడా పిలక కోయడం జరిగింది. పార్లమెంటులో తనే సీనియర్ మోస్ట్ పార్టీ ఎంపీ కదా, తనకే పార్లమెంటరీ పార్టీ నాయకత్వం యిస్తారనుకుంటే యివ్వలేదు, మల్లికార్జున్ ఖర్గేకు యిచ్చారు. అసాంలో తరుణ్ గొగొయ్‌పై తిరుగుబాటు చేసి విఫలమై గత జులైలో మంత్రివర్గం నుండి తప్పుకున్న హిమాంత బిశ్వశర్మను బిజెపి తన పార్టీలోకి లాగుదామని చూస్తోందని గ్రహించిన రాహుల్ అతనితో యిప్పటికి మూడుసార్లు సమావేశమయ్యాడు కానీ, అతని గొంతెమ్మ కోర్కెలు తీర్చడానికి సిద్ధపడలేదు.

రాష్ట్రాలలో చాలాకాలంగా పాతుకుపోయిన పాత నాయకులకు సంస్థాగత ఎన్నికలు, యువతరం రావడం, కొత్తగా నాయకులు కావడం - యిలాటివి యిష్టం లేదు. తాము లేదా తమ పిల్లలే ఎల్లకాలం పార్టీని చేతిలో పెట్టుకుని, ఎన్నికలలో టిక్కెట్లు, నిధులు పొందుతూ వుండాలని వారి ఆలోచన. 2007లో రాహుల్ యూత్ కాంగ్రెస్‌లో ఎన్నికలు నిర్వహించి యువకులను తీసుకుని వచ్చాడు. వారంతా రాహుల్‌కు మాత్రమే విధేయులు. ఇప్పుడు మాతృసంస్థలో కూడా సంస్థాగతమైన ఎన్నికలు జరపాలని, ఎవరికి బలం వుంటే వారి మాట చెల్లాలని, వీరంతా తన మాట వింటారని రాహుల్ ఆలోచన. సోనియాకు కావలసినదీ అదే. తన

తదనంతరం పాతతరం నాయకులు రాహుల్‌పై తిరగబడితే ఒంటరివాడై పోతాడని బెంగ. అయితే కేరళ, బిహార్, బెంగాల్ తదితర రాష్ట్రాలలో వృద్ధతరం సంస్థాగత ఎన్నికలను, రాహుల్ నియమించినవారిని అడ్డుకుంటున్నారు. ఇలా అడ్డుకుంటున్నవారిని తరిమివేసి, పాతతరపు నాయకత్వపు బూజు దులిపేసి, కాంగ్రెసును మళ్లీ తృణమూలాల నుంచి పునర్నిర్మించాలని రాహుల్ ఆశ. డిసెంబరు 2014లో జరిగిన యూత్ కాంగ్రెసు సమావేశంలో అదే అతను చెప్పాడు. అతని ఆశలకు వూపిరి పోస్తున్నది రాజస్థాన్‌లో సచిన్ పైలట్ వంటి యువనాయకులు. అతన్ని మార్చి 2014లో రాజస్థాన్ యూనిట్ యిన్‌చార్జి చేసిన తర్వాత నలుగురు మాజీమంత్రులు, ఏడుగురు ఎమ్మెల్యేలతో సహా 70 మంది నాయకులు పార్టీలో మళ్లీ చేరారు. తమ పట్టు సడలకూడదని పాతతరం రాజీనామాలతో బెదిరిస్తూంటే, వీళ్లు ఎలాగోలా వెళ్లిపోతే యిప్పట్లో ఎన్నికలు లేనందున కొత్తవాళ్లను తెచ్చుకుని, నాయకులుగా దిద్దుకునే అవకాశం వస్తుందని రాహుల్ ప్రయత్నిస్తున్నాడు. ఇందిరా గాంధీ గతంలో యిలాగే చేసింది. సిండికేట్ పేరుతో పెత్తనం చలాయించిన వృద్ధతరాన్ని తరిమివేసి తనకు మాత్రమే విధేయులుగా వుండే కొత్త నాయకులను సృష్టించుకుంది. మరి ఇందిరకున్న నాయకత్వ లక్షణాలు రాహుల్‌కు వున్నాయా అనేదే ప్రశ్న! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : గుజరాత్ పోలీసులకు అచ్ఛే దిన్ – ప్రజాహక్కుల యోధులకు బురే దిన్

'మోదీ వచ్చాక కార్పోరేట్‌లకు అచ్చే దిన్ వచ్చాయి' అన్నారు అణ్నా హజారే. 'మాకూనూ..' అంటున్నారు ఇష్రత్ జహాన్ ఎన్‌కౌంటర్ కేసులో నిందితుడుగా సాబర్మతి జైల్లో వున్న గుజరాత్ మాజీ పోలీసు అధికారి డి జి వంజారా. వెన్నెల వుండగా కలువలు వికసిస్తాయి. సూర్యుడు రాగానే కలువలు ముడుచుకుంటాయి, కమలాలు విచ్చుకుంటాయి. యుపిఏ పాలన పోయి ఎన్‌డిఏ పాలన రాగానే ఎక్కడ బడితే అక్కడ కమలాలు విచ్చుకుంటున్నాయి. సిబిఐ తన ధోరణి మార్చుకోవడంతో మోదీ, అమిత్ షా యిరుక్కున్న కేసులన్నీ టపటపా ఎగిరిపోతున్నాయి. వారి ఆదేశాలు మన్నించిన వారు కేసుల్లోంచి బయటపడుతున్నారు. ఎన్‌కౌంటర్ కేసులో జైలుకి వెళ్లిన వంజారా నిరాశకు లోనై 2013లో రాజీనామా లేఖ రాస్తూ అమిత్ షా మోదీని తప్పుదోవ పట్టించాడని ఆరోపించాడు కూడా. 8 ఏళ్ల జైలువాసం తర్వాత బుధవారం ఆయనకు బెయిల్ వచ్చి, బయటకు వచ్చి 'అచ్ఛే దిన్ వచ్చాయని మోదీగారు అన్నది నిజం. నాకూ నా తోటి పోలీసు ఆఫీసర్లకు యిక మంచి రోజులే" అన్నాడు. మరి గతంలో రాసిన లేఖ మాటేమిటి అంటే 'నేను గతంలోనో, భవిష్యత్తులోనో జీవించను. నాకు వర్తమానం ముఖ్యం' అన్నాడు.

కమలాలు యిలా విచ్చుకుంటూ వుంటే కలువలు ముడుచుకోవాలిగా. వీళ్లపై కేసులు పెట్టిన వారు యిప్పుడు అవస్థల పాలవుతున్నారు. గుజరాత్ ప్రభుత్వం యిప్పుడు వాళ్ల పని పడుతోంది. అందరి కంటె వాళ్లకు కసి వున్నది ప్రజాహక్కుల కార్యకర్త తీస్తా సెతల్వాడ్‌పై! లాయర్ల కుటుంబం నుంచి వచ్చిన ఆమె "సిటిజన్స్ ఫర్ జస్టిస్ అండ్ పీస్" (సిజెపి) అనే స్వచ్ఛంద సంస్థ పెట్టి, 2002 గోధ్రా అల్లర్లపై, నకిలీ ఎన్‌కౌంటర్లపై నిరంతర పోరాటం జరిపి, బాధితుల గాథలను మీడియా ముందుకు తెచ్చి మోదీ, అమిత్‌లను చాలా యిబ్బందులకు గురి చేసింది. ఆమెను కట్టడి చేయడానికి ఆమెపై కేసులు పెట్టించారు వారు. బాధితులు కోర్టులో వేసిన రిట్ పిటిషన్లు యీమె వారికి చెప్పకుండా వేసిందని, వారు పాపం యీమె మాయమాటలకు లొంగిపోయి సంతకాలు పెట్టేశారని.. యిలా. గుజరాత్ అల్లర్లలో బాగా దెబ్బ తిన్న ప్రాంతం గుల్‌బార్గ్ సొసైటీ. అక్కడ 68 మంది చనిపోయారు. నిర్వాసితులైన వారు యిళ్లు కట్టుకోవడానికి సాయపడతామని చెప్పి ఆమె సంస్థ దేశవిదేశాల నుంచి విరాళాలు సేకరించి వాటిని దుర్వినియోగం చేసిందని కేసు పెట్టి ఆమెను వేధిస్తున్నారు.

కేసు పెట్టినవారెవరు? విరాళాలు యిచ్చిన దాతలు కారు. గుల్‌బర్గ్ సొసైటీలో గతంలో నివసించామని చెప్పుకున్న 12 మంది సభ్యులు. "చనిపోయినవారి స్మృతికై మ్యూజియం కడతామని, మా పేరు చెప్పి వసూలు చేసిన నిధులు సిజెపి దుర్వినియోగం చేసింది." అని 2013లో సొసైటీ లెటర్‌హెడ్‌పై ఫిర్యాదు చేసి లీగల్ నోటీసు పంపారు. అంతేకాదు, "ఆ సంస్థ సభ్యులను నిషేధించండి. వారిని మా కాలనీలో అడుగు పెట్టనీయకండి." అని కూడా చేర్చారు. ఇది చాలా తీవ్రమైన అభియోగం, దీనిపై విచారణ జరుపుతాం అని అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ ప్రకటించింది. ఆ లేఖ పంపిన 12 మందికి సొసైటీకి ఏ సంబంధం లేదని, వారు లెటర్‌హెడ్‌ను దొంగిలించి దురుపయోగం చేశారని సొసైటీ చైర్మన్, సెక్రటరీ పోలీసు కమిషనర్‌కు, క్రైమ్ బ్రాంచ్‌కు 2013 మార్చిలో లేఖలు రాశారు. మ్యూజియం కోసం తాము నిధులు వసూలు చేయలేదని సిజెపి మీడియాకు స్పష్టం చేసింది. సబ్‌రంగ్ ట్రస్టుకు ఆ వుద్దేశం వుండేదని రూ.4.60 లక్షలు సేకరించాక ఆ నిధులు సరిపోవని గమనించి ఆ ఐడియా వదులుకుందనీ, దాతలతో సంప్రదించి దాని విషయమై తుది నిర్ణయం తీసుకుంటుందని అంది. ఇక తమకు వచ్చిన విరాళాలపై మాట్లాడుతూ 'మేం వసూలు చేసిన విరాళాలను మా కార్యకలాపాలకు వినియోగిస్తున్నాం. వాటిని ఆడిట్ చేయించి, సంబంధిత అధికారులకు తెలియపరుస్తూనే వున్నాం.' అని చెప్పుకుంది. ఇంత చెప్పినా 2014 జనవరిలో అహ్మదాబాద్ క్రైమ్ బ్రాంచ్ తీస్తాపై, ఆమె భర్త జావేద్ ఆనంద్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. వారు బెయిల్ కోసం అప్లయి చేస్తూ "మానవహక్కుల కోసం పోరాడేవారిని భయపెట్టడానికి గుజరాత్ పోలీసు బనాయించిన తప్పుడు కేసు యిది. 2004 నుండి నాపై యిలాటి కేసులు 5 పెట్టారు. జాకియా జాఫ్రీ కేసులో అప్పీలుకి వెళ్లకుండా భయపెట్టడానికి చేస్తున్న ప్రయత్నమిది" అని అన్నారు. జడ్జి వారికి తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు.

గుల్‌బర్గ్ సొసైటీ తీస్తా పక్షాన నిలబడి కోర్టుల్లో పోరాడింది. 2014 ఫిబ్రవరిలో మేజిస్ట్రేటు కోర్టు ఫిర్యాదు చేసిన 12 మంది ఎవరో వారిని వెతికిపట్టుకుని, సొసైటీ లెటర్‌హెడ్ ఎలా మిస్‌యూజ్ చేశారో విచారణ జరపండని గుజరాత్ క్రైం బ్రాంచ్‌ను ఆదేశించింది. క్రైం బ్రాంచ్ ఆ దిశగా ఏమీ చేయలేదు. కేంద్రంలో సర్కారు మారడంతో గుజరాత్ పోలీసులు, కోర్టులకు ధైర్యం వచ్చింది. తీస్తా, జావేద్, వారి స్వచ్ఛంద సంస్థల బ్యాంకు ఎక్కవుంట్లు ఫ్రీజ్ చేసేశారు. డీ ఫ్రీజ్ చేయమంటూ వారు 2014 నవంబరులో స్థానిక కోర్టుకి వెళితే వాళ్లు తిరస్కరించారు. గుజరాత్ క్రైం బ్రాంచ్ తీస్తా, జావేద్‌లను అరెస్టు చేయడానికి పూనుకుంటే వాళ్లు యాంటిసిపేటరీ బెయిల్ కోసం గుజరాత్ హైకోర్టుకు అప్లయి చేసుకున్నారు. కానీ 2015 ఫిబ్రవరి 12న హైకోర్టు ఆ అప్లికేషన్‌ను తిరస్కరించింది. గుజరాత్ పోలీసు వెంటనే ముంబయి వచ్చి తీస్తాను, భర్తను అరెస్టు చేయబోయారు. ఇక వాళ్లు సుప్రీం కోర్టుకి అప్లయి చేసుకున్నారు. వాళ్లు ఫిబ్రవరి 19న వాదనలు వింటామని అప్పటి వరకు హైకోర్టు ఆదేశాలు అమలు కావని తీర్పు యిచ్చారు. తీస్తా సమర్పించిన 1500 పేజీల డాక్యుమెంట్లు పరిశీలించకుండా, వాటిపై విచారణ జరపకుండానే గుజరాత్ పోలీసులు తీస్తాను అరెస్టు చేయడానికి వుబలాట పడడమేమిటని ఆమె తరఫున హాజరైన కపిల్ సిబ్బల్ ప్రశ్నించాడు. న్యాయమూర్తులు ఎస్ జె ముఖోపాధ్యాయ, ఎన్ వి రమణ "తీస్తా ఎక్కణ్నుంచో దిగి రాలేదు. అందరిలాగే ఆమె కూడా. ఆమెపై చేసిన ఆరోపణలు తీవ్రమైనవి.." అంటూ కఠినంగా మాట్లాడారు. ఎడిషనల్ సొలిసిటర్ జనరల్ ఇందిరా జైసింగ్ "మూడు హత్యలు చేసిన కేసుల్లో కూడా బెయిల్ యిచ్చిన సందర్భాలున్నాయి. నిధుల దురుపయోగం కేసులో బెయిల్ యివ్వకపోవడం ఎక్కడా వినలేదు" అని చెప్పబోతే "మీకు సంబంధం లేని కేసు కాబట్టి మీరు మాట్లాడడానికి వీల్లేదు" అన్నారు. గుజరాత్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న తుషార్ మెహతా బాధితుల పేరు చెప్పి సేకరించిన నిధులతో తీస్తా విదేశీ పర్యటనలు చేస్తోందని, బట్టలు, బూట్లు కొంటోందని ఆరోపించడంతో ఒళు మండిన ఇందిరా జైసింగ్ "మోదీ సూటు మాటేమిటి?" అని అడిగింది. న్యాయాధీశులు తుషార్‌ను ఏమీ అనలేదు కానీ ఇందిరనే చివాట్లు పెట్టారు.

ఈ వరసంతా చూస్తే న్యాయమూర్తులిద్దరూ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని న్యాయకోవిదులు ఫీలయ్యారు. ప్రశాంత్ భూషణ్ నిరసన తెలుపుతూ "ముఖోపాధ్యాయ, రమణల యిళ్లల్లో యీ మధ్య జరిగిన పెళ్లిళ్లకు మోదీ హాజరయ్యారని విన్నాను. మోదీకి వ్యతిరేకంగా నడుస్తున్న యీ కేసుల్లో వారు వాదనలు వినడం సబబా?" అనే ప్రశ్న లేవనెత్తారు. సుప్రీం కోర్టు ఏమనుకుందో ఏమో యీ కేసు విచారించే బెంచ్‌లో వారిద్దరికీ బదులు దీపక్ మిశ్రా, ఎ కె గోయల్‌లను నియమించింది. వారు గుజరాత్ ప్రభుత్వ పక్షాన వాదిస్తున్న మహేశ్ జెఠ్మలానీని "పోలీసులు విచారణకై తీస్తాను పిలిచినపుడు ఆమె వచ్చిందా లేదా?" అని అడిగారు. రెండు సార్లు పిలిస్తే రెండు సార్లూ ఆమె వచ్చిందని మహేశ్ చెప్పవలసి వచ్చింది. "దాతల నుండి ఫిర్యాదులు లేవు, ఫండ్స్‌ను వేరే పనులకు మళ్లించినట్లు మీ వద్ద ఆధారాలు లేవు, యిచ్చిన డాక్యుమెంట్లు పరిశీలించి అనుమానాలుంటే తీర్చుకోండి. ప్రశ్నలడగడానికి ఆమెను నిర్బంధంలోకి తీసుకోవాలనుకోవడం దేనికి?" అని అడిగారు. మహేశ్ దగ్గర సమాధానం లేదు. తీస్తాను అతితెలివికి పోకుండా గుజరాత్ పోలీసులతో సహకరించమని చెప్పండి ఆమె న్యాయవాది కపిల్ సిబ్బల్‌కు చెపుతూ ఆమె అరెస్టుపై స్టేను కొనసాగించారు న్యాయాధీశులు. ఈ కథ ముందుముందు ఎలా సాగుతుందో ఆసక్తిగా గమనించాలి. ఒక్కమాట మాత్రం నిజం – మోదీని వ్యతిరేకించినవారికి చెడ్డదినాలు వచ్చాయి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**2015 ఫిబ్రవరి 31-32 వీక్లీకై** **ఎమ్బీయస్ : నిర్మాత పదానికి నిర్వచనం – రామానాయుడు**

రామానాయుడుగారికి ఘననివాళి లభించింది. ఆయనా, ఆయన వారసులు పరిశ్రమలో యింకా ప్రముఖులు కాబట్టే.. అనడానికి లేదు. ఆయన వలన మేలు కలిగినవారు ఎందరో వున్నారు. మంచిమనిషిగా, హుందాతనాన్ని కాపాడుకుంటూ చివరి వరకూ ఉజ్వలంగా ప్రకాశిస్తూ లైమ్‌లైట్‌లోనే వున్నారు కాబట్టి అనుకోవాలి. ఆయన గురించిన విషయాలు చాలాకాలంగా అందరూ చెప్పుకునేవే. ఆయన జీవితచరిత్రలు వచ్చాయి. వ్యాసాలు వచ్చాయి, అనేక టీవీ యింటర్వ్యూలు వచ్చాయి. ఆయన ఏ విషయాన్నీ దాచుకోలేదు. తన బలమేమిటో, బలహీనత ఏమిటో, ఎప్పుడు ఏ సినిమాకు ఎంత ఖర్చు పెట్టారో, ఎంత వచ్చిందో, ఎంత పోయిందో, ఎక్కడ సక్సెసయారో, ఎందుకు బోర్లా పడ్డారో అన్ని వివరాలూ స్పష్టంగా చెప్పారు. మనం కొత్తగా చెప్పేదేమీ లేదు – కొన్ని పరిశీలనలు చేయడం తప్ప!

ఈ రోజు ఆయనకు నీరాజనాలు అర్పించిన నిర్మాతలు రామానాయుడుగారి అంశ తమలో ఏ కొంచెమైనా వుందా లేదా అన్నది వారంతట వారే తరచి చూసుకోవాలి. రేపు మనం వెళ్లిపోయిన తర్వాత మన గురించి యిలా చెప్పుకుంటారా మరోలా చెప్పుకుంటారా అన్నది కూడా ఆలోచించుకోవాలి. ఆయన రోజులు వేరు, మా రోజులు వేరు అనే వాదన నప్పదు. రామానాయుడు గారే చెప్తూ వుండేవారు – 'పరిస్థితులు ఏం మారాయి? సక్సెస్ రేటు ఎప్పుడూ పదిశాతమే అని. ప్రణాళికాబద్ధంగా వెళ్లినవారు నిలదొక్కుకున్నారు, లేనివారు లేదు' అని. ఆయన గొప్పతనం ఏమిటంటే – సినిమాను ఆయన వ్యాపారంగా చూశారు. చాలామంది దాన్ని జూదంగా చూస్తారు. వేరే చోట డబ్బు మిగిలితే యిక్కడ పెడదామని కొందరు, దీనిలో అర్జంటుగా గడించేసి వేరే చోట పెడదామని కొందరూ అనుకుంటారు. ఏ వ్యాపారానికైనా పెట్టుబడిదారుడు ముఖ్యం. ఎంత గొప్ప నటుడికైనా, దర్శకుడికైనా, రచయితకైనా, గాయకుడికైనా,

కళాకారుడికైనా – తన ప్రతిభ చూపించాలంటే ఒక వేదిక కావాలి. అది కల్పించేవాడికి శక్తి, ఆసక్తి రెండూ వుండాలి. నిర్మాతకు టేస్టు లేకపోతే ఎంత గొప్ప సినిమాయైనా రూపొందదు. అందువలన నిర్మాతే తొలిగౌరవాన్ని అందుకోవాలి. కానీ సినిమారంగంలో ఆ పరిస్థితి లేదు. డివి నరసరాజుగారి మిత్రులు కొందరు యీ రంగంలోకి రాబోయి మానేశారట. ఏమంటే 'ఎక్కడైనా డబ్బిచ్చినవాడికి అందరూ దండాలు పెడతారు. ఇక్కడేమిటండీ బాబూ, డబ్బూ మనమే యిచ్చుకోవాలి, దండాలూ మనమే పెట్టుకోవాలి' అన్నారట.

కథ చూసుకోవడం, సరైన వాళ్లను ఎంచుకుని బాధ్యతలు అప్పగించడం, ప్లానింగ్ చేసుకుని, దగ్గరుండి అన్నీ అమలయ్యేట్లు చూసుకోవడం – యివే నిర్మాత పనులు. ఈ రోజు నిర్మాత కథ చుట్టూ కాకుండా హీరోల కాల్షీట్ల కోసం వెతుకుతున్నారు. డైరక్టరు తనకు కథ చెప్పకపోయినా, బజెట్ ఎంతవుతుందో చెప్పకపోయినా డబ్బులు అప్పు తెచ్చి అతని చేతిలో పోస్తున్నాడు. ఎందుకు? అతను దాన్ని రెట్టింపు చేసి మళ్లీ తన చేతిలో పోస్తాడన్న దురాశతో! ప్రాక్టికల్ థింకింగ్ లేదు. ఏదో అద్భుతం జరిగిపోయి, మన సినిమాను హీరో, డైరక్టరు ఆడించేస్తారు అని ఆశ పెట్టుకుని తక్కినవాటిని పట్టించుకోవడం లేదు. రామానాయుడుగారు ఎప్పుడూ చెప్పేవారు – 'ఏట్లో పారేసినా ఎంచి పారేయాలి' అని. సెట్లో నిర్మాత వుంటే ఖర్చులో కనీసం 30% ఆదా అవుతుంది అని. సినిమాను యిండస్ట్రీగా చూసినవారే బాగుపడతారు, పద్ధతీపాడూ లేకుండా, పబ్లిసిటీ కోసం విచ్చురూపాయలను విచ్చలవిడిగా విరజిమ్మేవారు ఖర్చయిపోతారు.

రామానాయుడి గారి జీవితం మనకు స్ఫూర్తిదాయకం అంటూ పైకి చెప్పడం కాదు, ఏ వ్యాపారం చేసినా ఎంత శ్రద్ధగా చేయాలో ఆయనను చూసి కొంతైనా నేర్చుకోవాలి. డబ్బుంది కదాని ఆస్తులన్నీ అమ్మేసి సినిమా వ్యాపారంలోకి ఒక్కసారిగా దూకలేదు. డబ్బింగ్ సినిమా తీద్దామనుకుని, రామినీడుగారి సలహాతో చిన్న బజెట్ సినిమాలో భాగస్వామిగా దిగారు. రామినీడు వద్ద సినిమా రంగంలోని మెళకువలతో బాటు ప్రవర్తన విషయంలో జాగ్రత్తలు కూడా తెలుసుకున్నారు. మార్కెటింగ్‌లో వున్నవారికి ప్రెజెన్స్, పర్శనాలిటీ ఎలా అవసరమో, నిర్మాతకు కూడా మాటమంచితనం, ఎవరినైనా ఒప్పించగల నేర్పు వుండాలి. "అనురాగం" సినిమాలో తన కిచ్చిన పాత్ర చిన్నదని ఫీలైన షావుకారు జానకి వేషం వేయనన్నారు. దర్శకనిర్మాతలు చెప్పినా వినలేదు. అప్పుడు యీయన వెళ్లి 'ఇది నా ప్రథమ ప్రయత్నం, సహకరించండి' అని అడిగితే ఆవిడ 'మీకోసం చేస్తా' అంటూ ఒప్పుకున్నారు. 'కావాలంటే పారితోషికం ఎక్కువడగండి, యిస్తాం' అని పొగరుగా మాట్లాడి వుంటే పని అయివుండేది కాదు.

నిర్మాతకు విజన్ వుండాలి. "రాముడు–భీముడు" లాటి కథను ఎందరో పెద్దలు తిరస్కరించారు. కానీ యీయన దానిలో బంగారుగనిని చూడగలిగాడు. దానిపై భారీగా పెట్టుబడి పెట్టాడు. అదే ఆయన్ను నిలబెట్టింది. ఆ సినిమా ఎన్ని భాషల్లో, ఎన్ని రకాలుగా వచ్చిందో అందరికీ తెలుసు. కథకు ఆయన ఎప్పుడూ ప్రాధాన్యత యిచ్చాడు. తమిళంలో నుంచి చాలా కథలు తీసుకున్నారు, రీమేక్‌లు చేశారు, తమిళ రచయితల కథలు తీసుకున్నారు, తెలుగు నవలలను సినిమాలుగా తీశారు, చివరిదాకా ఆయన కొత్త కథలు వింటూనే వున్నారు. కథలు నచ్చితే స్క్రిప్టు తయారుచేసి దాచి వుంచుకుని అవసరమైనపుడు బయటకు తీసిన సందర్భాలూ వున్నాయి. ఆయన అంచనాలు అన్ని వేళలా కరక్టు కాలేదు, కెరియర్‌లో చాలా ఫెయిల్యూర్లు వున్నాయి. ఏ వ్యాపారంలోనైనా అది సహజం. ఎక్కడా ఆగకుండా వరుసగా తీసుకుంటూ పోవడంతో టర్నోవర్ కారణంగా ఆయన సంస్థ నిలబడింది. వరుసగా ఫ్లాపులు వచ్చి దుకాణం కట్టేస్తారేమోననుకుంటే ఒక హిట్ వచ్చి నిలబెట్టేది. 1979–82 మధ్య "ఒక చల్లని రాత్రి", "కక్ష", "అగ్నిపూలు", "ప్రేమమందిరం" వచ్చి కోటి రూపాయల డెఫిసిట్‌లోకి వెళితే "దేవత" (1982) వచ్చి మళ్లీ వూపిరి పోసింది.

ఆయన సినిమాలన్నీ కళాఖండాలనీ, ఆయన అభిరుచి ఉత్తమోత్తమైనదనీ నేననను. ఆయన వాటిని వ్యాపారదృష్టితోనే తీశాడు. అందుకే దాదాపు 150 సినిమాలు తీయగలిగాడు. లేకపోతే ఏ పాతిక దగ్గరో ఆగిపోయేవాడు. అయితే ఆయనలో విశేషం ఏమిటంటే ప్రయోగాలు చేయడానికి వెరవలేదు. ఆ ప్రయోగాలు కూడా డబ్బు తెస్తాయనే, జనాలు చూస్తారనే అనుకున్నాడు కానీ, కేవలం అవార్డుల కోసం తీయలేదు. సాధారణంగా కొందరు నిర్మాతలు కెరియర్ తొలిదశలో ప్రయోగాలు చేసి ఆ తర్వాత మానేస్తారు. ఆయన అలా మానలేదు. హీరోహీరోయిన్లు లేని "పాపకోసం" (1968) "ద్రోహి" (1970) తీసినట్లే తర్వాతి రోజుల్లో కూడా గుడ్డి హీరోయిన్‌తో "ప్రేమించు" (2001), పిల్లలతో "హరివిల్లు" (2003) లాటివి తీశారు. వరుసగా భారీ సినిమాలు తీస్తూ మధ్యలో "సూరిగాడు" (1992) వంటి చిన్న సినిమా తీసి వాటికి వూపిరి పోశారు. "అక్కాచెల్లెళ్లు" (1993), "పరువు–ప్రతిష్ట" (1993), "తోడికోడళ్లు" (1994), "కొండపల్లి రత్తయ్య" (1995). "నువ్వు లేక నేను లేను" (2002) – యివన్నీ చిన్న సినిమాలే. వీటిలో కొన్ని బాగా ఆడాయి కూడా. ఇది ఒక విశేషంగా భావిస్తాను నేను. ఎందరో నిర్మాతలు తాము బలపడిన కొద్దీ తమ బ్యానర్ వాల్యూ నిలబడాలంటే సక్సెస్ వచ్చి తీరాలనే లెక్కతో భారీగా, మరింత కమ్మర్షియల్‌గా తీస్తూ పోయారు. విజయా ప్రొడక్షన్స్ సైతం అంతే.

ఎవిఎం, జెమినీ వంటి స్టూడియో ఆధారిత సంస్థలు మాత్రమే చిన్నా, పెద్దా ఒకేసారి తీస్తూ నిలబడ్డారు. స్టూడియో కట్టి అధినేత కావడానికి ముందు నుండే రామానాయుడు ఆ ఫార్ములా వుపయోగించారు. "రాముడు భీముడు" (1964)కి "శ్రీకృష్ణ తులాభారం" (1967) కు మధ్య "ప్రతిజ్ఞా పాలన"(1965) తీస్తే దానికీ లాభం వచ్చింది. ("ప్రేమనగర్" (1971) కలర్‌లో తర్వాత తీసినది అంతకంటె భారీ సినిమా కాదు. "జీవనతరంగాలు" (1973) అనే బ్లాక్ అండ్ వైట్ సినిమా. తర్వాత రంగుల్లో తీసిన "చక్రవాకం" (1974) పోయినా వెంటనే వచ్చిన "అమ్మాయిల శపథం" (1975) అనే చిన్న సినిమా ఆడింది. నిజానికి పెద్ద సినిమాల్లో ఆదాయం, ఖర్చు యించుమించు సమానంగా వుండేవిట. అందుకే వరుసగా "బొమ్మలు చెప్పిన కథ" (1969), "సిపాయి చిన్నయ్య" (1969),

''ద్రోహి'' (1970) ఫెయిల్ కావడంతో పెట్టనదంతా పోయి, అప్పులు చేసి ''ప్రేమనగర్'' తీయాల్సి వచ్చింది. తర్వాతి రోజుల్లో కూడా పెద్ద దర్శకులతో తీసిన సినిమాలు ఫెయిలయిన తరుణంలో ఔత్సాహికులతో తీసినవి హిట్ అయి ఆదుకున్నాయి. ''తాజ్‌మహల్'' (1995) – అలాటిద్దే. కామెడీ జానర్ కూడా ఆయనికి లాభాలు తెచ్చి పెట్టింది.

రామానాయుడు కథలు వినడం గురించే అందరూ చెప్తారు తప్ప కథలో మార్పులు సూచించారనీ, స్టోరీ సిట్టింగుల్లో, మ్యూజిక్ సిట్టింగుల్లో కూర్చున్నారనీ ఎవరూ చెప్పరు. ఒక కార్పోరేట్ చీఫ్‌లా ఆయన ఒక వ్యక్తిని సమర్థుడిగా భావించి, అతని చేతికి అన్నీ అప్పగించేవారు. స్క్రిప్టు తనకు మనసుకు హత్తుకునేదాకా  కార్యాచరణకు దిగేవారు కారు. ''ప్రేమఖైదీ'' స్క్రిప్టు ఇవివి 17 సార్లు తిరగరాయవలసి వచ్చింది. 17వది ఓకే చేసి డైరక్షన్ అప్పగించారు. సినిమా హిట్ అయింది. తను కథ వినకుండా ఓకే చేసిన ఏకైక సినిమా ''సూపర్ హీరోస్'' (1997) అనీ, అందుకే దాని ఫ్లాప్‌కి తానూ కారకుడననీ ఆయన చెప్పుకున్నారు. నిర్మాణ సమయంలో టెక్నీషియన్ల వ్యవహారాల్లో తలదూర్చినట్లు ఎక్కడా వినలేదు. దూర్చి వుంటే ఎవరో ఒక దర్శకుడితోనో, నటుడితోనో పేచీ వచ్చి వుండేది. ఆయన కెయస్ ప్రకాశరావు, వి మధుసూదనరావు, కమలాకర కామేశ్వరరావు, తాపీ చాణక్య వంటి సీనియర్లతో ఎలా కలిసి పనిచేశారో కొత్తతరం దర్శకులతోనూ అంతే యీజ్‌తో పని చేయించుకున్నారు. అర్ధశతాబ్ది దాటిన కెరియర్‌లో ఎలాటి వివాదమూ రాలేదంటే ఎవరికి యివ్వాల్సిన గౌరవం వారికి యిచ్చినట్లే అనుకోవాలి. తొలిసారిగా భారీ తారాగణంతో తీస్తున్న రాముడు భీముడు సినిమాను అప్పటికి వరుసగా ఏడెనిమిది ఫ్లాపులు తీసిన తాపీ చాణక్యకు యిచ్చారు. ''పాపకోసం'' లాటి విలక్షణ చిత్రాన్ని జివిఆర్ శేషగిరిరావు వంటి కొత్త దర్శకుడికి యిచ్చారు. ''బొమ్మలు చెప్పిన కథ'', ''ద్రోహి'' లాటి ఫ్లాప్‌లిచ్చినా బాపయ్యకు ''సోగ్గాడు'' (1975) యిచ్చారు. ఇవివి సత్యనారాయణ ''చెవిలో పువ్వు'' తీస్తూ వుంటే 11 ఆఫర్లు వచ్చాయి. ఆ సినిమా ఫెయిల్ కావడంతో అన్నీ వెనక్కు వెళ్లిపోయాయి. కానీ ఈయన ''ప్రేమఖైదీ''(1991) ఛాన్సు యిచ్చారు.

వ్యాపారమే ప్రధానంగా భావించినా మొహమాటాలకు లొంగిన సందర్భాలూ లేకపోలేదు. ''సెక్రటరీ'' విజయోత్సవ సభలో 'నన్ను హీరోగా పెట్టి తీసినా సక్సెస్ చేయగల సత్తా నాయుడుగారిది' అని నటుడు సత్యనారాయణ అంటే 'సరే అలాగే తీస్తా' అన్నారు. ''సావాసగాళ్లు'' సినిమా చిత్రీకరణలో నాగేశ్ కొత్త డైరక్టరుకు మరీ సూచనలు యిస్తూ వుంటే 'కావాలంటే నీకు డైరక్షన్ ఛాన్సు యిస్తాను కానీ, కొత్తవాణ్ని కంగారు పెట్టకు' అన్నారు. వెంటనే నాగేశ్ ''మొరటోడు'' కథతో వస్తే యిద్దరికీ యిచ్చిన మాట ప్రకారం ఆ సినిమా తీసి 5 లక్షలు పోగొట్టుకున్నారు. కృష్ణంరాజును పెట్టి తీయాల్సింది అని డిస్ట్రిబ్యూటర్స్ అన్నారట కానీ సినిమాయే చాలా మొరటుగా, మోటుగా, అతిగా వుంటుంది. అలాగే తన అనేక సినిమాలకు కథ యిచ్చిన ఆపుడు గుహనాథన్‌ను దర్శకుడిగా పరిచయం చేయడానికి తీసిన ''కక్ష'' సినిమా బజెట్ బాగా పెరిగినా పోనీ అనుకున్నారు. దాంతో రూ. 8 లక్షలు నష్టం తెచ్చింది. అదే గుహనాథన్ ''మనసే మందిరం'' సినిమానే మగా, ఆడ పాత్రలు మార్చేసి ''మాంగల్యబలం'' (1985)కు కథ యిస్తే సినిమా తీస్తూండగా మధ్యలో పోలిక గుర్తించినా యింకేం చేయలేక సినిమా పూర్తి చేసి నష్టాన్ని భరించారు.

తమిళంలో తీసిన ఆయన సినిమాల్లో కొన్ని తెలుగువాటి రీమేక్స్ కాగా, కొన్ని డబ్బింగ్ కాగా, ''నమ్మకుళందైగళ్'', ''మధురగీతం'', ''తనికట్టు రాజా'', ''మైఖేల్ రాజా'', ''కైనాట్టు'' ''శివప్పు నిరత్తిల్ చిన్న పూ'' స్ట్రెయిట్ సినిమాలు. హిందీ సినిమాలు మాత్రం తెలుగు రీమేక్సే. ''ప్రేమ్‌నగర్'' అదే పేరుతో, ''సోగ్గాడు–దిల్‌దార్'', ''జీవనతరంగాలు – దిల్ ఔర్ దీవార్'', ''చిలిపి కృష్ణుడు–బందిష్'', ''దేవత–తోఫా'', ''ముందడుగు–మక్సద్'', ''ప్రతిధ్వని–ఇన్సాఫ్‌కీ ఆవాజ్'', ''కథానాయకుడు–దిల్‌వాలా'', ''బ్రహ్మపుత్రుడు–రఖ్‌వాలా'', ''బొబ్బిలి రాజా–జీవన్ ఏక్ సంఘర్ష్'', ''ప్రేమఖైదీ''ని అదేపేరుతో, ''సూరిగాడు–సంతాన్'', ''చంటి–అనాడీ'', ''యమలీల–తక్‌దీర్‌వాలా'', ''పవిత్రబంధం–హమ్ ఆప్‌కే దిల్‌మే రహ్‌తే హై'', ''శివయ్య–ఆఘాజ్'', ''కలిసుందాం రా – కుఛ్ తుమ్ కహో కుఛ్ హమ్ కహే''. ఒకే ఒక్క హిందీ చిత్రం ''హమారీ బేటీ'' ఎకె బీర్ దర్శకత్వంలో వికలాంగ యువతి గురించి తీశారు. ఆయన హిందీ కాక యితర భాషల్లో తీసిన సినిమాల్లో చాలా వాటిల్లో డబ్బులు రాలేదట. కానీ – ఫర్ ద హెక్ ఆఫ్ యిట్ – తీశారు. వాటన్నిటికై డబ్బుకోసం అనేక మసాలా సినిమాలు తీశారు. వాటిలో కాలపరీక్షకు నిలిచేవి కొన్నే కావచ్చు. కానీ ఆయన కారణంగా ఎందరో ఆర్టిస్టులకు, ఎందరో టెక్నీషియన్లకు తెరపరిచయం కలిగింది, అభివృద్ధి కలిగింది, వేలాదిమందికి జీవనోపాధి కలిగింది. రామానాయుడిగారు డబ్బు రావాలనే సినిమాలు తీసినా ఆయనను నడిపించినది మాత్రం సినిమాల పట్ల 'పేషన్'. దాని కోసం కొన్ని భిన్నతరహా సినిమాలు కూడా తీశారు. ఆయన వారసులు కేవలం వాణిజ్యపరమైన విజయం కోసమే సినిమాలు మాత్రమే తీద్దామనుకుంటే మాత్రం ఆయనంత ఖ్యాతి తెచ్చుకోలేరు. రామానాయుడిగారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుందాం.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 34–35** **ఎమ్బీయస్ : రచయితగా ఆర్.కె.లక్ష్మణ్**

ఎవరికైనా ఎవార్డు వచ్చినా, ఎవరైనా పోయినా వారి గురించి రాయండి అని కొందరు పాఠకులు నాకు మెయిల్స్ రాస్తూ వుంటారు. ధర్మవరపు సుబ్రహ్మణ్యం, ఎమ్మెస్ నారాయణ యిలాటి వారిపై నాకు గౌరవం వున్నా పత్రికలలో, టీవీల్లో వచ్చేదాని కంటె భిన్నంగా, అదనంగా చెప్పడానికి ఏమీ లేనప్పుడు నాకేమీ రాయబుద్ధి కాదు. అందరూ రాసేది మనమూ రాయడం దేనికి? మనకంటూ

అదనపు సమాచారం లేకపోతే మానె కనీసం భిన్నదృక్పథం వుంటేనైనా రాయవచ్చు, లేకపోతే వూరుకుంటే మేలు అనుకుంటాను. బాలచందర్ గురించి కాస్త ఆలస్యంగానైనా వ్యాసం రాశాను – తక్కినవాళ్లు ఆ పాయింట్లు మిస్ చేస్తున్నారని తోచి! అలాగే ఆర్ కె లక్ష్మణ్. ఆయన పోయిన దగ్గర్నుంచి చూస్తున్నాను – అందరూ ఆయన కార్టూన్ కళ గురించి, కామన్ మ్యాన్ గురించి రాశారు కానీ ఆయన రచనల గురించి రాయలేదు. ఆయనను ఆ కోణంలో పరామర్శిస్తూ యిది రాస్తున్నాను.

లక్ష్మణ్‌ను ఒక యింటర్వ్యూలో ఎవరో అడిగారు – మీకూ రచనావ్యాసంగం వుంది కదా, దాన్ని వదిలిపెట్టేశారేం? అని. 'మా అన్నయ్య ఆర్‌కె నారాయణ్‌తో పోల్చి చూస్తున్నారు. అందుకని మానేశా..' అన్నాడాయన. లబ్ధప్రతిష్టులతో బంధుత్వం వుంటే యిదే చిక్కు. ఆర్ కె నారాయణ్ జగమెరిగిన రచయిత, ఆయనతో పోలిస్తే ఎలా? ఆయన లక్ష్మణ్‌లా కార్టూన్లు వేయలేడుకదా! లక్ష్మణ్‌వి కార్టూన్ల పుస్తకాలు చాలా వున్నాయి. రచనల విషయానికి వస్తే ఆయన కలెక్టెడ్ వర్క్స్ (2000 పెంగ్విన్ ప్రచురణ) ఒకటే ఆన్‌లైన్‌లో కనబడుతోంది. దానిలో "ద హోటల్ రివియేరా", "ద మెస్సెంజర్" అనే రెండు నవలలు, "ద టన్నెల్ ఆఫ్ టైమ్" అనే ఆయన ఆత్మకథ వున్నాయని బ్లర్బ్‌లో తెలుస్తోంది. నేనా పుస్తకం చూడలేదు. హోటల్ రివియేరా అనే హోటల్ చుట్టూ తిరిగే పాత్రలతో రాసిన "సారీ, నో రూమ్" అనే పుస్తకం నా దగ్గర వుంది. (1969, ఐబిఎచ్ ప్రచురణ) "ద హోటల్ రివియేరా" పేరుతో పెంగ్విన్ వాళ్లు 1989లో వేసినదీ అదీ ఒకటేనేమో తెలియదు. నా దగ్గరున్న నవల చదివితే, ఆ పాత్రల తీరు చూస్తే ఆర్‌కె నారాయణ్ రాసినట్లే వుంటుంది. లక్ష్మణ్ సన్నిహితులు ఆ ముక్క ఆయన దగ్గరా అన్నారేమో, ఒళ్లు మండి మానేసి వుంటారు. లక్ష్మణ్ రచనాశైలి పరిచయం చేయడానికి నేను ఒక కథను ఎంచుకుంటున్నాను. "ద ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా" 1975 మే 11 సంచికలో "ఏన్ యాక్సిడెంట్" అనే కథ బాగా నచ్చింది. కట్ చేసి దాచుకున్నాను. ఆయన యిలాటి చిన్న కథలను "ఐడిల్ అవర్స్" (1982–ఐబిఎచ్ ప్రచురణ)లో చేర్చారనుకుంటా. తెలియదు. ఆ పుస్తకం నా వద్ద లేదు. ఈ కథ థీమ్ చిన్నదే. హత్య చేయడం యింత సులభమా అనిపిస్తుంది. నేరేషన్, భాష ఏదీ క్లిష్టంగా వుండదు. అలవోకగా రాసినట్లు వుంటుంది. ఆ కథను తెలుగులో సంగ్రహంగా చెప్తాను –

'కైలాశ్ అనే వ్యక్తి డాగా అనే దుర్మార్గుడి నుండి పారిపోతున్నాడు. ఒక మహా నగరం నుంచి కారులో ఒంటరిగా డ్రైవ్ చేసుకుంటూ వెళుతూంటే హైవేకు పక్కగా వున్న రోడ్డు ఒక అడవిలోకి దారి తీసినట్లు కనబడింది. అటు పోనిచ్చాడు. కొన్ని గంటల తర్వాత పెట్రోలు బంక్ కనబడింది. కారులో పెట్రోలు కొడుతూ వుంటే వెళ్లి న్యూస్ పేపరు కొని, పేజీలు గబగబా తిరగేశాడు. తను మిస్ అయినట్టు ఎక్కడా ఏ ప్రస్తావనా లేదని చూసుకుని నిట్టూర్చాడు. చీకటి పడేలోపున ఏదైనా వూరు చేరితే మంచిదనుకుని స్పీడు పెంచాడు. అంతలో సడన్‌గా అతనికి మతి పోయినట్లు అనిపించింది. కళ్లముందు ఏమీ కనబడడం మానేసింది. ఏమిటో, ఎక్కడున్నాడో ఏమీ తెలియలేదు. అప్రయత్నంగా కాలితో సడన్ బ్రేకు వేశాడు. కారు జర్క్‌తో పక్కకు స్కిడ్ అయింది. పక్కనుంచి సరసరా వాహనాలు హారన్ కొట్టుకుంటూ వెళ్లి గుండెలు అదరగొట్టాయి. కొన్ని క్షణాల్లో అర్థమైంది – తన ముఖాన్ని న్యూస్ పేపరు మూసేసిందని. చేతులతో దాన్ని లాగి పారేశాడు. చదివి, కారు వెనుకసీటులో పడేసిన దినపత్రిక పేపరు విప్పుకుని పోయి కాగితాలు చెల్లాచెదురై అటూయిటూ ఎగిరి ఒకటి స్టీరింగుపై పడగా, మరొకటి తన ముఖాన్ని పూర్తిగా కప్పేసింది. దాంతో అతను గందరగోళ పడిపోయాడు. కాస్త వుంటే ఎదురుగా వున్న పెద్ద చింతచెట్టును గుద్దేసి వుండేవాడు. కాస్సేపు నిస్తేజంగా కూర్చుని, నీళ్లు తాగి తమాయించుకుని, కాగితాలన్నీ నలిపి, అవతల పారేసి, మళ్లీ డ్రైవింగ్ మొదలుపెట్టాడు. తను కొద్దిలో చావు తప్పించుకున్నాడు. ఇలా చచ్చిపోయినా బాగుండేదేమో, డాగా చేతిలో ఘోరమైన చావు కన్నా.. అనుకోగానే అతని ఆలోచనలు గతంలోకి వెళ్లాయి.

'తనూ, డాగా యిద్దరూ కలిసి బిల్డింగు కాంట్రాక్టు వ్యాపారం చేసేవారు. తను చిన్న భాగస్వామి. డాగాకు క్లయింట్ల దగ్గర్నుంచి విపరీతంగా బ్లాక్ మనీ తీసుకోవడం, దాన్ని ఎలా ఖర్చు పెట్టాలో తెలియక వ్యసనాలు పాలు చేయడం, యిదీ పని. అవన్నీ తనకూ మప్పాడు. నీ వాటా అంటూ డబ్బు యివ్వడం, తన చేత తాగుడికి, అమ్మాయిలకు ఖర్చు పెట్టించడం. డాగా పోనుపోను స్మగ్లింగే కాదు, మరీ దుర్మార్గంగా హత్యలు కూడా చేసే స్థితికి దిగజారాడు. ఈ జీవితంపై విసుగుపుట్టి తను మారిపోదామన్నాడు. కానీ డాగా అలా వదిలేరకం కాదు. తన మాటకు ఎవరైనా ఎదురాడినా, గుప్పిట్లోంచి తప్పించుకున్నా ప్రాణాలు తీస్తాడు. కొద్దిపాటి అనుమానంతో దశాబ్దాలుగా తనకు సేవ చేసిన కణ్ణన్ అనే అతన్ని అలాగే చంపేసి రైలుపట్టాల మీద పడేశాడు. అతనికి టైపిస్టు డోరిన్ మీద కూడా అనుమానం వుంది. ఓ రోజు తను తాగి, డోరిన్‌తో పక్కలో వుండగా యిద్దరం పారిపోదాం, మన దగ్గర వున్నదానితో మిగిలిన జీవితాన్ని నిర్భయంగా అనుభవిద్దాం అన్నాడు. కొద్ది రోజులకే ఆమె విడిగా పారిపోయింది. ఇక తనూ పారిపోకపోతే డాగా అనుమానంతోనైనా చంపేస్తాడని భయపడ్డాడు. మూడు రోజుల క్రితం డాగా చిత్తుగా తాగి మత్తుగా పడివున్నపుడు యిదే ఛాన్సని కారు, చేతికందిన స్మగుల్డ్ వస్తువులు పట్టుకుని వుడాయించాడు. దాన్ని అమ్మి డబ్బు చేసుకున్నాడు.'

చీకటి పడేవేళకు అతను అడవి మధ్యలో వున్న ఒక చిన్న పల్లెటూళ్లో ఒక లాడ్జికి చేరాడు. మర్నాడు కిటికీలోంచి చూస్తే లారీలు వరుసగా వచ్చి పక్కనున్న అడితిలో  దుంగలను దింపుతున్నాయి. ఒకతను అవన్నీ రాసుకుని వేర్వేరు వూళ్లకు పంపుతున్నాడు. వెళ్లి పరిచయం చేసుకున్నాడు. అతని పేరు నాయుడు. తన పేరు కుమార్ అని చెప్పుకున్నాడు. రోజూ చాలాసేపు అతని దగ్గరే కూర్చుని కబుర్లు చెపుతూండేవాడు. మూడువారాలు గడిచేసరికి నాయుడడిగాడు – "ఇక్కడికి 50 కి.మీ.ల దూరంలో అరణ్యమధ్యంలో హంటర్స్ లాజ్ అని ఒక గెస్ట్ హౌస్ వుంది. చుట్టూ ఎవరూ వుండరు. చెట్ల నుండి కొట్టేసిన దుంగలు అక్కడకి వచ్చి చేరతాయి. వాటి మీద నెంబర్లు పెయింటుతో రాయించి, ఆ నెంబర్లన్నీ ఒక పుస్తకంలో రాయాలి. ఆ దుంగలను వేరే లారీలకు ఎక్కించి, నా దగ్గరకు

పంపాలి. నమ్మకస్తుడు ఎవరూ దొరకటం లేదు. నువ్వు అక్కడ వుంటావా? అక్కడ నీకు సాయపడడానికి ఓ పనిమనిషి వుంటాడు. కూరలూ, పాలూ పక్కనున్న గ్రామం నుంచి అతనే తెస్తాడు. నువ్వు చదువుకోవడానికి పేపర్లూ, మ్యాగజైన్లు నేను లారీ డ్రైవర్ల ద్వారా పంపిస్తాను." అని. కైలాశ్ ఒప్పుకుని ఆ వుద్యోగంలో స్థిరపడ్డాడు. ఏ చీకూచింతా లేకుండా ఒంటరి జీవితం బతకసాగాడు.

కొన్ని రోజులు గడిచేసరికి అతని స్మృతిపథంలో నుంచి డాగా క్రమంగా తొలగిపోసాగాడు. కానీ ఒక రోజు అందరూ వెళ్లిపోయాక చీకట్లో ఒక నల్లకారు అతని దగ్గరకి వచ్చింది. దాన్లోంచి దిగినది వేరెవరో కాదు, డాగా! తెల్లబోయి చూస్తున్న కైలాశ్ వైపు విషపు నవ్వు విసిరి "నీ పాతస్నేహితుణ్ని లోపలికి తీసుకెళ్లి తిండీతిప్పలూ చూడవా?" అన్నాడు. కైలాశ్ సర్దుకున్నాడు. "నీకు తిండి కంటె ముందు తాగుడు కావాలని తెలుసుగా" అంటూ వెళ్లి డ్రింక్స్ ఏర్పాటు చేశాడు. ఇద్దరూ కూర్చుని తాగసాగారు. కాస్సేపటికి చిత్తుగా తాగిన డాగా అసలు సంగతి ఎత్తాడు – "నువ్వు యిక్కడ ఎంత సంపాదించావో అది చెప్పు" అని.

"డబ్బా? ఇక్కడ మనశ్శాంతి తప్ప వేరే ఏమీ దొరకదు." అన్నాడు కైలాశ్.

"నీ డోరిన్‌ను ఎక్కడ దాచావ్? దుప్పట్లోనా? సరేలే, దాన్నేం చేస్తే నాకెందుకు గానీ డబ్బేం చేశావో చెప్పు. అనాథలకు దానం చేసేశావా?"

"నా దగ్గర డబ్బేమీ లేదు. ఈ వుద్యోగంలో జేబు ఖర్చులకు పదో, పాతికో యిస్తారు తప్ప వేరే జీతమేమీ లేదు.."

"...అబద్ధాలు చెప్పకు." అని డాగా ఒక్కసారిగా టీపాయ్ చరిచాడు. "నాకు ఏభైవేలు కావాలి. నా స్మగుల్డ్ వస్తువులు కొట్టేసి అమ్మేసుకున్నావ్. రేపటికల్లా రెడీ చేయి. లేకపోతే లోకంలో ఎక్కడ దాక్కున్నా నిన్ను వెతికి పట్టుకుని పిండుకుంటాను." అని అరిచాడు.

అతను అన్నంత పనీ చేస్తాడని కైలాశ్‌కు తెలుసు. "రేపటికి రేపంటే ఎలా? కాస్త టైమివ్వు.." అని బతిమాలాడు.

"కుదరదు, నువ్విచ్చేదాకా యిక్కడే కూర్చుందును కానీ యివాళ ఓ పార్టీతో డీల్ చేసేదుంది. ఎంత రాత్రయినా సరే వెళ్లాలి. ఇక్కణ్నుంచి వంద కిలోమీటర్ల దూరం. రేపు పనేం లేదు. వచ్చి కూర్చుంటాను. తప్పించుకుందామని అనుకోకు, ప్రాణాలు తీస్తాను.." కర్కశంగా, కచ్చితంగా చెప్పి డాగా బాత్‌రూమ్‌కు వెళ్లాడు.

కైలాశ్ నీరసంగా లేచి టీ పాయ్ మీద గ్లాసులు, కింద వున్న మ్యాగజైన్లు, నేలమీద చిందరవందరగా పడి వున్న పేపర్లు సర్దాడు. అంతలో అతనికి ఒక అయిడియా వచ్చింది. కొన్ని పేపర్లు పట్టుకెళ్లి డాగా కారు వెనకసీటులో పడేసి వచ్చాడు.

---

మర్నాడు పొద్దున్న పాలవాడు కేక వేసేదాకా కైలాశ్‌కు మెలకువ రాలేదు. చూస్తే ఎనిమిదయింది. "ఏం యింత ఆలస్యం?" అని గద్దించాడు.

"హైవే మీద యాక్సిడెంటు అయింది సార్. ఓ నల్లకారు చెట్టుని గుద్దేసింది. డ్రైవరు ఒక్కడే వున్నాడు. పాపం చచ్చిపోయాడు."

"అలాగా! వయసెంత వుంటుందేమిటి?"

"ఏమో సార్, పోలీసులు అతని మొహం మీద న్యూస్‌పేపరు కప్పేశారు!"

---

తన రచనలకు లక్ష్మణే బొమ్మలు వేసుకుంటారు. ఈ కథకూ ఆయనే వేసుకున్నారు. ఇలస్ట్రేషన్ గొప్ప కళ. బొమ్మలు వేయడం వచ్చినంత మాత్రాన అది పట్టుబడదు. ఇలస్ట్రేషన్ వలన కథపై ఆసక్తి రగలాలి తప్ప దానిలో వున్న కీలకాంశం రివీల్ కాకూడదు. కానీ లక్ష్మణ్ యీ కథకు మొదటి పేజీలో వేసిన బొమ్మలో స్టీరింగ్‌కు, డ్రైవర్‌కు మధ్య పేపర్లు అడ్డురావడం బొమ్మ వేసేశారు. నేను కావాలని ఆ భాగాన్ని కట్ చేసి యిక్కడ యిచ్చాను. ఆర్‌కె నారాయణ్ రచనలెన్నిటినో అద్భుతంగా యిలస్ట్రేట్ చేసిన లక్ష్మణ్ యీ కథకు యిలా ఎందుకు చేశారో నాకైతే తట్టటం లేదు. – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)

**ఫిబ్రవరి 36** **ఎమ్బీయస్ : పానుగంటి వారి "సాక్షి" – 3**

సంఘసంస్కర్తలు సంఘాన్ని ప్రేమిస్తారు, దానిలోని లోపాలను ద్వేషిస్తారు. లోపాలు సవరించడానికి కొందరు సూటిమార్గంలో ఉపన్యాసాలు యిస్తారు, మరికొందరు వ్యంగ్యమార్గంలో వెక్కిరిస్తారు. వ్యంగ్యానికి పదును, ప్రభావం ఎక్కువ. కందుకూరి, చిలకమర్తి ప్రహసనాలు రాసినది అందుకే. సంఘంలోని దురాలోచనలను, దురలవాట్లను ఎత్తి చూపడానికి ఇంగ్లీషులో వచ్చిన "స్పెక్టేటర్" వ్యాసాల ప్రభావంతోనే పానుగంటి "సాక్షి" వ్యాసపరంపర మొదలుపెట్టారు. నాటకరంగంలోని కొందరు చేస్తున్న 'అతి'ని, ఔచిత్యభంగాన్ని ఎత్తి చూపడానికి ఆయన రాసిన వ్యాసాలను ఉదహరిస్తే ఆయన నాటకరంగం మొత్తాన్నే తిట్టిపోశాడనీ, నాటకాలనేవి చూడనక్కరలేనివనీ

ఎవరైనా భావిస్తే అంతకంటె పొరబాటు వుండదు. పానుగంటి స్వయంగా నాటకకర్త. పాతిక పై బడి నాటకాలు రాశారు. అసలు ఆయన స్వతహాగా కవి. కాకినాడ నాటక సమాజం వారి నాటక ప్రదర్శనలు చూసి ఉత్తేజితులై, పామరజనానికి కూడా వాటి 'రీచ్' వుందని గ్రహించి అటు మొగ్గారు. పిఠాపురం సంస్థానంలో నాటకకర్తగా నియమించబడడానికి ముందూ, వెనుకా అనేక నాటకాలు రాశారు. అవి గ్రంథమాలగా ప్రచురించబడ్డాయి. ఆయన నాటకాల్లో కొన్ని – "సారంగధర", "ప్రచండ చాణక్యము", "రాధాకృష్ణ", "పాదుకా పట్టాభిషేకము", "విప్రనారాయణ"! విప్రనారాయణ నాటకం చదివితే ఆ పేరుతో వచ్చిన సినిమాలో రేలంగి–భానుమతి మధ్య డైలాగ్సుకి యీ నాటకసంభాషణలే ప్రేరణ అనిపిస్తుంది. "కంఠాభరణం" అనే యీయన రాసిన ఫార్స్ అద్భుతంగా వుంటుంది. ఒక్క రాత్రిలో కథ నడుస్తుంది. దానిలో 'మాలప్రాపిజం'ను ఆయన ఎంత బాగా వాడుకున్నారో చెప్పలేను. హాస్యప్రియులు చదివి తీరవలసిన పుస్తకమది. ఇక కవిగా ఆయన ప్రతిభకు ఒక ఉదాహరణ – "సంపూర్ణ రామాయణం" సినిమాలో రాముణ్ని ఉద్దేశించి వశిష్ఠుడు పాడినట్లు ఆయన పద్యాన్ని టెయిల్‌పీస్‌గా వాడుకున్నారు. దాన్ని యథాతథంగా యిస్తున్నాను. ఇదీ నాకు చాలా యిష్టమైన పద్యమే!

సర్వమంగళ గుణసంపూర్ణుడగు నిన్ను నరుడు దేవునిగాగ నరయుగాత
రామనామము భవస్తోమభంజన దివ్యతారకనామమై తనరుగాత
పదికొంపలు లేని పల్లెనైనను రామభజన మందిరమొండు వరలుగాత
కవులెల్ల నీ దివ్యకథ నెన్నో రీతుల గొనియాడి ముక్తి గైకొంద్రుగాత
ఎట్టి వ్రాతయు శ్రీరామ చుట్టబడక వ్రాయబడకుండు గావుత
రామవాక్యమనిన తిరుగనిదని యర్థమగునుగాత
రమ్యగుణధామ రఘురామ రామరామ ఎఎ

ఇక "సాక్షి" వ్యాసానికి వస్తాను – 2000 సంఎరంలో ప్రపంచం అంతరించి పోతుందన్న పుకార్లు వచ్చినమాట యిప్పుడు ఎంతమందికి గుర్తుందో తెలియదు. 2012లో ప్రళయమే అని కూడా ప్రచారం సాగింది. అంతకుముందు 1900 సంఎరంలో, 1800 లో కూడా యిలాటి పుకార్లే వచ్చాయట. స్కైలాబ్ పడిపోతుందని, అష్టగ్రహ కూటమి అని, వినాయకుడు పాలు తాగాడని, అమ్మవారి విగ్రహం నుంచి రక్తం కారిందని, ఏసు క్రీస్తు నీడ గోడమీద పడిందని, ఏదో ఒకటి చెప్పి ప్రపంచమంతా ప్రజలు కంగారు పడుతూనే వుంటారు. ప్రతీసారీ నోస్ట్రాడమన్ జోస్యం అనడం, మన తెలుగునాట అయితే బ్రహ్మంగారు చెప్పారనడం పరిపాటి. ఇటీవల గ్లోబల్ వార్మింగ్ గురించి చేసేదేమీ లేకపోయినా చర్చించడాలు, అడలగొట్టడాలూ ఎక్కువయ్యాయి. ఇలాటి మాటలు అప్పుడూ వున్నాయి. వాటి గురించిన వ్యాసం యిది.

గ్రహచక్ర జ్యోతిషము – సమావేశస్థలానికి వచ్చినవారు 'ఇప్పటికే ఎండలు తీవ్రంగా వున్నాయి, వైశాఖమాసం ఎలా వుంటుందో ఏమో' అనుకుంటూండగా జంఘాల శాస్త్రి ఉపన్యాసం మొదలుపెట్టాడు – "కావా? యింకా ఎక్కువవుతాయి. ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం ఎండలు హెచ్చిపోతున్నాయి. వర్షాలు తగ్గిపోతున్నాయి. భూమిలోని సారం హరించిపోతోంది. భూగర్భంలో వుండే అగ్ని అధికమవుతోంది. లతలు, చెట్లు నీరసిస్తున్నాయి. ఇక మనుష్యుల మాట చెప్పేదేముంది? ఏడు తరాల కింద జీవించిన మనిషి ఎవరైనా మళ్లీ పుట్టి మనల్ని చూస్తే మనం మనుష్యజాతి వాళ్లం అనుకోడు. అతని ముందు గేదె ముందు లేతపెయ్యల్లా అగపడతాం. దీనికంతా కారణం ఎండ. సూర్యుని ఆకర్షణ శక్తి అధికం కావడం చేత భూమి దినదినానికి సూర్యుడికి దగ్గరగా వెళ్లిపోతోంది. మన తండ్రుల కాలం కంటె మన కాలం వచ్చేసరికి మరింత దగ్గరగా వెళ్లింది. ఆ మహాగ్నికుండం ఏ పగలు మనల్ని భోజనం చేస్తుందో, ఏ రాత్రి నిద్రపోతూండగా గబుక్కున మింగుతుందో? అప్పుడు యీ భూమి దీపంలో మిడతలా, హెూమకుండంలో నేతిబొట్టులా అంతరించిపోదూ!?

ఇదిగో యీ పత్రిక చూశారా? కొన్ని సంవత్సరాలలో కొన్ని కోట్ల యోజనాల తోకతో ఒక గొప్ప తోకచుక్క అవతరిస్తుందని పాశ్చాత్యుడు రాసిన వ్యాసం. అది ఒక క్రమం అనుసరించి, రూటు ప్రకారం పోకుండా యిష్టం వచ్చినట్లు ప్రయాణిస్తుందట. పొరపాటున ఖర్మకాలి, అంత పెద్ద తోకతో మన భూమిని కొడితే గాలిలోకి తన్నిన బంతిలా మన గోళం ఎక్కడకి ఎగిరిపడుతుందో ఆలోచించండి. భూమి అలా అంతరిక్షంలోకి ఎగిరిపోతూంటే మన గతి ఏమిటి? చెట్టు దులిపితే నేరేడుపళ్లు జలజల రాలినట్లు భూమి నుండి చెల్లాచెదరై జలజల–జరజర–బిరబిర కిందకు పడిపోమా? కింద అంటున్నాను కానీ భూమిని వదిలినవాడికి కిందేమిటి, పైనేమిటి? దేనిమీదా పడకుండా అంతరిక్షంలో గిరగిర ఎన్ని యుగాలు తిరుగుతూ వుంటామో ఏమో! అలా ఎగిరిపోకుండా భూమి మీద ఏ స్తంభాన్నో గట్టిగా పట్టుకుని నిలదొక్కుకున్నా, భూమి మరి ఏ యితర గోళాన్నో ఢీడిక్కీ కొడితే పండు దోసకాయ విచ్చిపోయినట్లు మన గోళం విడిపోదా? మనం గొట్టంలోంచి వెన్న ముద్దలు ఎగిసినట్లు పైకి ఎగిరిపోమా? మనలో కొందరు యితర గోళాల్లో పడిపోరా?

ఈ పత్రికలోనే 37 వ పుటలో ఏముందో చూశారా? ఇది రాసిన పాశ్చాత్యుడు ప్రకృతిశాస్త్ర పండితుడు. సూర్యునిలో వంటచెఱకు తగ్గిపోతోందట. అందుకే సూర్యదీప్తి తగ్గిపోతోంది. కొంతకాలం జరిగాక సూర్యుడు ఆరిపోతాడు. సూర్యుడు చల్లారిపోతే చంద్రుడు, నక్షత్రాల మాట లెక్కేమిటి? ప్రపంచమంతా గాఢాంధకారం కమ్ముకుంటుంది. పగలు, రేయి తేడా తెలియదు. ఏక చలి. చలి

కాచుకుందామంటే అగ్గిపుల్లయినా వెలుగుతుందో లేదో. అందరం గుడ్డివాళ్లం అయిపోతాం. ఆకలికి అలమటించి ఒకరి నొకరం తింటాం. ఇదొకటేనా? ఆరిపోయిన సూర్యుడికి ఆకర్షణశక్తి కూడా పోతుంది కదా. అది లేకపోతే యితర గోళాలు అంతరిక్షంలో ఎలా నిలుస్తాయి? వచ్చి మనమీద పడతాయేమో! ఈ ఆలోచన వచ్చిన కొద్దీ నాకు అన్నం సహించటం లేదు. మనసు చెదిరిపోయింది." అంటూ నిట్టూర్పులు విడుస్తూ జంఘాల శాస్త్రి కూర్చున్నాడు. ఇది విని పోగొట్టుకోవడానికి భార్య, పిల్లలు, సోదరీసోదరులు ఎవరూ లేని కాలాచార్యులు కూడా విషాదంలో మునిగిపోయాడు. ఢీకొట్టినపుడు తను యింకో గోళంలోకి ఎగిరిపడితే అక్కడ తన కవిత్వం వినిపించడానికి వారికి తెలుగు వచ్చో రాదో అనే చింతతో కవి అయిన వాణీదాసుడు వెర్రివాలకం వేసి కూర్చున్నాడు. ఇక శ్రోతలందరూ దుఃఖంలో మునిగిపోయారు. వారిలో కొందరు తోకచుక్క కొట్టే లోపున రావలసిన బాకీలు వసూలు చేసుకుంటే మంచిదనుకుంటూ బయటకు వెళ్లిపోయారు. తూర్పు ప్రాంతాల నుంచి వచ్చిన ఒక యువతి జంఘాల శాస్త్రి వద్దకు వచ్చి "అయ్యా మా పిన్నమ్మ నిన్న నేను వచ్చేసరికి కొత్తగా పెట్టిన ఆవకాయను ఎండపెట్టింది. అది ఎండకుండానే సూర్యుడు ఆరిపోతాడంటారా?" అని ఆదుర్దాగా అడిగింది.

ఇదంతా చూసి నేను (ఈ ఉపన్యాసాలు, కార్యకలాపాలు రిపోర్ట్ చేసే సాక్షి అనే అతను) వేదిక ఎక్కి మాట్లాడాను – "చేటలో పడినది మొదలు కాటిలో పడేవరకూ మనం ప్రత్యక్షంగా ఏడవవలసిన ఏడుపులు చాలవన్నట్లు కొత్తగా యీ రోదనకాండ పారాయణ చేయాలా? మీకేమైనా మతి పోయిందా? ముంచుకు వచ్చిన ఆపదలను వేదాంత విజ్ఞానమున తొలగించుకోవడం మన విధి. అది మర్చిపోయి ఎప్పుడో రాదలచిన, వస్తుందో రాదో అని సందేహింప దగిన, వచ్చినా కలియుగంలో నాల్గో పాదంలో తప్ప రావడానికి వీల్లేని ఆపద గురించి యిప్పుడు ఆలోచించడం దేనికి? అంత సర్వనాశనం చేసే వుపద్రవమే అయితే విచారించేవాడి విచారానికే అవకాశం లేదు, ప్రతిక్రియ చేయడానికీ అవకాశం లేదు. అలాటి ఆపద వచ్చినప్పుడే ఏడవకుండా యిప్పుడే వచ్చినట్లు ఏడ్చేవాడు మూరు?డు కాడా? ప్రాపంచిక వస్తువులు అస్థిరములు. శాశ్వతపదార్థం నీలో వున్నదని తెలుసు కదా. ఏ మహాతేజము ముందు సూర్యుడు కూడా బొగ్గువలె వుంటాడో ఆ తేజాన్ని నువ్వు ఆధ్యాత్మికదృష్టితో చూడగలిగినప్పుడు సూర్యుడు ఆరిపోతే ఏమి? గురుశుక్రులిద్దరు ఢీకొని పొడి ఐపోతేనేమి? అట్టి జ్ఞానదశ ఎలా పొందాలో నేను చెప్తాను." అని ఉపన్యాసం మొదలుపెట్టేసరికి అందరూ జారుకున్నారు. **(సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : ఆపసోపాంధ్ర

విభజన జరిగాక మిగిలిన భాగాన్ని ఇంగ్లీషులో 'రెసిడ్యువల్ ఆంధ్రప్రదేశ్' అని ఇంగ్లీషులో, 'అవశేష ఆంధ్రప్రదేశ్' అని తెలుగులో అన్నారు. వ్యాసాల్లో 'అవశేష' పదాన్ని వుపయోగిస్తుంటే అదేదో అవమానకరమైన పదం అన్నట్టు కొందరు చాలా ఫీలై పోయారు. నవ్యాంధ్ర అనరాదా, స్వర్ణాంధ్ర అనరాదా అని చివాట్లు వేశారు. మీరు ముద్దుపేరు ఏదైనా పెట్టుకోవచ్చు, కానీ అసలు పేరు అదే కదా అంటే వినలేదు. ఇక్కడ బాబు, అక్కడ మోదీ కలిసి ఆంధ్రను మిరుమిట్లు గొల్పిస్తారని, గొల్పించకపోతే జనసేనానాయకుడు కల్పించుకుని యిద్దర్నీ ప్రశ్నిస్తాడనీ వాళ్లు ప్రగాఢంగా నమ్మారు. ఇది 2014 జూన్ నాటి కథ. 9 నెలలైంది. ఈ రోజు స్వర్ణాంధ్ర కాదు కదా, రోల్డుగోల్డు ఆంధ్ర కూడా వచ్చినట్లు కనబడటం లేదు. బాబు అంటే ఆషామాషీ మనిషి కాదని, జాతీయస్థాయిలో చక్రం తిప్పగల సమర్థుడని ఆంధ్రప్రజలకు బలే నమ్మకం. రాష్ట్రం సమైక్యంగా వుండకపోతే ఆంధ్ర, తెలంగాణ రెండూ నష్టపోతాయని సమైక్యవాదులు నెత్తినోరు కొట్టుకుని చెప్పినా వాళ్లు వినలేదు. సమైక్యనినాదంతో కిరణ్ కుమార్ రెడ్డి పార్టీ పెడితే ఓట్లేసినవాడు కాదు కదా, టిక్కెట్టు పుచ్చుకున్నవాడు కూడా లేకపోయాడు. ప్రజల్లో స్పందన కరువు కావడంతో నాయకులు పారిపోయారు, పార్టీ హారతి కర్పూరంలా యిగిరిపోయింది.

ప్రకృతివైపరీత్యాలలో సర్వం నాశనం అయినప్పుడే కాసులు విదల్చని కేంద్రం మీరు సింగపూర్లు కట్టుకోండి, టోక్యోలు కట్టుకోండి మేం నిధులిచ్చి కళ్లప్పగించి చూస్తూ వుంటాం అంటుందా? పదవీకాలం చివర్లో దీన్ని తలపెట్టిన కాంగ్రెసు బాధ్యత వహించదు కదా? కొత్తగా వచ్చే పార్టీకి బాధ్యత వుండదు కదా? గతంలో చీల్చిన మూడు రాష్ట్రాలకు పుష్కరం గడిచినా రాజధానులు ఏర్పడలేదు కదా? చీల్చాలని మేమేమీ అనలేదు కదా, మీలో మీరు కొట్టుకుని చచ్చి విడిపోతే మిమ్మల్ని నిలబెట్టడానికి యితర రాష్ట్రాల పొట్ట కొట్టి మీకెందుకు యివ్వాలి అని కేంద్రం అడిగితే మన దగ్గర సమాధానం ఏమిటి? – యిలాటి ప్రశ్నలు ఎన్ని అడిగినా సమాధానం యిచ్చినవాడు లేడు. తక్కువేమి మనకు రాముడొక్కడుండు వరకు అనే రామదాసు కీర్తనలా బాబుండగా మనకు ఢోకా లేదు అనే ఆవేశంలో ఉద్రూతలూగిపోయారు. తిరుపతి సభలో మోదీ ఏ వాగ్దానమూ చేయకుండా మీకు తూర్పున సముద్రం వుంది, దాన్ని వుపయోగించుకుని మీ అంతట మీరే బాగుపడండి అని చెప్పి వెళ్లాడు. అది విని 'తూర్పుకు తిరిగి దణ్ణం పెట్టమన్న మోదీ' అని నేను రాస్తే నాపై ఎందరు విరుచుకుపడ్డారో చెప్పలేను. ఆ తర్వాత సముద్రతీరాన్న వున్న వైజాగ్‌పై హుదూద్ విరుచుకుపడడం, 30 వేల కోట్ల నష్టం జరిగిందని వీళ్లు లెక్కలేస్తే మోదీ వెయ్యికోట్లు మాత్రం ప్రకటించి, అది కూడా యిప్పటిదాకా పూర్తిగా యివ్వకపోవడం గమనించాక కూడా యీ రోజుకీ వారందరికీ మోదీపై నమ్మకం యింకా అలాగే మిగిలుందని అంటే వారి వైపు తిరిగి మనం దణ్ణం పెట్టాలి.

ఎందుకంటే బాబుగారికే కేంద్రంపై నమ్మకం సడలిపోయింది. ఫైనాన్సు కమిషన్ సిఫార్సుల తర్వాత మోదీని వ్యక్తిగతంగా ఏమీ అనకపోయినా 'ఏపీకి న్యాయం జరగలేదు, రాష్ట్రాభివృద్ధి కోసమే కేంద్రంలో చేరాం అయినా నా మొర కేంద్రం ఆలకించలేదు, రెండు కాళ్లూ కట్టేసి పరిగెట్టమంటే ఎలా?' అని బహిరంగంగా అసంతృప్తి వ్యక్తపరిచారు. ఇవాళ రైల్వే బజెట్ తర్వాత అసంతృప్తి డోసు పెంచారు. ప్రత్యేక రైల్వే జోను లేదు, వైజాగ్‌ను సౌత్ సెంట్రల్‌లో కలపలేదు (కొత్త లైన్లు లేకపోతే లేకపోయాయి లెండి, అవి ప్రకటించడమే తప్ప ఓ పదికోట్లో విదిలిస్తారు, ఎటూ సరిపోదు, పాతవి పూర్తి చేస్తే అంతే చాలు), వైజాగ్ మెట్రో లేదు, ఆంధ్ర రాజధాని మెట్రో లేదు, కోస్తా ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మెరుగుపరచడానికి యిచ్చిన దాంట్లో ఆంధ్ర కోస్తాకు ఎంత యిస్తారో స్పష్టత లేదు. ప్రత్యేక జోన్ గురించి విభజన చట్టంలో పేర్కొన్నారని టిడిపి నాయకులు పూరిస్తూ వచ్చారు. పేర్కొనడం వేరు, యిస్తామని కమిట్ కావడం వేరు. ఇదే కాదు, యింకా అనేకవాటికి 'సాధ్యతలు పరిశీలిస్తాం' అనే మాటతో సరిపెట్టారు. ఐఐఎం ఒక్కటే కచ్చితమైన హామీ. అది అమలవుతోంది. తక్కినవన్నీ పరిగణించి తృణీకరించారని అనుకోవాలి. ఆంధ్రలో కొత్త జోన్ ప్రతిపాదన ఏదీ తన వద్ద లేదని రైల్వే బోర్డు చైర్మన్ ఏకె మిట్టల్ కుండ బద్దలు కొట్టి చెప్పాక, మన నాయకులు యింకా ఏం చెప్పి ఆశపెడతారు? అసలు రైల్వే మంత్రి బజెట్ ఉపన్యాసంలో ఆంధ్ర పేరే ఉచ్చరించలేదు కదా! అన్నిటి కన్నా ముఖ్యమైనది ప్రత్యేక హెూదా! మన్‌మోహన్ స్వయంగా చెప్పాక కూడా దాన్ని అమలు చేయించుకోలేక పోతున్నారేమని కాంగ్రెసు పార్టీ కవ్విస్తూ వుంటే తప్పక తెచ్చుకుంటాం అని యిన్నాళ్లూ బుకాయిస్తూ వచ్చిన టిడిపి యిక చేతులు ఎత్తేసింది. హెూదా గురించి వెంకయ్య నాయుడు మార్చి మార్చి చెపుతున్న కబుర్లు జోకుల స్థాయికి చేరుకున్నాయి. దాంతో ఆయనను కాస్సేపు వూరుకోమని చెప్పి, ఢిల్లీలో వున్న టిడిపి అధికార ప్రతినిధి ఆంధ్రకు ప్రత్యేక హెూదా తేలేకపోయినా, హెూదాతో సమానమైన సదుపాయాలు పొందుతాం అని కొత్త పల్లవి మొదలుపెట్టారు. ఏవీ ఆ రాయితీలు అని అడిగితే అబ్బే, శాఖల పరంగా నిధులు సంపాదించడానికి చూస్తున్నాం అని జవాబు. శాఖలవారీ కేటాయింపుల్లో కొత్తేముంది? విభజన వలన జరిగిన నష్టాన్ని పూడ్చడానికి చేస్తున్న ప్రత్యేక కృషి ఏముంది?

కేంద్రపన్నుల వాటాలో రాష్ట్రాల వాటా పెంచడమనేది చాలా మంచి అడుగు. అయితే రాష్ట్రాలు వాటిని సంక్షేమ పథకాలకై ఖర్చు పెట్టేయకుండా అభివృద్ధి పనులపై వెచ్చించేట్లు కొన్ని షరతులు విధిస్తే బాగుంటుంది. ఆంధ్రకు వచ్చేసరికి వచ్చే ఏడాది బజెట్ లోటు గురించి చెప్తున్నారు. ఈ ఏడాది లోటు 9 వేల కోట్లుంటే రూ. 500 కోట్లు యిచ్చి వూరుకున్నారు. మిగిలిన దాని గురించి ఊసెత్తడం లేదు. కమిషన్ అంచనాల ప్రకారం ఐదేళ్ల తర్వాత కూడా రాష్ట్రం రెవెన్యూ లోటులోనే కొట్టుమిట్టులాడుతుంది. ఇటు బాబు ప్రభుత్వం చూస్తే లక్ష కోట్ల బజెట్ రూపొందించేస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ బజెట్‌లు వచ్చినపుడు తెలుస్తుంది – అంచనాలకు, వాస్తవాలకు అంతరం ఎంత తీవ్రంగా వుందో! 2020 నాటికి దేశంలోని అన్ని రాష్ట్రాలు మిగులు బజెట్ స్థితికి చేరితే ఆంధ్ర మాత్రం జమ్మూ కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల సరసన లోటు బజెట్‌లో వుంటుంది. అది రూ. 2500 కోట్లు వుంటుంది. ఇది చూసైనా ఆంధ్రకు ప్రత్యేక హెూదా కల్పించాలి లేకపోతే చరిత్ర క్షమించదు (చరిత్ర దాకా ఎందుకు, టిడిపి క్షమిస్తుందో లేదో చెప్తే చాలు) అని ఆంధ్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు, టిడిపి ఆర్థిక సలహాదారు కుటుంబరావుగారు అంటున్నారు. పరిస్థితి యింత దీనంగా వున్నపుడు సంక్రాంతికి చంద్రన్న పప్పుబెల్లాలు పంచమన్న సలహా ఎవరిచ్చారో మరి! తెలంగాణతో పోటీ పడి ఉద్యోగులకు 43% ఫిట్‌మెంట్ యిమ్మన్నదెవరో మరి!

ఆర్థికసంఘం ఆంధ్రకు ప్రత్యేక హెూదా గురించి పట్టించుకోలేదు. మీకేమీ స్పెషల్ మీల్స్ లేవు, అందరితో బాటూ అన్నసమారాధనే అన్నారు. జాతీయ పెట్టుబడి నిధిని తీసేస్తున్నారు కాబట్టి ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన డబ్బంతా కేంద్రానికే వెళుతుంది, రాష్ట్రాలకు పైసా రాదు. ఐదేళ్లలో ఆంధ్రకు చుట్టూ వున్న రాష్ట్రాలు మిగులు బజెట్‌తో కళకళలాడుతూ వుంటే ఆంధ్ర మాత్రం కేంద్రం యిచ్చిన నిధులన్నీ ఉద్యోగుల జీతాలకే వెచ్చిస్తూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు పెట్టడానికి ఏమీ లేకుండా అల్లాడుతూంటే ఎవడైనా పెట్టుబడి పెట్టడానికి ముందుకు వస్తాడా? రాష్ట్రాన్ని ప్రత్యేకంగా పరిగణించి నిధులివ్వకపోతే 20, 30 ఏళ్లకు కూడా రాష్ట్రం అభివృద్ధి చెందే అవకాశం లేదని బాబు కుప్పంలో చెప్పేశారు. రాజధాని కట్టడం గురించి, దాన్ని మేన్‌టేన్ చేయడం గురించి ఏమీ లెక్కలోకి వేసుకోకుండా వుంటేనే పరిస్థితి యిలా వుంది. ఆ లెక్కలు కలిపితే చెప్పడానికి ఏమీ లేదు. పరిస్థితి యిలా తయారైంది కాబట్టి బాబు దీని నుంచి చేతులు కడిగేసుకుందా మనుకుని చూస్తున్నారు. 'రాష్ట్ర విభజనను ప్రజలు కోరుకోలేదు, కాంగ్రెస్, బిజెపి కలిసి రాష్ట్రాన్ని చీల్చాయ'ని యిప్పుడు చెప్తున్నారు. విభజనను అఖిలాంధ్ర ప్రజలు కోరుకుంటున్నారని ఆయన నియమించిన ఎర్రన్నాయుడు కమిటీ చెప్పిన మీదటే ఆయన విభజన కోరుతూ కేంద్రానికి లేఖ యిచ్చారు. ఆంధ్రప్రాంతం టిడిపి నాయకులు ఎంత మొత్తుకున్నా దాన్ని వెనక్కి తీసుకోలేదు. కేంద్రం అఖిలపక్షం ఏర్పాటు చేసినప్పుడల్లా తన ప్రతినిధులిద్దరిలో ఒకరి చేత విభజనరాగం పాడించారు. తాము విభజనకు లేఖ యివ్వడం చేతనే తెలంగాణ సానుకూల పడిందని తెలంగాణలో పాదయాత్రలో పదేపదే నొక్కి వక్కాణించారు. లోకసభలో తెలంగాణ బిల్లు పాస్ అయ్యే సందర్భంగా ఆయనకు అత్యంత విశ్వాసపాత్రుడైన నామా నాగేశ్వరరావు, తదితరులు కలిసి ఆంధ్ర టిడిపి ఎంపీపై భౌతికంగా దాడి చేసినా వూరుకున్నారు. వారిని పార్టీలోంచి సస్పెండ్ చేయలేదు సరికదా, మళ్లీ టిక్కెట్లు యిచ్చారు.

ఇన్ని చేశాక యిప్పుడు ఏసుక్రీస్తును కొరత వేయమని తీర్పు యిచ్చి 'దీని పాపం ప్రజలదే' అంటూ చేతులు కడుక్కున్న పిలాతులా యీ విభజన పాపం ఆ రెండు పార్టీలది అంటున్నారంటే దాని అర్థం ఏమిటి? విభజన వలన ఆంధ్ర ఘోరంగా నష్టపోయింది, కొన్ని

దశాబ్దాల దాకా కోలుకునే ఛాన్సు లేదు అని గ్రహించబట్టే కదా. దీనిలో ఏ పాటి మేలు వుందని తోచినా నా వలననే యీ పరిణామం జరిగిందని బాకా వూదేవారు కాదా! ఇవాళ బజెట్ వస్తుంది, దానిలో కూడా ఆంధ్రకు మేలు జరుగుతుందని అనుకోవడానికి ఏమీ లేదు. ఆ తర్వాత బాబు ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేస్తారట. ప్రధానిని, హోం మంత్రిని, రైల్వే మంత్రిని, ఆర్థిక మంత్రిని, పనిలో పనిగా రాష్ట్రపతిని కలిసి వస్తారు. సంక్రాంతి దాసరి ఎన్ని రౌండ్లు కొట్టినా నెత్తి మీద కుంభం ఖాళీగానే వుంది. బాబుకు ఆపసోపాలే తప్ప రాష్ట్రానికి ఆలంబన దొరకటం లేదు. అందుకే దీన్ని అవశేషాంధ్ర ప్రదేశ్‌కు బదులు ఆపసోపాంధ్ర ప్రదేశ్ అనడం సముచితంగా వుంటుంది.

ఇవన్నీ బాబుకి తప్పకుండా వేదన కలిగిస్తూ వుంటాయి. తనపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, తనలో ఒక ఆధునిక మయబ్రహ్మను వూహిస్తున్నారనీ తెలుసు, అవి నెరవేరకపోతే తన అభిమానుల్లో కలిగే ఆశాభంగం తలచుకుని ఆయన మనసు కలవరపడుతూ వుంటుంది. మనం సినిమాల్లో చూస్తూ వుంటాం – సర్కసులో జోకర్ వుంటాడు, అతని తల్లి చనిపోయిందని అప్పుడే తెలుస్తుంది. కన్నీళ్లు ధారగా సాగుతూ వుంటాయి. అవతల డేరాలో ప్రజలు చప్పట్లు కొడుతున్నారు. తను వచ్చి వాళ్లని అలరించి రంగురంగుల వూహల్లో తేలియాడిస్తాడని ఎదురుచూస్తున్నారని తెలుసు. కళ్లు తుడుచుకుంటాడు. మొహానికి రంగు పూసుకుంటాడు. 'ద షో మస్ట్ గో ఆన్' అనుకుంటూ పగలబడి నవ్వుతూ, బుడగలు చేతబట్టి రంగంపైకి ప్రవేశిస్తాడు – రైల్వే బజెట్‌లో ఆంధ్రకు సున్నా చుట్టారని తెలిసిన రోజునే బాబు సింగపూరు ప్రతినిథులను రప్పించి, వారి చేత కొత్త రాజధాని బ్లూ ప్రింట్ గురించి మాట్లాడించారు. రాజధాని నిర్మాణాన్ని సింగపూర్ ప్రభుత్వం చేపట్టడం లేదని ఒప్పుకుంటూ (సింగపూరు ప్రభుత్వమే కడుతోందని చాలాకాలంపాటు మన పత్రికలు రాసినది తప్పు, సింగపూరు వెబ్‌సైట్‌లు రాసినది కరక్టు అని స్పష్టమైందిగా) పిపిపి పద్ధతిని ఒక ప్రయివేటు సంస్థకు యిస్తున్నామని చెపుతూనే, వ్యాపార వాణిజ్యంతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు ఆంధ్ర అన్నివిధాలా అనువైనదనే విషయం సింగపూర్ 'ప్రభుత్వాని'కి తెలుసని అన్నారు. సింగపూరాయన కూడా తక్కువ్వాడు కాదు. ఆంధ్ర జర్నలిస్టులు సిద్ధంగా వుంటే (అసలా సందేహం ఎందుకు వచ్చింది? ఇలాటి విషయాల్లో ఎవర్రెడీ!) సింగపూరు తీసుకెళతామన్నాడు. బాబు వంతుగా రాజధాని ప్రాంతంలోని జరీబు రైతులకు 150 గజాలు ఎక్కువ యిస్తానన్నారు. ఉద్యాన పంటలకు లక్షన్నర వరకు ఋణమాఫీ చేస్తానన్నారు. పళ్లతోటలున్నవారికిచ్చే పరిహారం ఎకరాకి 50 వేలు పెంచారు. ఇలా చేస్తూనే ప్రస్తుతం 7% వున్న వ ృద్ధి రేటును వచ్చే ఏడాదికే డబుల్ డిజిట్‌కు తీసుకెళతామన్నారు. రైల్వే బజెట్ యిలా అఘోరించింది, రేపటి బజెట్ యింత కంటె మనని ఉద్ధరిస్తుందా, ఏం చూసుకుని యీ వాగ్దానాలు అని అడిగితే 'అబ్బే రైల్వేకి యిది పూర్తి బజెట్ కాదు, అనుబంధ బజెట్ వచ్చే అవకాశం వుంది' అని కబుర్లు చెపుతున్నారు.

ద 'షో' మస్ట్ గో ఆన్! – **(సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి 25-27 వీక్లీకై**

## ఎమ్బీయస్ : విలోకనం – 02
## ఎమ్బీయస్ : మధ్యప్రదేశ్‌లో మార్కుల స్కామ్

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌పై మార్కుల స్కామ్ నీడలు పడ్డాయి. టీచర్లు, పోలీసు కానిస్టేబుళ్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఫారెస్టు గార్డులు, జైలు గార్డులు, ఫుడ్ యిన్‌స్పెక్టర్లు వంటి అనేక ప్రభుత్వోద్యోగాల రిక్రూట్‌మెంట్‌కై నిర్వహించే పరీక్ష నిర్వహించే సంస్థను ఆ రాష్ట్రంలో వ్యావసాయిక్ పరీక్షా మండల్ (సింపుల్‌గా వ్యాపమ్) అంటారు. వారి పరీక్షలో వచ్చిన మార్కుల ప్రకారమే ఉద్యోగ నియామకాలు జరుగుతాయి. లంచాలు తినో, నేతల పలుకుబడికి లొంగో అధికారులు కొందరి మార్కులు మార్చేసి ప్రతిభావంతులకు అన్యాయం చేశారని గత ఏడాదే గొడవ జరిగింది. నిందితుల్లో ఒకడు, సిస్టమ్ ఎనలిస్ట్ అయిన నితిన్ మొహీంద్రా అనే అతని వద్ద ఒక ఎక్సెల్ షీటు దొరికింది. ఎవరెవరు ఎవరెవరి విషయంలో తమ పలుకుబడి వుపయోగించారో అలాటి 131 పేర్లు దానిలో వున్నాయి. దిగ్విజయ్ సింగ్ ఆ షీటు సంపాదించి హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశాడు. దానిపై స్పందించిన హైకోర్టు మాజీ జడ్జి ఆధ్వర్యంలో స్పెషల్ ఇన్వెస్టిగేటింగ్ టీమ్ (సిట్) ఏర్పాటు చేసి విచారించమంది. ఆ షీటులో తన పేరు కూడా వుండడంతో ఉమా భారతి సిబిఐ చేత విచారణ జరిపించమని కోరారు. కానీ ముఖ్యమంత్రి రాష్ట్ర పోలీసుల చేతే చేయిస్తున్నారు.

ఇప్పటికి 500 మందిని అరెస్టు చేశారు. వారిలో విద్యాశాఖ మంత్రి, ఆరెస్సెస్‌కు సన్నిహితుడు అయిన లక్ష్మీకాంత శర్మ కూడా వున్నారు. లిస్టులో వున్న పేర్లలో ఆరెస్సెస్ నాయకుడు సురేష్ సోనీ, ఆరెస్సెస్ మాజీ చీఫ్ కెయస్ సుదర్శన్ పేర్లు కూడా వున్నాయి. అసలు లిస్టులోని పేర్లను విచారణ సంస్థలు మార్చేశారని దిగ్విజయ్ సింగ్ ఆరోపిస్తున్నారు. ముఖ్యమంత్రి పేరు 21 చోట్ల వుంటే ఆయన పేరు తీసేసి ఆ స్థానంలో విద్యామంత్రి పేరు పెట్టారని, ఉమా భారతి పేరు ఏడు చోట్ల మార్చారని, రాజ్‌భవన్ పేరును ఒక చోట మార్చారని కూడా ఆరోపించారు. రాజ్ భవన్‌లో వుండే గవర్నరు రామ్ నరేశ్ యాదవ్ కుమారుడు శైలేశ్ కూడా నిందితుల్లో ఒకడు కాబట్టి గవర్నరును విచారించేందుకు అనుమతి కోరుతూ సిట్ హైకోర్టుకు దరఖాస్తు చేసుకుంది. ఉద్యోగాలకు సిఫార్సు చేసిన పెద్దల్లో గవర్నరు కూడా వున్నారు కాబట్టి ఆయన చేత రాజీనామా చేయిస్తారనే వార్తలూ వస్తున్నాయి. ముఖ్యమంత్రి శివరాజ్ అడ్వాణీకి సన్నిహితుడు. అందుచేత అతన్ని దింపేసి మంత్రి కైలాశ్ విజయవర్గీయను అతని స్థానంలో నియమించే యోచన కూడా

అమిత్ షా మనసులో వుందట. దిగ్విజయ్ సింగ్ యిచ్చిన లిస్టు బోగస్ అని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నందకుమార్ చౌహాన్ ఓ పక్క ఆరోపిస్తున్నా, ఆ లిస్టు తెప్పించి నిజానిజాలు తెలుసుకోండి అని అమిత్ షా కేంద్రమంత్రి రవి శంకర్ ప్రసాద్‌ను ఆదేశించారట!
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : తృణమూల్ చీలుతుందా..?

ఫిబ్రవరిలో బెంగాల్‌లో ఒక అసెంబ్లీ స్థానానికి, ఒక పార్లమెంటు స్థానానికి జరిగిన ఉపయెన్నికలలో తృణమూల్ గెలిచింది. తృణమూల్ శారదా స్కామ్‌లో పీకలదాకా యిరుక్కున్నా, సిపిఎం నిర్జీవంగా పడి వున్నా ఫలితం యిలా రావడంతో అక్కడ ఎదుగుదామని చూస్తున్న బిజెపి కంగు తిని, ముకుల్ రాయ్ ద్వారా తృణమూల్‌ను చీల్చే ప్రయత్నం చేస్తోందని వార్తలు వస్తున్నాయి. ముకుల్ రాయ్ 24 పరగణా జిల్లాకు చెందిన కాంగ్రెసు నాయకుడు. మమతా బెనర్జీ లాగే ప్రియరంజన్ దాస్‌మున్షీకి అనుచరుడు. మమతా 1984లో సిపిఎం దిగ్గజం సోమనాథ్ చటర్జీని ఓడించాక, ఆమె శక్తిని గుర్తించి ఆమెకు అనుచరుడిగా మారాడు. 1998లో తృణమూల్ పార్టీని స్థాపించమని ప్రోత్సహించాడు. వ్యవస్థాపక జనరల్ సెక్రటరీగా రిజిస్ట్రేషన్ సమయంలో సంతకం పెట్టాడు. ఎన్నికల కమిషన్‌నుండి పార్టీ గుర్తు ఆమోదింప చేసుకున్నాడు. 2000 సం॥లో అందరూ ఆమెను విడిచి వెళ్లినా అతను వెంటనంటి వున్నాడు. అప్పట్లో విద్యావంతులకు, మేధావులకు మమతా అంటే గౌరవం వుండేది కాదు. నందిగ్రామ్, సింగూర్ ఘర్షణ సమయంలో ముకుల్ ఎంతో కష్టపడి మీడియా ద్వారా ఆమె యిమేజిని మారుస్తూ వారికి ఆమోదయోగ్యురాలిగా చేశాడు. మమత అతనిపై చాలా ఆధారపడింది. అజిత్ పాంజా, సుబ్రత ముఖర్జీలను తప్పించి అతన్నే నెంబర్ టూగా చేసుకుంది. తన పార్టీ తరఫున యుపిఏలో రైల్వే మంత్రిగా వున్న దినేష్ త్రివేదిని తప్పించినపుడు, ముకుల్ అతని స్థానంలో పంపించింది. మనమోహన్, ప్రణబ్ అభ్యంతరం చెప్పినా ఖాతరు చేయలేదు. ఇలాటి ముకుల్ యిప్పుడు శారదా స్కామ్ కారణంగా దూరమయ్యాడు.

శారదా అధిపతి సుదీప్త సేన్‌ను తను ఎప్పుడూ కలవలేదని మమతా బుకాయిస్తూ వచ్చింది. కానీ ఆమె పార్టీ మాజీ ఎంపీ కునాళ్ ఘోష్ జైల్లోంచి సిబిఐకు రాసిన తన ఉత్తరంలో మమత, ముకుల్ కలింపాంగ్‌లో సమావేశమయ్యారని తెలియపరిచాడు. సిబిఐ ముకుల్‌ని పిలిచి నిజమేనా అని అడిగింది. అతను నిజమని ఒప్పుకున్నాడన్న వార్త మమతను మండించింది. ముకుల్ కలకత్తా తిరిగి రాగానే పిలిపించి నా పరువు తీశావని తిట్టింది. తప్పంతా నీదే అని ఒప్పుకో, నన్ను ముంచకు అందిట. పార్టీ ఆదేశాల ప్రకారమే నడుచుకున్నందుకు నాకు దక్కుతున్న మర్యాద యిదా? అని ముకుల్ వాదించాడట. సిబిఐతో జరిగిన తర్వాతి సమావేశంలో తన పార్టీలో ఎవరెవరు ఎంతెంత తీసుకున్నారో చెప్పేశాడట. వారిలో మమత మేనల్లుడు, పార్టీ ఎంపి అభిషేక్ బెనర్జీ పేరు కూడా వుందిట. 'మాకు చెప్పినట్లు వాళ్లకు తెలియపరచవద్దు. వాళ్లు జాగ్రత్త పడి ఆధారాలు నాశనం చేస్తారు' అందిట సిబిఐ. 'సిబిఐతో ఏం చెప్పావో నాకు చెప్పు' అని మమత అడిగినా ముకుల్ నోరు విప్పలేదు. అతను సిబిఐ ఎప్రూవర్‌గా మారి తనను చిక్కుల్లోకి నెడతాడని మమత భయపడి, అతను ఏం చెప్పినా తనపై కక్షతో చెప్పాడన్న భావం రావడానికై పార్టీలో అతని పరువు తీయాలనుకుంది. అతను వ్యవస్థాపక సెక్రటరీ కాబట్టి అతన్ని తీయలేదు, అందుకని అతనితో సమాన హెూదా కల్పిస్తూ జనరల్ సెక్రటరీ పదవి సృష్టించి దాన్ని సుబ్రత బక్షికి యిచ్చింది. ముకుల్ కొడుకు శుభ్రాంశును పార్టీ యువవిభాగపు ఉపాధ్యక్ష పదవి నుండి తప్పించింది. ఈ పార్టీలో భవిష్యత్తు లేదని ముకుల్‌కు అర్థమైంది. పార్టీ ఫిరాయించి బిజెపిలో చేరితే తృణమూల్ కార్యకర్తలు హర్షించరు. అందుకని తనదే అసలైన తృణమూల్ అనో, మమత నియంతృత్వం నుండి పార్టీని రక్షించవలసిన అవసరం వచ్చిందనో, మరో వాదనతోనో ముకుల్ రాయ్ పార్టీని చీల్చవచ్చని, ఎన్నికల సమయంలో బిజెపితో పొత్తు పెట్టుకుని మమతను ఓడించవచ్చని వూహాగానాలు సాగుతున్నాయి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : అసూయకు మతం ముసుగు

లక్నోలో హెడాఫీసు వున్న ''అవధ్‌నామా'' అనే ఉర్దూ పత్రిక ముంబయి ఎడిషన్‌కు ఎడిటరుగా వున్న షిరీన్ దాల్వి అనే ఆమె ఆరు కేసులతో బాటు ప్రాణాలకు ముప్పు కూడా ఎదుర్కొంటోంది. ఎవరూ గుర్తు పట్టకూడదని బురఖా వేసుకునే అలవాటు కొత్తగా చేసుకుంది. ఉద్యోగం పోయింది, ఆమెను చంపినా పాపం లేదని సాటి ఉర్దూ పాత్రికేయులు అంటున్నారు. ఇంతకీ ఆమె చేసిన పాపం ఏమిటి? తాజా సంచికలో ''చార్లీ హెబ్డో'' ఉదంతం గురించి కథనం వేస్తూ, కవర్‌పేజీపై ఆ పత్రిక ముఖచిత్రంతో బాటు, వారు వేసిన కార్టూన్ ప్రచురించడం. ఆమె వేసిన కార్టూన్‌లో ప్రవక్త పేరు లేదు, ఆయనను అవమానపరిచే ధోరణీ లేదు. ఒక గడ్డపాయన దిగాలుగా కూర్చుని ''మూరు?లచేత ప్రేమించబడుతున్నందుకు బాధగా వుంది'' అంటూంటాడు. ముస్లిము ఉగ్రవాదులు మూర?ంగా మతం పేర హింసకు పాల్పడి ప్రవక్తకు చెడ్డపేరు తెస్తున్నారన్న వ్యంగ్యం మాత్రమే అందులో వుంది. దానితో బాటు ఆ కార్టూన్లను నిరసిస్తూ యిచ్చిన పోప్ కొటేషన్ – 'భావప్రకటనా స్వేచ్ఛకు కూడా పరిమితులున్నాయి, మతవిశ్వాసాలను వెక్కిరించడానికి దాన్ని వాడకూడదు' కూడా వేసింది. పైగా గొడవ రాగానే ఆమె లిఖితపూర్వకమైన క్షమాపణ చెప్పింది. అయినా సద్దు మణగడం

లేదు. చార్లీ హత్యలకు దారి తీసిన కార్టూన్లను అనేక పత్రికలు, వెబ్‌సైట్‌లు వేశాయి, అనేక టీవీలు చూపాయి, వాళ్లెవరికీ రాని హెచ్చరికలు యీమెకు రావడానికి కారణం వృత్తిపరమైన అసూయ అంటున్నారు.

షిరీన్ ఉత్తర ముంబయి శివార్లలోని కౌసాలో నివసించే మధ్యతరగతి ముస్లిం కుటుంబం నుంచి వచ్చింది. ఆ కుటుంబాల్లో నాల్గో తరగతి దాటి ఆడపిల్లల్ని చదివించరు. కానీ ఆమె డిగ్రీ చదివింది. విద్యార్థినిగా వుండగానే వ్యాసాలు రాసి ఉర్దూ పత్రికలకు పంపేది. వారు వేసేవారు కూడా. అబ్దుల్లా కమాల్ అనే ఉర్దూ కవిని పెళ్లాడాక అతని ప్రోత్సాహంతో 'ఉమైె వాజ్‌దాన్' అనే కలంపేరుతో ఆమె రాస్తూ వుండేది. అతను పోయిన తర్వాత షిరీన్ దాల్వి పేరుతో ప్రఖ్యాతి కెక్కింది. సాజిద్ రషీద్ అనే ఉదారవాద ముస్లిం సంపాదకుడుగా నడిపే "సహాఫత్" అనే ఉర్దూ పత్రికలో సహసంపాదకురాలిగా చేరింది. రషీద్ హఠాత్తుగా మరణించినపుడు ఛాందస ముస్లిం జర్నలిస్టుల సంస్థ 'ఫోరమ్ ఎగెనెస్ట్ బ్లాస్‌ఫెమీ' అంత్యక్రియలను బహిష్కరించింది. ఆ సంస్థకు నాయకుడుగా వున్న జుబైర్ అజ్మీయే షిరీన్‌పై మొదటి కేసు పెట్టిన ప్రబుద్ధుడు. షిరీన్ ప్రతిభను గుర్తించిన "అవధ్‌నామా" తన ముంబయి ఎడిషన్‌కు ఆమెను సంపాదకురాలిని చేయడంతో వారందరికీ కడుపు మండింది. దేశంలోని ఉర్దూ పత్రికలలో దేనికీ ఒక మహిళ సంపాదకురాలిగా లేదు. ఆ పదవిపై ఆశ పెట్టుకుని భంగపడిన నిహాల్ సాగిర్ అనే సహోద్యోగి యిప్పుడు షిరీన్‌పై నింద మోపుతున్నాడు. "ఆ కార్టూన్ వేయవద్దని నేను చెప్పినా ఆమె వినలేదు, 'మనం విశాలదృక్పథం కలిగి వుండాలి, మహా అయితే కొందరు ఛాందసులు కొన్ని కాపీలు తగలబెడతారంతే' అని కొట్టి పారేసింది." అని ఒక యింటర్‌వ్యూలో చెప్పాడు. "అది అబద్ధం, మా ఆఫీసులో ఎవరూ ఏమీ అనలేదు. డిటిపి ఆపరేటరైనా సరే యిదేమిటమ్మా అని వుంటే మానేసేదాన్ని" అంటోంది షిరీన్.

కార్టూన్ వెలువడ్డాక మౌల్వీలు, ముల్లాలు, మతవాద సంస్థలు నిరసనలు తెలిపాయంటే, కేసులు పెట్టాయంటే అర్థం చేసుకోవచ్చు. కానీ యీ విషయంలో కేసులు పెట్టి అల్లరి చేస్తున్నదంతా జర్నలిస్టులే! ఉర్దూ పత్రకార్ సంఘ్‌కు అధ్యక్షుడిగా వున్న ఇజార్ అహ్మద్ "ఆమె చేసిన నేరం క్షమార్హం కానే కాదు. దానికి తగిన శిక్ష మృత్యుదండన మాత్రమే. పోనీ కదాని మేం ఇండియన్ చట్టాల ప్రకారం శిక్ష విధించమని మాత్రమే కోరుతున్నాం. అది ఆమె అర్థం చేసుకోవాలి." అన్నాడు. ఈ గొడవ బయటకు రాగానే "అవధ్‌నామా" తన ముంబయి ఎడిషన్ మూసేసి, ఉద్యోగులందరినీ యింటికి పంపేసి, చేతులు కడిగేసుకుంది. షిరీన్ ఒంటరిగానే కేసులన్నీ ఎదుర్కోవాలి. ఆమెకు అండగా ముస్లిం మేధావులు, ముస్లిం సంస్థలు నిలిచాయి. "మన విశ్వాసాలు దెబ్బ తినేలా ఎవరైనా కార్టూన్ వేసినా, వ్యాసం రాసినా మనం ఆ పత్రికను కొనడం మానేయవచ్చు, చదవడం మానేయవచ్చు, యాడ్స్ యివ్వడం మానేయవచ్చు. నిరసనగా లేఖలు రాయవచ్చు, వారికి ప్రతిగా మనమే కార్టూన్లు వేయవచ్చు, లేదా మనమే ఒక పత్రిక పెట్టవచ్చు. అంతేకానీ జర్నలిస్టులను, రచయితలను వెంటాడి వేధించడం తప్పు." అంటున్నారు వాళ్లు. పోలీసులు ఆమెను ఫిబ్రవరి 4 న అరెస్టు చేయగా కోర్టు బెయిలు యిచ్చింది.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ ః బలాత్కారమంటే...?

2013 ఫిబ్రవరిలో వచ్చిన క్రిమినల్ లా (ఎమెండ్‌మెట్) ఆర్డినెన్సు తర్వాత బలాత్కారానికి నిర్వచనం బాగా విస్తరించింది. దానితో 498 (ఎ) వరకట్న చట్టం లాగానే యిదీ కొన్ని సందర్భాల్లో దురుపయోగం అవుతోంది. ఈ మధ్య ఆంధ్రలో ఒక విడాకుల కేసులో తన భర్త తరఫున న్యాయవాది కోర్టులో వాదనలు వినిపిస్తూ తన శీలాన్ని అవమానపరిచేలా మాట్లాడాడని ఆరోపిస్తూ భార్య లాయరుపై కేసు పెట్టింది. ఏ కేసో తెలుసా? వరకట్న నిషేధ (498 ఏ) కేసు! దీనిలో కట్నసమస్య ఎలా వచ్చింది? అయినా ఆ లాయరు తన క్లయింటు ఏం చెపితే అదే చెప్తాడు తప్ప సొంత అభిప్రాయాలు చెప్పడు కదా! కొన్ని చట్టాలను ఎలా వాడుతున్నారో దీనివలన తెలుస్తోంది. ఒక ఎయిర్‌హెూస్టెస్, ఒక బ్యాంకర్ మూడేళ్లపాటు సహజీవనం సాగించారు. తర్వాత పెళ్లి చేసుకోకుండానే విడిపోయారు. ఇప్పుడామె అతను తనను మూడేళ్లపాటూ 'రేప్' చేశాడని కేసు పెట్టింది! 'ఒకసారి కాదు, రెండుసార్లు కాదు, మూడేళ్లపాటు, యిద్దరూ కలిసి వుంటూనే రేప్!! అదెలా సంభవం!?' అంటే 'పెళ్లి చేసుకుంటానని మాట యిచ్చాడు కాబట్టే అతనితో సెక్స్‌లో పాల్గొన్నాను. లేకపోతే ఒప్పుకునేదాన్ని కాదు. అబద్ధపు వాగ్దానంతో నన్ను అనుభవించాడు కాబట్టి అది బలాత్కారం కిందే లెక్క' అంటోంది ఆమె. 'నేను అప్పటికే వివాహితుణ్ని. ఆ విషయం ఆమెకూ తెలుసు. పెళ్లి చేసుకోకపోయినా ఫర్వాలేదు, నువ్వంటే యిష్టం అంటూ నాతో యిన్నాళ్లూ గడిపి, యిప్పుడు నన్ను రేపిస్టు అంటే ఎలా?' అని అతను వాదిస్తున్నాడు.

పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నాతో శృంగారం నెరపాడు కాబట్టి అది బలాత్కారమే అని కొన్ని కేసుల్లో మహిళలు వాదిస్తున్నారు. 'ఆమె యిష్టపడి కొన్నేళ్లపాటు లేదా కొన్ని నెలలపాటు సంభోగంలో పాల్గొంటే, అది రేప్ ఎలా అవుతుంది?' అని మగవాళ్లు తిప్పికొడుతున్నారు. ఆమె యిష్టపడినట్లు రుజువు చూపవలసిన భారాన్ని యీ 2013 నాటి ఆర్డినెన్సు మగవాడిపై పెట్టింది. ఇది ఆచరణలో ఎలా సాధ్యమో అర్థం కాదు. ఎవరైనా స్త్రీ తనంటే యిష్టపడి ముందుకు వస్తే 'ఆగు, నీతో పడుక్కోవడం నాకు యిష్టమే అని కాగితం రాసియ్యి, లేదా వీడియోలో చెప్పు' అని మగవాడు అని, ఆ సాక్ష్యాన్ని ఏళ్ల తరబడి భద్రపరచుకోవాలా? ఇలాటి కేసుల్లో ఏం చేయాలో తెలియక న్యాయాధీశులు కూడా తల పట్టుకుంటున్నారు. ఒక్కో జడ్జి ఒక్కోలా తీర్పు యిస్తున్నారు. ఓ కేసులో 'ఇతను నన్ను పెళ్లి చేసుకుంటానని మాట యిచ్చి, అనుభవించి, ఆ తర్వాత మాట తప్పాడు' అని మహిళ ఆరోపించింది.

దానిపై 2003లో సుప్రీం కోర్టు తీర్పు యిస్తూ – 'మోహావేశంలో ఆ క్షణాన పెళ్లి చేసుకుంటానని మాట యిచ్చినా దాన్ని సీరియస్‌గా తీసుకోనక్కరలేదు' అంది. 2006లో యిలాటి కేసే వచ్చినపుడు యింకో జడ్జి తీర్పు యిస్తూ ముద్దాయికి శిక్ష విధించారు. అదేమంటే 'ఇతనికి పెళ్లి చేసుకుందామన్న ఉద్దేశం మొదటినుంచీ లేదు' అని జవాబిచ్చారు, అంజనం వేసి కనుక్కున్నట్లు! 2013లో యింకో కేసులో అదే కోర్టులోని మరో జడ్జి 'పెళ్లి చేసుకుంటానని మాట యిచ్చి పరిస్థితులు అనుకూలించక నిలబెట్టుకోకపోవడం వేరు, కావాలని అబద్ధపు వాగ్దానం చేయడం వేరు' అన్నారు. ఏది ఏ కేటగిరీలోకి వస్తుందో ఎవరి మనసులోకి దూరి చెప్పగలరు?

2014 ఆగస్టు 27 న కేంద్రమంత్రి, మాజీ ముఖ్యమంత్రి సదానంద గౌడ కుమారుడి నిశ్చితార్థం జరిగింది. మర్నాడే మైత్రేయ అనే ఒక కన్నడ జూనియర్ నటీమణి అతనిపై రేప్ కేసు పెట్టింది. 'అతను నన్ను ప్రేమించాడు, నన్ను గుళ్లో పెళ్లి కూడా చేసుకున్నాడు' అని. నవంబరులో బెంగుళూరు ఫ్యామిలీ కోర్టులో కేసు విచారణకు వచ్చింది. ఆధారాలు చాలలేదో ఏమో అది పెళ్లి కాదని కోర్టు కొట్టి పారేసింది. ఇంకేం, నాపై కేసులు కొట్టేయండి అంటూ అతను హైకోర్టును ఆశ్రయించాడు. జనవరి 29 న తీర్పు చెపుతూ కర్ణాటక హై కోర్టు 'నీపై వున్న ఆరోపణల తీవ్రత దృష్ట్యా కేసు కొట్టివేయలేం. విచారణ జరగాల్సిందే' అంది. ఏమిటా తీవ్రత? రేప్ ఆరోపణ! పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడు అంటే 420 కింద కేసు పెట్టాలి కానీ రేప్ చట్టం కింద పెట్టడమేమిటి విడ్డూరం కాకపోతే? సినిమాల్లో రేప్‌లు చూసి స్త్రీపై పడి బట్టలు చింపి, నానా బీభత్సం చేసి, ఆమెను ఏడిపించడం అనుకుంటూ వచ్చాం. ఇప్పుడవేమీ అక్కరలేదు. అది పెళ్లి కాని స్త్రీపురుషుల మధ్య మామూలు శృంగారమే కావచ్చు, దాన్ని రేప్‌గా చిత్రీకరించే హక్కు స్త్రీ చేతుల్లోకి వచ్చింది. వివాహపూర్వ శృంగారానికి, వివాహేతర శృంగారానికి ఉబలాటే పడే మగవాళ్లు తమ ఊహలకు కళ్లాలు వేసుకోకపోతే కోర్టుల్లో, జైళ్లల్లో తేలతారని తాత్పర్యం. ఎందుకంటే యిలాటి వ్యవహారాలు ఎప్పుడు బెడిసికొడతాయో తెలియదు. కానూన్ డాట్‌కామ్ అనే వెబ్‌సైట్‌లో ఒక ముంబయి అమ్మాయి ఒక ప్రశ్న వేసిందట – 'నాకు ఆరేళ్లగా ఒక అబ్బాయితో రిలేషన్‌షిప్ వుంది. అతను శృంగారం కోరితే నేను వద్దన్నాను, పెళ్లి చేసుకుంటానన్నాడు. ఆరేళ్లయింది. ఐ యామ్ ఫీలింగ్ ఐ యామ్ రేప్‌డ్. నేను అతనిపై కేసు పెడదామనుకుంటున్నాను. ఏమంటారు?' అని. జవాబిచ్చిన ఏడుగురు లాయర్లలో యిద్దరు 'వదిలేయ్' అన్నారట, ఒకతను 'అతను పెళ్లిచేసుకుంటానని రాసి యిచ్చాడా?' అని అడిగాడట. తక్కిన నలుగురు 'పోలీసు స్టేషన్ కెళ్లి రేప్ కేసి పెట్టేయ్' అని సలహా యిచ్చారట! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**ఫిబ్రవరి వీక్లీకై**

## ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 87
## ఎమ్బీయస్ : ఇరికించడంలో ఘనులు

నెలాఖరులో ట్రాఫిక్ పోలీసులు అన్యాయంగా కేసులు బుక్ చేయడం చూస్తూనే వుంటాం. మావోయిస్టు ప్రాంతాల్లో పనిచేసే పోలీసులు అమాయకులపై కూడా మావోయిస్టు ముద్ర కొట్టడమూ చూశాం. పొరపాటున మామూలు పౌరుడిపై ఉగ్రవాది ముద్ర కొట్టి వేధించిన సంఘటనలు "మనోహరం" వంటి సినిమాలుగా కూడా వచ్చాయి. గత నెలలో బయటకు వచ్చిన లియాఖత్ షా కథా అలాటిదే అంటోంది నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజన్సీ (ఎన్ఐఏ)! కశ్మీరు యువకులు చాలామంది చాలాకాలంగా ఆక్రమిత కశ్మీరులోకి పారిపోయి పాకిస్తాన్ చేత తర్ఫీదు పొంది తీవ్రవాదులుగా మారుతున్నారు. కొన్నాళ్లకు ఆ జీవితంతో విసుగుచెంది జనజీవితంలోకి తిరిగివద్దామని చూస్తున్నారు. మావోయిజం వదిలి వచ్చి లొంగిపోయినవారికి మన దగ్గర పునరావాసం కల్పిస్తున్నట్లే వీరికీ కల్పించాలని జమ్మూ, కశ్మీరు ప్రభుత్వం సంకల్పించింది. 1989–2009 మధ్య ఆక్రమిత కశ్మీర్‌లోకి పారిపోయి తిరిగి వద్దామనుకుంటున్న భారతీయ కశ్మీర్ పౌరులు వెనక్కి రావాలనుకుంటే వారి బంధువులు జిల్లా సూపరింటెండెంట్‌కు దరఖాస్తు పెట్టుకోవచ్చు. వాళ్లు విచారణ జరిపి తమ సిఫార్సుతో సిఐడి (క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్)కి పంపిస్తారు. వాళ్లు సదరు వ్యక్తి కార్యకలాపాల గురించి డొస్సియర్ తయారుచేసి రాష్ట్రం హోం శాఖకు పంపిస్తారు. అతడు క్షమాపణకు తగిన వ్యక్తి అవునా కాదా అని వారు నిర్ణయం తీసుకుని తెలియపరుస్తారు. అనుమతి యిచ్చినవారు వాఘా సరిహద్దు ద్వారా కానీ, ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఎయిర్‌పోర్టుద్వారా కానీ దేశంలో ప్రవేశించవచ్చు అని ప్రభుత్వం చెపుతుంది. కానీ ఒకసారి ఉగ్రవాద సంస్థల్లో పనిచేసిన తర్వాత పారిపోవడం రావడం కూడా కష్టమే. అందుచేత వారి కన్నుగప్పడానికి యిలా తిరిగి వచ్చే మాజీ తీవ్రవాదులు నేపాల్ ద్వారా భారత్‌లోకి వస్తున్నారు.

సయ్యద్ లియాఖత్ షా అనే వ్యక్తి అలా తిరిగి వద్దామనుకున్నాడు. అతను కశ్మీర్‌లోని కుప్వారా జిల్లా నివాసి. భార్య పిల్లలు వున్నారు. 1995 ప్రాంతంలో అతను ఆక్రమిత కశ్మీర్‌లోకి వెళ్లిపోయి అల్–బరాక్ అనే సంస్థలో చేరాడు. పాకిస్తాన్‌లో నసీం బీబీ అనే మహిళను మళ్లీ పెళ్లి చేసుకుని ఆమె ద్వారా ఒక బిడ్డను కన్నాడు. ఆ తర్వాత అఖ్తర్ నిసా అనే ఆమెను కూడా పెళ్లి చేసుకున్నాడు. ఆమె ద్వారా కూతుర్ని కన్నాడు. కశ్మీర్ ప్రభుత్వం యీ పునరావాస పథకం ప్రకటించాక అతని మొదటి భార్య అమీనా బేగం లొంగిపోమని అతనిపై ఒత్తిడి చేసింది. అతను సరేనన్నాడు. అతని తరఫున ఆమె 2011 ఫిబ్రవరిలో అప్లికేషన్ పెట్టుకుంది. కశ్మీర్ ప్రభుత్వం ఎప్పుడు అనుమతి యిచ్చిందో ఆ వివరాలు పేపర్లో రాలేదు కానీ లియాఖత్ నేపాల్ ద్వారా ఇండియాకు వచ్చేద్దామని 2013లో నిశ్చయించుకున్నాడు. అతని రెండో భార్య నాకు అనారోగ్యం రానంది, మూడో భార్య, కూతురు వెంటరాగా తనలాగే లొంగిపోతున్న మంజూర్ అనే అతనితో కలిపి మొత్తం 12 మంది 2013 మార్చిలో నేపాల్ చేరి ఖట్మండూలో రెండు రోజులు

హెూటల్లో వున్నారు. మార్చి 20న నేపాల్–భారత్ సరిహద్దు దాటుతూండగా వారిని సహస్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) అధికారులు ఆపారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ (డిపిఎస్‌సి) తాలూకు ధర్మేంద్ర కుమార్ అనే యిన్‌స్పెక్టర్ అక్కడే వున్నాడు. వారిని మాకు అప్పగించండి అన్నాడు. గోరఖ్‌పూర్ నుండి సనౌలీకి వస్తూండగా తక్కినవారిని వదిలేసి లియాఖత్‌ను ఢిల్లీకి తీసుకుని వచ్చాడు.

అతను సభ్యుడుగా వున్న అల్–బరాక్ నిషిద్ధ సంస్థ కాదు. పాకిస్తాన్‌లో కాని, ఇండియాలో కానీ అతను పాల్గొన్న తీవ్రవాద కార్యకలాపం ఏమీ లేదు. అతనిపై కేసు పెట్టాలంటే కష్టం. అందుకని మనమే కష్టపడి ఓ కథ రాసి పెట్టి సాక్ష్యాన్ని తయారుచేయాలి అనుకుంది స్పెషల్ సెల్. అది దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ప్రకారం – 'నిషిద్ధ టెర్రరిస్టు సంస్థ హిజ్‌బుల్ ముజాహిదీన్, కొంతమంది పాకిస్తాన్ జాతీయులతో కలిసి ఢిల్లీలోని ముఖ్యమైన ప్రాంతాలపై దాడులు చేయాలని విస్తృతంగా ప్రణాళికలు రచించారని మాకు ఒక 'ఇన్‌ఫార్మర్' చెప్పాడు. (అతనెవరో మేం చెప్పలేము). మాకందిన సమాచారం ప్రకారం యిద్దరు, ముగ్గురు ముజాహిదీన్ సభ్యులు జమ్మూ కశ్మీర్ నుండి ఢిల్లీ వచ్చి జామా మసీదు ప్రాంతంలో ఒక హెూటల్లో వున్నారు. మరి కొందరు నేపాల్ సరిహద్దుల ద్వారా ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కి కానీ, ఉత్తరాఖండ్‌లోని తనక్‌పూర్‌కి కానీ వచ్చి అక్కణ్నుంచి ఢిల్లీ చేరి వీళ్లను కలవాలి. వారిలో ఒకడైన లియాఖత్‌ను ధర్మేంద్ర కుమార్ గోరఖ్‌పూర్ రైల్వే స్టేషన్‌లో పట్టుకున్నాడు. అరెస్టు చేసిన 24 గంటల్లో న్యూఢిల్లీలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేటు ఎదుట హాజరు పరిచి, 15 రోజుల పోలీసు కస్టడీకి అనుమతి తీసుకున్నాం. అతన్ని విచారించగా అతను ఢిల్లీకి రాగానే ఒక నెంబరుకు ఫోన్ చేయాలన్న ఆదేశాలున్నాయని ఒప్పుకున్నాడు. అప్పుడు జామా మసీదు ప్రాంతానికి తీసుకుని వెళ్లి ఇన్‌స్పెక్టర్ సంజయ్ దత్ మొబైల్ ద్వారా ఆ పాకిస్తానీకి ఫోన్ చేయించాం. దానికి సాక్షి కూడా వున్నాడు. అప్పుడు ఆ పాకిస్తాన్ వ్యక్తి జామా మసీదు ప్రాంతంలోని హాజీ ఆరాఫత్ గెస్ట్ హౌస్‌లో 304 నెంబరు రూముకి వెళ్లి అక్కడున్న అన్వర్ అహ్మద్ అనే వ్యక్తి నుండి ఆదేశాలు తీసుకోవాలని చెప్పాడు. మేము లియాఖత్‌ను పోలీసు స్టేషన్‌కు పంపేసి, ఆ రూముపై మార్చి 21 అర్ధరాత్రి దాడి చేశాం. అక్కడ ఎకె 56, 60 రౌండ్ల మ్యాగజైన్లు, మూడు హేండ్‌గ్రెనేడ్లు, మారణ సామగ్రి, మ్యాప్‌లు దొరికాయి. అందుచేత కేసు పెట్టాం.'

ఇంటికి రావలసిన లియాఖత్ యిలా పోలీసుల చేతిలో పడి కేసులో యిరుక్కోవడంతో కంగారు పడిన అతని భార్య జమ్మూ, కశ్మీర్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. లొంగిపోదామనుకునేవాడు యిలా ఎందుకు చేస్తాడు అని ఆలోచనలో పడిన కేంద్ర హెూం శాఖ మార్చి 28 న యీ కేసును ఎన్ఐఏకు అప్పగించి, స్పెషల్ సెల్ ఆరోపణలు నిజమో కాదో పరిశీలించమంది. ఎన్ఐఏ లియాఖత్‌తో బాటు తిరిగి వచ్చిన మంజూర్ నుండి వివరాలు సేకరించి జరిగినదేమిటో తెలుసుకుంది. ధర్మేంద్ర కుమార్ లియాఖత్‌ను గోరఖ్‌పూర్ స్టేషన్‌లో అరెస్టు చేయలేదని, ఎస్ఎస్‌బి నుంచి నేపాల్ సరిహద్దుల్లోనే స్వాధీన పరుచుకున్నాడని తెలుసుకుంది. అది కూడా ముందే వేసుకున్న పథకమని అర్థమైంది. స్పెషల్ సెల్‌లో డిసిపిగా పనిచేసే యాదవ్ అనే అతను మహమ్మద్ అస్లాం హక్లా అనే కశ్మీరు నివాసితో ఎప్పణ్నుంచో టచ్‌లో వున్నాడు. అతనికి నాలుగు సెల్‌ఫోన్లు యిచ్చాడు. లియాఖత్‌ను రిసీవ్ చేసుకోవడానికి కశ్మీర్ నుంచి మార్చి 15 న బయలుదేరే ముందు హక్లా యాదవ్‌తో మాట్లాడాడు. ఆ తర్వాత నేపాల్ వెళ్లి వాళ్లందరినీ తీసుకుని భారత్‌లోకి అడుగుపెట్టగానే వాళ్లను పట్టించాడు. ఇవన్నీ ఎన్ఐఏ కనుగొంది.

ఆ హెూటల్ రూములో ఆయుధాలు దొరికాయి బాగానే వుంది కానీ అక్కడ రెండు రోజులు బస చేసిన అన్వర్ అహ్మద్ ఎందుకు దొరకలేదు, స్పెషల్ సెల్ అతని గురించి ఎందుకు గట్టిగా ప్రయత్నించలేదు అనే విషయంపై దృష్టి సారించింది. హెూటల్ రిసెప్షన్‌లో అన్వర్ అహ్మద్ పేరుతో యిచ్చిన మొబైల్ నెంబరు, డ్రైవింగ్ లైసెన్సు కాపీ రెండూ బోగస్‌వే అని తేలింది. అతని పోలికలు చూద్దామని సిసిటివి డిస్కులు పరిశీలించబోయారు. అవి డామేజి అయిపోయాయని స్పెషల్ సెల్ చెప్పింది. అప్పుడు ఎన్ఐఏ కెమెరాలు సప్లయి చేసిన ఇసిఐఎల్‌కు పంపి ఫుటేజ్ రిట్రీవ్ చేసి (పునరుద్ధరించి) యిమ్మన్నారు. 'దానికి ఓ టెక్నిక్ వుంది, స్పెషల్ సెల్ వాళ్లకు చెప్తే గతంలో రెండు కేసుల్లో అలా చేశారు కూడా' అంది ఇసిఐఎల్. మరి ఆ పద్ధతి యీ కేసులో ఎందుకు అవలంబించలేదు అని అడిగితే స్పెషల్ సెల్ 'మేం పద్ధతుల ప్రకారం వెళ్లాం' అంటూ సమాధానం దాటవేసింది. అంటే ఆ ఫుటేజి బయటకు రావడం స్పెషల్ సెల్‌కు యిష్టం లేదన్నమాట అని ఎన్ఐఏ అనుమానించి, హెూటల్ స్టాఫ్ సహాయంతో ఆ రూములో వున్నతని చిత్రాలు గీయించారు. లోతుగా విచారించగా తేలిందేమిటంటే అతను సబీర్ ఖాన్ పఠాన్ అనే లోఢీ కాలనీ నివాసి. స్పెషల్ సెల్‌లోని సంజయ్ దత్ టీములో పని చేసే పోలీసు యిన్‌ఫార్మర్. రెండేళ్లగా మిస్సింగ్. హెూటల్ రూము నుండి సేకరించిన దుస్తులపై వున్న డిఎన్ఏను అతని తండ్రి డిఎన్ఏతో పోల్చి చూడగా సరిపోయింది కూడా. అతని సెల్ నెంబరు నుంచి మార్చి 21 రాత్రి దాడికి ముందూ, వెనుకా టీములో వున్నవారితో అనేక సంభాషణలు జరిగినట్లు కాల్ రికార్డు బయటపెట్టింది. పోలీసుల ఆదేశాలపై అతనే ఆయుధాలు కొన్ని ఆ గదిలో పెట్టాడని తేలిపోయింది. ఇప్పుడు ఎన్ఐఏ స్పెషల్ సెల్‌లోని సంజయ్ దత్, రాహుల్ కుమార్ అనే యిన్‌స్పెక్టర్ల మీద, మొహమ్మద్ ఇక్బాల్ దర్, మనీష్ అనే హెడ్ కానిస్టేబుళ్లపైన, కృష్ణకుమార్, గుల్వీర్ సింగ్ అనే కానిస్టేబుళ్ల పైన కేసు పెట్టింది. లియాఖత్‌ను బెయిల్‌పై విడిచి పెట్టమని కోరింది. ఈ లియాఖత్‌ను పట్టుకుని దేశంలో పెద్ద టెర్రరిస్టు కుట్రను భగ్నం చేసినట్లు ఢిల్లీ స్పెషల్ సెల్ 2013లో గొప్పగా చెప్పుకుంది. అదంతా బోగస్ అనీ, ఇలా అన్యాయంగా అమాయకులను యిరికించేస్తున్నారని తెలిస్తే పోలీసుల పరువు పోతుందని భయపడ్డారో ఏమో, కేసు విచారిస్తున్న జిల్లా జడ్జి 2015 జనవరి 31 న ఎన్ఐఏతో "మీ వెబ్‌సైట్ నుండి యీ చార్జిషీటు వివరాలు తొలగించేయండి. లేకపోతే దేశభద్రతకు ముప్పు." అన్నారు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : ఈ పొదుపు మాకొద్దు అంటూన్న గ్రీసు

ఆర్థికమాంద్యం కారణంగా దెబ్బ తిని అప్పణ్నుంచి నానాటికీ దిగజారుతున్న దేశం గ్రీసు. 2010 నుండి దాని ఋణభారం యింతింతై పెరుగుతూ వచ్చి దాన్ని కబళించే స్థితికి వచ్చింది. ప్రజలు అడుక్కుతినే స్థితికి వచ్చారు. ఇదంతా మీకు అప్పులు పెరగడం చేతనే జరుగుతోంది, అవి తీరడానికి మేం యింకాస్త అప్పు యిస్తాం పట్టండి అంటూ 'త్రిమూర్తులు'గా పిలవబడే యూరోజోన్‌లోని దేశాలు, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్, ఐఎమ్ఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్) అప్పుల మీద అప్పులు యిస్తూ పోయి దాని కొంప ముంచారు. ఈ సమస్య వచ్చినపుడు అప్పు దేశపు జిడిపికి 120% వుండేది. ఇప్పుడది 175%కి చేరింది. అంటే యీ ఋణాలు వారికి మేలు చేయలేదన్నమాట. దీనికి కారణం అప్పులు యిస్తూ యీ త్రిమూర్తులు పెట్టిన షరతులే! 'మీరు ప్రభుత్వవ్యయం తగ్గించాలి, జీతాలు తగ్గించాలి, సంక్షేమ పథకాలు మానేయాలి, వ్యవస్థ మార్చడానికి చేసే ఖర్చు తగ్గించాలి, గవర్నమెంటు ఆస్తులు అమ్మేయాలి' అంటూ షరతులు విధించి తాము యిచ్చిన అప్పులో 90% వడ్డీ కింద, చెల్లింపుల కింద వెనక్కి లాగేశారు. 2010 నుంచి గ్రీసు తీసుకున్న అప్పు 110 బిలియన్ యూరోలు. దీనివలన గ్రీసు పరిస్థితి మరింత అధ్వాన్నం కావడంతో, గ్రీకు ప్రభుత్వపు బాండ్లు చెత్త కాగితాలతో సమానం అని క్రెడిట్ రేటింగ్ ఏజన్సీలు అనడంతో వూబిలోంచి మళ్లీ బయటపడేయడానికి అంటూ యింకో 130 బిలియన్ యూరోలు యిచ్చారు. ఇటీవలే ఐఎమ్ఎఫ్ జనవరి 2015 నుంచి మార్చి 2016 లోపున యింకో 8.2 బిలియన్ యూరోలు యిస్తానంది. ఇంత అప్పుచేసి సాధించినది ఏమిటా అని చూస్తే – నిరుద్యోగం 50% పెరిగింది, యిళ్లు లేని వారి సంఖ్య 25% పెరిగింది, ప్రజారోగ్యంపై పెట్టే ఖర్చు జిడిపిలో 6%కి తగ్గించడానికి ప్రభుత్వ ఆసుపత్రులు మూసేయడంతో ఎచ్ఐవి 200% పెరిగింది. యూరోప్ మొత్తంలో గ్రీసులో ఆత్మహత్యలు అతి తక్కువగా వుండేవి. ఇప్పుడవి 60% పెరిగాయి.

త్రిమూర్తులు విధించిన దుర్మార్గపు పొదుపు షరతులకు తమ ప్రభుత్వం తల వూపడమే తమ యీ దుస్థితికి కారణం అని గ్రీసు పౌరుడు భావించాడు. అందుకే 2015 జనవరిలో జరిగిన పార్లమెంటు ఎన్నికలలో అప్పటిదాకా వున్న పాలిస్తున్న రైటిస్టు కూటమిని గద్దె దింపి, పొదుపు చర్యలను వ్యతిరేకించిన సిరిజా అనే లెఫ్టిస్టు కూటమికి అధికారం అందించాడు. 300 మంది సభ్యులున్న పార్లమెంటులో సిరిజాకు గతంలో 71 వుంటే యిప్పుడు 149 సీట్లు వచ్చాయి. గత కూటమిలో భాగస్వామిగా వున్న న్యూ డెమోక్రసీ అనే కన్సర్వేటివ్ పార్టీకి 129 నుండి 76కి తగ్గాయి. మరో భాగస్వామి ఐన పసోక్ అనే సోషల్ డెమోక్రాటిక్ పార్టీకి 33 నుంచి 13కి తగ్గాయి. అతివాద రైట్ వింగ్ ఫాసిస్టు భావాలున్న డాన్ పార్టీకి 17 రాగా, కమ్యూనిస్టు పార్టీకి 15 వచ్చాయి. ఈ సిరిజా పార్టీ తరఫున ప్రధానిగా ఎలెక్సిస్ సిప్రాస్ అనే 40 ఏళ్ల ఆర్థికవేత్త ఎన్నికయ్యాడు. అతని ముందు అతి పెద్ద సవాలు ఏమిటంటే – తన దేశ ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చాలి. అప్పటిదాకా అప్పులాళ్లను గడప అవతల వుంచాలి. మమ్మల్ని మరీ ఒత్తిడి చేస్తే ఇయు (యూరోపియన్ యూనియన్) నుంచి బయటకు వెళ్లిపోతాం, దివాలా తీసి మీ బాకీలు ఎగ్గొడతాం, అందుకని కాస్త ఓపిక పట్టండి, వడ్డీలకోసం, వాయిదాల కోసం తొందరపెడితే మొదటికే మోసం అని బెదిరిస్తూ, అదే సమయంలో అనునయంగా బేరాలాడుతూ యింటి వ్యవహారం చక్కదిద్దుకోవాలి.

దేశంలో ఎవరి వద్దా డబ్బులు లేకపోతే కొనేవాడెవడు? రైతులకు, వస్తూత్పత్తిదారులకు తిండి ఎలా గడుస్తుంది? అందుకని కొన్ని సంస్కరణలు చేపట్టాడు. ఆ ప్రణాళికకు పార్లమెంటు ఆమోదం లభించింది. దాని ప్రకారం పెన్షన్లను పునరుద్ధరించారు, పన్ను మినహాయింపును ప్రస్తుతం వున్న 5 వేల యూరోల నుండి 12 వేల యూరోలకు పెంచారు. దారిద్ర్యరేఖకు అడుగున వున్న వారి కోసం తక్కువ ధరలో భోజనాలు ప్రవేశపెట్టారు, గతంలో తీసేసిన 3500 మంది ప్రభుత్వోద్యోగులకు మళ్లీ వుద్యోగాలు యిచ్చారు, ప్రయివేటు సెక్టార్‌లో 2011లో కనీస వేతన పరిమితి 751 యూరోలు వుంటే గత ప్రభుత్వం దాన్ని 586కు తగ్గించింది. 2016 లోగా 751కి తీసుకెళ్లాలని ప్రయివేటు సెక్టారు యజమానులకు ఆదేశాలిచ్చింది. గత ప్రభుత్వం ఒక నౌకాశ్రయాన్ని అమ్మేయబోయింది. ఈ ప్రభుత్వం అమ్మకాన్ని ఆపేయడంతో బాటు, యికపై ప్రభుత్వాస్తులు అమ్మనని చెప్పింది. వీటన్నిటితో బాటు చేయవలసిన దిద్దుబాటు చర్యలు – అవినీతిపరులను, పన్ను ఎగవేతదారులను పట్టుకోవడం, పబ్లిక్ సెక్టార్ పనితీరును మెరుగుపరచడం – కూడా చేపట్టింది. 'మీరు తీసుకున్న 240 బిలియన్ యూరోల ఋణాన్ని పొడిగించాలంటే మీరు అప్లికేషన్ పెట్టుకోవాలి' అని త్రిమూర్తులు అంటే 'ఈ షరతులపైన అయితే అప్లికేషన్ పెట్టుకోం పొండి' అనేసింది. ఈ చర్యలు ఆ శక్తులకు రుచించలేదు. అందువలన యీ సంస్కరణల బిల్లు పాస్ అయిన రోజున గ్రీసు షేరు మార్కెట్టును పడగొట్టాయి. ఈ సంస్కరణల బిల్లు పాస్ చేయించుకోవడానికి సిరిజా పార్టీకి మెజారిటీ సరిపోలేదు. అందువలన 12 సీట్లున్న ఏనెల్ పార్టీ అనే రైట్ వింగ్ పార్టీతో జత కట్టి, వారికి డిఫెన్సు మంత్రి పదవి యిచ్చింది. ఇది వామపక్ష కూటమి కాబట్టి మామూలుగా చూస్తే 15 సీట్ల కమ్యూనిస్టు పార్టీతో కలియాలి. కానీ కమ్యూనిస్టు పార్టీ ఇయులో కొనసాగకూడదని, ఋణదాతలతో బేరసారాలు ఆడవలసిన పనే లేదని యిలా మొండి వైఖరి అవలంబిస్తోంది. అంతకంటె ప్రాక్టికల్‌గా ఆలోచించే ఏనెల్ పార్టీయే బెటరనుకుంది సిరిజా.

రెండవ ప్రపంచయుద్ధానంతరం జర్మనీ 20 యూరోపియన్ దేశాలకు 32 బిలియన్ల డాయిష్ మార్క్‌స్ అప్పుపడింది. అప్పుడు ఆ దేశాలు దానిలో సగాన్ని మాఫీ చేశాయి. ఆ దేశాల్లో గ్రీసు కూడా వుంది. 'మేం యిప్పుడు అలాటి పరిస్థితుల్లోనే వున్నాం, మాకు

కూడా సగానికి సగం అప్పు ఎందుకు మాఫీ చేయకూడదు?' అని సిప్రాస్ అడుగుతున్నాడు. రెండవ ప్రపంచయుద్ధ సమయంలో జర్మనీ గ్రీసును ఆక్రమించి అక్కడి ఆస్తులు ధ్వంసం చేసింది. అంతేకాదు, గ్రీసు బ్యాంకుకి యిష్టం లేకపోయినా బలవంతంగా జర్మన్ ప్రభుత్వానికి అప్పు యిప్పించింది. నాజీ ప్రభుత్వం కూలిపోవడంతో ఆ అప్పు చావుబాకీగా మారింది. అలాటివన్నీ లెక్కలేసిన గ్రీక్ కమిషన్ ఒకటి క్రితం ఏడాది ''జర్మనీ మాకు 160 బిలియన్ యూరోలు బాకీ పడింది, వడ్డీ కలిపితే అది యింకా ఎక్కువవుతుంది'' అని ప్రకటించింది. జర్మనీ యివేమీ జాన్తానై అని కొట్టిపారేసింది. ఏది ఏమైనా అప్పులో కొంత కొట్టేయాలనీ, తక్కినది చెల్లించడానికి గడువు యివ్వాలనీ, మా ప్రభుత్వాన్ని ఎలా నడుపుకోవాలో షరతులేవీ విధించకూడదనీ సిరిజా బేరాలాడుతోంది. చివరకు యూరోజోన్ దిగి వచ్చి నాలుగు నెలల గడువు యిచ్చింది. ఈ లోపుగా మనం నేర్చుకోవలసిన పాఠం ఏమిటంటే – ప్రపంచ బ్యాంకు ఋణాలకోసం పరిగెట్టి, వాళ్ల షరతులకు లోబడి యూజర్ చార్జీలని, ఫ్యూయల్ చార్జీలని ప్రజలను పీల్చి పిప్పి చేస్తే మన పనీ గ్రీసులాగే తయారవుతుంది. రాత్రికి రాత్రి అద్భుతాలు సృష్టించనక్కరలేదు, ఆకాశహర్మ్యాలు కట్టనక్కరలేదు. ప్రణాళికాబద్ధంగా కష్టపడుతూ, ఓపిక పడితే ఆలస్యంగానైనా విజయాలు సిద్ధిస్తాయి. ప్రపంచబ్యాంకు , లేదా ఐఎమ్ఎఫ్ సాయంతో అడ్డదారిలో వెళ్లబోతే వాళ్లు యివాళ ఆవుకి తట్టెడు మేత వేసి, మర్నాడు పొదుగు కోసి పట్టుకుపోతారు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఫిబ్రవరి 51 ఎమ్బీయస్ : నిర్మాతల గురించి ఎందుకు?

రామానాయుడుగారిపై నా వ్యాసానికి స్పందనగా ఒక పాఠకుడు నేను రాజేంద్రప్రసాద్‌గారి గురించి కూడా పేజీలకు పేజీలు రాశాననీ, నటుల గురించి పట్టించుకోలేదనీ అన్నారు. నేను కొందరు రచయితలను కించపరిచానంటూ కులం రంగు కూడా పులమబోయారు. నేను గతంలో డివియస్ రాజు గారి గురించి కూడా పేజీలకు పేజీలు రాశానన్న విషయం ఆయన దృష్టికి వచ్చి వుండదు. వేటూరి గురించి నేను అనరాని మాటలన్నానని అభాండం వేశారు. నేనెప్పుడూ అనలేదు. వృత్తిపరంగా ఆయన గురించి చెడ్డగా విననూ లేదు. నాకు ఆయన వ్యక్తిగతంగా తెలుసు. ఆయన సౌమ్యతా, మంచితనం కూడా తెలుసు. పాటకు లక్షలాది రూపాయలు తీసుకునే రోజుల్లో కూడా మా ''హాసం'' పత్రికకు ఆయన ''కొమ్మకొమ్మకో సన్నాయి'' శీర్షికకు వ్యాసాలు రాసిచ్చేవారు. మేం యిచ్చే పారితోషికం రూ. 250 మాత్రమే, అయినా ఆయనకు అది రాయడం సరదా. పుస్తకరూపంలో వేసుకుంటామన్నప్పుడు డిటిపి మేటర్ అంతా సిడిలో యిచ్చాం. ఆంధ్రపత్రిక వీక్లీలో పని చేసే రోజుల్లో క్రింద పేరు లేకుండా ఆయన రాసిన ''అనూరాధ డైరీ'' శీర్షిక పేజీలను నేను సేకరించాను – అవి రమణగారు రాసినవేమోనన్న అనుమానంతో! బాపురమణలకు చూపిస్తే కొన్ని చదివి (రమణగారికి తను రాసినవి కూడా గుర్తుండేవి కావు) 'ఇది సుందరం రాసినది' (వేటూరిని వాళ్లు అలా పిలిచేవారు) అన్నారు. అప్పణ్నుంచి ఆయనకు అవి అందచేయాలని అనుకునేవాణ్ని. కొంతకాలం పాటు ఆయన ఎవరికీ కనబడకుండా పోయారు. బాపురమణలకు కూడా దొరకలేదు. ఆయన చేత ఏదైనా రాయించుకోవాలని తీవ్రంగా అన్వేషించగా మా పక్క ఎపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లోనే వుంటున్నారని తెలిసింది. మా ఎపార్ట్‌మెంట్‌లోంచి తొంగి చూస్తే ఆయన ఫ్లాట్ కనబడుతుందన్నమాట. కానీ ఆయన్ని వారి బాల్కనీలో ఎప్పుడూ చూడలేదు. అప్పటికి (2002 నాటికి) టూ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో వుండేవారు. అనూరాధ డైరీ సేకరించి యిచ్చినందుకు పొంగిపోయారు. వెళ్లినపుడు 'మీరు' అంటూ చాలా మర్యాదగా మాట్లాడేవారు. తన మిత్రుడు ముళ్లపూడి రమణగారి సాహితీసర్వస్వాన్ని సంకలనం చేశానని వేటూరిగారికి నాపై అభిమానం. మాకు వ్యాసాలు ఎప్పుడూ ఆలస్యం చేసేవారు కారు. ప్రూఫ్‌లు చూసేవారు కూడా.

2005లో మేం ''హాసం'' పుస్తకాల ప్రచురణ ప్రారంభించినపుడు మొదటి పుస్తకంగా తనికెళ్ల భరణిగారి ''ఎందరో మహానుభావులు'' పుస్తకం వేశాం. దానికి వేటూరి ముందుమాట రాసిచ్చారు. ఆవిష్కరిస్తానని కూడా మాట యిచ్చారు. అయితే ఆవిష్కరణ సభ మాదాపూర్ ఆర్ట్ గ్యాలరీలో పెట్టవలసి వచ్చింది. ఎందుకంటే దానితో బాటు ''జంధ్యామారుతం 1, 2'' భాగాలు చిరంజీవి ఆవిష్కరిస్తున్నారు. వేరే ఎక్కడైనా అయితే జనాల్ని మేనేజ్ చేయడం కష్టమనుకున్నాం. ఆర్ట్ గ్యాలరీ అయితే మెట్లెక్కలేనన్నారు వేటూరి. చివరకు చిరంజీవిగారి చేతనే ''ఎందరో మహానుభావులు'' ఆవిష్కరించబడగా నా ''అచలపతి కథలు''ను భరణి ఆవిష్కరించారు. వేటూరి పాటలపై విశ్లేషణాత్మకంగా చక్రవర్తి అనే రచయిత రాసిన పుస్తకం కృతజ్ఞతల లిస్టులో నా పేరు కూడా వుంటుంది. వాస్తవాలు యిలా వుండగా నేను అనరాని మాటలన్నానని యీ పాఠకుడు ఎలా అన్నారో తెలియదు. వేటూరి పోయినప్పుడు ప్రభుత్వం డబ్బుతో ఆయనకు యిల్లు కట్టిస్తామని కొందరు నాయకులు చేసిన వాగ్దానాలను నేను వెక్కిరించాను. వేటూరి బతికుండగా ఎవర్నీ యాచించలేదని, దేబిరించలేదని, డబ్బు పోగొట్టుకున్నపుడు ఆయన కష్టాలు ఆయనే పడ్డారని, యిలాటి ఆఫర్లతో మరణానంతరం ఆయన పరువు తీయడం భావ్యం కాదని వాదించాను. ఆయనకు, శ్రీనాథుడికి చాలా పోలికలున్నాయి. కవిత్వంలోనే కాదు, జీవితంలో కూడా. శ్రీనాథుడి చివరి దశ బాధాకరం. కానీ వేటూరి మళ్లీ వెలుగులోకి వచ్చారు. టాప్ రైటర్‌గా వుండగానే లోకం నుంచి నిష్క్రమించారు. ఆలాటాయన కుటుంబానికి టాక్స్‌పేయర్ డబ్బులతో యిల్లు అని చెప్పారు, ఆ తర్వాత దాన్ని విస్మరించారు! బాపుగారు పోగానే కూడా యిలాటి వాగ్దానాలే వెలువడ్డాయి. వాటిపై నేను ఎలా స్పందించానో జనాలకు గుర్తుండే వుంటుంది. ఆ దిశగా ఒక్క అడుగైనా పడిందా? బాపు విగ్రహం నరసాపురంలో వెలిసిందంటే దానికి కారణం తానా! ప్రభుత్వం కాదు. పుష్కరాల

టైముకి రాజమండ్రిలో బాపురమణల విగ్రహాలు వెలుస్తాయని అంటూ వచ్చారు. ఇవాళ రాజమండ్రి మునిసిపాలిటీ సమావేశంలో పుష్కరాల పనులు అసంపూర్తిగా వున్నాయని, అవినీతి జరిగిందని నిందించుకుంటూ బాహాబాహీ యుద్ధం జరిగింది. ఈ గొడవల మధ్య విగ్రహాలు వెలుస్తాయని ఎలా నమ్మగలం? పత్రికల్లో మరీ విమర్శలు వస్తే రెడీగా వున్న విగ్రహాలు రెండు పట్టుకుని వచ్చి యిదిగో బాపురమణ అనవచ్చు. అదేమిటని తెల్లబోతే 'ఏం? నరసాపురం బాపు విగ్రహంలో మాత్రం పోలికలున్నాయా?' అని మనల్ని దబాయించవచ్చు. ఈ వాక్యాలు చదివి బాపుని నేను అనరాని మాటలన్నానంటే ఏం చెప్పాలి? వేటూరి పోయినప్పుడు ఒక సీనియర్ జర్నలిస్టు తన పత్రికలో ''వేటూరి కమ్మ నిర్మాతలకు కావాలని బూతుపాటలు రాసి యిచ్చారని' ప్రతిపాదిస్తూ వ్యాసం రాశారు. అలాటి ఆలోచనను వేళాకోళం చేస్తూ నేను వ్యాసం రాశాను. పాత్రల బట్టి రాస్తారు తప్ప నిర్మాతల, డిస్ట్రిబ్యూటర్ల, హాలు ఓనర్ల కులం బట్టి పాటలు రాయరని వ్యంగ్యంగా చెప్పాను.

ఇక ఆత్రేయ గురించి – ఆత్రేయ నిర్మాతలను ఏడిపించారన్న సంగతి, బొత్తిగా అన్‌ప్రొఫెషనల్ అన్న సంగతీ అందరికీ తెలుసు. ఆయనే గొప్పగా చెప్పుకున్నాడు కూడా. ఆయన ప్రవర్తన గురించి సహరచయిత ఆరుద్ర కూడా 'సినీమినీ కబుర్లు'లో రాశారు. రమణగారు 'కోతికొమ్మచ్చి'లో రాశారు. నేను పనిగట్టుకుని పరువు తీసినదేముంది? ఇక్కడ నేను చెప్పదలచినది నిర్మాతల కష్టాల గురించి. రచయితలకు, కవులకు చేతిలో కలం వుంటుంది. వారి పక్షాన్నుండి సబబనుకున్నది రాయడానికి అవకాశం వుంటుంది. ''అనుగ్రహం'' సినిమా రచయితగా తనను తీసేసి ఆరుద్రను పెట్టినపుడు శ్రీశ్రీ ఎంతటి వ్యాసాలు రాశారో గుర్తున్న వారికి నా పాయింటు అర్థమౌతుంది. శ్రీశ్రీ చెప్పాపెట్టకుండా చైనా చెక్కేశారని నిర్మాత చేసుకున్న మొత్తుకోళ్లు పుస్తకాల్లో రావు. శ్రీశ్రీ సాహితీసర్వస్వంలో ఆయన వెర్షనే కనబడుతుంది. కళాకారులు పైకి కనబడేటంత అమాయకులు కారు. మీరేదైనా కచ్చేరీ ఏర్పాటు చేసినా, ఒక ఆడియో సిడి ప్లాన్ చేసిన

సృజనాత్మకత వున్నవారితో వేగడం ఎంత కష్టమో తెలుస్తుంది. రాజేంద్రప్రసాద్ వ్యాసంలో ఆత్రేయ గురించే కాదు, బి సరోజాదేవి కుటుంబం గురించి కూడా రాశాను గమనించారో లేదో. ''దసరా బుల్లోడు''కై జయలలితను బుక్ చేస్తే ఆవిడ ఆఖరి నిమిషంలో ఆ డేట్స్ ''శ్రీకృష్ణవిజయం''కు యిచ్చేసింది. అప్పటికప్పుడు వాణిశ్రీని బుక్ చేయవలసి వచ్చింది. తారలు వాళ్లల్లో వాళ్లు కొట్టుకున్నా, జబ్బు పడినా, గర్భం దాల్చినా, మధ్యలో పేచీ పెట్టినా మునిగిపోయేవాడు నిర్మాతే. రామానాయుడు వ్యాసం మొదట్లోనే చెప్పాను – నిర్మాతకు అభిరుచి లేకపోతే సినిమా మొదలే కాదని. ఈ రోజు ఎయన్నార్ సినిమాలు, ఎన్టీయార్ సాంగ్స్.. అంటూ నటుల పరంగా మాట్లాడుతున్నారు కానీ నటుడి స్థానం నాలుగోదేనని ఎయన్నార్ చెప్పేవారు. నిర్మాత పెట్టుబడి పెట్టాలి, రచయిత సృష్టించాలి, దర్శకుడు రూపుదిద్దాలి అప్పుడే నటుడికి తన ప్రతిభ చూపే ఛాన్సు వస్తుంది. అయితే నిర్మాతల గురించి ఎవరూ పట్టించుకోరు. నటీనటుల జయంతికి, వర్ధంతికి ఏటేటా వ్యాసాలు వస్తాయి. వారి పేర అవార్డులు యిస్తూ వుంటారు. వారిపై పుస్తకాలు రాస్తారు. నిర్మాతలు అనామకులుగా మిగిలిపోతున్నారనే బాధతోనే మురారి గారు నిర్మాతల డైరక్టరీ తలపెట్టి వ్యయప్రయాసలతో వెలువరించారు.

నటీనటుల గురించి ఎవరైనా రాస్తారు, నిర్మాతల గురించి రాయాలని నాకుంటుంది. అయితే వారి గురించి పుస్తకాలు బహు తక్కువగా వుంటాయి. నాదంతా కాప్స్యూల్ తయారీ వ్యవహారం. అంటే ఏదైనా పెద్ద పుస్తకం చదివి, దాని సారాంశాన్ని పాఠకులకు సులువుగా అందించే పని. పుస్తకం లేకుండా వ్యాసం మాత్రమే దొరికితే యిక నేను పిండడానికి ఏముంటుంది, నా తలకాయ! అందుకే అనేకమంది కళాకారుల పట్ల గౌరవం వున్నా నేను వ్యాసాలు రాయలేకపోతున్నాను. భానుమతి, సావిత్రి గురించి రాసినపుడు అంజలి గురించి రాయలేదేం అని చాలామంది అడిగారు. ఆవిడ గురించి పుస్తకం ఏదీ లేకపోతే నేనేం చేయగలను? ఇలాటి ప్రాక్టికల్ యిబ్బందులుంటాయి తప్ప కులపరమైన పరిగణనలు ఒక్కనాటికీ వుండవు. నాకే కాదు, ఏ రచయితకూ వుండవు. ఉంటే మనజాలడు – ఆ కులానికి సంబంధించిన పత్రిక ఏదైనా వుంటే దానిలోనే రాసుకుంటూ వుంటే తప్ప!

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## లో బజెట్ న్యూ టెక్నాలజీ కథ

రాజుగారు ఒంటరిగా వేట కెళుతున్నారు. ఆకలేసింది. ఎదురుగా గుడిసె కనబడితే దూరి అన్నం పెట్టమన్నారు.

సుబ్బమ్మ కంగారు పడింది. వంట అవుతోంది, యీలోగా మజ్జిగిస్తాను, తాగి చల్లబడండి అంది. రాజుగారు మజ్జిగ తాగుతూండగా పెరట్లోకి వెళ్లింది.

రాజుగారు భోజనం చేసి త్రేన్చారు – 'పచ్చడి మెతుకులే పెట్టినా అద్భుతంగా వండావు. కడుపు నిండిపోయింది. ఆ పచ్చడి దేనితో చేశావ్ చెప్పు'' అన్నారు.

సుబ్బమ్మ మొహమాట పడింది, భయపడింది, చెప్పనుగాక చెప్పనంది. నయాన చెప్పడం అయిపోయాక భయాన గద్దించి రాజుగారు విషయం రాబట్టారు. ''గడ్డితోనే అంత రుచికరమైన పచ్చడి చేశావా!? ఈ చిట్కా ప్రజలందరికీ తెలిస్తే నా కెంత భారం దిగుతుంది! అన్నమో రామచంద్రా అంటూ మా దివాణం గంట మోగిస్తే 'ఏం మీ పెరట్లో గడ్డి లేదా? కాస్త పీక్కుని రొంత పచ్చడి

చేసుకోలేరా?' అని నేనే వారిపై విరుచుకు పడవచ్చు. దీనిపై ప్రజలందరికీ అవగాహన కలగాలంటే పబ్లిసిటీ అవసరం. ఇప్పుడే నీకు ఓ అగ్రహారం బహుమతిగా యిస్తున్నాను. ఊరూరా యీ కథను దండోరా వేయించమని సైనికులకు ఆజ్ఞ యిస్తాను." అన్నాడు.

వేట ముగించుకుని మర్నాడు రాజుగారు అదే గూడెం ద్వారా తిరిగి వస్తున్నారు. సుబ్బమ్మ గుడిసె కోసం చూపు సారిస్తూండగానే వెంకమ్మ అడ్డుపడింది. ''మహారాజా, సుబ్బమ్మ పొరుగిల్లు మాది. మీకోసం గడ్డి పచ్చడి చేశా! అవేళ సరైన గడ్డి కోసం సుబ్బమ్మ పెరట్లో చాలాసేపు వెతికింది, నేను గబగబా ఏరుకొచ్చేశా, సుబ్బమ్మలా చింతపండు, బెల్లం, పచ్చిమిర్చి యివన్నీ వేసి రుబ్బలేదు. ఖర్చు మిగులుద్దామని ఏదో అలాఅలా పైపైన కానిచ్చేశాను. మీరు మా యింటికి వెంటనే వచ్చి అది ఆరగించి – అతి తక్కువ సమయంలో, ఏ ఆధరవూ లేకుండా చేయడంలో గల నా నేర్పును గుర్తించి సుబ్బమ్మ కిచ్చినంత అగ్రహారమే నాకూ యిప్పించాలి. అంగుళం తగ్గినా మర్యాద దక్కదు." అంది.

'కట్' చేస్తే – రచ్చబండలో ఆమె తల చెట్టుకి వేళ్లాడుతోంది. కింద ఓ ఫలకం మీద రాసి వుంది – 'ఆరగించేవాడిపై శ్రద్ధ చూపకపోయినా, కనీసం చూపినట్లు నటించకపోయినా యిదే శిక్ష' అని **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**మార్చి 1-3 వీక్లీకై**

## ఎమ్బీయస్ : విలోకనం – 03
## ఎమ్బీయస్ : రాహుల్ గాంధీకి సెలవు

రాహుల్ గాంధీ కనబడడం మానేశారు. అది కూడా వూహించని విధంగా. ఫిబ్రవరి 23న పార్లమెంటు సెషన్ ప్రారంభమైనపుడు రాహుల్ గాంధీ భూసేకరణ ఆర్డినెన్సుపై మోదీ సర్కారును చెరిగేస్తాడని కాంగ్రెసు నాయకులు అనుకున్నారు. కానీ రాహుల్ ఎక్కడా కనబడలేదు. సాయంత్రం కాంగ్రెసు నాయకులు మీడియాతో 'ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా రేపు జంతర్‌మంతర్ వద్ద జరగబోయే నిరసన కార్యక్రమానికి రాహుల్ గాంధీ నాయకత్వం వహిస్తారు' అని చెప్పారు. ఆ రాత్రి పొద్దుపోయాక కాంగ్రెసు మీడియా డిపార్టుమెంటు నుండి మీడియాకు సమాచారం వచ్చింది – పార్టీ భవిష్యత్తుపై యోచించడానికి రాహుల్ సోనియా నడిగి కొన్ని వారాలపాటు సెలవు తీసుకున్నారు' అని. రాహుల్ ఉండి మాత్రం ఉద్ధరించేదేముంది, రాజకీయాలకు శాశ్వతంగా సెలవు తీసుకుంటే అద్భుతంగా వుంటుంది కదా, అసలు మొత్తం పార్టీయే దేశానికి టాటా చెప్పేస్తే భేషుగ్గా వుంటుంది కదాని జోకులు వేశారందరూ. కానీ పార్టీలో వున్నవాళ్లకి అలా తోచదు కదా, 'పార్టీ ఎన్నో ఏళ్లగా వుంది, జనాల నోట్లో నానింది, అదృష్టం బాగుండి, బిజెపి తప్పులు చేస్తే జనాలు ప్రత్యామ్నాయం కోసం వెతికినప్పుడు మనం కంటికి ఆనతాం, అప్పటిదాకా రింగులో తచ్చాడుతూంటే మంచిది, గతంలో ఎన్నిసార్లు దివాలా తీసి మళ్లీ కోలుకోలేదు, బిజెపి కూడా 2 ఎంపీ స్థానాల నుంచి యిప్పుడు సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థితికి రాలేదా?' అనుకుంటారు. కావాలంటే రాహుల్ సెలవు తీసుకోమను తప్పులేదు కానీ బొత్తిగా పార్లమెంటులో బజెట్ సమావేశాలు నడిచే సమయంలో తీసుకోవాలా, అప్రదిష్ట కాకపోతే! అని పళ్లు నూరుకుంటున్నారు. ఇంతకీ రాహుల్‌కు అర్జంటుగా సెలవెందుకు కావలసి వచ్చింది? తన లీవు లెటర్లో ఏం రాసి వుంటాడు?

గతంలో ఒకసారి కంచి కామకోటి పీఠంలో జూనియర్‌గా వున్న జయేంద్ర సరస్వతి యిలాగే అంతర్ధానమై పోయారు. సీనియర్ అయిన చంద్రశేఖర సరస్వతి గాభరా పడి వెతికించారు. తల కావేరి (కావేరీ నది పుట్టిన ప్రాంతం) దగ్గర దొరికాడు. తపస్సు చేసుకోవడానికి వెళ్లాను అన్నాడు జయేంద్ర. అదేం కాదు, పీఠంపై తన పట్టు సాధించడానికి వెళ్లాడన్నారు విజ్ఞులు. ఆయన డిమాండ్లను కాదన్నాడు పెద్దాయన. అలిగి వెళ్లి అక్కడ కూర్చున్నాడు చిన్నాయన. పీఠం పరువు పోతుందని పెద్దాయని లొంగి, వెనక్కి పిలిపించి తాళాలు అప్పగించారు. ఇప్పుడు రాహుల్ కూడా తల్లిమీద అదే సత్యాగ్రహం చేస్తున్నాడని అర్థమయ్యాక వూహాగానాలు ప్రారంభమయ్యాయి. కుటుంబస్నేహితుడైన శామ్ పిత్రోదా సలహాపై థాయ్‌లాండ్‌లోని బౌద్ధారామానికి వెళ్లి ధ్యానం చేస్తున్నాడని కొందరన్నారు. అబ్బే ఫిబ్రవరి 16 నాటికే యూరోప్ వెళ్లిపోయాడు అని మరి కొందరన్నారు. ఎక్కడికీ వెళ్లలేదు, ఉత్తరాఖండ్‌లో గుడిసెలో వుంటూ జనాలకు సేవ చేసేస్తున్నాడు అంటూ జగదీశ్ శర్మ అనే కాంగ్రెస్ నాయకుడు కొన్ని ఫోటోలు ట్విట్టర్‌లో పెట్టాడు. కానీ ఆ ఫోటోలు 2008 నాటివని కొందరు కనిపెట్టేశారు. ఇంకోవారంలో రాహుల్ దర్శనం యిస్తాడని యివాళే కమల్ నాథ్ అన్నాడు.

రాహుల్ పరిస్థితి దయనీయంగా వుంది. కాంగ్రెసు స్థితి నానాటికీ తీసికట్టు నాగంభొట్లు పరిస్థితిలా వుంది. తల్లి చూస్తే ఏదీ ఎటూ తేల్చదు. అంతా నాన్పుడు (ఆ విషయం తెలుగువారికి తెలిసినంతగా వేరెవరికీ తెలియదు, తెలంగాణ విషయంలో చూశాంగా, నాన్చినాన్చి చివరకు పార్టీని ముంచింది) గట్టిగా నిలదీస్తామంటే రోగిష్టిది. అలా అని తనకు పగ్గాలు అప్పగించదు. తనకిస్తే తన యిష్టం వచ్చినట్లు చెడుగుడు ఆడేస్తాడేమోనని ఆవిడకు భయం. 2013 డిసెంబరు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో అధికారం పోగొట్టుకుని గతంలో వున్న 43 స్థానాలకు బదులు 8 సీట్లు వచ్చినపుడు రాహుల్‌కి ఆవేశం వచ్చింది – "నేను పార్టీ వ్యవస్థను సమూలంగా మార్చేస్తాను – మీరెవ్వరూ వూహించలేని తీరుగా.." అని ప్రకటించాడు. కానీ అతను వూహించలేనిదేమిటంటే – మార్పుకి పార్టీ అధ్యక్షురాలే అడ్డుపడుతుందని! పార్టీ ఓడినప్పుడల్లా అందరూ తననే బాధ్యుణ్ని చేస్తున్నారు. అలా అని పార్టీ నిర్వహణ తనకు అప్పగిస్తారా అంటే అప్పగించరు. ఏదైనా నిర్ణయం తీసుకుని తల్లికి చెపితే 'అందర్నీ సంప్రదించి అప్పుడు అంతిమ నిర్ణయం చెపుతా,

అప్పటిదాకా ఏమీ చేయకు' అంటుంది. పార్టీలో సీనియర్లందరూ సోనియాను కలిసి మాట్లాడతారు. వారి స్థానంలో వద్దామనుకుంటున్న జూనియర్లు రాహుల్‌ను ఆశ్రయిస్తున్నారు. పాతవాళ్ల వలన పార్టీకి ప్రయోజనం ఏమీ లేదని, వాళ్లని  తప్పించి ప్రజాస్వామ్యయుత ఎన్నికల ప్రక్రియ ద్వారా కొత్త మొహాలను తేవాలని రాహుల్ ప్రతిపాదన. అలా చేస్తే పాతవాళ్లు తిరగబడతారని, రాహుల్ వంటి అనుభవశూన్యుడు ఆ పరిస్థితిని ఎదుర్కోలేడని సోనియా మాతృహృదయం తల్లడిల్లింది. అందువలన చూదాం చూదాం అంటూ బండి నెట్టుకుంటూ వచ్చింది. రాహుల్ ఓపిక పట్టాడు.

పార్లమెంటు ఎన్నికలలో ఘోరపరాజయం, ఆ పై ఐదు ఎసెంబ్లీ ఎన్నికలలో పరిస్థితి యింకా హీనమైనా సోనియాలో కదలిక లేదు. ఇక రాహుల్ మొండికేశాడు. నువ్వు తప్పుకుని, ఆ పదవి నాకు అప్పగించు, నా ప్రయోగాన్ని అమలు చేయనీ. పోయేదేమీ లేదు, మనం యిప్పటికే నిండా మునిగి వున్నాం. చలేసేందుకు అవకాశమే లేదు అన్నాడు. ఆవిడ వినలేదు. రాహుల్ ఊహల్లో తేలుతున్నాడనీ, అవన్నీ ఇండియాలో కుదిరేవి కాదనీ ఆవిడ నమ్మకం. 2014 లోకసభ ఎన్నికల సమయంలో 16 నియోజకవర్గాల్లో అతను చెప్పినట్లే అమెరికా తరహాలో ప్రైమరీ ఎన్నికలు నిర్వహించి, ఎవరికి బలముందని తేలిందో చూసుకుని, వారికి టిక్కెట్లు యిచ్చింది. అయితే అందరూ ఓడిపోయారు. పార్టీలో సీనియర్లందరూ రాహుల్‌ని వెక్కిరించారు. 'దేశం మొత్తం కాంగ్రెస్ వ్యతిరేక పవనాలు వీచే సమయంలో వచ్చిన ఫలితాలను తీసుకుని ప్రయోగం విఫలమైందంటే ఎలా?' అని రాహుల్ అనుయాయులు వాదిస్తున్నారు.  చిన్నా, పెద్దా ఎవరైనా సోనియా వద్దకు వచ్చి సమస్య చెపితే 'రాహుల్‌తో మాట్లాడండి' అంటుందామె. రాహుల్‌తో చెపితే 'పార్టీ అధ్యక్షురాలుండిగా ఆవిడదే తుది నిర్ణయం' అంటాడతను. ఈ దోబూచులతో ఏం చేయాలో, ఏం చేయకూడదో తెలియక రాష్ట్ర నాయకులు నిస్తేజం అయిపోతున్నారు.

మాయం కావడానికి వారం రోజుల క్రితం రాహుల్ సోనియాను కలిసి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్న కొందరు నాయకులపై, అసెంబ్లీ ఎన్నికలలో ఓటమికారకులని భావించే కొందరిపై చర్య తీసుకోమని కోరాడట. దానితో బాటు అనేక రాష్ట్రాలలో పార్టీ అధ్యక్షులను మార్చమని, ఏప్రిల్‌లో జరగబోయే పార్టీ సెషన్‌కు ముందుగానే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో మార్పులు చేయమని అడిగాడట. గతంలో కామరాజ్ పథకం పేర జరిగిన కాంగ్రెసు ప్రక్షాళన టైపులో ఏదో ఒక తీవ్రచర్య చేపట్టకపోతే కాంగ్రెసుకు మైనారిటీలు, యువత దూరమై పోతారని రాహుల్ వాదన. ఆవిడ దేనికీ తలవూపలేదు. రాహుల్‌ను అధ్యక్షుడయితే తక్షణం పార్టీ విడిచి వెళ్లడానికి డజను మంది నాయకులు సిద్ధంగా వున్నారని ఆవిడకు తెలుసు. తలిని లొంగదీయడానికి రాహుల్ మాయం కావాలని నిశ్చయించుకున్నాడు. పార్లమెంటు సెషన్‌లో వుంది కదా అని ఎవరో అంట్టే 44 మంది ఎంపీలు పెట్టుకుని అక్కడ ఊడబొడిచేదేముంది, మన మాట ఎటూ చెల్లుబాటు కావటం లేదు అన్నాడట. సరైన సమయంలో సుపుత్రుడు కనబడకపోవడాన్ని సమర్థించుకోవడానికి సెలవు చీటీ కథ చెప్పింది తల్లి. తనను యిన్నాళ్లూ నమ్ముకున్నవారికి న్యాయం చేయాలనే హామీ తీసుకుని రాహుల్‌కు పగ్గాలు అప్పచెప్పవచ్చుని వూహాగానాలు వినబడుతున్నాయి. ఈలోగా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడి మార్పు జరిగింది. ఆయన సోనియా కాండిడేటో, రాహుల్ కాండిడేటో స్పష్టత లేదు. ఏదో ఒక మార్పు చేశాం, కాస్త ఓపిక పట్టు అని రాహుల్‌కి నచ్చచెప్పడానికి సోనియా చేసిన మార్పేమో కూడా తెలియదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : నితిన్ గడ్కరీ వ్యాపారబంధాలు

నితిన్ గడ్కరీ రాజకీయనాయకుడు మాత్రమే కాదు, వ్యాపారస్తుడు కూడా. అతని పూర్తీ గ్రూపుకు సంబంధించిన వివాదాల వలననే మళ్లీ బిజెపి అధ్యక్షుడు కాలేకపోయాడు. అతని పూర్తీ గ్రూపు ఎస్సార్ గ్రూపులోని ఎస్సార్ ఆయిల్ లిమిటెడ్‌తో 2013 ఆగస్టులో టై అప్ అయి ఇథనాల్ ఆధారిత పెట్రోలు అమ్మడానికి 50 ఔట్‌లెట్స్ తెరవడానికి ఒప్పందంపై సంతకం పెట్టింది. తమకు కాబోయే భాగస్వామిని సంతోషపెట్టడానికి ఎస్సార్ గ్రూపు దక్షిణ ఫ్రాన్సులో తనకు సంబంధించిన "సన్‌రేస్" అనే ఒక విహారనౌక (యాట్)లో గడ్కరీకి, అతని కుటుంబసభ్యులకు జులైలో మూడు రోజుల విహారయాత్ర ఏర్పాటు చేసింది. ఆ విషయాలను యిప్పుడు "అవుట్‌లుక్" పత్రిక సాక్ష్యాలతో సహా బయటపెట్టింది. ఒక వ్యాపారసంస్థ తన క్లయింటుకు అలా ఏర్పాటు చేయడంలో వింతేమీ లేదు కానీ యీయన రాజకీయనాయకుడు కావడం, అది వివాదాలలో యిరుక్కున్న గ్రూపు కావడంతో యీ యాత్రకు సమ్మతించడంలోని ఔచిత్యంపై చర్చ జరుగుతోంది.

2013 జూన్ 30న ఎస్సార్ స్టీల్ చైర్మన్ ఎక్జిక్యూటివ్ అసిస్టెంటు "సన్‌రేస్" కెప్టెన్‌కు ఈ మెయిల్ పంపాడు. "నితిన్ గడ్కరీ అనే బిజెపి పార్టీ మాజీ అధ్యక్షుడు యూరోప్‌లో వున్నారు. మన బోటుపై 2-3 రోజులు గడుపుతారు. ఏర్పాట్లు చేయవలసినది." అని. గడ్కరీకి అప్పటికి ఏ పదవీ లేదు కానీ అప్పటికే  యుపిఏ ప్రభ తగ్గుతోందని, ఇంకో ఏడాదిలో జరగబోయే ఎన్నికలలో యుపిఏ తిరిగి రాదని, బిజెపికే అవకాశం వుందని, బిజెపికి మంచిరోజులు వస్తే నితిన్ మళ్లీ పుంజుకుంటాడనీ కార్పోరేట్ వర్గాలకు తెలుసు. ఎస్సార్ గ్రూపు అప్పటికే 2 జి స్కాములో యిరుక్కుని వుంది. లూప్ టెలికామ్ అనే అనుబంధ సంస్థ ద్వారా 2 జి లైసెన్సులు చేజిక్కించుకోవడానికి టెలికామ్ డిపార్ట్‌మెంటును మోసగించిందని ఆరోపిస్తూ సిబిఐ 2011 డిసెంబరు 12న ఐదుగురిపై కేసు పెట్టింది. దానిలో యిద్దరు లూప్ వారు యిద్దరు, ఎస్సార్ వాళ్లు ముగ్గురు వున్నారు. మాకే సంబంధం లేదని రెండు గ్రూపులూ

చెప్పుకున్నాయి. ఇలాటి గ్రూపునుండి సౌకర్యాలు పొందడానికి నితన్ సందేహించలేదు. సౌకర్యాలు కల్పించడానికి గ్రూపువారూ సంశయించలేదు. అవుట్‌లుక్ బయటపెట్టిన యీ మెయిల్స్ చూస్తే వారు యుపిఏ కేంద్రమంత్రులు సిఫార్సు చేసినవారికి బలవంతాన తమ సంస్థలో ఉన్నతోద్యోగాలు యివ్వవలసి వచ్చిందని అర్థమవుతుంది. ఈ వ్యాపారస్తులు రొట్టెకు రెండువైపులా వెన్న పూస్తూనే వుంటారు. ఈ తెలివితేటలు కొందరు ప్రభుత్వాధికారులకు లోపిస్తాయి. 2013 మేలో ఇన్‌కమ్‌టాక్స్ డిపార్టుమెంటు వాళ్లు నితిన్ గ్రూపు రూ.7 కోట్లు పన్ను ఎగేసిందని కేసు పెట్టారు. "మా పార్టీ అధికారంలోకి రాగానే యీ అధికారులను రక్షించడానికి అప్పుడు చిదంబరం, సోనియా వుండరు" అని తెగేసి బహిరంగంగా అన్నాడు నితిన్. ఐటీ అధికారులు అభ్యంతరం తెలిపితే మన్నించండి అన్నాడు. కానీ 2014 మే 13 న బిజెపి అధికారంలోకి వస్తూండగానే అధికారులే మమ్మల్ని మన్నించండి, మీరు పన్ను ఎగ్గొట్టమేమిటి, మా మతి మండా అంటూ కేసు ఎత్తేశారు. ఎస్సార్ గ్రూపు అలాటి పొరపాట్లు చేయలేదు. నితిన్‌తో ముందు నుంచీ సఖ్యంగానే వుంది.

నితిన్, అతని భార్య కాంచన్, పిల్లలు నిఖిల్, సారంగ్, కేతకి, కుటుంబసభ్యులు మధురా, రుతుజ, నందిని, గడ్కరీ ప్రయివేటు సెక్రటరీ వైభవ్ డాంగే మొత్తం 9 మందిని బోటు కెప్టెన్ ఫ్రాన్సులోని నైస్ ఎయిర్‌పోర్టు నుండి జూలై 7 న హెలికాప్టర్‌లో తన బోటు మీదకు తెప్పించుకున్నాడు. బోటులో యితర సౌకర్యాలతో బాటు హెలిపాడ్ కూడా వుంది. 20 మంది సిబ్బంది వున్నారు. విహారం ముగిసిన తర్వాత జులై 9 న మళ్లీ హెలికాప్టర్ ద్వారా నైస్ ఎయిర్‌పోర్టులో దింపేశారు. వాళ్లు అక్కడినుండి ఫ్రాంక్‌ఫర్ట్ మీదుగా ముంబయి చేరుకున్నారు. ఇది జరిగిన ఏడు వారాలకు పూర్తీ-ఎస్సార్ గ్రూపు ఒప్పందం కుదిరింది. ఎస్సార్ ఆశలు ఫలించాయి. నితిన్ ఎంపీగా, మంత్రిగా అయ్యాడు. మధ్యప్రదేశ్‌లోని మహాన్ కోల్ బ్లాక్‌లో ఎస్సార్ పవర్, హిందాల్కో భాగస్వాములుగా వున్నారు. పర్యావరణ శాఖ నుంచి అనుమతులు రాకుండానే ప్రాజెక్టు చాలా మేరకు కట్టేశారు. యుపిఏ మంత్రులు జైరాం రమేశ్, జయంతీ నటరాజన్ ప్రాజెక్టును ముందుకు పోనీయకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు నితిన్ వంటి కార్పోరేట్ మిత్రుడు మంత్రి అయ్యారు. ఆయన రూరల్ డెవలప్‌మెంట్ మంత్రిగా వుండగానే భూసేకరణ చట్టానికి సవరణలు ప్రతిపాదించాడు. కార్పోరేట్లు-ప్రభుత్వం కలిసి చేసే పిపిపిలకు 70% మంది స్థానికులు అనుమతి యివ్వాలని, ప్రయివేటు సంస్థల విషయంలో అయితే అది 80% అని యుపిఏ చేసిన చట్టానికి తూట్లు పొడవాలని సూచించినవాడు యితనే. వాటి ఆధారంగానే ఆర్డినెన్సు వెలువడింది. దాన్ని చట్టంగా చేయబోతే యిది రైతులకు వ్యతిరేకమంటూ ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టడంతో బిజెపి పునరాలోచనలో పడింది. కార్పోరేట్ బాంధవుడనే ముద్ర పడుతున్నందువలన కాబోలు, నితిన్‌ను నాలుగు నెలల క్రితమే ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖకు బదిలీ చేశారు. ఇప్పుడు పెట్రోలియం శాఖ డాక్యుమెంట్ల లీకు కేసు నిందితులలో ఎస్సార్‌కు చెందిన వినయ్ కుమార్ కూడా వున్నారు. ఇప్పుడీ విహారయాత్ర విషయం బయటకు వచ్చాక నితిన్‌ను వివరణ అడిగితే "అదెలా వుంటుందో చూడ్డానికి వెళ్లాను. అయినా నేను కార్పోరేట్ల దగ్గర్నుంచీ ఎప్పుడూ డబ్బు తీసుకోలేదు." అని జవాబిచ్చాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

## ఎమ్బీయస్ : గోవింద్ పన్సారే హత్య వెనుక ఎవరున్నారు?

ఫిబ్రవరి 16 న కొల్హాపూర్‌లో కమ్యూనిస్టు, లాయరు, సామాజిక కార్యకర్త అయిన గోవంద్ పన్సారే అనే 81 ఏళ్ల ఆయన తన భార్యతో మార్నింగ్‌వాక్‌కి వెళుతూండగా మోటార్‌సైకిల్ వచ్చిన యిద్దరు యువకులు తుపాకీతో 4 రౌండ్లు కాల్చి గాయపరిచారు. చికిత్స పొందుతూ పన్సారే ఫిబ్రవరి 20 న మరణించారు. ఈ వృద్ధుడు ఏం తప్పు చేశాడని యీ శిక్ష విధించారన్నదే అంతు పట్టటం లేదు. గతంలో మూఢవిశ్వాసాలు వ్యతిరేకంగా ఉద్యమించిన దభోల్కర్‌ను 2013 ఆగస్టులో హత్య చేసిన రీతిలోనే యీ హత్యా జరగడంతో యిది మతఛాందస వాదుల పని అని ఒక అనుమానం మెదలుతోంది. హత్య జరగగానే మహారాష్ట్ర నాయకులందరూ ఖండించారు. నాసిక్, ఔరంగాబాద్, ముంబయి వంటి నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఇటీవలి కాలంలో టోల్-గేట్లకు వ్యతిరేకంగా యీయన ఉద్యమించి వివాదాన్ని సుప్రీం కోర్టు దాకా తీసుకెళ్లాడు కాబట్టి దానివలన నష్టపోతున్న కార్పోరేట్లలో ఎవరైనా హత్య చేయించారా అన్న చిరుసందేహం కూడా వుంది.

1933లో అహ్మద్‌నగర్‌లో శ్రీరాంపూర్ తాలూకాలో పుట్టిన గోవింద్ పన్సారే దరిద్రంలోనే పెరిగాడు. వాళ్ల పొలం అప్పులవాళ్ల పరమై పోయింది. తల్లీ తండ్రీ వ్యవసాయ కూలీలుగా వుండేవారు. తల్లి పట్టుదలతో అతను బడికి వెళ్లాడు. సోషలిస్టు భావాలతో నెలకొల్పిన రాష్ట్ర సేవా దళ్ అనే సంస్థలో చేరడం వలన వారు నిర్వహించే హైస్కూలులో ఫీజు లేకుండా చదువుకోగలిగాడు. ఆ దశలో కమ్యూనిస్టు ఉద్యమంతో పరిచయం కలిగింది. కాదూ పాటిల్ అనే కమ్యూనిస్టు నాయకుడికి అసెంబ్లీ ఎన్నికలలో సాయపడితే అతను కొల్హాపూర్ తీసుకెళ్లి రాజారాం కాలేజీలో బిఏలో చేర్పించాడు. కమ్యూనిస్టు పుస్తకాలు అమ్మే రిపబ్లిక్ బుక్‌స్టాల్‌లోనే బస. ఇంటింటికి న్యూస్ పేపర్లు వేస్తూ, మునిసిపాలిటీలో ప్యూన్‌గా, ప్రైమరీ స్కూలులో టీచరుగా పనిచేస్తూ తిండికి గడించుకునేవాడు. శివాజీ యూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేశాడు. కొన్నాళ్లకు న్యాయశాస్త్రం చదివి 1964 నుండి లేబర్ సమస్యలపై న్యాయవాదిగా వున్నాడు. సిపిఐలో చేరి స్టేట్ సెక్రటరీగా వుంటూ అనేక ప్రజా ఉద్యమాలలో పాలు పంచుకున్నాడు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకునేవారిని ఆదుకోవడానికి సంస్థ నడిపాడు. అతని ముగ్గురు పిల్లలు కులాంతర వివాహాలు చేసుకున్నారు.

కమ్యూనిస్టు పార్టీలో వుంటూ కూడా వారి విధానాలు కొన్నిటిని విమర్శించేవాడు. ఛత్రపతి శివాజీ గురించి మహారాష్ట్రలో సరైన చర్చ జరగడానికి యిష్టపడరు. శివాజీ హిందూమతాన్ని నిలబెట్టడానికే అవతరించాడని, ముస్లింలను ద్వేషించాడనీ హిందూత్వ సంఘాలు ప్రచారం చేస్తాయి. ఖేడేకర్ అనే అతను శంభాజీ బ్రిగేడ్ పేర బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమం నడుపుతూంటాడు. శివాజీ పుట్టుపూర్వోత్తరాలు పరిశోధించి జేమ్స్ లేన్ అనే అమెరికన్ రాసిన ''శివాజీ–హిందూ కింగ్ యిన్ యిస్లామిక్ ఇండియా'' అనే పుస్తకం 2004లో వెలువడినపుడు యితను చాలా హింసాత్మకమైన ఆందోళన చేశాడు. పుణెలో భండార్కర్ ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ అనే గొప్ప పుస్తక భాండాగారాన్ని తన అనుచరులతో కలిసి తగలబెట్టాడు. గోవింద్ శివాజీపై ''శివాజీ కోన్ హోతా?'' (శివాజీ ఎవరు?) అనే చిన్న పుస్తకాన్ని 1987లో రాశాడు. శివాజీ ముస్లిం వ్యతిరేకి కాదని, సెక్యులర్ భావాలు కలవాడని, మహిళలను గౌరవించాడని, రైతులకు మేలు చేసే సంస్కరణలు చేశాడని, దళితులను, వెనకబడినవారిని పెద్ద పదవుల్లో నియమించాడని, బానిసత్వం నిర్మూలించాడని నిరూపించాడు. ఈ పుస్తకం లక్షలాది కాపీలు అమ్ముడుపోయింది.

ఇటీవలి కాలంలో హిందూత్వ శక్తులు మళ్లీ పుంజుకుంటూన్నాయి. ముస్లిం వ్యతిరేకతకు ప్రతీకగా శివాజీని వాడుకోవాలని చూస్తున్నాయి. గోడ్సేను ఆరాధించడం కూడా మొదలైంది. గోవింద్ యీ ధోరణులను నిరసించాడు. దానిపై యిటీవల యిద్దరు ఎబివిపి కార్యకర్తలు అతన్ని బెదిరించడం జరిగింది. ముంబయిపై దాడి జరిగిన సందర్భంగా మరణించిన హేమంత్ కర్కారేను ఎవరు చంపారన్నది మిస్టరీగా మిగిలిపోయింది. 'కర్కారేను ఎవరు చంపారు?' అని పుస్తకం రాసిన మాజీ ఐజీ ఆఫ్ పోలీసు ఎస్ ఎమ్ ముష్రిఫ్‌ను గోవింద్ జనవరిలో కొల్హాపూర్ రప్పించి సభ ఏర్పాటు చేశాక అతనిపై బెదిరింపులు యింకా ఎక్కువయ్యాయి. కొల్హాపూర్, పుణె వంటి ప్రదేశాల్లో విద్యాసంస్థల్లో కూడా రైటిస్టు ధోరణులు చొచ్చుకుపోయాయి. దభోల్కర్ హత్య జరిగి 18 నెలలైనా యింకా హంతకులను పట్టుకోలేదంటే అనుమానాలు వస్తున్నాయి. ఇప్పుడు యీ వ ృద్ధుడి హత్యతో అవి బలపడుతున్నాయి. నిన్న ఔరంగాబాద్ పోలీసులు అమోల్ పాటిల్ అనే యువకుడిపై కేసు పెట్టి విచారణ చేస్తున్నారు. అతను సోషల్ మీడియాలో దభోల్కర్, పన్సారేల గురించి అభ్యంతరకరమైన వ్యాఖ్యలు పోస్టు చేశాడు. వీరిద్దరూ ప్రగతిశీలవాదులు కాబట్టి అమోల్ రైటిస్టు అయి వుంటాడన్న అనుమానం సహజంగా వస్తుంది. అయితే కన్‌ఫ్యూజ్ చేయడానికి కాబోలు అతను యీ ఇద్దరి భావాలకు బద్ధవిరోధి ఐన ఎక్స్‌ట్రీమ్ రైటిస్టు ఖేడేకర్ పేరు కూడా జాబితాలో చేర్చాడు. 'మొదట దబోల్కర్, తర్వాత గోవింద్, యిక ఖేడేకర్' అని అతను నినదించాడు.

విచారణ సాగుతోంది. నిందితులు ఎప్పటికైనా దొరుకుతారో లేదో ఫడ్నవీస్‌కే తెలియాలి. ఈ లోగా రైటిస్టు శక్తుల మీదనే అనుమానం నీడలు పడుతున్నాయి. పన్సారేపై కాల్పులు జరిగిన మర్నాడే దానిని ఖండిస్తూ మరాఠీ దినపత్రిక తన సంపాదకీయానికి ''ఆలోచనాపరులారా, జాగ్రత్త'' అని శీర్షిక పెట్టింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**మార్చి 4-7 వీక్లీకై**

**ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 88**

## ఎమ్బీయస్ : ఈజిప్టు అధ్యక్షుడికి కార్మికవర్గాల బెడద

నాలుగేళ్ల క్రితం ఈజిప్టులో ముబారక్ పాలనపై 'అరబ్ స్ప్రింగ్' (వసంతం) పేర ప్రజల తిరుగుబాటు జరిగింది. దానికి నాందిగా కైరోలోని తహరీర్ స్క్వేర్‌లో జనవరి 25 న పౌరులు నిరసన ప్రదర్శనలు చేశారు. దేశమంతా శాంతియుతంగా ఆందోళనలు, సమ్మెలు జరిగాయి. అన్ని వర్గాల ప్రజలు, అన్ని రాజకీయ పక్షాలు చేతులు కలపడంతో భయపడిన ముబారక్ ప్రభుత్వం దాన్ని అణచాలని చూసింది. వెయ్యిమంది చనిపోయారు. ఆరువేలమంది గాయపడ్డారు. చివరకు ముబారక్ తన ఉపాధ్యక్షుడికి అధికారం అప్పగించి, గద్దె దిగిపోయాడు. అయినా ప్రజలు శాంతించకపోవడంతో ఆ ఉపాధ్యక్షుడు అధికారాన్ని సైన్యానికి అప్పగించి తను తప్పుకున్నాడు. ఫిబ్రవరి 13 న సైన్యాధికారి రాజ్యాంగాన్ని సస్పెండ్ చేసి, పార్లమెంటును రద్దు చేసి ఆర్నెల్ల సైన్యపాలన తర్వాత ఎన్నికలు నిర్వహించి తాము గద్దె దిగుతామని చెప్పాడు. ముబారక్‌పై విచారణ జరిపినట్లే జరిపి కేసులు నీరుకారుస్తూ వచ్చారు. దానిపై ప్రజలు మండిపడ్డారు. 2012లో జరిగిన ఎన్నికలలో ముస్లిం బ్రదర్‌హుడ్ నాయకుడు మహమ్మద్ మోర్సీని గెలిపించి అధికారంలోకి తెచ్చారు. అయితే సెక్యులరిస్టులు, సైన్యం మోర్సీని వ్యతిరేకించారు. 2013 జులైలో రక్షణ మంత్రి జనరల్ అబ్దెల్ ఫతా ఎల్ సిసి అమెరికా మద్దతుతో మోర్సీపై కుట్ర జరిపి అధికారంలోకి వచ్చాడు. 2014లో తనను అధ్యక్షుడిగా ఎన్నిక చేసేసుకున్నాడు. హోస్నీ ముబారక్‌పై అన్ని కేసులు ఎత్తేశాడు.

ఇప్పుడు సైన్యం సహాయంతో, అమెరికా మద్దతుతో, ఐఎంఎఫ్ ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్ యిచ్చిన ఆర్థికసహాయంతో, మధ్యప్రాచ్యంలో ఎటువంటి ప్రజాస్వామ్యమూ వర్ధిల్లకూడదనే పట్టుదలతో వున్న సౌదీ అరేబియా అందిస్తున్న నిధులతో ఈజిప్టును తన దాదాపు నియంతలా పాలిస్తున్నాడు. తను విరోధులుగా భావించిన వారినందరినీ హింసాయుతంగానో, చట్టప్రకారమో మట్టుపెడుతున్నాడు. ఈ విషయంలో జడ్జిలు అతనికి పూర్తిగా సహకరిస్తున్నారు. సైన్యం, పోలీసులు, న్యాయవ్యవస్థ మూకుమ్మడిగా ప్రజలపై చేస్తున్న దాడి యిది అంటున్నారు పరిశీలకులు. 2013 నుండి ప్రభుత్వం 29 వేల ముస్లిం బ్రదర్‌హుడ్ సభ్యులను జైల్లో పెట్టాడు. మూకుమ్మడిగా విచారణ జరిపించి, మూకుమ్మడిగానే మరణశిక్ష విధించారు. ఒక చోట వారి సంఖ్య అయితే 529 అయితే, మరో చోట 183. నిరసన తెలిపినందుకు జైళ్లల్లో పెట్టిన అన్ని పార్టీల వారి సంఖ్య 40 వేలు. ఈ చట్టం పేరుతో ప్రజాబలం వున్న

నాయకులందరినీ ఖైదులో కూర్చోబెట్టారు. 230 మందికి యావజ్జీవ కారాగార శిక్ష వేశారు. ఈ జనవరి 25న ఈజిప్టు తిరుగుబాటు నాల్గవ వార్షికోత్సవం జరుపుదామని కొందరు తహరీర్ స్క్వేర్‌లో ప్రవేశిద్దామని చూస్తే పోలీసులు తరిమివేశారు. నియంతకు వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం కోసం పోరాడిన ఆనాటి విప్లవం ఛాయలు ఎక్కడా మిగలకుండా వుండాలని కడు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అక్కడ గోడలపై రాసిన నినాదాలు తుడిపివేసి రంగులేసేశారు. ముస్లిం బ్రదర్‌హుడ్‌కు పట్టున్న అలెగ్జాండ్రాలో జరిగిన నిరసన ప్రదర్శలపై పోలీసులు విరుచుకుపడ్డారు. కాల్పుల్లో ఒక 17 ఏళ్ల కుర్రాడు చచ్చిపోయాడు.

ఇతని నిరంకుశ పాలన యిలా సాగుతుంటే ప్రజలు ఎలా భరిస్తున్నారన్న సందేహం వస్తుంది. నాలుగేళ్లగా నడుస్తున్న సంక్షోభంతో విసిగిపోయిన ప్రజలు ఏదో ఒకలాగ శాంతి నెలకొంటే చాలని చూస్తున్నారు. వారి సరిహద్దు దేశాలలో ఐయస్ దారుణ మారణకాండ జరుపుతోంది, మరో వైపు లిబ్యాలో అంతర్యుద్ధంతో కుతకుతలాడుతోంది. తను లేకపోతే, గట్టినా నిలబడకపోతే ఈజిప్టు గతీ యింతే, ప్రజాస్వామ్యపు హక్కుల కోసం పట్టుబడితే అశాంతి, అల్లర్లు తప్ప వేరేమీ దక్కవు అని ఎల్ సిసి ప్రజలకు చెపుతున్నాడు. హక్కుల గురించి పట్టణ ప్రజల్లో వున్నంత అవగాహన గ్రామీణ ప్రాంతాలలో లేదు. ఈజిప్టు ఉత్తరభాగంలో తహరీర్ స్క్వేర్ ప్రభావం లేదు. అక్కణ్నుంచి చాలామంది సైన్యంలో చేరుతున్నారు. ఇవి చూసి సిసి పాలనకు ఎదురు లేదు అనుకుంటే పొరపాటు. అతనికి కార్మిక వర్గాల నుంచి, రైతుల నుంచి ఆర్థికపరమైన కారణాల చేత వ్యతిరేకత ఎదురవుతోంది. ఐఎంఎఫ్ షరతులకు తలవొగ్గి పత్తిపై సబ్సిడీలు తగ్గించడం రైతుల పొట్ట కొట్టింది. 20 ఏళ్ల క్రితం ఈజిప్టు రైతులు 4 లక్షల టన్నుల పత్తిని ఉత్పత్తి చేసేవారు. గ్లోబలైజేషన్ వచ్చి, ప్రపంచ మార్కెట్ ధరలను శాసించడం మొదలుపెట్టడంతో ధరలు తగ్గడంతో వారు పత్తి ఉత్పత్తి తగ్గించేశారు. సబ్సిడీలు తగ్గించడంతో ఇంకా తగ్గించేశారు. గత ఏడాది 1.27 లక్షల టన్నులు పండిస్తే, యీ ఏడాది అంతకంటె తక్కువగా వుంటుంది అంటున్నారు. ఇలా వాణిజ్యపంటల ఉత్పత్తి తగ్గడం దేశానికి మేలు చేయదని మనం అనుకుంటాం. కానీ 2014 నవంబరులో కైరో పర్యటించిన ఐఎంఎఫ్ బృందం ఈజిప్టు చేపట్టిన ఆర్థిక సంస్కరణలపై హర్షం వ్యక్తం చేసి, దానికి ఫుల్ మార్కులు వేసింది.

ఇక కార్మికుల సంగతికి వస్తే మహల్లా ప్రాంతంలోని టెక్స్‌టైల్ మిల్స్ కార్మికులు ఒక సంఘటిత శక్తిగా ఏర్పడి తమకు కావలసినవి సాధించుకుంటున్నారు. 2006లో సమ్మె చేసి బోనస్సులు సాధించుకున్నారు. అది చూసి దేశమంతా కార్మికులు మాకూ కావాలంటూ ఆందోళనలు దిగారు. అవి రెండేళ్లపాటు సాగాయి. సిసి ప్రభుత్వం అందరినీ వంచుతోంది కానీ కార్మికులను ఏమీ చేయలేకుండా వుంది. వారి పోరు తట్టుకోలేక తన ప్రధానమంత్రి హజీమ్ ఎల్ బెబ్లాయీని తప్పించి అతని స్థానంలో ఇబ్రహీం మెహలెబ్‌ను తెచ్చాడు. అతను వస్తూనే "కార్మికుల దేశభక్తిని నమ్ముకునే ముందుకు సాగుతున్నాం" అన్నాడు. దేశభక్తి మాట ఎలా వున్నా మా భుక్తికి మాత్రం లోటు వస్తే వూరుకోం అంటున్నారు జౌళి పరిశ్రమలోని కార్మికులు. ప్రభుత్వరంగంలోని అనేక ఫ్యాక్టరీలకు స్వయంసమృద్ధి లేదు. మూసేద్దామంటే కార్మికులు వూరుకోరని భయం. 2014 డిసెంబరులో మహల్లా కార్మికులు పరిశ్రమల మంత్రిని కలిసి కాటన్ టెక్స్‌టైల్ పరిశ్రమను జాతీయ పథకంగా ప్రకటించాలని, తీసేసిన సబ్సిడీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అతను నిరాకరించాడు. వీళ్లు జనవరిలో సమ్మె మొదలుపెట్టారు. రాజకీయ కార్యకర్తలను కాల్పించగల, జైళ్లలో తోయించగల సిసి కార్మికుల విషయంలో మాత్రం యింకా ఏమీ చేయలేకుండా వున్నాడు. కార్మికులు, రైతులు చేతులు కలిపితే మాత్రం సిసి పని అయిందే, అప్పుడు ఐఎంఎఫ్ యిచ్చిన సర్టిఫికెట్టు, సౌదీ అరేబియా డబ్బు, అమెరికా ప్రశంసలు ఎందుకూ పనికి రావు. ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)

## ఎమ్బీయస్ : సమాచారచౌర్యం

ప్రభుత్వ కార్యాలయాల ఫైళ్ల నుండి నుండి కార్పోరేట్లు సమాచారాన్ని తస్కరిస్తున్నాయన్న సంగతి హఠాత్తుగా చర్చలోకి వచ్చింది – ప్రభుత్వ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఇంటెలిజెన్సు బ్యూరో రెండు నెలల పాటు నిఘా వేసి ఫిబ్రవరి 18 న ఢిల్లీ పోలీసుల చేత దోషులను అరెస్టు చేయించారు కాబట్టి! ఎన్నో ఏళ్లుగా యిలాటివి జరుగుతూనే వుంటాయని అందరూ వూహిస్తూంటారు. 2010 నాటి నీరా రాడియా టేపుల తర్వాత నిర్ధారణ అయింది కూడా. ఈసారి పెట్రోలియం శాఖ ఆఫీసుల్లో సిబ్బంది 9 రహస్య డాక్యుమెంట్లతో సహా పట్టుబడ్డారు. కేంద్ర బజెట్‌లో ప్రతిపాదించబోయే నేషనల్ గ్యాస్ గ్రిడ్‌కై సేకరించిన సమాచారంతో సహా నెలవారీ నివేదికలు, ఉత్తరప్రత్యుత్తరాలు వాటిలో వున్నాయి. వాళ్లు పవర్, కోల్ మంత్రిత్వ శాఖల్లో కూడా యిలాటి పనులే చేశామని ఒప్పుకున్నారు. చివరకు శంతను సైకియా, ప్రయాస్ జైన్ అనే ఎనర్జీ కన్సల్టెంట్లను, ఐదు కార్పోరేట్ల ఉన్నతాధికారులను – రిషి ఆనంద్ (అడాగ్ రిలయన్సు), సుభాష్ చంద్ర (జుబిలియంట్ ఎనర్జీ), వినయ్ కుమార్ (ఎస్సార్), శైలేశ్ సక్సేనా (ఆర్ఐఎల్), కెకె నాయక్ (కెయిర్న్స్) అరెస్టు చేశారు.

అసలు మీలాటి పెద్ద కార్పోరేట్లు యిలాటి పనికి ఎందుకు దిగజారాలి? అని అడిగితే సంస్థల ప్రతినిథులు కొందరు వాపోయారు – 'ఏం చేయమంటారు? మేం ఉత్తరాలు రాస్తే ప్రభుత్వాధికారులు జవాబివ్వరు. అపాయింట్‌మెంట్ అడిగితే యివ్వరు. బతిమాలితే కొన్నాళ్లకు యిచ్చినా సమావేశాల్లో పెదవి విప్పరు. మనం చెప్పినది విని వూరుకుంటారు. వాళ్లు ఏం ఆలోచిస్తున్నారో, ఎలాటి విధానం రూపొందిస్తున్నారో తెలియకపోతే మా కంపెనీ పథకాలను ఎలా రచించేది? కోల్, పెట్రోలియం, టెలికమ్యూనికేషన్స్

రంగాలలో యిలాటి ముందస్తు సమాచారం చాలా అవసరం. అది పెట్టుకుని మేం పత్రికల్లో అనుకూలంగానో, ప్రతికూలంగానో వ్యాసాలు రాయిస్తాం, పార్లమెంటులో ప్రశ్నలు వేయిస్తాం, ఆ విధానాన్ని త్వరగా అమలు చేయించడమో, ఆలస్యం చేయించడమో, అడ్డుకోవడమో ఏదో ఒకటి చేయగలుగుతాం. రక్షణ శాఖ విషయంలో పోటీదారు ధర తెలుసుకుని, మనం ఎలాగోలా కాంట్రాక్టు దక్కించుకోగలిగితే అది కొన్ని వందల కోట్ల లాభానికి బాట వేస్తుంది.' అంటారు. ప్రభుత్వం నుంచే కాదు, యితర కంపెనీల నుండి కూడా సమాచారాన్ని సేకరించడం వారి కార్యకలాపాల్లో భాగంగా మారిపోయింది.

ఈ విషయంపై అసోచామ్‌వారు 2012లో 1500 మంది సిఇఓలతో నిర్వహించిన సర్వేలో 900 మంది యితర కంపెనీల్లో తమ గూఢచారులను పెట్టి సమాచారం సేకరించినట్లు ఒప్పుకున్నారు. తమకు కావలసినవారిని పోటీ కంపెనీల్లో ప్యూన్లుగా నియమింపచేసి టేబుల్ కింద బగ్గింగ్ సామగ్రి పెట్టించడం, రిసెప్షనిస్టులుగా చేర్చి టెలిఫోన్ సంభాషణలను వినమనడం – యిలాటివి చేస్తామని చెప్పారు. లంచాలిచ్చి, విందులిచ్చి సమాచారాన్ని సేకరించడం, దాన్ని బట్టి విధానాలను తమ కనుగుణంగా మార్చడానికి, తమ కనుకూలమైన నిర్ణయాలు తీసుకోవడానికి అధికారులను, మంత్రులను లోబరచుకోవడానికి ప్రతి కంపెనీ కొంత శాతం ఖర్చు పెడుతోందన్నది బహిరంగ రహస్యం అయిపోయింది. రూ. 300 కోట్ల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీకి 2% దీనికోసం కేటాయించినా అది రూ. 6 కోట్లు అవుతుంది. వాల్‌మార్ట్ ఇండియాలో ప్రవేశిద్దామనుకున్నపుడు తమ తరఫున లాబీయింగ్‌కై 25 మిలియన్ డాలర్లు ఖర్చుపెట్టిందని 2013లో బయటకు వచ్చింది. ఈ విభాగానికి వారు పెట్టుకున్న ముద్దు పేరు – లయజన్ లేదా కార్పోరేట్ కమ్యూనికేషన్ ! తమకు కావలసిన ప్రభుత్వశాఖల నుంచి రిటైరైన వారిని నెలకు రూ.లక్ష జీతంతో నియమించుకుని, పాత పరిచయాలతో పని చక్కబెట్టుకుని రమ్మంటారు. వీరితో పాటు విడిగా పని చేసే కొన్ని సంస్థలను కన్సల్టెంట్లుగా, లాబీయిస్టులుగా పెట్టుకుంటారు. వీరు స్వతంత్రంగా పనిచేస్తూ రేటు ఎవరికి కావాలంటే వారికి తాము సేకరించిన సమాచారం అమ్ముతూ వుంటారు. వీరు ప్రతి చిన్న లేఖను ఎంతో కొంత ధర పెట్టి కొంటూ వుంటారు. ఏ పుట్టలో ఏ పాముందో తెలియదు కదా! సమాచారాన్ని కొన్న తర్వాత తమకు పనికి రాకపోతే దాన్ని ఇంకోళ్లకు అమ్మేసుకునే పద్ధతి కూడా వుంది. వీరికి జర్నలిస్టులు కూడా తోడవుతారు. ఏదైనా హాట్‌హాట్ సమాచారం దొరికితే కథనం రాసుకోవచ్చు కదాని వారి ఆశ. ప్రచురించలేని సందర్భాల్లో ప్రతిపక్ష నాయకులకు అమ్మేసుకుంటారు.

డాక్యుమెంటు విలువను బట్టి ధర పలుకుతుంది. మీటింగ్ రిపోర్టులకు పేజీకి రూ.వెయ్యి, రిపోర్టులు, ప్రాజెక్షన్లు, సర్వేలు, ఆంతరంగిక సమావేశాల తీర్మానాలు, మంత్రుల చర్చలు అయితే రూ.50 వేల నుండి రూ.లక్ష దాకా. ప్రధానమంత్రి ఆఫీసు నుంచి డాక్యుమెంట్లయితే రూ.2 నుంచి 5 లక్షల దాకా వుంటుంది. ఒక ఫైలు సరాసరిన డజను కార్యాలయాలకు వెళుతుంది. దాన్ని చిన్నా పెద్దా ఉద్యోగులు చేతబట్టి అనేక శాఖలకు తీసుకెళతారు. వారిలో కాంట్రాక్టు వుద్యోగులు కూడా వుంటారు. ఈ క్రమంలో ఎక్కణ్నుంచైనా సమాచారం లీక్ కావచ్చు. సీనియర్ ఆఫీసర్లు సమాచారాన్ని పంపడానికి తమ ప్రయివేటు యీ మెయిల్స్ వుపయోగిస్తున్నారు. సమాచారం బయటకు వచ్చే మార్గాలు అనేకం. క్లాసు 3, 4 తరగతుల ఉద్యోగులు డాక్యుమెంట్లను చూసి రాసివ్వడమో, జిరాక్సు చేయడమో చేస్తూంటారు. ఇప్పుడు మొబైల్ ఫోన్లలో స్కాన్‌బాట్ అప్లికేషన్ వచ్చాక ఎక్కడికీ తీసుకెళ్లనక్కర లేకుండానే ఒక్క సెకనులో ఫోటో తీసేస్తున్నారు. క్షణాల్లో బయటకు పంపేసి, డిలీట్ చేసేస్తున్నారు. పట్టుబడినా జేబులో ఏ కాగితమూ దొరకదు. అందుకే దశాబ్దాలుగా వేలాది క్లాసిఫైడ్ డాక్యుమెంట్లు బయటకు వచ్చేస్తున్నాయి. మిలటరీ ప్రొక్యూర్‌మెంట్ ప్లాన్ల దగ్గర్నుంచి ప్రధాని కాబినెట్ మీటింగుల్లో రహస్య బ్రీఫింగుల దాకా ఏవీ లీకుకి అతీతం కాదు. 2014లో పెట్రోలియం మంత్రి వీరేంద్ర పాటిల్ గ్యాస్ ధరలు పెంచినపుడు అది ఒక కార్పోరేట్‌కు సాయపడడానికే అని సిపిఐ నాయకుడు గురుదాస్ దాస్‌గుప్తా ఆరోపించారు. సాక్ష్యంగా పెట్రోలియం శాఖలోని ఫైళ్ల నోటింగ్సు చూపించారు. దాంతో ప్రభుత్వం వులిక్కిపడి, యికపై సమాచారం బయటకు పొక్కకుండా వుండాలని ఆఫీసుల్లో సిసిటివిలు పెట్టించారు, కొన్ని ఫైళ్లు బీరువాల్లో పెట్టించే ఏర్పాట్లు చేశారు. అంత చేసినా మరి యీ లీకులు ఎలా జరిగాయి అంటే సింపుల్. ఆ సిసిటివి కెమెరాలు పనిచేయకుండా పాడు చేశారు, ఆ బీరువా తాళాలకు డూప్లికేట్ తాళం చెవులు చేయించారు.

తాజా వుదంతాన్ని లాబీయింగ్‌తో ముడిపెట్టడాన్ని లాబీయిస్టులుగా పేరు బడినవారు వ్యతిరేకిస్తున్నారు. 'ఇది చౌకబారు దొంగతనం, దీన్ని లాబీయింగ్, లయజనింగ్ అంటే ఎలా? అది చాలా సోఫిస్టికేటెడ్‌గా సాగుతుంది. అధికారులకు డిన్నర్లు, మందు పార్టీలు యిచ్చి చర్చల్లోకి దింపి, మా ఆలోచనలను వారి మెదళ్లలోకి వారికే తెలియకుండా చొప్పించి, ఒరిజినల్‌గా అది వారి ఆలోచనే అని వారు భావించేట్లు చేస్తాం. దీనికి కొన్ని నెలల కసరత్తు చేయాలి. ఎన్నో తెలివితేటలు వుపయోగించాలి.' అంటున్నారు వారు. నీరా రాడియా టేపుల్లో ప్రస్తావనకు వచ్చిన కార్పోరేట్ లాబీయిస్టు దీపక్ తల్వార్ వున్నాడు. అతనూ, అతని క్లయింటు టెలికార్డియా అనే టెలికామ్ కంపెనీ కలిసి ఫ్లోట్ చేసిన ఎంఎన్‌పి ఇంటర్‌కనక్షన్ టెలికామ్ సొల్యూషన్స్ కంపెనీకి మరో కంపెనీతో బాటు మొబైల్ నెంబరు పోర్టబిలిటీ లైసెన్సు దక్కింది – హోం శాఖ భద్రతాపరమైన అభ్యంతరాలు వ్యక్తం చేసినా! దీనికోసం అతను అప్పటి సిబిఐ చీఫ్ రంజిత్ సిన్హా యింటికి 2013 మే నుండి 2014 ఆగస్టు వరకు 63 సార్లు వెళ్లాడని సిన్హా యింటి దగ్గర పెట్టిన రికార్డులు చెపుతున్నాయి! ఇలా వుంటుంది ప్రభుత్వం పనిచేసే తీరు. ఇప్పుడీ ఫైళ్ల దొంగతనం తర్వాత ప్రభుత్వం ఏ మేరకు మేలుకుంటుందో, యీ అధునాతన సాంకేతికయుగంలో భద్రత ఏ మేరకు సాధ్యమో గమనించాలి. ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)

## ఎమ్బీయస్ : షారుఖ్ ఖాన్ రుచి చూసిన కామన్ మ్యాన్ పవర్

షారూఖ్ ఖాన్ ముంబయిలోని బాంద్రా బీచ్ వద్ద సముద్రానికి ఎదురుగా "మన్నత్" పేర భవంతి కట్టుకున్నాడు. 2002లో రెవెన్యూ అండ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అతనికి ఆ ప్లాటు లీజు కిచ్చింది. కొన్ని షరతులతో అక్కడ యిల్లు కట్టుకోవడానికి జిల్లా కలక్టరు అనుమతి యిచ్చాడు. ఇల్లు కట్టుకోవడంతో మనవాడు ఆగలేదు. 2007లో యింటి ముందు వున్న రోడ్డుపై 1.5 మీటర్ల ఎత్తులో 70 మీటర్ల పొడవుతో ఓ ర్యాంప్ (రోడ్డు మీద వంతెన) కట్టేసి, దానిమీద తన వ్యాన్ పార్క్ చేసుకోవడం మొదలుపెట్టాడు. ఇది ఆక్రమణ కిందే వస్తుంది. సముద్రతీరంలో అక్రమనిర్మాణం కాబట్టి కోస్టల్ రెగ్యులేషన్ జోన్ అథారిటీ కూడా చర్య తీసుకోవచ్చు. అయినా అతని పలుకుబడి చూసి మునిసిపాలిటీ అధికారులు కానీ కోస్టల్ అధికారులు కానీ నోరెత్తలేదు. అయితే అతని కర్మానికి ఆ వీధిలోనే కాస్త ముందుకు వెళితే 300 ఏళ్ల నాటి మౌంట్ మేరీ బేసిలికా చర్చ్ వుంది. దానికి అనేక మంది క్రైస్తవులు వెళుతూ వుంటారు. ఏటా లక్షలాది భక్తులు పాల్గొనే పెద్ద ఉత్సవం కూడా జరుగుతూంటుంది. 2010లో అలాటి ఉత్సవం జరిగినపుడు యీ ర్యాంప్‌పై ప్రజల ఒత్తిడి పడకుండా పోలీసులు ఆ రోడ్డుకి అడ్డంకులు (బ్యారికేడ్లు) కట్టేసి భక్తులను అటువైపు వెళ్లనీయకుండా చేసి వారికి యిబ్బంది కలిగించారు. ఎందుకా అని ఆరా తీస్తే షారుఖ్ గారి అక్రమ నిర్మాణాన్ని కాపాడడానికి అని తెలిసి వారు మండిపడ్డారు. కాథలిక్ సంస్థలు అనేకం కలిసి షారుఖ్‌పై ఫిర్యాదులు గుప్పించారు. వారికి స్థానిక కాలనీవాసుల సంఘాలు తోడయ్యాయి. కానీ కార్పోరేషన్ పట్టించుకోలేదు. 2013 నాటికి వారి ఆందోళన తారస్థాయికి చేరింది. 300 మంది కాలనీవాసులు, క్రైస్తవ సంఘాలవారు ఉత్సవం మొదటి రోజున అడ్డంకి వద్ద కొన్ని గంటలపాటు నినాదాలు యిచ్చి నిరసన వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ మంత్రి, ముఖ్యమంత్రి.. ఎవరూ స్పందించలేదు.

అప్పుడు వాచ్‌డాగ్ ఫౌండేషన్ రంగంలోకి దిగింది. గాడ్‌ఫ్రే పిమెంటా అనే లాయరు, నికొలస్ అల్‌మీడా అనే కార్పోరేటరు దానిలో ప్రముఖులు. ఇద్దరూ కలిసి  నడుం కట్టారు. ముఖ్యమంత్రి వద్దకు వెళ్లి పోట్లాడితే ర్యాంప్ కూల్చేయమని ఆయన అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ సెక్రటరీకి లేఖ పంపించారు, రెండు సార్లు. అయినా ఆచరణలో ఏమీ జరగలేదు. మునిసిపల్ కమీషనర్‌ను వెళ్లి నిలదీస్తే ఆయన ఆ వార్డుకి లేఖ రాసి సంగతేమిటో చూడమన్నాడు. ఆచరణ శూన్యం. బాబా సిద్దిఖి అనే మాజీ ఎమ్మెల్యే, ప్రియా దత్ (సునీల్ దత్ కుమార్తె) అనే మాజీ ఎంపీ.. అందరూ విని నోరు చప్పరించినవారే తప్ప సాయపడలేదు. కమిషనర్‌పై, షారూఖ్ పై క్రిమినల్ కంప్లయింట్ యిచ్చి కేసు పెట్టారు. కోర్టు దాన్ని పెండింగులో పెట్టింది. ఇక వీళ్లు షారూఖ్ ఖాన్  యింటి గురించి, దానికి యిచ్చిన అనుమతుల గురించి సమాచార హక్కు కింద వివరాలు కోరారు. పన్నెండు సార్లు అప్లయి చేయగా అప్పుడు వెలుగులోకి వచ్చింది – లీజు సంగతీ, షరతుల సంగతీ. షరతు ఉల్లంఘిస్తే ఆ ప్లాటును ప్రభుత్వం స్వాధీనం చేసుకునే వెసులుబాటు కూడా వుంది. ఒక ఫారంలో షారుఖ్, అతని భార్య గౌరి సంతకాలు వున్నాయి కానీ పైనంతా ఖాళీగానే వుంది. అయినా డిపార్టుమెంటు వాళ్లు అనుమతి యిచ్చేశారు! షారుఖ్ పలుకుబడి స్థాయి తెలుపుతుందిది.

కితం ఏడాది బిజెపి అధికారంలోకి రావడంతో పోరాట వీరులకు ధైర్యం, అధికారులకు భయం కలిగింది. బిజెపి ఎమ్మెల్యే అశీశ్ షెలార్, ఎంపి పూనమ్ మహాజన్ మునిసిపల్ కమిషనర్‌కు లేఖలు రాసి సంగతేమిటో చూడమన్నారు. వాచ్‌డాగ్ ఫౌండేషన్ వారు ఫిబ్రవరి 3 న మునిసిపల్ కమిషనర్‌కు లేఖ రాశారు – 24 గంటల్లో మీరు కూల్చేయకపోతే మేం పిల్ దాఖలు చేస్తాం, మీ పరువు బజారు కెక్కిస్తాం అని. "చెన్నయ్ ఎక్స్‌ప్రెస్" సినిమాలో షారుఖ్ మాటిమాటికీ 'డోంట్ అండర్‌ఎస్టిమేట్ పవర్ ఆఫ్ కామన్ మ్యాన్' అని చెప్పిన డైలాగు సారాంశం యిదే కాబోలు అనుకుని కమిషనర్ ఫిబ్రవరి 6 న షారుఖ్‌కు 'ర్యాంప్ మీ అంతట మీరే కూల్చేస్తారా, మమ్మల్ని కూల్చేయమంటారా?' అని నోటీసు పంపారు. షారుఖ్ సమాధానం ఏమిచ్చాడో తెలియదు కానీ ఫిబ్రవరి 14 న 35 మంది మునిసిపల్ అధికారులు, 40 మంది కార్మికులు వచ్చి దాన్ని కూల్చేశారు. కూల్చినందుకు అయిన ఖర్చును షారుఖ్ దగ్గర వసూలు చేస్తారని పుకారు.  **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఫిబ్రవరి 2015)**

**మార్చి 8**

## ఎమ్బీయస్ : తీస్తా ఎన్‌జిఓ గురించి మరి కాస్త...

"అచ్చే దిన్– బురే దిన్" వ్యాసంలో తీస్తా సెతల్వాడ్, ఆమె భర్త ఎదుర్కుంటున్న కేసుల గురించి కొంత రాశాను. ఆమె నడిపే ఎన్‌జిఓ సిజెపి, మ్యూజియం గురించి నిధులు సేకరించిన సబ్‌రంగ్ ట్రస్టు గురించి మరిన్ని వివరాలు తెలియవచ్చాయి. అవి పాఠకులతో పంచుకోవడానికి, ఆ వ్యాసం సందర్భంగా నాపై వచ్చిన విమర్శలకు నా వివరణ యివ్వడానికి యిది రాస్తున్నాను. పనిలో పనిగా యితర వ్యాసాలపై వచ్చిన విమర్శలనూ ప్రస్తావిస్తాను, అప్రస్తుత ప్రసంగం అని తోస్తే మన్నించండి. దీనిపైనా వ్యాఖ్యలు చేయవచ్చు కానీ అన్ని భాగాలూ పూర్తిగా చదివిన తర్వాతనే ఆ పని చేయండి.

ఆ వ్యాసంలో నేను ఎక్కడా తీస్తా నడిపే ఎన్‌జిఓ గొప్పదని సర్టిఫికెట్టు యివ్వలేదని గమనించాలి. వారు ఎదుర్కుంటున్న కేసులేమిటి, ఎవరు పెట్టారు, దానిపై కోర్టుల్లో జరిగిన వాదోపవాదాలేమిటి, పోలీసులు ఏం చేస్తున్నారు యివే రాశాను. ఏ ఎన్‌జిఓ చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం? అనే భావనే నాది. సత్యార్థి విషయంలో కూడా దానిపై వచ్చిన విమర్శలు రాశాను. మోదీ

అధికారంలోకి వస్తూండగానే ఎన్‌జిఓలను నియంత్రించాలని అనుకున్నారు. అప్పుడు చాలా కథనాలు వచ్చాయి. వాటిని సేకరించి వ్యాసం రాద్దామని చూస్తే సీరీస్ రాయనిదే కుదరదనిపించింది. ఉన్నవి పూర్తి చేయకుండా సీరీస్ అంటే తంతారని భయపడి ఆగిపోయాను. ఎన్‌జిఓలలో 90% ఏదో ఒక వివాదంలో యిరుక్కున్నవే. అవన్నీ ఒకళ్లో, యిద్దరో వ్యక్తుల చుట్టూనే తిరుగుతాయి. వాళ్లకు వేరే జీవనోపాధి వుండదు, అందుకని అనాథల పేర, బాధితుల పేర సేకరించిన డబ్బును వారి ఖర్చులకు వాడుకుంటారు. చాలా కేసుల్లో ఎన్‌జిఓ ఆఫీసు వాళ్ల యిల్లే అయివుంటుంది. రోజంతా దీనికే సమయాన్ని వెచ్చించినపుడు మరి బతుకుతెరువు ఎలా? రోమన్ తెలుగు ప్రచార సమితి నడిపినపుడు దేశవిదేశాలలోని తెలుగు సంఘాల అడ్రసులు సంపాదించాను. 99% కేసుల్లో అన్నీ ఎవరో ఒక వ్యక్తి నడిపేవే. పెద్దపెద్ద ఫౌండేషన్‌లు కూడా మనం అనుకున్నట్టు సాగవు. చిన్నప్పుడు బాలలకు సహాయం చేస్తున్నాను అనుకుంటూ 'క్రై' వారి గ్రీటింగ్ కార్డులు కొనేవాణ్ని. తర్వాత తెలిసింది – వాళ్లకు వచ్చిన విరాళాల్లో సింహభాగం అధికారుల భారీ జీతాలకే పోతుందిట, పిల్లలకు దక్కేది తక్కువట. అప్పణ్నుంచి ఎవరికైనా సరే విరాళాలు వస్తురూపేణా యిస్తున్నాను, క్యాష్ అయితే డైరక్టుగా యిస్తున్నాను తప్ప సంస్థలకు యివ్వడం మానేశాను. ఇక ఎన్‌జిఓల పేరు చెప్పి బ్లాక్‌మెయిలింగ్ చేసే సందర్భాలూ బోలెడు చూశాను. ఇన్ని చూసినవాణ్ని తీస్తా ఎన్‌జిఓకు నేనెందుకు కారెక్టరు సర్టిఫికెట్టు యిస్తాను?

ఒక పాఠకుడు ''ఈనాడు''లో పడిన వీరేంద్ర కపూర్ వ్యాసం అనువాదం లింకు చూడమన్నారు. ముందే చదివాను. కిరణ్ బేదీ బిజెపిలో చేరినప్పుడు అరవింద్, కిరణ్ ఒకే తానులో గుడ్డలంటూ వారు నడిపే ఎన్‌జిఓలను విమర్శిస్తూ ఆయన రాసిన వ్యాసమూ చదివాను. కిరణ్ బేదీ గురించి రాస్తూ ఆమె ఎన్‌జిఓ కూడా ఆమె యింటి నుంచే నడుస్తుందని, ఆమె లెక్చర్లు యివ్వడానికి విమానంలో వెళ్లినపుడు నిర్వాహకుల వద్ద ఎక్జిక్యూటివ్ క్లాస్ టిక్కెట్టు డబ్బు పుచ్చుకుని, వెళ్లడం మాత్రం ఎకానమీ క్లాసులో వెళ్లిందని, ఆ విషయం బయటపడినప్పుడు రెండింటి మధ్య వ్యత్యాసాన్ని తన ఎన్‌జిఓ ఖాతాలో వేశానని చెప్పుకుందని గుర్తుచేశాడు. ఈ వ్యాసం అనువాదం ''ఈనాడు''లో వచ్చిందో లేదో (కిరణ్ బిజెపి అభ్యర్థి కదా), దాన్ని ఆ పాఠకుడు చదివారో లేదో నాకు తెలియదు. ఎన్‌జిఓలలో చాలా భాగం యిలాటివే అయినా తీస్తా కేసులో గుజరాత్ హై కోర్టు న్యాయమూర్తి జె బి పార్దీవాలా 'ఈ సిజెపి ఒన్ మ్యాన్–ఒన్ వుమన్ షో' అన్నాడు. హై కోర్టు ముందు గుజరాత్ ప్రభుత్వం తరఫున వాదిస్తున్న మహేశ్ జెఠ్మలానీ వీళ్ల నిధులు దుర్వినియోగం చేశారన్నది సాక్ష్యంగా ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసరుకు యిన్‌కమ్‌టాక్స్ రిటర్న్‌స్ దాఖలు చేయలేదని అన్నాడు. తీస్తా తరఫు న్యాయవాది మిహిర్ ఠాకూర్ 'చేయకపోవడమేం, అవీ, వోచర్లు, యితర డాక్యుమెంట్లు అన్నీ సబ్మిట్ చేశారు' అని వాదించాడు. అయితే ఆ వాదనను ఫిబ్రవరి 6న, వాదనలు ముగిసిన తర్వాత చేశాడట. అందువలన దాన్ని లెక్కలోకి తీసుకోకూడదని జడ్జిగారు నిర్ణయించారు.

అంతటితో ఆగకుండా 'వీళ్లు బీదవారికై ఉద్దేశించిన నిధులను దుర్వినియోగం చేశారు. బాధితుల కోసం సేకరించిన నిధులతో వీళ్లు జల్సా చేయడమేమిటి?' అన్నాడు. బెయిల్ తిరస్కరించి, అరెస్టు చేయడానికి పోలీసులకు అనుమతి యిచ్చాడు. బెయిల్ పిటిషన్‌ను ఆయన తిరస్కరిస్తాడని గుజరాత్ పోలీసులకు ముందే ఎలా తెలుసో మనకు తెలియదు కానీ వాళ్లు ముందే ముంబయి వచ్చి కూర్చున్నారు. 'బెయిల్‌పై తీర్పు అహ్మదాబాద్‌లో వెలువడినది సాయంత్రం నాలుగున్నరకి, కానీ గుజరాత్ పోలీసులు ముంబయిలోని తీస్తా యింటికి మిట్టమధ్యాహ్నమే వచ్చి కూర్చున్నారు' అంటాడు కపిల్ సిబ్బల్. అయితే తీస్తా వాళ్లు అవేళ అరెస్టు తప్పించుకున్నారు, సుప్రీం కోర్టులో బెయిల్ దొరుకుతుందనే ఆశతో! సిజెపి, సబ్‌రంగ్ ట్రస్టు ఇన్నాళ్లగా తమ ఎక్కవుంట్లను చారిటీ కమిషనర్‌కు, హోం శాఖకు, ఇన్‌కమ్‌టాక్స్ శాఖకు, దాతలకు, ఆడిటర్లకు సబ్మిట్ చేస్తూనే వుందని, వాళ్లెవరూ ఎన్నడూ అభ్యంతర పెట్టలేదనీ ముంబయిలోని మానవహక్కుల సంఘం నేత సంధ్య అనే ఆవిడ చెప్పారు.

వివాదగ్రస్తమైన మ్యూజియం విరాళాల గురించిన వివరాలేమిటంటే – 2007లో ఆ సొసైటీ స్థలంలో స్మారకచిహ్నంగా మ్యూజియం కడదామని అనుకున్నారు. 2008లో సొసైటీ సరేనంది. ఆ పని కోసమే సబ్‌రంగ్ ట్రస్టు అని ప్రారంభించారు. 80 మంది ఆర్టిస్టులు ముందుకు వచ్చి వారి చిత్రాలను దానం చేసి 'ఆర్ట్ ఫర్ హ్యూమానిటీ' పేర ముంబయిలో ప్రదర్శనకు అమ్మకానికి పెట్టి నిధులు సంపాదించి యిచ్చారు. ''వీక్'' ప్రకారం చిత్రాల అమ్మకం ద్వారా వచ్చినది రూ. 4 లక్షలుట (''ఫ్రంట్‌లైన్'' ప్రకారం వచ్చినది రూ. 1 కోటి! – రిపోర్టెడ్‌లీ అని చేర్చారు) ''అవుట్‌లుక్'' ప్రకారం బొమ్మల ద్వారా రూ. 4 లక్షలు, విదేశాల నుంచి మరో 50 వేలు వచ్చాయట. వీటిలో ఏది నిజమో తెలియదు కానీ ఆ ట్రస్టు రూ.8 కోట్లకు మించి వసూలు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో రాశారు. ''అవుట్‌లుక్'' ప్రకారం సిజెపి, సబ్‌రంగ్ కలిసి గత పదేళ్లలో సేకరించిన డబ్బు రూ. 9.74 కోట్లు. దానిలో రూ.38.5 లక్షల గురించే వివాదమని అంటుందా పత్రిక. నా ఉద్దేశంలో మనం అన్ని చోట్ల నుండి సమాచారం సేకరించాలి, అన్నీ విన్నాక ఒక అభిప్రాయం ఏర్పరచుకోవాలి, కొత్త సమాచారం వచ్చినపుడు అవసరమైతే అభిప్రాయాన్ని మార్చుకోవాలి. ఇంకో ముఖ్యమైన విషయం ఏమిటంటే – ఒక వ్యక్తికి పలుకోణాలుంటాయి. ఒక కోణంలో సమాజానికి మంచి చేయవచ్చు, మరో కోణంలో చెడు చేయవచ్చు. ఏ వ్యక్తి పుట్టిన దగ్గర్నుంచి చచ్చేదాకా ఒక్కలా వుండడు. అతనేం చేసినా సమర్థిస్తూనే వుండాలి అనుకునేవాడు మానసికంగా బానిస.

మా చిన్నపుడు ఎయన్నార్ యిష్టమా? ఎన్టీయార్ యిష్టమా? (అప్పట్లో అభిమాని అనే మాట వాడేవారు కాదు) అని అడుగుతూండేవారు. ఫలానా సినిమాలో ఎయన్నార్, ఫలానా సినిమాలో ఎన్టీయారూ... అని చెప్పబోతే కట్ చేసేసేవారు.. అలా కాదు, ఒక్కళ్లే వుండాలి అనేవారు. ఎయన్నార్ నడిగినా 'నేను అన్ని సినిమాల్లోనూ దంచేశాను' అని చెప్పరు. అయినా యీ వీరాభిమానులకు

ఎయన్నార్ గొప్ప, ఎట్ ద సేమ్ టైమ్ ఎన్టీయార్ చెత్త. కొందరికి వైసీ వెర్సా. ఇద్దర్నీ అభిమానిస్తాననే తటస్థుడు యిద్దరికీ శత్రువే. స్కూలు పిల్లలు అలా వున్నా ఫరవాలేదు కానీ విద్యావంతులు కూడా అలాగే ఫీలవుతూంటే ఏం చేయగలం? మోదీని విమర్శిస్తే రాహుల్ పక్షపాతి అనే అర్థం వస్తుందా? బాబును విమర్శిస్తే జగన్‌ను మెచ్చుకున్నట్లవుతుందా? రాజధాని విషయంలో ఆంధ్ర ప్రభుత్వం చేస్తున్న పొరపాట్లను ఎత్తి చూపితే జగన్ అయితే యింతకన్నా ఏం చేసేవాడు అని అడుగుతున్నారు కొందరు. ఏం చేసేవాడో మనకేం తెలుస్తుంది? ప్రతిపక్షంలో వుండగా వీళ్లందరూ ఎన్నయినా చెప్తారు. వైయస్సార్ కాకినాడ సెజ్‌కై భూములు లాక్కున్నప్పుడు చంద్రబాబు ధర్నా చేసి, తాము అధికారంలోకి వస్తే తిరిగి యిచ్చేస్తామని మాటిచ్చారు. ఇప్పుడు వచ్చారు, తిరిగి యిస్తున్నారా? పైగా తక్కిన చోట్ల కూడా లాక్కుంటున్నారు. జగన్ యీ రోజు తుళ్లూరు రైతులకు యిచ్చిన హామీ రేపు నిలబెట్టుకుంటారన్న గ్యారంటీ లేదు. ప్రస్తుతం గురించే మాట్లాడగలం. జగన్ అధికారంలోకి వస్తాడా? వస్తే గిస్తే రాజధానికి డబ్బులు ఎక్కణ్నుంచి తెస్తాడు? అని ఆలోచించి నేనెందుకు బుఱ్ఱ బద్దలు కొట్టుకోవడం? అంత కంటె 'నేనే ప్రధానమంత్రినైతే ఏం చేస్తానంటే...?' అని చిన్నప్పుడు స్కూల్లో యిచ్చిన వుపన్యాసాలను గుర్తు చేసుకుని పగటి కలలు కంటాను.

ఒక్క విషయం మాత్రం గ్రహించాలి – కుటుంబంలో వ్యక్తినైనా సరే, వాళ్లు చేసిన ప్రతి పనినీ సమర్థించడం వీలుకాదు. తక్కిన వాళ్ల సంగతెందుకు, మనం యివాళ చేసిన పని రేపు మనకే నచ్చకపోవచ్చు. గుజరాత్ అల్లర్ల బాధితుల విషయంలో తీస్తా చేసిన పని గొప్పది, అంతమాత్రం చేత ఆమె చేసిన ప్రతీ పనీ గొప్పదని ఎవరనగలరు? ఫలానా వ్యక్తి, ఫలానా సమయంలో చేసిన ఫలానా పని మంచిదనుకుంటాను, ఫలానాది చెడ్డదనుకుంటున్నాను అనే స్పష్టత వుండాలి. రాజీవ్ గాంధీపై రోజూ ప్రశ్నలు సంధించినపుడు రామ్ జెత్మలానీ గొప్పవాడనిపించాడు. స్మగ్లర్ల తరఫున, హంతకుల తరఫున వకాల్తా పుచ్చుకున్నపుడు దుర్మార్గు డనిపించాడు. మంచిదనుకున్నంత మాత్రాన ఆకాశానికి ఎత్తేయవలసిన అవసరమూ, భుజాన వేసుకుని మోయవలసిన అవసరమూ లేదు. అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన అన్నా హజారేను, జెపిని మీరు సమర్థించలేదంటూ ఒకరు నింద వేస్తారు. సమర్థించడం అంటే నేనేం చేయాలిట? మీరంతా ఫార్వార్డ్‌లు పంపండి అని పిలుపు నివ్వాలా? ఓట్లేయమని కాన్వాస్ చేయాలా? రేపు వాళ్లు విఫలమైతే ఆ నింద నేను మోయాల్సి వస్తుంది కదా! ఈ రోజు అన్నా పరిస్థితి, లోకసత్తా పరిస్థితి ఎలా వుందో చూడండి. ఆరేళ్ల క్రితం లోకసత్తా అంటే విద్యావంతులందరూ వూగిపోయారు. 2009 ప్రిఫైనల్, 2014లో రాష్ట్రంలో అధికారం మాదే అన్నారు. ఈ రోజు జెపి సహచరులే ఆయన అప్రజాస్వామిక విధానాలపై ఎదురు తిరిగారు. పార్టీ చీలికలైంది, సస్పెన్షన్లు సాగుతున్నాయి. జెపి తరచుగా అంటూండే 'సాంప్రదాయకపు పార్టీల' తీరుగానే వారి పార్టీ తయారైంది. మూడేళ్ల క్రితం అంతకు మించిన వూపు అన్నా అంటే వచ్చింది. ఈ రోజు ఆయన హైదరాబాదు వస్తే పబ్లిసిటీయే లేదు. నినాదాలు విని 30 ఏళ్ల లోపు వాళ్లకి వచ్చే పొంగు నాబోటి అనుభవజ్ఞుడికి రాదు. ఎవరినైనా మెచ్చుకున్నా ఆ సందర్భం గురించే మెచ్చుకుంటాను తప్ప సర్టిఫికెట్లు యిచ్చేయను, ఎప్పుడు ఏది బయటపడుతుందో, ఆ తర్వాత సంజాయిషీ చెప్పుకోవలసి వస్తుందని జంకుతాను.

నేను ఆ వ్యాసంలో రాసినదేమిటి? మోదీని తీస్తా యిన్నాళ్లూ సతాయించింది. ఇప్పుడు ఆమె సతాయింపులకు గురవుతోంది అని. గుల్‌బెర్గ్ సొసైటీలో 30 యిళ్లు, 10 అపార్ట్‌మెంట్లు వున్నాయి. ఆ రోజు అల్లర్లలో ప్రతీ యింటికి నిప్పు పెట్టారు. 69 మంది చనిపోయారు, 100 మంది గాయపడ్డారు. అదే కాంపౌండులో మాజీ కాంగ్రెసు ఎంపీ ఎహసాన్ జాఫ్రీ యిల్లుంటే చాలామంది అక్కడికి వచ్చి ఆశ్రయం పొందారు. ఆయన ఎంపీ కదా, ఆయన జోలికి రారని అనుకున్నారు. ఆయన అధికారులకు వరుసగా ఫోన్లు చేస్తూనే వున్నాడు. మోదీతో కూడా మాట్లాడాడట. టెలిఫోన్ రికార్డుల్లో యిదంతా నమోదై వుంది. కానీ ఎవరూ సహాయానికి రాలేదు. పైగా ఎహసాన్‌నే యింట్లోంచి బయటకు లాగి నరికి, కుటుంబసభ్యుల ముందే తగలబెట్టారు. ఇంకో 35 మందిని కూడా యిలాగే నరికి, సజీవదహనం చేశారు. తీస్తా మద్దతుతో ఎహసాన్ భార్య జాకియా మోదీని నిందితుడుగా పేర్కొంటూ 2006లో కేసు పడేసింది. గోధ్రా అల్లర్లలో మోదీ పేరు ప్రస్తావించబడిన కేసు యిదొక్కటే. గుల్‌బర్గ్ సొసైటీ కేసులో మోదీని నిర్దోషిగా ప్రకటిస్తూ సిట్ (స్పెషల్ యిన్వెస్టిగేషన్ టీమ్) దాఖలు చేసిన రిపోర్టును అహ్మదాబాద్ మేజిస్ట్రేటు ఆమోదించడాన్ని జాకియా జాఫ్రీ వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టు దాకా వెళ్లింది. 2014 డిసెంబరులో మరో కేసులో సిట్ అమిత్ షాను నిర్దోషిగా ప్రకటించింది. ఆ తీర్పునూ ఛాలెంజ్ చేయకుండా తీస్తాను భయపెట్టడానికే కేసును యిలా తిప్పారుట. ఈ కేసులో జాకియా కొడుకు తన్వీర్ జాఫ్రీని కూడా తీస్తా కేసులో నిందితుడిగా పేర్కొన్నారు. అతనితో పాటు గుల్‌బెర్గ్ సొసైటీ సభ్యులు ఫిరోజ్ గుల్జార్, సలీం సాంధీ కూడా వున్నారు. తీస్తా, ఆమె భర్త సంస్థ నిధులు పెట్టి విదేశీయాత్రలు చేస్తే, విలాసవస్తువులు కొనుక్కుంటే మరి వీరి నెందుకు జైల్లో పెట్టాలనుకోవడం? ఎలాగోలా వీళ్లు దడిసి వూరుకుంటే అప్పుడు మోదీయే తీస్తాపై, జాకియాపై పరువునష్టం అంటూ ఎదురు కేసులు పెట్టవచ్చు.

ఇది పేపర్లలో చదివి నేను తెలియపరుస్తున్నాను. నేను రాసినదానిలో అసత్యం వున్నా, అన్వయదోషం వున్నా ఎత్తి చూపించాలి. అది మానేసి అసలు నువ్వు అదెందుకు రాశావ్ అని అడిగితే ఏం సమాధానం చెప్తాను? ఇదే కాదు, ఏం రాసినా యిదెందుకు రాశావు, యిప్పుడెందుకు రాశావు, అప్పుడు రాయలేదేం, ఫలానా వాడి మీద రాయలేదేం అని అడుగుతూంటారు. తెనాలి రామకృష్ణ సినిమా తీసినవాణ్ని అల్లసాని పెద్దనపై ముక్కు తిమ్మనపై ఎందుకు తీయలేదేం, మీదీ తెనాలి– మాదీ తెనాలి ఫీలింగా అని అడిగితే వాడేం చెపుతాడు? నన్నయ్యపై నవల రాసినవాణ్ని నన్నెచోడుడిపై రాయలేదేం, తెలంగాణపై చిన్నచూపా? అని అడిగితే ఏం చెప్తాడు? ఎవరికి ఏది రాయాలనిపిస్తే దానిపై రాస్తారు. ఆసక్తి వుంటే చదువుతాం, లేకపోతే వదిలేస్తాం, చదివాక తప్పులున్నాయని

తెలిస్తే ఎత్తి చూపుతాం. రచయిత కోణం నుంచి చూస్తే – అందరికీ తెలిసినది రాయడం కంటె తెలియనిది రాస్తే పాఠకులను ఆకట్టుకుంటాం కదా అనుకుంటాడు. మీడియా అంతా వాయించి వాయించి వదిలిపెడుతున్న సబ్జక్ట్‌ను కొత్తకోణం ఏదీ దొరకనప్పుడు రాసి ఉపయోగమేమిటి? నా మట్టుకు నేను తెలుగు పత్రికలు, టీవీలు పట్టించుకోని సబ్జక్టుల గురించి వెతికి, వివరాలు సమకూర్చుకుని రాస్తూంటాను. అధికారంలో వున్నవారైనా, ప్రతిపక్షంలో వున్నవారైనా ఏదైనా ప్రత్యేకంగా ప్రకటన చేసినప్పుడో, కార్యక్రమం చేపట్టినప్పుడో రాయడానికి మేటర్ దొరుకుతుంది. లేకపోతే వార్తలు చెప్పినట్టే వుంటుంది. ఎడిటోరియల్ పేజీలో వీక్లీ కాలమ్ నడపమని నాకు రెండు, మూడు దినపత్రికల నుంచి ఆఫర్లు వచ్చాయి. ఒప్పుకోలేదు. వారం వారం నాకూ, పాఠకులకూ ఆసక్తి కలిగించే అంశం దొరకదేమోనని భయం.

తీస్తా సబ్జక్ట్ రాసినంత మాత్రాన నేను హిందూమతానికి ద్రోహం చేసినట్లు కొందరు చిత్రీకరించడం వింతల్లో వింత. వారికి మోదీ స్వచ్ఛమైన హిందువు, హిందూ రక్షకుడు, మోదీని వ్యతిరేకించినవారు కేసులు ఎదుర్కుంటున్నారని ఆధారాలతో సహా రాస్తే నేను హిందూమతద్రోహిని అయిపోయాను. హిందువులు నాశనం అయితే కానీ నా ఆత్మ శాంతించదట! ఇంకో ఆయన నన్ను క్రైస్తవుణ్ని చేసేశాడు కూడా. నాతిచరామి మంత్రం పఠించి, అగ్నిసాక్షిగా పెళ్లాడిన ధర్మపత్నిని ఏ కారణం చెప్పకుండా వదిలిపెట్టేసిన పెద్దమనిషి వీళ్లకు గొప్ప హిందువు. ఆయనను విమర్శించినవాళ్లు మతభ్రష్టులు. హిందూమతం ప్రకారం సన్యాసం తీసుకోవాలన్నా భార్య అనుమతి తప్పనిసరి. ఇప్పటికైనా భర్త ఆశ్రయం యిస్తే చాలని ఆవిడ అంటూ వుంటే వినడానికే జాలిగా వుంది. ఆవిడ చేసిన అపరాధం ఏమిటో, యీయన నిర్దయకు కారణమేమిటో యీయన తరఫు నుండి ఆ విషయమై ఏ వివరణా వుండదు. వ్యక్తిగత విషయం కాబట్టి దీనిలో మనకు ప్రమేయం ఏమీ వుండదు. కానీ ఆయన్ని హిందూ మతానికి ప్రతీకగా నిలబెట్టడం దురభిమానానికి పరాకాష్ట. ఎవరో ఒకరు నా కులం గురించో, మతం గురించో, ప్రాంతం గురించో–ఏదో ఒకటి అనవసరంగా అంటూనే వుంటారు. వాళ్లను తృప్తి పరచడానికి నా పుట్టుపూర్వోత్తరాలను వివరించవలసిన అవసరం నాకు లేదు. అలా అని నేను దాస్తున్నదీ ఏమీ లేదు. నా రచనలన్నీ చదివితే నా వివరాలు తెలుస్తాయి. తీస్తా గురించో, పిస్తా గురించో, బస్తరు గురించో రాసినప్పుడల్లా అవన్నీ వల్లించనక్కరలేదు.

గోడ్సే వ్యాసాల్లో నేను శివాజీ గురించి రాసినపుడు రాశాను – పాలకులకు కులం, ప్రాంతం, మతం అన్నీ జనాలను చేరదీయడానికి, శత్రువులకై పురికొల్పడానికే పనికివస్తాయని. వారి వ్యక్తిగత విశ్వాసాలేమిటో ఎవరూ వూహించలేరు. మోదీకి తన పార్టీలోనే అనేకమందిని అణచివేశాడు – కేశూభాయ్ పటేల్, సంజయ్ జోషి... వగైరా, వాళ్లంతా హిందువులే. గుజరాత్‌లో రోడ్లవిస్తరణ సమయంలో ఆరెస్సెస్‌తో తలపడ్డాడు. మోదీ మూడోసారి ముఖ్యమంత్రి అయినపుడు ఆ ఎన్నికలలో ఆరెస్సెస్ అతనికి సహకరించలేదు. పార్లమెంటు ఎన్నికలు వస్తున్నప్పుడే యిద్దరి మధ్య సయోధ్య కుదిరింది. అది ఎంతకాలం సాగుతుందో తెలియదు. ఢిల్లీ తరహా ఎదురుదెబ్బలు లైట్‌గా తగిలినా మోదీ యీ వాచాలసాధ్వీమణులను కట్టడి చేయనారంభిస్తాడు. మైనారిటీలను దువ్వుతాడు. నిజానికి గోధ్రా అల్లర్ల తర్వాత మోదీ ముస్లింలతో తలపడింది ఎప్పుడు? అవైనా మోదీ రాజకీయంగా బలపడడానికి జరిగిన అల్లర్లు తప్ప వేరొకటి కాదు. గుజరాత్‌లో ముస్లిములు ఎప్పణ్నుంచో వున్నారు, వ్యాపారాలు చేసుకుంటూ అభివృద్ధిలోకి వస్తూనే వున్నారు. కెసియార్ చూడండి, అధికారంలోకి వచ్చేదాకా సెటిలర్స్ పదాన్ని తెగ వుపయోగించారు. ఇప్పుడు ఆ మాట వాడితే వూరుకోనంటున్నారు. రేపు జిఎచ్ఎంసి ఎన్నికల తర్వాత మళ్లీ ఏం మాట్లాడతారో తెలియదు. ఆంధ్రుల గురించి తండ్రి ఒకలా, కొడుకు మరొకలా మాట్లాడతారు. అలా అని కొడుకు వారితో కలిసి వ్యాపారాలు చేయరా అంటే చేస్తూనే వుంటారు.

రాజకీయనాయకులు దేన్నయినా, ఎవరినైనా తమ ఎదుగుదల కోసమే వాడుకుంటారు. ఇప్పుడు తీస్తా తాట తీయడానికి ఆమె వద్ద పనిచేసిన ముస్లిం ఉద్యోగినే వాడుకుంటున్నారు మోదీ మనుష్యులు. ఇందులో మతప్రమేయం ఏమీ లేదు. తీస్తా ఎన్‌జిఓ సిజెపిలో రయీస్ ఖాన్ పఠాన్ అనే ఉద్యోగి వుండేవాడు. గుల్‌బర్గ్ సొసైటీ నివాసి, అల్లర్లలో బతికి బట్టకట్టినవాడు. 2002 నుంచి పని చేస్తున్నాడు. 2007లో అతను ఒక ఆఫర్ తెచ్చాడు – రూ. 1.86 కోట్లకు ఒక వ్యక్తి సొసైటీలో 16 యిళ్లు కొంటానన్నాడంటూ. తీస్తా నిరాకరించింది. పైగా అల్లర్లకు బాధ్యులైన వారితో అతను కుమ్మక్కవుతున్నాడని అనుమానం వచ్చి 2008లో తీసేసింది. ఆ తర్వాత అతను తీస్తాపై ఆరోపణలు చేయసాగాడు. సిజెపి వెబ్‌సైట్‌లో విరాళాల కోసం అభ్యర్థన చేశారని, మ్యూజియం పేర కోట్లాది రూపాయలు వసూలు చేశారని 2012లో ఆరోపించాడు. అతను సొసైటీ లెటర్‌హెడ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసిన దగ్గర్నుంచి విషయం సీరియస్ అయింది. సొసైటీ సభ్యులు 2013లో ఆ ఉత్తరాన్ని ఖాన్ ఫోర్జరీ చేశాడని ఫిర్యాదు యిచ్చారు కానీ పోలీసులు అది పట్టించుకోలేదు. ఇప్పుడా ఖానే వీళ్ల ఆయుధం.

గోడ్సే పాలకుడు కాడు. అతనికి మతమే ముఖ్యం. గాంధీ హిందూమతానికి అపకారం చేస్తున్నాడు అనుకున్నాడు, చంపేశాడు. అయితే అతని అవగాహనలో అంతరం వుంది, ఆలోచనల్లో గందరగోళం వుంది. దాన్ని ఎత్తి చూపడానికే గోడ్సే లేవనెత్తిన ప్రతీ పాయింటును తీసుకుని అప్పటి చరిత్రను వివరిస్తూ ఆధారాలతో సహా వివరిస్తున్నాను. ఏదైనా తప్పుంటే ఎత్తిచూపాలి. 'గోడ్సే 80% జనాభా భాష హిందీ అనడం తప్పు, అనేక మంది ఉర్దూ భాషీయులు, పంజాబీ, సింధీ, బెంగాలీ భాషీయులు పాకిస్తాన్ వెళ్లిపోయాక ఇప్పటి భారత్‌లో 53 ఏళ్ల తర్వాత 41% అయింది – అదీ 50 భాషలు కలిపి..' అని రాస్తే '40% కూడా ఎక్కువే కదా' అంటే అర్థమేమిటి? ఏ కోశాన్నయినా అంకెల్లో పోలిక వుందా? అంతేకానీ 'మనం పుస్తకాలు కొని చదవము కాబట్టి యీ ప్రసాద్ నోటి

కొచ్చినదల్లా చెత్తల్లా రాస్తున్నాడు' అంటే నేనేం చెప్పగలను? ఆధారాలు చెప్పి మరీ రాస్తూంటే ఈయన దాన్ని చదవనని మొండికేయడం, పైగా నన్ను అబద్ధాలకోరనడం!? దీనికి పరిష్కారమేమిటి? కాంగ్రెస్ మొదట్లో నిషేధించింది కానీ తర్వాత పుస్తకరూపంలో వచ్చింది మహాప్రభో, చదవండి అంటూ వుంటే చదవడానికి ఏమి కష్టం? ఆ పుస్తకం గోడ్సే సోదరుడు గోపాల్ ప్రచురించినది. సావర్కార్ ప్రతిష్టాన్ వాళ్లు వేసినది. నేను 2000 సం॥ఎరంలో కొన్నాను. ఇప్పటికీ హైదరాబాదు కేశవ్ నిలయంలో దొరుకుతూండవచ్చు. దానిలోంచి రాస్తూంటే అసత్యాలు, అర్ధసత్యాలు రాసి మోసగిస్తున్నాడు అంటున్నారు. ఇంకో రెండేళ్లు పోయాక వ్యాఖ్యానాలు మారవచ్చేమో కానీ యీ వ్మాలం మారే ప్రశ్న లేదు – గోడ్సే మరణించాడు కనుక!

సదరు పాఠకుడు చదవరేమో కానీ చాలామంది పాఠకులు కొని చదువుతారు. నేనేదైనా ప్రస్తావించగానే ఆ పుస్తకం కోసం వెతికాం, ఎక్కడ దొరుకుతుంది అంటూ మెయిల్స్ వస్తాయి. ఎవరో మరీ చిన్నవాళ్లయితే తప్ప దాదాపు నా పాఠకులందరూ నా కంటె ఏదో ఒక సబ్జక్ట్‌లో గట్టివాళ్లు. మొన్న గ్రీసు గురించి నేను కాస్త రాస్తే దాని ఆర్థిక నిర్వహణ గురించి ఎంత చర్చ జరిగి, ఎంతమంది చక్కటి విషయాలు చెప్పారో చూడండి. మళ్లీ అందులో ఒక పాఠకుడు నేను గతంలో పివి నరసింహారావును ఆకాశానికి ఎత్తేసినట్లు రాశారు. ఎంతోమంది అడిగినా ఇప్పటిదాకా పివిపై నేను రాయనేలేదు – సోనియా ఆయనకు అన్యాయం చేసిందని ప్రస్తావించడం తప్ప! మరి ఈయన ఎక్కడ చదివారో ఏమో. కొందరు మీరు కాంగ్రెసుపై పక్షపాతంతో యుపిఏ అవినీతిపై విషయంపై రాయలేదంటారు, ఫలానా అంశంపై రాశాను మహాప్రభో అని జవాబిస్తే, అయితే నాకు దాని పిడిఎఫ్ నాకు పంపండి అంటారు. సమయం వెచ్చించి, వెతికి వాళ్లకోసం పంపాలా? పంపినా నమ్ముతారా? మీ వెబ్‌సైట్‌వాళ్లు వేయలేదేమో, వేసినా ఓ మూల వేశారేమో అని సందేహిస్తే...?

గ్రీసుపై జరిగిన చర్చలో భాగంగానే నా వ్యాఖ్యల గురించి – ప్రపంచబ్యాంకు షరతులపై, ఆర్థిక సంస్కరణలపై, సంక్షేమ పథకాలపై నా అభిప్రాయాలు నాకున్నాయి. వాటి గురించి సందర్భం వచ్చినపుడు చెపుతూనే వుంటాను. అభివృద్ధికై ఋణం, విదేశీ పెట్టుబడి, టెక్నాలజీ అవసరం. వాల్‌మార్ట్ కానీ, గ్లోబలైజేషన్ కానీ, ప్రపంచ బ్యాంకు అప్పుగానీ – మన చెక్ సిస్టమ్స్ గట్టిగా వున్నపుడే ఆహ్వానించాలి. స్వదేశీ, విదేశీ కార్పోరేట్స్‌పై గట్టి నిఘా వుంచాలి. వాల్‌మార్ట్‌ని రానిచ్చాం కదాని, రేపు వాళ్లు రైతులను దోచేస్తున్నా వూరుకోకూడదు. గెటౌట్ అనగలగాలి. అలాగే విదేశీ టెక్నాలజీని సాంకేతిక పరిశ్రమల్లోకి, బ ృహత్ ప్రాజెక్టుల్లోకి అనుమతించాలి. కన్స్యూమర్ గూడ్స్ కోసం, విలాసవస్తువుల కోసం విదేశీ దిగుమతులు అక్కరలేదు. విదేశీయుల పెట్టుబడితో స్వదేశీ ఉత్పత్తి పెంచాలని చూడాలి కానీ స్వదేశీకి ప్రత్యామ్నాయంగా చేయకూడదు. ఏ రంగంలోనైనా సరే నూటికి నూరు శాతం విదేశీ పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) అనుమతించకూడదు. అవి స్వదేశీ కంపెనీలను చేజిక్కుంచుకుని ధరలను నియంత్రిస్తాయి. పివి ఆర్థిక సంస్కరణలు అప్పటి పరిస్థితుల్లో అనివార్యం అయినా యీ అంశంలో ఆయన దేశాన్ని దెబ్బ తీశాడు. స్వదేశీ కంపెనీలు ఆర్ అండ్ డిని అటకెక్కించేశాయి. పోనుపోను యుపిఏ, ఎన్‌డిఏ ప్రభుత్వాలు సరళీకరణ పేరుతో దిగుమతులను పెంచేశాయి. దేశీయ వస్తువుల నాణ్యత పెరగలేదు, ఎగుమతులు పెరగలేదు. అన్ని దేశాలతో మనకు ట్రేడ్ డెఫిసిటే. చిన్నా, పెద్దా సెక్టార్లు, స్వదేశీ, విదేశీ కంపెనీలు అన్నీ బాగుండి ఒకదానితో మరొకటి పోటీ పడినప్పుడే కన్స్యూమర్‌కు లాభం, దేశ ఆర్థికవ్యవస్థకు శ్రేయం.

ఇక సంక్షేమపథకాల గురించి చెప్పాలంటే – ఒక మేరకే అవి వుండాలి. మొత్తమంతా దీర్ఘకాలిక యిన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులపై పెడితే యీ లోపున సామాన్యుడి బతికేది ఎలా? ఓట్ల కోసం సంక్షేమంపై ఖర్చు పెట్టేస్తే, జీతాలకు పోను తక్కినదంతా దానికే పోతే ప్రపంచబ్యాంకు ఋణాలు ఎలా తీరుస్తారు? అందుకని కన్స్యూమర్‌పై చార్జీలు వడ్డించేస్తున్నారు. ప్రతీదానికి ఒక లెక్క వుండాలి. బజెట్‌లో ఇంత శాతం సంక్షేమానికి, యింత శాతం స్వల్పకాలిక ప్రాజెక్టులకు, యింత శాతం దీర్ఘకాలిక ప్రాజెక్టులకు, యింత శాతం ప్రక ృతి సంక్షోభాలకు కేటాయిస్తాం అని మానిఫెస్టోలో చెప్పి, ఆ విధంగా అమలు చేయాలి. ఏ ప్రాజెక్టయినా అంచెలవారీగా, దశలవారీగా సాధ్యపడుతుంది. సింగపూరు కట్టడానికి 50 ఏళ్లు పట్టింది, కానీ మేం మూడేళ్లలో కట్టేస్తాం అని నారాయణగారి ప్రకటన. అంటే ఎడాపెడా అప్పులు చేస్తారన్నమాట. ఇలా చేసే రాజపక్ష శ్రీలంక కొంప ముంచాడు. ఎన్నికలలో ఓడిపోయాడు. ఇప్పుడు వాటిల్లోంచి బయటపడడం వారసుడికి చచ్చే చావుగా వుంది. ఇదే వద్దని మాటిమాటికీ రాస్తూంటాను. దీనికి పెద్ద పరిజ్ఞానం అక్కరలేదు. ఇల్లు ఎలా నడుపుకుంటామో పరికిస్తే మనకే అర్థమవుతుంది. పెంకుటిల్లు వాళ్లం రాజమహల్ కోసం అప్పు చేస్తే తినడానికి తిండి వుండదు, సైకిల్‌కు స్తోమత వున్నచోట పెద్ద కారు అప్పుచేసి కొంటే పెట్రోలుకి డబ్బుండదు, అప్పిచ్చినవాడు కారు పట్టుకుపోతాడు. అప్పులు చేయాలి తప్పదు, కానీ కొద్దికొద్దిగా, మన ఉత్పాదకశక్తిని పెంచేట్లుగా చేసుకోవాలి. హెచ్చు వడ్డీలకు తెచ్చి విలాసాలకు ఖర్చు పెడితే దివాలాయే.

గోడ్సే గురించి అంశాల వారీగా రాస్తూంటేనే ఒక పాఠకుడు ప్రశ్నలు సంధించారు. వాటికి సమాధానం చెప్పండి అంటూ మరో పాఠకుడి కోరిక. వాటిలో కొన్నిటికి (ఖిలాఫత్, మోప్‌ళా..) యిప్పటికే సమాధానం యిచ్చాను. మరి కొన్నిటి గురించి వచ్చే భాగాల్లో యివ్వబోతున్నాను. గోడ్సే తన వాఙ్మలంలో లేవనెత్తిన అంశాల ఆర్డర్‌లోనే నేనూ వెళుతున్నాను. అవేమీ చదవకుండానే ముందే తీర్మానించేసుకుంటే అసలు యిటువైపు రావడం దేనికి? 'మోప్‌ళాలు వేలాది హిందువులను వూచకోత కోస్తే అది ముస్లిములు తమ మతాచారప్రకారం చేసిన పవిత్రకార్యము అని, ముస్లిములు చంపివేసినా హిందువులు మారుమాటాడకుండా స్వర్గంలోకి వెళ్లి హిందూ సామ్రాజ్యం స్థాపించుకోవాలని – గాంధీ అన్నాడ'ని ఆ పాఠకుడు రాశారు. ఆ స్టేటుమెంట్లు ఆయన ఎక్కడ చూశారో సాక్ష్యాలు చెపితే నాకు మేలు చేసినవారవుతారు. గాంధీ ఉపన్యాసాలు, వ్యాసాలు అన్నీ రికార్డయి వున్నాయి. వేటి నుంచైనా ఆయన తన ఆరోపణకు

ఆధారాలు చూపవచ్చు. ఈయనే అచ్ఛే దిన్.. వ్యాసానికి స్పందనలో 2014 ఫిబ్రవరిలో గుజరాత్ రాష్ట్రంలో పోలీసులు వ్యవహరించిన తీరు గురించి నేను రాస్తే 'అది కాంగ్రెసు ప్రభుత్వం టైమ్‌లో..' అంటున్నారు. అప్పుడు కేంద్రంలో యుపిఏ వుంది కానీ గుజరాత్ రాష్ట్రంలో మోదీ పాలనే వుంది. మోదీ మీద నింద మోపడానికి అన్నీ కలిపి రాసేశానని అంటున్నాడీయన. 'కేంద్రంలో సర్కారు మారిన తర్వాత గుజరాత్ హైకోర్టు తీరు కూడా మారింది..' అని నేను స్పష్టంగా రాసినా కూడా! ఈ స్థాయి అవగాహనతో ఆయన ఏ స్టేటుమెంటును ఎలా అర్థం చేసుకుంటున్నారో గమనిద్దామని నా కుతూహలం.

ఇంకో ఆయన 'గాంధీయే కాంగ్రెసు, కాంగ్రెసే గాంధీ, అప్పుడు గాంధీ మాటే దేశమంతా వింది. అందువలన గాంధీయే ప్రతీ దానికీ బాధ్యుడు' అని రాశాడు. భరణి స్టయిల్లో ఆయన గట్ల డిసైడ్ చేస్తే నేనేం చేసేది? స్వాతంత్ర్యోద్యమంపై కాంగ్రెసుకు గుత్తాధిపత్యం లేదు, యితర పార్టీలూ వున్నాయి, 1937 ఎన్నికలలో కాంగ్రెసు 11 రాష్ట్రాలలో 7టిలో మాత్రమే సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది, అనేకమంది కాంగ్రెసును విడిచి వేరే పార్టీలు పెట్టుకున్నారు, కాంగ్రెసులో గాంధీ మాట కొన్నిసార్లు చెల్లుబాటు కాలేదు, ఆయన అభ్యర్థి అధ్యక్షుడిగా ఓడిపోయాడు, కొన్ని సందర్భాల్లో ఆయన తీర్మానం ఓడిపోయింది అని అంకెలతో, పేర్లతో చెప్తున్నా వినకపోతే ఎలా చావాలి? స్వాతంత్ర్యానంతరం కాంగ్రెసును రద్దు చేయాలని గాంధీ చెప్పినా కాంగ్రెసు నాయకులు ఆ మాటలు లక్ష్యపెట్టలేదని అనేకమంది మాటిమాటికీ చెపుతూంటారు. అది గుర్తుకు వచ్చినా గాంధీ మాటే దేశానికి సుగ్రీవాజ్ఞ అని ఎలా అనగలడీయన? నేను గాంధేయవాదిని కాను. గాంధీ, నెహ్రూ చేసిన పొరపాట్లను అనేక వ్యాసాల్లో వివరించాను, విమర్శించాను. పైన చెప్పినట్లు నేను ఎవరినీ గుడ్డిగా ఆరాధించను. నా ఆలోచనల్లో స్థిరత్వం లేదని కూడా కొందరు అనడానికి యిదే కారణం.

కొంతమంది సరిగ్గా చదవడం కూడా రాదని నా అనుమానం. బలత్కారమంటే.. వ్యాసంలో రేప్‌కు మారిన నిర్వచనం వలన పెళ్లికి ముందుకాని, తర్వాత కానీ స్నేహితురాలితో పరస్పరాంగీకారంతో జరిగే శృంగారంలో సైతం పాల్గొనవద్దు, చిక్కుల్లో పడతారు అని మగవాళ్లను హెచ్చరిస్తే రేపిస్టుల పట్ల జాలి పడ్డట్టు భావించాడు ఒక పెద్దమనిషి. మూడేళ్లు సహజీవనం చేసి, అన్నాళ్లూ రేప్‌కు గురయ్యానని మహిళ యీ రోజు క్లెయిమ్ చేస్తే మగాడి గతి ఏమిటి? ఈ విషయంలో కోర్టులే ఏకాభిప్రాయంతో లేవని చూపాను కదా. పరస్త్రీతో శృంగారమే వద్దంటే, బలాత్కారం చేయమని అర్థమా? ఇలాటి చట్టాల వలన నిజమైన బాధితులకు న్యాయం జరగదు. ఏ చట్టమైనా బ్యాలన్స్‌డ్‌గా వుండాలని నా భావన. మరి కొందరు పాఠకులకు సరైన అన్వయం తెలియదు. ఎక్కువమంది పిల్లల్ని కనండి అని బాబు యిచ్చిన స్టేటుమెంటును నేను వ్యతిరేకిస్తే నన్ను ఖండిస్తూ యింకా కనవచ్చంటూ యూరోప్‌లో జనాభా గణాంకాలు వల్లె వేశారు. యూరోప్ తన పౌరులకు విద్య, వైద్యం బాధ్యత తీసుకుంటుంది. నిరుద్యోగ భృతి యిస్తుంది. బాబు మాట విని పిల్లల్ని ఎడాపెడా కనేస్తే వాళ్లని ప్రభుత్వ స్కూళ్లల్లో చదివించి, ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యం చేయించవలసి వస్తుంది. స్థానిక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్న విషయం ఆ పాఠకులకు తట్టదా? ప్రభుత్వ సంస్థల స్థాయి పెంచి, మేక్ ఇన్ ఇండియా ద్వారా యిక్కడి పరిశ్రమల్లో వస్తూత్పత్తి పెంచి ఆ తర్వాత శిశూత్పత్తి గురించి మాట్లాడమనండి.

తీస్తా మ్యూజియం దగ్గరకు మళ్లీ వస్తే – 2002 అల్లర్ల తర్వాత అహ్మదాబాద్‌లో హిందువులు నివసించే ప్రదేశాల్లో రియల్ ఎస్టేటు ధరలు నాలుగు రెట్లు పెరిగాయట. ఈ సొసైటీ హిందూ కాలనీల మధ్య వుంది కాబట్టి అక్కడా రేట్లు పెరిగాయి. వచ్చిన డబ్బు ఏ మూలకూ చాలదని అర్థమయ్యాక 2012లో మ్యూజియం ఐడియా డ్రాప్ చేశారు. సొసైటీ సభ్యులు ఆ స్థలంలో మ్యూజియం కడితే మాకేం లాభం, దాన్ని అమ్మేసి డబ్బులిస్తే మా బతుకు మేం బతుకుతాం కదా అన్నారట. దాంతోటి అంతిమ నిర్ణయం తీసుకునేదాకా వాటిని ఏమీ చేయకుండా అలాగే వుంచేశారట. బాధితుల తరఫున కేసులు పోరాడడానికి ఆ 4.5 లక్షలు వుపయోగించడానికి మాకు ఏ అభ్యంతరమూ లేదు అని సొసైటీ సభ్యుల నుంచి నో–అబ్జక్షన్ లెటర్స్ తీసుకుంది తీస్తా. ఇప్పుడీ కేసు పెట్టిన వాళ్లెవరూ డబ్బులివ్వలేదు. 'మా పేర సబ్‌రంగ్ ట్రస్టు వారు వసూలు చేసి మ్యూజియం కట్టకుండా డబ్బు దిగమింగారు' అని సభ్యులు ఫిర్యాదు చేసినట్లుగా ఫోర్జరీ చేసిన లేఖ ఆధారంగానే యింత కేసు నడుపుతున్నారు. ''మా మీద నమ్మకం లేకపోతే 80 మంది ఆర్టిస్టులు మాకు అండగా ఎందుకు నిలుస్తారు? ఆ డబ్బేమైంది అని వారెవరూ అడగటం లేదుకదా'' అంటుంది తీస్తా. కేసు పెడితే సబ్‌రంగ్ మీదే పెట్టాలి. సబ్‌రంగ్ వసూలు చేసిన అంకె రూ. 4.50 లక్షలు లేదా రెండు ట్రస్టులూ కలిపి రూ. 38.5 లక్షలు నిధుల దుర్వినియోగం జరిగిందని అనుమానం వుంటే ఖాతాలు సబ్మిట్ చేయమనాలి, వీళ్లు చేశారు, అవి చూసి తప్పులుంటే పట్టుకోవాలి. కానీ వాళ్లను జైల్లో పెట్టి చిప్పకూడు తినిపించాలని పోలీసులు పంతం పట్టడంతోనే అందరూ వేలెత్తి చూపుతున్నారు. దీనిపై కొత్త విశేషాలు తెలిస్తే అప్పుడు మళ్లీ పాఠకులతో పంచుకుంటాను. అప్పటిదాకా విరామం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : గతుకులబాటపై అతుకుల బండి

కశ్మీర్‌లో పిడిపి–బిజెపి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడగానే యిది అవకాశవాదానికి పరాకాష్ట అని కొందరు విమర్శించారు. కానీ దానికి ప్రత్యామ్నాయం ఏమిటో ఎవరూ చెప్పలేకపోయారు. రెండు పార్టీలకు కించిత్తు కూడా భావసారూప్యం లేదన్నమాట, ఒకరి నొకరు నమ్మరన్నమాట నిజమే. కానీ వేరే ఏ విధంగా చూసినా ఏ ప్రభుత్వమూ ఏర్పడే సావకాశం లేదు. మళ్లీ ఎన్నికలు నిర్వహించినా

యిదే పరిస్థితి రావచ్చు. రాష్ట్రపతి పాలన కొనసాగిస్తే పరోక్షంగా బిజెపి పాలిస్తోంది అనే విమర్శలు వస్తాయి. 87 సీట్ల అసెంబ్లీలో 28 పిడిపికి రాగా, 25 బిజెపికి వచ్చాయి. షేక్ అబ్దుల్లాకు, అతని వారసులకు వ్యతిరేకంగా రాజకీయాలు చేస్తూ వచ్చిన ముఫ్తీ నేషనల్ కాన్ఫరెన్సుతో చేతులు కలపలేదు. కాంగ్రెసుతో కలుపుదామంటే వారికి సీట్లు రాలేదు. బిజెపి ఒక్కటే శరణ్యం. కానీ తమతో చేతులు కలపాలంటే జమ్మూ నుంచి హిందువును ముఖ్యమంత్రిని చేయాలని బిజెపి పట్టుబడుతోంది. అదే జరిగితే కశ్మీర్‌లో ముఫ్తీ తలెత్తుకునే పరిస్థితి లేదు. ఈ రోజు వచ్చినన్ని సీట్లు భవిష్యత్తులో వస్తాయో రావో, యిప్పుడు గట్టిగా పట్టుబట్టి సాధిస్తే జమ్మూలో తిరుగులేని శక్తిగా మారవచ్చని బిజెపి అంచనా. ఇవే కాకుండా సిద్ధాంతపరమైన విభేదాలు చాలా వున్నాయి. 370 ఆర్టికల్ గురించి, సైన్యానికి యిచ్చిన విశేషాధికారాల గురించి, పశ్చిమపాకిస్తాన్ నుండి శరణార్థులుగా వచ్చిన హిందువులకు పౌరసత్వం గురించి.. యివన్నీ తేలాలి. అవతలివారితో రాజీ పడుతూనే తమ క్యాడర్‌ను మెప్పించాలి. ఈ క్లిష్టమైన చర్చలకు బిజెపి తరఫు నుంచి రామ్ మాధవ్ పాల్గొనగా పిడిపి తరఫు నుంచి ప్రస్తుతం ఆర్థికమంత్రిగా వున్న హసీబ్ ద్రాబూ పాల్గొన్నారు. ఆయన ఎకనమిస్టు. జె అండ్ కె బ్యాంకు చైర్మన్ పదవికి రాజీనామా చేసి ముఫ్తీకి ఆప్తుడయ్యాడు. ఇద్దరూ గత రెండు నెలలుగా 50 రోజుల పాటు జమ్మూలో, చండీగఢ్‌లో, ఢిల్లీలో ఎవరికీ తెలియకుండా కలుస్తూ, చర్చించుకుంటూ వ్యవహారాన్ని ఓ కొలిక్కి తెచ్చారు.

ఢిల్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బిజెపి గుఱ్ఱం దిగి వచ్చి, నిర్మల్ కుమార్ సింగ్‌కు ఉపముఖ్యమంత్రి పదవి యిచ్చినా చాలంది. అదే అదనని ముఫ్తీ 25 మంది సభ్యులున్న మంత్రివర్గంలో పది కాబినెట్ పదవులు పుచ్చుకుని, బిజెపికి ఆరు మాత్రమే యిచ్చాడు. బిజెపి యింకోలా కసి తీర్చుకుంది. ఒకప్పటి వేర్పాటు వాది, పీపుల్స్ కాన్ఫరెన్స్ లీడరైన సజ్జాద్ లోనెను ముఫ్తీ తన కాబినెట్‌లో తీసుకోనన్నాడు. లోనె మోదీతో మాట్లాడి బిజెపి కోటాలో కాబినెట్ మంత్రి అయ్యాడు. అందుకే ప్రమాణస్వీకారం సభకు హాజరైన మోదీ ముఫ్తీని కౌగలించుకున్న అనంతరం లోనెను కూడా కౌగలించుకున్నాడు. తమకు సన్నిహితం అనుకున్న పిడిపి, అధికారం కోసం బిజెపితో చేతులు కలిపినందుకు మండిపడిన పాకిస్తాన్ పిడిపి నాయకుడు నయీమ్ అఖ్తర్‌కు వీసా తిరస్కరించింది. పాకిస్తాన్ తలచుకుంటే సరిహద్దుల్లో భద్రతా సమస్యలు లేవనెత్తి తన ప్రభుత్వానికి యిక్కట్లు సృష్టించగలదని భావించిన ముఫ్తీ ప్రమాణస్వీకారం తర్వాత యిచ్చిన పత్రికా సమావేశంలో వారికి ధూపం వేశాడు. 'కశ్మీర్‌లో ఎన్నికలు సజావుగా జరగడానికి మిలిటెంట్లు, వేర్పాటువాదులు, తీరానికి అవతల వున్న ప్రజలతో (పాకిస్తాన్ అని భావం) సహా అందరూ తోడ్పడ్డారు' అని వారికి ధన్యవాదాలు తెలిపాడు. ఇది సహజంగా బిజెపిని మండించింది. స్థానిక బిజెపి నాయకులు ఏమీ మాట్లాడకపోయినా రాజ్‌నాథ్ సింగ్ "ఎన్నికలు సవ్యంగా జరగడానికి ఎన్నికల కమిషన్, భారతసైన్యం, పౌరులు కారకులు తప్ప ముఫ్తీ చెప్పినవారు కాదు." అని ప్రకటించాడు.

పార్లమెంటుపై దాడి జరిపిన అఫ్జల్ గురును యుపిఏ ప్రభుత్వం ఢిల్లీ తీహార్ జైల్లో ఉరి వేసి అతని అవశేషాలను అక్కడే వుంచారు. అతని హత్యను ఖండించిన పిడిపి భౌతిక అవశేషాలను అతని కుటుంబీకులకు అప్పగించాలని డిమాండ్ చేసింది. ఇస్తే కశ్మీర్‌లో అతనికి స్మారకచిహ్నం కడతారని జాతీయపార్టీల భయం. ఎవరూ ఒప్పుకోలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక పిడిపి అఫ్జల్ గురు గురించిన డిమాండ్ మళ్లీ లేవదీసింది. ఈ గొడవలు యిలా నడుస్తూండగానే ముఫ్తీ బిజెపితో ఒక్క మాటైనా చెప్పకుండా జైల్లో వున్న పాకిస్తానీ ఏజంటు, వేర్పాటువాది మస్రత్ ఆలమ్‌ను విడుదల చేసేశాడు. అతనిపై 27 కేసులున్నాయి. ముఫ్తీ యిలా చేయడంతో బిజెపి విస్తుపోయింది. గతంలో కాంగ్రెసు పార్టీ యిలాటివి సహిస్తే 'వేర్పాటువాదులతో రాజీ పడ్డార'ని నానా యాగీ చేసే తాము యీరోజు సంజాయిషీ చెప్పుకోవలసి వస్తోందని గ్రహించింది. సహజంగానే ప్రతిపక్షాలు నిలదీశాయి. రాజ్‌నాథ్ జవాబిస్తూ "ఆ 27 కేసులు గట్టిగా నడపండి, వదిలిపెట్టవద్దు. అతను, అతని అనుచరుల చర్యలపై నిఘా వేసి వుంచండి' అని ముఫ్తీకి చెప్పాం. ఏదైనా అవాంఛనీయమైనది జరిగితే వెంటనే చర్య తీసుకుంటాం. నిజం చెప్పాలంటే రాష్ట్రప్రభుత్వం చేసినది మాకు సమ్మతం కాదు. కొన్ని సాంకేతిక కారణాల వలన అలా జరిగిందంతే.." అని ప్రకటించారు. కానీ కాంగ్రెసు పార్టీ ఏకీభవించలేదు. "ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలనే వుంది కదా, మసారత్ డిటెన్షన్‌ను కొనసాగిస్తూ ఎందుకు అదేశాలు జారీ చేయలేదు?' అని అడిగారు. "రాష్ట్రప్రభుత్వం చెప్పిన ప్రకారం వారి పబ్లిక్ సేఫ్టీ చట్టం కింద 2010 ఫిబ్రవరి నుండి 8 సార్లు అతన్ని కేసుల్లో బుక్ చేశారు. ఆఖరి ఆర్డర్ 2014 సెప్టెంబరు 15న జమ్మూ జిల్లా మేజిస్ట్రేట్ జారీ చేశారు. దాన్ని 12 రోజుల్లోగా జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ఆమోదించాలి. కానీ అది హోం శాఖకు అక్టోబరు 9 న అంటే 23 రోజుల తర్వాత చేరింది. అందువలన ఆమోదించడం వీలుపడలేదు. అందువలన యీ ఫిబ్రవరిలో రాష్ట్రప్రభుత్వం జమ్మూ మేజిస్ట్రేటుకి సెప్టెంబరు ఆర్డర్ మురిగిపోయింది కాబట్టి, కొత్తగా ఆర్డర్ వేయవచ్చు అని లేఖ రాసింది. అలా అన్న తర్వాత అతని డిటెన్షన్ కొనసాగించడానికి కారణాలు ఏమీ కనబడకపోవడం చేత మేజిస్ట్రేటు మార్చి 7 న విడుదల చేశారు." అని రాజ్‌నాథ్ సమాధానం. పైకి యిలా చెపుతూనే లోపాయికారీగా మళ్లీ యిలాటిది జరగడానికి వీల్లేదని ముఫ్తీకి గట్టిగా వార్నింగ్ యిచ్చిందని అంటున్నారు.

పిడిపి, బిజెపి మధ్యన కుదిరిన 16 పేజీల 'ఎజెండా ఆఫ్ ద ఎలయన్సు' యిరుపక్షాల కార్యకర్తలకు అసంతృప్తిని కలిగించింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కలిగించే 370 ఆర్టికల్‌ను రద్దు చేస్తామని బిజెపి చెపుతూ వచ్చింది. దాన్ని ఎలాగైనా నిలుపుకోవడమే కాక స్వయంపాలన సాధిస్తామని పిడిపి చెప్తూ వచ్చింది. ఇప్పుడు యిద్దరూ కలిసి ఒక్కడుగు వెనక్కి వేసి 'కశ్మీర్‌కు వున్న ప్రత్యేక హోదాను యథాతథ స్థితిని కొనసాగిస్తాం' అన్నారు. బుధవారం నాడు రాజ్యసభకు ఒక ప్రశ్నకు సమాధానం చెపుతూ హోం శాఖ సహాయమంత్రి రిజిజు '370 తాత్కాలికమైన ఏర్పాటు మాత్రమే, కానీ దాన్ని తీసేయాలంటే రాజ్యాంగ సవరణ అవసరం. మాకు

సవరణ చేసేంత మెజారిటీ లేదు' అన్నాడు. కల్లోల ప్రాంతాలపై సైన్యానికి విశేషాధికారాలు కల్పించే ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (స్పెషల్ పవర్స్) యాక్ట్ ఎత్తేయాలని పిడిపి పట్టుబడుతూ వచ్చింది. కొనసాగాలని బిజెపి అంటోంది. రాజీ ప్రతిపాదనగా 'ఏవేవి కల్లోల ప్రాంతాలో గుర్తించే విషయంలో కశ్మీర్ ప్రభుత్వం పునరాలోచిస్తుంది' అన్నారు. అంటే ముఫ్తీ ప్రభుత్వం ఫలానా చోట ప్రశాంతంగా వుంది, అక్కడ యీ చట్టం అమలు చేయనక్కరలేదు అని సిఫార్సు చేస్తే కేంద్రం ఆ ప్రతిపాదనను పరిశీలిస్తుందన్నమాట. ఇదంతా ఫలానా గడువులో పూర్తవ్వాలని షరతు విధించుకోలేదు. ఇక పాకిస్తాన్ ఆక్రమించిన కశ్మీర్ నుండి హిందువులు 1947లో కొందరు, 1965లో కొందరు, 1971లో యింకొందరు శరణార్థులుగా వలస వచ్చారు. వారికి కశ్మీరు పౌరులుగా పూర్తి పౌరసత్వం యివ్వాలని బిజెపి పోరాడుతూ వచ్చింది. వారి సంఖ్య కూడా కలిస్తే ముస్లిముల ఆధిక్యత తగ్గిపోతుందని పిడిపి భయం. ''వీరి గురించి క్షుణ్ణంగా చర్చించి ఒన్-టైమ్ సెటిల్‌మెంట్ చేయడానికి యిద్దరూ తీర్మానించారు' అని రాసుకున్నారు. ఆ సెటిల్‌మెంట్ ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలియదు. అప్పటిదాకా ఆర్థికసాయం మాత్రం చేస్తారట. ఇలాటి అస్పష్టమైన ప్రతిపాదనలతో ఎలాగోలా బండి నెట్టుకొద్దామని చూస్తూంటే ముఫ్తీ సవ్యంగా సాగనిచ్చేట్టు లేదు.

''మాయాబజారు'' సినిమాలో బలరాముడు వస్తున్నాడని తెలిసి, ఆయనకు నమస్కారం ఎలా పెట్టాలని లక్ష్మణకుమారుడు తన అనుచరుణ్ని సలహా అడుగుతాడు. అతను చెప్తాడు – 'ధర్మరాజుగారు కురువృద్ధులందరికీ ఒంగిఒంగి నమస్కారాలు పెడుతూ వుంటే మీరు పడిపడి నవ్వుకునేవారు చూశారూ, యిప్పుడు మీరూ అలాగే వంగి, వినయంతో కరిగి ముద్దయిపోయి...' అని వంగి చూపుతాడు. (డైలాగు యిదే కాకపోవచ్చు, భావం యిదే). అంటాడు. ''ఇంతకంటె ద్విగుణంగా నేనూ కాగలను' అంటూ లక్ష్మణకుమారుడు బలరాముడు రాగానే పాదాలమీద తల ఆన్చి తలే ఎత్తడు. కశ్మీర్ పాలకులతో కాంగ్రెసు యిన్నాళ్లూ రాజీపడుతూ వచ్చింది. వాళ్లేం చేసినా సహిస్తూ వచ్చింది. 'మీకు దేశభక్తి లేదు, మానాభిమానాలు లేవు, ముస్లిములను బుజ్జగిస్తున్నారు, పాకిస్తాన్ అంటే భయం, వేర్పాటువాదులకు లొంగిపోతున్నారు, అదే మేమైతేనా...' అంటూ వచ్చింది బిజెపి. ఇప్పుడు వారి స్థానంలో లక్ష్మణకుమారుడిలా అదే పాత్ర పోషిస్తోంది. కబుర్లకు, చేష్టలకు వున్న యీ వ్యత్యాసాన్ని విమర్శించే హక్కు కాంగ్రెసుకు లేదు, కానీ దేశప్రజలకు వుంది. – **ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : హేతువాదులకు మూడుతోంది

ఫిబ్రవరి 16 న మహారాష్ట్రలో గోవింద్ పన్సారే హత్య జరిగిన పది రోజులకే బంగ్లాదేశ్‌లో మరొక హేతువాది చంపబడ్డాడు – ఇస్లామిక్ మతవాదుల చేతిలో! అతని పేరు అభిజిత్ రాయ్. వయసు 42. బంగ్లాదేశ్‌లో ఢాకా యూనివర్శిటీలో ప్రొఫెసర్ కొడుకు. మెకానికల్ యింజనీరింగ్ పాసయి, లెక్చరర్‌గా పనిచేసి, సింగపూరు వెళ్లి బయోమెడికల్ యింజనీరింగులో డాక్టరేటు తీసుకున్నాడు. రెండు అమెరికన్ పేటెంట్స్ తీసుకున్నాడు. 2000 సం।।లో అట్లాంటాకు తరలివెళ్లి అక్కడ యింజనీరుగా పని చేస్తున్నాడు. తన ప్రజల్లో మతమౌఢ్యాన్ని నివారించి ఆలోచనను, తర్కాన్ని, శాస్త్రీయ అవగాహనను పెంచాలనే ధ్యేయంతో 'ముక్త మన' (ఫ్రీ థింకింగ్) పేరుతో సంస్థ స్థాపించి, ఒక వెబ్‌సైట్ నడుపుతూ బెంగాలీలో 8 పుస్తకాలు రాశాడు. మతపరమైన రాజకీయాలను నిరసించాడు. అది బంగ్లాదేశ్‌లోని తీవ్రవాద ముస్లిం పార్టీయైన జమాతే ఇస్లామీ పార్టీకు కోపం తెప్పించింది. ఆ పార్టీ నాయకుడైన అబ్దుల్ ఖాదర్ మొల్లా బంగ్లాదేశ్ యుద్ధసమయంలో పాకిస్తాన్‌కు దోహదపడ్డాడు. అతనిపై విచారణ సమయంలో అతనికి ఉరిశిక్ష విధించాలని, అతని పార్టీని నిషేధించాలనీ షాబాగ్ అనే చోట 2013లో ప్రదర్శనలు జరిగాయి. వాటిని అభిజిత్, యితర బ్లాగర్లు సమర్థించారు. వారిలో అభిజిత్ తప్ప అందరూ ముస్లిములే. అభిజిత్ భార్య కూడా ముస్లిమే. ఈ సెక్యులరిస్టులందరూ నాస్తికులనీ, ఈ ఇస్లాం వ్యతిరేకులను ఉరితీయాలనీ జమాతే సమర్థకులు ప్రదర్శనలు నిర్వహించి, వారిపై దాడి చేసి చంపేశారు కూడా. చంపేముందు వాళ్లకు రాసిన బెదిరింపు ఉత్తరాలను అభిజిత్ వెబ్‌సైట్ ప్రచురించింది. అది జమాతేకు మరింత కోపాన్ని తెప్పించింది. ప్రభుత్వం జమాతేను చల్లార్చడానికి వీళ్ల బ్లాగులను నిషేధించసాగింది. కొందరు బ్లాగర్లను అరెస్టు చేసింది, మరి కొందరికి పోలీసు రక్షణ కల్పించింది. అంతర్జాతీయ మానవహక్కుల సంస్థలు యీ అరెస్టులను, యీ నిషేధాలనూ విమర్శించాయి. అభిజిత్ 'బ్లాగర్లను బంగ్లాదేశ్ మీడియా సంఘవ్యతిరేక శక్తులుగా చిత్రీకరిస్తోంద'ని విమర్శించాడు. ఖైదు చేయబడిన బ్లాగర్ల విడుదల కోసం ఢాకా, న్యూయార్క్, వాషింగ్టన్, లండన్, అట్టావాలలో ప్రదర్శనలు నిర్వహించాడు. అంతర్జాతీయంగా అనేకమంది రచయితలు అతనికి అండగా నిలిచారు.

ఇదంతా జమాతేకు మరింత కోపం తెప్పించింది. దాని సానుభూతిపరులు అభిజిత్ ఢాకాలో అడుగుపెడితే చంపేస్తామని బెదిరిస్తూ ట్వీట్ చేయసాగారు. వారిలో ఒకడైన ఫరాబీ షఫీయుర్ రెహమాన్‌ను యిప్పుడు అరెస్టు చేశారు. ఇన్ని హెచ్చరికలు వినిపిస్తున్నా అభిజిత్ ధైర్యంగా ఢాకాలో జరుగుతున్న పుస్తకప్రదర్శనకు భార్యతో సహా వచ్చి తిరిగి వస్తూ రిక్షా ఎక్కాడు. రాత్రి 8.30 సమయంలో యిద్దరు అతనిపై దాడి చేసి కత్తులతో పొడిచారు. అతని భార్య వేళ్లు కోసేశారు. అతను ఆ రోజే రెండు గంటల తర్వాత ఆసుపత్రిలో చనిపోయాడు. మార్చి 1 న అతని భౌతికకాయానికి వేలాది మంది నివాళి ఘటించారు. అతని హంతకులను పట్టుకోవడానికి అమెరికా గూఢచారి సంస్థ ఎఫ్‌బిఐ సహాయం చేస్తానంది. బంగ్లాదేశ్ ప్రభుత్వం సరేనంది. మార్చి 6 న నలుగురు సభ్యుల ఎఫ్‌బిఐ

టీము వచ్చి హత్యాస్థలం వద్ద సాక్ష్యాలు సేకరిస్తోంది. అభిజిత్ తన "విశ్వాసేర్ వైరస్" (మత విశ్వాసాల వైరస్) అనే పుస్తకంలో రాశాడు – 'కొంతమందే వైరస్ చేత ప్రభావితులవుతారు. తక్కిన వారు కేవలం కారియర్స్ (వాహకులు)గా వుంటారు. వారికి గాఢమైన మతద్వేషాలు వుండవు. అయినా అసలైన సమయాల్లో అచేతనంగా వుంటారు. గుజరాత్‌లో 2002లో జరిగిన అల్లర్లలో చాలామంది హిందువులు ముస్లిం ద్వేషమేమీ లేకపోయినా ఏమీ చేయకుండా స్తబ్దంగా వుండిపోయారు. బంగ్లాదేశ్‌లో హిందువులు యిళ్లపై దాడి జరుగుతూంటే చాలామంది శాంతికాముకులైన ముస్లిములు నిస్తేజంగా వుండిపోవడానికి కూడా కారణం యిదే.." అని. ఫిబ్రవరి 26 రాత్రి 8.30కు అతన్ని, అతని భార్యను నడిరోడ్డులో రిక్షాలోంచి లాగి కత్తులతో పొడిచి చంపుతూ వుంటే రక్షణకు ఎవరూ రాకపోవడం యీ వైరస్ ప్రభావమే అనాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : వార్ధక్యంలో కూడా తిరగబడడం మానలేదు

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం పార్టీ కురువృద్ధుడు 91 ఏళ్ల వియస్ అచ్యుతానందన్ ఫిబ్రవరి 21 న కేరళలోని అళప్పుళాలో జరిగిన పార్టీ రాష్ట్రసమావేశంలో నిరసనతో వాకౌట్ చేశారు. 50 ఏళ్ల క్రితం 1964 ఏప్రిల్‌లో అప్పటి ఐక్య కమ్యూనిస్టు పార్టీ జాతీయ కౌన్సిల్ నుండి కూడా యిలాగే వాకౌట్ చేశారు. తేడా అల్లా అప్పుడు ఆయనతో పాటు 30 మంది కామ్రేడ్లు వెంటనడిచారు. ఇప్పుడు ఆయన ఒంటరిగా బయటకు వెళ్లాడు. కారణం– సిద్ధాంతపరంగా యిన్నేళ్లలో సిపిఎంలో వచ్చిన మార్పు ! అచ్యుతానందన్ వెళ్లిపోయినది – తనకు ఏదో పదవి దక్కలేదని కాదు. అవినీతికి మారుపేరుగా పేరు తెచ్చుకున్న రాష్ట్ర సెక్రటరీగా వున్న పినరాయి విజయన్ పార్టీ ప్రతిష్ట తీస్తున్నాడని ఆయన కేంద్ర నాయకత్వానికి రహస్యలేఖ రాస్తే అది విజయన్ పక్షమే వహించింది. ఇటు విజయన్ వర్గం ఆయనను పార్టీ వ్యతిరేకిగా ముద్ర కొడుతోంది. అదీ ఆయన అలకకు కారణం. విజయన్ వ్యవహారాలతో విసిగి పోటీ కమ్యూనిస్టు పార్టీ పెట్టిన టిపి చంద్రశేఖరన్ హత్యకు గురయ్యాడు. ఆ హంతకులను విజయన్ రక్షిస్తున్నాడని అచ్యుతానందన్ ఆరోపణ. పార్లమెంటు ఎన్నికల సమయంలో లెఫ్ట్ ఫ్రంట్‌లో ఎన్నో ఏళ్లగా వున్న రివల్యూషనరీ సోషలిస్టు పార్టీకి టిక్కెట్టు యివ్వకపోవడంతో అది కాంగ్రెస్ ఫ్రంట్‌లోకి చేరిపోయింది. ఆ విషయంలో కూడా విజయన్‌ను తప్పుపట్టడం జరిగింది. అచ్యుతానందన్ గతంలో కూడా అనేకసార్లు యిలాటి ఆరోపణలు చేశారు. పార్టీ పొలిట్ బ్యూరో వాటిపై చర్య తీసుకోలేదు, ఆయనపైనా తీసుకోలేదు. ఆయన వయసును, అనుభవాన్ని, ప్రజాదరణను వాళ్లు విస్మరించలేకపోయారు. ఇప్పుడీ ఉత్తరాన్ని ఎవరు లీక్ చేశారో తెలియదు కానీ, "మలయాళ మనోరమ"లో ఆ ఉత్తరం అచ్చయింది. రాష్ట్ర యూనిట్‌లో విజయన్ వర్గం బలంగా వుంది. వాళ్లు సమావేశానికి ముందుగానే అచ్యుతానందన్ పార్టీ వ్యతిరేకి ఒక తీర్మానాన్ని పాస్ చేసి పంపిణీ చేశారు. ఆయన యీ తీర్మానానికి అభ్యంతరం తెలుపుతూ బయటకు నడిచాడు.

అచ్యుతానందన్ సమావేశం నుండి వెళ్లిపోగానే తిరిగి రప్పించడానికి ప్రకాశ్ కరాట్ ఆయనకు ఫోన్ చేశాడు. ఉపయోగం లేకపోయింది. ఆయన విధించిన షరతులు అమలు చేయడం మాకు సాధ్యం కాదు అన్నాడు కరాట్. త్రిపుర వంటి చిన్న రాష్ట్రంలోనే సిపిఎం పాలిస్తోంది. బెంగాల్‌లో తిరిగి అధికారంలోకి వచ్చే సూచనలు కనబడటం లేదు. కేరళలో ప్రతిపక్షంలో వున్నా ఎంతో కొంత బేస్ వుంది. ఇప్పుడీయన మాట వింటే మెజారిటీలో వున్న విజయన్ వర్గం పార్టీ విడిచి వెళ్లిపోతే ఎలాగ అని వారి బెంగ. పొలిట్ బ్యూరోలో సభ్యులు విజయన్ తీర్మానాన్ని తప్పుపడుతూనే అచ్యుతానందన్ క్రమశిక్షణారాహిత్యాన్ని కూడా ఖండిస్తూ చర్య తీసుకోవలసినదే అన్నారు. అయితే ఆయన పక్షం వహించిన సీతారాం యేచూరి అలా చేస్తే పార్టీ ప్రతిష్ట జాతీయస్థాయిలో దెబ్బ తింటుంది అని వాదించాడు. ప్రకాశ్ కూడా ఔనన్నాడు. ఏప్రిల్‌లో జరగబోయే పార్టీ కాన్ఫరెన్సులో ప్రకాశ్ స్థానంలో యేచూరి వస్తే పొలిట్ బ్యూరో దృక్పథం మారవచ్చు. విజయన్ వర్గం పంపిణీ చేయించిన తీర్మానంలో అతన్ని లవలీన్ కుంభకోణంలో అచ్యుతానందనే యిరికించాడన్న ఆరోపణ వుంటే దాన్ని పొలిట్ బ్యూరో తీసేయించింది. రాష్ట్ర సెక్రటరీగా మూడు పర్యాయాలు చేసిన విజయన్ తను తప్పుకుని కొడియేరి బాలకృష్ణన్‌కు బాధ్యతలు అప్పగించాడు. అతను విజయన్‌కు కాస్త పగ్గాలు వేసి, పెద్దాయనతో రాజీ పడాలని కేంద్ర నాయకత్వానికి సూచిస్తున్నాడు. మార్చి 20 నాటి పొలిట్ బ్యూరో సమావేశం దాకా ఓపిక పట్టమని అచ్యుతానందన్‌కు నచ్చచెపుతున్నాడు. అచ్యుతానందన్ కేరళ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడుగా వున్నారు. ఆ పదవిలో కొనసాగుతారా, లేక రాజకీయాల్లోంచి తప్పుకుంటారా అన్నది ముందుముందు తెలియాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : ఫడ్నవీస్ నూరు రోజుల పాలన

వంద రోజుల్లో ఫలితాలు చూపించడం ఎవరికైనా కష్టమే. అయినా మీడియా అలాటి లెక్కలు వేస్తూ వుంటుంది, ప్రతిపక్షం ఏమీ చేయలేదని పెదవి విరుస్తూ వుంటుంది. దాన్ని తిప్పి కొట్టడానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తనే ఓ ప్రెస్ కాన్ఫరెన్సు పెట్టి ప్రభుత్వపు ప్రోగ్రెస్ రిపోర్టు విడుదల చేశాడు. తనకు కుడిపక్క సీనియర్ మోస్ట్ బిజెపి మంత్రి ఏక్‌నాథ్ ఖాడ్సేను, ఎడమపక్క సీనియర్ శివసేన మంత్రి దివాకర్ రౌతేను కూర్చోబెట్టుకున్నాడు. వీళ్లిద్దరినీ ఎంచుకోవడానికి కారణాలున్నాయి. ఏక్‌నాథ్ తనే

ముఖ్యమంత్రి అవుదామనుకున్నాడు. అతన్ని చల్లార్చడానికి రెవెన్యూతో సహా ఏకంగా 12 శాఖలు యిచ్చారు. అయినా ముఖ్యమంత్రి తనకు తగిన గౌరవం యివ్వటం లేదనికి అతని కినుక. తనకు తెలియకుండా తన శాఖలో అధికారులను బదిలీ చేశారన్న అలకతో యిటీవల కాబినెట్ మీటింగుకు గైరుహాజరయ్యాడు. 'అబ్బే ఆయనకు అవేళ ఒంట్లో బాలేదు' అని చెప్పుకున్నాడు ఫడ్నవీస్. ఇక శివసేనకైతే చాలా ఫిర్యాదులే వున్నాయి. '1995-99 నాటి గత సంకీర్ణ ప్రభుత్వంలో బిజెపి మా జూనియర్ పార్ట్‌నర్. అయినా బాల ఠాక్రే మాతో సమానంగా వారిని చూశారు. ఇప్పుడు మేం బిజెపి స్థానంలోకి వచ్చాం. ఆ నాటి గౌరవమర్యాదలను యిప్పుడు మేం ఆశిస్తే తప్పేమిటి?' అంటుంది నీలమ్ గోర్హే అనే శివసేన ఎమ్మెల్యే. కరువు పరిస్థితిపై ప్రభుత్వ అలసత్వాన్ని శివసేన పార్టీకి చెందిన పర్యావరణ మంత్రి రామదాసు కదమ్ బాహాటంగా విమర్శించాడు. దానితో బాటు తనకు యిచ్చిన శాఖపై, కేటాయించిన ఛాంబర్‌పై కూడా అసంతృప్తి వెళ్లగక్కాడు. రవాణా మంత్రి రౌతే విదర్భకు చెందిన రైతు నాయకుడు. రైతు ఆత్మహత్యల గురించి జిల్లా కలక్టరు కంటె ముందుగానే అతనికి తెలిసిపోతుంది. తమ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేశారని కాంగ్రెసు-ఎన్‌సిపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ వచ్చాడు. ఇప్పుడు అవే విమర్శలు బిజెపి ప్రభుత్వంపై చేస్తున్నాడు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలలో విదర్భలో శివసేన బాగా దెబ్బ తింది. అక్కడ పార్టీ బలం పుంజుకోవాలంటే యిలాటి యిమేజి మేన్‌టేన్ చేయడం అత్యవసరం. ఫడ్నవీస్ తనపై అలిగిన యీ యిద్దరు మంత్రులను ఎడాపెడా కూర్చోపెట్టుకుని తను ఏం సాధించాడో మీడియాకు చెప్పాడు.

కరువు పరిస్థితులను నివారించడానికి జలయుక్త శివర్ అభియాన్ అని పల్లెటూళ్లలో చెఱువులు పునరుద్ధరించే కార్యక్రమానికి రూ. వెయ్యి కోట్లు ప్రకటించాడు. ఇది కాంగ్రెసు ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ మొదలుపెట్టినదే. ఇతను దాన్ని విస్తరించి మొత్తం 5 వేల గ్రామాల్లో అమలు చేస్తాడట. పరిశ్రమలు ఆకర్షించడానికై సత్వర చర్యలు తీసుకుంటున్నానన్నాడు. షిండ్లర్ గ్రూపువారు తలపెట్టిన ఎస్కలేటర్ ప్లాంట్ చాలా సంవత్సరాలుగా ఆగిపోయింది. దాన్ని వెంటనే క్లియర్ చేసి ఇటీవల దావోస్‌లో జరిగిన ఎకనమిక్ ఫోరంకు వెళ్లినపుడు ఆ గ్రూపు మేనేజ్‌మెంట్ ఫైనల్ లెటర్ ఆఫ్ ఎప్రూవల్‌ను చేతికి అందించాడట. నాగపూర్‌లో సియట్ వాళ్లు పెడదామనుకున్న టైర్ల ఫ్యాక్టరీకి రికార్డు టైములో 23 రోజుల్లో అనుమతి యిచ్చేశాడట. ఎవరైనా పరిశ్రమ పెట్టాలంటే 75 అనుమతులు తీసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు దాన్ని 25కి యితను కుదించాడు. బాంద్రా-కుర్లా కాంప్లెక్సు వంటి బిజినెస్ డిస్ట్రిక్టును ముంబయిలో యితర ప్రాంతాల్లోను, యితర పట్టణాల్లోనూ మొత్తం 25 అభివృద్ధి చేస్తానంటున్నాడు. వీటిపై స్పందన అడిగితే కాంగ్రెసు వాళ్లు 'ఇవన్నీ మా ప్రాజెక్టులే. మేం ప్లాన్లు వేసి అన్నీ సిద్ధం చేశాం. ఇతను వచ్చి తనే ఏదో సాధించినట్టు చెప్పుకుంటున్నాడు. ప్రతిపక్షంలో వుండగా మమ్మల్ని అప్రతిష్టపాలు చేయడానికి టోల్ తీసేస్తామనీ, స్థానిక సంస్థల పన్ను తీసేస్తామనీ అన్నారు. ఇప్పుడు వాటి గురించి నోరెత్తటం లేదు. ఇక పారిశ్రామిక ప్రగతి గురించి చెప్పేదంతా అసత్యాలే. పెద్ద పెద్ద ప్రాజెక్టులన్నీ గుజరాత్‌కు తరలిపోతున్నాయి. పాల్ఘర్ నుంచి కోస్టల్ గార్డ్ హబ్ పోర్‌బందర్‌కు, ఇంటర్నేషనల్ ఫైనాన్స్ సెంటర్ అహ్మదాబాదుకు వెళ్లిపోయాయి. జెఎన్‌పిటి రేవు వద్ద కార్గో రవాణా గుజరాత్ రేవులకు వెళ్లిపోతున్నాయి.' అన్నారు. ఎన్‌సిపి వాళ్లు 'రాష్ట్రంలో భీకరమైన కరువు పరిస్థితులున్నాయి. ప్రభుత్వం ఏమీ పట్టించుకోవడం లేదు' అన్నారు. **- ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : ఎంత నేర్చినా... కాంతదాసులే!

74 ఏళ్ల డాఃఎం రాజేంద్ర కుమార్ పచౌరీ పద్మవిభూషణ్ బిరుదాంకితులు. నోబెల్ బహుమతి తెచ్చుకున్న యునైటెడ్ నేషన్స్ వారి ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానెల్ ఆన్ క్లయిమాటిక్ ఛేంజ్ (ఐపిసిసి)కి 13 ఏళ్లగా ఛైర్మన్. అలాటి పెద్దమనిషి యీ రోజు తల దించుకుని తన పదవుల నుంచి రాజీనామా చేయవలసి వచ్చింది. కారణం - కాముకత! భారతప్రభుత్వపు 'ద ఎనర్జీ అండ్ రిసోర్సెస్ ఇన్‌స్టిట్యూట్' (టిఇఆర్ఐ - టెరి)కి డైరక్టర్ జనరల్‌గా వున్న పచౌరీపై ఆ సంస్థలో రిసెర్చి చేస్తున్న 29 ఏళ్ల రిసెర్చర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది - అతను తనను సెక్సువల్‌గా హెరాస్ చేస్తున్నాడని. తను 2013లో టెరిలో చేరిన దగ్గర్నుంచి వేధిస్తున్నాడని, అసభ్యమైన ఇమెయిల్స్, ఎస్సెమ్మెస్‌లు, తన కోరిక ఒప్పుకోకపోతే నిరాహారదీక్ష చేస్తానని బెదిరిస్తూ చేత్తో రాసిన లేఖలు పంపాడని, తనను తాకడానికి, ముద్దుపెట్టుకోవడానికి పలుమార్లు ప్రయత్నించాడని ఆమె చెప్పింది. ఆమె ఫిర్యాదు చేసిందని తెలియగానే మొదట పచౌరీ నాటకం ఆడబోయాడు. తన ఈ మెయిల్ ఎక్కవుంట్, మొబైల్ హ్యాక్ అయిపోయాయని, ఎవరో తన పేర అశ్లీల సందేశాలు పంపి తన పరువు తీయాలని చూస్తున్నారని, దీన్ని మీడియా జనంలోకి తీసుకెళ్లకూడకుండా నిరోధించాలని ఢిల్లీ హై కోర్టుకి వెళ్లి వారి అదేశం తెచ్చుకున్నాడు. దానితో అప్పటికే యీ వార్తను తన వెబ్‌సైట్‌లో పెట్టిన పత్రిక వెంటనే తీసేసింది. ఈ లోపునే అతని చేష్టల గురించి తక్కినవారు కూడా మాట్లాడడం మొదలుపెట్టారు. వృందా గ్రోవర్ అనే అడ్వకేట్ యితనిపై మరో టెరి ఉద్యోగిని కూడా యిలాటి ఆరోపణలే గతంలో చేసిందని బయటపెట్టింది. 'పచౌరీకి క్లయిమేట్ ఛేంజ్ కంటె మేట్ (సహచరి) ఛేంజ్‌పైనే మక్కువ' అంటూ ట్వీట్లు పడ్డాయి.

ఇదంతా చూసి హై కోర్టు తన ఆదేశాన్ని ఉపసంహరించుకుని మీడియాకు స్వేచ్ఛ యిచ్చింది, విచారణలో సహకరించమని పచౌరీకి సలహా యిచ్చింది. అతని లాయరు పవన్ దుగ్గల్ 'నీ కేసు నేను వాదించను' అంటూ తప్పుకోవడంతో పచౌరీ పరువు గంగలో కలిసింది. టెరి నుండి అతను తప్పుకోవాలన్న డిమాండ్ రావడంతో ఫిబ్రవరి 24 న 'ఆయన లీవుపై వెళ్లారు' అని టెరి

ప్రకటించింది. అంతకు కొన్ని నిమిషాలకు ముందే పచౌరీ ఐపిసిసి చైర్మన్ పదవికి రాజీనామా చేశాడు. 200 దేశాలకు పర్యావరణ విషయాలపై దిశానిర్దేశం చేసే సంస్థ నుండి యింత అమర్యాదకరంగా తప్పుకున్నాక గుండె పోటు వచ్చిందంటూ మర్నాడే ఆసుపత్రిలో చేరాడు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సైంటిస్టుకు ఏమిటీ దౌర్బల్యం? ప్రసిద్ధవ్యక్తులకు వయసు మీరి లైంగిక శక్తి వుడిగినా, శృంగారంలో కూడా తాము యింకా చురుగ్గా వున్నామని చూపించుకోవాలనే యావ వుంటుందని, అందుకే వారు ఔచిత్యం, హోదా మరచి, పదవి సహాయంతో అవతలివారిని బెదిరించి, తమ అహంకారాన్ని తృప్తి పరచుకుంటారని మానసిక శాస్త్రవేత్తలంటారు. తను ఎంత రసికుడో చెప్పుకోవడానికి పచౌరీ ఆత్మకథలా తోచే ''రిటర్న్ టు ఆల్మోడా'' అనే నవల రాశాడు. దానిలో హీరో 60 ఏళ్ల (పచౌరీ కంటె పదేళ్లు చిన్న) రసికుడు, పచౌరీ లాగే క్లయిమేట్ ఛేంజ్ ఎక్స్‌పర్ట్. ధ్యానం కోసం హిమాలయాల్లోని పచౌరీ స్వగ్రామమైన ఆల్మోడాకు వస్తాడు. ధ్యానం మాట ఎలా వున్నా స్థానిక వివాహిత మహిళలతో, టూరిస్టులుగా వచ్చిన విదేశీ వనితలతో, తన విద్యార్థినులతో శృంగారం సాగిస్తాడు. 2010లో పుస్తకం వెలువడగానే అందరూ 'డర్టీ ఓల్డ్ మాన్' అంటూ పచౌరీని దుమ్మెత్తిపోశారు. అతని వూహలు అక్షరాలకే పరిమితం కాలేదని, ఆచరణకకు కూడా విస్తరించిందని యిప్పుడు తేలింది. ఇతని విషయం బయటకు రాగానే సోషలైట్, రచయిత్రి శోభా దే 'అవును, అతని బుద్ధి, చూపులు అలాటివే, నన్ను చూసీ చొంగ కార్చుకున్నాడు' అంది. రిసెర్చర్ ధైర్యాన్ని మెచ్చుకుంది. ఇతని వేధింపు భరించలేకపోతే ఆమె రెండేళ్ల క్రితమే ఉద్యోగం నుంచి రిజైన్ చేయాల్సింది అని ఎవరైనా అంటే తంతానంది. తప్పు యితనిదైతే ఆమె ఎందుకు ఉద్యోగం వదులుకోవాలి, అంతర్జాతీయ ఖ్యాతి కలిగిన వ్యక్తిపై కేసు పెట్టిన ఆమె ధైర్యాన్ని మెచ్చుకోవాలంది. పచౌరీకి మద్దతు పలికేవారు ఒక్కరూ లేరు. తేజ్‌పాల్ ఉదంతం తర్వాత కూడా యీ ముసలి రసికులు పాఠాలు నేర్చుకోవటం లేదంటే ఏం చెప్తాం! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : కాశీకి మోక్షం వస్తుందా?

స్వచ్ఛభారత్‌లో భాగంగా గత నవంబరులో మోదీ తన నియోజకవర్గమైన కాశీలో అస్సీ ఘాట్ వద్ద ఓ పార చేతపట్టి కాస్సేపు మట్టి ఎత్తారు. కాశీని 'క్యోటో'లా సుందరనగరంగా తీర్చిదిద్దడానికి జపాన్‌తో కలిసి ఎంఓయు పై సంతకాలు పెట్టారు. పరమ రొచ్చులా వుండే కాశీని బాగు చేయడం ఎవడి తరమైనా అవుతుందా అని అందరూ ఆశ్చర్యపడితే స్థానిక బిజెపి నాయకులు 'నిక్షేపంలా అవుతుంది. దానికి మా వద్ద ప్రణాళికలు వున్నాయి. ఊరి చుట్టూ శాటిలైట్ టౌన్‌షిప్పులు కట్టి వూళ్లో రద్దీ తగ్గిస్తాం, గంగానదిలోని పూడిక తీయించేసి పెద్ద పెద్ద పడవలు తిరిగేట్లా చేస్తాం, వాటి ద్వారా ఇంధనం తెప్పించి విద్యుత్ ఉత్పాదన చేయిస్తాం, రోడ్లు వెడల్పు చేయిస్తాం, ఔటర్ రింగు రోడ్డు కడతాం, మెట్రో వస్తుంది, మోనోరైల్ వస్తుంది, విపరీతమైన పారిశ్రామికీకరణ జరిగి నోయిడాలా తయారవుతుంది' – అంటున్నారు. ఇవి అమలవుతాయో లేదో తెలియదు కానీ, అవొస్తాయి, యివొస్తాయి అనగానే భూమిధరలు 60% పెరిగి కూర్చున్నాయి. అనేకమంది రైతులకు తమ భూమి లాక్కుంటారేమోనని బెంగ పట్టుకుంది. ఎందుకంటే అలహాబాద్ నుండి వారణాశి దాకా వున్న నదీతీరంలో లక్షలాది రైతులు కొన్నేళ్లగా పంటలు వేసుకుని పండించుకుంటూ వుంటారు. ఆ భూములు ఎవరి పేరా రిజిస్టరై వుండవు. ఇప్పుడు డెవలప్‌మెంట్ పేరుతో వాటిని ప్రభుత్వం తీసుకోవచ్చు, మొరాయిస్తే కొత్తగా వస్తున్న భూసేకరణ చట్టం ప్రయోగించవచ్చు. ఇక నదిలో పెద్ద బోట్లు తిరుగుతాయనగానే యిప్పటిదాకా నావలు, పడవలు తిప్పే 40 వేల మంది పడవవాళ్లు బెంగ పెట్టుకున్నారు. బోట్లు వస్తే మా గతేమిటి అని. రోడ్లు వెడల్పు చేయడం పేరుతో పాత భవంతులు కూలగొడితే కాశీలో మిగిలే యిళ్లెన్ని, మేం ఎక్కడుండాలి అని అడుగుతున్నారు పాతకాశీ వాసులు.

''దీన్ని ఆధునిక నగరంగా చేస్తాం, మెట్రో తెస్తాం, హైవేలు వేస్తాం లాటి కబుర్లన్నీ అనవసరం. కనీస పారిశుధ్యపరమైన పనులు చేయండి. ఉదాహరణకి రోజూ నగరంలో 400 ఎంఎల్‌డిల సీవేజ్ (రకరకాల వ్యర్థాలు) తయారవుతోంది. కేవలం 100 ఎంఎల్‌డి సీవేజి శుభ్రం చేసే ట్రీట్‌మెంట్ ప్లాంట్ మాత్రమే వుంది. దానిలో కూడా విషపదార్థాలను తీసేయలేకపోతున్నారు. అన్నీ గంగలోకి చేరుతున్నాయి. దాని కారణంగా వరుణా, గంగా నదుల సంగమం వద్ద కాలుష్యస్థాయి 1–1.5 మిలియన్ల మిల్లిగ్రాములు వుంటోంది. అనేక స్నానఘట్టాల్లో అది 50 వేల మిల్లిగ్రాములుంటోంది. మామూలు నీటిలో 500 మిల్లిగ్రాములు వుండాలి. ఈ నీటిని వ్యవసాయానికి, చేపల పెంపకానికి వుపయోగించాలన్నా 400 ఎంఎల్‌డి సామర్థ్యం వున్న ప్లాంట్లు పెట్టించి, వాటిలో ట్రీట్ అయిన సీవేజిని విషపదార్థాలను తీసివేయడానికి మళ్లీ యింకోసారి ట్రీట్ చేసి గంగలోకి వదలాలి.'' అంటున్నారు వారణాశిలోని సామాజిక కార్యకర్తలు.

కావలసిన చెత్తకుండీలు పెట్టకుండానే 'ఊరిని శుభ్రంగా వుంచండి, చెత్తను చెత్తకుండీల్లోనే వేయండి' అని గోడలపై నినాదాలు రాయించారు. చెత్తకుండీ పెట్టని దుకాణదారులపై జరిమానా వేస్తామన్నారు. కానీ యీ చెత్తకుండీలన్నీ ఎక్కడ ఖాళీ చేయాలో మాత్రం కాశీ అధికారులకు తెలియదు. అది అన్నిటికన్న పెద్ద సమస్య. ఆ వూరు 5 లక్షల జనాభా కోసం కట్టినది. ఇప్పటి జనాభా 15 లక్షలు. వచ్చే పోయే యాత్రికుల సంఖ్య కూడా కలిపితే యింకా పెరిగిపోతుంది. వీరందరూ కలిసి తయారుచేసే చెత్త తొలగించే సాధనం లేదు. అందువలన కాశీలో ఎక్కడ చూసినా – మోదీగారి స్థానిక కార్యాలయం తో సహా – పక్కన చెత్త కనబడుతుంది. జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ ఆధ్వర్యంలో ఒక కంపెనీ (దాని పేరు ఎ టు జెడ్) కితం సంవత్సరం వరకు యింటింటికీ తిరిగి చెత్త సేకరించేది. అయితే వాళ్లు సరిగ్గా పనిచేయడం లేదని ప్రభుత్వం వారు, ప్రభుత్వం తమకు యివ్వాల్సినది

యివ్వటం లేదని వాళ్లూ పేచీ పడి ఏడాదిగా సేకరణ ఆపేశారు. నగర్ నిగమ్ (మునిసిపల్ కార్పోరేషన్) జనవరిలోనే ఆ బాధ్యత తీసుకుంది కానీ ఆ చెత్తను ఏం చేయాలో తెలియక తికమక పడుతోంది. కార్సాడా వద్ద కేంద్రనిధులతో తయారు కావలసిన ట్రీట్‌మెంట్ ప్లాంట్ యింకా సిద్ధం కాలేదు. అందువలన కాశీలో రోజూ తయారవుతున్న 650 మెట్రిక్ టన్నుల చెత్తను శివార్లలో వున్న గ్రామాల్లో కుప్పపోయడం జరుగుతోంది. దీనికి తోడు యిందాకా చెప్పిన 300 ఎంఎల్‌డి సీవేజ్.. యీ మొత్తం కలిసి వూళ్లోనే అటూ యిటూ వీధుల్లోనూ, సందుల్లోనూ దొర్లి చివరకు గంగలో తేలుతోంది. ప్రభుత్వ కాలనీల్లో కట్టిన టాయిలెట్స్ గత ఆరేడేళ్లగా పని చేయడం లేదు. నగరంలో పారిశుధ్య పనివారి కొరత వుంది. ప్రస్తుతం వున్నది 2700 మందే. వారణాశి ప్రజలకు శుభ్రత నేర్పడం చాలా కష్టం. వాళ్లు ఎక్కడ పడితే అక్కడ వుమ్మూతారు.

ఇలాటి పరిస్థితిలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, ప్రజలు, యాత్రికులు అందరూ కలిసి వస్తే తప్ప కాశీ బాగుపడదు. కానీ వ్యవస్థలో లోపాలకు ఒకరి నొకరు నిందించుకుంటూంటారు, ఏ కొద్దయినా మంచి జరిగితే అది తమ ఘనతే అని చాటుకోవడానికి అందరూ ముందుకు వస్తున్నారు. కాశీ మునిసిపాలిటీ బిజెపి చేతిలో వుంది. పారిశుధ్యం గురించి అడిగితే "రాష్ట్రప్రభుత్వం అలసత్వం వల్లనే యిలా వుంది. 2017 కల్లా మేం అక్కడా అధికారంలోకి వచ్చి పరిస్థితులు చక్కదిద్దుతాం. ఓపిక పట్టండి." అంటున్నారు. "ఊళ్లో నేత పనివారికి వుపయోగంగా వుంటుందని మోదీగారు ట్రేడ్ ఫెసిలిటేషన్ సెంటర్ శాంక్షన్ చేయిస్తే అది వూరికి దూరంగా ఎక్కడో యిచ్చారు. అది వీవర్స్‌కు చాలా దూరంగా వుంది." అని ఆరోపించారు. "కాశీ నగరసరిహద్దుల్లో వారు అడిగిన భూమి ఒక ప్రయివేటు ట్రస్టుకి చెందినది. అదెలా యివ్వగలం?" అన్నాడు జిల్లా మేజిస్ట్రేటు. మోదీ అస్సీ ఘాట్‌లో శ్రమదానం చేయడానికి వచ్చినపుడు దీపక్ మధోక్ అనే వ్యాపారస్తుడు ముందుకు వచ్చాడు. అతనికి చాలా స్కూళ్లు, కాలేజీలు వున్నాయి. మోదీ అతని భుజం తట్టి అస్సీ ఘాట్ ప్రక్షాళనను ఒక నెలలో స్థానిక సంస్థలే పూర్తి చేస్తాయని ప్రకటించారు. మధోక్ వుత్సాహంగా తన స్కూళ్లలోని పిల్లలను దీనిలో భాగస్వాములను చేశాడు. వాళ్లు మట్టి తవ్వి పోయగా, అతను డజన్ల కొద్దీ ట్రక్కులు తెప్పించి ఆ మట్టిని తరలించాడు. ఉద్యమం ఎంత బాగా జరిగిందంటే అమితాబ్ బచ్చన్ మధోక్‌ను టీవీ ఛానెల్‌పై లైవ్‌గా యింటర్వ్యూ చేశాడు. ఇది చూసి స్థానిక బిజెపి నాయకులకు కన్ను కుట్టింది. డిసెంబరు 25 న మోదీ మళ్లీ వారణాశి వచ్చే లోపుగా ఆ పని తమకు సంబంధించిన యింకో సంస్థకు అప్పగించి మొత్తమంతా వాళ్లే చేశారని ఆ నాటి సభలో మోదీకి చెప్పారు. మధోక్, అతని భార్య సభకు వెళితే వెనక్కు పంపేశారు. దాంతో ఒళ్లు మండిన మధోక్ మీడియా ముందుకు వచ్చి బిజెపి వారు తననూ, విద్యార్థులను ఎలా మోసగించారో, తమకు రావలసిన ఘనతను వేరేవారికి ఎలా కట్టబెట్టారో వరసపెట్టి యింటర్వ్యూలు యిచ్చాడు! ఇలాటి రాజకీయాల వలన నెలలోపు పూర్తి కావలసిన అస్సీ ఘాట్ ప్రక్షాళన యింకా సాగుతూనే వుంది!

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి 19**

## ఎమ్బీయస్ : హమ్ 'ఆప్' కే హై కౌన్?

యోగేంద్ర యాదవ్, ప్రశాంత్ భూషణ్ యిప్పుడు ఆ ప్రశ్న అడుగుతున్నారు. మార్చి 4 నాటి సమావేశంలో వారిద్దరినీ పిఏసి (పొలిటికల్ ఎఫెయిర్స్ కమిటీ) నుంచి తీసేశారు. కానీ పార్టీలోనే వుంచారు. యోగేంద్ర-ప్రశాంత్ ద్వయం యిది వూహించలేదు. కొత్త పిఏసి నియమించండి, మేం పోటీ చేయం అనే ఒక ప్రతిపాదన, పాత కమిటీనే కొనసాగించండి, మేం సమావేశాలకు దూరంగా వుంటాం అనే మరో ప్రతిపాదన చేశారు. రెండూ ఒప్పుకోం, మీరు బయటకు నడవాల్సిందే అంటూ మనీశ్ శిశోదియా తీర్మానం ప్రవేశపెట్టాడు. 11 మంది సరేనన్నారు, 8 మంది వద్దన్నారు. మెజారిటీ మాట నెగ్గింది. 'మేం యిప్పుడు వాలంటీర్లమే' అన్నాడు యోగేంద్ర. తటస్థంగా వుండి ఎటూ ఓటేయని మాయాంక్ గాంధీ యివన్నీ బయటపెట్టారు.

అన్ని ప్రాంతీయపార్టీల్లాగానే ఆప్‌లో కూడా ఏకవ్యక్తి పాలన సాగుతున్నట్లు యీ చర్యల వలన అర్థమవుతోంది. మంచికో, చెడుకో ఆప్ అనగానే అరవిందే అందరికీ గుర్తుకు వస్తున్నాడు. తాము పార్టీ స్థాపించినది అందుకు కాదని, అంతర్గత ప్రజాస్వామ్యం వుండి తీరాలని యోగేంద్ర, ప్రశాంతి భూషణ్ వంటి నాయకులు వాదిస్తున్నారు. దాని గురించి పట్టుబట్టినందుకే తమను వేధిస్తున్నారని వారి వాదన. ఎవరి ప్రణాళికలు వాళ్ల కున్నాయి. అరవింద్‌కు ఢిల్లీయే ముఖ్యం – తనకు అక్కడ పట్టు వుంది కాబట్టి. మరి హరియాణాలో బేస్ నిర్మించుకున్నాడు కాబట్టి అక్కడ పార్టీ పోటీ చేయాలని, తనను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రొజెక్టు చేయాలనీ యోగేంద్రకు ఆశ. హరియాణా ఒక్కటీ అంటే బాగుండదు కనుక, దేశమంతా పోటీ చేయాలని ప్రతిపాదన చేశాడు. అది చీదేయడంతో అందరూ యోగేంద్రను తప్పుపట్టారు. 'అది నా ఒక్కడి నిర్ణయమే కాదు, అరవింద్ కూడా ఒప్పుకున్నాడు' అంటాడు యోగేంద్ర యిప్పుడు. పార్లమెంటు ఎన్నికలలో ఆప్ ఘోరంగా ఓడిపోగానే శాంతి భూషణ్ 'అరవింద్ ప్రచారానికి పనికి వస్తాడు కానీ ఆర్గనైజేషన్ వ్యవహారాల్లో వీక్. పార్టీని దేశమంతా విస్తరింపచేయగల శక్తియుక్తులు అతనికి లేవు. ఆప్ కన్వీనర్‌గా యోగేంద్ర వుండాలి' అని బహిరంగంగా వ్యాఖ్యానించాడు. ఆప్‌లో అంతర్గత చర్చలు జరగటం లేదని కూడా ప్రకటించాడు. 'ఇది బహిరంగంగా చెప్పవలసిన అవసరం ఏముంది?' అని ఆప్ కార్యకర్తలు, అరవింద్ సన్నిహితులు మండిపడ్డారు. శాంతి భూషణ్ కుమారుడు, మరో ఆప్ లీడరు అయిన ప్రశాంత్ వాటిని ఖండించలేదు.

పెద్దా, చిన్నా భూషణ్‌లు, యోగేంద్ర కలిసి అరవింద్ స్థానంలో యోగేంద్రను తెచ్చేందుకు కుట్ర పన్నుతున్నారని అందరికీ అనుమానాలు వచ్చాయి. పార్టీ సమావేశం ఏదైనా పెడితే వీళ్లు తన వైఫల్యాలపై నిలదీస్తారన్న భయంతో అరవింద్ కూడా మూణ్నెళ్లకోసారి జరపవలసిన సమావేశాలు జరపడం మానేశాడు. 2014 జులై తర్వాత మళ్లీ 2015 ఫిబ్రవరిలోనే, అంటే ఎన్నికలలో గెలిచాకనే మీటింగు పెట్టాడు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేద్దామని యోగేంద్ర చేసిన సూచనను కూడా పెడచెవిన పెట్టాడు. ఆప్ ఢిల్లీలో ఓడి, హరియాణాలో నెగ్గితే ఆ ఘనతంతా యోగేంద్రకే పోయి, తన సారథ్యానికి ఎసరు వస్తుందన్నే భీతితో అరవింద్ ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించేవరకూ యింకెక్కడా ప్రయత్నం సైతం చేయకూడదనుకున్నాడు. ఢిల్లీ ఎన్నికలలో అరవింద్‌కు విజయం సిద్ధించకుండా భూషణ్‌లిద్దరూ ప్రయత్నించారు. పెద్దాయన శాంతి భూషణ్ అరవింద్ టిక్కెట్లు అమ్ముకుంటున్నాడని ఆరోపించాడు. ఆప్ నాయకబృందం వెళ్లి బతిమాలినా వినలేదు. ఆయన ధోరణి చూశాక, చిన్నాయన ప్రశాంత్ భూషణ్, యోగేంద్ర టిక్కెట్ల పంపిణీకి అడ్డు తగులుతారని వీళ్లకు అనుమానం వచ్చింది. అందుకని వాళ్లు సభ్యులుగా వున్న పిఏసిని తప్పించి ఢిల్లీ యూనిట్ ఏర్పరచి దాని ద్వారా టిక్కెట్ల పంపిణీ చేపట్టారు. అప్పుడు ప్రశాంత్ 19 మంది అభ్యర్థుల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేశాడు. ఆప్ ఆంబుడ్స్‌మన్ దీనిపై విచారించి 12 మందిని ఓకే చేశాడు. ప్రచారం జరుగుతూండగా శాంతి భూషణ్ బిజెపి అభ్యర్థి కిరణ్ బేదీని ఆకాశానికి ఎత్తేశాడు. ప్రశాంత్ ప్రచారంలో పాల్గొనన్నాడు. యోగేంద్ర ప్రచారం చేశాడు కానీ అరవింద్‌తో కలిసి చేయలేదు. ఇద్దరూ మాట్లాడుకుని నాలుగు నెలలయిందట. ఢిల్లీ అభ్యర్థుల సెలక్షన్ గురించి ఫిర్యాదు చేయడానికి మాత్రమే యోగేంద్ర అరవింద్ యింటికి వెళ్లాడు. ఎన్నికల ప్రచార సమయంలో 'ఆప్'లో వింగ్ అంటూ 'అవామ్' ఒకటి బయలుదేరి ఆప్ తీసుకున్న విరాళాల గురించి వివాదం రేపింది. అదంతా యోగేంద్ర తెలివితేటలే అని అరవింద్ అనుయాయుల నమ్మకం. ఢిల్లీ ఎన్నికలలో నెగ్గకపోతే అరవింద్ రాజకీయజీవితం సమాప్తం అని అందరూ అనుకున్నారు కాబట్టి అతని అనుచరులు అంతర్గతంగా సర్వే చేయించారు. ఆప్‌కు కొద్దిపాటి మెజారిటీ వస్తుందని తేలింది. వీళ్లిలా బిక్కుబిక్కుమంటూ వుండగానే ముంబయి నుంచి మార్కెటింగ్ ప్రొఫెషనల్ ఒకాయన వచ్చి బ్రహ్మాండమైన మెజారిటీతో గెలుస్తుందని చెప్పాడు. యోగేంద్ర వంటి సెఫాలజిస్టు తమ పార్టీలో వుండి కూడా ఆప్ యిలా గందరగోళ పడిందంటే కారణం – అతనిపై అపనమ్మకమే.

ఢిల్లీ ఎన్నికల్లో ఘనవిజయం తర్వాత అరవింద్‌కు ఆత్మవిశ్వాసం పెరిగింది. యోగేంద్ర, ప్రశాంత్ పిఏసి సభ్యులుగా వుంటే తను పార్టీ కన్వీనరుగా వుండనని సన్నిహితులతో చెప్పి, మార్చి 4న ఒక సమావేశం ఏర్పరచి, తను గైరుహాజరయ్యాడు. మర్నాడే 10 రోజుల ప్రకృతి చికిత్సకై బెంగుళూరు వెళ్లాడు. ప్రశాంత్ తనకు పంపిన రెండు ఎస్సెమ్మెస్‌లకు జవాబివ్వలేదు. తను లేకుండానే తన అనుచరులు వీళ్ల భరతం పట్టాలని, తనకు చెడ్డపేరు రాకూడదని అతని ఉద్దేశం. ఆ సమావేశం కన్వీనరు పదవికి అరవింద్ చేసిన రాజీనామా తిరస్కరించి, యోగేంద్ర, ప్రశాంత్‌లను పిఏసి పదవుల నుంచి తప్పించివేసింది. అయితే అప్పుడు పడిన ఓట్లు చూస్తే అరవింద్ గ్రూపుకి 11 ఓట్లు వస్తే యోగేంద్ర గ్రూపుకు 8 వచ్చాయి. మెజారిటీ స్వల్పంగానే వుంది. ఈ పరిస్థితుల్లో యోగేంద్ర, ప్రశాంత్ తిరగబడ్డారు. వారికి సన్నిహితంగా వుండే ముంబయికి చెందిన అంజలి దమానియా గతంలో అరవింద్ ప్రభుత్వం ఏర్పరచినప్పుడు కాంగ్రెసు పార్టీ ఎమ్మెల్యేలను కొనడానికి ప్రయత్నించాడని, బేరసారాలు ఆడాడని ఆరోపిస్తూ పార్టీలోంచి తప్పుకుంది. "ఆరుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెసు పార్టీని చీల్చి విడిగా పార్టీ ఏర్పరచుకుని మన ప్రభుత్వాన్ని ఏర్పరచేందుకు సహకరించేట్లా చేయండి." అని అరవింద్ తనతో టెలిఫోన్‌లో మాట్లాడాడంటూ రాజేశ్ గర్గ్ ఆరోపించి ఆ సంభాషణను ఒక టీవీ ఛానెల్ ద్వారా విడుదల చేశాడు. దానికి అనుబంధంగా యోగేంద్ర, ప్రశాంత్ తాము పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డామన్న ఆరోపణలు ఖండించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత అరవింద్ కాంగ్రెసు మద్దతుతో ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తానన్నాడని, తాము ప్రతిఘటించామని, అప్పణ్నుంచే తమ మధ్య విభేదాలు వచ్చాయని చెప్పారు. వీరిద్దరితో బాటు శాంతి భూషణ్‌ను కూడా పార్టీలోంచి తీసేయాలని కపిల్ మిశ్రా అనే ఎమ్మెల్యే సంతకాల సేకరణ మొదలుపెట్టాడు. త్వరలో జరగబోయే పార్టీ జాతీయ మండలిలో వారిపై వేటు పడవచ్చని అనుకుంటున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : వీడ్కోలు సభలో దుమ్ము దులిపేసిన సుజాతా సింగ్

ఫారిన్ సెక్రటరీగా పనిచేస్తూ సడన్‌గా పదవి పోగొట్టుకున్న సుజాతా సింగ్ తన స్టాఫ్ యిచ్చిన వీడ్కోలు సభలో మోదీపై, తన స్థానంలో వచ్చిన జయశంకర్‌పై విరుచుకుపడ్డారు. ఇండియన్ ఫారిన్ సర్వీసులో 38 ఏళ్ల సర్వీసు వున్న ఆమె ఏడాదిన్నర క్రితం ఆ పదవిలో నియమింపబడ్డారు. పదవీకాలం యింకా ఆర్నెల్లు వుండగానే మోదీ జనవరి 28 న ఆమెను సడన్‌గా తీసేసి, జయశంకర్‌ను వేశారు. సుజాతా చేసిన పొరపాటు ఏమిటో ఎవరూ ఏమీ చెప్పలేదు. ఈ రోజుల్లో ఏదీ కాగితంపై వుండడం లేదు. ట్వీట్‌లు, ఫేస్‌బుక్కులు, సోషల్ మీడియా ద్వారానే చెపుతున్నారు. కొన్ని రోజులుగా జయశంకర్‌ను ఆకాశానికి ఎత్తివేయడంతో కథ ప్రారంభమైంది. మోదీని అమెరికాకు ఆహ్వానించడానికి, రిపబ్లిక్ దినోత్సవ వేడుకలలో పాల్గొనడానికి ఒబామాను ఒప్పించడానికి, చైనాతో సరిహద్దు వివాదంలో ప్రస్తుత ఘర్షణవాతావరణం తగ్గడానికీ జయశంకర్ చేసిన ప్రయత్నాలే కారణమని కొందరు రాయసాగారు. ఆయన ఐఎఫ్ఎస్ నుండి మూడు రోజుల్లో రిటైర్ అవుతాడనగా సడన్‌గా తీసుకుని వచ్చి సుజాత స్థానంలో కూర్చోబెట్టారు. ఇది సహజంగానే

ఆమెకు కోపం తెప్పించింది. తన విదేశాంగ శాఖలోని 100 మంది ఉన్నతాధికారులు తనకై ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో తన ఆగ్రహాన్ని వెళ్లగక్కారు.

''మీలో చాలామంది కరణ్ థాపర్‌కు నేను యిచ్చిన టీవీ యింటర్వ్యూ చూసి వుంటారు. నేను చెప్పదలచుకున్నదానిలో సగమే అక్కడ చెప్పాను. మిగతా సగం యివాళ్టి కోసం దాచుకున్నాను. నేను చాలాసేపు మాట్లాడతాను. ఓపిక లేనివాళ్లు ముందే వెళ్లిపోవచ్చు...'' అంటూ ఉపన్యాసం ప్రారంభించింది. అంతకు ముందు జయశంకర్ ఆమెను 'ఔట్‌గోయింగ్ ఫారిన్ సెక్రటరీ'గా సభకు పరిచయం చేస్తూ ''జూనియర్ డిప్లోమాట్‌గా ఆమె చాలా ధైర్యాన్ని ప్రదర్శించింది. మానససరోవర్‌లో విపరీతమైన వర్షాలు పడి యాత్ర దుర్లభం అనుకున్నపుడు ఆమె ధైర్యంగా లయజన్ ఆఫీసరుగా వుండి అక్కడకు వెళ్లింది.'' అని మాత్రమే చెప్పాడు. 38 ఏళ్ల కెరియర్‌లో ఆమె సాధించిన తక్కిన విజయాల గురించి ప్రస్తావించనైనా ప్రస్తావించలేదు. దానితో ఆమె ''జయశంకర్, జూనియర్ డిప్లోమాట్‌గా నేను చేసినదాన్ని చెప్పడంతో బాటు నన్ను యీ ప్రభుత్వం ఏ విధంగా తొలగించిందో అది కూడా చెప్పాల్సింది..'' అని మొదలుపెట్టి, 'విదేశాంగ వ్యవహారాలనేవి ఒక్కసారిగా జరిగేవి కావు. ఏళ్ల తరబడి బంధాలు నిర్మించుకుంటూ రావాలి. ఎన్నో స్థాయిలలో ఎందరితోనూ వ్యవహారం నడుపుతూ పరిస్థితులను సానుకూల పరుచుకోవాలి. అది నిరంతర ప్రక్రియ. టీమ్ వర్క్. చాలామంది తమ నైపుణ్యాలను రకరకాలుగా వుపయోగిస్తేనే ఫలితం కనబడుతుంది. అంతేకానీ ఎవరో ఒక వ్యక్తి చేతనే అంతా జరిగిందనుకోవడం భ్రమ' అంటూ జయశంకర్‌పై విసుర్లు విసిరింది. ఇక మోదీ తన పట్ల ఎందుకు విముఖంగా వున్నాడో అర్థం చేసుకోలేకపోయానని చెపుతూ 'నాకు మోదీతో పర్సనల్ కెమిస్ట్రీ లేదని కొందరంటున్నారు. విదేశీ వ్యవహారాలపై నేను మోదీగారితో హిందీలోనే మాట్లాడాను. తమిళంలో మాట్లాడి వుంటే ఆయనకు బాగా అర్థమయ్యేదేమో!' అని వెటకరించింది.

సుజాతా సింగ్ తమిళ వనిత. ఆమె తండ్రి టివి రాజేశ్వర్ ఇందిరా గాంధీ కాలంలో ఇంటెలిజెన్సు బ్యూరోకు చీఫ్‌గా పనిచేశారు. భర్త సంజయ్ సింగ్ ఉత్తరభారతీయుడు. ఐఎఫ్ఎస్‌లోనే పనిచేశాడు. తండ్రి కారణంగా ఆమెకు కాంగ్రెసు నాయకులతో పలుకుబడి వుందని, అందుకే మోదీకి ఆమె నచ్చలేదనీ కొందరు వ్యాఖ్యానించిన మాట కూడా ఆమె ప్రస్తావించింది. 'నాకేవో పొలిటికల్ కనక్షన్లు వున్నాయని అంటున్నారు. అంత కనక్షనే వుంటే మా ఆయనకు రాయబారిగా ఒకే ఒక్కసారి – అదీ రెండేళ్లపాటు, పైగా ఇరాన్‌లో – ఎందుకు వస్తుంది?' అని అడిగింది. సాధారణంగా రాయబారి పోస్టింగు మూడు, నాలుగేళ్లకు యిస్తారు. కొంతకాలం ఒక చోట చేసిన తర్వాత హెడ్‌క్వార్టర్స్‌కు వచ్చి పని చేశాక మళ్లీ యింకో చోటకి పంపిస్తారు. పలుకుబడి గల కొందరు హెడ్‌క్వార్టర్స్‌కు రాకుండా దేశం తర్వాత దేశానికి రాయబారిగా వెళ్లిపోతూ వుంటారు. సంజయ్ సింగ్‌కు ఆ భాగ్యం దక్కలేదంటే ఆమెకు పలుకుబడి పెద్దగా లేనట్టే లెక్క. ఆమెతో పనిచేసినవారు చెప్పేదాని ప్రకారం, ఆమె చాలా సమర్థురాలు. వాస్తవ పరిస్థితిని ధైర్యంగా, శషభిషలు లేకుండా పై అధికారులకు, నాయకులకు చెప్పే రకం. అది ప్రస్తుత ప్రభుత్వానికి నచ్చలేదని అర్థమవుతోంది. అవమానకరంగా అవతలకు పంపించే ముందు ఆమెపై సోషల్ మీడియాలో చాలా వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'ఆమెకు ఏదీ చేతకాదనీ, మోదీ విదేశాంగ విధానం అమలు చేయడంలో విఫలమైందనీ..' యిలాటివి! దానితో అవకాశం రాగానే ఆమె దుమ్ము దులిపేసింది. రేపు మీ గతీ యింతే కావచ్చని సహచరులను హెచ్చరించింది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : అడ్డుకట్టకు అడ్డంకులు

గుజరాత్‌లో 'స్టాచ్యూ ఆఫ్ యూనిటీ' పేర 182 మీటర్ల ఎత్తున సర్దార్ పటేల్ విగ్రహం కడుతున్నారని అందరికీ తెలుసు. ఆంధ్ర రాజధానికి డబ్బులడిగితే లేవంటారు, (ప్లాను వచ్చాక చూద్దామంటారు. పిండి ఎంత వుందో చెపితే దాని ప్రకారం రొట్టె సైజు ప్లాను చేయవచ్చు. నాలుగు లక్షల కోట్ల బజెట్‌తో ప్రాజెక్టు రిపోర్టు పట్టుకుని వస్తే ఏ వెయ్యి కోట్లో విదిలించి సర్దుకోమంటే...?) పోలవరం ప్రాజెక్టుకు రూ. 100 కోట్లు చాలంటారు, వెనకబడిన ప్రాంతాలకు నిధులు విదల్చరు. కానీ యీ ప్రాజెక్టును మాత్రం రూ. 2989 కోట్ల వ్యయంతో తలపెట్టారు. 2018 కల్లా పూర్తి చేయాలనే సంకల్పంతో బజెట్‌లో కేటాయింపులు కూడా భారీగానే చేస్తున్నారు. ఎందుకు అంటే దాన్ని టూరిస్టు ప్రాంతంగా అభివృద్ధి చేస్తారట. అక్కడ ఒక మ్యూజియం, స్మారక ఉద్యానవనం, కన్వెన్షన్ సెంటరు, 'శ్రేష్ఠ భారత్ భవన్' పేరుతో 128 గదుల మూడు నక్షత్రాల హెూటలు కడతారు. విగ్రహం చుట్టూ ఒక సరస్సు కూడా వుంటుంది. హుస్సేన్ సాగర్ అప్పటికే వుంది కాబట్టి మధ్యలో బుద్ధవిగ్రహం పెట్టారు. ఇప్పుడు విగ్రహం పెట్టి చుట్టూ 12 కి.మీ.ల కృత్రిమ సరస్సు ఏర్పాటు చేస్తారట. దానిలో బోట్లో తిరుగుతూ విగ్రహాన్ని చూడవచ్చు. లిఫ్ట్‌లో విగ్రహం పైకి వెళ్లి అక్కణ్నుంచి పరిసరాలు పరికించవచ్చు. ఐడియా బాగానే వుంది కానీ యీ సరస్సుకి నీళ్లు ఎక్కణ్నుంచి వస్తాయి? సర్దార్ సరోవర్ డ్యామ్ నుండి నీళ్లు యిటు లాగాలి. లాగి అక్కడే నిలవ వుంచాలంటే నదికి అడ్డుగా ఒక అడ్డుకట్ట (సాంకేతికంగా వియర్ అంటారు) కట్టి నీటిమట్టం పెంచాలి. సర్దార్ సరోవర్ ప్రాజెక్టు కడదామనుకున్నపుడు అక్కడ కట్టబోయే జలవిద్యుత్ ప్రాజెక్టు 12 కి.మీ.ల దిగువన గరుడేశ్వర్ వద్ద అడ్డుకట్ట కట్టి నీళ్లను ఆపి మళ్లీ దాన్ని ఆ ప్రాజెక్టులోకి తోడుదామని అనుకున్నారు కానీ అది కార్యరూపం ధరించలేదు. 1980లలో ప్రాజెక్టు రూపు దిద్దుకుంటున్నపుడు యీ అడ్డుకట్టకు అనుమతులు తీసుకోలేదు. పర్యావరణంపై, ప్రాజెక్టు పటిష్టతపై దాని ప్రభావాన్ని అంచనా వేయించలేదు. ప్రాజెక్టు అయిన తర్వాత దీని సంగతి విడిగా చూద్దామనుకున్నారు. అందువలన 1987లో ప్రాజెక్టుకు

యిచ్చిన అనుమతిలో దీని ప్రస్తావన లేదు. ఇప్పుడు యీ విగ్రహం చుట్టూ చెఱువు ఐడియా రాగానే ఆ అడ్డుకట్ట ప్రతిపాదన దుమ్ము దులిపారు.

ఆ అడ్డుకట్ట కడితే 11 గ్రామాలు మునిగి, 11 వేల మంది గిరిజనులు నిర్వాసితులవుతారు. వారి పునరావాసం పెద్ద సమస్య. పైగా యిప్పుడు భూమి అడిగితే వాళ్లు యిచ్చేట్లు లేరు. అందువలన పాత రికార్డులు తీసి చూశారు. 1961లో సర్దార్ ప్రాజెక్టు రూపకల్పన చేసినపుడు ఎందుకైనా మంచిదని చాలా వూళ్లకు అధికారులు వెళ్లి 'మేం మీకు పరిహారం యిచ్చి భూములు తీసేసుకుంటాం.' అని చెప్పారు. ఈ వూళ్లలోనూ అలాగే చెప్పారు. కానీ తర్వాత అవసరం పడకపోవడంతో యిటువైపు రాలేదు. ఇప్పుడు యీ విగ్రహం చెఱువుకోసం అవసరం పడింది కాబట్టి 'అప్పుడెప్పుడో ఖాళీ చేయమని మీకు చెప్పాం కదా, యిప్పటికైనా వెళ్లిపోండి' అంటున్నారు. 'అప్పుడు మీరు అడిగినది సర్దార్ ప్రాజెక్టు కోసం. అది కట్టేయడం జరిగిపోయింది. మీరు యిప్పుడు వచ్చి మా స్థలాల్లో త్రీ స్టార్ హెూటలు కడుతూ, 500 కార్ల పార్కింగ్ స్థలం కోసం మమ్మల్ని యిళ్లు ఖాళీ చేయమంటే ఎందుకు చేస్తాం?' అని వీళ్లు ఎదురు తిరిగారు. 'ఎలా వుపయోగించుకుంటామో మీ కనవసరం. అప్పుడు మీరు ఒప్పుకున్నారు, ఖాళీ చేయాల్సిందే' అని వీరు... 'ఒప్పుకున్నట్లుగా మీ దగ్గర పత్రాలు వున్నాయా? మాకు నష్టపరిహారం యిచ్చినట్లు ఋజువులు చూపించగలరా?' అని గిరిజనులు.. అడుగుతున్నారు. అధికారులు తెల్లమొహం వేస్తున్నారు. ఇబ్బంది ఏమిటంటే భూసేకరణ చట్టం ప్రకారం ఏ ప్రాజెక్టు పేరు చెప్పయినా భూమి తీసుకుంటే, పదేళ్ల వరకే గడువు. పదేళ్లలో పూర్తి చేయకపోతే భూమి తిరిగి యిచ్చేయాల్సిందే. పూర్తయిన సర్దార్ ప్రాజెక్టు పేరుతో యిప్పుడు భూములడిగితే నర్మద కంట్రోలు అథారిటీ చట్టం ప్రకారం చెల్లదు. 1961 తర్వాత అధికారులు పరిహారం యివ్వనే లేదు. ఆ భూములు, యిళ్లు ఆ గిరిజనుల పేరే వున్నాయి. వాళ్లు యింటి పన్ను కడుతున్నారు, విద్యుత్ బిల్లులు కడుతున్నారు. 55 ఏళ్ల తర్వాత వచ్చి మీరు ఆక్రమణదారులు అంటే వాళ్లెందుకు ఒప్పుకుంటారు? 'మీకు వేరే చోట స్థలాలు యిస్తాం' అంటే వాళ్లు '15 కి.మీ.ల దూరంలో రాళ్లూ రప్పలు వున్నచోట, 1980లలో పునరావాస కార్యక్రమాలు చేపట్టినపుడు ఎవ్వరికీ అక్కరలేని స్థలాలు చూపించి వెళ్లమంటారా? మేం వెళ్లం' అంటున్నారు.

వారి తరఫున సామాజిక కార్యకర్తలు, పర్యావరణ కార్యకర్తలు, మానవహక్కుల కార్యకర్తలు అందరూ రంగంలోకి దిగి, కేసులు పెడుతున్నారు. ఈ సర్దార్ పటేల్ విగ్రహం ప్రాజెక్టుకి పర్యావరణ అనుమతులు రాలేదు. డ్యామ్‌కు పక్కగా అంత పెద్ద విగ్రహం, వేలాది మంది టూరిస్టులు వచ్చిపోయేట్లా నిర్మిస్తే డ్యామ్ సురక్షితంగా వుంటుందో లేదోనన్న భయాలూ వున్నాయి. ఈ అడ్డుకట్ట పొడవు ఎంతో కూడా యిప్పటిదాకా తేల్చలేదు. పునరావాసం అనేది ఎక్కడైనా చికాకు పెడుతోంది. జాతీయప్రయోజనాల పేరు చెప్పి భూమి లాక్కుంటే అదో అందం. కానీ హెూటల్ కోసమంటూ లాక్కుంటూంటే వాళ్లెందుకు వూరుకుంటారు? ఇంత పెద్ద ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వున్నాయా అని రోహిత్ ప్రజాపతి అనే పర్యావరణవేత్త సమాచార హక్కు కింద అడిగితే గుజరాత్ ప్రభుత్వం 'కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం 20 వేల చ.మీ.ల స్థలం కంటె ఎక్కువ స్థలంలో కట్టే ప్రాజెక్టులకే అనుమతి కావాలి. ఇది అంతకంటె తక్కువ కాబట్టి అక్కరలేదు! విగ్రహం ఎత్తు, బరువు ఎంతున్నా అనుమతులు తీసుకోనక్కరలేదు.' అని జవాబిచ్చింది.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : అవినాశ్ చందర్‌ను ఎందుకు పంపించేశారు?

డిఆర్‌డిఓ (డిఫెన్స్ రిసెర్చి అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్) కు డైరక్టర్ జనరల్‌గా, రక్షణమంత్రికి సైంటిఫిక్ ఎడ్వయిజర్‌గా పని చేస్తున్న అవినాశ్ చందర్ భారతదేశానికి ఎంతో ఖ్యాతి గడించిపెట్టిన బాలిస్టిక్ మిసయిల్ సిస్టమ్స్ అగ్ని సీరీస్‌కు ప్రధాన శిల్పి. జనవరి 31న అగ్ని5 ప్రయోగం జరగబోతూండగా మిమ్మల్ని అవేళ నుంచే తీసేస్తున్నాం అంటూ జనవరి 14న తెలియపరిచారు. ఐఐటి నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగు పట్టా తీసుకుని 1972లో డిఆర్‌డిఓలో చేరిన అవినాశ్ సారథ్యంలో డిఆర్‌డిఓ ఎన్నో విజయాలను సాధించింది. అతనికి పద్మశ్రీ బిరుదు కూడా యిచ్చారు. సాధారణ ఉద్యోగిని తీసేసేటప్పుడు సైతం పిలిచి ఎగ్జిట్ ఇంటర్వ్యూ పేర చర్చిస్తారు. అవినాశ్ వంటి ఉన్నతోద్యోగిని తీసేసేటప్పుడు అలాటి మర్యాదలేవీ పాటించలేదు సరికదా తనను తీసేసినట్లు అతనికి మీడియా ద్వారానే తెలిసింది. 2013 మేలో అతన్ని యుపిఏ ప్రభుత్వం మూడేళ్ల కాంట్రాక్టుపై నియమించింది. అది చాలా వింతగా వుంది అని యీ రోజు రక్షణమంత్రి అంటున్నారు. అంత వింతగా వుంటే దాన్ని మన్నిస్తూ 2014 నవంబరులో 64 ఏళ్లు నిండి రిటైరయ్యాక (సైంటిస్టులకు రిటైర్‌మెంట్ వయసు 64) అతని కాంట్రాక్టును 2016 మే వరకు పొడిగించి నెలన్నరలోనే యిలా అర్థాంతరంగా, అవమానకరంగా తీసేయడం వింతన్నరగా వుంది. ఎందుకు పొడిగించారో, అంతలోనే ఎందుకు పీకేశారో యిప్పటిదాకా స్పష్టంగా తెలియరాలేదు. అవినాశ్‌ను అడిగితే "42 ఏళ్ల సర్వీసు తర్వాత, ఏ చర్చలూ, సంప్రదింపులు లేకుండా 'తీసేశారు' (శాక్‌డ్) అనిపించుకోవడం బాధాకరం." అన్నాడు. అంటూనే తన టీమును ఎంచుకునే హక్కు రక్షణమంత్రికి వుంటుంది అని వివాదాలకు దూరంగా వున్నాడు. రక్షణమంత్రి మనోహర్ పారికర్ 'డిఆర్‌డిఓ అభివృద్ధి చెందాలనే కాంక్ష గల యువసైంటిస్టులు వుండాలని మా కోరిక' అన్నాడు. మరి ప్రభుత్వం అన్నిచోట్లా యువకులను వేస్తోందా అంటే అదీ లేదు. అది కొత్తగా నియమిస్తున్న వారిలో 60 ఏళ్లు దాటినవారు చాలామంది వున్నారు.

డిఆర్‌డిఓ వేగంగా పనిచేయడం లేదని, అది చేసిన ఆలస్యాల వలన రూ. 29 వేల కోట్లు వ్యర్థమయ్యాయని, మారిన పరిస్థితుల్లో కూడా చల్తా హై అనే ధోరణిలోనే నడుస్తూ తన స్పీడు అందుకోలేకపోతోందని మోదీకి విసుగుపుట్టి యీ చర్య తీసుకున్నారని కొందరు చెప్తున్నారు. అవినాశ్‌ను అడిగినా, డిఆర్‌డిఓలోని యితర సైంటిస్టులను అడిగినా ఎప్పుడో దశాబ్దాల కితం నాడు వేర్వేరు కారణాల వలన అర్జున్ ట్యాంక్, లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ వంటివి ఆలస్యమైన మాట నిజమే అయినా ప్రస్తుతం ఏ ప్రాజెక్టూ డ్రాయింగ్ బోర్డు నుంచి డెలివరీ వరకు నాలుగైదు సంవత్సరాలకు మించి పట్టటం లేదని చెప్తున్నారు. మిలటరీ రూ.1.70 లక్షల కోట్ల ఆర్డరు తమకు యిచ్చిందని గుర్తు చేస్తున్నారు. తమకు సంబంధించిన అనేక సంస్థలు త్వరగా, చౌకగా అనేక ఆధునిక పరికరాలను తయారుచేస్తున్నాయని తెలుపుతున్నారు.

ఈ నిర్ణయం తీసుకోవడానికి కారణమేమిటో తెలియక వూహా-గానసభలు సాగిపోతున్నాయి. దానిలో ఒకటి – ప్రధాని కార్యాలయానికి అవినాశ్‌పై మూడు ఫిర్యాదులు వచ్చాయట. రెండు ఆకాశరామన్న ఉత్తరాలు కాగా, మరొకటి అవినాశ్‌తో పని చేసే ఆర్ కె గుప్తాది. గుప్తా హైదరాబాదులోని అడ్వాన్స్ సిస్టమ్ లేబ్‌కు అధిపతి. అగ్ని5 ప్రాజెక్టు డైరక్టర్. అవినాశ్ రూల్సు మార్చేసి తన జూనియర్‌కు ప్రమోషన్ యిచ్చి, తనను పక్కకు తప్పించాడని గుప్తా అభియోగం. గుప్తా మాట విశ్వసించి అవినాశ్‌ను తప్పించారనుకున్నా, అగ్ని5 ని ప్రయోగించిన వెంటనే గుప్తాను ఆ డిపార్టుమెంటు నుంచి వేరే చోటకి బదిలీ చేశారు. జనవరి 9 వ తారీకుతో వున్న బదిలీ ఆదేశం తనకు ఫిబ్రవరి 2 న చేరిందని, తన వంటి సీనియరు పట్ల యిలా వ్యవహరించడం అన్యాయమని గుప్తా వాపోయాడు. 'నేనే కాదు, మా కుటుంబసభ్యులందరూ కూడా బాధపడుతున్నాం. జరగరానిది ఏదైనా జరిగితే దానికి అవినాశ్ చందర్, డాఎ విజి శేఖరన్ బాధ్యత వహించాలి' అని తన లేఖలో పేర్కొన్నాడు.

అవినాశ్ నిష్క్రమణ వెనక్కాల నీతి ఆయోగ్ సభ్యుడిగా నియమితుడైన విజయ్ కుమార్ సారస్వత్ వున్నారన్న పుకారు వినబడుతోంది. అతను అవినాశ్ కంటె డిఆర్‌డిఓలో పది రోజులు సీనియర్. ఇద్దరూ కలిసి కలామ్ సారథ్యంలో పృథ్వి, అగ్ని, అరిహంత్ ప్రాజెక్టులలో పనిచేశారు. మంచి స్నేహితులు కూడా. సారస్వత్ 2009 నుండి 2013 వరకు డిఆర్‌డిఓకు అధిపతిగా వున్నాడు. అతను రిటైరయ్యాక అవినాశ్ అతని స్థానంలోకి వచ్చాడు. సారస్వత్‌కు బిజెపితో సంబంధాలు పెంచుకున్నాడు. సంఘ్ పరివార్‌కు సంబంధించిన వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేసి, ఎన్‌డిఏ ప్రభుత్వం ప్లానింగ్ కమిషన్ స్థానంలో తీసుకుని వచ్చిన నీతి ఆయోగ్‌లో కేంద్రమంత్రివర్గంలో మినిస్టర్ ఆఫ్ స్టేట్ స్థాయిగల ఫుల్‌టైమ్ మెంబర్‌గా అయ్యాడు. అతను వచ్చిన కొన్ని రోజులకే అవినాశ్ వుద్యోగం వూడింది. అవినాశ్ సైంటిస్టే తప్ప రాజకీయాల జోలికి వెళ్లలేదు. అతను వ ృద్ధుడై పోయాడని పారికర్ అంటున్నారు. రెండు నెలలైనా అతని స్థానంలో యింకా ఎవర్నీ నియమించలేదు. సీనియారిటీ ప్రకారం చూస్తే డిఆర్‌డిఓలో అవినాశ్ స్థానంలో వచ్చే వాళ్లందరూ 60 ఏళ్లకు పై బడినవారే. డిఆర్‌డిఓ పరుగులు పెట్టాలి అంటూ ఆకస్మిక నిర్ణయం తీసుకున్న మోదీ సర్కారు రెండు నెలలుగా అంత ముఖ్యమైన సంస్థకు అధిపతి లేకుండా చేసింది! ఇదెక్కడి తర్కమో అర్థం కాదు.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : 55 ఏళ్ల తర్వాత నవలకు సీక్వెల్

1960 లో వెలువడి పులిట్జర్ బహుమతి పొందిన ''టు కిల్ ఏ మాకింగ్ బర్డ్'' అనే ప్రపంచ ప్రఖ్యాత నవలకు సీక్వెల్‌గా ''గో సెట్ ఎ వాచ్‌మన్'' అనే నవల రాబోతోంది. మాకింగ్ బర్డ్ నవల యిప్పటిదాకా 4 కోట్ల ప్రతులు అమ్ముడు పోయిందని అంచనా. ఆ నవలకు నేపథ్యంగా వున్న వూరు యాత్రాస్థలంగా మారిపోయింది. ఇంత పేరు వచ్చిన తర్వాత ఆ గ్రంథరచయిత్రి నెల్లె లీ (ఆమె కలం పేరు హార్పర్ లీ) మరో పుస్తకం వెనువెంటనే రాసి వుండాలి కదా! మరి 50 ఏళ్లు ఆలస్యమైందేమిటన్న సందేహం రావడం సహజం. అంతకుముందు ఆ నవల యితివృత్తం గురించి, రచయిత్రి గురించి కొంత తెలుసుకోవాలి. అలబామాలోని మేకోంబ్ అనే చిన్నపట్టణంలో 1933–35 మధ్య జరిగినట్లుగా నవల రాయబడింది. అప్పట్లో అక్కడ జాతిభేదాలు విపరీతంగా వుండేవి. తెల్లవారు నల్లవారిని నీచంగా చూసేవారు. ఆ వూళ్లో అటికస్ అనే మధ్యవయస్కుడైన ఒక లాయరు వున్నాడు. భార్య పోయింది. పదేళ్ల కొడుకు, ఆరేళ్ల కూతురు. ఆ వూర్లో మేయెల్లా అనే తెల్లజాతి అమ్మాయిని టామ్ అనే నల్లవాడు చెరిచాడన్న ఆరోపణతో అతనిపై కేసు పెడతారు. జడ్జి అటికస్‌ను డిఫెన్సు లాయరుగా వుండమంటాడు. ఊళ్లో అందరూ వారించినా నిజం వెలికితీయడానికి అటికస్ అంగీకరిస్తాడు. విచారణ సందర్భంగా మేయెల్లా, ఆమె తాగుబోతు తండ్రి బాబ్ అబద్ధాలాడుతున్నారని నిరూపిస్తాడు. జరిగిందేమిటంటే తెల్లజాతి మగాళ్లెవరూ తన వైపు ఎవరూ కన్నెత్తి చూడడం లేదన్న వ్యథతో మేయెల్లా టామ్‌ని ముగ్గులోకి లాగబోయింది. కానీ అతను నిరాకరించాడు. ఈ విషయం తెలిసిన బాబ్ ఆమెను చితకబాది, టామ్‌పై కేసు పెట్టాడు. ఇంత తెలిసినా జ్యూరీ సభ్యులు నల్లవాడిపై ద్వేషంతో అతన్ని దోషిగా నిర్ధారించి శిక్ష వేయిస్తారు. టామ్ జైల్లోనుంచి పారిపోయడానికి ప్రయత్నించి కాల్పులకు గురై చనిపోతాడు. అటికస్‌కు న్యాయవ్యవస్థపై నమ్మకం సడలుతుంది.

బాబ్ అటికస్‌పై పగబడతాడు. అతని పిల్లలపై హాలోవెన్ పండగ రాత్రి (అందరూ మారువేషాల్లో వుంటారు) దాడి చేస్తాడు. అయితే బూ రాడ్లీ అనే అజ్ఞాతవ్యక్తి వాళ్లను రక్షిస్తాడు. ఈ బూ ఒక యింట్లో ఒంటరిగా వుంటూ వుంటాడు. ఎవరికీ కనబడడు. ఈ

పిల్లలు ఆ పరిసరాల్లో ఆడుకుంటూ అతనెలా వున్నాడో చూద్దామని ఉబలాట పడుతూ వుంటారు. అతను బయటకు వచ్చి వీళ్లతో మాట్లాడడు కానీ వీళ్లకోసం చెట్ల దగ్గర బహుమతులు విడిచిపెడుతూ వుంటాడు. ఆ రోజు వీళ్ల పాలిట రక్షకుడిగా అవతారమెత్తి బాబ్‌ని చంపివేస్తాడు. అటికస్ తన కొడుకే హత్య చేశాడని అనుకుని అరెస్టు చేయమంటాడు. విచారణ జరపడానికి వచ్చిన షెరీఫ్ ఎవరిదీ తప్పు లేదని, బాబ్ తన కత్తిపై తానే ప్రమాదవశాత్తూ పడి చనిపోయాడని చెప్పి కేసు మూసేస్తాడు. ఈ కథను రచయిత్రి ఆరేళ్ల చిన్నపిల్ల పరంగా చెప్పడంతో చాలా అందం వచ్చింది. ఆదర్శప్రాయుడైన తండ్రి, జాతివివక్షతకు వ్యతిరేకంగా పోరాటం, మిస్టీరియస్‌గా ఎవరికీ కనబడని అజ్ఞాతవ్యక్తి, చెట్లల్లో, గుట్టల్లో ఆడుకోవడం యివన్నీ పిల్లల్నీ, పెద్దల్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి. దీన్ని 1962లో సినిమాగా తీశారు. తండ్రి పాత్రలో గ్రిగరీ పెక్ అద్భుతంగా నటించి మంచి పేరు. ఆస్కార్ ఎవార్డూ తెచ్చుకున్నాడు.

రచయిత్రి హార్పర్ లీకి యిప్పుడు 88 ఏళ్లు. ఆమె జీవితం కూడా నాటకీయంగా సాగింది. తన సొంత జీవితంలోని సంఘటనల ఆధారంగానే ఆ నవల రాసింది. ఆమెదీ అలబామాలోని మన్రోవిల్లి అనే చిన్నపట్టణమే. తండ్రి లాయరే. నవలకు విపరీతంగా పేరు రావడంతో అందరి దృష్టి తనపై పడడంతో భరించలేక న్యూయార్క్ వెళ్లిపోయి ఎవరికీ తెలియకుండా వుండేది. పెళ్లి చేసుకోలేదు. చిన్ననాటి స్నేహితుడు ట్రూమన్ కాపొటేతో కలిసి వుంటూ అతనికి రచనల్లో సాయపడేది. ఈమెను పాత్రగా పెట్టి అతను నవలలు రాశాడు. 1984లో అతను చనిపోయాడు. 2007లో ఆమెకు సడన్‌గా స్ట్రోక్ రావడంతో రోగిష్టిదయిపోయింది. చెవులు వినబడవు, కళ్లు కనబడవు. చక్రాల కుర్చీలోనే తిరగాలి. మతిమరుపు. ఏదీ గుర్తుండదు. ఈ పరిస్థితిలో ఆమె తన కంటె 15 ఏళ్లు పెద్దదైన అక్క ఏలిస్ వద్దకు వచ్చేసింది. ఏలిస్ సొంత వూళ్లో తన తండ్రి పెట్టిన లీగల్ కంపెనీని నడుపుతోంది. ఈమె పుస్తకం కాపీరైట్ వ్యవహారాలన్నీ చూసేది. హార్పర్ పరిస్థితి చూసి సహాయకురాలిని ఏర్పాటు చేసింది. మతిమాలిన స్థితిలో హార్పర్ తన పుస్తకంపై హక్కులను ఎవరికో రాసి యిచ్చేసి చాలా వివాదాల్లో యిరుక్కుంటే ఆమె సర్దుబాట్లు చేస్తూ వచ్చింది.

ప్రస్తుతం వెలువడబోతున్న 'వాచ్‌మన్' నవల మాకింగ్ బర్డ్ జరిగిన కథాకాలానికి 20 ఏళ్ల తర్వాత జరుగుతుంది. పిల్లలిద్దరూ పెరిగి పెద్దవారై న్యూయార్క్‌లో నివసిస్తూ తమ తండ్రిని చూడ్డానికి సొంతవూరు వస్తారు. నిజానికి హార్పర్ యీ నవలను ముందు రాసింది. ప్రచురణకు పంపితే, దాన్ని చదివిన సంపాదకుడికి ఆ నవల్లో ఫ్లాష్‌బ్యాక్‌లో రాసిన సంఘటనలు బాగా నచ్చాయి. ముఖ్యంగా ఆరేళ్ల పిల్ల అనుభవాలు ముచ్చట గొలిపాయి. ఆమె దృక్కోణం నుంచి అప్పటి కాలంలో జరిగినట్లుగా నవల రాయమని సలహా యిచ్చాడు. అదే ఆమె ప్రథమప్రయత్నం కావడంతో అతని సలహా మన్నించి చిన్నపిల్లలనే ప్రధానపాత్రలుగా పెట్టి మాకింగ్ బర్డ్ రాసింది. అది విపరీతంగా పేరు తెచ్చుకుంది. ఆ పేరు చెడగొట్టుకోకూడదని యీ స్క్రిప్టును మూడు సార్లు తిరగరాసింది. రెండున్నరేళ్లు పట్టింది. మాకింగ్ బర్డ్ సినిమా హడావుడిలో యీ వాచ్‌మన్ నవల మ్యాన్‌స్క్రిప్టు ఎక్కడో పోయింది. మళ్లీ గుర్తు చేసుకుని రాయాలన్న వూహ పోక హార్పర్ వూరుకుంది. నిజానికి మాకింగ్ బర్డ్ తర్వాత ఈమె కొన్ని నవలలు రాద్దామని ప్రయత్నించింది కానీ నచ్చక పక్కన పెట్టేసింది. కథలు కూడా రాయలేదు. చిన్న చిన్న వ్యాసాలు రాసిందంతే. హార్పర్ అక్క ఏలిస్‌తో కలిసి పనిచేసిన మరో లాయరు టోంజా కార్టర్ యిటీవలి కాలంలో హార్పర్‌కు చేరువై ఆమె వ్యవహారాలు చక్కబెట్ట సాగింది. ఆమె కారణంగా హార్పర్ కొన్ని వివాదాల్లో చిక్కుకున్నా, ఆమెనే నమ్ముకుంది. ఏలిస్ వృద్ధాప్యంతో 2014 నవంబరులో 103 వ యేట మరణించాక హార్పర్‌కు వేరే దిక్కు లేదు. ఈ టోంజా యీ 2014లో ఏవో కాగితాలు సర్దుతూంటే మాకింగ్ బర్డ్ మ్యానుస్క్రిప్టు కనబడింది. దానితో కలిపి కుట్టిన వాచ్‌మన్ మ్యానుస్క్రిప్టు కూడా కనబడింది. ఇప్పుడు దాన్ని వెలుగులోకి తెస్తే బాగుంటుందని నిర్ణయించింది. ఈ విషయం తెలియగానే హార్పర్ కాలిన్స్ వారు అమెరికా హక్కులు, పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ వాళ్లు యుకె కామన్‌వెల్త్ దేశాల్లో ప్రచురణ హక్కులు కొనేశారు. ఈ జులైలో పుస్తకం మార్కెట్లోకి రాబోతోంది. ఇవన్నీ హార్పర్‌కు తెలిసే జరుగుతున్నాయా, టోంజా తన యిష్టం వచ్చినట్లు చేసేస్తోందా అన్నది ఎవరికీ తెలియదు. టోంజాను నిలదీసేందుకు హార్పర్‌కు పిల్లలు లేరు. హార్పర్ పేర టోంజా పెడుతున్న కేసులు చూసి వూళ్లో వాళ్లందరూ టోంజాపై పగబట్టారు. ఫిర్యాదు చేశారు. అలబామా ప్రభుత్వం హార్పర్ విషయంలో 'ఎల్డర్ ఎబ్యూజ్' (ముసలివాళ్లను వేధించడం) జరుగుతోందా తెలుసుకోవాలని విచారణకు ఆదేశించారు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

## ఎమ్బీయస్ : మన్‌మోహన్ పట్ల జాలి పడాలా?

బొగ్గు కుంభకోణంపై విచారిస్తున్న స్పెషల్ సిబిఐ కోర్టు మన్‌మోహన్ సింగ్‌ను ఏప్రిల్ 8 న హాజరు కావాలని ఆదేశించింది. ఆయనపై పెట్టిన అవినీతి, నేరపూరిత కుట్ర యిత్యాది కేసులు రుజువైతే యావజ్జీవ కారాగార శిక్ష తప్పదు. టీవీ చర్చల్లో చాలామంది మన్‌మోహన్ సచ్ఛీలుడని అందరికీ తెలుసని, యితరుల ప్రమేయం వలన అనవసరంగా యిరుక్కున్నారని వాపోతున్నారు. కాంగ్రెసు పార్టీ అయితే చెప్పనే అక్కరలేదు. "మన్‌మోహన్ నిజాయితీపరుడని యావత్ భారతదేశానికి తెలుసు. ఇది రాజకీయపరమైన కుట్ర. మన్‌మోహన్‌కు అండగా నిలిచి పోరాడతాం." అంటోంది. నిద్ర లేవడానికి ఒక కారణం కనబడింది కాబట్టి లేచి హడావుడి చేస్తోంది.

2012 మార్చిలో కాగ్ రిపోర్టు వచ్చాక 2013 అక్టోబరులో సిబిఐ కుమార మంగళం బిర్లా, పిసి పరేఖ్‌లపై కేసు పెట్టింది. 2014 ఆగస్టులో యీ కేసులో ఎవరూ నేరానికి పాల్పడలేదంటూ ముగింపు నివేదికను సుప్రీం కోర్టు ఏర్పరచిన స్పెషల్ కోర్టుకు సమర్పించింది.

ఆ కోర్టు దాన్ని తిరస్కరించింది. మన్‌మోహన్‌ను ఎందుకు ప్రశ్నించలేదని అడిగింది. కేంద్రంలో ప్రభుత్వం మారడంతో సిబిఐ దృక్పథం, సిబిఐ కోర్టుల దృక్పథం మారినట్లుంది. ఇప్పుడు సిబిఐ ప్రత్యేక న్యాయస్థానాధిపతి భరత్ పరాశర్ 'మన్‌మోహన్‌ను నేరాభియోగంపై విచారించడానికి కావలసినన్ని ప్రాథమిక సాక్ష్యాధారాలున్నాయి' అంటున్నారు.

195 బొగ్గుగనుల కేటాయింపుల్లో అక్రమాల కారణంగా 2004-09 మధ్య ఖజానాకు 1.86 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని కాగ్ అభిప్రాయపడింది. ఇలాటి అక్రమ కేటాయింపులు ఎప్పణ్నుంచో జరుగుతున్నాయని భావించి సుప్రీం కోర్టు 1993 నుంచి జరిగిన 214 కేటాయింపును 2014 ఆగస్టులో రద్దు చేసింది. ప్రస్తుత కేసు ఒడిశాలోని తాలాబిరా కోల్ బ్లాక్ బొగ్గు బ్లాకుల గురించి. వాటిని బొగ్గు శాఖ స్క్రీనింగ్ కమిటీ ప్రభుత్వ సంస్థలైన నైవేలీ లిగ్నయిట్‌కు, మహానది కోల్‌ఫీల్డ్స్‌కు కేటాయించింది. దాంతో కుమారమంగళం బిర్లా తమకు చెందిన హిందాల్కోకు కేటాయించమని కోరుతూ మన్‌మోహన్‌ను కలిసి స్క్రీనింగ్ కమిటీ సిఫారసును మళ్లీ పరిశీలించమని కోరారు. అభ్యర్థనను ప్రధాని కార్యాలయం బొగ్గు శాఖ కార్యదర్శి పరేఖ్‌కు పంపించింది. పరేఖ్ హిందాల్కోకు యివ్వాలని సిఫారసు చేశారు. దీనిపై ప్రధాని కార్యాలయం మంత్రి దాసరి నారాయణరావు అభిప్రాయం అడిగింది. ఆయన వద్దన్నారు. స్క్రీనింగ్ కమిటీ తిరస్కరించాక నిర్ణయం మళ్లీ మార్చుకోవడం సరికాదన్నారు. చివరకు మన్‌మోహన్ పరేఖ్ సూచనే పరిగణనలోకి తీసుకుని హిందాల్కోకి కేటాయించారు. ఇప్పుడు సిబిఐ ప్రత్యేక కోర్టు దాసరిని యీ కేసులో చేర్చలేదు. ప్రాథమిక ఆధారాల బట్టి హిందాల్కో, కుమార మంగళం బిర్లా, అధికారులు శుభేందు భట్టాచార్య నేరపూరితమైన కుట్ర చేసి పరేఖ్‌ను, మన్‌మోహన్‌ను అందులోకి లాగారని కోర్టు అంటోంది. వారికి సమన్లు పంపింది. ప్రధాని కార్యాలయంలోని అధికారులైన టికెఏ నాయర్, బివిఆర్ సుబ్రహ్మణ్యంలపై కూడా కేసు పెట్టాలని సిబిఐకు గతంలోని సూచించింది - ఇదీ తెలుగు పత్రికలు చదివితే మనకు లభించే సమాచారం. దాసరికి వేరే కేసుల్లో యిప్పటికే బొగ్గు మసి అంటింది. క్విడ్ ప్రో కో అభియోగాలున్నాయి. ఆయన రూల్సు ప్రకారం వెళతాననడం, పరేఖ్ నియమాలు వుల్లంఘిస్తాననడం వింతగా తోస్తోంది కదా. పరేఖ్ మన రాష్ట్రంలో కూడా పనిచేశారు. నిజాయితీకి నిలువుటద్దంగా పేరు తెచ్చుకున్నారు. ఆయన పొరపాటెందుకు చేసి వుండాలి? అన్న సందేహం కలుగుతుంది.

ఈ అరకొర సమాచారం వలన కోల్‌బ్లాక్‌ను హిందాల్కోకు మొత్తంగా కేటాయించారన్న అభిప్రాయం కలుగుతోంది. జరిగినది ఒక్కసారి పునరావలోకనం చేసుకుంటే - పరేఖ్ నేతృత్వంలో స్క్రీనింగ్ కమిటీ తాలాబిరా 2, 3 బ్లాకులను ప్రభుత్వ సంస్థలైన నైవేలీ, మహానది కోల్‌ఫీల్డ్స్‌కు 2005 జనవరి 10 న కేటాయించింది. మార్చి 1 న హిందాల్కో, ఇండాల్ పెట్టుకున్న అప్లికేషన్లను తిరస్కరించింది. జూన్ 17 న కుమారమంగళం బిర్లా మన్‌మోహన్‌కు కలిసి తన వాదనను వినిపించాడు. తర్వాత పరేఖ్‌ను కలిశాడు. పబ్లిక్ సెక్టార్ యూనిట్ల కంటె తమకు ఆర్థిక, సాంకేతిక, నిర్వహణాసామర్థ్యం మెరుగ్గా వున్నాయని వాదించాడు. ఈ వాదన పరేఖ్‌ను మెప్పించింది. ఒక జాయింట్ వెంచర్ ఏర్పడాలని సూచించారు. దానిలో ప్రభుత్వసంస్థలైన మహానది కోల్‌ఫీల్డ్ (70%), నైవేలి లిగ్నయిట్ (15%)లకు కలిపి 85% వాటా వుండగా, హిందాల్కోకు 15% వాటా వుండాలని ప్రతిపాదించారు. ఇది 2005 నవంబరు 10 న జరిగింది. మామూలుగా చూస్తే యిది ఆచరణాత్మకమైన సూచనే అనుకుంటారు. దీనికి తోడు ఒడిశా ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ హిందాల్కోకు కేటాయిస్తే అల్యూమినియం ఫ్యాక్టరీ వచ్చి ఒడిశాలో ఉపాధి అవకాశాలు వస్తాయని, అదే నైవేలీకి యిస్తే బొగ్గు తవ్వుకుపోయి తమకు కాలుష్యం మాత్రమే మిగులుస్తుందని అభిప్రాయపడి హిందాల్కోకు యిమ్మనమని లేఖ రాశారు.

2013 అక్టోబరులో సిబిఐ తనపై కేసు బుక్ చేసినపుడు పరేఖ్ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ మీడియాకు చెప్పిన వాదన యిదే. ఇప్పుడు కూడా కోర్టు సమన్లు వచ్చాక మాట్లాడతాను కంగారేమీ లేదు అంటున్నాడు. ఈ వాదనను కోర్టు ఆమోదిస్తే అప్పుడు మన్‌మోహన్ కూడా తప్పించుకుంటారు. 'దాసరి కంటె పరేఖ్ పాలనాదక్షుడు కాబట్టి ఆయన మాటకు ఎక్కువ విలువ నిచ్చాను, ఆ పాటి నిర్ణయం తీసుకునే అధికారం నాకుంది, హిందాల్కో నుంచి నేను లంచం స్వీకరించినట్లు సిబిఐ రుజువు చేస్తే తప్ప నాకు దురుద్దేశం అంటగట్టలేరు' అని వాదిస్తాడు. ప్రస్తుత సమన్లు వచ్చాక హిందాల్కో కంపెనీ "తాలాబిరా 2, 3 బ్లాకులు ఎలాట్ చేయబడిన జాయింటు వెంచర్‌లో మా వాటా 15% మాత్రమే అయినా, మేం యిప్పటికే 13 వేల కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టాం. 2014 నుంచి బొగ్గు కేటాయింపులు ఆపేయడంతో బొగ్గు దిగుమతి చేసుకుని ఆ నష్టాన్ని కూడా భరిస్తున్నాం. మేం ఏ తప్పు చేయలేదు." అంటోంది. సిబిఐ స్పెషల్ కోర్టు మాత్రం తాలాబిరా 3 వ బ్లాకు గురించి మాట్లాడకుండా 2 వ బ్లాకు గురించే మాట్లాడుతూ, అది హిందాల్కోకు కేటాయించినట్లు చెపుతోంది. ఈ 2, 3 బ్లాకుల మర్మం, కేటాయింపు జాయింటు వెంచర్‌కా, హిందాల్కోకు మాత్రమేనా అన్న ధర్మసూక్ష్మం స్పష్టంగా తేలితే తప్ప మన్‌మోహన్ నిర్ణయం తప్పో కాదో తెలియదు. ఈ వివాదం చెలరేగినప్పుడు 2013 అక్టోబరు 19 న ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ద్వారా విడుదల చేసిన ప్రధాని కార్యాలయం బులెటిన్‌లో కూడా ప్రభుత్వసంస్థలకు 85% వాటా వున్న జాయింటు వెంచర్‌కు 2, 3 బ్లాకులు కేటాయించినట్లు స్పష్టం చేశారు. దానిలోంచి విడిగా ఒక ముక్క బయటకు లాగి చూస్తామంటే ఎలా? అందుకే సిబిఐ 'మన్‌మోహన్‌కు వ్యతిరేకంగా సాక్ష్యాలు ఏమీ లేవు' అంటూ స్పష్టం చేసి వుండవచ్చు.

ఏది ఏమైనా తక్కినవాళ్లు ఎత్తి చూపేదాకా ఆగకుండా మన్‌మోహన్ దేశప్రజలను విశ్వాసంలోకి తీసుకుని జరిగినదేమిటో ప్రకటించాలి. కేటాయింపు జాయింటు వెంచర్‌కు చేసినా, తర్వాత పరిణామాలు ఏం జరిగాయి? ప్రభుత్వ సంస్థలను తప్పించారా?

హిందాల్కోయే మొత్తమంతా తవ్వుకుపోతోందా? అది చెప్పకుండా మన్‌మోహన్ తనకు మినహాయింపు కావాలంటూ సుప్రీం కోర్టుకి వెళ్లడం, కాంగ్రెసు పార్టీలో హేమీహేమీలు కపిల్ సిబ్బల్, చిదంబరం, అభిషేక్ సింఘ్వీల చేత కేసు వాదింపచేసుకుని సమన్లు కొట్టించేసుకోవడం సబబు కాదు. కాంగ్రెసు పార్టీ మన్‌మోహన్ పక్షాన నిలుస్తాం అంటూ నిరసనలు చేపట్టడం వలన కుంభకోణం తప్పకుండా జరిగిందన్న నమ్మకం ప్రజల్లో మరింత గాఢంగా నాటుకుంటుంది. సాధారణ ప్రజలందరికీ తెలుసు – యుపిఏ పాలనలో అవినీతి విపరీతంగా జరిగిందని. మన్‌మోహన్ సొంతానికి డబ్బు తీసుకోలేదనీ, తన చేతికి మట్టి అంటుకోకుండా సోనియాయే ఆయన చేత అన్ని దిక్కుమాలిన పనులూ చేయించిందని కూడా ప్రజలు అనుకుంటారు. ఒకవేళ అదే నిజమైనా మన్‌మోహన్‌కు అదేమీ ఘనత కలిగించే విషయం కాదు. ఆయన ప్రజల పక్షాన ప్రధానమంత్రి. సోనియా యింటి పాలేరు కాదు. ప్రజాధనాన్ని కాపాడవలసిన మనిషి, దాన్ని దొంగలు ఎత్తుకుపోతూ వుంటే చూస్తూ వూరుకుంటే తప్పు కదా! ఇంటికి కాపలాగా పెట్టుకున్న సెక్యూరిటీ గార్డు పడి నిద్రపోతూ వుంటే మెచ్చి మేకతోలు కప్పుతామా? తన్ని తగిలేస్తామా? మొన్న ఎన్నికలలో అందుకే ప్రజలు కాంగ్రెసును చిత్తుగా ఓడించారు. మన్‌మోహన్ కేసులో ఆయన నిద్రపోలేదు, సోనియా చెపితే కళ్లు మూసుకుని కూర్చున్నాడు. ఆయన వ్యవహారశైలి గురించి సంజయ్ బారు రాసినది గుర్తు చేసుకోవాలి. 2009 ఎన్నికలు మన్‌మోహన్ గెలిచినవే. అప్పణ్నుంచి ఆయన 'నా యిష్టం వచ్చినట్లు వ్యవహరిస్తాను, లేకపోతే దిగిపోతాను' అనాల్సింది. దానికి బదులు ఆయన మరీమరీ కీలుబొమ్మగా అయిపోయాడు. ఎందువలన? పదవీవ్యామోహమా?

ఆ పదవిలో వుండి ఆయన కొన్ని రంగాల్లో కొన్ని మంచిపనులు చేయలేక పోలేదు. కానీ మొత్తం మీద బాలెన్స్ షీటు వేసి చూస్తే దేశానికి, ఆయన యిమేజికి జరిగిన నష్టమే ఎక్కువ. వ్యక్తిగతంగా ఆస్తులు వెనకేసుకోనప్పుడు, కీర్తి తెచ్చుకోనప్పుడు సోనియాయో, రాహులో చెప్పినట్లల్లా ఆడడం దేనికి? బ్లాక్‌మెయిల్ చేశారా? బ్లాక్‌మెయిల్‌కు గురయ్యేటంత తప్పేమీ చేశాడీయన? మామూలు పౌరుల కంటె విద్యావంతులకు సమాజం పట్ల బాధ్యత ఎక్కువ. వివేకానందుడి దగ్గర్నుంచి అందరూ అదే మాట చెప్పారు. ఉన్నతవిద్యను, ఉన్నతోద్యోగాలను, అంతర్జాతీయ కీర్తిని కట్టబెట్టిన మాతృదేశం పట్ల మన్‌మోహన్ వంటి మేధావి ఏ బాధ్యతా లేదా? కేవలం సోనియా చెప్పిన చోటల్లా సంతకం పెట్టడానికి ఆత్మ అమ్ముకోవాలా? ఈ కేసులో మన్‌మోహన్ దొరక్కపోవచ్చు, మరో దానిలో దొరకవచ్చు, దానిలో కూడా సిబిఐ ద్వారా ఏదో మతలబు చేయవచ్చు. ఫైళ్లు మాయం కావచ్చు. నా ఆఫీసుకి మట్టి అంటుకోకుండా దడి కట్టుకుని మడి పాటించాను కాబట్టి నేను సేఫ్ అని మన్‌మోహన్ అనుకోవడం దుర్మార్గం. కాబినెట్‌లో ఒక్కో మంత్రి జైలుకి వెళుతూ వుంటే వైకేరియస్ లయబిలిటీ (సంక్రమించే బాధ్యత) ఆయనకు వుండదా? ఈ కేసు బయటకు రాగానే కాంగ్రెసు పార్టీ చేసిన పాపాలకు మన్‌మోహన్ మూల్యం చెల్లించాల్సి వస్తోందని బిజెపి, దాని మిత్రపక్షాలు జాలి పడుతూ ప్రకటనలు చేశాయి. అలాటి ఆయనపై జాలి పడాలా? మరి యీ దేశప్రజలపై ఎవరు జాలిపడాలి? పాపాలు కాంగ్రెసు పార్టీ మాత్రమే కాదు, మన్‌మోహనూ చేశారు. ఎవరి పాపానికి వారు మూల్యం చెల్లించడం న్యాయం. గడుసువాళ్లు తప్పించుకుంటే తప్పించుకోవచ్చు.

అసలు యీ కేసులో మన్‌మోహన్‌కి సమన్లు యివ్వడంలోనే ఒక ప్లాను వుందేమో తెలియదు. అగాథా క్రిస్టీ నవల ఒకదానిలో ("మర్డర్ ఎట్ స్టయిల్స్" అనుకుంటా) ఒకడు హత్య చేస్తాడు. పోలీసులు ప్రాథమిక ఆధారాలతో అతనిపై కేసు పెట్టబోతారు. డిటెక్టివ్ అతను నిర్దోషి అని వాదిస్తాడు. పోలీసులు వదిలేస్తారు. డిటెక్టివ్ తన పరిశోధన కొనసాగించి తిరుగులేని సాక్ష్యాలు సంపాదించి, అప్పుడు పోలీసులను కేసు పెట్టమంటాడు. వాళ్లు తెల్లబోతారు – నువ్వేగా నిర్దోషి అని గతంలో చెప్పావ్? అని. అప్పుడు అతను వివరిస్తాడు – 'ఇంగ్లండ్ చట్టాల ప్రకారం ఒక వ్యక్తిపై ఒక అభియోగం రెండుసార్లు మోపలేం. అరకొర సాక్ష్యాలతో మీరు మొదట్లో పెట్టిన కేసు ముందుకు సాగితే కేసు వీగిపోయి, అతను నిర్దోషిగా విడుదల అయ్యేవాడు. ఎందుకంటే అవన్నీ అతను కల్పించిన తప్పుడు సాక్ష్యాలే. విచారణ సమయంలో వాటిని తిరగకొట్టే ఎలిబయ్‌లు అతను సిద్ధంగా పెట్టుకున్నాడు. ఒకసారి అతను బయటకు వచ్చేసిన తర్వాత ఎన్ని సాక్ష్యాలు దొరికినా అతన్ని బోనెక్కించలేరు. అందుకే అప్పుడు తప్పించాను.' అని. ఇప్పుడు మన్‌మోహన్‌పై పెట్టిన కేసులో జాయింటు వెంచర్‌కు 2, 3 బ్లాకులు ఎలాట్ చేశారని, హిందాల్కో ఒక్కదానికీ యివ్వలేదని తేలిందనుకోండి. అప్పుడు దురుద్దేశం అంటగట్టలేరు. ఎందుకంటే 85% వాటా ప్రభుత్వ సంస్థలదే. కేసు కొట్టేస్తే ప్రజలకు జాలి కలుగుతుంది. ఈ కేసు తర్వాత సవ్యమైన కేసు పెట్టినా అదీ బోగస్సే అనుకోగలరు. ఇదంతా రాజకీయ దురుద్దేశంతో సాగుతోంది అని కాంగ్రెసు గగ్గోలు పెట్టగలదు. జనతా పార్టీ పాలనలో చరణ్ సింగ్ యిలాగే అరకొర సమాచారంతో జీప్ స్కాండల్‌లో ఇందిరా గాంధీని అరెస్టు చేయించాడు. ఆమె నానా యాగీ చేసింది. చివరకు కేసు నిలవలేదు. ప్రజల సానుభూతి, జనతా పార్టీ అనైక్యత తోడై ఇందిరా గాంధీ 1980లో తిరిగి అధికారం చేపట్టింది. ఈ హిందాల్కో వ్యవహారంలో నా అనుమానాలకు కారణం – పరేఖ్ చూపుతున్న స్థయిర్యం! కేసు ముందుకు నడిచిన కొద్దీ స్పష్టత వస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి 51 – 56 వీక్లీకై విలోకనం 5 ఎమ్బీయస్ : తూర్పున చీట్ ఫండ్స్**

కితం ఏడాది శారదా స్కాము కుంభకోణం బయటకు వచ్చేవరకు తూర్పు రాష్ట్రాలైన త్రిపుర, అసాం, పశ్చిమ బెంగాల్, ఒడిశాలలో చిట్ ఫండ్స్, ఫైనాన్స్ కంపెనీల పేరుతో 8 ఏళ్లలో 194 కంపెనీలు కోటి మంది ప్రజల నుంచి రూ. 60 వేల కోట్ల దాకా సేకరించి

మోసగించారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అంటోంది. మనదేశంలో కావలసినన్ని బ్యాంకులు లేవు. లక్షమంది జనాభాకు చైనాలో 24 బ్యాంకులుండగా మన దేశంలో 11 మాత్రమే వున్నాయి. దేశంలో 35% మంది మాత్రమే బ్యాంకు ఖాతాలు కలిగి వున్నారు. బ్యాంకులున్నా బ్యాంకింగ్ సౌకర్యాలు, సేవలు తృప్తికరంగా వుండకపోవడంతో మధ్యతరగతి, పేద ప్రజలు అధిక వడ్డీకి ఆశపడి వీటిలో డబ్బు మదుపు పెడుతున్నారు. బలమైన ఆర్థికవనరులు కలిగిన బ్యాంకులు ఎక్కువలో ఎక్కువ 10% వడ్డీ మాత్రమే యివ్వగలుగుతుండగా యివి 15%-24% వడ్డీ యిస్తూ, పైగా తెచ్చిన డిపాజిట్‌లో 20% కమిషన్ ఏజంట్లకు ఎలా యివ్వగలుగుతున్నాయన్న ఆలోచనే వీరికి వుండటం లేదు. మాట యిచ్చిన ప్రకారం వీరికి వడ్డీ యివ్వాలంటే వారు 50% లాభం వచ్చే వ్యాపారం ఏదైనా చేయగలగాలి. అలాటి వ్యాపారం ఏముంటుంది? ఇలా ఆలోచించడానికి ఏజంట్లు వ్యవధి యివ్వరు. తమకు వచ్చే కమిషన్‌కు ఆశపడి వాళ్లు డిపాజిటర్లను ఊదరగొట్టేస్తారు. కొన్ని సందర్భాల్లో ఏజంట్లు తమ మాయలో తామే పడి, తమకు వచ్చిన కమిషన్, యింట్లో డబ్బు కూడా డిపాజిట్‌గా పెడతారు. కంపెనీ దివాలా తీసిన తర్వాత డిపాజిటర్లకు తేరగా దొరికేది ఏజంటు మాత్రమే. వారి చేతిలో అతను చావుదెబ్బలు తింటూ వుంటాడు. హతాశులై ఆత్మహత్యలు చేసుకున్న డిపాజిటర్ల సంఖ్య యీ నాలుగు రాష్ట్రాలలో కలిపి 106! సిబిఐ ఒడిశాలో 44 కేసులను, బెంగాల్‌లో 13 కేసులను బుక్ చేసింది. 46 మందిని అరెస్టు చేసింది.

దశాబ్దాలుగా అనేక ఫైనాన్స్ కంపెనీలు బోర్డు తిప్పేస్తున్నా కొత్తవాటిల్లో వీళ్లు అంత తెలివితక్కువగా ఎలా డబ్బు కడుతున్నారన్న సందేహం రావడం సహజం. ఈ కంపెనీలందరిదీ ఒకటే ఫార్ములా. మొదట అనేక వూళ్లల్లో ఒకేసారి బ్రాంచీలు తెరిచేస్తారు. ఎడాపెడా ఏజంట్లను నియమిస్తారు. డిపాజిట్ చేసినవారికి అధిక వడ్డీ యిస్తామని చెపుతూ మొట్టమొదటి వందమంది డిపాజిటర్లకు భూమి యిస్తామనో, హాలీడే ట్రిప్ యిస్తామనో చెప్తారు. అంతేకాదు, కొత్త మెంబరును చేర్పిస్తే దానిపై కమిషన్ యిస్తామని కూడా చెప్తారు. ఇలా ఆ కంపెనీ విస్తరిస్తూ పోతుంది. బ్యాంకులైతే తమ వ్యాపారపు లావాదేవీల్లో వచ్చిన లాభం నుంచి వడ్డీ చెల్లిస్తాయి. ఈ కంపెనీలు వ్యాపారం చేసేదేమీ వుండదు కాబట్టి డిపాజిట్లు చెల్లింపవలసిన సమయం వచ్చేసరికి కొత్త డిపాజిటర్లు కట్టిన డబ్బులోంచి పాతవాళ్లకు యిస్తూ వుంటారు. చాలా కేసుల్లో డబ్బు వెనక్కి యివ్వరు. 'వడ్డీతో సహా రెన్యూ చేసుకోండి. వడ్డీ మీద వడ్డీ వచ్చి ఇంకో రెండేళ్లు పోయేసరికి యింకా బోల్డంత వస్తుంది' అని ఏజంట్ల చేత చెప్పిస్తారు. ఆ విధంగా కంపెనీలోంచి డబ్బు బయటకు పోకుండా చూస్తారు. మరీ ఎవరైనా మొండికేస్తే డబ్బు యిచ్చేసి 'చూశావా, మామీద నమ్మకం లేక ఎంత వడ్డీ పోగొట్టుకుంటున్నావో' అంటారు. అలాటి సందర్భాల్లో వాళ్లు నాలిక కరుచుకుని మళ్లీ డిపాజిట్టు చేస్తూ వుంటారు కూడా. ఇలా అంతా కాగితాలపైనే నడుస్తుంది. ప్రమోటర్లు ఈ కంపెనీ నడుపుతూనే డబ్బు బయటకు లాగేసి, తమ పేర నడిచే వేర్వేరు వ్యాపారాల్లో పెట్టేస్తూ వుంటారు. ఆస్తులు సమకూర్చుకుంటారు. కంపెనీ పేర యాడ్స్ గుప్పిస్తూ, ఈవెంట్స్ నిర్వహిస్తూ ప్రచారంపై చాలా ఖర్చుపెడతారు. ఎప్పటికో అప్పటికి కొత్త డిపాజిటర్ల కంటె పాత డిపాజిటర్ల సంఖ్య ఎక్కువ అవుతుంది. అప్పుడిక క్యాష్ ఫ్లోకు యిబ్బంది వస్తుంది. ఎవరైనా ఒక్క పాత డిపాజిటరుకు డబ్బు చెల్లించకపోతే చాలు, అందరూ ఆందోళనకు గురై, డబ్బిచ్చేయమని ఒక్కుమ్మడిగా మీద పడతారు. అలా పడితే మహామహా బ్యాంకులే తట్టుకోలేవు. ఇక యీ కంపెనీల మాట చెప్పనే అక్కరలేదు. వెంటనే ప్రమోటర్లు ఆసుపత్రి పాలవడమో, ఆత్మహత్యా ప్రయత్నం చేయడమో, జైలుకి వెళ్లి కూర్చోవడమో చేస్తారు. డిపాజిటర్లు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపడతారు. ప్రభుత్వం మోసగాళ్ల కొమ్ము కాస్తోందని ఆరోపిస్తారు. సిబిఐకి అప్పగించమంటారు.

ఇదంతా జరుగుతూంటే వీరిని నియంత్రించవలసిన ఆర్‌బిఐ, సెబి వంటి సంస్థలు ఏం చేస్తున్నాయన్న సందేహం వస్తుంది. వీళు 'ఆర్‌బిఐ చేత ఆమోదించబడినది' అని పోస్టర్లు వేసి గోడ కతికించినా, కరపత్రాలు పంచినా ఆర్‌బిఐ ఉలకదు, పలకదు. ఆ విధంగా వీళ్లు అధికారులను మేనేజ్ చేస్తారు. ఈ మోసగాళ్లలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రభుత్వాధికారులు, బ్యాంకు అధికారులు వుంటున్నారు. కంపెనీలు తమ డిపాజిట్లపై చిన్న అక్షరాల్లో ఆర్‌బిఐ రూల్సు వర్తించవని రాస్తాయి. వాటిని చదివేవారు ఎవరూ వుండరు. అంతా అయిపోయాక అప్పుడు యీ సంస్థలు రంగంలోకి దిగుతాయి. సిబిఐ పట్టుకున్న చేపల్లో కొన్నిటిని పరికిస్తే వీటి వ్యవహారంపై ఒక అవగాహన కలుగుతుంది. అసాం, ఒడిశాలలో పెట్టిన రోజ్ వ్యాలీ గ్రూపు రియల్ ఎస్టేటు, హెూటళ్లు, టేకు ప్లాంట్లు వ్యాపారం చేస్తున్నామంటూ 2006-14 మధ్య సేకరించిన డిపాజిట్లు రూ.15 వేల కోట్లు. దానిలో యిన్వెస్టర్లకు, ఏజంట్లకు తిరిగి యిచ్చిన మొత్తం కేవలం రూ. 20 కోట్లు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) ఫ్రీజ్ చేసిన లిక్విడ్ ఎసెట్స్ (క్యాష్ వంటివి) విలువ రూ.300 కోట్లు. తక్కిన కోట్లు ఏమైనట్లు? అలాగే ఒడిశాకు చెందిన సీషోర్ గ్రూప్ - కిరాణా వ్యాపారంలో ఫ్రాంచైజీ వ్యాపారం. ఆరోగ్యం, పర్యటన, కోఆపరేటివ్ రంగాలలో ఒడిశా ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఎంఓయులు చేసుకోవడంతో ప్రజల విశ్వాసం చూరగొంది. 2008-13 మధ్య సేకరించిన మొత్తం రూ.1500 కోట్లు. ఇన్వెస్టర్లకు తిరిగి యిచ్చినది రూ.10 కోట్లు! ఒడిశాకే చెందిన అర్థ తత్వ గ్రూపు ఇన్సూరెన్సు, హౌసింగ్ వగైరా వ్యాపారం అంటూ 2010-12 మధ్య సేకరించినది రూ.500 కోట్లు, తిరిగి యిచ్చినది రూ.30 లక్షలు! బెంగాల్‌కు చెందిన ఎంపిఎస్ గ్రీనరీ డెవలపర్స్ ప్లాంటేషన్ బిజినెస్ అంటూ 2010-13 మధ్య సేకరించినది రూ.500 కోట్లు, తిరిగి యిచ్చినది రూ.25 లక్షలు! ఒడిశాకే చెందిన మైక్రో ఫైనాన్స్ లిమిటెడ్ 2007-10 మధ్య రూ.500 కోట్లు సేకరించి రూ.20 లక్షలు తిరిగి యిచ్చింది.

ఒడిశాలో చాలా మోసాలు జరగడానికి కారణం ఒకటుంది. సెల్ఫ్‌హెల్ప్ (స్వయంసహాయక) కోఆపరేటివ్ యాక్ట్ అని ఒడిశా

ప్రభుత్వం 2001లో చేసి, సహకార పద్ధతిలో ఋణం తెచ్చుకునేందుకు దోహదపడ్డాననుకుంది. ఎందుకంటే చిట్‌ఫండ్‌లో వున్న సౌకర్యం ఏమిటంటే డబ్బు దాచుకున్న ప్రజలే అవసరం బట్టి దానిలోంచే అప్పు తీసుకుంటారు. వాళ్లే ఋణదాతలు, వాళ్లే ఋణగ్రస్తులు. 50 మంది సమూహంగా ఏర్పడి ఒకరి అవసరాలకు మరొకరు వుపయోగపడతారు. కానీ చట్టంలో లోపాలను వుపయోగించుకుని 979 కంపెనీలు పుట్టుకుని వచ్చి ప్రజల్ని దోచాయి. దాంతో ఆ చట్టాన్ని రద్దు చేశారు. ఇవి చూసి దేశంలోని చిట్‌ఫండ్ కంపెనీలన్నీ చీటింగ్ కంపెనీలనుకోవడం పొరబాటు. చిట్ ఫండ్ రంగం 10 వేల కంపెనీలతో ఏటా రూ. 35వేల కోట్ల బిజినెస్ చేస్తుంది. అన్నిటికంటె పెద్దది 1969లో స్థాపించిన కేరళ ప్రభుత్వం నడిపే కెఎస్ఎఫ్ఇ (కేరళ స్టేట్ ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైజెస్)!
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి వీక్లీకై న్యూస్ వ్యూస్... ఎమ్బీయస్ : బుల్లెట్ ట్రైన్స్ వచ్చేనా?**

బుల్లెట్ ట్రైన్‌గా మనం వ్యవహరిస్తూండే హై స్పీడ్ రైల్ గురించి మనదేశంలో పదేళ్లగా ఆలోచనలు సాగుతున్నాయి. అయినా ఫీజిబిలిటీ స్థాయి దాటి ముందుకు వెళ్లలేదు. అభివృద్ధి పథంలో ఇండియా దూసుకుపోతోంది అనే హైపర్ యిమేజి ఏర్పడాలంటే హైస్పీడ్ రైళ్లు అత్యవసరం అని మోదీ భావించి, వాజపేయి రూపొందించిన స్వర్ణచతుర్భుజి కంటె మెరుగ్గా వజ్రచతుర్భుజిని (2020 నాటికల్లా నాలుగు మెట్రో సిటీలను నిలువుగా, అడ్డంగా ఆరు హై స్పీడు రైలు కారిడార్ల ద్వారా కలుపుతూ మొత్తం 10 వేల కి.మీ. దూరం కవర్ చేయడం) ప్రతిపాదించి, దానిపై దృష్టి పెట్టడంతో అవి మళ్లీ చర్చనీయాంశాలయ్యాయి. ఒక పక్క చూస్తే కొత్త రైల్వే మార్గాలకు డబ్బు లేదంటున్నారు. ఎప్పుడో అనుమతించిన రైలుమార్గాలకు సర్వే కూడా పూర్తి చేయలేదు. దేశంలో అనేక ప్రాంతాలకు కనెక్టివిటీ లేదు. కొన్ని మార్గాల్లో రద్దీ ఎక్కువై పోయింది. వాటికి ప్రత్యామ్నాయంగా వేయవలసిన రైలు మార్గాలు రూపు దిద్దుకోలేదు. ఇంజన్లు లేవు, కోచ్‌లు లేవు, కోచ్ ఫ్యాక్టరీలు శాంక్షన్ చేయటం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైలు టిక్కెట్ల ధర పెంచకూడదన్న విధానం చాలా ఏళ్లగా అమల్లో వున్న కారణంగా నిధులు సరిపోక భద్రతపై రాజీ పడడంతో అనేక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. జనావాసాల వద్ద వున్న వేలాది రైల్వే క్రాసింగ్‌లకు కాపలా లేక ప్రజలు రైళ్ల కింద పడుతున్నారు. రైళ్లలో నీటివసతి లేదు, మరుగుదొడ్లు అసహ్యంగా వుంటున్నాయి. సికింద్రాబాద్ వంటి బోల్డంత డబ్బు వచ్చే రైల్వే స్టేషన్లకు సమకూరుస్తామన్న స్థాయి యిప్పటిదాకా సమకూర్చలేదు. ఇలాటి పరిస్థితుల్లో యీ హైస్పీడ్ రైళ్లు అవసరమా? ఒకవేళ కొన్ని మార్గాలలో ప్రవేశపెట్టినా నడపగలమా? ప్రజలు ఆ టిక్కెట్టు ఖరీదు తట్టుకోగలరా? ఎక్కడం మానేస్తే వాటి గతి ఏమిటి? – యిలా అనేక ప్రశ్నలు వుదయిస్తున్నాయి.

గంటకు 300 కి.మీ.ల దూరం వెళ్లే రైళ్లను హైస్పీడు రైళ్లంటారు. ఆ రైల్వే ట్రాకుకు అటూ యిటూ ఫెన్సింగ్ అత్యవసరం. ఇప్పుడున్న ట్రాక్‌లు వాటి స్పీడు తట్టుకోలేవు కాబట్టి కొత్తగా వేయవలసిందే. కొత్తవాటిపై ఖర్చులో నాలుగో వంతు పెడితే పాత మార్గాలను దృఢతరం చేసి సెమి-హైస్పీడు రైళ్లు పెట్టవచ్చు. ఢిల్లీ-ఆగ్రా రూటులో గతిమాన్ ఎక్స్‌ప్రెస్ ఎప్పుడో శాంక్షన్ అయినా రైల్వే సేఫ్టీ కమిషన్ నుండి అనుమతి రాక ఆగిపోయింది. మరి యీ హై స్పీడు రైళ్ల సేఫ్టీ గురించి ఎవరు గ్యారంటీ యిస్తారో తెలియదు. 2019 ఎన్నికల కల్లా మొదటి బుల్లెట్ ట్రైన్ పరుగులు తీస్తుందని, దాన్ని చూపించి భారత్ అభివృద్ధి చెందిందని అనుకుందామని అనుకునేవారికి నిరాశ తప్పదు. ఎందుకంటే ఒక కారిడార్ పూర్తి చేయడానికి కనీసం పదేళ్లు పడుతుందంటున్నారు నిపుణులు. రైల్వే మంత్రి సురేశ్ ప్రభు ఫీజిబిలిటీ స్టడీలను విదేశాలకు అప్పగించారు. ముంబయి-అహ్మదాబాదు రూటుని జపాన్ వాళ్లు స్టడీ చేస్తున్నారు. ఢిల్లీ-చెన్నయ్ లింకును చైనా వాళ్లు చేస్తున్నారు. బుల్లెట్ ట్రైన్‌కు కావలసిన యిన్‌ఫ్రాస్ట్రక్చర్ ఖర్చు కి.మీ.కు ఎంత ఖర్చవుతుందో కచ్చితంగా ఎవరూ చెప్పడం లేదు. రూ180- రూ.250 కోట్ల దాకా ఎవరి అంచనా వారిది. ముంబయి-అహ్మదాబాద్ మధ్య వున్న 534 కి.మీ.లకు మొత్తం ఖఋ్చు కనీసం రూ.90 వేల కోట్లు అవుతుందని యిప్పుడు అంటున్నారు. జనసమ్మర్దంగా వుండే ముంబయి శివార్లలోకి వచ్చాక నడవాల్సిన 60 కి.మీ.లకు స్థలసేకరణకు, యితర ఖర్చులకే చచ్చేటంత ఖర్చు అవుతుందని రైల్వే అధికారులు అంటున్నారు. అలా అని సిటీకి దూరంగా కడితే ఎక్కువమంది వుపయోగించలేరు. వీటి నిర్వహణ ఖర్చు కూడా తడిసి మోపెడవుతుంది. ముంబయి-అహ్మదాబాద్ హీ స్పీడు రైలుకి ఎంతవుతుందని పార్లమెంటులో అడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా కితం ఏడాది రైల్వే శాఖ చెప్పిన ప్రకారం 2021 (అంటే మొదలెట్టిన సంవత్సరం) ఆదాయం రూ.2499 కోట్లు, నిర్వహణ ఖర్చు రూ.412 కోట్లు అవుతుంది. ఇది 2010లో వేసిన అంచనా ప్రకారం యిచ్చిన గణాంకాలు. ఆ తర్వాత ద్రవ్యోల్బణం ఎలా వుందో మనకే తెలుసు. మరి దీన్ని ప్రయాణీకుల నుండే రాబట్టాలి. హైస్పీడు రైలు టిక్కెట్లు సాధారణంగా ఎలా వుంటాయి? ఫస్ట్ క్లాసు టిక్కెట్టు విమానప్రయాణానికి సమానంగా వుంటుంది. సెకండ్ క్లాసు దాని కంటె కాస్త తక్కువగా, థర్డ్ క్లాసు మామూలు ఎసి సెకండ్ క్లాసు టిక్కెట్టుతో సమానంగా వుంటుందని అంచనా. చౌక విమానయానం యీలోపుగా వూపందుకుంటే యీ పోలికలు పనికి రావు.

ఈ రూట్లలో ఢిల్లీ-చెన్నయ్ కారిడార్ అన్ని రకాలుగా అనవసరం అంటారు – రైల్వే బోర్డు మెంబరుగా పని చేసిన డిపి పాండే. ''ఈ ప్రయాణం 10 గంటలు పడుతుంది. విమానం టిక్కెట్టంత ఖఋ్చు పెట్టుకుని టైము కూడా కలిసి రాకపోతే, ఎవరెక్కుతారు?'' అంటాడాయన. 400 కి.మీ.-800 కి.మీ.ల మధ్య దూరం వున్న రూట్లకి పరిమితమైతేనే మంచిది. గంటకు 300 కి.మీ.లు

ప్రయాణం చేస్తుంది కాబట్టి 2-3 గంటల్లో ప్రయాణం ముగిసిపోతుంది. ఎయిర్‌పోర్టుకి వెళ్లే టైము, చెకింగ్ టైము యిలాటివి కలిసి వస్తాయి. అంతకంటె ఎక్కువ దూరమైతే విమానాల్లోనే వెళతారు అంటాడాయన. ప్రపంచంలో యూరోస్టార్ వంటి అతి కొద్ది హైస్పీడు రైళ్లు తప్ప తక్కినవన్నీ నష్టాల్లో నడుస్తున్నవే. ప్రభుత్వాలు సబ్సిడీ యిచ్చి వాటిని నడిపించాల్సి వస్తోంది. వీటి కంటె విమానాశ్రయాలను పెంచి, యూజర్ చార్జీలు తగ్గిస్తే ప్రజలు విమానాలకే మొగ్గు చూపుతారు. ధనిక దేశాలలో మధ్యతరహా దూరాలలో (450-500 కిమీ), జనసమ్మర్దం బాగా వున్న ప్రాంతాలలో నడిచే హైస్పీడు రైళ్లను చూసి ముచ్చటపడి వాటిని మన దేశంలో తెద్దామని చూడడంలోని విజ్ఞతను నిపుణులు ప్రశ్నిస్తున్నారు. 1965 ప్రాంతంలో మొదలుపెట్టిన జపాన్‌లో టోక్యో-ఒసాకా-క్యోటో రూటు ట్రాఫిక్, టారిఫ్, దూరం దృష్ట్యా అందరికీ రోల్‌మోడల్ ఐంది. దక్షిణ కొరియాలో నడిచే సీవోల్-బుశాన్ కారిడార్ జనాభాలో 75%ను కవర్ చేస్తుంది. స్పెయిన్‌లో మొదలుపెట్టిన హైస్పీడు రైలు ప్రాజెక్టు ఆర్థికమాంద్యంతో మందగించింది. ఇంగ్లండులో తక్కువతక్కువ దూరాల్లో నడుస్తుంది. టిక్కెట్టు ఖరీదు చాలా ఎక్కువ. ఫ్రాన్సు ప్రభుత్వం వీటిని ప్రోత్సహించడానికి సబ్సిడీలు యివ్వవలసి వస్తోంది. సకల సౌకర్యాలు వున్న అమెరికాలో యీ రైళ్లపై చాలాకాలం విస్తృతచర్చ జరిగి చివరకు జనసాంద్రత ఎక్కువగా వున్న లాస్ ఏంజిలిస్-శాన్‌ఫ్రాన్సిస్కో రూటు, ఫిలడెల్ఫియా-బోస్టన్-న్యూయార్క్-వాషింగ్టన్ డిసి కారిడారు ఆమోదించారు.

చైనాలో దూరప్రాంతాలకూ నడుస్తున్నాయి. కానీ చైనాది స్పెషల్ కేస్. వాళ్లు ప్రపంచానికి కన్ను కుట్టేలా హైస్పీడు రైళ్లు 10 వేల కి.మీల దూరం నడుపుతున్నారు. కానీ గమనించ వలసినదేమిటంటే ఇండియాలో 65 వేల కి.మీ.ల మేర రైల్వే లైను వుండగా చైనాలో 20 వేల కి.మీ. రైల్వే లైను మాత్రమే వుంది. చైనాలో మొత్తం రైలు ప్రయాణీకులు రోజుకి 60 లక్షలమందైతే వారిలో హైస్పీడు రైలు ఎక్కేవారు 20 లక్షలు. మరి మన దేశంలో రోజుకి సాధారణ రైళ్లల్లో 120 లక్షల మంది, సబర్బన్ రైళ్లలో మరో 120 లక్షల మంది ప్రయాణిస్తారు. ఆ లోటును అధిగమించడానికి చైనా వాళ్లు ఒక్కసారిగా హైస్పీడు మార్గం పట్టారు. దానికి అయిన వ్యయమెంతో, నిర్వహణాభారమెంతో అంతా గోప్యం. 968 కి.మీ.ల ఉహాన్-గ్యువాంగ్‌ఝౌ కారిడార్‌కు 19 బిలియన్ డాలర్ల కంటె ఎక్కువ ఖర్చయిందని కానీ ఆ రూటులో ట్రాఫిక్ తక్కువగా వుందనీ అంటున్నారు. 117 కి.మీ.ల బీజింగ్-టియాన్‌జిన్ మార్గం ఏటా 2 కోట్లమందిని వుపయోగించుకుంటున్నారు. అది 3 కోట్లు అయితే తప్ప కిట్టుబాటు (బ్రేక్ యీవెన్) కాదుట. అనేక మార్గాలలో టిక్కెట్టు ధర తగ్గించి, ప్రయాణీకులను ఆకర్షిద్దామని చూస్తున్నారు. తగ్గించిన రేట్లలో కూడా వెళ్లే స్తోమత చైనీయులలో చాలామందికి లేదు. తూర్పుతీరంలోని ఎక్స్‌పోర్టు జోన్లలో పనిచేసే కార్మికులు కొత్త సంవత్సరం వేడుకలకు యింటికి వెళ్లడానికి యీ రైళ్ల కంటె బస్సుల్నే ఎంచుకున్నారు. వారి కోసం 70 వేల బస్సులు అదనంగా వేయవలసి వచ్చింది. ప్రయాణీకుల ఆదరణ సరిపోక చైనా రైల్వేకు ఏటా 1.46 బిలియన్ డాలర్ల నష్టం వస్తోందట, 318 బిలియన్ డాలర్ల అప్పు వుందట. మన దేశానికైతే అంత అప్పు భరించే తాహతు లేదు. 90% మంది నాన్-ఏసి, సాధారణ తరగతుల్లోనే ప్రయాణించే మన ప్రజలకు హైస్పీడు రైలు టిక్కెట్టు కొనే స్తోమత లేదు. ఇప్పటి అంచనాల ప్రకారం హైస్పీడు రైళ్లలో కి.మీకి రూ.8 చార్జ్ వుండే అవకాశం వుందట. అంటే ముంబయి-అహ్మదాబాదు టిక్కెట్టు రూ.3200 వుండవచ్చు. ఈ రేటులో ఎందరు వెళతారు అన్నదే భయం కొల్పుతున్న ప్రశ్న. ఈ రైళ్లు తయారుచేసే టెక్నాలజీ కోసం మనం చైనా లేదా జపాన్ సాయం తీసుకోవాల్సిందే. నిధులు కూడా వారే సమకూర్చాలి. మరి వారు ఎలాటి షరతులు విధిస్తారో తెలియదు. భూసమీకరణ అనేది పెద్ద ప్రతిబంధకం. కొత్త ఆర్డినెన్సు ద్వారా రైతులనుండి భూమి సేకరించి వారి చేతిలో పెడితే 'స్వదేశీ' అంటే యిదేనా అని ప్రతిపక్షాలే కాదు, బిజెపి, ఆరెస్సెస్ అభిమానులే ప్రశ్నిస్తారు.

**- ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి 51 వీక్లీకై విలోకనం 5 ఎమ్బీయస్ : తమిళనాడు కొంప ముంచిన ఉచితాలు**

2011 ఎన్నికల సభలలో జయలలిత డిఎంకె ప్రభుత్వం యిస్తున్న ఉచితపథకాలను విమర్శిస్తూ తమిళనాడులో పుడుతున్న ప్రతి బిడ్డ కళ్లు తెరిచేలోగా తలపై రూ.15000 అప్పుతో పుడుతున్నాడని ఎత్తిచూపారు. ఆమె వచ్చిన తర్వాత వాటిని తగ్గిస్తుందేమోననుకుంటే తగ్గించలేదు కదా 20% పెంచింది. వాళ్లు అధికారంలోకి వచ్చాక యిచ్చిన ఉచిత పథకాలపై, సబ్సిడీలపై రూ. 78 వేల కోట్లు ఖర్చయాయి. 2014-15 సంఎకి అయిన ఖఋ్చు రూ.19,486 కోట్లు. (అంచనా). వాళ్లు ఉచితంగా యిచ్చే వస్తువుల జాబితా - మిక్సీలు, వెట్ గ్రైండర్, ఫ్యాన్, లాప్‌టాప్, మంగళసూత్రాలు, పంచె, చీర, స్కూలు యూనిఫారంలు, బస్సుపాసులు, అచ్చుపుస్తకాలు, ఆవులు, గొఱ్ఱెలు, సైకిళ్లు, శానిటరీ నాప్‌కిన్స్... చూస్తే యింతెందుకు అయిందో అర్థమవుతుంది. ఈ పథకాలు సరిగ్గా అమలవుతున్నాయో లేదో చూసేందుకు ఏర్పరచిన ప్రత్యేక శాఖపై పెట్టిన ఖర్చు రూ.6 కోట్లు. ఈ ఉచితాలు యిచ్చే ఆర్థికబలం రావడానికి ప్రభుత్వసంస్థల సామర్థ్యం మెరుగు పరుచుకుని వుంటే బాగుండేది. కానీ అది జరగటం లేదు. 2012-13 కాగ్ వారి నివేదిక ప్రకారం 77 పబ్లిక్ సెక్టార్ యూనిట్లలో 11 ఏ మాత్రం ఆదాయం గడించటం లేదు. 40 యూనిట్లు కలిపి ఆర్జించినది - రూ.512 కోట్లు. 20 యూనిట్లు కలిసి మూటకట్టుకున్న నష్టం దానికి 16 ప్లస్ రెట్లు - రూ. 8548 కోట్లు. సరిగ్గా మేనేజ్ చేసి వుంటే రూ.4 వేల కోట్ల నష్టాన్ని అరికట్టగలిగేవారని కాగ్ అభిప్రాయం. అన్నిటికంటె పెద్ద యూనిట్ అయిన తమిళనాడు ఎలక్ట్రిసిటీ బోర్డు రెవెన్యూ నష్టం రూ.5 వేల కోట్లు. గత మూడేళ్లలో దాని అప్పు రూ.72 వేలకు చేరింది. ఇక రోడ్డు ట్రాన్స్‌పోర్టు నష్టాలు రూ. 2 వేల కోట్లు. అది

ఎంత దీనావస్థలో వుందంటే కోర్టులో ఎటాచ్ అయిన బస్సులకు జరిమానా కట్టి విడిపించుకునే స్థితిలో కూడా లేదు.

ప్రభుత్వం పనితీరు మెరుగుపడందే పరిస్థితులు బాగుపడవు. అక్టోబరు నుంచి పేరుకు మాత్రమే ముఖ్యమంత్రిగా వున్న పన్నీర్ శెల్వం ఏ నిర్ణయమూ తీసుకోడు. అసలు ముఖ్యమంత్రి ఆఫీసుకే వెళ్లకుండా తన పబ్లిక్ వర్క్స్ మినిస్ట్రీ ఆఫీసు నుండే పనిచేస్తున్నాడు. ప్రతీ ఫైలు కాపీ పోయెస్ గార్డెన్‌లోని వేదనిలయానికి వెళుతుంది. అది జయలలిత నివాసం. అక్టోబరు 20 న బెయిలులో విడుదలయ్యాక ఆమె అక్కడే వుండి బయటకు రావడం లేదు. ఒక ఆరుగురి సహాయంతో ఆమె ఫైళ్లు చూసి తన నిర్ణయాన్ని ఒక కాగితంపై పెన్సిల్‌తో రాసి పంపుతుందట. రాష్ట్రప్రభుత్వపు కార్యాలయాలన్నిటిలో ఆమె ఫోటోయే వుంది – రిపబ్లిక్ డే పెరేడ్ పోస్టర్లతో సహా! పన్నీర్ శెల్వం ఫోటో ఎక్కడా వుండదు, జనవరి 16 న జరిగిన ప్రభుత్వ కార్యక్రమపు ఆహ్వానపత్రంతో సహా! ఇక మంత్రులు చెలరేగిపోతున్నారు. వ్యవసాయశాఖలో తిరునల్వేలిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న ముత్తు కుమారస్వామి అనే ఆయన తన శాఖలో డ్రైవర్లుగా నియమించడానికి జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసు నుంచి సీనియారిటీ ప్రాతిపదికపై నలుగురు వ్యక్తులను ఫైనలైజ్ చేసి, జాబితా తయారుచేశాడు. అంతలో వ్యవసాయశాఖ మంత్రిగా వున్న కృష్ణమూర్తి దాన్ని పక్కన పెట్టేసి, తన జాబితాలోని వాళ్లకు యిమ్మనమని చెప్పాడు. నిజాయితీపరుడుగా పేరున్న కుమారస్వామి అది కుదరదన్నాడు. మంత్రి అతన్ని బెదిరించసాగాడు. ఆర్నెల్లలో రిటైరు కాబోతున్న కుమారస్వామి యీ ఒత్తిడి తట్టుకోలేక ఒక రైలు కింద పడి ఫిబ్రవరి 20న చచ్చిపోయాడు. అతని సహచరులు, ప్రతిపక్షంవారు ఆందోళన చేయడంతో ఎడిఎంకె కృష్ణమూర్తిని మొదట పార్టీ పదవి నుంచి, తర్వాత మంత్రిపదవి నుంచి తప్పించింది. ఈ సంఘటన వలన రాష్ట్ర నాయకత్వం అధికారులను స్వతంత్రంగా పనిచేయనీయటం లేదని లోకానికి తెలియవచ్చింది.

పారిశ్రామికవేత్తలకు యిదంతా యిబ్బందికరంగానే వుంది. గత రెండేళ్లలో ఒక్క పరిశ్రమ కూడా కొత్తగా రాష్ట్రానికి రాలేదు. యమాహా వాళ్లు 2013లో రూ.1500 కోట్లు పెట్టి కాంచీపురంలో పెట్టిన ప్లాంట్ తయారైంది. జయలలిత చేత ప్రారంభింప చేస్తామంటే ఆవిడ ఎపాయింట్‌మెంటే యివ్వటం లేదు. చూసిచూసి వాళ్లే జనవరిలో ఆపరేషన్స్ మొదలుపెట్టేశారు. శ్రీపెరంబుదూరు ఎలక్ట్రానిక్ హబ్ నుండి నోకియా తప్పుకోవడం పారిశ్రామిక రంగానికి పెద్ద కుదుపే. ఇలాటి పరిస్థితుల్లో రూ.లక్షకోట్ల పెట్టుబడులు ఆహ్వానించడానికి గ్లోబల్ యిన్వెస్టర్ల మీట్ పెట్టింది తమిళనాడు ప్రభుత్వం. ముహూర్తం ఎప్పుడంటే మే నెలలో! అప్పటిదాకా ఎందుకు అంటే జయలలిత బెయిలు గడువు ఏప్రిల్ 18కి ముగిసిపోతుంది. ఆలోగా ఆమెపై కేసులు కొట్టివేస్తారని వాళ్ల ఆశ!

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి వీక్లీకై న్యూస్ వ్యూస్... ఎమ్బీయస్ : మహాన్‌లో ఎస్సార్ పవర్ ప్రాజెక్టు**

దేశంలో ఎక్కడ పవర్ ప్రాజెక్టు పెట్టినా ఏదో ఒక వివాదం తప్పదు. పునరావాసం సరిగ్గా జరగలేదన్న నింద తప్పదు. అందువలన మహాన్ ప్రాజెక్టు గురించి కూడా మనం పెద్దగా పట్టించుకునేవారం కాదు. కానీ అక్కడ గిరిజనులకు నష్టం జరిగిందన్న వాదనను ఇంగ్లండు ఎంపీల ముందు వినిపించడానికి వెళ్లబోయిన 'గ్రీన్‌పీస్' కార్యకర్త ప్రియా పిళ్లయ్‌కు కేంద్ర హెూం శాఖ వీసా తిరస్కరించడంతో, గ్రీన్‌పీస్ బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడంతో అందరి దృష్టీ దీనిపై పడింది. మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలీ జిల్లా కేంద్రానికి 35 కి.మీ.ల దూరంలో మహాన్ ప్రాంతం వుంది. అక్కడ మంచి నాణ్యమైన బొగ్గు దొరుకుతుంది కాబట్టి 1975 ప్రాంతాల నుండి బొగ్గు తవ్వకాలు మొదలై 1977లో మొదటి పవర్ ప్లాంట్ వచ్చింది. అక్కడ మరింతగా విస్తరించడానికి ఎస్సార్ పవర్, హిందాల్కో కలిసి జాయింటు వెంచర్‌గా ఏర్పడి 2006లో ఒక కోల్ బ్లాక్ ఎలాట్ చేయించుకున్నాయి. చకచకా పనులు పూర్తి చేసుకుంటూ పోయి, 2010 కల్లా ఎస్సార్ చైర్మన్ పవర్ ప్లాంట్ పని 65% పూర్తయిందని మన్‌మోహన్ సింగ్‌కు ఉత్తరం రాశాడు. వెంటనే పర్యావరణ శాఖ చూసే మంత్రి జయరాం రమేష్ తగులుకున్నాడు – అనుమతులు అన్నీ రాకుండా మీరు ప్లాంట్ నిర్మాణం ఎలా చేపట్టారు? అంటూ.

ఎందుకంటే అక్కడ చుట్టూ వున్న అడవుల్లో 5 లక్షల సాల్ వృక్షాలున్నాయి. ఎన్‌టిపిసి, ఎన్‌సిఎల్, రిలయన్స్, హిండాల్కో, జేపీ సంస్థలు నాలుగు దశాబ్దాలగా మైనింగ్ చేస్తున్న కారణంగా జిల్లాలో వున్న అడవుల్లో మూడో వంతు యిప్పటికే నాశనమయ్యాయి. వాటిని పరిరక్షించవలసిన అవసరం వుంది. పునరావాసం కల్పిస్తామని చెప్పిన కంపెనీలు వాటి గురించి శ్రద్ధ పట్టలేదు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని పర్యావరణ మంత్రిత్వశాఖ మహాన్ ప్రాజెక్టు ముందుకు వెళ్లడానికి వీల్లేదు అని తేల్చి చెప్పింది. అబ్బే ఆ అడవులంత ముఖ్యమైనవి కావు, మా ప్రాజెక్టు ప్రభావం అక్కడున్న రెండు నదులపై, వన్యప్రాణులపై, రిహాండ్ డ్యామ్ రిజర్వాయరుపై ఎంత తక్కువగా పడుతుందో చూడండి అంటూ కంపెనీ 2010–11లో రిపోర్టులు దాఖలు చేసింది. పర్యావరణ శాఖ వాటిల్లో తప్పులు పట్టి, యివి నమ్మను పొమ్మంది. 2011లో మంత్రిగా వచ్చిన జయంతి నటరాజన్ అనుమతి నిరాకరించింది. ఫైలు ప్రధాని కార్యాలయానికి చేరింది. ఆయన ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన ఒక మంత్రులబృందాన్ని ఏర్పరచి, దానికి పంపించారు. ఆ బృందం పర్యావరణ శాఖ అభ్యంతరాలను తోసిరాజని ఆ జాయింటు వెంచర్‌కు మొదటి స్టేజికి క్లియరెన్సు యిచ్చేసింది. అక్కడ నివసిస్తున్న ప్రజల అనుమతి తీసుకుంటే చాలంది.

ఇక స్థానికుల అనుమతి ప్రహసనం ప్రారంభమైంది. ఉదాహరణకు అమెలియా అనే గ్రామంలో 2013 మార్చి 5 రాత్రి 10

గంటలకు మర్నాడు గ్రామసభ వుంది రమ్మనమని దండోరా వేయించారు. సాధారణంగా అలాటి సభలు వుంటే వారం రోజుల ముందు నుంచీ వేయిస్తారు. దీనికి మాత్రం ఒక్కసారి, అందరూ పడుక్కున్నపుడు వేయించి, మర్నాడు అందరూ పనిపాటలపై వెళ్లిన సమయం చూసి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశం నిర్వహించి, అందరూ ఒప్పుకుంటున్నారు అని రాసి యిచ్చేశారు. ఆ గ్రామం జనాభా 2 వేలు కాగా, అవేళ హాజరైనది 184 మంది. జనాభాలో 50% మంది వస్తే తప్ప కోరమ్ సరిపోదు. కానీ హాజరై సంతకాలు పెట్టినవారి సంఖ్య – 1185, రికార్డుల ప్రకారం. ఆ సంతకాల్లో 2012 అక్టోబరులో చనిపోయిన నా తండ్రి సంతకం కూడా వుంది, యిదెలా సంభవం? అని ఒకతను కేసు పెట్టాడు. నిజమేనా అని గ్రీన్‌పీస్ వాళ్లు వెళ్లి పోలీసులను అడిగారు. 'మేం విచారణ జరిపి, అంతా సవ్యంగా వుందని తేల్చుకున్నాం' అన్నారు పోలీసులు. 2013లో మొదటి స్టేజికి అనుమతి రాగా, రెండవ స్టేజికి 2014 ఫిబ్రవరిలో వీరప్ప మొయిలీగారు అనుమతి దయ చేయించారు. అంతలోనే ప్రభుత్వం మారడం, కోల్ బ్లాక్ ఎలాట్‌మెంట్ గురించి విస్తృత చర్చలు జరిగి, 2014 సెప్టెంబరులో సుప్రీం కోర్టు 214 కోల్ బ్లాకుల కేటాయింపు రద్దు చేయడం జరిగింది.

ప్రాజెక్టుకోసం భూములు సేకరించినప్పుడు పునరావాసం గురించి, ఉద్యోగాల గురించి గిరిజనులకు యిచ్చిన వాగ్దానాలను కంపెనీలు పట్టించుకోవటం లేదని గ్రీన్‌పీస్ వారు ఆందోళన చేపట్టారు. ఈ జాయింటు వెంచర్‌లో భాగస్వామి అయిన ఎస్సార్ పవర్, మాతృసంస్థ ఎస్సార్ ఎనర్జీ, ఇంగ్లండులో రిజిస్టరైన కంపెనీ. మొన్నటిదాకా లండన్ స్టాక్ ఎక్స్‌ఛేంజ్‌లో లిస్టయ్యేది. ఒక బ్రిటిషు కంపెనీ ఇండియాకు వచ్చి యిక్కడి ఫారెస్టు చట్టాలను, గిరిజన చట్టాలను ఉల్లంఘిస్తోంది అని నిరసన తెలపడానికి బ్రిటిష్ ఎంపీలను కలిసి వారికి పరిస్థితి తెలియపరచాలనే ఐడియాతో గ్రీన్‌పీస్ సంస్థ ప్రతినిధిగా ప్రియా పిళ్లయ్ యుకె వెళ్లబోయింది. ఆమెపై భారతప్రభుత్వం ఆంక్షలు విధించడంతో పత్రికలవారి దృష్టి యీ ప్రాజెక్టుపై పడింది. వాస్తవపరిస్థితి ఏమిటో తెలుసుకోవాలని మహాన్‌కు బయలుదేరారు. ఎస్సార్ పవర్ ప్రాజెక్టు కంపెనీ వాళ్లు రూ. 4500 కోట్లు పెట్టుబడి పెట్టారు. రెండేళ్లపాటు విద్యుత్ ఉత్పత్తి చేస్తూ వచ్చి, రెండు నెలలుగా మూసేసుకున్నారు. మహాన్ కోల్ బ్లాక్ వేలానికి పెడితే కొనుక్కుని పని ప్రారంభించాలి. ఎక్కడో దూరం నుంచి బొగ్గు తెస్తే కిట్టుబాటు కాదు. అందుకని ఆగారు.

ప్లాంట్ కట్టినపుడు నిర్వాసితులైన వారిలో గిరిజనులు ఎక్కువ. వెయ్యి మంది కోసం నంద్‌నగర్ రీసెటిల్‌మెంట్ కాలనీ కట్టారు. దాన్ని మోడల్‌గా చూపించి యితర ప్రాంతప్రజలను కూడా పునరావాసానికి ఒప్పిద్దామని అనుకున్నారు. స్కూళ్లు, హాస్పటల్స్, ఉచిత పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనాలు, బస్సులు, ఆటస్థలం, తాగునీరు సౌకర్యం – అన్నీ వుచితమే అన్నారు. నాలుగేళ్లయినా అవేమీ జరగలేదు. అంతెందుకు పక్కనే విద్యుత్ ఉత్పత్తి అవుతున్నా వీళ్లకు మాత్రం కరంటు సరఫరా లేదు. స్కూలు కట్టారు కానీ దాన్ని నడిపే బాధ్యతను ఆరెస్సెస్ సంస్థ సరస్వతీ శిశు మందిర్‌కు అప్పచెప్పి చేతులు దులుపుకున్నారు. 'ఎవరూ జవాబుదారీ కాదు. ఉదయం 7 గంటలకు రావలసిన టీచర్లు నాలుగు గంటలు లేటుగా వస్తారు. వచ్చాక పాఠాలు చెప్పకుండా, మా పిల్లలను అడవిలోకి వెళ్లి వంట చెరుకు పట్టుకురమ్మంటారు' అని పిల్లల తలిదండ్రులు ఫిర్యాదు చేస్తున్నారు. నిర్వాసితులు చిన్న వ్యాపారాలు పెట్టుకోవడానికి ఋణసౌకర్యం కల్పిస్తామన్నారు, అదీ జరగలేదు.

పునరావాస పనుల్లో ఉపాధి అవకాశాలు కల్పించడం చాలా ముఖ్యం. ప్రాజెక్టు ప్రతిపాదించినప్పుడు స్థానికులకు వుద్యోగాలు యిస్తామంటారు. మొదట్లో కూలీపనులు యిస్తారు, ప్రాజెక్టు తయారయ్యాక వీరికి నైపుణ్యం లేదంటూ బయటివారిని తెస్తారు. వీళ్లు గోలపెడతారు. నైపుణ్యం లేని పనివాళ్లను పెట్టుకోవడం కంటె వారి మొహాన ఎంతో కొంత పడేసి వూరుకోబెడితే మంచిదనుకుని నిరుద్యోగ భృతి అంటూ నెలనెలా యిస్తూ వుంటారు. దాంతో వీళ్లకు సోమరితనం పెరుగుతుంది. డబ్బు సరిపోక యిక్కట్లు పడతారు. ఇక్కడా అదే జరిగింది. ఆరేళ్ల క్రితం ఎకరాకు రూ. 4 లక్షల చొప్పున యిచ్చి, భూమి తీసుకున్నారు. నిర్మాణసమయంలో స్థానికులకు రెండు, మూడు నెలలు పని యిచ్చారు తప్ప తర్వాత వుద్యోగాలు యివ్వలేదు. మీకు ట్రైనింగ్ యిచ్చి మీ నైపుణ్యం పెరిగాక ఉద్యోగాలు యిస్తామని చెప్పారు కానీ ట్రైనింగూ లేదు, ఉద్యోగాలూ లేవు. బిహార్, ఛత్తీస్‌గఢ్, ఝార్‌ఖండ్‌ల నుండి పనివాళ్లను తెప్పించుకుంటున్నారు. వీరికి నెలకు రూ. 7 వేలు (అది అక్కడ రూలు ప్రకారం యివ్వవలసిన కనీసజీతం) నిరుద్యోగ భృతిగా యిస్తున్నారు. 'కుటుంబంలో ఒక్క వ్యక్తికి మాత్రమే అలా యిస్తున్నారు. గతంలో పొలం వుండేటప్పుడు యింట్లో అందరూ పనిచేసి డబ్బు గడించేవారం కదా' (యీ మాటలు ఎక్కడో విన్నట్లు అనిపిస్తోందా?) అని వాపోతున్నారు మహాన్ ప్రజలు. ఎస్సార్ వాళ్లింకా నయం. రిలయన్సు వాళ్లయితే ఏమీ యివ్వకుండా చాన్నాళ్లు కాలక్షేపం చేసి, తప్పనిసరి పరిస్థితుల్లో యీ మధ్యే సగం అలవెన్సు మొదలెట్టారు.

పత్రికల వాళ్లు యివన్నీ స్థానికుల నుండి సేకరిస్తూ వుంటే కంపెనీ మనుష్యులు వచ్చి మీకేం పని? వెళ్లిపోండి అని దబాయించసాగారు. రెండు మూడు రోజుల పాటు వాళ్లు ఎక్కడకు వెళితే అక్కడకు అనుసరించి గమనిస్తూ వున్నారు. కంపెనీ మద్దతుతో 'మహాన్ వికాస్ మంచ్' అనే సమాజం ఏర్పడి, గ్రీన్‌పీస్ కార్యకర్తలతో కలహిస్తోంది. 'ఇక్కడ గిరిజనులకు నష్టం కలుగుతోంది అనే విషయాన్ని అంతర్జాతీయ వేదికలపై చెప్పితే వాళ్లు యిది ఒక సాకుగా తీసుకుని భారత్‌కు పెట్టుబడులు రాకుండా చేస్తారు. అందువలన గ్రీన్‌పీస్ వారి ప్రతినిధి అక్కడకు వెళ్లడానికి వీల్లేదు' అనే అభిప్రాయంతో కేంద్రప్రభుత్వం ప్రియా పిళ్లయ్ వీసా తిరస్కరించింది. గ్రీన్‌పీస్ ఖాతాలను స్తంభింపచేసింది. స్వయంగా అక్కడకు వెళ్లలేకపోయినా ప్రియా పిళ్లయ్ బ్రిటిషు ఎంపీలతో స్కైప్‌లో మాట్లాడేసింది. ఇక

ప్రభుత్వం ఏం సాధించినట్లు? పునరావాసం, పర్యావరణం విషయంలో తప్పు చేసిన కార్పోరేట్లను వెనకేసుకుని రావడం, తప్పును సవరించకపోవడం, బయటకు తెలిస్తే పరువు పోతుందని భయపడడం, తప్పును ఎత్తి చూపించేవారిని దండించడం – యీ విషయాల్లో గతంలో యుపిఏ, యిప్పుడు ఎన్‌డిఏలకు భేదం లేదు. పునరావాసం గురించి యిచ్చిన హామీలు అమలయ్యేట్లు కార్పోరేట్ల మెడలు వంచితే ఎవరు వచ్చి చూసినా, ఎవరు ఫిర్యాదు చేసినా ఏమీ కాదు. అది పాలకులు గ్రహించాలి.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి వీక్లీకై న్యూస్ వ్యూస్...** **ఎమ్బీయస్ : యాంకరే న్యూస్ అయినవేళ....**

''టైమ్స్‌నౌ'' టీవీ ఛానెల్‌లో రాత్రి 9 గంటలకు వచ్చే ''న్యూస్‌అవర్'' అత్యధికులు వీక్షించే కార్యక్రమం. మెచ్చుకుంటూనో, తిట్టుకుంటూనో అందరూ దాన్ని చూస్తూ వుంటారు తప్ప దాన్ని విస్మరించలేరు. దానికి ఆ కళ తెచ్చిన వ్యక్తి దాని యాంకర్ లేదా హోస్ట్ అర్ణవ్(బ్) గోస్వామి. అభిప్రాయాలు వ్యక్తం చేయడానికి వచ్చినవారిపై అతను విరుచుకుపడి, నంచుకు తినేయడం చూసి ఆనందించడానికి చాలా మంది ఆ టైముకి టీవీ ఆన్ చేస్తారు. అది చూస్తే విజ్ఞానం మాట ఎలా వున్నా చూసేవాళ్లు ఉక్కిరిబిక్కిరై పోయేటంత వినోదం మాత్రం ఖాయం. ఎమోషన్స్, పంచ్ డైలాగ్స్, వెక్కిరింతలు, తర్జని చూపుతూ బెదిరించడాలు, మెలోడ్రామా – దేనికీ లోటుండదు. ఆ ప్రోగ్రాం పేరులో మాత్రమే 'న్యూస్..' వుంది. అక్కడ వుండేది న్యూస్ కాదు, వ్యూస్ మాత్రమే, అవీ అర్ణవ్‌వి. అవి వ్యూస్ మాత్రమే కావు, అర్ణవ్ యిచ్చే తీర్పులు, ప్రతీ విషయంపై ముందే ఒక నిర్ధారణకు వచ్చేసి, తనకు అడ్డు వచ్చేవాళ్లను మాట్లాడనివ్వకుండా కసిరేసి, అరిచేసి, నిందలు మోపి, తన మాటలు వాళ్లన్నట్లుగా తీర్మానించేసి, తీర్పులిచ్చేసి, శిక్ష కూడా అప్పటికప్పుడు అమలు చేసేసే సర్కస్ షో అది. యాంకర్ అంటే ప్యానెలిస్టులందరి అభిప్రాయాలూ సేకరిస్తూ, వారి మధ్య సమన్వయం చేస్తూ, వారి నుండి సమాచారం సేకరిస్తూ వుంటాడు అనే భావంలో వుంటున్న టీవీ ప్రేక్షకులకు యిలా శివతాండవం చేసే యాంకర్ ఒక ఎట్రాక్షన్ అయిపోయాడు. అదే సమయంలో అతను చర్చనీయాంశం కూడా అయిపోయాడు. అందుకే ''ఔట్‌లుక్'' అతనిపై కవర్ స్టోరీ వేసింది. ఇంతకీ ఎవరీ అర్ణవ్?

వాళ్లది అసాంలో న్యాయవాదుల కుటుంబం. పితామహుడు లాయరు, స్వాతంత్ర్యయోధుడు, కాంగ్రెసు పక్షపాతి. మాతామహుడు గౌరీ శంకర్ భట్టాచార్య ప్రఖ్యాత రచయిత, అసాంలో ప్రతిపక్ష నాయకుడు. తండ్రి మనోరంజన్ కల్నల్‌గా పనిచేసి రిటైరయ్యాక బిజెపిలో చేరాడు. తండ్రి ఉద్యోగాల వలన అర్ణవ్ చాలా వూళ్లల్లో చదివాడు. ఢిల్లీలో గ్రాజువేషన్, ఆక్స్‌ఫర్డ్‌లో పోస్ట్ గ్రాజువేషన్ చేశాక 22 వ యేట 1995లో ఎన్‌డిటివిలో డైలీ న్యూస్‌కాస్ట్‌లకు యాంకర్‌గా చేశాడు. తర్వాత న్యూస్ ఎడిటరు అయ్యాడు. న్యూస్‌అవర్ కార్యక్రమాన్ని ఐదేళ్లపాటు 1998 నుండి 2003 వరకు హోస్ట్ చేశాడు. 26/11 ముంబయి దాడుల దగ్గర్నుంచి అనేక ముఖ్య సంఘటనలను లైవ్ కవరేజి చేసి పేరు తెచ్చుకున్నాడు. అనేక ఎవార్డులు కూడా తెచ్చుకున్నాడు. అతని తెలివితేటలను, విషయపరిజ్ఞానాన్ని ఎవరూ శంకించలేరు. 2006 నుండి టైమ్స్ ఆఫ్ ఇండియావారి టైమ్స్‌నౌ ఛానెల్‌కు ఎడిటర్ యిన్ చీఫ్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి 9 గంటలకు వచ్చే ''న్యూస్‌అవర్'' కార్యక్రమాన్ని హోస్ట్ చేస్తున్నాడు. మనదేశంలోని హేమాహేమీలే కాదు, విదేశీ ప్రముఖుల్లో కొందరు కూడా అతని కార్యక్రమానికి అతిథులుగా వచ్చారు.

ఇంత పాప్యులర్ అయిన కార్యక్రమంపై విమర్శలేల అంటే దాన్ని అర్ణవ్ మలచుకున్న తీరు. అతని దృష్టిలో అది ఒక కోర్టు, వచ్చినవారు ముద్దాయిలు. ఇతను ప్రాసిక్యూటరు, జడ్జి, జ్యూరీ, తలారి కూడా! గబగబా ఆరోపణలు చేసి, దానికి అవతలివాళ్లు సమాధానం యిచ్చేలోగానే 'నువ్వు ఏమీ చెప్పలేకపోయావ్, నువ్వు తప్పుచేశావని ఒప్పుకున్నావ్' అంటూ అరిచేసి కంగారు పెట్టేస్తాడు. ఎదుటివాళ్లు చెప్పేది వినడు. వింటే దానిలోంచి ఏదో ఒకటి సంబంధం లేకుండా లాగుతాడు. ఢిల్లీ ఎన్నికల ఫలితాల సమయంలో 'కాంగ్రెసు పని అయిపోయింది, దుకాణం మూసేసుకోవచ్చు' అని యితను అంటే అతన్ని ఖండిస్తూ కాంగ్రెసు ప్రతినిధి 'కాంగ్రెసు ఫీనిక్స్‌లా మళ్లీ లేస్తుంది' అన్నారు. వెంటనే యితను 'అంటే రాహుల్ గాంధీ కాంగ్రెసును భస్మీపటలం చేశాడని నువ్వు అన్నావన్నమాట, అది రికార్డు చేస్తున్నాను. నిన్ను భవిష్యత్తులో అలా కోట్ చేస్తాను.' అంటూ తైతక్కలాడేశాడు. నేను చెప్పేదేమిటి? నువ్వు చెప్పేదేమిటి అని అడిగిందావిడ. 'ఫీనిక్స్ అంటే ఏమిటి? భస్మంలోంచి మళ్లీ పునరుజ్జీవం పొందేదే కదా, అంటే కాంగ్రెసు ప్రస్తుతం బూడిదై పోయిందన్న అర్థం దానిలో వుంది కదా, బూడిద చేసిందెవరు? రాహుల్ గాంధీ మీ నేత కాబట్టి అతనే! అందువలన రాహుల్ గాంధీ కాంగ్రెసును బూడిద చేసేశాడు అని నువ్వు అన్నావన్నమాట' అని అతను లాజిక్ లాగాడు. ఆమె మాత్రమే కాదు, వినేవాళ్లూ బిత్తరపోయారు. ఫీనిక్స్‌లా తిరిగిలేవడం అనేది ఒక ఉపమానం. ఎవరైనా ఉపయోగిస్తారు. పైగా రాహుల్ కాంగ్రెసు పార్టీ ఉపాధ్యక్షుడు. పైన సోనియా ఒకామె వుంది. అర్ణవ్ రాహుల్ మీద ఒక రాయి వేద్దామనుకున్నాడు. వేసేశాడు. దానికి యీవిడను బలిపశువు చేసేశాడు. ఇలాటి చేష్టల వలననే అతని కార్యక్రమంలోంచి కొందరు విసుక్కుంటూ, అతన్ని తిట్టుకుంటూ బయటకు వెళ్లిపోతారు. మళ్లీ ఛస్తే రాం, నీకు రారరాం అంటూ లేఖలు కూడా రాశారు.

మరి ప్రేక్షకులు ఎందుకు విరగబడి చూస్తున్నారు? అన్నదానికి కొందరు వివరణలు యిచ్చారు. ఏ విషయమైనా నలుపు, తెలుపుల్లో స్పష్టంగా ఎప్పుడూ తెలియదు. ప్రతీదానికీ పలుకోణాలు వుంటాయి. అందుకే టీవీ కార్యక్రమాల హోస్టులు విభిన్న ద

ృక్పథాల వారిని కూర్చోబెట్టి అందరి అభిప్రాయాలను ప్రేక్షకుడికి సమపాళ్లల్లో తెలిసేట్లు చేస్తారు. ఏ అతిథికి అన్యాయం జరగకుండా వారి భావాలు చెప్పనివ్వడమే యాంకర్ కర్తవ్యం. అన్నీ విన్నతర్వాత ప్రేక్షకుడు తనంతట తాను ఆలోచించుకుని, వీటిలో ఎవరి దృక్కోణం సమంజసంగా వుందో ఒక అభిప్రాయం ఏర్పరచుకుంటాడు. ఒక్కోప్పుడు విభిన్న దృక్పథాలు నచ్చి అస్పష్టత కూడా ఏర్పడుతుంది. దశాబ్దాలుగా ప్రణయ్ రాయ్ వంటి యాంకర్లు చేస్తూ వచ్చిన పనే యిది. అయితే పోనుపోను టీవీ ప్రేక్షకుడికి మేధోపరంగా బద్ధకం ఎక్కువై పోయింది. చిన్నపిల్లలు చూడండి, తెరమీద ఎవరైనా పాత్ర కనబడగానే తల్లినో, తండ్రినో 'వీడు మంచివాడా? చెడ్డవాడా?' అని అడిగేస్తూ వుంటారు. 'కొన్ని విధాల మంచివాడు, పరిస్థితుల బట్టి అప్పుడప్పుడు చెడ్డగా ప్రవర్తిస్తాడు' అని వివరణ యివ్వబోతే వాళ్ల తలకెక్కదు. అటోయిటో ఏదో ఒకటే చెప్పాలంతే. టీవీ ప్రేక్షకులూ అలా తయారవుతున్నారు. 'ప్రతీ వ్యక్తినీ కూలంకషంగా విశ్లేషించే ఓపిక మాకు లేదు, మంచివాడో చెడ్డవాడో నువ్వే చెప్పేయ్' అని అర్ణబ్‌కు ఆ బాధ్యత అప్పగించేశారు. అతను తను చెడ్డవాళ్లనుకున్నవాళ్లని చీల్చి చెండాడుతూంటే పాతకాలంలో క్రైస్తవులను సింహాలకు ఆహారంగా వేసినపుడు రోమన్లు ఎలా చప్పట్లు కొట్టారో అలా కొడుతున్నారు. అర్ణబ్ తన అభిప్రాయాలకు జాతీయవాదం కూడా జోడిస్తున్నాడు కాబట్టి అతనెంత పరుషమైన భాషను వుపయోగించినా వీళ్లకు ఎబ్బెట్టుగా తోచడం లేదు. అందుకే యిది న్యూస్ కాదు అంటున్నారు యీ రంగంలో చాలాకాలంగా వున్నవారు. కానీ అర్ణబ్ పొందుతున్న ప్రజాదరణ చూసి, అతన్ని అనుకరించేవారు పెరిగిపోతున్నారు. అందుకే అర్ణబ్ వార్తలు విశ్లేషించే స్థాయి నుండి ఎదిగి వార్తల్లో వ్యక్తి అయ్యాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**

**మార్చి 54 వీక్లీకై** **ఎమ్బీయస్ : పెత్తదార్లంకే భోజ్యం....**

బజెట్‌పై చాలామంది విశ్లేషించారు. మెగసెసాయ్ ఎవార్డు గ్రహీత, గ్రామీణ సమస్యలపై అథారిటీ అనదగిన జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ చేసిన ఒక పరిశీలన ఆకట్టుకునేట్లా వుంది. కార్పోరేట్లకు ఏ విధంగా అచ్చే దీన్ వచ్చాయో ఆయన అంకెలతో సహా నిరూపించారు. దశాబ్దాలుగా అన్ని కేంద్ర ప్రభుత్వాలూ కార్పోరేట్లకు మేలు చేస్తున్నాయని అందరూ అనుకుంటూ వస్తాం కానీ నిర్ధారణగా తెలియదు. అంతకముందు సంగతి వదిలేసి 2005–06 నుండి కార్పోరేట్ల నుండి వదులుకున్న ఆదాయాన్ని బజెట్‌లో ప్రభుత్వం విడిగా చూపసాగింది. ఆ ఏడాది రూ. 35 వేల కోట్లు కార్పోరేటు ఇన్‌కమ్ టాక్స్‌పై, 66 వేల కోట్లు ఎక్సయిజ్ డ్యూటీపై, 128 వేల కోట్లు కస్టమ్స్ డ్యూటీపై వదిలేశారు. మొత్తం 2లక్షల 29 వేల కోట్లు అన్నమాట. పేదల సంక్షేమంకై పాటుపడాలంటే అలాటి మినహాయింపులకు ముకుతాడు వేయాలి. కానీ ఎన్‌డిఏ ప్రభుత్వం వేసిందా? 2014–15 సం॥రానికి వదులుకున్న ఆదాయం 5 లక్షల 49 వేల కోట్లు అయింది! అంటే పదేళ్ల క్రితం దానికి దగ్గర దగ్గర రెండున్నర రెట్లన్నమాట! గత పదేళ్లగా వదులుకున్న మొత్తం ఎంతో తెలుసా? 42 లక్షల కోట్ల రూపాయలు.. అంటే 42 తర్వాత 12 సున్నాలు. ఇప్పటికే చాలా యిచ్చేశాం చాలు అనుకుని కొత్త బజెట్‌లో ఏమైనా తగ్గించారా?

కొత్త బజెట్‌లో బంగారం, వజ్రాలు, జవహరీపై తగ్గించిన కస్టమ్స్ డ్యూటీ వలన ప్రభుత్వ ఆదాయానికి వచ్చిన లోటు రూ. 75,592 కోట్లు. ఇవి కొనేవి డబ్బున్నవారే కదా! మరి ఎందరో పేదలకు ఉపాధి కల్పిస్తున్న 'నరేగా' (మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ స్కీము)కు కేటాయించిన మొత్తం ఎంతో తెలుసా? రూ. 34,699 కోట్లు. కితం ఏడాది కంటె రూ. 5 వేల కోట్లు ఎక్కువ యిచ్చాం అని జైట్లే చెప్పుకున్నారు. గమనించవలసిన దేమిటంటే దీనిలోంచి కేంద్రం రాష్ట్రాలకు బకాయి పడిన రూ. 6 వేల కోట్లు తీసేయాలి. ఆ విధంగా చూస్తే గతంలో కంటె తక్కువగా ఎలాట్ చేశారని గమనించాలి. నరేగా పథకంలో లోటుపాట్లు వున్నాయని అందరూ ఒప్పుకున్న నిజం. దానికి కారణం – స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా దేశమంతా – అవసరం లేని చోట కూడా – దాన్ని అమలు చేయడం. పని చేసినా చేయకపోయినా సగం డబ్బులు యిచ్చి, సగం తినేస్తున్నారు. ఇలాటి లోపాలు సవరించాలి. స్వచ్ఛభారత్ ఉద్యమానికి, నరేగాకు ముడిపెడితే నిఘా ఏర్పడి, లోపాలు సవరించబడతాయి. కానీ ప్రభుత్వం ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు లేదు. దీనికి నిధుల్లో కోత పెట్టింది. సబ్సిడీలు యిచ్చి పేదలను చెడగొట్టం అంటున్న యీ ప్రభుత్వమే కార్పోరేట్ యిన్‌కమ్ టాక్స్‌ను రైట్ ఆఫ్ చేస్తోంది. యుపిఏ ప్రభుత్వపు ఆఖరి సంవత్సరంలో ఆ మొత్తం రూ. 58 వేల కోట్లయితే, మోదీ ప్రభుత్వపు తొలి సంవత్సరంలో అది రూ. 62 వేల కోట్లు (అంచనా) అంటే 8% ఎక్కువన్నమాట. చిత్రం ఏమిటంటే దీనికి అరుణ్ జైట్లే పెట్టిన పేరు – కార్పోరేట్ రంగానికి యిచ్చే ఇన్సెంటివ్ (ప్రోత్సాహకం)!

దీనికి యివ్వడానికి ఎక్కడో అక్కడ తగ్గించాలిగా! తగ్గించారు. పిల్లల ఆరోగ్యసంబంధిత స్కీముల్లో 22% కోత, విద్యాసంబంధిత స్కీముల్లో 25% కోత... యిలా! కార్పోరేట్లకు గత పదేళ్లలో యిచ్చిన 'ప్రోత్సాహకాల' విలువ 42 లక్షల కోట్లు కదా. దానితో ఏమేం చేసి వుండవచ్చో సాయినాథ్ చెప్పారు – నరేగాను ప్రస్తుత స్థాయిలో 121 సం॥లు నడపవచ్చు, ఫుడ్ సబ్సిడీని ప్రస్తుత స్థాయిలో 34 ఏళ్లు యివ్వవచ్చు. ఈ అంకెలన్నీ బజెట్‌లో కనబడుతున్నవి. కనబడని సౌకర్యాలు కూడా కార్పోరేట్లు పొందుతున్నాయని సాయినాథ్ ఎత్తిచూపారు. పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల ఎన్‌పిఏ (నిరర్థక ఆస్తులు)లలో సింహభాగం ధనికులు, కార్పోరేట్లదే. పేర్లు చెప్పమంటే చట్టప్రకారం చెప్పకూడదు, రహస్యం అంటారు. ఇవే బ్యాంకులు మధ్యతరగతివారు, రైతుల విషయంలో మాత్రం కుదువ పెట్టిన బంగారం వేలం వేయడానికి, వారి పేర్లు పేపర్లో ప్రకటించడానికి ఏ మాత్రం సంకోచించవు. ఆ ఋణాల విషయంలో

హెడాఫీసు నుండి మేనేజర్లకు తాఖీదులు వస్తూ వుంటాయి. కార్పోరేట్ ఋణాల విషయంలో మాత్రం ముందుకు వెళ్లడానికి వీల్లేకుండా చేతులు కట్టేస్తారు. హెడాఫీసు లెవెల్లో సూపర్‌వైజ్ చేస్తున్నాం అంటారు. ఎన్‌పిఏల గురించి పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు ఆర్థికశాఖ సహాయమంత్రి 'అవి రెండు లక్షల కోట్లకు చేరాయి – కొన్ని సంవత్సరాలుగా' అన్నారు. ఎన్నేళ్లుగా? వాటి విలువ రాబట్టే సాధనం వుందా? దానికి సమాధానం లేదు. ఇది కాకుండా 'కార్పోరేట్ డెట్ రిస్ట్రక్చరింగ్' అనే పేర బకాయిల అంకె యింకా పెద్దది అంటారు సాయినాథ్. భూమి మీద కనబడే ప్రతీ విషయాన్ని లోతుగా పరిశోధించాలనుకునే పాత్రికేయులు, సంపాదకులు యీ విషయంలో మాత్రం నిస్తేజంగా వుంటారు. మరీ లోతుగా వెళితే తమ యజమాని పేరే తగలవచ్చేమోనని భయం. ఆ వార్త వేస్తే తన ఉద్యోగానికే ముప్పు! కఠోరవాస్తవం ఏమిటంటే – గద్దె మీద ఎవరున్నా పెద్దలు మరింత పెద్దలవుతున్నారు, పేదలు మరింత పేదలవుతున్నారు.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మార్చి 2015)**